# Telugu katha - Streela Astitwa Jeevita Chitrana

A thesis submitted during 2011 to the University of Hyderabad in partial fulfillment of the award of a Ph.D. degree in Telugu Department.

**By**

***UDUMU JHANSY***

Department of Telugu,
School of Humanities

University of Hyderabad
(P.O) Central University, Gachibowli
Hyderabad - 500 046
Andhra Pradesh, India

# తెలుగు కథ – స్త్రీల అస్తిత్వ జీవిత చిత్రణ
(2000 - 2009)

పరిశోధన

వుడుము ఝాన్సీ

పర్యవేక్షణ

ఆచార్య తుమ్మల రామకృష్ణ

పిహెచ్.డి. పట్టాకోసం హైదరాబాద్ విశ్వ విద్యాలయానికి

సమర్పించిన పరిశోధనా గ్రంథం

జూన్ 2011

# కృతజ్ఞతలు

నన్ను వ్యక్తిత్వం ఉన్న మనిషిగా తీర్చిదిద్దిన అమ్మా నాన్నలకు...

నా పరిశోధనకు పర్యవేక్షణ బాధ్యత వహించి, సకాలంలో పరిశోధన పూర్తికావడానికి అన్నివిధాలుగా సహాయ సహకారాలందించిన నిరంతర అధ్యయనశీలి, ఆదర్శమూర్తి అయిన ఆచార్య తుమ్మల రామకృష్ణ గారికి...

పరిశోధనకు అవసరమైన సలహాలు, సూచనలతోపాటు అవసరమైన, అరుదైన, కథలను అందించిన స్నేహశీలి డా. డి. విజయలక్ష్మి గారికి...

ఉపపర్యవేక్షకులుగా బాధ్యత వహించిన ఆచార్య రేమిల్లి రామకృష్ణ గారికి, డా.పిల్లలమర్రి రాములు గారికి..

తెలుగు శాఖ అధ్యక్షులైన డా. ఎన్. ఎస్.        , అధ్యాపక బృందమైన ఆచార్య రామ బ్రహ్మం గారికి, ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి గారికి, డా. జి. అరుణ కుమారి గారికి, డా. డి. వెంకటేశ్వరరావు గారికి, డా. పి. పవన్ కుమార్ గారికి, డా. భుజంగ గారికి....

ఈ పరిశోధనకు అవకాశం కల్పించిన హైదరాబాదు విశ్వవిద్యాలయానికి, అన్వేషి, అస్మిత రీసెర్చ్ సెంటర్స్ కి, శ్రీకాకుళం కథానిలయానికి, నూజివీడు జిల్లా గ్రంథాలయాల సిబ్బందికి,

నా అభ్యున్నతిని ఆకాంక్షించే కుటుంబ సభ్యులకు,...

ఆత్మీయ మిత్రులైన సౌజన్య, మల్లీశ్వరి, రమణకు...

పరిశోధనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారందరికీ...

కృతజ్ఞతలతో...

ఝాన్సీ.

# DECLARATION

I *Udumu Jhansy* hereby declare that this thesis entitled "*Telugu katha-Streela Astitwa Jeevita Chitrana (2000-2009)*" submitted by me under the guidance and supervision of Professor / *Dr.Tummala Ramakrishna* is a bonafide research work. I also declare that is had not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma.

Date: 30/6/2011

Name: Udumu Jhansy

Signature of the student

Regd.No.07HTPH12

## విషయసూచిక


1. అస్తిత్వవాదం- ఆవిర్భావ వికాసాలు ..................... 1

1. 1. ప్రవేశిక ..................... 1

1. 2. అస్తిత్వవాదం- కీర్కెగార్డు: ..................... 3

1. 3. అస్తిత్వవాదం- భిన్ననిర్వచనాలు: ..................... 5

1. 4. అస్తిత్వస్పృహ: ..................... 6

1. 5. అస్తిత్వవాద లక్ష్యం ..................... 8

1. 6. ప్రముఖ అస్తిత్వవాదులు- విభిన్న అభిప్రాయాలు ..................... 9

1. 6. 1. జీన్ పాల్ సాత్రే ..................... 9

1. 6. 1. 1. కవి, నిబద్ధత, కళ - సాత్రే ..................... 10

1. 6. 1. 2. తనలో తాను ..................... 12

1. 6. 1. 3. తనకై తాను ..................... 12

1. 6. 1. 4. ఇతరుల కోసం తాను ..................... 12

1. 6. 2. పాస్కల్ ..................... 13

1. 6. 3. కాఫ్కా ..................... 14

1. 6. 4. కామూ ..................... 15

1. 6. 5. డాస్టోవస్కీ ..................... 17

1. 6. 6. పాల్ టిల్లిచ్ ..................... 18

1. 6. 6. 1. విధి - మృత్యువు ..................... 18

1. 6. 6. 2. శూన్యం - నిరర్థకత ..................... 18

1. 6. 6. 3. పాపం - శిక్ష: ..................... 18

1. 6. 7. హెడిగర్: ..................... 18

1. 6. 8. నీట్షే: ..................... 19

1. 6. 9. యునామునో: ..................... 19

1. 7. చారిత్రక పరిణామ దశలో స్త్రీ: ..................... 22

1. 7. 1. ప్రారంభ దశలో స్త్రీ: ..................... 22

1. 7. 2. పురుషాధిపత్య సమాజంలో స్త్రీ: ........................................................ 23
1. 7. 3 బానిసవ్యవస్థలో స్త్రీ: ........................................................ 23
1. 7. 4. భూస్వామ్య వ్యవస్థలో స్త్రీ: ........................................................ 24
1. 7. 5. వేదాల్లో స్త్రీ:........................................................ 24
1. 7. 6. గృహసూత్రాల్లో స్త్రీ: ........................................................ 25
1. 7. 7. అర్థశాస్త్రంలో స్త్రీ: ........................................................ 26
1. 7. 8 మనుధర్మ శాస్త్రాల్లో స్త్రీ:........................................................ 26
1. 7. 9. రామాయణ, మహాభారతాల్లో స్త్రీ: ........................................................ 26
1. 8. స్త్రీ వాదం - ఆవిర్భావ వికాసాలు: ........................................................ 27
1. 8. 1. స్త్రీవాదం - నిర్వచనాలు: ........................................................ 28
1. 8. 2. స్త్రీవాద సాహిత్యం అంటే: ........................................................ 29
1. 8. 3. పాశ్చాత్య దేశాల్లో స్త్రీవాదం - ఆవిర్భావం: ........................................................ 30
1. 8. 4. ఆంధ్రదేశంలో స్త్రీవాదం - ఆవిర్భావం:........................................................ 30
1. 9. స్త్రీవాదంలోని ప్రధాన ధోరణులు: ........................................................ 31
1. 9. 1. ఉదారవాద స్త్రీవాదం: ........................................................ 31
1. 9. 2. రాజకీయ స్త్రీవాదం:........................................................ 32
1. 9. 3. మార్క్సిస్టు స్త్రీ వాదం: ........................................................ 32
1. 9. 4. సోషలిస్టు స్త్రీ వాదం: ........................................................ 33
1. 9. 5. సాంస్కృతిక స్త్రీవాదం: ........................................................ 33
1. 9. 6. మానవవాద స్త్రీవాదం: ........................................................ 34
1. 10. స్త్రీవాదం చర్చించిన అంశాలు: ........................................................ 35
1. 10. 1. పితృస్వామ్యం: ........................................................ 35
1. 10. 2. జెండర్: ........................................................ 35
1. 10. 3. మాతృత్వం: ........................................................ 36
1. 10. 4. హింస: ........................................................ 37
1. 10. 4. 1. కుటుంబ హింస: ........................................................ 37
1. 10. 4. 1. 1. శారీరకహింస:........................................................ 38

1. 10. 4. 1. 2. లైంగిక హింస: ....................................................38
1. 10. 4. 1. 2. సామాజిక హింస: ....................................................38
1. 10. 5. కుటుంబ శ్రమ: ....................................................39
1. 10. 6. లైంగిక స్వేచ్ఛ: ....................................................39
1. 10. 7. భాష....................................................40
పాదసూచికలు....................................................44
**2. విభిన్న ఉద్యమాలు- స్త్రీలు - చైతన్యం....................................................46**
2. 1. ఉద్యమ ఆవిర్భావం ....................................................46
2. 2. జాతీయోద్యమం - స్త్రీలు ....................................................46
2. 2. 1. ఝాన్సీ లక్ష్మిబాయి: ....................................................47
2. 2. 2. హజరత్ మహల్: ....................................................48
2. 2. 3. రామ్ ఘర్ రాణి: ....................................................49
2. 2. 4. జ్యోతిపూర్ రాణి....................................................49
2. 2. 5. సరోజిని నాయుడు: ....................................................50
2. 2. 6. దుర్గాబాయి దేశముఖ్: ....................................................51
2. 2. 7. అహల్యా రంగ్నేకర్....................................................52
2. 2. 8. కనక ముఖర్జీ....................................................54
2. 2. 9. అనిబిసెంట్: ....................................................54
2. 2. 10. కస్తూ రిబా గాంధీ: ....................................................56
2. 3. సంస్కరణోద్యమం- స్త్రీలు: ....................................................57
2. 3. 1. సరళాదేవి: ....................................................58
2. 3. 2. విమల రణదివె: ....................................................58
2. 3. 3. సావిత్రీ బాయి ....................................................59
2. 3. 4. పండిత రమాబాయి: ....................................................60

2. 3. 5. కనుపర్తి వరలక్ష్మమ్మ: ....................61

2. 3. 6. నివేదిత: ....................62

2. 4. తెభాగా ఉద్యమం - స్త్రీలు....................64

2. 4. 1. పోరాట నేపథ్యం: ....................64

2. 4. 2. బెంగాల్ గ్రామీణ స్త్రీలపై రెండంచెల అణచి వేత: ....................66

2. 4. 3. పోరాటం వెనుక చైతన్యవంతమైన కృషి:....................66

2. 4. 5. మహిళాభాగస్వామ్యం: ....................67

2. 5. శ్రీకాకుళ పోరాటం - స్త్రీలు: ....................70

2. 5. 1. తెగింపు సంఘం: ....................72

2. 5. 2. పంచాది నిర్మల: ....................75

2. 5. 3. తెలికల సరస్వతి: ....................75

2. 5. 4. దున్న అంకమ్మ: ....................75

2. 5. 5. శ్రీకాకుళ పోరాటాలు - ప్రతిఫలాలు....................75

2. 5. 6. శ్రీకాకుళ పోరాటం-అపజయాలు: ....................76

2. 5. 7. కూలీ పోరాటం: ....................77

2. 5. 8.సారా పోరాటం: ....................77

2. 5. 9. భూపోరాటం: ....................78

2. 6. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం - స్త్రీలు: ....................79

2. 6. 1. దివాని: ....................80

2. 6. 2. జాగిర్దారీ భూమి: ....................80

2. 6. 3. సర్వేఖాస్: ............ 80

2. 6. 4. పరిపలన వ్యవస్థ: ............ 81

2. 6. 5. కులపీడన: ............ 81

2. 6. 6. వెట్టిచాకిరి: ............ 81

2. 6. 7. నిజాం పాలనలో స్త్రీల స్థితి: ............ 82

2. 6. 8. చిట్యాల ఐలమ్మ: ............ 83

2. 6. 9. ఎర్రమ్మ: ............ 83

2. 6. 10. నర్సమ్మ: ............ 84

2. 6. 11. చిలకమ్మ: ............ 84

2. 6. 12. పూనం లచ్చక్క: ............ 85

2. 6. 13. లచ్చమ్మ: ............ 86

2. 6. 14. మల్లికాంబ: ............ 86

2. 6. 15. రాంబాయమ్మ: ............ 87

2. 6. 16. మల్లు స్వరాజ్యం: ............ 87

పాదసూచికలు ............ 93

**3. స్త్రీల అస్తిత్వ చిత్రణకథలు - వస్తు వైవిధ్యం............ 94**

3. 1. కథ - నిర్వచనాలు: ............ 94

3. 2. తెలుగు కథ - యుగ విభజన: ............ 96

3. 3. అంటురోగం............ 98

3. 4. అగ్నిస్పర్శ: ............ 99

3. 5. అతను: ........................................................................................101

3. 6. ఆకాశంలో సగం: ................................................................................103

3. 7. ఆధిపత్యం: ......................................................................................106

3. 8. ఆవర్జా: ...........................................................................................108

3. 9. ఆశ.................................................................................................110

3. 10. ఇలా... ఉన్నాం: ................................................................................113

3. 11. ఎంతో చిన్నది జీవితం........................................................................117

3. 12. ఒక రాత్రి గడవాలి: ...........................................................................119

3. 13. కంచె మేసిన చేను: ............................................................................121

3. 14. కూటి కోసం - కూలి కోసం: .................................................................123

3. 15. గంగ జాతర.......................................................................................124

3. 16. గూడు: .............................................................................................126

3. 17. ఛ! ...................................................................................................129

3. 18. జారుడు మెట్లు: .................................................................................131

3. 19. టెన్షన్: ..............................................................................................132

3. 20. తృషిత: ..............................................................................................135

3. 21. దృశ్య కీచకం.......................................................................................137

3. 22. నింగీ నేల: .........................................................................................138

3. 23. నిర్ణయం: ............................................................................................140

3. 24. పరివర్తన ...........................................................................................142

3. 25. పారిజాతం: ............................................................144
3. 26. పేరెంట్: ............................................................145
3. 27. పోరాటం: ............................................................147
3. 28. ప్రగతి: ............................................................150
3. 29. బింబ ప్రతిబింబం: ............................................................153
3. 30. భూలక్ష్మి: ............................................................154
3. 31. మదుపు............................................................156
3. 32. మసిగుడ్డ............................................................158
3. 33. ముసుగు: ............................................................159
3. 34. మొదటి అడుగు: ............................................................161
3. 35. రెక్కలున్న పిల్ల: ............................................................164
3. 36. వల: ............................................................165
3. 37. విముక్తి............................................................168
3. 38. శిలకోల: ............................................................170
3. 39. సంకట విమోచన: ............................................................173
3. 40. సర్పంచెవరు? ............................................................175
3. 41. స్వాభిమానం: ............................................................178
3. 42. క్షతగాత్ర: ............................................................180
3 .43. **2000 సంవత్సరానికి ముందు వచ్చిన స్త్రీల అస్తిత్వ చిత్రణకథలు**............................................................183
3. 43. 1. అతని భార్య: ............................................................ 183

3. 43. 2. అదెక్కడ? ....184

3. 43. 2. 1. శారీరక హింస: ....185
3. 43. 2. 2. మానసిక హింస: ....185
3. 43. 3. ఆమె ఇల్లు: ....186
3. 43. 4. ఆర్తి: ....187
3. 43. 5. ఇన్ స్టెంట్ లైఫ్ ....188
3. 43. 6. ఇల్లలకగానే పండగౌనా....189
3. 43. 7. (తొలి) నిర్ణయం: ....191
3. 43. 8. పక్షులు: ....192
3. 43. 9. పనికి (రాని) సగం: ....194
3. 43. 10. బొమ్మలో చైతన్యం : ....195

3. 43. 11. బోన్సాయి బ్రతుకు: ....197
3. 43. 11. 1. ఆ కాలం నాటి సమాజపు ఆలోచన. ....198
3. 43. 11. 2. స్త్రీ పురుషుల మధ్య నెలకున్న అసమానత్వం: ....198
3. 43. 12. మురళీ వాళ్ళమ్మ: ....199
3. 43. 13. మోక్షం: ....200
3. 43. 14. యాష్ ట్రే: ....201
3. 43. 14. 1. పురుష మనస్తత్వం ....201
3. 43. 14. 2. స్త్రీ మనస్తత్వం ....202
3. 43. 15. రచయిత పెళ్ళాం: ....202
3. 43. 16. వ్యక్తిత్వం ....203
3. 43. 17. శివాని: ....205

3. 43. 18. శీలమా? అదియేమి? ....207

3. 43. 19. సత్యపాలన: ....208
3. 43. 20. సూపర్ మామ్ సిండ్రోమ్: ....211

పాదసూచికలు........................................................................................................215

**4. అస్తిత్వ చిత్రణ కథలు- భాషాశిల్పం.....................................................................218**

4. 1. వస్తు వు..................................................................................................220

4. 2. కథాకథనం: ..........................................................................................221

4. 3. కథా సంవిధానం.....................................................................................221

4. 4. పాత్రలు.................................................................................................222

4. 5. నేపథ్యం.................................................................................................222

4. 6. దృష్టికోణం ............................................................................................223

4. 6. 1. సర్వసాక్షి దృష్టికోణం.........................................................................223

4. 6. 2. ఉత్తమ పురుష దృష్టికోణం .................................................................223

4. 6. 3. నాటకీయ దృష్టికోణం .........................................................................224

4. 7. అంటురోగం..........................................................................................224

4. 8. అతని భార్య...........................................................................................224

4. 9. అదెక్కడ..................................................................................................226

4. 10. ఆకాశంలో సగం....................................................................................226

4. 11. ఆర్తి........................................................................................................227

4. 12. ఆవర్జా...................................................................................................228

4. 13. ఇన్ స్టెంట్ లైఫ్.......................................................................................229

4. 14. ఇలాఉన్నాం...........................................................................................230

4. 15. ఇల్లలకగానే పండగౌనా.........................................................................231

4. 16. ఒక రాత్రి గడవాలి........232

4. 1 7. గంగజాతర........232

4. 18. టెన్షన్........233

4. 19. (తొలి) నిర్ణయం........234

4. 20. తృషిత........235

4. 21. నిర్ణయం........236

4. 22. పట్ట పగటి చీకటి........236

4. 23 .పనికి (రాని) సగం........237

4. 24. పరివర్తన........238

4. 25. పేరెంట్ ........239

4. 26. ప్రగతి ........239

4. 27. భూలక్ష్మి ........240

4. 28. మదుపు ........241

4. 29. మురళీ వాళ్లమ్మ ........241

4. 30. మోక్షం ........242

4. 31. యాష్ ట్రే ........243

4. 32. రెక్కలున్న పిల్ల ........243

4. 33. శిలకోల ........244

4. 34. సూపర్ మామ్ సిండ్రోమ్ ........245

4. 35. క్షతగాత్ర ........246

4. 36. సామెతలు, జాతీయాలు: ........246

పాదసూచికలు........248

**5. స్త్రీల అస్తిత్వ చిత్రణ కథలు - దృక్పథం**........250

5. 1. అంటు రోగం........250

5. 2. అదెక్కడ........251
5. 3. ఆకాశంలో సగం........252
5. 4. ఆవర్జ........253
5. 5. ఆర్తి........253
5. 6. ఇలావున్నాం........254
5. 7. ఇల్లలగానే పండగౌనా........254
5. 8. ఒక రాత్రి గడవాలి ........255
5. 9. క్షతగాత్ర........256
5. 10. టెన్షన్ ........256
5. 11. తృషిత ........257
5. 12. (తొలి) నిర్ణయం........258
5. 13. నిర్ణయం........259
5. 13.1. ఆత్మగౌరవం లేకపోవటం........259
5. 13.2. భయం........260
5. 13. 3. సామాజిక - ఆర్థిక వత్తిడులు........260
5. 13. 4. సామాజిక గుర్తింపు కోరుకోవటం........260
5. 13. 5. అభద్రతా భావన........260
5. 13. 6. భవిష్యత్తు కి పెట్టుబడిగా కొడుకు........260
5. 14. పట్ట పగటి చీకటి ........261
5. 15. పరివర్తన ........261

5. 16. పేరెంట్ ....................................................................................................262

5. 17. ప్రగతి ....................................................................................................262

5. 18. బొమ్మలో చైతన్యం ....................................................................................263

5. 19. మదుపు ....................................................................................................263

5. 20. మురళీ వాళ్ళమ్మ ........................................................................................263

5. 21. యాష్ ట్రే ....................................................................................................264

5. 22. వ్యక్తిత్వం ....................................................................................................264

5. 22. 1. స్త్రీ అంతః సంఘర్షణ ......................................................................264

5. 22. 2. పురుష అంతః సంఘర్షణ ..................................................................265

5. 23. శిలకోల....................................................................................................265

5. 24. సత్య పాలన ..............................................................................................266

5. 25. సూపర్ మామ్ సిండ్రోమ్ .............................................................................266

5. 26. గంగజాతర.................................................................................................267

5. 27. భూలక్ష్మి ....................................................................................................267

పాదసూచికలు..................................................................................................270

అధ్యయన ఫలితాలు:

ఉపయుక్త గ్రంథాలు

# ముందుమాట

నేను ఎం.ఏ. చదివే రోజుల్లో (2004 - 2006) జరిగిన జాతీయ సదస్సులు నన్ను పరిశోధన వైపు ఆకర్షించాయి. సాహిత్యరంగంలో పరిశోధన చేస్తే మానవుల అంతరంగ, బాహ్య స్వభావాలను కొంతవరకైనా అర్థంచేసుకోవడానికి అవకాశం వుందని భావించి, పరిశోధనలో ప్రవేశించాను.

వందమంది పరిశోధకులు తమ జీవితమంతా పరిశోధన చేసినా, ఇంకా అనేక కోణాలు మిగిలి వుండే అంశం 'స్త్రీ జీవితం'. ఎందుకంటే స్త్రీ జీవితం అనేక అంశాలతో ముడిపడి ఉంటుంది. అందువల్ల ఆమె జీవితం చాలా సంక్లిష్టమైనది. తల్లి కడుపులో ఆడపిల్లగా రూపొందింది మొదలు, తన చుట్టూ వున్న సమాజంతో సంఘర్షించవలసి వస్తుంది అడుగడుగున ఆమె అభివృద్ధికి ఆటంకాలే. ఆమె జీవితంపై సమస్త అధికారాలు పురుషులవే. దీన్నిబట్టి స్త్రీ ఒక పరాన్న బుక్కుగా జీవిస్తోందని అర్థమౌతుంది.

నా పరిశోధనకు స్త్రీ జీవితమే కేంద్రబిందువయ్యింది. అయితే ఇప్పటికే స్త్రీ జీవితానికి సంబంధించి అనేక పరిశోధనలు జరిగాయి. కానీ కథాసాహిత్యంలో స్త్రీ అస్తిత్వానికి సంబంధించి పరిశోధన జరగలేదు. అందుకే నేను ***"తెలుగు కథ - స్త్రీల అస్తిత్వ జీవిత చిత్రణ(2000 - 2009)"*** అనే అంశాన్ని పరిశోధనకు స్వీకరించాను.

నా పరిశోధనను ఒక దశాబ్దానికి పరిమితం చెయ్యడం జరిగింది. ఈ దశాబ్దిలో అంటే 2000 నుండి 2009 వరకు వచ్చిన వివిధ కథాసంపుటులు, సంకలనాలు, ఈనాడు, వార్త, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, సూర్య మొదలైన దినపత్రికల ఆదివారం అనుబంధాలను పరిశీలించడం జరిగింది. పరిశోధనలో భాగంగా కాళీపట్నం రామారావుగారి 'కథానిలయాన్ని', అస్మిత, అన్వేషి రిసోర్స్ సెంటర్లను సందర్శించడం జరిగింది. వీటన్నింటిలో నుంచి స్త్రీ అస్తిత్వానికి సంబంధించిన నలభై కథలను నా పరిశోధన కోసం స్వీకరించడం జరిగింది. అయితే 2000 సంవత్సరానికి ముందుకూడా బలమైన అస్తిత్వ చిత్రణ కథలువచ్చాయి. అలా వచ్చిన కథల్లో ఇరవై కథలను కూడా తీసుకోవడం జరిగింది. మొత్తం అరవై కథలపై పరిశోధన చేయడం జరిగింది.

పరిశోధనా సౌలభ్యం కోసం ఈ సిద్ధాంతగ్రంథాన్ని అయిదు అధ్యాయాలుగా విభజించడం జరిగింది. మొదటి అధ్యాయం ***"అస్తిత్వవాదం - ఆవిర్భావ వికాసాలు."***

ఈ అధ్యాయంలో - అస్తిత్వవాద ఆవిర్భావ వికాసాలు, ఈ వాదంలోని మౌళికభావనలు, ప్రముఖ అస్తిత్వవాదుల అభిప్రాయాలను వివరించడం జరిగింది. నేటి కాలంలో తమ అస్తిత్వం కోసం పోరాడుతున్న స్త్రీల పరిస్థితులు అర్థంకావాలంటే, తరతరాలుగా వారు ఏ విధమైన అస్తిత్వాన్ని కలిగివున్నారో తెలుసుకోవడం ఎంతైనా అవసరం గనుక వివిధ యుగాల్లో వారి స్థితిగతులు ఎలావున్నాయో వివరించడం జరిగింది.

ఆధునిక కాలంలో స్త్రీలు చైతన్యవంతులై సాహిత్యం ద్వారా తమ గొంతు వినిపించడానికి మార్గాన్ని సులభతరం చేసింది స్త్రీవాదోద్యమం. నా పరిశోధన కోసం తీసుకున్న కథలు కూడా స్త్రీవాదోద్యమంలో భాగంగా వెలువడినవే గనుక ఈ అధ్యాయంలో స్త్రీవాదం గురించి కూడా వివరించడం జరిగింది.

తరతరాలుగా అణచివేయబడిన స్త్రీ నేటికాలంలో చైతన్యవంతురాలవుతుందంటే, అది ఒక్కసారిగా వచ్చిన మార్పు కాదు. చైతన్యవంతురాలైన నేటి స్త్రీ వెనుక అనేక మంది స్త్రీ మూర్తు ల పోరాట స్ఫూర్తి త్యాగం ఉన్నాయి. అందువల్ల ***"వివిధ ఉద్యమాలు - స్త్రీలు - చైతన్యం"*** అనే అంశాన్ని రెండో అధ్యాయంగా చేర్చడం జరిగింది. ఇందులో వివిధ ఉద్యమాల్లో పాల్గొన్న స్త్రీల గురించి, వారి త్యాగనిరతి గురించి వివరించడం జరిగింది.

మూడవ అధ్యాయం ***"స్త్రీల అస్తిత్వ చిత్రణ కథలు - వస్తు వైవిధ్యం"***. ఇక్కడ స్త్రీల అస్తిత్వ చిత్రణ కథలు అంటే స్త్రీలు రాసిన కథలు కాదు. స్త్రీలకు సంబంధించిన కథలు. ఈ కథల్లో స్త్రీలు ఏఏ విషయాల్లో అస్తిత్వం కోసం పోరాడుతున్నారో పేర్కొనడం జరిగింది.

ఈ అధ్యాయం చివరిలో ***'2000 సంవత్సరానికి ముందు వచ్చిన అస్తిత్వ చిత్రణ కథలు'*** అనే ఉప అధ్యాయాన్ని చేర్చడం జరిగింది.

నాలుగో అధ్యాయం ***"స్త్రీల అస్తిత్వ చిత్రణ కథలు - భాషాశిల్పం"***. పరిశోధనకు తీసుకున్న కథల్లో వున్న భాషా శిల్పాలను పరిశీలించడం జరిగింది.

అయిదో అధ్యాయం ***"స్త్రీల అస్తిత్వ చిత్రణ కథలు – దృక్పథం"***. ఈ అధ్యాయంలో పరిశోధనకు తీసుకున్న కథల్లోని స్త్రీల దృక్పథాలను పరిశీలించడం జరిగింది. చివరిలో పరిశోధన ఫలితాలు, ఉపయుక్త గ్రంథ సూచి ఇవ్వడం జరిగింది.

# 1. అస్తిత్వవాదం - ఆవిర్భావ వికాసాలు

## 1.1. ప్రవేశిక:

సాహిత్యం, సమాజం రెండు పరస్పర ఆధార ఆదేయాలు. ఈ రెండు ఒకదాన్నొకటి ప్రభావితం చేస్తు ంటాయి సాహిత్యం ఎప్పుడు కూడా సమాజాన్ని ఒక కంట కనిపెడుతూవుంటుంది. సమాజం కూడా సాహిత్యం పోకడలను గమనిస్తూ వుంటుంది సాహిత్యం సమాజం యొక్క ఉత్తా నపతనాలను వివరిస్తు ంది ఒక్క మాటలో చెప్పాలంటే సమాజాన్ని మంచిమార్గంలో నడిపించడానికి సాహిత్యం తనవంతు కృషిచేస్తు ంది అదే విధంగా సమాజంలోని వ్యక్తు ల అభిప్రాయాలు, ఆలోచనలు సాహిత్యం ద్వారా వ్యక్తమవుతూ వుంటాయి. స్థూలంగా చెప్పాలంటే సమాజ ప్రతిబింబమే సాహిత్యం.

సాహిత్య ప్రపంచంలో వెలువడిన కొన్ని బలమైన సిద్ధాంతాలు, వాదాలు అవి వెలువడిన దేశంలోనే కాక మిగిలిన దేశాల్లో కూడా వ్యాపించి ఆయా దేశాల భాషా సాహిత్యాలపై ప్రభావం చూపుతున్నాయి. అలా ప్రభావం చూపిన వాదాల్లో అస్తిత్వవాదం ఒకటి.

వ్యక్తి ప్రవృత్తికి వ్యవస్థకు మధ్యవున్న సంఘర్షణ ఇప్పటిది కాదు. అనాది నుంచి వస్తు న్నదే సమాజంలో ఒక సభ్యునిగా వుంటున్న వ్యక్తి తన ప్రవృత్తిని లేదా ప్రవర్తనను సమాజ నియమాలకు, కట్టుబాట్లకు లోబడి ఉండేటట్లు రూపొందించుకోవాలని సమాజం నిర్దేశిస్తు ంది అందుకే సమాజంలో అనేక కట్టుబాట్లు ఏర్పడ్డాయి.

అస్తిత్వవాదం మొదటి ప్రపంచయుద్ధం తర్వాత వెలుగులోకి వచ్చింది. మొదటి ప్రపంచయుద్ధానికి రెండవ ప్రపంచయుద్ధానికి మధ్యకాలంలో ఫ్రాన్సులో మానవమనుగుడకు దుర్భరం కావడమే ఈ వాదం ఆవిర్భవానికి కారణం. రెండవ ప్రపంచయుద్ధానికి ముందు, ఆ తర్వాత ఫ్రాన్సులో ఉండే అనిశ్చిత జీవన పరిస్థితుల వలన యూరప్ ఖండాలలో ఫ్రెంచ్ పౌరుని మనుగడ ఆ కాలంలో అత్యంత దుర్భరంగా మారిపోయింది. ఎవరికివారు తమ గమ్యన్ని వెతుక్కుంటూ తన అస్తిత్వ రక్షణ కోసం పరుగు ప్రారంభించారు. ఒక వైపు ఆర్థికంగా పెట్టుబడిదారి దోపిడి, మరోవైపు జర్మన్ నాజీల దురాక్రమణ ఫ్రాన్సులో నెలకొంది. తద్వారా మనిషికి ఒంటరితనం ఏర్పడింది. నాజీలను ఎదిరించగలిగిన ధైర్యం, దేశభక్తి కొందరిలో ఉన్నా, అనేకమందిలో నెలకొన్న నిరాశ నిస్పృహలవల్ల ఆ ఆశయం నిరుగారిపోయింది. ఎవరికివారు తమకు దొరికినంత స్వేచ్ఛను అనుభవిస్తూ ఏదోవిధంగా జీవనాన్ని సాగించడమే జీవిత పరమార్థం అనే భావన ప్రతి ఒక్కరిలో ఏర్పడింది. వీటి ప్రభావం సాహిత్యంపై పడింది.

ఫ్రాన్సులో మొట్టమొదటిసారిగా వ్యక్తివాద తాత్విక దృక్కోణం సాహిత్య రూపం ధరించింది. డాడాయిజం, సర్రియలిజం మొదలైనవి మొదటిగా ఫ్రాన్సులో వచ్చాయి. 1930 - 50 మధ్యకాలంలో ఫ్రెంచ్ మేధావులు అక్కడ విభిన్నమైన, విచ్ఛిన్నమైపోయిన విలువులమధ్య జీవిస్తూ వాటికి సంబంధించిన రచనలు చేశారు. మనిషి పుట్టుక, ఆ తర్వాత సంభవించే మృత్యువు వీటి మధ్యవున్నవ్యవధిలో వ్యక్తి బుద్ధిజీవిగా తాను ఏమి కావాలనుకుంటున్నాడు? కావలిసిన వాటికోసం ఏమి చేయాలి? వాటికున్న అవకాశాలు ఏమిటి? అనే అన్వేషణ వ్యక్తి తనను తాను తెలుసుకోవడానికి, అంటే... తన అస్తిత్వాన్ని గుర్తెరగడానికి తోడ్పడింది. వీటన్నింటివల్ల అస్తిత్వవాదం వ్యాప్తిలోకి వచ్చి, అభివృద్ధిచెందడానికి దోహదపడింది.

రెండవ ప్రపంచయుద్ధానంతరం తెలుగు సాహిత్యంపై ప్రభావం చూపిన అంశాల్లో "అస్తిత్వవాదం" ఒకటి. అస్తిత్వవాదాన్ని ఆంగ్లంలో "Existentialism" అంటారు. "Existence" అనే పదానికి నిఘంటువులో అనేక అర్థాలున్నాయి. వాటిలో కొన్నింటిని చూద్దాం! శబ్దార్థచంద్రికలో అస్తిత్వం అనే మాటకు "ఉండుట"[1] అనే అర్థం ఇచ్చారు. శ్రీ సూర్యయాంధ్ర నిఘంటువులో అస్తిత్వం అనే మాటకు "ఉనికి", "ఉండుట"[2] అనే అర్థాలిచ్చారు. సి.పి. బ్రౌన్ ఇంగ్లీష్ - తెలుగు నిఘంటువులో "To exist" అనే మాటకు "ఉండుట", "కలిగిఉండుట", "జీవించుట", "బతుకుట" అనే అర్థాలిచ్చారు. అంతేకాక "Existence" అనే మాటకు "ఉనికి", "స్థితి", "ఉండడం", "జీవితకాలం"[3] అనే అర్థాలు కూడా ఇచ్చారు. (బ్రౌన్ ఇంగ్లీష్ - తెలుగు నిఘంటువు 2000 : 393)

concise oxford dictionary లో existence అంటే "being existing life" అనే అర్థాలు ఉన్నాయి. Existentialism అనే మాటకి "Philosophical Theory emphasizing existence of the individual person as free and responsible agent determining his own development"[4] అని అర్థం చెప్పబడింది.

తెలుగు అకాడమీ ఇంగ్లీష్ - తెలుగు నిఘంటువులో Existence అనే మాటకు "ఉండు" అని, అస్తిత్వం అనే మాటకు "కలిగివుండు", "సంభవించు", "బ్రతుకు", "జీవించు" అనే అర్థాలు ఇవ్వడం జరిగింది. "Existentialism" అనే మాటకు "మానవుడు స్వతంత్రుడు, తన కర్మకు తానే బాధ్యుడు. జీవితం, సత్యం అనుభవనీయమేగానీ శాస్త్రార్థమైన విచారణ కాదు"[5] అనే అర్థంలో వివరించడం జరిగింది. సాధారణంగా నిర్వచించడానికి కష్టమైన పదాల్లో అస్తిత్వం ఒకటి. దీనిని ఆంగ్లంలో "Existence" అంటారు. దీన్నే కొందరు "Politics of Identity" అని కూడా అంటారు.

మార్క్స్ మాటల్లో చెప్పాలంటే 'ప్రగతికి మూలం భిన్నశక్తుల మధ్య ఘర్షణ", తద్మూలంగా ఉత్పన్నమయ్యే ఒక నూతన స్థితి. ఈ ఘర్షణే సామాజిక అస్తిత్వఘర్షణ.

ప్రసిద్ధ నిఘంటువుల్ని చూసిన తర్వాత "Existence" అంటే ఉండుట, కలిగిఉండుట, బ్రతుకుట, జీవించుట మొదలైన అర్థాలు ఉన్నా... సాహిత్య పరిభాషలో ఆంగ్లంలోని "Existence" అనే మాటకి తెలుగులో 'ఉనికి', 'కలిగివుండు' అనే మాటలు, "Existentialism" అనే పదానికి 'అస్తిత్వవాదం' అనే మాటకు దగ్గర అర్థాన్నిస్తున్నాయి కాబట్టి ఈ సిద్ధాంతగ్రంథంలో ఈ అర్థాలనే ప్రధానంగా గ్రహించడం జరిగింది.

## 1. 2. అస్తిత్వవాదం- కీర్కుగార్డు:

అస్తిత్వవాదానికి మూలపురుషుడు కీర్కుగార్డు (1813 - 1855). ఈయన డెన్మార్కు దేశానికి చెందినవాడు.

కీర్కుగార్డు తండ్రి ఆధ్యాత్మికవాది. కీర్కుగార్డు తనకున్న బాధల వల్ల ఎప్పుడు దేవున్ని నిందిస్తూ ఉండేవాడు. తన తోటి వ్యక్తులతో కలవలేక ఒంటరిగా ఉండేవాడు. ఈ కారణం వల్లే ఆయన చాలా విచిత్రమైన స్వభావం కలిగి వుండేవాడు. అంతేకాక అతను చదువుకుంటున్న రోజుల్లో అతని తల్లి, సోదరులు మరణించారు. ఈ సంఘటనలు ఆయనను చాలా కుంగదీశాయి.

1840లో ఆయనకు 'రేగినా' అనే యువతితో వివాహం జరిగింది. అతడు ఆమెను ఎంతో ప్రేమించాడు. ఆమెను తన హృదయేశ్వరిగా అభివర్ణించాడు. ఈ ఆనందం ఎక్కువకాలం నిలువలేదు. పెళ్లయిన ఒక సంవత్సరం తర్వాత ఇద్దరు వేరైపోయారు. అప్పటి నుండి అతడు ఒంటరిగా మారి, సాహిత్యరచన చేయడం మొదలుపెట్టాడు. కీర్కుగార్డు దాదాపు 20 పుస్తకాలు డేనిష్ భాషలో రాశాడు. ఆ భాష విశ్వవ్యాప్తమైంది కాకపోవడం వలన ఆయన రచనలకు డెన్మార్కులో తప్ప ఇక ఏ దేశంలోనూ ప్రాచుర్యం లభించలేదు. అయితే తరువాత కాలంలో ఆయన రచనలన్నీ ఆంగ్లంలోకి అనువదించబడడం వలన ప్రపంచవ్యాప్తంగా ఆయన రచనలు ప్రసిద్ధిచెందాయి. వాటిలో ప్రధానమైనవి:

1. ఐదర్ ఆర్
2. ఫిలసాఫికల్ ఫ్రాగ్మెంట్స్
3. కంక్లూడింగ్, అన్ సైంటిఫిక్ పోస్టు స్క్రిప్టు
4. రెవిరేటన్.

కీర్కుగార్డు జీవించిన కాలంలో అస్తిత్వవాదానికి అంత ప్రాముఖ్యం ఏర్పడలేదు. కాని ఆయన మరణానంతరం అస్తిత్వవాదానికి యూరప్ లోనే కాక, ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం లభించింది. అస్తిత్వవాద సాహిత్యం మీద ఆయన ప్రభావం ఎక్కువగా కనబడుతుంది.

మానవుడు తన చుట్టూ ఉన్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ, మత వ్యవస్థలను అర్థంచేసుకుంటూ, వాటితో మమేకమవ్వడానికి ప్రయత్నించి విఫలమవ్వడాన్ని ఆయన గుర్తించాడు అంతేకాక వ్యక్తి మాటలకు, చేతలకు, సంబంధం లేకపోవడం గమనించాడు. అందుకే 'The philosopher of system is as a man like someone who builds a castle but lives next door in a shanty... the thoughts of a man must be the house in which he lives or it will become perverted' అని పేర్కొన్నాడు. ఆలోచన కంటే అనుభూతి ప్రధానం. ఆ అనుభూతి స్వరూపాన్ని చిత్తశుద్ధితో గ్రహించే ఆత్మపరీక్ష ముఖ్యం. ఈయన దృష్టిలో చిత్తశుద్ధి అంటే త్రికరణశుద్ధిగా జీవించడం. ఇలా త్రికరణశుద్ధిగా జీవించడమే ఈయన దృష్టిలో వ్యక్తిగా రూపొందడం (to become a person) అని అర్థం. ఈ స్థితిలో వ్యక్తి తన చేతలకు, నిర్ణయాలకు బాధ్యత వహించాలి. ఇక్కడ ధర్మనిర్ణయం తన అస్తిత్వం మీద ఆధారపడి గాని, సిద్ధాంతం మీద గాని, వ్యవస్థ మీద గాని, హేతుబద్ధమైన ఆలోచన మీద గాని, తాత్కాలికమైన ప్రేరణ మీద గాని కాదు. ఇవన్నీ అస్తిత్వానికి ఉపాంగాలే తప్ప ప్రధానమైనవి కావు. కీర్కగార్డు దృష్టిలో అస్తిత్వం అంటే వ్యక్తి అంతరాల్లోంచి ఉద్భూతమై వ్యక్తిని ముందుకు నడిపించే అతని వైశిష్ట్యాన్ని అస్తిత్వం[6] అంటారు.

కీర్కగార్డుది ప్రధానంగా అస్తిత్వతత్వం అంటే మానవుని అస్తిత్వం దీనికి పునాది. అస్తిత్వం అంటే అయన దృష్టిలో జీవించడంకాదు. తనను తాను తెలుసుకొని జీవించడం. అంటే జ్ఞానంతో జీవించడం. జ్ఞానంతో జీవించడంవలన మానవునికి స్వతంత్రత లభిస్తుంది తనకు తానే పునాది అవుతాడు. తద్వారా ప్రపంచ నాటకరంగంలో వ్యక్తిత్వంగల పాత్రను అభినయించగలుగుతున్నాడు. ఇటువంటి ఆత్మజ్ఞానపరమైన అస్తిత్వం మనిషికే ఉంది. జంతువులకు లేదు అని పేర్కొన్నాడు.

కీర్కగార్డు అభిప్రాయంలో వ్యక్తి యొక్క అస్తిత్వం వాస్తవం మిగిలినవన్నీ అవాస్తవాలు అంటే నిజమైన వాస్తవికత వ్యక్తి యొక్క అస్తిత్వం వాస్తవికతను ఆలోచనా విధానాల వల్ల తెలుసుకోలేం. ప్రత్యక్షానుభవం వల్ల మాత్రమే తెలుసుకోగలం అని ఆయన పేర్కొన్నారు.

కీర్కగార్డు తన రచనల్లో హెగెల్ ప్రతిపాదించిన భౌతికవాద సిద్ధాంతాన్ని విమర్శించాడు. వస్తుగతమైన బాహ్యదృష్టితో మానవుని అస్తిత్వాన్ని, అస్తిత్వం లేకపోవడాన్ని పరిశీలించకూడదని ఆయన అభిప్రాయం. దానిని ఆయన ఈ కింది ఉదాహరణ ద్వారా తెలియచేశాడు.

ప్రపంచపటాన్ని చూపించి, అందులో ఒక చిన్న బిందువుగా ఉన్న డెన్మార్క్ ను చూపిస్తే డెన్మార్కును సందర్శించాలనే వ్యక్తికి అది ఏ మాత్రం ఉపయోగపడదని ఆయన అభిప్రాయం. అందులో చిన్న బిందువుగా మాత్రమే మానవుని అస్తిత్వం చిత్రించబడిందని కీర్కగార్డు అభిప్రాయం[7].

సత్యం ఆత్మనిష్టమైనది. అస్తిత్వమనేది ఘనీభూతమైన భావనాపరిధిలో నిండి వుంటుంది. అస్తిత్వ సంపన్నుడయిన వ్యక్తి ఖచ్చితమైన లక్ష్యాలతో తన అస్తిత్వాన్ని వికసింపచేసుకుంటాడు. ఏ వ్యక్తి స్వయంగా క్రైస్తవుడిగానో లేక ఇంకొక వ్యక్తిగానో కాడు. అతడు తన సాధన వల్ల, తన జ్ఞానం వల్ల క్రైస్తవుడిగానో లేక హిందువుడిగానో మారతాడు. వ్యక్తి సాధనచేసి తన జీవితాన్ని తనకిష్టమైన మూసలో పోసి నిర్మించుకుంటాడు అని కీర్కగార్డు పేర్కొన్నారు. సత్యదర్శనం ఎలా కలుగుతుంది అనే దానిగురించి వివరిస్తూ, వస్తు గత చింతనావిధానం వల్ల, సిద్ధాంతాలు చెప్పడం వినడం మాత్రమే జరుగుతుంది. కాని ఆత్మగత చింతనావిధానం ద్వారా మాత్రమే సత్యదర్శనం కలగడం సాధ్యమని ఆయన పేర్కొన్నారు.

డెకార్డే అనే తత్వవేత్త చెప్తూ... "నేను ఆలోచిస్తున్నాను అందువల్లే నేనున్నాను"[8] అంటాడు. కానీ కీర్కగార్డు "నేను ఉన్నాను. అందువల్లే ఆలోచిస్తున్నాను" అంటాడు. ఆలోచించడానికి అస్తిత్వం అవసరం. అస్తిత్వం లేనిదే ఆలోచన లేదు అంటాడు కీర్కగార్డు. మనం అంతర్ముఖులమై మన అస్తిత్వాన్ని గురించి ఆలోచించడం ప్రారంభించగానే మనలో ఏదో తెలియని అంతర్విరోధం ఏర్పడుతుంది. దాన్ని తట్టుకుని నిలబడలేక దేవుని సహాయం కోరతాం అని చెప్పాడు. ఈయన మానవుని అస్తిత్వానికి ఎంతో ప్రాధాన్యం ఇచ్చినప్పటికీ, దేవుడు మనలో ప్రేరకశక్తిగా ఉన్నాడని, అతడు సర్వాధికారి అని భావించాడు. మత ప్రబోధాలను వ్యతిరేకించినా, దేవుని యెడల నమ్మకం కలిగి ఉండేవాడు. అనేకులు ఈ విషయం కీర్కగార్డులోని లోపమని అనేకులు తెలియజేశారు.

కీర్కగార్డు రచనావ్యాసాంగాన్ని చేపట్టిన కాలంలో చర్చ్ సేవలో చేరదామనుకుంటాడు. కానీ వాటిలో ఉన్న లోపాల కారణంగా ఆ కార్యక్రమాలకు దూరంగా ఉన్నాడు. క్రైస్తవమతానికి వ్యతిరేకంగా అనేక రచనలు చేయడంవల్ల మతాధికారులు ఈయనపై చాలా ఒత్తిడి తెచ్చారు. ఆ ఒత్తిడుల మధ్యలో ఆరోగ్యం క్షీణించి మరణించాడు. అప్పటికి అతని వయసు 42 సంవత్సరాలు.

కీర్కగార్డు అభిప్రాయాన్ని గోపిచంద్ వివరిస్తూ... "కీర్కగార్డు తత్వం అస్తిత్వతత్వం అంటే మానవుని అస్తిత్వం దీనికి పునాది. అస్తిత్వం అంటే ఆయన దృష్టిలో జీవించడం కాదు. అస్తిత్వం అంటే తనను తాను తెలుసుకొని జీవించడం. అంటే... జ్ఞానంతో జీవించడం. జ్ఞానంతో జీవించడం వల్ల మానవునికి స్వతంత్రత లభించింది. తనకు తానే పునాది అయ్యాడు. ప్రపంచనాటకరంగంలో వ్యక్తిత్వంగల పాత్రను అభినయించగలుగుతున్నాడు. వ్యక్తి అస్తిత్వం వాస్తవం మిగిలినవన్ని పిచ్చికగూళ్లే, అంటే... నిజమైన వాస్తవికత వ్యక్తి యొక్క అస్తిత్వం వాస్తవికతను ఆలోచనా విధానాలవల్ల తెలుసుకోలేం ప్రత్యక్షానుభవం వల్ల మాత్రమే తెలుసుకోగలం"[9] అని అన్నారు.

కీర్కగార్డు ప్రబోధించిన అస్తిత్వవాదం క్రైస్తవ అస్తిత్వవాదంగా అభివర్ణింపబడింది. భగవంతుని అన్వేషణ, వ్యక్తిజీవితం ఒక్కటేనని కీర్కగార్డు నమ్మకం. ఈయన అంతర్ముఖత్వానికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చాడు[10].

## 1. 3. అస్తిత్వవాదం- భిన్న నిర్వచనాలు:

అస్తిత్వవాదాన్ని గురించి అనేకులు అనేక నిర్వచనాలు చెప్పారు. వాటిలో ముఖ్యమైన కొన్ని నిర్వచనాలు-

జాన్ మెకారి అభిప్రాయం ప్రకారం: "Existence is not an idea or an essence that can be intelletually manipulated. indeed man becomes something less than human life if he allows himself and his being to be a absorbed into some organised scheme of being or something rational system of thought. Man fulfils his being practicely by existing by standing out as the unique individual that he is and stubbornly refusing to be observer into a system"[11].

"అస్తిత్వం అంటే ఒక భావమో, ఒక సిద్ధాంత సారమో కాదు. అది ఒక జీవన సరళి. మనిషి తనకు రక్షణలేదని ఎప్పుడైతే భావిస్తాడో అప్పుడే అస్తిత్వ ఆలోచనాసరళి అతడిలో ప్రవేసిస్తుంది అప్పటినుండి అతడిలో అస్తిత్వ సంఘర్షణ ప్రారంభమౌతుంది".

దీన్ని నిర్వచనం అనడం కంటే వివరణ అంటే బాగుంటుంది. ఎందుకంటే అస్తిత్వానికి సంబంధించిన ఒక అవగాహన ఏర్పరచుకోవడానికి ఈ వివరణ ఉపయోగపడుతుంది.

'ప్రపంచంలో మానవ జీవనగతికి ఒక ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేక జీవనగతి నుండే జీవన సమరం ప్రారంభమౌతుంది. ఆ జీవన సమరం నుండే వ్యక్తి రూపుదాల్చుతున్నాడు. అలా రూపుదాల్చిన వ్యక్తి తన వ్యక్తిత్వంతో మనుగడ సాగిస్తాడు ఈ స్థితిని అస్తిత్వవాదులు "Standing out" అంటారు. అదే వారి దృక్పథంలో అస్తిత్వం"[12] "interpreting life which is based upon an attitude of seriousness in living Existentialism is a method of living"[13].

అంటే అస్తిత్వమనేది జీవితాన్ని అన్వయించుకొనే ఒక విధానం. జీవించడంలోగల సీరియస్ నెస్ అనే దృక్పథాన్ని భూమికగా కలిగి ఉంటుంది. ఇక్కడ అస్తిత్వం కలిగి ఉండడం అంటే వైయక్తిక ప్రామాణికతకు విలువనివ్వడమే తప్ప శాస్త్ర ప్రామాణికతతో దానికి ఎలాంటి సంబంధం లేదు. అందుకే మైకెల్ సన్ తన స్థితికి సంబంధించిన గుణాలను బహిర్గతపరచడమే అస్తిత్వం అన్నారు.

## 1. 4. అస్తిత్వస్పృహ

సృష్టిలో మానవజన్మ ప్రారంభమైన నాటినుండి నేటివరకు అస్తిత్వపోరాటం లేదా అస్తిత్వ ఘర్షణ మానవప్రపంచంలో ఏదో ఒక రూపంలో కనిపిస్తూ నే ఉంది. మనిషి తనలో తాను, సమాజంతో తాను నిత్యం సంఘర్షణకు గురికావడం మూలంగా అతని ఆలోచనల్లో, భావాల్లో మార్పు అనేది అనివార్యమైంది. మనిషిలోని ఆలోచనలు ఒక దానితో ఒకటి విభేదించి మార్పులు, చేర్పులు జరిగి కొత్త కొత్త సిద్ధాంతాలు రూపుదిద్దుకుంటూ వచ్చాయి. ఈ అస్తిత్వపు సంఘర్షణ వలన ఏర్పడిన సిద్ధాంతం అస్తిత్వవాదంగా పరిణమించింది.

వ్యక్తి తన చైతన్యాన్ని బట్టి విమర్శనాదృష్టితో వాస్తవాన్ని పరిశీలించడం ప్రారంభిస్తా డు తద్వారా భావచైతన్యానికి అంకురార్పణ జరుగుతుంది. ఇది క్రీ. పూ. 4, 5 శతాబ్దాల కాలంలో ప్లేటో, అరిస్టాటిల్ మొదలైన వారిలో తాత్వికచింతనగా ప్రారంభమై మానవత్వపు విలువలకు ప్రాధాన్యమిస్తూ వచ్చింది. ఈ భావచైతన్యంతోనూ, సామాజిక చైతన్యంతోనూ కూడిన ఆలోచన, జిజ్ఞాస మేధావుల చేత ముందడుగు వేయించింది. ఫలితంగా వ్యక్తి చైతన్యం, ఆధ్యాత్మిక చైతన్యం మానవజీవితంలో చోటుచేసుకున్నాయి. ఇలా... చైతన్యం అనేక విధాలుగా విస్తరించిన సంధి కాలంలోనే అస్తిత్వవాదపు బీజాలు మొలకెత్తా యి మానవుడు ప్రకృతిని పరిశీలించడంతో పాటు తనని తాను పరిశీలించుకోవడం ద్వారా (ఆత్మ పరిశీలన) వ్యక్తి తన అస్తిత్వాన్ని గుర్తించి దానికి ఒక ప్రత్యేక గుర్తింపు కోసం అన్వేషణ ప్రారంభించినట్లుగా తెలుస్తోంది వ్యక్తి తనను తాను అర్థంచేసుకోడమే తన అస్తిత్వాన్ని గుర్తించడం 'తనని తాను వెతుక్కునే కృషికి కారణం, ఫలితం కూడా వ్యవస్థతో తలపడటమే అవుతుంది. దాదాపు ఇలాంటి భావాలే అస్తిత్వవాదం ఏర్పడడానికి అంకురార్పణచేసాయి' [14] అంటారు కోడూరి శ్రీరామమూర్తి.

అస్తిత్వ౹ అస్తిత్వ సంబంధమైన భావాలను నిర్వచనాల ద్వారా అర్థంచేసుకోవడం కంటే నిజజీవితానుభవాల ద్వారా సరిగా అర్థంచేసుకోవచ్చు.

మనిషి తన గురించి తాను ఆలోచించుకోవాలి. తన జీవితానికి, తన మనుగడకు ఒక అర్థాన్ని ఆపాదించుకోవాలి. జీవిత అసంతృప్తిలోంచే అస్తిత్వసంబంధమైన ఆలోచన పుట్టుకొస్తుంది కీర్కెగార్డు అభిప్రాయం ప్రాకారం 'మనం జీవితంలో కొన్ని లక్ష్యాలను పెట్టుకుంటాం. ఆ లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నిస్తాం దీనివల్ల మనలను బాహ్య జీవితమనేది ఒకటి పెనవేసుకుంటూ వుంటుంది. అందువల్ల ప్రయత్నం ఎక్కువైన కొద్దీ వాస్తవికత దూరమౌతుంది. వాస్తవికత ఎవరికి వారికి వారి అస్తిత్వంలో ఉంది' అంటారు అస్తిత్వవాదులు

అయితే అస్తిత్వస్పృహ ఎప్పుడు కలుగుతుంది? అనే ప్రశ్నకు సమాధానంగా 'విషమపరిస్థితి సంభవించినపుడు' అని కీర్క్‌గార్డు చెప్పడం జరిగింది. పరిస్థితులన్నీ సజావుగా కొనసాగుతున్నంత కాలం ఏ వ్యక్తి తన గురించి తాను ఆలోచించడు. బాహ్య ప్రపంచం నుంచి కొన్ని కావాలని కోరుకుంటాడు. వాటిని సంపాదించుకుంటూ ఉంటాడు. తాను అనుకున్నది సజావుగా జరగనపుడో, విషమపరిస్థితి వచ్చినపుడో తనను గురించి తాను ఆలోచించుకుంటాడు. కాబట్టి మానసిక సంఘర్షణ కలిగినపుడు మాత్రమే వాస్తవికతను తెలుసుకోగలం అంటాడు కీర్క్‌గార్డు[15].

'ఆతృత వల్ల, భయం వల్ల మానసిక ఆందోళన తీవ్రమైనపుడు ఎవరికి వారికి తమ అస్తిత్వపు స్పృహ ఏర్పడుతుంది. ఆందోళన అధికమైనకొద్దీ ఈ స్పృహ బలపడుతూ వుంటుంది. ఇది బాహ్య లక్ష్యాలను అధిగమించినపుడు ఒక మొత్తంగా తయారై తాత్వికచింతనగా రూపొందుతుంది. అస్తిత్వమంటే ఏమిటో అప్పుడుగానీ తెలియదు' అని హెన్రీ డి. ఐకన్ వ్యాఖ్యానించారు.

అస్తిత్వాన్ని గురించి వివరించిన వారిలో డార్విన్ ను గురించి చెప్పుకోవాలి. ఎందుకంటే ఇతడు ప్రతిపాదించిన 'జీవ పరిణామ సిద్ధాంతం' (Evolution Theory) వెనుక ఉన్నది కూడా అస్తిత్వవాద సిద్ధాంతమే. డార్విన్ దృష్టిలో అస్తిత్వమంటే మనుగడ కోసం పోరాటం. (Struggle for Existence). ఈ విషయాన్ని 1859లో ప్రచురించిన జీవజాతుల పుట్టుక (Origin of specis) అనే గ్రంథంలో వివరించాడు.

ప్రతి ప్రాణి కూడా తన అస్తిత్వపోరాటంలో జయించాలని ప్రయత్నిస్తుంది ఏ జీవి అయితే అస్తిత్వపోరాటంలో నిలుస్తుందో అదే తన మనుగడ సాగిస్తుంది తక్కినవి అంతరించిపోతాయి. ఇదే సిద్ధాంతం మానవ జీవితానికి కూడా వర్తిస్తుంది మానవుడు ఇతర జీవులతో పోరాడి తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూ వస్తున్నాడు

అస్తిత్వాన్ని గురించి వివరించే సందర్భంలో వ్యక్తికి అస్తిత్వం ఎలా కలుగుతుంది అనే ప్రశ్న తప్పకుండా వస్తుంది దీనికి అనేకులు అనేక రకాలైన సమధానాలు చెప్పారు. వాటి సారాంశం- వ్యక్తి స్వయంకృషి వల్ల తనని తాను ఉద్ధరించుకోగల అవకాశాలు అధికంగా ఉన్నాయి. అంతర్ముఖంగా కలిగివున్న భావాలను నిజజీవితంలో సఫలం చేసుకోగలిగిన ప్రాణి మానవుడు ఒక్కడే. కాబట్టి వ్యక్తికి తనని తాను ఉన్నతంగా తీర్చిదిద్దుకోగల శక్తి ఉంది. 'నేను' అనే అహంభావంతో ప్రాపంచిక అస్తిత్వాన్ని అభిలాషిస్తూ, ప్రేమిస్తూ తాదాత్మ్యతను పొందాలి. అలా త్వమేవాహం (నీవే నేను) గా జీవిస్తూ స్వాతంత్ర్యాన్ని సంపూర్ణంగా స్వాధీనం చేసుకుని భౌతిక శరీరంపై ఆధిపత్యం పొందగలడు. అదే వ్యక్తి యొక్క అస్తిత్వ స్థితి. వ్యక్తి అస్తిత్వానికి ఆత్మాన్వేషణ, వైజ్ఞానిక దృష్టి ఇరు పార్శ్వాల వంటివి. అస్తిత్వవాదులు వ్యక్తి అస్తిత్వానికి ప్రధానంగా మూడు అంశాలు చెప్పారు. అవి

1. వ్యక్తిస్వేచ్ఛ (Freedom)
2. నిర్ణయం (Decision)
3. బాధ్యత (Responsibility)

వ్యక్తి మనుగడకు ఆధారమైనవి ఇవే. వ్యక్తిస్వేచ్ఛగా తన భవిష్యత్తు ను తీర్చిదిద్దుకోగల సామర్థ్యం కలిగి ఉండటం వలనే ఇతర జంతువుల కంటే ఉన్నతంగా పరిణతి చెందాడు. సామర్థ్యమనేది వ్యక్తి నిర్ణయం, బాధ్యతాయుతమైన నిర్ణయాలవల్ల వ్యక్తి సాధికారికంగా 'తాను' కాగలుగుతాడు. అస్తిత్వం గురించి సమగ్రమైన అవగాహన కలిగిన అస్తిత్వవాదులు వ్యక్తిత్వం వ్యక్తిగత చైతన్యం ఈ రెండింటికే ప్రాధాన్యమిచ్చారు.

## 1. 5. అస్తిత్వవాద లక్ష్యం:

ప్రతీ సిద్ధాంతానికి, వాదానికి ఒక లక్ష్యమనేది ఉంటుంది. ఆ లక్ష్యమే ఆయా సిద్ధాంతాలకు, వాదాలకు దిశానిర్దేశం చేస్తుంది అస్తిత్వ లక్ష్యాన్ని గురించి ఒక్కొక్కరు వారి వారి దృక్పథాలననుసరించి ఒక్కొక్క విధంగా చెప్పారు. వీటన్నింటినీ సంగ్రహపరిచి అస్తిత్వవాద లక్ష్యాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే 'మానవ జీవితం ఆరంభం నుండి ముగింపు దాకా ఎన్ని పోకడలకు అవకాశం కలిగివుందో, ఆ పోకడలలో వ్యక్తి తన అస్తిత్వాన్ని నిలుపుకోవడానికి ఎలా ప్రయత్నిస్తాడో; ఆ ప్రయత్నానికి వ్యక్తి జీవితంలో ఎలాంటి అవకాశం వుందో సమగ్రంగా ప్రయత్నించడమే అస్తిత్వవాద లక్ష్యంగా చెప్పవచ్చు'.

అస్తిత్వానికి మూలబిందువు వ్యక్తి, ఈ వ్యక్తి తన అస్తిత్వాన్ని ఎలా కాపాడుకుంటాడు?, అస్తిత్వపోరాటంలో అతను ఏవిధంగా నిలబడతాడు మొదలైన అంశాలను వివరించడమే అస్తిత్వవాదంలో ఉన్న మూలసారం.

అస్తిత్వాన్ని గురించి ఒక్క మాటలో చెప్పాలంటే వ్యవస్థకంటే వ్యక్తికి ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పేదే అస్తిత్వవాదం వ్యవస్థ విధించిన ధర్మాన్ని, నీతి, నియమాలను వ్యక్తి అనుసరించినపుడు లేదా వ్యవస్థ కోసమే వ్యక్తి బతుకుతున్నపుడు అతని స్వేచ్ఛ పూర్తిగా నాశనమౌతుంది. అతడొక జడపదార్థం గా మారిపోతాడు. వ్యక్తి ప్రత్యేక అస్తిత్వం కలిగి జీవించాలనుకుంటే తనకై తాను తన ధర్మమేమిటో తెలుసుకోవాలి. కాబట్టి ఆత్మాన్వేషణ అనేది అస్తిత్వవాదంలో ప్రధానమైన అంశం.

## 1. 6. ప్రముఖ అస్తిత్వవాదులు- విభిన్న అభిప్రాయలు:

అస్తిత్వవాదంలో ఉన్న అంశాలను అనేకులు అనేక రకాలుగా వివరించారు. వ్యక్తిని కేంద్రంగా చేసుకొని ఒక్కొక్కరు ఒక్కొక్క రకమైన అభిప్రాయం వ్యక్తం చేశారు. వారిలో ప్రధానంగా-

### 1. 6. 1. జీన్ పాల్ సాత్రే:

జీన్ పాల్ సాత్రే 1905లో జన్మించాడు. అతను రెండు సంవత్సరాల వయసులో ఉన్నప్పుడే తండ్రి మరణించాడు. సాత్రే, పాఠశాల ఉపాధ్యాయునిగా తన జీవితం ప్రారంభించాడు. తరువాత, సైన్యంలో చేరాడు. ఈయన చిన్నతనం నుండి ఎక్కువ సమయాన్ని పుస్తకపఠనంలో గడిపేవాడు. క్రమ క్రమంగా ఏకాంతవాదిగా మారి, చివరికి వ్యక్తివాదిగా; అంటే... వ్యక్తికే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చే అస్తిత్వవాదిగా మారాడు. అస్తిత్వవాద దార్శనికులలో జీన్ పాల్ సాత్రే చాల సుప్రసిద్ధుడు. అస్తిత్వవాదమంటే సాత్రే, సాత్రే అంటే అస్తిత్వవాదమే అన్నంతగా ఆయన పేరుగడించారు. అధునాతనమైన జీవితాన్ని, ఆధునిక కళలను వ్యాఖ్యానించడానికి అస్తిత్వవాద దర్శనం ఒక్కటే సమర్థవంతమైనది అన్నంతగా ఈ వాదాన్ని ప్రాచుర్యంలోకి తీసుకుని వచ్చాడు. సాత్రే రచనలో ప్రధానంగా:

1. బీయింగ్ అండ్ నథింగ్ నెస్
2. ఎగ్జిస్టెంసియలిజం అండ్ హ్యూమనిజం
3. సిచ్యుయేషన్స్
4. వాట్ ఈజ్ లిటరేచర్

సాత్రే దృక్పథంలో ప్రధానాంశం వ్యక్తిస్వేచ్ఛ సాత్రే- వ్యక్తి హృదయంలోని పరమార్థికాన్వేషణను గుర్తిస్తా డు కాని ఈ అన్వేషణకు గమ్యం లేదంటాడు. మానవులంతా తమ గమ్యం 'భగవంతుని చేరడం' అని భావించే సాత్రే వివరిస్తూ... భగవంతుడు ఒక వ్యవస్థ, ఒక భావం, ఒక కల్పన. అందువల్ల అది మానవుని అస్తిత్వాన్నీ, దాని లక్షణమైన స్వేచ్ఛను భంగపరిచే ఆత్మవంచన తప్ప మరొకటి కాదు. "man is a useless passion" అంటాడు.

వ్యక్తికి స్వేచ్ఛ ప్రధానం కాబట్టి బాధ్యత, నిజాయితి కూడా ప్రధానం అవుతాయి. నైతికసూత్రాలు కాని, మానవత్వపు విలువలు కాని వ్యక్తి తన అస్తిత్వం నుంచీ కర్మణ్యా సృష్టించుకునేవే (Existence precedes essence) అంటాడు సాత్రే.

సాత్రే అభిప్రాయం ప్రకారం 'మనిషి తన పనులలో, అభిరుచులలో స్వతంత్రుడు. అయితే అతని వ్యక్తిగతమైన పనులు, అభిరుచులు అన్నీ సమాజానికి ఉపయోగపడవలె'నంటాడు. అంటే వ్యక్తిగతమైన అభిరుచులు, పనులు సామాజిక హితమనే బాధ్యతను గుర్తించి మనుగడ సాగించాలంటాడు సాత్రే. మతం, నైతికవిలువలు మొదలైన వాటి విషయంలో వ్యక్తి తన వివేకం మీద ఆధారపడతాడు. మనిషి యొక్క అదృష్టం, అతని శక్తి, అస్తిత్వం అన్నీ అతని మీదనే ఆధారపడి వుంటాయి. అతడు ఏ శక్తి చేతిలోనూ కీలుబొమ్మ కాడు. తానే కర్త, తానే భోక్త.

'జీవితం అనేది సుఖఃదుఃఖాల, ఆశ - నిరాశల సమ్మేళనం. ప్రతి వ్యక్తీ వీటన్నింటిని ఎదుర్కోక తప్పదు. ఏ వ్యక్తి అయితే తన కోరికలను తీర్చుకోలేక, ప్రయత్నాలు ఫలించక నిరాశకు గురౌతాడో అలాంటప్పుడు అతడు భగవంతుని వైపుకు ఆకర్షింపబడతాడు. వ్యక్తి తన జీవితంలో తన ప్రయత్న ఫలంగా ఫలప్రాప్తి కలగకపోతే దేవుడు అతనికి ఎలా ఫలప్రాప్తి కలుగజేస్తాడు? ఇది నాకు అర్థంకాని విషయం అని సాత్రే పేర్కొన్నాడు.

సాత్రే చేతనావాది. అందుకే 'చేతన', 'వస్తువు'లో ఉంటుంది కాని, వస్తువు 'చేతన'లో లేదు అంటూ దీనికి ఉదాహరణగా ఈ క్రింది విషయం చెప్పాడు. అద్దంలో వస్తువు ఉండదు, కాని అద్దానికి దగ్గరగా ఉన్న వస్తువు ఆ అద్దంలో ప్రతిబింబిస్తుంది 'చేతన' వస్తువు అనే ద్వైతాన్ని సాత్రే అంగీకరిస్తాడు

సాత్రే వ్యక్తిగత స్వాతంత్ర్యం గురించి చెప్తూ... స్వాతంత్ర్యం అనేది భూత, వర్తమానాలు రెండింటి నుండి విముక్తమై తన ఉద్దేశాలను, లక్ష్యాలను నిర్మించుకుంటుంది అంటాడు. స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అనేవి మనిషి జన్మహక్కుగా అభివర్ణించాడు. మనుష్యుని అస్తిత్వం అనేది 'నేను జగత్తులో ఒక భాగంగా ఉన్నా'ననే దానిచేత అనుశాసితమవుతుంది. శరీరం ఒక స్థూలకేంద్రం. అది ఒక ఆరంభ బిందువు. దాని సహాయంతో మనుష్యుడు ముందుకు సాగడానికి ప్రయత్నించాలి అంటాడు.

### 1. 6. 1. 1. కవి, నిబద్ధత, కళ - సాత్రే

సాత్రే- కవి లేదా సాహిత్యకారుడు గురించి చెప్తూ, దుఃఖం వలన కలిగిన చీత్కారం ఏదో వేదనను కలిగిస్తుంది ఆవేదన నుండి ఒక దుఃఖగీతం వెలువడుతుంది. ఆ దుఃఖగీతం వేదనాపూరితమే కాక, ఇంకా ఏదో అవుతుంది అంటాడు. ఈ విశ్వంలో సాహిత్యకారుడు మాత్రమే మానవుని అంతరాంతరాలలో నిగూఢంగా ప్రజ్వరిల్లుతున్న వేదనను, బాధను తెలుసుకొని, దానిని తాను అనుభవించిన దాని తాలూకు అస్తిత్వాన్ని, సత్యాన్ని తెలుసుకుంటాడు. సాహిత్యం, స్వాతంత్ర్యం రెండు పరస్పర ఆశ్రితులంటాడు సాత్రే.

నిబద్ధత గురించి సాత్రే ఒక స్పష్టమైన అభిప్రాయన్ని వెల్లడిచేశాడు. రచయిత అయినటువంటి వ్యక్తి... సమస్యల్ని, ప్రశ్నల్ని పరిష్కరించడానికి తప్పక కృషిచేయాలి. నిబద్ధత వలన సాహిత్యకారుని శక్తి కుంచితమవుతుందనే భావనను సాత్రే తిరస్కరిస్తాడు జీవితం సంక్లిష్టంగా ఉన్నప్పుడు దాన్ని 'ఆత్మ చిత్రణ' అంటాడు సాత్రే. రచయిత ఆత్మచిత్రణ చేయడంలో నిబద్ధత కలిగి ఉండాలి. ఇతని రచనలు చదివిన అనేకమంది మీ పాత్రలు కురూపులుగా, దుష్టపాత్రలుగా ఉంటాయి ఎందుకు? అని ప్రశ్నించినప్పుడు, దీనికి ఆయన సమాధానంగా 'నేను సృష్టించిన పాత్రలు మనుష్యుని ఆత్మ సాక్షాత్కారం చేయిస్తున్నవి' అని చెప్పాడు.

సాత్రే తన 'సాహిత్యమనగానేమి?' అనే గ్రంథంలో రచయితల బాధ్యతలు, గుణాలను గురించి వివరంగా చర్చించాడు. జీవితంలో మనకు మనమే నిబద్ధులం. నిబద్ధులమైన మన రచనల్లో ఆత్మ చిత్రణచేస్తున్నాం మన రచనల్లో నిజాయితీ కలిగిన స్వరూప చిత్రణ ఉండాలి అంటాడు. ఇదే సందర్భంలో శిల్పం గురించి ప్రస్తావిస్తూ, శిల్పం వంటి వాటిమీద ఎక్కువగా ఆధారపడితే రచనలోని అంతఃసౌందర్యం నష్టమై, పై పై జిలుగులు మాత్రమే అలంకారాలుగా మిగిలిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నాడు[16].

సాత్రే దృష్టిలో కళ ఒకానొక ఆశయయుక్తమైన క్రియ. అది కల్పన ద్వారా సంచాలితమవుతుంది. కల్పన- కళాకారుని స్వాతంత్ర్యాన్ని వ్యక్తీకరిస్తుంది ఎందువల్లనంటే అది లభించిన స్థితి నుండి ముందుకు సాగి, వస్తువును దాని స్వరూపాన్ని సృష్టిస్తుంది కళాభోక్త పాఠకుడి కృతిని వస్తురూపంలో చూసి, స్వతంత్రుడుగా దానిని అనుభవిస్తూ దానినే పునఃర్నిర్మిస్తాడు అనగా మొదటిస్థితిలో వస్తువు ముఖ్యమై, కళాకారుడు గౌణుడవుతున్నాడు. అనగా కళాకృతి నిర్మాణానికి పూర్వం కళాకారుడు ముఖ్యుడు. కృతిగౌణంగా ఉంటుంది. కళాకారుడు సహృదయుడు ఇద్దరు కలిసి సౌందర్య నిర్మాణ, పునఃర్నిర్మాణాలను చేస్తారు ఏ కృతి నిర్మాణం జరిగినా, సాహిత్యకారుని వ్యక్తిత్వం ఆకృతితో సంబంధం కలిగివుంటుంది. రచయిత తన స్వాతంత్ర్యాన్ని గుర్తించుకుంటూనే విశ్వంతో తనకు గల సంబంధ స్వరూపాన్ని తన కృతిలో పొందుపరుస్తాడు అంటే అతని ఆలోచనా విధానమంతా అతని రచనల్లో వ్యక్తీకరిస్తాడు

సాహిత్యపు ప్రయోజనాన్ని గూర్చి వివరిస్తూ, వ్యక్తి ఉన్న దుర్భరమైన, మానసిక, పరిస్థితుల నుండి అతణ్ణి పైకి లేవదీసి అతనిలో స్వతంత్రభావాన్ని రేకెత్తింపజేసి స్వతంత్రుడుగా చేయడమే సాహిత్యం, కళ యొక్క ప్రధాన లక్ష్యమని సాత్రే అభిప్రాయం.

సాత్రే కొన్ని సిద్ధాంతాలకు కట్టుబడిన వాడు. 1964లో నోబెల్ బహుమతి ఆయనను వరించినప్పటికీ దాన్ని తిరస్కరించాడు. అదే సందర్భంలో ఆ బహుమతిని ఎందుకు తిరస్కరిస్తునాడో చెప్తూ, 'ఏ సిద్ధాంతాలు సాహిత్యకారునికి ముఖ్యమైనవని నేను విశ్వసిస్తున్నానో, రచయితల బాధ్యత

విషయంలో ఏ గుణాలు అవసరమని నేను భావిస్తున్నానో... వాటిని దృష్టిలో పెట్టుకుని నేను ఈ బహుమతిని తిరస్కరిస్తున్నాను' అని పేర్కొన్నాడు. రాజకీయంగా, సామాజికంగా లేక సాహిత్యపరంగా విశిష్టదృష్టి కలిగిన రచయిత తన రచనల ద్వారా ప్రసిద్ధి చెందాలని ఆయన అభిప్రాయం.

సాత్రే - వ్యక్తి స్వేచ్ఛకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. వ్యక్తి హృదయంలోని పారమార్థికాన్వేషణను గుర్తిస్తాడు గాని ఈ అన్వేషణకు గమ్యంలేదని అతని అభిప్రాయం. మానవ జీవితానికి గమ్యం అని ఊహించుకునే భగవంతుడు ఒక భావం, ఒక కల్పన. అందువల్ల అది మానవుని అస్తిత్వాన్ని, దాని లక్షణమైన స్వేచ్ఛని భంగపరిచే ఆత్మవంచన తప్ప మరేమీ కాదని, అన్వేషణకు సార్థకత కేవలం 'అన్వేషణే' తప్ప మరొకటి కాదని అతని అభిప్రాయం.

అస్తిత్వాన్ని సాత్రే మూడు పొరలుగా విశ్లేషిస్తాడు అవి

1. తనలో తాను
2. తనకై తాను
3. ఇతరుల కోసం తాను

## 1. 6. 1. 2. **తనలో తాను** (being in itself):

ఈ అస్తిత్వపొరలో ఏకత్వం, అద్వైతం ఉంది.

## 1. 6. 1. 3. **తనకై తాను** (being for itself):

ఈ పొరలో ద్వైతం ఉంది. అంటే తనను వేరుగా ఒక వస్తువుగా చూడటం. ఇక్కడ తనను గురించిన ఆలోచనకు ఊహకు కల్పనకు అవకాశం ఉంది. ఆత్మజ్ఞానానికి ఆత్మవంచనకు అవకాశం ఉంది.

## 1. 6. 1. 4. **ఇతరుల కోసం తాను** (being for otherself):

ఇతరుల దృష్టిలో తనను గురించి ఏ అభిప్రాయం ఉందో ఊహించడం వల్ల వ్యక్తి తన ప్రవర్తనను ఆ విధంగా రూపొందించుకోడం జరుగుతుంది. తద్వారా వ్యక్తికి స్వేచ్ఛ పోయి జడత్వం, బానిసత్వం సంభవిస్తాయి

వ్యక్తి 'తనలో తాను' అనే పొరలో జీవించేటప్పుడు నిజాయితి, బాధ్యత, స్వేచ్ఛ అనే విలువలు కలుగుతాయి. సామాజికుడైన మానవునిలో ఈ మూడు పొరల అస్తిత్వం ఉంటూనే ఉంది. ఎవరూ దీన్ని తప్పించుకోలేరు. అయితే ఈ మూడు పొరల్లో ఏది ప్రాధాన్యం వహిస్తున్నదన్న విషయమే ముఖ్యం.

## 1. 6. 2. పాస్కల్:

సుప్రసిద్ధ అస్తిత్వవాదుల్లో పాస్కల్ ఒకరు. ఈయన ఫ్రాన్సు దేశంలో 1632న జన్మించాడు. ఈయన మూడు సంవత్సరాల వయస్సులో వున్నప్పుడే తల్లి మరణించింది. బాల్యం నుండి అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. అనారోగ్యం కారణంగానే జీవితాంతం బ్రహ్మచారిగా ఉండిపోయాడు. పాస్కల్ గణితశాస్త్రజ్ఞుడు. కీర్క్ గార్డ్ అస్తిత్వవాద మూలపురుషుడు అని సాహితీజగత్తు లో ప్రసిద్ధికెక్కినప్పటికీ... ఈయన కంటే రెండు శతాబ్దాల క్రితమే పాస్కల్ అస్తిత్వవాదానికి అంకురార్పణచేశాడు. పాస్కల్ కి తన 31వ సంవత్సరంలో మాటలకందని ఆంతరంగిక అనుభూతి కలిగి, దాని ఫలితంగా క్రీస్తు ను ఆరాధించడం మొదలుపెట్టాడు. ఆయనలో చెలరేగిన ఆంతరంగిక అనుభూతుల వలన దేవుడు మనుష్యులపై చూపే జాలి, ప్రేమ మొదలైన అంశాలపై అతనికి అనేక సందేహాలు ఏర్పడ్డాయి. ఈ విషయంపై ఆయన అనేక అంశాలను ఉత్తరాల రూపంలో రాయడం జరిగింది. ఆ ఉత్తా రాలన్నీ "పాస్కల్ ఉత్తరాలు" అనే పేరుతో ప్రచురించబడ్డాయి.

మానవుడు ఆర్జించే జ్ఞానంవల్ల అతనికి మేలు కలుగుతుందా లేదా అనే సంశయం ఏర్పడింది. వైజ్ఞానిక అంశాలపై పరిశోధన చేయడం వల్ల మానవుడు తన సహజ ధర్మానికి రోజురోజుకీ దూరమై పోతున్నాడని ఆయనకు నమ్మకం ఏర్పడింది. విజ్ఞానం శాశ్వతమా? ఆత్మ శాశ్వతమా? అనే సందేహం ఏర్పడింది. దీనిని తెలుసుకోవడానికి అనేక క్రైస్తవ మత గ్రంథాలను అధ్యయనం చేశాడు. ఈ అధ్యయనాల ద్వారా అతనికి సంతృప్తికరమైన సమాధానం దొరకలేదు. అంతేకాక ఆయనలో 'నేను నా చిన్న జీవితాన్నే చూస్తు న్నాను నా జీవితం అనంత దేశ, కాలాల మధ్య ఒక బిందువుగా వుంది. ఈ అనంత దేశ, కాలాలు నన్ను ఎరుగవు. అసలు ఇప్పుడు నేనున్న స్థానం ఏమిటి? ఈ స్థానంలో ఎందుకున్నాను? వేరే స్థానంలో ఎందుకు లేను. నన్ను ఈ స్థానానికి తెచ్చిపడేసిన శక్తి ఏది?" మొదలైన ప్రశ్నలు... ఆయనలో ఏదో తెలుసుకోవాలనే జిజ్ఞాసను కలిగించాయి. ఈ జిజ్ఞాసే ఆయనలో అస్తిత్వవాద దర్శనానికి బీజాలు వేశాయి.

జ్ఞానప్రాప్తికి తర్కం కంటే శ్రద్ధ, విశ్వాసం ఎక్కువ ఉపయోగపడతాయని ఆయన నమ్మకం. ఇంద్రియాల ద్వారా తెలుసుకోలేని దానిని శ్రద్ధ, విశ్వాసం ద్వారా తెలుసుకోగలమని ఆయన వివరించాడు. మనుష్యుని అస్తిత్వాన్ని వస్తు గత బాహ్యదృష్టితో కాక ఆత్మగతమైన ఆంతరంగిక దృష్టితో గుర్తించగలమని ఆయన బోధించాడు. ఆయనలో ఏర్పడిన ఈ తర్కబుద్ధి క్రమ క్రమంగా అస్తిత్వవాదానికి అంకురార్పణ చేసింది.

### 1. 6. 3. కాఫ్కా:

కాఫ్కా 1883లో ప్రేగ్ లో జన్మించాడు. ఇతను న్యాయశాస్త్రంలో పట్టభద్రుడు. ఇతని తండ్రి పెద్ద వ్యాపారి. అందువల్ల కొడుకుని కూడా వ్యాపారంలో ప్రవేశించమని కోరాడు. కాని కాఫ్కా స్వభావానికి వ్యాపారం సరిపడకపోవడంవల్ల వ్యాపారానికి దూరంగా ఉన్నాడు.

తమ రచనల ద్వారా అస్తిత్వవాదానికి ప్రఖ్యాతి కలిగించిన వారిలో కాఫ్కా ఒకరు. ఈయన తన రచనల యెడల కూడా విముఖత వ్యక్తం చేసేవాడు. అయితే స్నేహితుల ప్రోత్సాహంతో కొన్ని రచనల్ని ప్రచురించాడు. ఆ రచనలు ప్రపంచసాహిత్యంలో మంచిపేరు సంపాదించుకున్నాయి. తద్వారా కాఫ్కా కూడా సాహిత్యరంగంలో ప్రముఖస్థానాన్ని సంపాదించుకున్నారు.

**కాఫ్కా రచనల్లో ముఖ్యమైనవి:**

1. మెటమార్ఫిసిస్
2. ఇన్ ది ఫైనల్ సెటిల్మెంట్
3. ది ట్రయల్
4. అమెరికా

ఇవేకాక ఈయన చాలా కథానికలు కూడా రాశారు. ప్యారిస్ లో ఆండ్రే జీద్, జీన్ లయూటర్బో అనే ఇద్దరు 'ది ట్రయల్' అనే నవలను నాటకంగా మార్చి ప్రదర్శించారు. ఆ ప్రదర్శన ఫ్రెంచ్ నాటక చరిత్రలో "అబ్సర్డ్స్" నాటకం పేరుతో గొప్ప సంచలనాన్ని సృష్టించింది.

కాఫ్కా యూదు జాతికి చెందినవాడు. హిట్లర్ ప్రభుత్వం ఆయన బంధువుల్ని, చెల్లెళ్లనూ నిర్దాక్షిణ్యంగా చంపడం మూలాన ఆయన రచనల్లో ఈ హింసాకాండ ప్రతిఫలిస్తుంది ఈయన ఆలోచనా విధానంలో నిరాశ, నిస్పృహలు ఎక్కువ. ఈ కారణంగానే ఆయన రచనల్లో నిరాశ, నిస్పృహలకు గొప్ప స్థానాన్ని కల్పించాడు. జర్మన్ భాషల్లో వెలువడిన ఈయన రచనలన్నీ ప్రపంచవ్యాప్తంగా అనేక భాషల్లోకి అనువదించబడ్డాయి.

కాఫ్కా తన "మౌస్" అనే కథలో జీవితసత్యాన్ని తెలియచేశాడు. ఈ కథలో- బోనులో ఎలుక ఉండడాన్ని, ఆ పరిస్థితిలో దానికి కలిగిన సంక్లిష్టతను వివరిస్తాడు అదే విధంగా, ఆ ఎలుకకు ఎదురుగా ఉన్న పిల్లికి దిశాపరివర్తనం అవసరమని బోధించి, చివరికి ఆ పిల్లి, ఎలుకను తినేసినట్లుగా కథ ముగిస్తాడు కాఫ్కా ఈ కథ ద్వారా మనుష్యుల ముందు అనేక లక్ష్యాలు, ఉద్దేశాలు ఉన్నాయని, అయితే వాటిని చేరుకునే మార్గంలో అనేక రకాలైన ఇబ్బందులు ఉన్నాయని వివరించాడు. ఇదే అంశాన్ని ఇంకా లోతుగా వివరిస్తూ అసలు మనిషి తనకు ఏది కావాలో తేల్చుకునే స్థితిలో కూడా లేడని పేర్కొన్నాడు.

కాఫ్కా రచనల్లోని పాత్రలు నిరాశ, నిస్పృహల్లో కూడా ఆశావాదులుగా కనిపిస్తారు ఈయన మనిషికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు చాలా అవసరమని, బానిసత్వం మిక్కిలి దుర్భరమైందని పేర్కొన్నాడు. మన ముందు ఎంతటి అంధకారమయమైన పరిస్థితులు ఉన్నా ధైర్యంగా ముందుకెళ్లాలని ఆయన బోధించాడు. ఆయన దృష్టిలో ప్రపంచం నిరర్థకమైంది. దానికేమి అర్థంలేదు. ప్రయోజనం కూడా లేదు. అయినప్పటికీ మానవ అస్తిత్వం ముందుకు సాగక తప్పదు. జీవితంలో ముందుకు సాగే క్రమంలో నిరాశ, నిట్టూర్పు, ఆవేదన తప్పవు. అయినప్పటికినీ వీటన్నింటినీ ఎదుర్కొంటూ ముందుకు సాగిపోవాలని ఆయన మానవాళికి బోధించాడు.

కాఫ్కాకు 1921లో అలిన్ అనే యువతితో వివాహం నిశ్చయమౌతుంది. కాని అతడు రోగగ్రస్తుడు కావడంతో అది విఫలమౌతుంది. తద్వారా ఆయన జీవితంలో అనేక మానసిక సంఘర్షణలకు లోనైనట్లు తన రచనల్లో పేర్కొన్నాడు. చివరికి 1942లో కన్నుమూశాడు.

### 1. 6. 4. కామూ:

కామూ 1913లో అల్జీరియాలోని ఒక కుగ్రామంలో జన్మించారు. చిన్నతనం నుండి పేదరికాన్ని అనుభవించాడు. అతను జన్మించిన సంవత్సరానికే తండ్రి మరణిస్తాడు అనేక క్లిష్టపరిస్థితుల మధ్య అతని బాల్యం, విద్యాభ్యాసం కొనసాగుతుంది. అల్జీరియా విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేస్తున్న కాలంలో క్షయ వ్యాధికి గురై, చదువు మధ్యలోనే ఆపివేయడం జరిగింది. ఆ తరువాత కొంతకాలనికి రచనావ్యాసాంగాన్ని ప్రారంభించాడు.

అస్తిత్వవాదుల క్రమంలో చూస్తే కాముని చివరివాడిగా చెప్పవచ్చు. అస్తిత్వవాది అనే పదం కంటే కళాకారుడు అనే పదం అయనకు చాలా ఇష్టం. మానవ సమాజంలోని పరిస్థితులన్నింటిని బాగా అర్థంచేసుకొని మానవాళికి అవసరమైన ఆలోచనలను తన రచనల ద్వారా అందించాడు. కామూ సాహితీ స్రష్ట, విమర్శకుడు.

**ఆయన రాసిన ఉద్గ్రంథాలలో ముఖ్యమైనవి:**

1. దిమిత్ ఆఫ్ సిసిఫస్
2. రెసిస్టెన్స్
3. రెబెలియన్
4. ది అవుట్ సైడర్
5. ది ప్లేగ్
6. ది ఫాల్

కామూ చిన్నతనం నుండి పేదరికంలో పెరగడం, తల్లి ఎప్పుడు ఏదో ఒక రోగంతో బాధపడుతూ, ఆ బాధలో ఆమె చేసే ఆక్రంధనల మధ్య తన బాల్యమంతా గడవడం వల్ల ఈ పరిస్థితులన్నీ అతని మానసనికస్థితిపై ప్రభావం చూపాయి. అందువల్లే అతని రచనల్లో ఇవన్ని ప్రతిఫలిస్తా యి

కామూ రాసిన 'హ్యాపీ డెత్' అనే చిన్న గ్రంథంలో రెండు భాగాలున్నాయి. రెండవ భాగం పాఠకుడికి చాలా ఆశ్చర్యాన్ని కలిగించడమే కాక, మరణాన్ని గురించి వివరిస్తూ... మరణంలోని రెండు భాగాలను విశదీకరించాయి.

1. నేచురల్ డెత్
2. కాన్షస్ డెత్

మృత్యువు స్వరూపాన్ని, పరమార్థాన్ని ఈ పుస్తకంలో బాగా చిత్రించాడు. మనిషి ఏర్పరచుకున్న ఆలోచనలు, విలువలు ఒక విధంగా ఉంటే, అతని బయటి ప్రపంచం వీటికి భిన్నంగా ఉంటుంది. ఈ రెండింటికీ ఎక్కడా పొంతన కుదరడం లేదు. ఈ పరిస్థితిని కామూ 'అబ్బర్డ్సు విసంగతి' అంటాడు. ఆయన నిర్మించిన 'సిసిఫస్' ఈ విసంగతుల దర్శనానికి ప్రతినిధి నాయకుడు. ఈ విసంగతుల నుండి తప్పుకోవడం ఎలా? అనే ప్రశ్నకు రెండు సమాధానాలు చెప్పాడు. అవి-

1. దేవున్ని శరణువేడడం
2. మృత్యువుని ఆశ్రయించడం.

అయితే ఇవి కూడా సరియైనవి కాదని వివరిస్తా డు ఈయన దృష్టిలో ఈశ్వరుణ్ణి శరుణువేడడం అంటే ఒక రకంగా మెటఫిజికల్ మృత్యువును వరించడమే అవుతుందని, మృత్యువుని ఆశ్రయించడం అంటే విసంగతులకు తలవంచడమేనని అంటారు. అందుకే ఈ రెంటింటికి భిన్నంగా అలాంటి సమస్యలపై తిరుగుబాటు చేయాలని అంటాడు. విసంగతుల పరిస్థితుల్లో ఉండి కూడా, మనం నూతన విలువలని ఏర్పరచుకోవాలి. ఈ పని కొంచం కష్టతరమైనప్పటికీ, పరిస్ధితులకు తలవంచక, మృత్యువును ఆశ్రయించక తిరుగుబాటు చెయ్యాలి. అదే సత్యస్థితికి మార్గం అంటాడు కామూ.

కామూ ప్రతిపాదించిన ఈ తిరుగుబాటు సిద్ధాంతం వ్యక్తిగత వ్యవహారాలలో ఫలప్రదమైన సామాజిక పరిధిలో ఫలప్రదం కావడం లేదు. సమష్టిగా ఈ సిద్ధాంతం సఫలం కావడం లేదని కామూ గుర్తించి ఈ విషయాన్ని తన మిత్రునికి లేఖలో వివరించాడు.

కామూ నిరాశను గాక విశ్వాసాన్ని సమర్థిస్తా డు జీవితంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైన ప్పటికి అహంను రక్షించుకుంటూ సమాజంతో సంఘర్షిస్తూ, తిరుగుబాటు చేస్తూ, అననుకూల పరిస్థితుల్లో కూడా విశ్వాసంతో జీవించాలి అంటాడు కామూ.

అస్తిత్వవాద దార్శనికుల్లో అనేకమంది ప్రముఖులు ఉన్నప్పటికీ సాహిత్యరచనల్లో అస్తిత్వవాదానికి ఆదర్శవాదానికి ప్రముఖస్థానం కల్పించిన వారిలో కామూ ఒకడు. ఈయనకు 1957లో నోబెల్ బహుమతి లభించింది. 1960లో ఒక మోటార్ దుర్ఘటనలో ఈయన మరణించాడు.

## 1. 6. 5. డాస్టోవస్కి:

ప్రపంచ సాహిత్యంలో విఖ్యాతులైన రచయితల్లో డాస్టోవస్కీ ఒకడు. అస్తిత్వవాదానికి సాహిత్యరంగంలో తగిన స్థానాన్ని కల్పించడానికి, తగిన వాతావరణాన్ని సృష్టించడానికి ఆయన రచనలు ఎంతగానో ఉపయోగపడ్డాయి.

డాస్టోవస్కీ 1821న మాస్కోలో జన్మించాడు. ఈయన తండ్రి డాక్టర్. 16వ ఏటనే తల్లి మరణించింది. అందుకే ఆయనకు తల్లి యెడల ఏంతో ఆరాధనాభావం ఉండేది. ఆయన తన రచనల్లో తల్లుల పాత్రలను ఎంతో ఉదాత్తంగా, వాత్సల్యపూరితంగా చిత్రించడం జరిగింది. ఈయన చిన్నతనం నుండి కుటుంబమన్నా, పరిసరప్రాంతాలన్నా చాలా నిర్లిప్త వైఖరి చూపేవాడు. మొదట, సైన్యంలో చేరాడు. అయితే తన వృత్తికి ప్రవృత్తికి మధ్య పొంతన కుదరకపోవడం వలన, తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. ఆ తరువాత ఆనాటి ప్రభుత్వ విధానాలను అనుసరించకపోవడం వలన ఏడు సంవత్సరాలు కారాగారశిక్ష అనుభవించి 1854లో విడుదలైనాడు.

డాస్టోవస్కీ నాస్తికుడు దేవుని అస్తిత్వాన్ని నిరాకరిస్తే ప్రతి వస్తువును మనం మంచిదిగా భావించి స్వీకరించవచ్చు అంటాడు. మానవుడు తన గురించి తాను ఆలోచించుకోవడం ప్రారంభిస్తే అతనికెంతో నిరాశ కలుగుతుంది. మానవుని ఆంతరంగిక వేదనను వినడానికి లేదా తెలుసుకోవడానికి ఎవరూ ఇష్టపడరు. కొన్ని సందర్భాలలో ప్రాణస్నేహితులు కూడా ఈ విషయంలో విముఖత చూపిస్తారని ఆయన తెలియచేశాడు. మానవజీవితం ఆచారం, సంస్కృతి పేరుతో ఉన్నతశిఖరాలను అందుకోలేక పోతుందని, తద్వారా మానవజీవితమే కృత్రిమంగా తయారవుతుందని పేర్కొన్నాడు.

డాస్టోవస్కీ అభిప్రాయంలో మానవుడు స్వతంత్ర ప్రతిపత్తి కలవాడు. స్వేచ్ఛాజీవి. అతడు తన మానసిక ప్రవృత్తి మేరకు తన కోర్కెల్ని, లక్ష్యాలను పెంచుకుంటాడు. ఒక్కొక్కప్పుడు తన స్వాతంత్ర్యానికి భంగం కలిగితే తనకు ఎన్ని కష్టాలు వచ్చినా వాటిని ధైర్యంగా ఎదుర్కొంటాడు. కీర్కగార్డు ప్రారంభించిన అస్తిత్వవాదానికి ప్రాచుర్యం కల్పించిన వారిలో డాస్టోవస్కీ ఒకరు.

డాస్టోవస్కీ తన రచనల్లో అజ్ఞాతమైన అచేతనా జగత్తును అద్భుతంగా విశ్లేషించాడు. ఆయన రచనల్లో ముఖ్యమైనవి.

1. నోట్స్ ఫ్రం అండర్ గ్రౌండ్
2. ది పొజెస్ట్
3. ది ఇడియట్
4. క్రైమ్ అండ్ పనిష్మెంట్.

నోడ్సు ఫ్రం అండర్ గ్రౌండ్ అనే గ్రంథంలో ఆయన ఆత్మగత చింతనావిధానాన్ని పేర్కొన్నాడు. ఆయన తన అస్తిత్వలక్ష్యాన్ని గురించి చెప్తూ 'నా లక్ష్యమంతా మానవునిపై కేంద్రీకృతమై ఉంటుంది. నా ప్రయత్నమంతా అతని స్వభావాన్నీ చరిత్రనూ జీవన విధానాన్నీ పద్ధతులనూ అనుభవాలనూ ఆలోచనలనూ వ్యక్తీకరించడమే'నని పేర్కొన్నాడు.

1868లో డాస్టోవస్కీ కన్నుమూశాడు. రష్యా చరిత్రలో ఒక రచయిత మరణం గొప్పగా పరిగణించడం అదే మొదటిసారి. ఆయన శవయాత్రలో వేలకొలది ప్రజలూ వందల ప్రజాప్రతినిధులూ వందల కొలది రచయితలూ పాల్గొన్నారు. ఆ కార్యక్రమం ముగిసిన మరుసటి రోజు శ్మశానాన్ని శుభ్రపరిచేవారికి ఒక్క సిగరెట్టు ముక్క కూడా అక్కడ కనబడలేదంటే, ప్రజలు ఆయన యెడల ఎంతటి గౌరవాన్ని వ్యక్తంచేశారో అర్థంచేసుకోవచ్చు.

## 1. 6. 6. పాల్ టిల్లిచ్:

ఈయన కూడా సాత్రే వలే అస్తిత్వవాదంలో మూడు రకాలైన అస్తిత్వవేదనలను పేర్కొని, వాటికి ప్రాముఖ్యం ఇచ్చాడు. అవి

### 1. 6. 6. 1. విధి - మృత్యువు:

ఎప్పుడూ ఏమౌతుందో అనే భయం; మృత్యువు తప్పదనే స్పృహ.

### 1. 6. 6. 2. శూన్యం - నిరర్థకత:

ఎప్పుడూ ఏదో చేయాలనే ఆదుర్దా, చేస్తు న్న దానికి అర్థమేమిటనే ప్రశ్న.

### 1. 6. 6. 3. పాపం - శిక్ష:

చేస్తు న్నది తప్పు, పాపం అనే భావన; దానికి శిక్ష తప్పదనే భయం. ఈ మూడు అస్తిత్వ వేదనలు వ్యక్తి అస్తిత్వానికి బంధకాలని పాల్ టిల్లిచ్ పేర్కొన్నాడు. ఈయన దృష్టిలో వ్యక్తికి ముఖ్యమైనవి ధైర్యం, విశ్వాసం. వీటి ద్వారానే వ్యక్తికి అస్తిత్వం సిద్ధిస్తు ందని ఇతని అభిప్రాయం.

### 1. 6. 7. హైడిగర్:

Design అనే పదాన్ని అస్తిత్వం అనే అర్థంలో ప్రయోగించినవాడు మార్టిన్. ఇతడి దృక్పథం ప్రకారం అస్తిత్వమనేది ప్రామాణికం అస్తిత్వంగా రూపొందే అవకాశం ఉంది. అయితే ఈ పరిణామంలో వ్యక్తికి నిజమైన వ్యక్తిగా రూపొందడం, తన ఉనికిని అనుభూతికి తెచ్చుకోవడం అనే ఈ రెండు కార్యాలు జరుగుతాయి. అస్తిత్వం అనేది మొదట్లో మూసివుంచిన కిటికీ వంటిది. ప్రామాణిక అస్తిత్వంలోనే అది తెరుచుకుంటుంది. తద్వారా లోతైన వైయక్తిక అనుభవం కలుగుతుంది.

సామాజిక అస్తిత్వం అనేది ఉనికి, అస్తిత్వాల మధ్య వారధి వంటిది. ఇక్కడ ఉనికి విషయంలో వ్యక్తి నిత్య చైతన్యస్పృహను కలిగివుండాలనేది హైడిగర్ అభిప్రాయం. కాబట్టి అస్తిత్వ విషయంలో ఉనికి అనేది ఆద్యంతాలు లేనటువంటిది. వ్యక్తి అస్తిత్వానికి ఉనికి అనేది నిత్య చైతన్యధార వంటిది.

### 1. 6. 8. నీట్షే:

నీట్షే 1844 - 1900ల మధ్యకాలానికి చెందినవాడు. ఇతను వ్యక్తి సంకల్పానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాడు. సంకల్పాన్ని అస్తిత్వపు లోతుల్నుంచి దృఢపరచుకోవడం ద్వారా వ్యక్తి ధర్మానికి భిన్నమైన ధర్మాలను ఎదుర్కొని వాటికి లోబడక స్వధర్మ సాధన చేయడానికి వీలవుతుందంటాడు. కీర్కగార్డు వలె నీట్షే కూడా నిజాయితీకీ స్వయం నిర్ణయాలకి ప్రాధాన్యమిచ్చి, అంతర్ముఖత్వానికి బదులు కార్యోన్ముఖతను బోధించాడు.

సృజనాత్మక శక్తుల ద్వారా విలువలని తనదైన ప్రపంచాన్ని వ్యక్తి నిర్మించుకోవాలని నీట్షే అభిప్రాయం.

ఇరవైయో శతాబ్దపు అస్తిత్వవాదులలో మార్టిన్, యాస్పర్స్, సాత్రే, కేమూ, పాలిటిల్లిచ్, గాబ్రియర్, బార్త్, బాబర్ ముఖ్యులు. సాహిత్యపరంగా అస్తిత్వానికి ప్రాభవాన్ని, ప్రాచుర్యాన్నీ తెచ్చిన రచయితలు సాత్రే, కేయూ. వీరిద్దరికి నోబెల్ బహుమతి లభించింది.

### 1. 6. 9. యునామునో:

ఇరవయ్యో శతాబ్దంలో ప్రముఖ అస్తిత్వవాదులుగా పేరుగాంచిన వారిలో మైకెల్ డి. యునామునో ఒకరు. ఈయన తన జీవితాన్నంతా మానవ అస్తిత్వ మర్మాన్ని ఛేదించడానికి వెచ్చించారు. ఈ ప్రయత్నంలో భాగంగానే ఈయన అలంకారం కోసం కాక, అస్తిత్వ మర్మాన్ని పరిశోధించడం కోసం సిలువను మెడలో వేసుకునేవాడు. అంతేకాక హృదయంపై సిలువను ప్రతిష్టించుకునేవాడు. ఆ సిలువ యునామునో ఆలోచనల్లోని నిరంతర సంఘర్షణకు ప్రతీకగా కనిపిస్తుంది

యునాముమనో దృక్పథం ప్రకారం 'ఏ వ్యక్తీ కేవలం తన వివేకం వల్ల ఆలోచించడం జరగదు. ఆలోచన అనేది ఎముకలతోను, మాంసంతోను నిర్మితమైన మానవుడి నుండి మాత్రమే జనించేది కాదు' అని అతని అభిప్రాయం.

అస్తిత్వం గురించి చెప్తూ 'స్వప్రయోజనాన్ని ఆశించే తన పరిమిత ప్రపంచాన్ని దాటి మానవ ప్రయోజనాన్ని ఆశించే మరో ప్రపంచంలోకి పయనించడమే అస్తిత్వం' అంటాడు యునామునో. అలాగే ఒక ఉన్నతాశయం, ఒక గొప్ప ప్రయోజనం కోసం పాటుపడడం, దాని కోసం జీవితంలో సంఘర్షణ పడడం వల్ల అస్తిత్వం సిద్ధిస్తుందని అంటాడు.

వ్యక్తి బాధ్యతను ఎప్పుడైతే శిరసావహిస్తాడో అప్పుడే బాధామయ ప్రపంచానికి చేరుకోవడం జరుగుతుంది. అదే విధంగా జీవితంలోకి విషాదాన్ని కొనితెచ్చుకోవడం జరుగుతుంది. యునామునో అభిప్రాయం ప్రకారం మనిషికి ప్రధాన సమస్య వృత్తి, సమకాలీన కాలంలో మానవజీవితానికి ప్రాథమిక సమస్య వృత్తి, కానీ యునామునో దృక్పథం ప్రకారం సంపదను పంచిపెట్టడం కాదు, వృత్తులను పంచిపెట్టాలి. ఈనాటి సమస్య. నేనెవరో నాకు తెలుసు. నేనేం కావాలో నాకు తెలుసు అన్న ధీమాలోనే అస్తిత్వానికి అవకాశం లభిస్తుంది ఆ ధీమాయే జీవితంలో మానవునికి అస్తిత్వాన్ని సిద్ధింపచేస్తుంది ఆ దృక్పథంతోనే యునామునో 'ఒక గొప్ప భావనను వివాహం చేసుకుని దానితో గడపడం నేర్చుకుని దాన్ని పెరగనివ్వండి' అంటాడు. ఇటువంటి దృక్పథానికి గానీ బాధ్యతలకుగానీ దూరమైన వ్యక్తిజీవితం యునామునో దృష్టిలో " The uncommited life is like a unscanised life it is unworthy of human being" వ్యక్తి తనను తాను విత్తుకోవాలంటాడు యునామునో. అంటే తనలో తాను ప్రతిష్టించుకోవాలి. వ్యక్తి పరిశ్రమించాలి. తన కంటే గొప్పదైన దానిలో తాదాత్మ్యం చెందాలి. ఆ ప్రయత్నంలో తాను మరణించే పరిస్థితులు ఎదురైనా భయపడకుండా ఉంటాడు. అంతేకాక వ్యక్తి ఎక్కడనుండి వచ్చాడు అనేది కాకుండా, ఏం సాధించాడు? దేనికి ప్రతీకగా నిలుస్తున్నాడు? ఏం చేశాడు? ఎక్కడికి పోతున్నాడు అనేదే వాస్తవం ఆ వాస్తవమే సత్యం. ఆ సత్యమే మానవ అస్తిత్వం[17].

యునామునో దృక్పథం ప్రకారం మతపరమైన మనిషే నిజమైన మనిషి. మతపరంగా ఉండడం అంటే భగవంతునితో సమరం సాగించడమే. ఆ సమరమే యునామునో దృక్పథంలో జీవితానికి ప్రథమ భూమిక. నిరంతర సంఘర్షణను, చేతనను అనుభవించనిదే జీవితం లేదంటాడు. వ్యక్తి ఎప్పుడూ జీవించి ఉండాలనుకుంటాడు. అతడి హృదయం శాశ్వతత్వం కోసం పరితపిస్తుంటుంది తద్వారా భగవంతుని అస్తిత్వాన్ని దృఢంగా విశ్వసించడం జరుగుతుంది. ఆ విశ్వాసంలో మానవ మనస్సు, హృదయం, సంఘర్షణకు లోనవుతాయి. అదే జీవనసమరం. జీవితానికి నిజమైన అర్థం జీవనసమరం నుండే లభిస్తుందని అతని అభిప్రాయయం. ఆ జీవనసమరం అందించే ఫలితమే అస్తిత్వం

వ్యక్తి ఎంతగా దివ్యుడైనా ఉన్నత విలువలు కలిగి ఉన్నా మానవ ప్రవృత్తికి మాత్రం దూరం కాలేడు. అంటే ప్రాథమికమైన మానవ ప్రవృత్తి , వ్యక్తి ఎంతగా దివ్యత్వానికి చేరువైనా అతడిని వదలదు. ఈ మానవ ప్రవృత్తి ప్రతి వ్యక్తికి సర్వసాధారణం. ఈ సర్వసాధారణం అనే లక్షణం నగ్న మానవుని యుగం నుండి నానోయుగం నాటి మానవుని వరకు ఒకేలా ఉంటుంది. అంటే ప్రాథమిక గుణాలను కలిగివున్న స్థితే వ్యక్తి ప్రాథమికస్థితి. ఈ ప్రాథమికస్థితి నుండే వ్యక్తి చైతన్యవంతుడవుతాడు. ఈ చైతన్యస్థితే క్రమంగా వ్యక్తి పరిణామ స్థితికి దోహదం చేస్తు ంది ఈ పరిణామ స్థితే వ్యక్తి అస్తిత్వానికి కారణమవుతుంది.

వ్యక్తి జీవితంలో సంపూర్ణంగా ముగ్ధుడైనప్పుడు, అంటే... జీవితంలో తాదాత్మ్యం చెందినప్పుడు వ్యక్తి ప్రమాణిక జీవితానికి సంబంధించిన భావాలతో తన ఆలోచనలను నింపుకున్నపుడు వ్యక్తికి అస్తిత్వం సిద్ధిస్తు ంది వ్యక్తి ఒక సుస్థిరత్వాన్ని సంపాదించడం అస్తిత్వం వాస్తవ ప్రపంచంలో సముచిత స్థానాన్ని సాధించడం అస్తిత్వం అంటాడు యునామునో.

అస్తిత్వవాదుల్లో ఆస్తికులు ఉన్నారు. నాస్తికులు ఉన్నారు. అస్తిత్వవాదులు ఆస్తికులైనా నాస్తికులైనా వ్యక్తి అనుభూతికి, అనుభవానికి ప్రాధాన్యమిస్తా రు ఇలా అనుభవానికి (Experience), అనుభూతికి (Feeling) ప్రాధాన్యం ఇవ్వడంవల్ల నాస్తికులు నిర్వచించలేని కొన్ని అంశాలను ఆస్తికులు నిర్వచించగలిగారు. నాస్తికుల జీవితాలలో తొంగిచూడని ఒకానొకస్థితిని ఆస్తికులు తమతమ జీవితాల్లో, అనుభవం ద్వారా సిద్ధింపచేసుకోవడం జరుగుతుంది. వారి దృష్టిలో ఈ స్థితి నిర్వికారం, ఆనందమయం. ఈ నిర్వికార స్థితినే ఆస్తికుడైన వ్యక్తి తన అస్తిత్వానికి మూలం అని విశ్వసించడం జరిగింది. జాస్పర్స్, గాబ్రియేల్ మార్సెల్ ఈ కోవకు చెందినవారు. అయితే నాస్తికులు ప్రతిదానికి ఎదురు నిలిచి, ధైర్యంగా పోరాడి తృప్తిపొంధి జయాపజయలతో కూడిన తమ అనుభూతినే అస్తిత్వ నిరూపంగా భావిస్తా రు జీన్ పాల్ సాత్రే, మార్టిన్ హెడిగర్, ఈ కోవకు చెందినవారు. సాత్రే లాంటి వారు భగవంతుడనే భావాన్ని తోసిపుచ్చి భౌతికస్థితుల్లోనే ఉన్నతాంశాలను గుర్తించడం మొదలుపెట్టి, వాటిలోనే జీవితపు విలువలను ఆపాదించుకోవడం జరుగుతుంది. అయితే వాస్తవిక సత్యాన్వేషణ లేదా యథార్థ సత్యాన్వేషణే ఆస్తిక నాస్తికవాదుల ప్రధాన ధ్యేయం. వ్యక్తి అస్తిత్వానికి ఆత్మాన్వేషణ, వైజ్ఞానిక దృష్టి రెండూ ముఖ్యమే. అంటే అస్తిత్వం అనే నాణానికి ఆత్మాన్వేషణ, వైజ్ఞానిక దృష్టి అనే రెండు ఇరు పార్శ్వాలవంటివి.

పైన వివరించిన అస్తిత్వవాదుల దృక్పథాలను పరిశీలించినట్లైతే వ్యక్తి వైశిష్ట్యాన్ని గుర్తించి మానవుల్లో ఒక్కొక్క వ్యక్తికి అనిర్వచనీయమైన వ్యక్తిత్వం ఉందని, దాని అభివ్యక్తి భిన్నంగా ఉండక తప్పదని, తద్వారా వ్యక్తిజీవితం ప్రవర్తన వ్యవస్థను వ్యతిరేకించినప్పుడు వ్యక్తి ధర్మాన్నే ఉత్కృష్టమైన విలువగా అంగీకరించి, వ్యక్తినే సమర్థించడం అస్తిత్వవాదం యొక్క సారాంశంగా చెప్పవచ్చు.

అస్తిత్వవాదం వ్యవస్థకంటే వ్యక్తి ధర్మానికి, అంటే... వ్యక్తి వైశిష్ట్యానికి, స్వేచ్ఛకు, సహజ వికాసానికి అస్తిత్వవాదం ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది

అస్తిత్వవాదం గురించి వివరించిన వివరణంతా ఈ వాదాన్ని అవగాహన చేసుకోవడానికి ఉపయోగపడుతుంది. ఈ అవగాహనతో అస్తిత్వవాద కథలను సరిగా అర్థంచేసుకొవడానికి తోడ్పడుతుంది.

తెలుగు సాహిత్యంలో అస్తిత్వవాద దృక్పథంతో రచనలు చేసి, అస్తిత్వవాదాన్ని ప్రచారం చేసిన వారిలో త్రిపురనేని గోపిచంద్, ఆర్.ఎస్.సుదర్శనం, వడ్డెర చండీదాస్ చెప్పుకోదగ్గ వ్యక్తులు గోపిచంద్ గురించి శ్రీ దోనేపూడి రాజారావు చెప్తూ "గోపీచంద్ సంఘంలోని, సాహిత్యంలోని నీతీ నియమాలను ఎన్నడూ పాటించలేదు. వాటిమీద విద్రోహం చేశాడు. నియమాలు పెట్టి వ్యక్తుల కోరికల్ని అణగద్రొక్కడం ఆయనకు గిట్టలేదు. వాళ్ల కోర్కెల్ని బలపరిచాడు. వాళ్ల స్వేచ్ఛకే హారతి పట్టాడు"[18] అంటారు.

## 1. 7. చారిత్రక పరిణామ దశల్లో స్త్రీ

శ్రీ శ్రీ 'దేశచరిత్రలు' అనే కవితలో... "ఏ దేశచరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం?/ నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం" (మహా ప్రస్థానం) అని అన్నారు. ఇది దేశచరిత్రలకే కాదు, స్త్రీల జీవితాలకి కూడా కింది విధంగా అన్వయించి చెప్పవచ్చు.

'ఏ జాతి చరిత్ర చూసినా ఏమున్నది గర్వకారణం
స్త్రీ జాతి చరిత్ర సమస్తం పురుష పీడన పరాయణత్వం'

దీన్నిబట్టి పితృస్వామ్య అణచివేత వల్ల స్త్రీ పీడించబడుతున్నట్లు స్పష్టమౌతోంది భారతీయ స్త్రీని మన కవులు, కళాకారులు రకరకాలుగా వర్ణించారు. కొందరు దేవతని, కొందరు మాతృమూర్తి అని, కొందరు భూదేవి అని, మరి కొందరు బానిస అన్నారే తప్ప ఎవరూ కూడా స్త్రీని సాటి మనిషిగా, ఒక మనస్సున్న మనిషిగా గుర్తించకపోడం శోచనీయం (భావకవులు మినహాయింపు).

భారతదేశాన్ని ఎందరెందరో రాజులు పాలించారు. కాలక్రమంలో ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయి. అయితే స్త్రీల పరిస్థితుల్లో, స్త్రీల స్థితిగతుల్లో ఇరవయ్యో శతాబ్దం వరకూ చెప్పుకోదగ్గ మార్పులు సంభవించలేదనే చెప్పాలి.

అనాదిగా స్త్రీ ఎలాంటి అస్తిత్వం కలిగివుంది అని ప్రశ్నించుకుంటే ఆ ప్రశ్నకు సమాధానంగా 'తరతరాల్లో స్త్రీ పరిస్థితిని, ప్రాచీనసాహిత్యాన్ని స్థూలంగానైనా చెప్పుకోవాలి. అప్పుడే ఈ కథల్లో చిత్రించిన స్త్రీల అస్తిత్వాన్ని సరిగా అర్థంచేసుకోగలం.

## 1. 7. 1. ప్రారంభ దశలో స్త్రీ

ఆదిమ దశలో స్త్రీలు స్వతంత్రంగా జీవించారు. స్త్రీ మీద పురుష పెత్తనం ఉండేది కాదు. స్త్రీలు వారి ఆహారాన్ని వారే సేకరించుకునేవారు. స్త్రీ పురుషుల మధ్య సంబంధాలు దాదాపు ఈనాడు మనం చూస్తున్న జంతు సంబంధాలను పోలి ఉండేవి. ఈ దశలో మనుషులకు వావి, వరసలు తెలియవు. స్త్రీ తనకు పుట్టిన పిల్లలకి పాలిచ్చి పెంచేది. ఎదిగిన ప్రతి బిడ్డ తన ఆహారాన్ని తానే సంపాదించుకుంటూ తల్లికి దూరమయ్యేది. కాలక్రమంలో మానవుడు ప్రకృతిని అర్థంచేసుకుంటూ వచ్చాడు. ప్రకృతి శక్తులను తన జీవనసరళి మెరుగుపరచుకోవడానికి ఉపయోగించడం మొదలుపెట్టాడు. అంటే నిప్పుతో మాంసాన్ని కాల్చుకుని తినడం వంటి కార్యక్రమాలు చేపట్టాడు. ఈ దశలో స్త్రీ పురుష అనే భేదం లేకుండా జీవనం సాగింది. పని విభజనంతా సంతానోత్పత్తికి సంబంధించింది మాత్రమే. అది అతి సహజమైన విభజన అని చెప్పవచ్చు. పశుపోషణ, భూమి నుండి ఆహారం ఉత్పత్తి చేసుకోడం మొదలైన ఉత్పత్తి సంబంధమైన పనులు ప్రారంభం కావడంతో శ్రమవిభజన రూపాలు స్పష్టంకావడం ప్రారంభమయ్యాయి. పునరుత్పత్తి పద్ధతిని గమనించిన స్త్రీ పురుషుని కంటే ముందుగా భూమి నుండి జరిగే ఉత్పత్తిని గ్రహించింది. తద్వారా మొట్ట మొదటిగా వ్యవసాయం ఆరంభించింది స్త్రీయే. ఈ విషయం గమనించదగ్గది. ఈ దశలో స్త్రీ పురుష సంబంధాలు స్వేచ్ఛా సంబంధాలు.

సింధూ నాగరికత నాటికి స్త్రీలు ఆహారోత్పత్తిలో ప్రధానపాత్ర వహించడమే కాకుండా తనకు పుట్టిన పిల్లలతో గుంపుగా సాంఘిక జీవనానికి పూనుకున్నట్లు తెలుస్తోంది అది గుంపు పెళ్ళిళ్ల దశ అయివుంటుందని చరిత్రకారుల అభిప్రాయం. ఎనరల్ పిల్స్ అను ఇండాలజిస్టు 'ఆర్యుల రాకకు ముందు భారతదేశంలోని తెగలు మాతృస్వామిక సమాజాలు'[19] అని చెప్పాడు. సంతానం స్త్రీకి చెందినదిగా ఉండేది. తల్లి తన కష్టార్జితంతో సమకూర్చిన వస్తువులను మాత్రమే పిల్లలు తమవిగా భావించేవారు.

ఈ వివరాల ద్వారా ఆరంభదశలో స్త్రీ స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో జీవించి తనకున్న మేధస్సును ఉపయోగించి మానవ జీవన మెరుగుపరచడంలో ప్రధానపాత్ర వహించిందని తెలుస్తుంది

## 1. 7. 2. పురుషాధిపత్య సమాజంలో స్త్రీ

మధ్య ఆసియా నుండి ఆర్యులు దాదాపు క్రీ.పూ. 1500 సంవత్సరాలు కాలంలో మన దేశానికి వచ్చారని చరిత్ర చెబుతోంది. ఆనాటికి ఆర్యులు ప్రధాన జీవనాధారం పశుపోషణ. వారు మన దేశం వచ్చేనాటికి ఇక్కడ మాతృస్వామిక వ్యవస్థను కూలద్రోసి దాని స్థానంలో పితృస్వామిక విలువలను స్థాపించారు.

పితృస్వామిక సమాజ లక్షణాలు ప్రధానంగా రెండు.

1. బహు భార్యత్వం
2. స్త్రీలపై సంపూర్ణాధిపత్యం

ఎక్కువ మంది సంతనాన్ని పొందే క్రమంలో పురుషుడు బహు భార్యత్వాన్ని పాటించడం జరిగింది. పశువులను లొంగదీసుకొనే విధంగానే స్త్రీలను కూడా లొంగదీసుకున్నాడు. తద్వారా భార్యలందరూ భర్తలకు బానిసలుగా మారారు. స్త్రీ అంతవరకు తన శరీరంమీద, పిల్లలమీద కలిగివున్న హక్కుల్ని పురుషుడు చేజిక్కించుకున్నాడు. స్త్రీలు... పురుషునికి చెందిన ఆస్తిగా మార్చబడ్డారు. క్రమక్రమంగా ఏర్పడిన జనపదాలు, గణరాజ్యాలు స్త్రీలను సంపూర్ణబానిసత్వంలోకి నెట్టివేశాయి. ఈ క్రమంలో మాతృస్వామ్య వ్యవస్థ నామరూపాలు లేకుండా పోయింది.

## 1. 7. 3 బానిసవ్యవస్థలో స్త్రీ

పితృస్వామిక వ్యవస్థ అభివృద్ధి చెందిన క్రమంలో ఏర్పడిందే ఈ బానిసవ్యవస్థ. ఈ దశ స్త్రీని పుట్టుబానిసగా మార్చివేసింది. స్త్రీని ఒక మనిషిగా కాక ఒక జంతువుగా పరిగణించారు. బానిస దశ ఏర్పడేనాటికి ఉన్న మతాలు కూడా స్త్రీలను తక్కువగానే చూశాయి. బానిస దశలో వృత్తిరీత్యా అనేక విభజనలు జరిగాయి. ఈ విభజనల మూలంగా స్త్రీల జీవితం మరింత దుర్భరంగా మారింది. స్త్రీ జీవితం 'బానిసకు బానిస'గా మారినట్లు తెలుస్తోంది అంటే ఒక పురుషుడు మరొక పురుషునికి బానిస అయితే ఆ బానిసకు బానిస స్త్రీ

## 1. 7. 4. భూస్వామ్య వ్యవస్థలో స్త్రీ

బౌద్ధమతంలో బ్రహ్మచర్యం సాధారణ సూత్రం. బౌద్ధమత ప్రజలను తమవైపు మలచుకోవడం కోసం అప్పటి ఆధిపత్య వర్గం శృంగార సాహిత్యాన్ని ముందుకు తీసుకువచ్చింది. వేదాలను, ఉపనిషత్తులను సృష్టించింది. ఇవన్నీ కూడా వైదికమతం అధికారమతం కావడానికి తోడ్పడ్డాయి. తద్వారా స్త్రీ దారుణంగా అణచివేతకు గురైంది. విద్యకు, నిషేధాలకు గురైంది. స్త్రీ కేవలం వంటింటికి, పూజా మందిరానికి, పడకటింటికి పరిమితమైపోయింది. ఈ విధంగా ఒక్కొక్క దశలో స్త్రీ అణచివేతకు గురౌతూవచ్చింది..

## 1. 7. 5. వేదాల్లో స్త్రీ

క్రీ.పూ. 1500 నుండి 500 సంవత్సరాల మధ్య కాలాన్ని వేదకాలంగా పిలుస్తున్నారు ఈ కాలంలో వేదాలు రాయబడ్డాయని పరిశోధకుల అభిప్రాయం. వేదాల ద్వారా ఆనాటి స్త్రీల స్థితిగతులను తెలుసుకోవచ్చు.

వేదకాలంలో స్త్రీ సంతానం కంటే పురుష సంతానానికే ఎక్కువ గౌరవం ఉండేది. ఈ కాలంలో స్త్రీ జీవిత లక్ష్యం 'పురుష సంతానాన్ని కనడం'గా మారిపోయిందనడానికి వేదాల్లో అనేక శ్లోకాలు ఆధారంగా కనిపిస్తున్నాయి (ఋగ్వేద సంహిత. 5 - 46 -7)

ఈ కింది శ్లోకం ఉదాహరణగా చెప్పవచ్చు.

"మానో అగ్నిమతయే మావీరతామైరీరథ"

(ఋగ్వేద సంహిత 3వ మండలం 16వ శ్లోకం 5వ ఋక్కు).

అంటే ఓ అగ్నీ! నీవు మమ్మల్ని అపుత్రిక విషమ భూతులనుగా చెయ్యకని అర్థం.

తాత్విక చర్చల్లో పాల్గొని, ప్రశ్నించడానికి స్త్రీలకు హక్కు ఉందని చెప్పడానికి గార్గి, మైత్రేయి నిదర్శనం. కాని ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్న వారి సంఖ్య వేళ్లమీద లెక్కించవచ్చు. స్త్రీలకు తాత్వికమైన, శాస్త్రీయమైన విద్యను అభ్యసించే అవకాశం లేకపోడం వల్ల పురుషులు శాస్త్రాన్ని తమ గుప్పెట్లో పెట్టుకుని పురుషాధిక్యతను కొనసాగించారు. బహు భార్యత్వం, బహు భర్తృత్వం రెండూ వేదకాలంలో ఉన్నాయి అయితే ఏక భార్యత్వం కూడా ఉండేది. బుద్ధుడికి యశోధర అనే ఒకే భార్య ఉండటం అందుకు మంచి ఉదాహరణ. తొలి వేదమైన ఋగ్వేదంలో వివాహం తప్పనిసరి అని కనిపించదు. ప్రేమ వివాహాలకు గౌరవమున్నట్లు తెలుస్తోంది భర్త చనిపోతే ఆ స్త్రీ తన భర్త అన్ననో, తమ్ముడినో తిరిగి పెళ్లిచేసుకోవచ్చు. స్త్రీ స్వేచ్ఛ పూర్తిగా హరించివేయబడలేదని చెపవచ్చు.

అథర్వణ వేదంలో 'అక్రమసంబంధాలు పెట్టుకున్న స్త్రీలు ఆడపిల్లల్ని కంటారని, భర్తతో మాత్రమే సంబంధాలు పెట్టుకున్న స్త్రీలు మగపిల్లల్ని కంటారు' అని చెప్పబడంది. దీని వెనుక వున్న పితృస్వామ్య రాజకీయం స్త్రీలను తమ చెప్పుచేతల్లో పెట్టుకోవడానికే ఇలా సృష్టించారని స్పష్టమౌతుంది.

స్త్రీ ఆస్తి కలిగివుండటం అనే విషయానికొస్తే స్త్రీకి అన్నదమ్ములు లేని పక్షంలో మాత్రమే తండ్రి ఆస్తి సంక్రమించేది.

## 1. 7. 6. గృహసూత్రాల్లో స్త్రీ

గృహసూత్రాల రచన ద్వారా కుటుంబజీవితం మరింత పటిష్టం చేయబడింది. గృహసూత్రాల్లో స్త్రీ పరిస్థితిని వివరించాలంటే ఇందులో పేర్కొన్న ఎనిమిది రకాలైన వివాహాల గురించి స్థూలంగానైనా తెలుసుకోవాలి. అవి

1. బ్రహ్మ వివాహం
2. దైవ వివాహం
3. ప్రజాపత్య వివాహం

4. అర్ష వివాహం
5. గంధర్వ వివాహం
6. అసుర వివాహం
7. పైశాచిక వివాహం
8. రాక్షస వివాహం

వీటిలో మొదటి మూడు రకాల వివాహాలు పాలక వర్గానికి చెందినవి. ఈ మూడు రకాల వివాహాల్లోనూ వరకట్నం ఇవ్వడం అనేది ఆనాడే ప్రారంభమైంది. ఆనాటి పాలక వర్గాలు స్త్రీని భోగవస్తువుగా చూశారు. అందుకే ఆమె పతివ్రతగా వుండాలని భావించి 'ఘోషా పద్దతి'ని ప్రారంభించారు. స్త్రీని ఒక 'పరాన్నభుక్కు'గా తయారుచేశారు. తద్వారా ఇంట్లో ఆమె చేసే శ్రమకు విలువలేకుండా పోయింది.

గృహసూత్రాల్లో స్త్రీలకుండే ఆస్తిహక్కును తిరస్కరించారు. వరకట్నం రూపంలో తెచ్చుకున్న ధనం మాత్రమే స్త్రీకి చెందినదిగా పరిగణించేవారు. స్త్రీ జీవితాన్ని దుర్భరం చేయడానికా?! అన్నట్లు ఆమె చేయవలసిన పనులను ఆచరించవలసిన నియమాలను గృహసూత్రాల్లో పేర్కొనడం జరిగింది. ఈ సూత్రాలను అప్పటి ఆధిపత్యవర్గం అధికారంగా కొంతకాలం, అనధికారంగా కొంతకాలం ఇంటింటా ప్రచారం చేసింది. నేటి కాలంలో కూడా ప్రతి స్త్రీ లేదా గృహిణి చేసే పనులను గమనించినట్లయితే గృహసూత్రాలు భారతీయ సమాజంపై ఎంతటి ప్రభావాన్ని చూపాయో మనకు అర్థమవుతుంది.

## 1. 7. 7. అర్థశాస్త్రంలో స్త్రీ

రాజ్యాన్ని శత్రు బారి నుండి రక్షించుకోడం కోసం స్త్రీలను ఉపయోగించుకునే పద్ధతిని కౌటిల్యుడు తన అర్థశాస్త్రం అనే గ్రంథం ద్వారా అలవాటు చేశాడు. రాజకుటుంబాల్లో పరిరక్షక పరివారంలో అధిక సంఖ్యాకులు స్త్రీలే. స్త్రీలపై స్త్రీ గూఢచారులను నియమించేవారు. వ్యభిచారాన్ని చట్టబద్ధం చేశారు. అర్థశాస్త్రం ప్రకారం భర్త ఆజ్ఞ లేకుండా స్త్రీలు ఆటలాడడానికి గాని, స్నేహితుల ఇళ్లకుగాని వెళ్తే పన్ను చెల్లించవలసి వచ్చేది.

రహస్య స్థలాల్లో సంభాషణలు కొనసాగించిన స్త్రీని దెబ్బలు కొట్టవచ్చు. రహస్య సంబంధాలు పెట్టుకున్న స్త్రీని గ్రామం మధ్యలో నిలబెట్టి కొట్టించేవారు.

## 1. 7. 8 మనుధర్మ శాస్త్రంలో స్త్రీ

మనువు రాసిన మనుధర్మశాస్త్రం పురుషాధిక్యతను మరింత అధికం చేసింది. భర్తను భగవంతుని స్థాయికి చేర్చి, భార్యను మరింత బానిసత్వంలోకి నెట్టివేసింది. తద్వారా స్త్రీకి ఎలాంటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేకుండా చేసింది. భర్తపట్ల తన కర్తవ్యాలను నెరవేర్చని స్త్రీకి మరణాంతరం అనేక శిక్షలు ఉంటాయని లేదా భూలోకం లోని తీవ్రమైన వ్యాధులకు గురౌతారని భయపెట్టి, భర్తలు తమ అవసరాలు నెరవేర్చుకునేవారు. దీన్నిబట్టి మనుధర్మశాస్త్రంలో స్త్రీ పరిస్థితి మరింత దిగజారినట్లు తెలుస్తోంది

## 1. 7. 9. రామాయణ, మహాభారతాల్లో స్త్రీ

రామాయణం ప్రధానంగా కుటంబవ్యవస్థను పటిష్టం చెయ్యడానికి పూనుకుంది. ఏక భార్యత్వం, ఏక భర్తృత్వం అనే భావాలను ప్రచారం చేసింది. స్త్రీలకు పాతివ్రత్యం అనేది ఎంత ప్రాముఖ్యమో సీత పాత్రద్వారా చెప్పించడం జరిగినది. అంతేకాక సీత పడ్డ చెరలన్ని భరించడానికి స్త్రీ సమాజాన్ని మానసికంగా సిద్ధంచేసి 'సీతమ్మ పడ్డ చెరలుకంటే నా చెరలు తక్కువే' అని స్త్రీలు గాలి పీల్చుకునే పద్ధతిని అలవాటు చేశారు.

మహాభారతం బహు భార్యత్వం, బహు భర్తృత్వం అనే విధానాలని పాలక వర్గాలకు అంగీకారయోగ్యమని పరోక్షంగా చెప్పింది. దీనికి ఉదాహరణగా ద్రౌపది, కృష్ణుడు కనిపిస్తున్నారు

ఈ విధంగా సాహిత్యంలో కూడా స్త్రీల పరిస్థితి దయనీయంగానే ఉంది.

సామాజిక పరిణామంలో స్త్రీలు కలిగివున్న స్థితిగతులును, సాహిత్యంలో స్త్రీని చిత్రించిన తీరు చూస్తే మాతృస్వామ్య సమాజంలో తప్ప మిగిలిన అన్ని దశల్లోనూ స్త్రీ అణచివేతకు, పీడనకు, దోపిడీకి గురౌతూ... పురుషుని ప్రయోజనాలకు బలైపోతూ వస్తుందనే వాస్తవం మరోసారి వెలుగు చూసింది.

## 1. 8. స్త్రీవాదం - ఆవిర్భావ వికాసాలు:

మానవుడు తన కనీస అవసరాలు (కూడు, గూడు, గుడ్డ) తీరిన తరువాత క్రమక్రమంగా అభివృద్ధి చెందడానికి ప్రయత్నించి ఉండి ఉంటాడు. ఈ ప్రయత్నంలో తన అభివృద్ధికి అవరోధంగా నిలిచే వాటితో సంఘర్షించి, ఎన్నో ఉత్థానపతనాలు చవిచూసి, మరెన్నో అనుభవాలు సంపాదించుకొని అభివృద్ధి మార్గంలో పయనించి ఉంటాడు.

సమాజం దొంతర్ల నిర్మాణం కాబట్టి అందరూ సమాన స్థాయిలో అభివృద్ధి చెందక, వాళ్ల మధ్య వ్యత్యాసాలు, వైరుధ్యాలు ఎక్కువై అసంతృప్తులు మొదలై మరిన్ని ఘర్షణలు చోటుచేసుకొని ఉంటాయి. ఈ ఘర్షణల్లోంచే విభిన్న వాదాలు, విప్లవాలు పుట్టుకొస్తాయి

19, 20 శతాబ్దాలలో భారతీయ సమాజంలో అందులో భాగమైన దేశానికి సంబంధించిన తెలుగుభాషా, సాహిత్య సంస్కృతులలో వచ్చిన మార్పులు, చేర్పులు, భేదాలు కుడా ఇందుకు మినహాయింపేమీ కాదు.

ఆధునిక భావసంస్కారాలతో, సంఘసంస్కరణ ప్రభావాలతో ప్రేరేపితులైన వీరేశలింగం, రాజారామ్మోహన్ రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్... మొదలైన వారు స్త్రీల అభ్యున్నతికి ఎంతో పరితపించారు. స్త్రీ విద్యకు పెద్దపీఠ వేశారు. ఈ సంస్కరణలలో ప్రధానంగా సతీసహగమనాలను ఖండించారు. బాల్యవివాహాలను వ్యతిరేకించారు. వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించి స్త్రీ జనోద్ధరణకు పాటుపడ్డారు.

20వ శతాబ్దం ప్రారంభంలోనే గురజాడ స్త్రీ శక్తిని గురించి, 'ఆధునిక మహిళ చరిత్రను తిరగ రాస్తుంది' అన్నారు. ఈ మాటలు గమనించినట్లయితే... ఆ తర్వాత కాలంలో వెలువడిన స్త్రీ వాద సాహిత్యాన్ని గమనించినట్లయితే గురజాడ ముందుచూపు ఏమిటో అర్థమవుతుంది.

ప్రధానంగా సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమాలు, సంఘ సంస్కరణోద్యమాలు, జాతీయోద్యమ, స్వాతంత్ర్యోద్యమ, నవ్య, భావ, అభ్యుదయ కవితోద్యమాలు, భాషా సంబంధమైన వ్యవహారిక భాషోద్యమం... మొదలైనవన్నీ ఈ కాలంలో పుట్టుకురావడం యాదృచ్ఛికమేమికాదు.

మానవ జీవితాన్ని, మానవ సంబంధాల్ని, మానవ విలువల్ని, మానవులకి సంబంధించిన సమస్త అంశాలను అర్థంచేసుకోవడానికి ప్రధాన ఆధారంగా కనిపిస్తున్నది సాహిత్యం ఒక్కటే. తెలుగు సాహిత్యాన్ని స్థూలంగా పరిశీలించినట్లయితే వెయ్యేళ్ల ప్రాచీన తెలుగు సాహిత్యంలో ఇతిహాస, పురాణ, కావ్య, ప్రబంధ, నాటకాలలో స్త్రీని గొప్పగా కీర్తించినా, నిజానికి అన్ని అవమానాలు, అన్ని రకాలైన అణచివేతలు, పీడనలు, సమస్యలు స్త్రీయే ఎదుర్కొన్నట్లు తెలుస్తోంది స్త్రీకి స్వేచ్ఛా స్వాతంత్ర్యం, ఆస్తి హక్కు, పిల్లలపై హక్కు, సాంఘిక గౌరవం... ఇవన్నీ లేకుండానే ఇంతకాలం జీవించింది అని చెప్పడానికి ఎన్నో ఆధారాలున్నాయి.

## 1. 8.1. స్త్రీవాదం - నిర్వచనాలు:

ఆంగ్లంలో ఫెమినిజం అనే పదానికి తెలుగులో స్త్రీ వాదం, స్త్రీ విముక్తి ఉద్యమం, స్త్రీ విమోచనోద్యమం, స్త్రీ స్వేచ్ఛాఉద్యమం... ఇలా అనేక పదాలు వ్యవహారంలో ఉన్నాయి. ఎక్కువమంది సాహిత్యవేత్తలు 'స్త్రీవాదం' అనే పదాన్నే ఉపయోగించారు. ఈ పదమే జనబాహుళ్యంలో ఎక్కువ ప్రచారం పొందింది. ఇప్పుడు ఫెమినిజం అంటే స్త్రీవాదమనే గుర్తుకువస్తుంది

స్త్రీవాదాన్ని అనేకులు అనేకరకాలుగా నిర్వచించినప్పటికీ వాటిలో ముఖ్యమైన వాటిని పరిశీలిద్దాం!

"సమాజంలోను, కుటుంబంలోను, పనిలోను, స్త్రీలు గురవుతున్న అణచివేత, దోపిడికి సంబంధించిన అవగాహన కలిగివుండి ఈ పరిస్థితిని మార్చడానికి స్త్రీ పురుషులు కలసికట్టుగా చేసే చైతన్యవంతమైన కార్యక్రమమే ఫెమినిజం"[20] అని ఫెమినిస్ట్ స్టడీ సర్కిల్ వారు నిర్వచించారు. ఈ నిర్వచనాన్ని సౌత్ ఏషియన్ వర్క్‌షాపులో పాల్గొన్న భారత్, బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్తాన్ , శ్రీలంక దేశాల స్త్రీలు ఆమోదాన్ని తెలిపారు.

"సమాజంలోని అన్నిరంగాలలోను ఆడదానికి సమాన భాగస్వామ్యం ఉండాలనీ, ఆడవాళ్ల వ్యక్తిత్వం జీవితం కొందరి చెప్పుచేతల్లో తీర్చిదిద్దబడే పరిస్థితి మారాలనీ ముఖ్యంగా ఆడది తల్లిగా, భార్యగా మాత్రమే ముద్రవేయబడే ఒక లేబిల్ నుండి మనిషిగా గుర్తింపబడే స్థితికి రావాలని దానికోసం సాంస్కృతికంగానూ సాహిత్యపరంగానూ మర్రి ఊడల వలే విస్తరించి ఉన్న పురుషస్వామ్యపు భావజాలం పోవాలని సాగుతున్న ఉద్యమమే ఫెమినిజం"[21] అని స్త్రీవాదం సాహితీ సమాఖ్యవారు నిర్వచించారు.

ప్రముఖ భాషాశాస్త్రవేత్త చేకూరిరామారావు ఈ విధంగా నిర్వచించారు. "స్త్రీవాదం ఒక ప్రపంచ దృక్పథం. ఒక సామాజిక సిద్ధాంతం. ఒక పరిశోధనా పరికరం. ప్రపంచంలో భాగమైన సాహిత్యాన్ని అధ్యయనం చెయ్యడానికి అవసరమైన పనిముట్టు"[22].

ఇక ఫెమినిస్టు అంటే ఎవరు? అనే ప్రశ్నకు సమాధానంగా... సైమన్ ది బోవియర్ మాటల్లో చెప్పాలంటే...

"స్త్రీల పరిస్థితిలో మార్పుని, సమాజంలో మార్పుకి పూర్తిగా లోబడి వుండేలా కాకుండా, వర్గ పోరాటంలో కలిసి గాని, విడిగా గాని స్త్రీల పరిస్థితిని మార్చడానికి పోరాడే వారిని ఫెమినిస్టులు"[23] అంటారు.

ప్రొఫెసర్ ఆన్ లివ్ బ్యాంక్స్ అనే ఆంగ్లరచయిత్రి - స్త్రీల స్థితిని, వారిని గురించిన భావాలను మార్చడానికి ప్రయత్నించే వారినెవరినైనా ఫెమినిస్ట్ గానే గుర్తిస్తారు"[24] అని అన్నారు.

ప్రసిద్ధ వ్యక్తులు నిర్వచించిన నిర్వచనాలను బట్టి, ఫెమినిజాన్ని, ఫెమినిస్టులను ఈ కింది విధంగా చెప్పవచ్చు.

'తరతరాలుగా స్త్రీలు ఎదుర్కొంటున్నటువంటి అనేక రకాలైన సమస్యలు, అంటే... దోపిడి, పీడిన, అణిచివేత, అసమాన్వం తొలిగిపోయి, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో, స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం కావాలని కోరుకుంటూ వాటిని సాధించడానికి మొదలైన ఉద్యమాన్ని స్త్రీవాదం అని, ఈ

అంశాలను సాధించడం కోసం తమవంతు సహాయసహకారాలను అందించేవారిని' స్త్రీవాదులను చెప్పవచ్చు.

స్త్రీవాదం ఎప్పుడు ప్రారంభమైందో చెప్పడం కష్టంగాని స్త్రీవాద భావాలు, వాటికి సంబంధించిన మూలాలు ప్రాచీనకాలం నుండి సమాజంలో ఏదో ఒక రూపంలో ఉన్నాయని చెప్పవచ్చు. ప్రాచీనకాలం నుండి స్త్రీ వాదానికి మూలాలు ఉన్నాయని వివరిస్తూ వాటిని 'నిశ్శబ్ద విప్లవాలు'గా డాక్టర్ మృణాళిని అభివర్ణించారు.

ఎప్పటి నుంచి అయితే స్త్రీ అణచివేతకు, పీడనకు బలి అవుతూ వచ్చిందో అప్పటి నుంచి తనను తాను కాపాడుకోవడానికి ఏదో ఒక రకంగా పోరాడుతూనే ఉంది. అయితే ఆ పోరాటంలో స్త్రీ చాలా వరకూ వైఫల్యాలనే చవిచూస్తూ వచ్చింది దళిత అనే శబ్దాన్ని పీడితలు లేదా బాధితలు అనే అర్థంలో తీసుకుంటే స్త్రీ అనాదిగా పీడించబడుతూనే ఉంది గనుక మెదటి దళిత జాతి 'స్త్రీజాతి' అని చెప్పవచ్చు.

ఆధునిక కాలంలో స్త్రీవాద సాహిత్యం ఒక ప్రధాన స్రవంతిగా గుర్తించబడుతుంది అంతేకాక సాహిత్య రంగంలో స్త్రీ జాతికి ప్రతినిధిగా నిలబడుతుంది. దీన్నిబట్టి ఆధునిక సాహిత్యంలో "స్త్రీవాద సాహిత్యం" ఎంత ముఖ్యమైన పాత్ర పోషిస్తుందో మనం అర్థంచేసుకోవచ్చు. స్త్రీల అస్తిత్వ చిత్రణ కథల్ని వివరించే ముందు, అసలు స్త్రీవాద సాహిత్యం అంటే ఏమిటి ? దేన్ని స్త్రీవాద సాహిత్యం అని పిలుస్తారు? అనే అంశాల్ని వివరిస్తాను

### 1. 8. 2. స్త్రీవాద సాహిత్యం అంటే:

ఎవరైనా కాని, స్త్రీవాద సాహిత్యాన్ని చదివి, స్త్రీవాద భావాల్ని అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తారో వారు మొదటిగా 'స్త్రీల సాహిత్యం అంటే స్త్రీలు రాసిన సాహిత్యం కాదు. స్త్రీలు గురించి రాసిన సాహిత్యం' అన్న కాత్యాయని విద్మహే గారి మాటల్ని గుర్తుంచుకోవాలి లేదంటే మొత్తం స్త్రీవాదాన్ని తప్పుగా అర్థంచేసుకోవడం జరుగుతుంది. ఒక్క మాటలో చెప్పాలంటే స్త్రీల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ రాస్తే దానిని స్త్రీవాద సాహిత్యం అని చెప్పవచ్చు. అంటే పురుషాధిపత్య సమాజం స్త్రీలకు విధించిన అనేక రకాలైన బంధకాల నుండి విముక్తి పొంది, పురుషులతో సమానంగా హక్కుల్ని పొందాలని ఆశిస్తూ, ఆ దిశగా మార్గనిర్దేశం చేస్తూ రాసే సాహిత్యమే స్త్రీవాద సాహిత్యమని నిర్వచించవచ్చు. ఈ సందర్భంలో మరొక ప్రశ్న తలెత్తవచ్చు పురుషులు రాసిన సాహిత్యాన్ని స్త్రీవాద సాహిత్యంగా పరిగణించాలా అని?! అయితే ఈ విషయంలో చాలా తర్జన, భర్జన జరిగి చివరికి స్త్రీవాద దృక్పథంతో పురుషులు రాసిన దాన్ని కూడా స్త్రీవాద సాహిత్యంగా పరిగణించవచ్చని అనేకులు పేర్కొన్నారు.

వర్జీనియా వుల్ఫ్ వివరించిన ఈ విధమైన స్త్రీ పరిస్థితికి కారణం పితృస్వామ్య వ్యవస్థ అని వేరే ప్రత్యేకంగా చెప్పనవసరంలేదు. స్త్రీ ఏవిధంగా పితృస్వామ్య భావజాలంలో కూరుకుపోయిందో గ్రహించి, దాని నుండి విముక్తి పొందడానికి ఆలోచించి, సాహిత్యంలో ఉన్న స్త్రీ గురించి రాయబడ్డ సాంప్రదాయకమైన వ్యక్తీకరణ కంటే భిన్నమైన అభివ్యక్తికి స్త్రీవాదోద్యమం దారితీసింది.

### 1. 8. 3. పాశ్చాత్య దేశాల్లో స్త్రీవాద ఆవిర్భావం:

సాహిత్యం ఆధారంగా 1792లో స్త్రీల హక్కుల గురించి మొట్టమొదటి సారిగా 'ఇండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ వుమెన్' అనే గ్రంథం రాసిన ఇంగ్లాండ్ రచయిత్రి మేరీ వోల్డ్ స్టోన్ క్రాఫ్ట్ అనే ఫెమినిస్ట్ ఆలోచనా ధోరణికి రూపకల్పన చేసిందని చెప్పవచ్చు.

పాశ్చాత్య దేశాల్లో స్త్రీవాద ఉద్యమం 'రాజకీయ ఉద్యమం'గా మొదలయ్యింది. 1792లో మేరీ... స్త్రీల హక్కుల గురించి రాసిన తరువాత, అంటే 1848లో అమెరికాలోని న్యూయార్క్ లో వందమంది మహిళలు 'మహిళాహక్కుల సమావేశాన్ని' నిర్వహించారు. సమాజంలో ఉన్న ద్వంద్వ విలువలు పోయి, పురుషులతో పాటు స్త్రీలకు సమానంగా హక్కులు కావాలనీ డిమాండు చేసారు. 1855లో బ్రిటిష్ ఫెమినిస్టులు తొలిసారిగా సమావేశమై, ఆస్తిహక్కు కావాలని డిమాండు చేసారు. తద్వారా 1948 నాటికి చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు చట్టబద్ధమైంది. 19వ శతాబ్దంలో పాశ్చాత్య దేశాల్లో వెలువడిన సాహిత్యం కూడా స్త్రీవాదానికి అనుకూలంగానే వచ్చింది. వీటిలో ముఖ్యంగా 1860లో ఛెర్నిచెవ్ స్కి రాసిన 'What is to be done' అనే పుస్తకం 1979లో అగస్ట్ బెబెల్ ప్రచురించిన 'Women Socialism' (స్త్రీ సోషలిజం) అనే పుస్తకం ఇబ్సెన్ రాసిన 'Dalls house' చెప్పుకోదగ్గవి.

1960 నాటికి ఫెమినిజం మలిదశకు చేరింది. యువతులు, స్త్రీ తాము వివక్షకు గురవుతున్నట్లు గుర్తించారు అన్ని నిర్ణయాలు పురుషులే తీసికోవడాన్ని వ్యతిరేకిస్తూ వచ్చారు. ఓటు హక్కుతో అన్ని సమస్యలూ తీరవని మహిళాసమాజం అర్థంచేసుకుంది. 1975వ సంవత్సరాన్ని 'అంతర్జాతీయ మహిళా సంవత్సరం'గా ప్రకటించబడడం స్త్రీవాద భావాలు వేళ్లూనుకోవడానికి బలంగా తోడ్పడింది. ఐక్యరాజ్య సమితి చేపట్టిన మహిళా దశాబ్ది కార్యక్రమాలు స్త్రీ వాదం బలం పుంజుకోవడానికి దోహదపడ్డాయి.

### 1. 8. 4. ఆంధ్రదేశంలో స్త్రీవాద ఆవిర్భావం:

ఆంధ్రదేశంలో స్త్రీవాదం ఆరంభమై, ఒక ఉద్యమంగా కొనసాగడానికి ఆంధ్రదేశ సామాజిక పరిస్థితులే అధికంగా దోహదపడ్డాయి. ఎందుకంటే ఆంధ్రదేశంలో స్త్రీలు తరతరాలుగా అనేక కట్టుబాట్లకు అర్థంపర్థంలేని ఆచారవ్యవహారాలకు బలైపోయారు. వీటినుండి విముక్తి పొందడం అంత సులువైన

పనికాదు. ఆనాటి స్త్రీ జీవితాన్ని అర్థంచేసుకోవడానికి కందుకూరి వీరేశలింగం నవలలు ఎంతగానో ఉపయోగపడతాయి.

సంఘసంస్కరణోద్యమాల కాలం నాటి స్త్రీ ఉద్యమాలకు, స్త్రీవాద ఉద్యమానికి మౌలికమైన తేడా ఉంది. సంఘసంస్కరణోద్యమాలు స్త్రీల కోసం పురుషులు నిర్వహించిన ఉద్యమాలు. స్త్రీవాదోద్యమం స్త్రీల కోసం స్త్రీలే నిర్వహించే ఉద్యమం. ఆంధ్రదేశంలో 1973లో 'ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్ ఫర్ ఉమెన్' సంస్థ ఏర్పడడంతో స్త్రీవాద ఉద్యమానికి తొలి బీజాలు పడ్డాయి. ఎమర్జెన్సీ తరువాత, అంటే... 1977లో ఏర్పడిన స్త్రీ శక్తి సంఘటన, ఆ తరువాత పదేళ్లకు ఏర్పడ్డ ఫెమినిస్టు స్టడీ సర్కిల్ 'వ్యక్తిగతమంతా రాజకీయమే' అనే స్త్రీవాద దృక్పథానికి ప్రచారం కల్పించడానికి, పునరుత్పత్తి హక్కుల చైతన్యం కలిగించడానికి విశేషంగా కృషిచేసాయి.

వివిధ ప్రాంతాల్లో చిన్న చిన్న గ్రూపులు ఏర్పడ్డాయి. ఇవి స్త్రీ సమస్యల మీద అవగాహన పెంచడానికి, వరకట్న సమస్యకు, కుటుంబ హింసకు వ్యతిరేకంగా స్త్రీల ఉద్యమాలు నిర్మించడానికి కృషిచేసాయి. ఈ గ్రూపులన్నీ సామాజిక విముక్తితోనే స్త్రీ విముక్తి ముడిపడి ఉందన్న సత్యాన్ని గ్రహించడం వల్ల వీరు సామాజికపరమైన కార్యక్రమాలే ఎక్కువగా నిర్వహించారు. అందుకే ఈ గ్రూపులన్నీ 1995 సెప్టెంబర్ లో 'ఆంధ్రప్రదేశ్ చైతన్య మహిళా సమాఖ్య'గా ఐక్యమయ్యాయి.

పైన పేర్కొన్న వివిధ సంస్థలతో పాటు కొన్ని పత్రికలు కూడా స్త్రీవాద ఉద్యమ వికాసానికి తోడ్పడ్డాయి. వాటిలో ఆంధ్రజ్యోతి దినపత్రిక, మహిళామార్గం, మాతృక, భూమిక మొదలైనవి ముఖ్యంగా చెప్పుకోదగ్గవి.

పాశ్చాత్యదేశాల్లో స్త్రీవాదం సఫలీకృతం అయినంతగా ఆంధ్రదేశంలో సఫలం కాలేదనే చెప్పాలి. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా:

1. ఆంధ్రదేశంలో స్త్రీవాద ఉద్యమానికి మేధావుల మద్దతు కాని పత్రికల మద్దతు కాని పెద్దగా లభించకపోవడం.
2. స్త్రీవాద రచయిత్రుల్లో ఎక్కువ భాగం ఉన్నత, మధ్యతరగతికి చెందిన స్త్రీలే ఉండడం వలన ఇది అగ్రవర్ణ హిందూ నగర స్త్రీల ఉద్యమం అనే అపనింద ఏర్పడటం.
3. స్త్రీవాదులు ప్రధానంగా జెండర్ నే ముఖ్య సమస్యగా గుర్తించడం
4. ఆంధ్రదేశంలో ఎక్కువ శాతం మహిళలు మూఢ విశ్వాసాలను, సాంప్రదాయాలను కలిగి ఉండడం.

స్త్రీవాదంలో వచ్చిన విభిన్న ధోరణుల్ని గమనిస్తే స్త్రీవాద వికాసం అవగతమవుతుంది.

## 1. 9. స్త్రీవాదంలోని ప్రధాన ధోరణులు:

### 1. 9. 1. ఉదారవాద స్త్రీవాదం:

ఈ వాదాన్నే ఆంగ్లంలో Liberal Feminism అంటారు. వ్యవస్థ పూర్తిగా మారకుండానే, స్త్రీలకి సమానహక్కులు, అధికారాలు, ప్రయోజనాలు, వేతనాలు లభించేటట్లు చూడ్డం లిబరల్ ఫెమినిజం. జీవితానికి సంబంధించిన అన్ని రంగాల్లో (సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలు) స్త్రీ పురుషుల మధ్య సమానత్వాన్ని పాటించడం దీని ముఖ్య ఉద్దేశం.

స్త్రీల అణచివేతకు ప్రధాన కారణం వారి శారీరక నిర్మాణమేనని ఉదారవాద స్త్రీ వాదులు భావిస్తా రు ఈ వాదం వెలువడ్డానికి బెట్టీ ఫ్రీడన్ రాసిన "ఫెమనైన్ మిస్టిక్" ఎంతగానో తోడ్పడింది.

### 1. 9. 2. రాజకీయ స్త్రీవాదం:

రాడికల్ ఫెమినిస్టులు ప్రధానంగా పురుషాధిక్య సమాజాన్ని వ్యతిరేకిస్తా రు పితృస్వామిక సమాజమే స్త్రీపైన అసహజమైన పరిమితుల్ని విధించిందని వీరి అభిప్రాయం. పురుషుని శారీరక బలాధిక్యత, సంతానోత్పత్తి విషయంలో స్త్రీ పాత్ర- ఈ రెండు విషయాలు స్త్రీని పురుషులతో సమానస్థితికి దూరం చేశాయని వీరి విశ్వాసం. స్త్రీ పురుషుల మధ్య వర్గ విభజన, రాజకీయ విభజన ఉన్నాయని వీరివాదం. స్త్రీల విప్లవం రావాలని వీరి ఆకాంక్ష. జెండర్ అనే భావనను, లైంగికతను, పునరుత్పత్తిని రాజకీయ సమస్యలుగా వీరు ముందుకు తెచ్చారు. అంతేకాక 'వ్యక్తిగతమంతా రాజకీయమే' (personal is political) అనే వీరి భావన విడివిడిగా ఉన్న స్త్రీ అనుభవాలను మొత్తం స్త్రీ పురుషుల మధ్య సాగే ఆధిపత్య రాజకీయాలలో భాగంగా చూడడానికి తోడ్పడింది.

రాడికల్ ఫెమినిస్టుల కంటే మరో అడుగు ముందుకెళ్లి పురుషాధిపత్యాన్ని తీవ్రంగా నిరసించిన వారున్నారు. వారు పురుషుల నుండి విడిపోవాలనే వేర్పాటువాదులు (separatists), స్వలింగ సంపర్కవాదులు (Lesbianists), స్త్రీలు, పురుషుల కంటే ఉన్నతులని, పురుషులతో సమానత్వం అనేది అర్థంపర్థంలేని భావనని... ఇలా రకరకలుగా తీవ్రమైన అభిప్రాయాలు కలిగినవారున్నారు. అందుకే రాడికల్ స్త్రీ వాదం మిగిలిన వాటికంటే భిన్నమైదిగా కనిపిస్తు ంది

### 1. 9. 3. మార్క్సిస్టు స్త్రీ వాదం:

ఈ సిద్ధాంతానికి మార్క్స్, ఎంగెల్సులను మూలపురుషులుగా చెప్పుకుంటారు. స్త్రీ పురుషుల మధ్య శారీరక విభేదాలుస్త్రీ పురుషుల పనివిభజనకు దారితీశాయని, స్త్రీ సమస్య ఒక రాజకీయ సమస్యని ఈ వాదం నమ్ముతుంది.

మార్క్సిస్టు స్త్రీ వాదుల దృష్టిలో స్త్రీ సమస్య ఒక చారిత్రక, సాంస్కృతిక, ఆర్థిక, వర్గ భేదాలతో స్త్రీ పరిస్థితి ముడిపడి ఉందని, సమాజంలో వర్గదోపిడి పోయినప్పుడే, జాతుల మధ్య అంతరాలు నశించినప్పుడే స్త్రీ విముక్తికి మార్గం ఏర్పడుతుందని వీరి అభిప్రాయం.

### 1. 9. 4. సోషలిస్టు స్త్రీ వాదం:

సోషలిస్టు స్త్రీ వాదులు స్త్రీల సమస్యల్ని ఏవో చట్టాలు, సంస్కరణలు చేస్తే తొలగిపోయే పైపై సమస్యలుగా కాకుండా చాలా లోతుగా సమాజపు పునాదుల్లో పాతుకుపోయిన వాటిగా గుర్తిస్తారు సమాజ రాజకీయార్థిక వ్యవస్థలో సంతానోత్పత్తి, లైంగికత్వం అనే వాటిని ముఖ్యమైన విషయాలు కూడా ఆర్థిక విషయాలే అని సోషలిస్టు ఫెమినిస్టులు గుర్తిస్తారు వీటిని కూడా రాజకీయ అర్థశాస్త్రంలో భాగంగా పరిగణిస్తారు ఆర్థికం అనే దానిలో సంతానోత్పత్తి, లైంగికత్వం కూడా కలిసి ఉంటాయి. కాబట్టి మొత్తం పునాదినే మార్చాలంటారు.

జయప్రభ గారు ఈ సిద్ధాంతం గురించి ఈ విధంగా వివరించారు. "వ్యవస్థలో మార్పు రాకుండా కేవలం హక్కులూ అధికారాలూ సంపాదించుకోవడం వల్ల స్త్రీల స్థితిలో మార్పురాదనీ, పెట్టుబడిదారీ ఆర్థిక విధానాన్ని అంతమొందించి, వర్గరహిత సమాజాన్ని స్థాపించడం ద్వారా మాత్రమే స్త్రీ కూడా విముక్తి కాగలదని నమ్మేవాళ్లు సోషలిస్టు ఫెమిస్టులు. తాత్వికంగా సోషలిస్టు ఫెమినిజం మార్క్సిజానికి పూరకంగా పనిచేస్తుంది పూరకం అని ఎందుకంటున్నానంటే మార్క్సిజం స్త్రీల సంతానోత్పత్తినీ లైంగిక దోపిడినీ ప్రత్యేకంగా చూడాలన్న విషయాన్ని గుర్తించదు ఇలా గుర్తించకపోవడం వల్ల మార్క్సిజం అమల్లో ఉన్న దేశాల్లో సైతం ఆడవాళ్లు ఇంకా సమానులు కాలేదు. సోషలిస్టు ఫెమినిజం ఈ మేరకు స్త్రీ విముక్తి ఉద్యమం ప్రత్యేకంగా రావాలంటుంది"[25] అని సోషలిస్టు ఫెమినిజాన్ని గురించి తెలిపారు.

### 1. 9. 5. సాంస్కృతిక స్త్రీవాదం:

దీన్నే ఆంగ్లంలో 'cultural Feminism' అంటారు. ఈ సిద్ధాంతం రాడికల్ ఫెమినిజానికి చాలా దగ్గరగా ఉంటుంది. కాకపోతే కొద్ది తేడాలున్నాయి. ఈ సిద్ధాంతం మహిళా సంస్కృతిని

శ్లాఘిస్తుంది స్త్రీ సృజనాత్మక శక్తిని సంతానోత్పాదనలో ఆమె సామర్థ్యాన్ని చూచి పురుషుడు ఈర్ష్యపడతాడని వీరి అభిప్రాయం. 'విప్లవ స్త్రీ విమోచన సిద్ధాంతాన్ని' ఇది ప్రతిపాదిస్తుంది సంతానోత్పాదనలో స్త్రీ పాత్రను పురుషుడు మానసికంగా గ్రహించే విధానంపై ఆమె అణగారినతనం ప్రత్యక్షంగా కాని పరోక్షంగా కానీ ఆధారపడుతుందని వీరి భావం. ఈ అంశం మీద రాడికల్ ఫెమినిస్టులకూ, సాంస్కృతిక ఫెమినిస్టులకు ఏకీ భావమే. స్త్రీ విమోచనకు ప్రధాన శత్రువు పురుషుడేనని వీరి నిర్ణయం.

రాడికల్ ఫెమినిస్టు అయిన 'ఫైర్ స్టోన్' పురుషులతో సంపర్కం లేకుండా కృత్రిమ గర్భధారణకు పూనుకోవలసిందని స్త్రీలకు విజ్ఞప్తి చేస్తున్నారు సాంస్కృతిక ఫెమినిస్టు అయిన రిచ్ అనే ఆమె సంతానోత్పాదన గురించి గర్వపడవలసిందని స్త్రీలకు ఉద్బోధిస్తున్నారు.

ఈ రెండు శాఖల వారు శారీరక మౌలిక సిద్ధాంతాన్ని ఆమోదిస్తున్నారు అంటే స్త్రీకి వుండే సృజనాత్మక శక్తిని చూచి పురుషజాతి అసూయచెంది, వారిని అణచివేయ పూనుకున్నారని ఈ వాదన ముఖ్యాంశం. ఈ వాదనను అంగీకరించే వారు పురుషనైజాన్ని ద్వేషిస్తారు పురుషజాతిని పురుష దురహంకార సూకరాలు (Male chauvinist pigs) అని మెక్సికో ప్రపంచ మహిళాసభలో పేర్కొనడం జరిగింది.

## 1. 9. 6. మానవవాద స్త్రీవాదం:

ఈ వాదాన్ని ఆంగ్లంలో 'Humanist Feminism' అంటున్నారు. పైన వివరించిన వివిధ స్త్రీవాద దృక్పథాలలోని లోపాలను సవరించి, వాటన్నింటిలోని సారవంతమైన విషయాలతో మల్లాది సుబ్బమ్మగారు స్త్రీ విముక్తి నూతన సిద్ధాంతం ప్రతిపాదించారు. అదే ఈ మానవవాద స్త్రీ వాదం. ఈ కొత్త సిద్ధాంతాన్ని ఈ కింది విధంగా పరిచయం చేశారు.

ఈ సిద్ధాంతం వాస్తవికతపై ఆధారపడి సమగ్ర పరిశీలన వల్ల పుట్టి, సమ్యక్ దృక్పథంతో భాసిల్లుతుంది. సంతానోత్పాదన విషయంలో స్త్రీ శక్తి సామర్థ్యాలను గుర్తిస్తుంది దానిని ఆమె బలహీనతగా గుర్తించదు కుటుంబ పెరుగుదలకు, సామాజిక శాశ్వతత్వానికి ఆమె చేసే అపూర్వ సేవగా లెక్కలోకి తీసుకుంటుంది. కనుక ఆమెను అభినందిస్తుంది గర్భధారణ సమయంలో, ఆమెకు అండగా నిలబడాలని పురుషునికి ఉద్బోధిస్తుంది ఇంటిపని, పిల్లల పెంపకం ఆమెకు మాత్రమే కేటాయించడం అక్రమమని వాదిస్తుంది స్త్రీ పురుషుల మేధాసంపత్తిలో తేడాలు, వ్యత్యాసాలు లేవని, స్త్రీ పురుషునితో సమఢీటుగా వ్యవహరించగలదని చెప్తుంది

ఈ సిద్ధాంతాన్ని సమర్థించే వారు రాడికల్ ఫెమినిస్టుల వలే పురుషద్వేషానికి వారసులు కాదు. అయితే పురుషాధిపత్యాన్ని ఎదిరిస్తారు పురుషాధిపత్యాన్ని దుయ్యబడతారు. ఉదారవాద స్త్రీ విమోచనోద్యమకారులవలె పెట్టుబడి దారి వ్యవస్థను సమర్థించి ఊరుకోరు. మార్క్సిస్టు ఫెమినిస్టుల వలే స్త్రీ విమోచనోద్యమాన్ని ఆర్థిక పోరాటాలను సామాన్య పోరాటాలకు బలిచెయ్యరు. సోషలిస్టు స్త్రీ విమోచన సిద్ధాంతాన్ని బలపరిచే వారి వలె అధికార కేంద్రీకరణకు తావు ఇచ్చే సోషలిస్టు వ్యవస్థకు స్త్రీ విమోచనోద్యమాన్ని అంటకట్టారు. అంటే పురుషాధిపత్యంపై జరిపే పోరాటం, సామాజిక వ్యవస్థ మార్పుకై సాగే ఆందోళన ఏకకాలంలో జరుపుతారు. మార్క్స్, ఫ్రాయిడ్, ఎం.ఎన్.రామ్... లాంటి మేధావుల సిద్ధాంతాలలో వాస్తవాంశాలను మాత్రం స్వీకరించి జీవితానుభవంతో ముందుకు సాగిపోతారు.

సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, కౌటుంబిక రంగాలన్నిటా స్త్రీ విమోచనకు అమరికలు లేకుండా కృషిచేయడం మన కర్తవ్యం అని మానవవాద స్త్రీవాదం ప్రతిపాదిస్తుంది ఈ విధంగా స్త్రీ వాదంలో కొన్ని ధోరణులు పుట్టుకొచ్చాయి. వీటితో పాటు మెటీరియలిస్టిక్ ఫెమినిజం, ఎకో ఫెమినిజం వంటివి కూడా వచ్చాయి. కాని ముఖ్యమైన ధోరణులను మాత్రమే వివరించడం జరిగింది. ఈ ధోరణులన్నీ స్త్రీవాద వికాసంలో భాగంగానే చెప్పవచ్చు. ఎందుకంటే ఆయా ధోరణుల్లో చర్చించిన అనేక అంశాలు స్త్రీ వాద పరిధిని విస్తృతపరచడానికి దోహదం చేస్తాయి

## 1. 10. స్త్రీవాదం లేవనెత్తిన అంశాలు:

స్త్రీవాదం అనేక అంశాలు లేవనెత్తినప్పటికీ సిద్ధాంతగ్రంథ పరిమిత దృష్ట్యా ప్రధానంగా పితృస్వామ్యం, జెండర్, మాతృత్వం, లైంగికస్వేచ్ఛ, భాష అనే అంశాలను పరిశీలిద్దాం!

### 1. 10. 1. పితృస్వామ్యం:

ఆదికాలంలో పితృస్వామ్యం స్థానంలో మాతృస్వామిక వ్యవస్థ ఉండేదని చరిత్ర చెబుతుంది. పితృస్వామిక కుటుంబం గురించి ఓల్గా చెప్తూ "కుటుంబంలో పురుషుడు సర్వాధికారాలు కలిగివుండి స్త్రీలపై, పిల్లలపై పెత్తనం చేస్తున్నప్పుడు ఆ కుటుంబంలోని సభ్యులు, కుటుంబ పెద్దయిన పురుషుడు ద్వారా గుర్తింపబడుతున్నప్పుడు దానిని పితృస్వామిక కుటుంబం"[26] అని అంటారు.

'స్త్రీల శ్రమను, లైంగికత్వాన్ని, సంతానోత్పత్తిని భౌతికంగానూ, భావజాలంలోనూ పురుషులు కంట్రోలు చేసే ఒక పద్ధతి పితృస్వామ్యం'గా వసంతాకన్నాభిరామ్ అభివర్ణించారు.

పితృస్వామ్య భావజాలాన్ని స్త్రీవాదులు వ్యతిరేకిస్తున్నారు స్త్రీవాదులు పితృస్వామ్యద్వేషులు గాని పురుషద్వేషులు కాదు అనే వాస్తవాన్ని ఈ సందర్భంలో గమనించాలి.

## 1. 10. 2. జెండర్:

స్త్రీవాదం చర్చించిన అంశాల్లో చెప్పుకోదగ్గ ముఖ్యాంశం జెండర్. పురుషుల నుంచి స్త్రీలను వేరుచేసే లక్షణాలూ పాత్రలూ ప్రవర్తనాతీరులను జండర్ అని నిర్వచించవచ్చు. ఈ లక్షణాలు, పాత్రలు, ప్రవర్తనారీతులూ పుట్టుకతో వచ్చిన శరీరం వల్ల కాకుండా సామాజిక సాంస్కృతిక సందర్భాల ఆధారంగా నిర్ణయించబడతాయి. జెండర్ గురించి వివరించే సందర్భంలో సెక్స్ కి, జండర్ కి మధ్య ఉన్న వ్యత్యాసాన్నితెలుసుకుందాం. సెక్స్ అనేది ప్రకృతి సిద్ధమైంది. అంటే ప్రకృతిచేత ఏర్పడింది. జీవసంబంధమైంది. శరీర నిర్మాణానికి, జననాంగాల్లో తేడాకు సంబంధించిది. ఇది శాశ్వతమైనది.

జెండర్ అనేది సమాజం వల్ల ఏర్పడిన భావన గనుక జెండర్ లక్షణాలను సమాజం నిర్ణయిస్తు ంది ఈ లక్షణాలు ఆయా సమాజాలు, అందులోని సంస్కృతి ఇష్టాయిష్టాలను బట్టి రూపుదిద్దుకుంటాయి. వ్యక్తు లు పెరిగేకొద్దీ అవి వారిలో జీర్ణించుకుపోతాయి. సమాజం, సంస్కృతి ఈ లక్షణాలను స్త్రీ పురుషులకు అలవరుస్తు ంది నిబంధనలనూ షరతులనూ విధిస్తు ంది ఇవి సాంస్కృతికమైన భావనలు కావచ్చు, ఆచారవ్యవహారాలు కావచ్చు.

స్త్రీలు, పురుషులు ప్రకృతి సహజంగా భిన్న శారీరక ధర్మాలను కలిగివున్నా, స్త్రీత్వం, పురుషత్వం అనేవి జెండర్ విధానం వల్ల ఏర్పడినవి. పిల్లలు పుట్టినప్పుడు భిన్న శారీరక నిర్మాణాలు కలిగి ఆడపిల్లలుగా, మగపిల్లలుగా వుంటారు. వాళ్లు పెరుగుతున్న కొద్దీ... స్త్రీత్వ, పురుషత్వ లక్షణాలు వారికి ఆపాదించబడతాయి. ఆ లక్షణాలతో వాళ్లు స్త్రీలుగాను, పురషులుగానూ తయారు చెయ్యబడతారు.

పిల్లల్ని కనడం, పాలివ్వడం అనేవి స్త్రీకి శారీరకంగా ఉన్న శక్తు లు ఇవి సహజమైనవి. తల్లి ప్రేమ, సుకుమారత్వం, దయ, త్యాగం మొదలైన లక్షణాలను స్త్రీలు కలిగి ఉండాలనేది జెండర్ విధానం. ఏ సందర్భంలోనైనా స్త్రీలు కొంచెం కఠినంగా వ్యవహారిస్తే 'నువ్వసలు ఆడదానివేనా?' అని ప్రశ్నించడం జరుగుతుంది. ఇది ప్రశ్న కాదు గాని ఒక దూషణకరమైన మాట అని చెప్పవచ్చు. ఇది ఏర్పడడానికి వెనుక ఉన్న కారణం జెండర్ భావజాలమే. అదే విధంగా స్త్రీలు పుట్టినప్పటి నుండి దుస్తు లు ఆటలు, వారి పనులు, ఆహారం స్త్రీలకు ప్రత్యేకంగా నిర్ణయించబడతాయి. త్యాగం, వినయం, సహనం అనేవి స్త్రీ సహజ లక్షణాలు అనే భావంతో వారిపై జరిగే అణచివేతను స్త్రీ వాదులు గుర్తు ంచి ఈ జెండర్ విధానాన్ని ప్రశ్నిస్తు న్నారు

వీటన్నింటినీ సమాజం, సంస్కృతి నిర్ణయించి... స్త్రీలను, పురుషులనూ నిర్వచిస్తుంది సమాజంలో వారు నిర్వహించాల్సిన పాత్రను నిర్ణయిస్తుంది జెండర్ అనే భావన స్త్రీ ఇంటిపని, పిల్లలపెంపకం, కుటుంబాన్ని చక్కదిద్దుకోవడం, కుటుంబాన్ని పోషించడం, కుటుంబానికి సంబంధించిన పని చెయ్యాలని, బయట పనులు చెయ్యడం పురుషుని లక్షణాలుగా చెబుతుంది. ఈ సందర్భంలో సైమన్ ది బేవియర్ మాటలు గమనించదగ్గవి.

'One is not born, but rather becomes a women' అంటే పుట్టుకతోనే ఎవరూ ఆడవాళ్లు కారు, పుట్టిన తరువాత ఆడవాళ్లుగా తయారవుతారు. జయప్రభ రాసిన పైటను తగలెయాలి అనే కవితలో

"నువ్వు ఆడదానివంటూ
హిప్నటైస్ చేస్తుంది
నేనూ మనిషినన్న భావన
నాచేత మరిపిస్తుంది"[27] - అని అనడం జెండర్ స్పృహతోనే.

## 1. 10. 3. మాతృత్వం:

మాతృత్వం స్త్రీకి ఒక గొప్ప వరమని, మాతృత్వం ద్వారానే ఒక స్త్రీ పరిపూర్ణత చెందుతుందని అతి ప్రాచీనకాలం నుండి చెప్పబడుతోంది. మాతృత్వం ద్వారానే స్త్రీ జన్మకి సార్థకత ఏర్పడుతుందని భావించే ఈ సమాజం మాతృత్వం పొందని స్త్రీని గొడ్రాలని, వంజె అని, దూషిస్తుంది గాని, అది ఆమెకు ఒక పునర్జన్మ అని గుర్తించడంలేదు

ప్రాచీన కాలంలో మాతృత్వం అంటే పిల్లల్ని కనడం మాత్రమేనని భావించేవారు. కాని ఆధునిక కాలంలో మాతృత్వం అంటే భౌతికంగా బిడ్డకు జన్మనివ్వడం మాత్రమేకాదు, పిల్లల పోషణ, పిల్లలపెంపకం, విద్యాశిక్షణ మొదలైనవన్నీ కూడా మాతృత్వంగా గుర్తించబడుతున్నాయి ఇలాంటి మాతృత్వాన్ని స్త్రీ పురుషులిద్దరూ సమానంగా పంచుకోవాలని నేటి స్త్రీవాదులు డిమాండ్ చేస్తున్నారు స్త్రీని పిల్లల్నికనే ఒక యంత్రంగా భావించి భర్త లేదా అత్తింటివారు ఆమె ఆరోగ్యం గురించి గాని, ఆమె మనసు గురించి గాని పట్టించుకోకుండా, తాము పిల్లల్ని కనమని ఆజ్ఞ జారీచేసినప్పుడు 'తప్పనిసరిగా పిల్లల్ని కనాలి' అనే సంప్రదాయాన్ని స్త్రీ వాదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు అంతేకాక ప్రతి స్త్రీ తనకు పిల్లలు, ఎప్పుడు కావాలో, ఎప్పుడు వద్దో, ఎంతమంది పిల్లల్ని కనాలి మొదలైన విషయాలలో స్వతంత్రంగా నిర్ణయం తీసుకునే హక్కు కలిగి ఉండాలని స్త్రీ వాదులు డిమాండ్ చేస్తున్నారు

## 1. 10. 4. హింస:

తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడం కోసం ఇతరులపై సాగించే దౌర్జన్యం లేదా అణచివేతనే హింస అంటారు. హింస అనేది అణచివేతకు సాధనం అని చెప్పవచ్చు. మన రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 17% చొప్పున స్త్రీలపై హింస పెరుగుతోంది. రాష్ట్రంలోనో లేక మన దేశంలోనో కాకుండా ప్రపంచవ్యాప్తంగా కూడా ఇంటా బయట స్త్రీలపై హింస పెరిగిపోతోంది. అందుకే ఐక్యరాజ్య సమతి స్త్రీలపై సాగుతున్న హింసను మానవహక్కుల సమస్యగా గుర్తించింది

సమాజంలో ప్రతిదినం పెరుగుతున్న నేరపూరిత రాజకీయాలు, విశృంఖలమైన స్వేచ్ఛ, వ్యాపారం కోసం ప్రసార సాధనాలు అవలంభిస్తు న్న మార్గాలు, పాశ్చాత్య నాగరికతల ప్రభావం... ఇలా ఎన్నింటినో స్త్రీలపై జరుగుతున్న హింసకు కారణాలుగా చూపవచ్చు.

హింసను రెండు రకాలుగా చెప్పవచ్చు.

**1. కుటుంబ హింస:** ఎ. శారీరక హింస, బి. లైంగిక హింస.

**2. సామాజిక హింస:**

## 1. 10. 4. 1. కుటుంబ హింస:

భారతీయ సంప్రదాయం ప్రకారం వివాహవ్యవస్థలో స్త్రీకి గౌరవం భద్రత ఉన్నాయని అనేకులు విశ్వసిస్తు న్నారు కాని పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉంది. 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ సర్వే ప్రకారం హత్యకు గురయ్యే స్త్రీలలో నూటికి డెబ్బై (70%) మంది భర్తచేతుల్లోనే చనిపోతున్నారని స్పష్టమైంది. ప్రభుత్వ లెక్కలు ప్రస్తు త వివాహ వ్యవస్థలో ఉన్న పురుషాధిపత్యాన్ని, స్త్రీల నిస్సహాయతని తెలియచేస్తు న్నాయి మన రాష్ట్రంలో మొత్తం స్త్రీలపై జరిగే నేరాల సంఖ్య 14, 970. వాటిలో 557 వరకట్న హత్యలు, 921 ఆత్మహత్యలు, 6, 433 వేధింపులు, ఇవికాకుండా లెక్కల్లో చేరనవి ఇంకెన్నో. భార్యని కొట్టడం, తిట్టడం, శీలాన్ని శంకించడం, ఇంటినుండి గెంటివేయడం మొదలైనవన్నీ కుటుంబహింసగానే చెప్పవచ్చు[28].

కుటుంబహింసలో శారీరక హింస, లైంగికహింస భాగంగానే చెప్పుకోవాలి.

## 1. 10. 4. 1. 1. శారీరకహింస:

పితృస్వామ్యసమాజం స్త్రీలకు ఎలాంటి హక్కులూ లేకుండా చేసింది. స్త్రీలు పుట్టింది మొదలు చనిపోయేదాక హింస ఉంటూనే ఉంటుంది. బాల్యం నుంచే అది చెయ్యకూడదు, ఇది చెయ్యకూడదు, అక్కడికి వెళ్లకూడదు, ఇక్కడికి వెళ్లకూడదు, ఇలా నడవకూడదు, అలా నడవకూడదు అంటూ... అనేక

రకాలైన నియమ, నిబంధనలతో అణచివేస్తా రు ఇదంతా పుట్టింట్లో జరిగే అణచివేత అనడం కంటే పుట్టింట్లో జరిగే హింస అంటేనే ఈ సందర్భానికి సరిపోతుంది. ఇక అత్తింటికి వెళ్లాక అసలైన హింస మొదలౌతుంది. కోడలిగా, అత్త ఇంట్లో అడుగు పెట్టిందగ్గరనుంచి, ఆమెకు ఆరోగ్యం ఉన్నా లేకపోయినా అందరి కంటే ముందుగా నిద్రలేచి అందరకీ అన్నీ సమకూర్చాలి. లేదంటే అత్త లేదా భర్త చేతిలో చీవాట్లు, దెబ్బలు ఆ తర్వాత హత్యలు, ఆత్మహత్యలు... స్త్రీల హత్యల విషయంలో నూటికి డెబ్భైశాతం మంది భర్తలచేత చంపబడటం అనే నగ్నసత్యాన్నిబట్టి స్త్రీలు ఏ మేరకు శారీరక శ్రమకు గురౌతున్నారో మనం అర్థంచేసుకోవచ్చు[29].

## 1. 10. 4. 1. 2. లైంగిక హింస:

కుటుంబ హింసలోనే లైంగిక హింసను ఒక భాగంగానే చెప్పుకోవాలి. ఎందుకంటే ప్రస్తుత సమాజంలో స్త్రీ పురుష సంబంధాలు యజమాని - బానిస సంబంధాలుగా కనిపిస్తున్నాయి ఈ సంబంధాలు లైంగిక జీవితం మీద ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి[27].

## 1. 10. 4. 2. సామాజిక హింస:

స్త్రీలు అన్నిచోట్లా హింసింపబడుతున్నారు. ఇంట్లో ఒక రకమైన హింస భరిస్తే, గడపదాటి బయటకు రావడంతోనే మరో హింసను ఎదుర్కొనక తప్పడంలేదు. ఇటీవల ఢిల్లీ శాఖ నిర్వహించిన సర్వేలో బాలికలపై లైంగిక వేధింపులకు సంబంధించిన విషయాల్లో ఎక్కువ భాగం కుటుంబ సభ్యులు, దగ్గరి బంధువులు, స్నేహితులే కారణమని తేలింది. బాలికలను కిడ్నాప్ చేసి, వేశ్యాగృహాలకు అమ్మివేయడం కూడా సామాజిక హింసలో భాగంగా చెప్పవచ్చు.

## 1. 10. 5. కుటుంబ శ్రమ:

'కుటుంబానికి సంబంధించిన పని అంతా స్త్రీలే చెయ్యాలి' అనేది పితృస్వామ్య భావన. ఉమ్మడి కుటుంబాలు తొలగిపోయి వైయక్తిక కుటుంబాలు ఏర్పడినా, స్త్రీలు చేసే ఇంటి పనిలో మాత్రం ఆమెకు ఎలాంటి రాయతీలు లభించలేదు. నిద్రలేచింది మొదలు, నిద్రపోయే వరకు పనిచేస్తూ ఉండాలని. పితృస్వామ్యం స్త్రీలపై అనధికార శాసనం చేసింది. ఆధునిక యుగంలోని స్త్రీ అయితే ఇటు ఇంటి పనితో పాటు, అటు ఉద్యోగ బాధ్యతలు కూడా నిర్వర్తించవలసి వస్తోంది

ఆదిమ సమాజంలో స్త్రీ పురుషులిద్దరూ కలిసే ఆహారం సంపాదించుకునేవారు. అలా సంపాదించిన ఆహారం నమానంగా పంచుకుని తినేవారు. ఆటవిక దశ నుండి గుంపు దశలోనికి ప్రవేశించిన కాలంలో

పురుషులు యుద్ధాలలోనూ వేటలోనూ స్త్రీలు దుంపలు, కాయలు ఏరడంలోనూ పాల్గొనేవారు. కుటుంబానికి అవసరమైన ఉత్పత్తి దాదాపు స్వయంపోషకంగా ఉండేది. తరువాత కాలంలో వ్యవసాయం, పశువుల పెంపకం ఆరంభమై, సొంత ఆస్తి ఏర్పడింది. ఆ క్రమంలో స్త్రీలు పూర్తిగా ఇంటి పనికి పరిమితమైపోయారు. తద్వారా పురుషుడి ఆధిపత్యం కింద జీవంచవలసి వచ్చింది. స్త్రీలు ఇంటి పనికే పరిమితమైపోవడం వల్ల అన్నింటికీ వారు భర్తపై ఆధారపడవలసి వచ్చింది. తద్వారా ఆమెకు ఎలాంటి హక్కులు లేకుండా పోయింది. చివరికి పిల్లలపై హక్కు కూడా లేకుండా పోయాయి. ఈ క్రమంలోనే భార్య, భర్తకు బానిసగా మారిందని చరిత్ర ద్వారా తెలుస్తోంది

ఇంటిపనికి ఆధునిక యంత్రాలు ఉపయోగించడం, పనివారిని నియమించడం, స్త్రీలు చేసే ఇంటిపనికి వేతనాలివ్వడం ఈ సమస్యలకు పరిష్కారం కాదుగాని... స్త్రీ పురుషులిద్దరూ పనిలో భాగస్వామ్యం కావడమే దీనికి పరిష్కారమని చెప్పవచ్చు.

## 1. 10. 6. లైంగిక స్వేచ్ఛ:

లైంగిక స్వేచ్ఛ గురించి జయప్రభ వివరిస్తూ... ఎవరూ గానీ అయిష్టమైన లైంగిక సంబంధాలను కొనసాగించకూడదన్నది లైంగిక స్వేచ్ఛకు అర్థమని పేర్కొన్నారు. అంటే బలవంతంగా స్త్రీ తన శరీరాన్ని మరొకరికి అప్పగించే స్థితి నుండి విముక్తి కావాలని అర్థం.

స్త్రీ పురుష సంబంధాలు సక్రమంగా ఉన్నప్పుడే ఈ సమాజం పురోభివృద్ధి చెందుతుంది. లేదంటే మనిషికి, జంతువుకి తేడా లేకుండాపోతుంది. ఈ సందర్భంలో సక్రమ సంబంధం, అంటే... ఎలా ఉండాలి అనే ప్రశ్న తలెత్తకమానదు దీనికి సమాధానంగా రంగనాయకమ్మ ఇలా అంటారు "సమాజ పరిణామక్రమంలో స్త్రీ పురుషుల మధ్య సరియైన సంబంధం (వైరుధ్యాలు లేని సంబంధం) ఏర్పడడమనేది 'ఒక స్త్రీ - ఒక పురుషుడు' అనే సూత్రం ద్వారా చాలా కాలం కిందటే ప్రారంభమైంది. ఈ సూత్రం ఎప్పటికీ మారదు. ఇది మారితే స్త్రీ పురుషుల సంబంధం మొత్తం వైరుధ్యాలయం అవుతుంది"[30].

పై వివరణను బట్టి లైంగిక స్వేచ్ఛ అంటే 'స్త్రీ పురుషులిద్దరికీ ఆనందం కలిగే విధంగా దాంపత్యజీవితాన్ని అనుభవించడమే'నని చెప్పవచ్చు. స్త్రీ పురుషుల సంబంధాలు అధికార సంబంధాలుకాక, స్నేహసంబంధాలుగా ఉంటే స్త్రీలకు చాలా వరకు లైంగిక స్వేచ్ఛ లభించడానికి అవకాశం ఉంటుంది.

ఈ సందర్భంలో చలం అన్న మాటలను గుర్తుచేసుకోవాలి "స్త్రీకి కావలసింది తన మీద తన జీవితం మీద, తన శరీరం మీద, మనస్సు మీద, హృదయం మీద సంపూర్ణాధికారం"[31].

## 1. 10. 7. భాష:

ఈనాటి స్త్రీవాదులు ప్రాధాన్యం ఇస్తున్న అంశం భాష. పితృస్వామ్యం తన భావజాలాన్ని భాషావ్యవస్థ ద్వారా అమలు పరుస్తుంది పితృస్వామ్య భావజాలం సజీవ శిలాజంలా భాషలో నిక్షిప్తమై ఉంటుంది. పురుషులు భాషను నియంత్రిస్తారు భాష, స్త్రీలను నియంత్రమైంది. భాష, స్త్రీల అణచివేతలో ఒక బలమైన సాధనం. కాబట్టి నేటి స్త్రీ వాదులకు, స్త్రీ వాదనకు ఒక సరికొత్త స్పృహ 'భాషా చైతన్యం.' దీనినే 'స్త్రీవాద లింగ విముక్తి భాష' అని అంటున్నారు.

భాష తమది కాదనే విషయాన్ని జయప్రభ ఇలా అంటారు.

"ఈ పదజాలమంతా పెట్టి డొల్లు....

నిన్ను వర్ణించగల భాషలేదే మాకు" అని పురుష నిర్మిత భాషను నిరాకరించారు. 1960లలో సెకెండ్ వేవ్ ఫెమినిజంలో 'బెట్టీఫ్రెడం' ఈ తరహా భావనకు 'problem without name' అని పేరు పెట్టారు. ఈ సమస్యను వ్యాఖ్యానిస్తూ సారామిల్స్ ఇలా అంటారు

"The experience of living as a women in patriarchal society where individual women assumed that the problem that they were experiencing were specific to themselves, since there were no terms in the language which demonstrated that this was winder problem"[32]

పితృస్వామ్య వ్యవస్థలో భాష ఎలాంటి పాత్రను నిర్వహిస్తున్నదో గురజాడ కన్యాశుల్కం (నాటకం) లోని కొన్ని సంభాషణలు గమనిస్తే మనకు అర్థమవుతుంది-

కన్యాశుల్కం ద్వితీయాంకంలో వెంకమ్మనుద్దేశించి అగ్నిహోత్రావధాన్లు- 'ఆడముండలతోనా ఆలోచన' అని అంటాడు. తృతీయాంకంలో వెంకటేశం బుచ్చమ్మతో 'నాన్సెన్స్! నువ్వు ఆడదానవి, నీకేం తెలియదు,' ఆడదానివి నీకెందుకు ఈ భోగట్టా అంతాను?' అంటాడు.

ఈ సంభాషణలు స్త్రీ పురుషుల మధ్య తేడాను ప్రదర్శించడమే కాదు, భాష పురుషుల ఆధీనంలోనే వుందనే వాస్తవాన్ని తెలుపుతున్నాయి. అంతేగాక భాషలో ఆధిపత్య స్వభావం ఎలా అంతర్లీనంగా ఉంటుందో ఈ సంభాషణల బట్టి గమనించవచ్చు.

భాష మానవ నిర్మితం కాక పురుష నిర్మితమైందని, 'పురుషుడు' మానవాళి ప్రతినిధిగా మారాడం ఇది ఏకపక్షంగా జరిగిందని స్త్రీవాదం అంటుంది. అందుకే మేరీ డేలీ "we have inherited a contaminated language" అన్నాదని స్త్రీవాద భాషాశాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ భాష మీద విశేషంగా కృషిచేసిన వారిలో మేరీ డాలీ, జూలియా, ల్యూస్, ఇరిగారి, ఎలెన్ సిస్సు, దెబోరా, కామెరాన్ ముఖ్యులు. వీరు అంగీకరించిన అంశాల్ని ఈ కింది విధంగా క్రోడీకరించవచ్చు. వాటిలో ముఖ్యమైనవి:

1. భాషలో లింగ దృక్పథం ప్రధానంగా ఉంది.

2. స్త్రీ విముక్తి కోసం జరిగే పోరాటంలో భాష ఒక కీలకమైన పాత్ర వహిస్తు ంది

3. స్త్రీల విముక్తి అంతా విప్లవాత్మకమైన భాషావ్యవస్థను సాధించడంలోనే ఉందని స్త్రీలకు పిలుపు ఇవ్వాలి.

4. ప్రతి భాషలోనూ వాక్యం పురుషదృక్పథాన్ని కలిగి ఉంటుంది. వాక్యానికి పురుష వాక్యమే గీటురాయి. అదే ప్రమాణం. స్త్రీలు రాసింది, మాట్లాడింది వాక్యం కాదు. స్త్రీలు రాసే వాక్యం Norm కాదు. అది Marginal.

5. జండర్ వివక్షలేని సమాజాన్ని ఆశిస్తు న్నప్పుడు జండర్ విముక్తి భాషను సృష్టించుకోవాలి[33].

పురుషుల అవసరాలకోసం, వారికి అనుకూలంగా, వారి దృక్పథాలకు అనుగుణంగా రూపొందించబడిన భాషలో స్త్రీలు తమ భావాలను గానీ ఆలోచనలను గాని చెప్పలేరు, రాయలేరు అని స్త్రీవాద భాషాసిద్ధాంతం భావిస్తు ంది అందుకే స్త్రీలకు 'సొంత భాష' కావాలని ఆశిస్తు న్నారు వర్జీనియా ఊల్ఫ్ మాత్రం తమకు సరిపోయే వాక్య నమూనాను స్త్రీలే తయారుచేసుకోవాలంటున్నారు. ఒకవేళ అలాంటి వాక్య నమూనా ఏర్పడితే దానిని Female sentence లేక Ecriture[33] అనవచ్చని చెప్పారు. కొందరు దీనిని 'వనితా వాక్యం' అంటున్నారు. భాష అనేది స్త్రీవాదంలో ఒక 'ఎజెండాగా' మారితే, ఉత్తమ ఫలితాలు లభించగలవని ఆశించవచ్చు.

ఇవి స్త్రీవాదం లేవనెత్తిన ప్రధాన అంశాలు. అయితే ఈ సందర్భంలో ప్రపంచ మహిళాసదస్సులు జరగడం, ఆ సదస్సులలో స్త్రీవాదులు చర్చించిన వివిధ అంశాలను ప్రస్తా వించకపోతే ఈ అధ్యాయం అసంపూర్ణమే అవుతుంది. గనుక ఇప్పుడు ఆయా ప్రపంచ మహిళాసదస్సులలో చర్చించిన ముఖ్యమైన విషయాలను వివరిస్తా ను

దాదాపు గత రెండు దశాబ్దాలుగా ప్రపంచ మహిళాసదస్సులు జరుగుతున్నా యి. వాటిలో స్త్రీలకు సంబంధించిన వివిధ అంశాలను చర్చించడం, ఆ చర్చల ద్వారా ఆయా సమస్యలకు పరిష్కార మార్గాలు తెలియజేయడం ఈ సదస్సులో ప్రముఖపాత్ర వహిస్తా యి ఇంతవరకు నాలుగు ప్రపంచ మహిళాసదస్సులు జరిగాయి. వాటి గురించి క్లుప్తంగా చెప్తా ను

ఈ ప్రపంచ మహిళాసదస్సులు మొదటిసారిగా 1975వ సంవత్సరంలో జరిగాయి. ఈ సదస్సులో స్త్రీ పురుష సమానత్వం, అభివృద్ధి, శాంతి ఎజెండాగా నిలిచాయి. రెండవ సమావేశం 1980లో డెన్మార్క్ లో జరిగింది. ఈ సమావేశంలో తీర్మానించిన అంశాలు- స్త్రీ పురుష సమానత్వం అభివృద్ధి, శాంతి సాధించేందుకు అవసరమైన విద్య, ఉద్యోగం, ఆరోగ్యం అనే అంశాలతో ఒక కార్యాచరణ పథకం ఏర్పాటయింది. మూడవ సమావేశం 1985లో కెన్యాలో జరిగింది. దీనిలో 2000 సంవత్సరానికి మహిళల

పురోగతిని వేగవంతంచేసే ప్రణాళికను చర్చించి సిద్ధంచేశారు. నాలుగో సమావేశం 1995లో బీజింగ్ లో జరిగింది. మహిళల సమానత్వం, పురోభివృద్ధి, హక్కుల పరిరక్షణ ప్రాతిపదికగా జరిగిన ఈ సదస్సు విజయవంతమైంది. దీనిలో మొత్తం 189 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. భారతదేశం నుంచి 500 మందిలో 16 మంది మహిళలు ఆంధ్రప్రదేశ్ నుండి ఈ సమావేశానికి ప్రాతినిధ్యం వహించారు. గత ఇరవయ్యేళ్లుగా తాము సాధించుకున్న హక్కుల్ని పరిరక్షించుకునేందుకు, సమానత్వం వైపు మరో అడుగు వేసేందుకు ప్రపంచ నలుమూలల నుంచి మహిళలు పాల్గొన్నారు.

అయితే గత రెండు దశాబ్దాలుగా ఇటువంటి సదస్సులు జరుగుతున్నా, ప్రపంచదేశాలు అధికారికంగా ఇందులో పాల్గొని నిర్ణయాలు తీసుకున్నా ఆచరణలో మాత్రం అవి అంతంత మాత్రంగానే మిగిలిపోతున్నాయి. ప్రపంచంలో ఇంకా 64% మంది మహిళలు నిరక్షరాస్యులుగానే ఉన్నారు. దారిద్ర్యం, దోపిడి, హింస పురుషుడి కన్నా స్త్రీలే ఎక్కువగా అనుభవిస్తున్నారు ప్రపంచంలో ప్రతి రెండు వేలమంది మహిళల్లో ఒకరు అత్యాచారానికి గురైనవారేనంటే... పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థంచేసుకోవచ్చు. ప్రపంచవ్యాప్తంగా మహిళల ప్రవేశం 11% మాత్రమే. ప్రపంచంలో 18 లక్షల మంది కార్మికులు ఉంటే అందులో 75% మహిళలే. ఇక భారతదేశ విషయానికొస్తే 1994లో మనదేశంలో దాదాపు 6, 400 వరకట్న మరణాలు జరిగాయి. కుల, మత, కుటుంబ, సామాజిక బంధాలు, బంధకాలుగ మారి, వారిని ముందుకు రానివ్వడం లేదు. శారీరక మానసిక హింసలకు అంతే లేదు.

బీజింగ్ లో జరిగిన సదస్సు పేదరికం, విద్య, ఆరోగ్యం, హింస, శాంతి, ఆర్థికపరిస్థితి, రాజకీయ అధికారం, పర్యావరణం, మీడియా, స్త్రీల ప్రత్యేక హక్కులు వంటి కీలక విషయాలను మహిళలపరంగా ఈ సదస్సులో చర్చించారు. మానవ హక్కులు, మహిళల హక్కులు వేరు వేరు అంశాలు కావని, రెండు పరస్పర అంతర్భాగాలేనని సదస్సులో పేర్కొనడం జరిగింది. పునరుత్పత్తి, మైనారిటీ, చట్టపరమైన హక్కుల గురించి కూడా వివరంగా చర్చలు జరిగాయి. తమ శరీరంపై సర్వాధికారాలు తమకే ఉండాలని ప్రతినిధులు ముక్తకంఠంతో చెప్పారు. లైంగిక సమానత్వసాధన లక్ష్యంపై మాత్రం ఏకాభిప్రాయం సాధించలేకపోయారు. ఈ విషయంలో మతవాదులు, స్త్రీ విముక్తవాదులు పరస్పర వ్యతిరేక అభిప్రాయాలు వ్యక్తంచేసారు

ఈ సదస్సులో చైనా అధ్యక్షుడు మాట్లడుతూ 'వర్థమాన దేశాలు ముఖ్యంగా ఆ దేశ మహిళల ఆర్థిక పురోగతికి, పేదరిక నిర్మూలనకు, జీవనప్రమాణాల పెరుగుదలకు సహకరించవలసిన బాధ్యత ఆయ దేశాలు కలిగి ఉన్నాయని' అన్నారు. అమెరికాకు చెందిన హిల్లరీ క్లింటన్ మాట్లాడుతూ మహిళల బాలికల, ఆరోగ్య రక్షణకు గట్టిగా కృషిజరగాలని తెలిపారు. పాకిస్తాన్ ప్రధాని శ్రీమతి బెనజీర్ భుట్టో మాట్లడుతూ... సాంప్రదాయ కుటుంబం గురించి చర్చించడంలో మరింత శ్రద్ధ వహించగలరని ఆమె

ఆకాంక్షించారు. భారతదేశానికి చెందిన ఎస్.కె.గుహ మాట్లడుతూ అంతర్జాతీయ సమాజం, అంతర్జాతీయ ఆర్థికసంస్థలు, ప్రభుత్వ సంస్థలన్నీ కలసి ఒక క్రమపద్ధతిలో పనిచేస్తేనే స్త్రీ పురుషుల మధ్య ఉన్న అసమానతలు తొలగుతాయని అన్నారు. దక్షిణాఫ్రికా, సిరియా, బ్రెజిల్ దేశాలు ఈ వాదాన్ని బలపరిచాయి. బీజింగ్ మహాసభలో భారతమహిళలు కొన్ని ప్రతిపాదనలు చేశారు.

**వాటిలో ముఖ్యమైనవి:**

1. శ్రమను, ప్రకృతిని దోపిడి చేస్తు న్న వైనాన్ని పరిశీలించి దాన్నిపూర్తిగా అరికట్టేందుకు U.N.O ఆధ్వర్యంలో న్యాయపరమైన అధికారంతో కూడిన వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
2. ప్రపంచ ఆర్థికసంస్థలను లోపర్చుకుంటూ, U.N.O అభిప్రాయాలను కూడా తోసిపుచ్చడానికి ప్రయత్నించే దేశాల ఆధిపత్యాన్ని వ్యతిరేకించాలి.
3. స్త్రీల ఆర్థికస్థాయి పెంపొందించడానికి U.N.O సూచించిన కార్యక్రమం ప్రకారం భూమిపై హక్కును మహిళలకు కల్పించాలి. భూ సంస్కరణలు అమలు జరపాలి.
4. స్త్రీలకు ఉచిత నిర్భంధ విద్యను సెకండరీస్థాయి వరకు కల్పించాలి.
5. కుటుంబంలో స్త్రీకి సమాన ప్రతిపత్తిని ఉత్పాదకతపై ఉమ్మడి యాజమాన్యాన్ని, వారసత్వపు హక్కులను కల్పిస్తూ ప్రభుత్వాలు శాసనాలు చెయ్యాలి. అప్పుడే మానవ హక్కులతో కూడిన ప్రజాస్వామిక కుటుంబ నిర్మాణం రూపొందించడానికి వీలుంటుంది.

బీజింగ్ సదస్సు చేసిన ఈ ప్రతిపాదనలు కార్యరూపంధరిస్తే మహిళా సదస్సుల ఆశయాలు సఫలమవుతాయి.

## పాదసూచికలు

1. శబ్దార్థ చంద్రిక. 2003. పుట: 103
2. శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు. 1979. పుట: 339
3. బ్రౌన్ ఇంగ్లీష్ - తెలుగు నిఘంటువు. 2000. పుట: 393
4. Concise oxford Dictionary of current English. 1987. పుట: 338
5. తెలుగు అకాడమీ ఇంగ్లీష్ - తెలుగు నిఘంటువు. 2000. పుట: 344
6. సుదర్శనం ఆర్.ఎస్. 1989. వ్యాసావళి (ద్వితీయ ముద్రణ). పుట: 109
7. ఆంజనేయ శర్మ, వేమూరి. 2009. అస్తిత్వవాదం.. అబ్సర్డ్ నాటకం వ్యాసాలు కొన్ని కథలు. ఆంజనేయ శర్మ స్మారక ట్రస్టు, హైదరాబాద్. పుట: 10
8. పైదే. పుట: 11
9. గోపిచంద్, త్రిపురనేని. 2005. తత్వవేత్తలు పుట: 309
10. రామకృష్ణారావు, పై. 1987. ఆధునికాంధ్ర సాహిత్యంలో చైతన్య స్రవంతి. పుట: 189.
11. John Macquarrie. 1982. Existentialism. పుట: 66
12. Ibid. పుట: 69
13. Carl Michalson.1987. What is Existentialism. పుట: 3
14. శ్రీరామ మూర్తి, కోడూరి. (1978 ఏప్రిల్, భారతి మాస పత్రిక) మూడు దశాబ్దాల తెలుగు నవలా సాహిత్యంలో అస్తిత్వవాద ధోరణులు (1947 - 77). పుట: 42
15. గోపిచంద్, త్రిపురనేని. 2005. తత్వవేత్తలు పుట: 313
16. ఆంజనేయ శర్మ, వేమూరి. 2009. అస్తిత్వవాదం.. అబ్సర్డ్ నాటకం వ్యాసాలు కొన్ని కథలు. పుట: 5, 6

17. John A. Mackay, Migual. 1986. Christianity and the Existentialism. పుట: 53

18. శ్రీరామ మూర్తి, కోడూరి. 1979. తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ. పుట:86

19. సత్యనారాయణ, పి. 1984. భారత స్త్రీ సంకెళ్ళు స్వాతంత్ర్యం. పుట:7

20. కమల భాసిన్, నిఖాత్ సయద్ ఖాన్ (అనువాదం: నాగమల్లీశ్వరరావు). 1989. ఫెమినిజం ప్రశ్నలు - సమాధానాలు. పుట: 3

21. స్త్రీవాద సమాఖ్య. 1989. లోహిత. పుట: 6

22. చే,రా. 1994. మహిళావాద విమర్శలో పెద్ద ముందడుగు. పుట:3

23. Delmor Rosalind. 1972. What is feminism. పుట:6

24. Ramazonoglo, carnolive. 1989. Feminism and the contradiction of the oppressions. పుట:21

25. జయప్రభ. 1989. స్త్రీ విముక్తి అంటే పురుష ద్వేషం కాదు. ఆంధ్రభూమి (దిన పత్రిక) డిసెంబర్ 21

26. ఓల్గా. 1985. కుటుంబ వ్యవస్థ. పుట: 1

27. విద్మహే కాత్యాయని (సంపాదకత్వం). 2005. జెండర్ స్పృహ. పుట: 23, 24

28. ఈనాడు దినపత్రిక మార్చి 8, 2007. పుట:2

29. పైదే. పుట:2

30. రంగనాయకమ్మ. 1988. అసమానత్వంలోంచి సమానత్వంలోకి. పుట: 54,55

31. చలం. 1988. స్త్రీ. పుట: 7

32. సీతారం. 2007. అదే పుట: పుట:74

33. సీతారం. 2007. అదే పుట: పుట: 77, 78

34. సీతారం. 2007. అదే పుట: పుట: 7

# 2. విభిన్న ఉద్యమాలు - స్త్రీలు - చైతన్యం

## 2. 1. ఉద్యమ ఆవిర్భావం:

ఉద్యమం అనేది హఠాత్తుగా ఆకాశంనుండి ఊడిపడే పదార్థంకాదు. అనేక రకాలైన సంఘటనలు, అసంతృప్తులు అణచివేతలనుండి ఉద్యమం పుట్టుకొస్తుంది. ప్రజలు ఎప్పుడైతే సమాజంలో ఉన్న పరిస్థితులమీద అసంతృప్తి, నిరసన వ్యక్తంచేస్తారో అప్పటినుండి ఉద్యమం బీజరూపం దాల్చుతుంది. సమాజంలో ఉన్న పరిస్థితులు బాగోలేనప్పుడు లేదా ఉన్నపరిస్థితిని సంస్కరించాలనుకున్నప్పుడు ఉద్యమాలు ప్రారంభమై, క్రమేపి తీవ్రరూపం దాల్చి, సమాజ సంస్కరణకు దారితీసి, తద్వారా సమాజాభివృద్ధికి దోహదంచేస్తాయి.

మానవసమాజంలో ఏర్పడిన అణచివేత, పీడన, దోపిడి మొదలైన అసాంఘిక శక్తులకు వ్యతిరేకంగా జరిగిన ప్రతి ఉద్యమంలోనూ స్త్రీలు "మేము సైతం" అంటూ పెద్దఎత్తున పాల్గొని, అనేక కష్టనష్టాలకోర్చి, ఎంతో త్యాగంచేసి అనేక ఉద్యమాలు విజయవంకావడానికి దోహదపడ్డారు. ఇలాంటి గొప్పవారి చరిత్ర ఎంతో ఉన్నప్పటికీ చరిత్రపుటల్లో వీరికి సముచితస్థానం లభించలేదు. భారతదేశంలో జరిగిన జాతీయోద్యమం, సంఘసంస్కరణోద్యమం, తెలంగాణా రైతాంగ ఉద్యమం, వివిధ మహిళాకార్మిక ఉద్యమాలన్నింటిలోను మహిళలు నిర్వహించిన పాత్ర శ్లాఘనీయమైంది. ఈ పోరాటాల్లో పాల్గొన్న స్త్రీలు అందించిన స్ఫూర్తితో, తరువాత కాలంలో స్త్రీలు అనేక రంగాల్లో ముందడుకు వెయ్యడానికి ఎంతగానో ఉపయోగపడింది.

స్వాతంత్ర్యానంతరం స్త్రీలు తమ సమస్యలను ఒక్కొక్కటిగా అధిగమిస్తూ ఇప్పుడు అస్తిత్వ పోరాటంవైపు తమ పోరాట ప్రస్థానాన్ని మళ్లించారు. ఈనాటి స్త్రీల పోరాట పటిమకు ప్రేరణ ఇచ్చిన ముందు తరాల స్త్రీలను, వాళ్లు వివిధ ఉద్యమాల్లో పాల్గొన్న తీరుతెన్నుల గురించి ఈ అధ్యయనంలో తెలుసుకుందాం!.

## 2. 2. జాతీయోద్యమం - స్త్రీలు

బ్రిటిష్ వారు వ్యాపారనిమిత్తం భారతదేశానికి వచ్చి, క్రమక్రమంగా సామ్రాజ్యాధిపతులుగా మారిపోయి, అధికారాన్ని మొత్తం హస్తగతం చేసుకున్నారు. బ్రిటిష్ వారు చేస్తున్న దోపిడి, దౌర్జన్యం, అణచివేతను ప్రజలు గుర్తించారు వీటన్నింటి నుండి విముక్తి పొందాలంటే 'స్వాతంత్ర్యం' ఒక్కటే మార్గమని గ్రహించారు. ఈ విధంగా మొదలైన స్వాతంత్ర్యకాంక్ష ఉద్యమరూపం దాల్చి, 'జాతీయోద్యమం' గా మారింది. దాదాపు 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం నుండి స్వాతంత్ర్యం వచ్చేవరకు అంటే సుమారు తొంభై సంవత్సరాల పాటు జాతీయోద్యమం కొనసాగింది. ఈ తొంభై సంవత్సరాల జాతీయోద్యమ మహాప్రవాహంలో చిన్నచిన్న పాయలుగా కనిపిస్తున్న

సంస్కరణోద్యమం, దానిలో భాగాలైన స్త్రీవిద్య, వితంతువివాహాలు, సతీసహగమనం, బాల్యవివాహాల నిషేదం మొదలైనవన్నీ అంతర్లీనంగా కనిపిస్తున్నాయి ఈ జాతీయోద్యమంలో వారు, వీరు అని కాకుండా పీడితప్రజలు, రైతులు, కార్మికులు, స్త్రీలు, విద్యార్థులు, యువకులు, ముఖ్యంగా మధ్యతరగతి బుద్ధి జీవులు పాల్గొన్నారు.

పంతోమ్మిదో శతాబ్ధం మధ్య కాలానికి బ్రిటిష్ వారు తమ వాణిజ్య స్వరూపాన్ని వదిలిపెట్టి రాజకీయ అధికారాన్ని స్థాపించుకోవడం ఆరంభించారు. మన దేశంలో ఉన్న చిన్న చిన్న స్వతంత్ర రాజ్యాలను తమలో విలీనం చేసుకోవడం ప్రారంభిచారు. ఎవరైతే బ్రిటిష్ అధికారాన్ని ధిక్కరించి తమ స్వతంత్ర ప్రతిపత్తిని కాపాడుకోవడానికి ప్రయత్నించారో అలాంటి వారిపై బలప్రయోగం జరిపి లేదా యుద్ధం ప్రకటించి, తద్వారా వారి రాజ్యాలను హస్త గతం చేసుకునేవారు. అనేకమంది స్త్రీలు తమ సంస్థానాలను కాపాడుకోవడానికి బ్రిటిష్ వారిపై తిరుగు బాటు చేశారు. ఇలాంటి తిరుగు బాట్లే జాతీయోద్యమానికి నాంది పలికాయి. 1857 ప్రారంభంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తొలిసారి తిరుగుబాట్లు జరిగాయి. ఈ తిరుగుబాట్లలో రాణీ లక్ష్మీబాయి, బేగంహజరత్ మహల్, రామఘర్ రాణి , తేజ్ బాయి వంటి ప్రముఖులు పాల్గొన్నారు . కధనరంగంలో వీళ్ల స్వయంగా సైన్యాన్ని నడిపి, పోరాడారు. కొంతమంది జైళ్లలో పెట్టబడ్డారు. మరికొందరు వీరోచితంగా పోరాడి స్వర్గస్తు లయ్యారు

## 2. 2. 1. ఝూన్సీ లక్ష్మిబాయి:

"జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అన్నారు పెద్దలు. అంటే పుట్టినదేశం, కన్నతల్లి స్వర్గం కంటే గొప్పవని అర్థం. తాను పుట్టిన దేశం కోసం బ్రిటిష్ వారితో పోరాడి, నేలకొరిగిన వారిలో లక్ష్మీబాయి ఒకరు. ఈమె వీరవనిత, ధైర్యానికి మారుపేరు. ఝూన్సీ రాజ్యానికి గంగాధరరావు రాజు. ఈయన భార్య లక్ష్మీబాయి. వీరికి సంతానం లేని కారణంగా ఎవరినైనా దత్తత తీసుకోవాలని ప్రయత్నిస్తా రు అయితే వీరి ప్రయత్నానికి బ్రిటిష్ వారు ఎన్నో ఆటంకాలు కలిగిస్తా రు లక్ష్మీబాయి, గంగాధరరావు ఇద్దరు కలసి ఎన్నో ఆటంకాలను ఎదుర్కొని చివరికి దామోదరరావు అనే బాలుణ్ణి దత్తత తీసుకుంటారు. తరువాత కొన్నాళ్లకు గంగాధర రావు మరణిస్తా డు ఆ తరువాత బ్రిటిష్ ప్రభుత్వం ఆమెకు నెలకు 5వేల రూపాయలు భరణంగా ఇస్తా మని ఝూన్సీ రాజ్యాన్ని తమకు అప్పగించమని రాయబారం పంపుతారు. లక్ష్మీబాయి దానికి అంగీకరించదు. ఈ సంఘటన ఆధారంగా చేసుకొని బ్రిటిష్ ప్రభుత్వం తన రాజ్యంపై దురాక్రమణ జరిపితే ఎదుర్కోవడానికి సిద్ధంగా అనేక వ్యూహాల్ని రూపొందిస్తు ంది లక్ష్మీబాయి.

బ్రిటిష్ ప్రభుత్వం ఝాన్సీని ఆక్రమించడానికి పన్నాగం పన్నుతున్న సమయంలో లక్ష్మీబాయి బ్రిటిష్ వల్ల నష్టపోయిన ఇతర రాజ్యాలతో చేతులు కలుపుతుంది . 1857 జూన్ 5న ఝాన్సీలో బహిరంగంగా తిరుగుబాటు జరుగుతుంది. ఇరువర్గాల మధ్య భీకరయుద్ధం జరుగుతుంది. రాణి సైనికులు కోటను కాపలా కాస్తా రు మారువేషంలో కోటలోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన బ్రిటిష్ సైనికాధికారిని గేటు వద్దే రాణి సైనికులు చంపేస్తా రు తరువాత రోజు మళ్లీ కోటపై తిరుగుబాటుదార్ల దాడి జరుగుతుంది. బ్రిటిష్ సైన్యం రాణి సైన్యం ముందు నిలవలేకపోతారు. తమను హింసించకుండా వదిలిపెడితే వెళ్లి పోతామని చెప్పి, లొంగిపోతారు.

ఈ ఘనవిజయం తర్వాత ఝాన్సీరాణి భర్త తరఫు బంధువయిన సదాశివరావు అనే వ్యక్తి తానే ఝాన్సీకి వారసుడనని, రాజుగా ప్రకటించుకుంటాడు. ఝాన్సీరాణి అతనిపై కూడా యుద్ధంచేసి విజయం సాధిస్తు ంది

బ్రిటిష్ ప్రభుత్వం క్రమక్రమంగా ఒక్కొక్క రాజ్యాన్ని తన చేతుల్లోకి తీసుకుంటున్నట్టు వార్తలు విన్నాకూడా ఆమె ధైర్యాన్ని వీడలేదు. తన సైన్యంతో నేరుగా వెళ్లి, పలుప్రాంతాల్లో పర్యటించి, తన మాటలతో సైన్యాన్ని ఉత్తేజితుల్ని చేసి, వారిలో దేశభక్తిని రగిలిస్తు ంది

1858 మార్చి 28న బ్రిటిష్ ప్రభుత్వం ఝాన్సీ రాజ్యంపై బాంబులవర్షం కురిపిస్తు ంది ఝాన్సీ బ్రిటన్ చేతుల్లోకి వెళ్లిపోతుంది. యుద్ధం చివర వరకు కూడా ఖడ్గం ధరించి, వీరోచితంగా పోరాడుతుంది. ఒకనాడు బ్రిటిష్ సైన్యాల రాకను గమనిస్తూ తన నివాసంపై నిలబడిన లక్ష్మీబాయిపై బ్రిటిష్ సైనికులు కాల్పులు జరుపుతారు. ఆ కాల్పుల్లో ఆమె గాయపడుతుంది. ఆ గాయంతోనే యద్ధరంగంలో ప్రవేశించి, వీరమరణం పొందుతుంది. ఈమె మరణం పరాయి దాస్యంలో మగ్గుతున్న భారతీయులలో స్వాతంత్ర్యకాంక్షను రేకెత్తించింది

## 2. 2. 2. హజరత్ మహల్.

హజరత్ మహల్ ఒక నాట్యకారిణి. ఈమె 'మోటా'[1] అనే ఆచారం ద్వారా ఓథ్ రాజు అయిన "వజీద్ ఆలీషా" భార్యగా ఉండేది. కొంతకాలానికి ఆలీషా కలకత్తా వెళ్లిపోతాడు. హజరత్ మాత్రం లక్నోలోనే ఉండి పోతుంది. 1856లో బ్రిటిష్ ప్రభుత్వం ఓథ్ రాజ్యాన్ని ఆక్రమించింది. ఓథ్ రాజయిన ఆలీషా పదవి లో బ్రిటన్ కు వ్యతిరేకంగా తిరుగుబాట్లు జరిపి ప్రజలు విజయం సాధిస్తా రు దీన్ని స్ఫూర్తిగా తీసుకుని, హజరత్ తిరిగి ఓథ్ ను ఆక్రమించుటకు బ్రిటిష్ ప్రభుత్వంపై తిరుగుబాటు చేస్తు ంది 1858లో ఫిబ్రవరి 25న స్వయంగా ఏనుగుపై యుద్ధరంగలోకి వెళ్లి, సైన్యాలకు ఆదేశాలను పంపడమేకాక, సైనికులను ప్రోత్సహిస్తు ంది తను ఓడిపోయే పరిస్థితుల్లో, శత్రువుల చేతిలో నుండి తప్పించుకుని, నేపాల్ వెళ్లిపోతుంది. తరువాత బ్రిటన్ ప్రభుత్వం ఆమెను లొంగిపొమ్మని, పెన్షన్ ఇస్తా మని రాయబారం పంపుతుంది. కాని హజరత్ ఒప్పుకోదు. కొంతకాలం తరువాత తిరిగి తన

దేశానికి రావడనికి ప్రయత్నించినప్పటికి, బ్రిటిష్ విధానాల వల్ల సాధ్యం కాక, నేపాల్లోనే ఉండిపోతుంది. ప్రవాసంలో ఉంటూనే 1887లో మరణించింది కాని, బ్రిటిష్ వారికి తలొగ్గలేదు.

## 2. 2. 3. రామ్ ఘర్ రాణి:

1857 - 58 తిరుగుబాట్లలో పాల్గొన్న మహిళల్లో రామ్ ఘర్ రాణి ఒకరు. పూర్వం 'రామ్ ఘర్' మధ్యప్రదేశ్ లో ఉండేది. దీన్ని లక్ష్మణ్ సింగ్ అనే రాజు పరిపాలించేవాడు. ఆయన మరణానంతరం ఈ ఆస్థానాన్ని బ్రిటిష్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. సంస్థాన పరిపాలన కోసం తహసిల్దారును నియమించింది. రామ్ ఘర్ రాణి అతన్ని తొలగించి, తానే స్వయంగా పరిపాలన చేపడుతుంది. కలెక్టర్ ఆదేశాలను తిరస్కరిస్తు ంది బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి సన్నద్ధమౌతుంది. సైనిక బలాన్ని పెంచుకుంటుంది. ఇరుగుపొరుగు జమిందారులను, సైన్యాధిపతులను సహాయం కోరుతుంది.

1858 ఏప్రిల్ 1న బ్రిటిష్ సైన్యాలు రామ్ ఘర్ పై దాడిచేస్తా యి ఆమె కోట నుండి వెలుపలికి వస్తు ంది యుద్ధరంగంలో సైన్యానికి నాయకత్వం వహిస్తు ంది రామ్ ఘర్ చిన్న రాజ్యం గనుక బ్రిటిష్ వారి చేతిలో ఓడిపోక తప్పలేదు. చివరికి బ్రిటన్ ప్రభుత్వానికి బందీ అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. బ్రిటిష్ వారికి బంధీఅవడం ఇష్టంలేక, తోటి సైనికుని వద్ద కత్తి తీసుకొని ఆత్మహత్య చేసుకున్న ధైర్య శీలి 'రామ్ ఘర్ రాణి'.

## 2. 2. 4. జ్యోతిపూర్ రాణి:

జ్యోతిపూర్ రాణి మెజిస్ట్రేట్ ఆజ్ఞలను ధిక్కరించి, సాయుధ బలంతో అధికారం చేపడుతుంది. నెలకు రెండువేల రూపాయల పింఛను ఇస్తా మన్ని బ్రిటిష్ ఆశ చూపినా ఆమె తిరస్కరిస్తు ంది

భారతదేశం అంతట బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక తిరుగుబాట్లు జరిగాయి. ఈ తిరుగుబాట్లలో అనేకమంది రాణులు పాల్గొని తమ రాజ్యాధికారాన్ని నిలబెట్టుకోవడానికి కృషిచేశారు. కొంతమంది స్త్రీలు పరోక్షంగా కూడా పాల్గొని, తమ దేశభక్తిని చాటుకున్నారు. బద్రీఠాకురాణి తిరుగుబాట్లకు నిధులను సేకరించారు. గోరక్ పూర్ తిరుగుబాట్లలో దిగంబర్ కోయెల్ రాణి, తిరుగుబాటుదార్లతో కలిసి పోరాడింది. టికారీ రాణి తన రాజ్యాధికారాన్ని నిలబెట్టుకోవడానికి అనేక రకాలుగా పోరాటం చేసింది.

ఈ తిరుగుబాట్లు ముగిసిన తరువాత, ప్రజల్లో స్వాతంత్ర్యకాంక్ష పెరిగి, అది స్వాతంత్ర్యోద్యమానికి ఊపిరి పోసింది. ఈ స్వాతంత్ర్యోద్యమం అనేక అంశాలతో కూడి అంచలంచెలుగా జరిగిన ఒక మహాసంగ్రామం. బ్రిటిష్ వారు అవలంభిస్తు న్న విధానాలకు వ్యతిరేకంగా మన భారతీయులు అనేక కార్యక్రమాలు రూపొందించారు. వాటిలో ముఖ్యంగా

సహాయనిరాకరణోద్యమం, ఉప్పుసత్యాగ్రహం, సైమన్ కమీషన్, క్విట్ఇండియాఉద్యమం... మొదలైనవన్నీ జాతీయోద్యమ ప్రవాహానికి కెరటాల వంటివి. ఈ ఒక్కొక్క ఉద్యమంలో కూడా అనేక మంది స్త్రీలు పాల్గొని, తమ సర్వస్వాన్ని ధారపోసి స్వాతంత్ర్యసిద్ధికై తమదైన పాత్ర పోషించారు.

## 2. 2. 5. సరోజిని నాయుడు:

మహాత్మాగాంధీ ప్రభావంతో సరోజిని నాయుడు దేవి స్వాతంత్ర్య సమరంలోకి ప్రవేశించారు. స్త్రీలను కూడా చైతన్యపరచి స్వాతంత్ర్యం కోసం పోరాడమని ప్రోత్సహించేవారు. 1919లో ఇంగ్లాండ్ నుండి స్వదేశానికి తిరిగి వచ్చిన తరువాత ఈమె విదేశీ వస్త్రాలను కాదని ఖద్దరు వస్త్రా లను ధరించడం మొదలు పెట్టింది. హిందూ వితంతుస్త్రీల రక్షణ కోసం కృషిచేశారు. హిందూ - ముస్లిం వేదికలపై అనేక ఉపన్యాసాలిచ్చారు. భారతీయుల స్వపరిపాలన కోసం, స్త్రీల హక్కుల కోసం ఆమె కృషిచేశారు. మాంటేగ్ - జేమ్స్ ఫర్డ్ సంస్కరణలను వ్యతిరేకిస్తూ ధైర్యంగా వేదికపై మాట్లాడేవారు. స్త్రీలను, యువజనులను ప్రోత్సహిస్తూ అనేక ఉపన్యాసాలిచ్చేవారు.

1923 - 29 వరకు అమెరికా, కెనడాలో పర్యటించారు. ఆ సమయంలో అనేక ఉపన్యాసాలిచ్చారు. 1925లో కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. ఈమె గాంధీ సిద్ధాంతాలపై విపరీతమైన ఆదరణ చూపించేవారు. 1930లో సహాయనిరాకరణోద్యమంలోకి స్త్రీలను సమీకరించే బాధ్యతను గాంధీజీ, సరోజినికి అప్పగించారు. ఈ సందర్భంలో 1930లో సరోజిని నాయుడు అరెస్టయ్యారు. విడుదలైన తరువాత 2,500 మంది స్త్రీలతో వెళ్లి, ఉప్పును సేకరించే కార్యక్రంలో నిమగ్నమయ్యారు.

1931లో రెండవరౌండ్ టేబుల్ సమావేశంలో స్త్రీల ప్రతినిధిగా హాజరయ్యారు. గాంధీ అరెస్ట్ తరువాత 1922లో కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. సహాయనిరాకరణోద్యమంలో పాల్గొనరాదని, నగరం దాటి వెళ్ళరాదని, ప్రభుత్వం ఆమెపై నిషేధం విధించింది. అయినా ఆమె ప్రభుత్వాన్ని లెక్కచేయకుండా బొంబాయికి ప్రయాణమయ్యారు. మార్గం మధ్యలో పోలీసులు కాపలా కాసి ఆమెను అరెస్ట్ చేసి, ఒక సంవత్సరం జైలు శిక్ష విధించారు.

సరోజిని నాయుడు 1912 లో గోపాలకృష్ణగోఖలేని కలిశారు. వారితో మాట్లాడడం ద్వారా హిందూ, ముస్లింల గురించిన అభిప్రాయాలను తెలుసున్నారు. తన జీవితంలో హిందూ ముస్లింల ఐక్యత కోసం పోరాటం చెయ్యాలని నిర్ణయించుకున్నారు. ఒక సభలో ప్రసంగిస్తూ 'హిందూ, ముస్లిం భాయి భాయి...' అంటూ అనర్గళంగా ప్రసంగించారు. ఆమె ప్రసంగాన్ని విన్న ప్రజలంతా... హిందూ, ముస్లిం భాయి భాయి అంటూ నినాదాలు చేశారు.

1942లో 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొని జైలుపాలయ్యారు. 1947లో ఆగష్టు 15న దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారతప్రభుత్వం ఆమెను 'ఉత్తర్ ప్రదేశ్ గవర్నర్ 'గా నియమించింది. భారతదేశం గర్వించదగ్గ వ్యక్తుల్లో సరోజిని నాయుడు ఒకరు. స్వాతంత్ర్య సముపార్జనలో తనదైన పాత్ర పోషించారు. అనేకుల ప్రశంసలు పొందారు. ఈమె 1949 మార్చి 2 న లక్నోలో కన్నుమూశారు.

## 2. 2. 6. దుర్గాబాయి దేశముఖ్:

దుర్గాబాయి 1909 జూలై 5న రాజమండ్రి లో జన్మించారు. తల్లి కృష్ణవేణమ్మ, తండ్రి రామారావు గారు. దుర్గాబాయి ప్రతిభ పాటవాలు కలిగిన అమ్మాయి. బాల్యంలోనే హిందీలో పాండిత్యం గడించారు.

స్వాతంత్ర్యానికి పూర్వం భోగం మేళాలు ఎక్కువగా ఉండేవి. దేవదాసీల జీవితం దుర్భరంగా ఉండేది. వారే కాకుండా ముస్లిం మహిళలు కూడా సంప్రదాయాలకు బానిసలై, బయట ప్రపంచంతో సంబంధం లేకుండా ఉండేవారు. వారి జీవితాలకు వెలుగు చూపాలని ఆమె నిర్ణయించుకుంటారు. కేవలం స్త్రీల కోసం ప్రత్యేక సభ ఏర్పాటుచేసి, ఆ సభలో గాంధీజీతో ఉపన్యాసం ఇప్పించారు. గాంధీజీ ఉపన్యాసం అనేక మంది స్త్రీల మెదళ్లలో కొత్త కొత్త ఆలోచలనలను పుట్టించింది. ఆ తరువాత కాలంలో వారు దేశం కోసం అనేక త్యాగాలకు పూనుకునేటట్లు చేసింది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఆమె ఎన్నో ముఖ్యమైన పదవులు విజయవంతంగా నిర్వహించారు. 1953లో ప్లానింగ్ కమీషన్ మెంబరుగా, 1953లో సెంట్రల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ గా పదేళ్లు పనిచేశారు. ఆ సమయములో కేంద్ర ఆర్థికశాఖామంత్రి అయిన చింతామణి దేశ్ ముఖ్ ని వివాహం చేసుకున్నారు.

కేంద్ర సంక్షేమ సంఘం అధ్యక్షురాలిగా ఆమె అవిశ్రాంతంగా కృషిచేశారు. 1963లో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్ ఇవ్వడం జరిగింది.

ఆంధ్ర మహిళాసభ కార్యక్రమాలు క్రమక్రమంగా విస్తరించాయి నర్సింగ్ హోమ్, ఆర్థోపెడిక్ సెంటర్, శిశు విహార్, నర్సెస్ హాస్టల్... మొదలైనవన్నీ ఆమె సేకరించిన విరాళాలతో వెలిసాయి. దాదాపు 23 సంస్థలకు మూలకారకులయ్యారు.

దేశ్ ముఖ్ దంపతులు తమ ఆస్తిపాస్తు లన్నింటినీసేవా సంస్థల స్థాపనకు విరాళంగా ఇచ్చారు. వారి 26 ఏళ్ళ దాంపత్య జీవితం సేవామయంగా సాగింది.

బెనారస్ యూనివర్సిటీ నుండి మెట్రిక్యులేషన్ పాసై అక్కడే ఇంటర్మీడియట్ పాసై , ఆ తరువాత బిఏ పూర్తిచేసి మద్రాసు లా కాలేజీలో బి.ఎల్ పట్టాపుచ్చుకున్నారు. సివిల్ మరియు క్రిమినల్ కేసులను చేపట్టి బాగా పేరు సంపాదించారు. ఆమె ప్రతిభాసామర్థ్యాలను గుర్తించిన నాయకులు ఆమెను రాజ్యాంగసభ సభ్యురాలుగా ఎన్నుకున్నారు. డాక్టర్ అంబేడ్కర్, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, బి.ఎస్. లావు వంటి ప్రముఖులతో కలిసి ప్రాథమిక హక్కులు, స్త్రీలకు ఆస్తిహక్కు మొదలైన అంశాలను రాజ్యాంగంలో చేర్పించారు. 1950 తర్వాత ఆమె సాంఘిక రంగంలో ప్రవేశించారు.

ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం, స్త్రీలకు కూడా కఠిన కారాగారశిక్ష విధించేది. దుర్గాబాయిని జైలులో ఉంచినపుడు జైళ్లలో జరిగే పోరాటాలకు నాయకత్వం వహించేవారు. తన తోటి మహిళాఖైదీలకు ధైర్యం చెప్పి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి స్వాతంత్ర్యం గురించి చెప్పేవారు. అందువల్ల ఆమెను జై ల్లో ఉన్న ఇతర స్త్రీల నుండి వేరు చేసి, రాయవేలూరు నుండి మధురై జైలుకు పంపించారు. మధురై జైలులో ఆమె ఒంటరిగా కారాగారశిక్ష అనుభవించారు.

ఒకసారి మద్రాసు బీచ్ లో బులుసు సాంబమూర్తి గారిని పోలీసులు లాఠీతో కొడుతుండగా దుర్గాబాయి ఆయనపై పడి, 'మా నాయకుణ్ణి కొట్టవద్దు, కొట్టాలనుకుంటే నన్ను కొట్టండి' అని అడ్డుపడి, ఆ లాఠీ దెబ్బలు తిన్నారు. ఈ సంఘటన అక్కడున్న వారందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. 1930లో మద్రాసులో జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని వేలూరు, మధురై జైళ్ళలో శిక్షను అనుభవించారు. 1937లో మద్రాసులో 'లిటిల్ లేడీస్ ఆఫ్ బృందావన్' అనే సంస్థను స్థాపించారు. ఆ సంవత్సరం తరువాత దానిని "ఆంధ్ర మహిళాసభ" గా మార్చి మహిళాభ్యుదయానికి ఎంతో పాటుపడ్డారు. "ఆంధ్ర మహిళ" అనే పత్రికను స్థాపించారు. అనాథలకూ, వికలాంగులకు సేవచేశారు.

## 2. 2. 7. అహల్యా రంగ్నేకర్:

"పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది" అన్న ఆర్యోక్తికి అహల్యా రంగ్నేకర్ నిలువెత్తు నిదర్శనం. అహల్యా రంగ్నేకర్ 1922న పూణాలో జన్మించారు. తండ్రి త్రయంబక్ రణదివే.

అహల్య పూణాలో చదువుతున్న సమయంలో ఎప్పుడెపుడు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనాలా అని ఎదురుచూస్తుంది సమయంలో బ్రిటిష్ ప్రభుత్వం గాంధీని అరెస్టు చేసింది. ఆయన్ని అరెస్ట్ చేసిన వారానికి గాంధీ కార్యదర్శి అయిన మహదేవ్ దేశాయ్ గుండెపోటుతో అగాఖాన్ కోట జైలులో మరణించారు. మహదేవ్ ఎన్నో ఏళ్లుగా గాంధీజీకి అత్యంత సన్నిహితుడు. ఈ వార్త తెలిసిన వెంటనే అహల్య 20 మంది విద్యార్థులతో కలిసి మౌనప్రదర్శన నిర్వహించారు. దీంతో పోలీసులు వీరిందరినీ అరెస్ట్ చేసారు.

అహల్య, జైలులో ఉండగా తన తోటి స్త్రీల వద్ద నుండి ఆకుపచ్చ, తెలుపు, నారింజరంగు చీరల్ని పోగుచేసి, వాటిని త్రివర్ణ జెండాగా కుట్టి, బొగ్గుతో చరఖా బొమ్మ గీస్తారు దాంతో జాతీయ జెండా పూర్తవుతుంది ఆ విధంగా తయారుచేసిన జాతీయజెండాను అగాఖాన్ జైలులో ఎగరవేయాలనేది వారి ఆశ. అయితే జైలు గోడలు చాలా పెద్దగా ఉండటం వలన ఎక్కడం సాధ్యం కాదు. అక్కడున్న మహిళలంతా ఆలోచించి, మానవ ఆకారంలో పిరమిడ్ నిర్మించి, దానిపై అహల్య, ఇందు అనే అమ్మాయిలను ఎక్కిస్తారు ఆ విధంగా గోడపైకి ఎక్కి, ఎత్తైన ప్రదేశంలో ఆ జెండాను ఆవిష్కరిస్తారు జైలు అధికారులకు తెలిసి, ఆ జెండాను ఊడదీయిస్తారు ఈ కారణంగా వారిని ఏడు రోజులు ఒక చిన్న గదిలో నిర్భందిస్తారు.[2]

అహల్య మొత్తం ఆరేళ్ల జైలు శిక్ష అనుభవించారు. బిఎస్సీ చివర సంవత్సరం చదువుచున్న కాలంలో కాంగ్రెస్ పార్టీ నుండి కమ్యునిస్టు ఉద్యమంవైపు ఆకర్షితులై పార్టీలో చేరారు.

కమ్యునిస్టు పార్టీ ట్రేడ్ యూనియన్లలో ఉంటూనే విమల రణదివే, మాలతి నగార్కర్ వంటి సహచరులతో కలిసి, అహల్య "ప్రగతిశీల మహిళా ఉద్యమానికి" ఆయువు పోశారు. స్వాతంత్ర్యోద్యమంలో పనిచేస్తూనే, స్త్రీల ప్రత్యేక సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు చేశారు. 1943న అహల్య తన సహచరులతో కలసి పారెల్ మహిళా సంఘాన్ని స్థాపించారు.

మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చాక "ప్రగతిశీల మహిళా సంఘాల వేదిక" కు అంకురార్పణ జరిగింది. అఖిల భారత మహిళా కాంగ్రెస్ తో పాటు మరికొన్ని సంస్థలు ఇందులో భాగస్వాములయ్యాయి. మహిళా హక్కుల పరిరక్షణ కోసం 1950లో "హిందూకోడ్ బిల్లు" 1950 రూపు దాల్చింది. ఈ బిల్లుకు మద్దతుగా ప్రగతిశీల మహిళా సంఘం ఉద్యమించింది. అనేక మహిళా సంఘాలు ఈ బిల్లును స్వాగతించాయి. "పారెల్ మహిళా సంఘం" ఈ బిల్లు గురించి విస్తృతంగా ప్రచారాన్ని నిర్వహించింది. ఈ ప్రచారంలో భాగంగా అహల్య, మరికొంతమంది సహచరులతో కలిసి, బొంబాయి నగరంలో ప్రతి వీధివీధి తిరిగి ప్రచారం చేశారు. కొందరు వీళ్లను వ్యతిరేకించారు. కొంతమంది వీళ్లకు వ్యతిరేకంగా ఒక కరపత్రాన్ని కూడా ముద్రించారు. అయినప్పటికీ, ఆ కష్టాలన్నీ భరించి, హిందూకోడ్ బిల్లు కోసం విస్తృత ప్రచారం కల్పించారు.

1980లో 'ఐద్వా' ఏర్పడిన తరువాత ఈ పేరును 'జనవాది మహిళా సంఘం'గా మార్చారు. 2001లో విశాఖపట్టణంలో జరిగిన మహాసభల నుండి, ఆమె ఐద్వాకు పోషకరాలిగా ఉన్నారు.

అహల్యా నిరాడంబరజీవి. నిస్వార్థపరురాలు. తాను నిర్వహించిన ప్రతి పదవిలో కూడా, ప్రజలకు న్యాయంచేశారు. ప్రజలబాధలను తనబాధలుగా భావించి, సమస్యలపై పోరాడేవారు. ప్రజలకోసం ఎంతటి వారితోనైనా గొడవపెట్టుకోవడానికి, అవసరమైతే ఉద్యమించడానికి వెనుదిరిగేవారు కాదు. అంతటి ధైర్యశీలి అహల్య. అంతేకాక, 80సంవత్సరాల భారతదేశ చరిత్రకు ఆమె ప్రత్యక్ష సాక్షి.

## 2. 2. 8. కనక ముఖర్జీ:

కనక ముఖర్జీ తండ్రి సతీష్ చంద్రదాస్ తల్లి నళినీ దేవి. తండ్రి పేరుమోసిన న్యాయవాది. ఈ దంపతులకు కనక ముఖర్జీ మూడో సంతానం. ఈమె మూడేళ్ల వయసప్పుడు తల్లి మరణించింది. అందువల్ల కనక ముఖర్జీ అమ్మమ్మ, తాతయ్యల దగ్గర పెరిగింది. 1937లో మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు

ఒకవైపు కనక విద్యాభ్యాసం సాగుతుండగా, మరోవైపు జాతీయోద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలమది. మాధ్యమిక పాఠశాలలో చదువుతున్నపుడే కనక జాతీయోద్యమంలో భాగస్వాములయ్యారు. తోటి స్నేహితులతో కలిసి కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం స్వీకరించారు. కాంగ్రెస్ లో ఉంటుండగా, మరోవైపు కమ్యూనిస్ట్ తరగతుల్లో పాలుపంచుకున్నారు.

1939న రెండో ప్రపంచ యుద్ధం మొదలైంది. ఒక రోజు ఉదయమే పోలీసులు ఆమె ఇంటిపై దాడిచేసి, కనకతోపాటు, ఆమె చెల్లెలనీ, చెల్లెలి బిడ్డను కూడా అరెస్టు చేశారు. అయితే అరెస్టు చేయడానికి తగిన ఆధారాలు లేకపోవడంతో వారిని విడుదల చేశారు. కానీ కనక, కలకత్తా సమీపంలో నివసించరాదనీ నిషేధాలు జారీచేశారు. అందువలన ఆమె జంషెట్ పూర్ లో ఉంటున్న తన అక్క దగ్గరకు వెళ్ళారు. అక్కడ కూడా పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తరువాత 24 గంటల్లోగా నగరాన్ని విడిచిపెట్టాలని ఆదేశించారు. ఆ సమయంలో 'మనోరమ బాసు' అనే సామాజిక కార్యకర్త వద్దకు చేరి, తరువాత అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. మొదట కలకత్తా లో ఉండి, ఆ తరువాత బొంబాయి చేరుకున్నారు. ఈ సాహస వనితను సరోజినీనాయుడు 'ఆటంబాబు'[3] అని పిలిచేవారు.

కనక ముఖర్జీ మంచి రచయిత్రి, కవయిత్రి, అనువాదకురాలు. అయిదు దశాబ్దాల కాలంలో 40కి పైగా పుస్తకాలు రాశారు. ఇందులో నవలలు, కథలు, కవితలు, బెంగాల్ రాష్ట్ర మహిళా ఉద్యమాల చరిత్ర, మార్క్సు సైద్ధాంతిక గ్రంథాల బెంగాలీ అనువాదాలు ఇందులో ఉన్నాయి. 1998వ సంవత్సరాన కలకత్తా విశ్వవిద్యాలయం కనక ముఖర్జీ సేవలకు గుర్తింపుగా బంగారు పతకాన్ని బహుకరించింది. కనక ముఖర్జీ తన చివరి రోజుల్లో కూడా, సాహిత్యరంగానికి తన సేవలందించారు. గణతంతత్ర మహిళా సమితి ప్రచురిస్తున్న 'ఏక్ సాథే' అనే మహిళాపత్రికకు తన సమయాన్ని వెచ్చించేవారు. ఈ పత్రికలో అనేక వ్యాసాలు రాశారు. కనక ముఖర్జీ తన జీవితాంతం దేశంకోసం నిర్విరామంగా కృషి చేశారు. జాతీయోద్యమంలో తనవంతు కృషిచేసి, పేదప్రజలకు స్నేహహస్తం అందించి, 2005న కన్నుమూశారు.

## 2. 2. 9. అనిబిసెంట్:

భారతదేశంలో ఉన్న ప్రకృతి సౌందర్యం, సహజ సంపద, సంస్కృతి, మొదలైనవన్నీ విదేశీయులను ఎంతగానో ఆకర్షించాయి. ఇలా ఆకర్షించబడి మనదేశానికి వచ్చిన విదేశీయులంతా

తమతమ స్వప్రయోజనాలను నెరవేర్చుకుని మనదేశ సంపదను కొల్లగొట్టుకుని వెళ్ళారు. అయితే దీనికి భిన్నంగా, భారతీయులకే భారతదేశం యొక్క గొప్పతనాన్ని చాటి చెప్పిన మహిళామణి అనిబిసెంట్

భారతదేశంలో పుట్టి, ఈ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడడం అనేది సామాన్య విషయం. అలాకాకుండా ఎక్కడో పుట్టి పెరిగి, చదువుద్వారా లభించిన అంతర్జాతీయ దృక్పథంతో భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడడం అనేది అత్యంత శ్లాఘనీయమైన అంశం . ఇదే అనిబిసెంట్ విషయంలో జరిగింది.

అనిబిసెంట్ 1847 అక్టోబర్ 1న లండన్ లో పుట్టారు. ఐదేళ్ళ ప్రాయంలోనే తండ్రిని కోల్పోయారు. అనేక ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారు. 1881లో నేషనల్ రిఫార్మర్ అనే పత్రికకు సంపాదకత్వం వహించారు. 'బలహీన దేశాలు చేసే న్యాయపోరాటానికి నా గొంతు వినిపించటంతో పాటు కలం కూడా ఉపయోగిస్తా నని' చెప్పారు.

1893లో అనిబిసెంట్ భారతదేశానికి వచ్చారు. మన దేశంలో నాలుగు దశలుగా సేవలందించారు.

1. 1893 -మతవిషయంలో ప్రచారం చేశారు.
2. 1893-1903 -స్త్రీ విద్య కోసం కృషి చేశారు.
3. 1903-13 -సాంఘిక సంస్కరణలపై దృష్టి పెట్టారు.
4. 1913-1933 -రాజకీయాల్లో పాల్గొన్నారు.

అనిబిసెంట్ బాలికలకు పాఠశాలలు, కళాశాలలు ప్రారంభించారు. తద్వారా వారిలో ఉన్న సనాతన ఛాందస భావాలు తొలగించడానికి కృషిచేశారు. 1898లో వారణాసిలో సెంట్రల్ హిందూ కాలేజిని స్థాపించారు. తరువాత కాలంలో బెనారస్ యూనివర్సిటీగా ప్రసిద్ధిలోనికి వచ్చింది. ఈమె మహిళా కళాశాల కూడా నెలకొల్పారు. ఈ స్ఫూర్తితో దేశమంతా ఇలాంటి విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. ఈమె బ్రిటిష్ వారి Y.M.C.A కు ప్రత్యామ్నాయంగా మద్రాస్ లో 'యంగ్ మెన్ ఇండియన్ అసోషియేషన్' అనే సంస్థను స్థాపించారు.

అనిబిసెంట్ 'న్యూ ఇండియా' అనే పత్రికను ప్రారంభించారు. స్వాతంత్ర్య సాధన ప్రచారం కోసం 'స్వపరిపాలన' గురించి అనేక వ్యాసాలు రాశారు. స్వదేశీపాలన సంస్థ ఏర్పాటు గురించి ఒక ప్రైవేట్ మీటింగ్ లో అనిబిసెంట్ వెలిబుచ్చారు. అది క్రమంగా సిద్ధాంత రూపాన్ని దాల్చి, జాతీయోద్యమసాధనలో బలమైన ఆయుధంగా మారింది. ఈమె నేతృత్వంలో మహిళల విముక్తికోసం నిర్మాణయుతమైన ఉద్యమం, స్త్రీల రాజకీయ హక్కుల డిమాండ్ ముందుకు వచ్చాయి. ఈమె

నాయకత్వంలో మన దేశ స్త్రీలు జాతీయఉద్యమంలో చురుకుగా పాల్గొనేలా చేశారు. తన ఉపన్యాసాల ద్వారా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేశారు. ఈమె చేపడుతున్న కార్యక్రమాలు ప్రభుత్వానికి గొడ్డలి పెట్టులా మారాయి. చివరికి ఆమెపై అనేక నేరాలు మోపి, అరెస్టు చెయ్యడం జరిగింది. ఈ అరెస్టుకు వ్యతిరేకంగా దేశామంతటా నిరసనలు జరిగాయి. అనిబిసెంట్ విడుదలయిన వెంటనే స్త్రీల ఓటుహక్కు సమస్యను వెలిబుచ్చి, ఈ సమస్యపై ఆందోళన చేపట్టారు. ఈ సమస్యను మొదటిగా మార్గరెట్ సోదరులు ముందుకు తెచ్చినా క్రియాశీలంగా అనిబిసెంట్ ఉద్యమం ప్రారంభించారు.

అంటరానితనం, స్వదేశీ ఉద్యమ పోరాటంలో స్త్రీల భాగస్వామ్యం, హిందూ ముస్లింల ఐక్యత మొదలైన అంశాలపై ఆమె విశేషమైన కృషిచేశారు. 1920 తరువాత నుండి ఆమె క్రమక్రమంగా రాజకీయాలకు దూరంగా ఉండిపోయారు. తన అవసాన కాలంలో కూడా ఆమె భారతదేశ స్వాతంత్ర్యం వాస్తవం అవుతుందని ప్రగాఢ విశ్వసంతో చెప్పారు. ఆమె 1933 సెప్టెంబర్ 20న కన్నుమూశారు. ఆమె ఆశించినట్లే మనకు 1947లో స్వాతంత్ర్యం వచ్చింది.

భారతీయ స్త్రీల కోసం ఎందరో మహనీయులు కృషిచేసినప్పటికీ అనిబిసెంట్ మాత్రం అటు రాజకీయ, సామాజిక అంశాల్లో ప్రధాన పాత్ర పోషించి, మన దేశానికి ఎనలేని సేవచేశారు. ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం.

## 2. 2. 10. కస్తూరిబా గాంధీ:

భారతీయ స్త్రీకి ఆదర్శవంతంగా నిలిచిన మహిళల్లో కస్తూరిబా గాంధీ ఒకరు. కస్తూరిబాకు 1882 లో గాంధీజీతో వివాహం అయింది. అప్పటి నుండి కస్తూరి బాగాంధీ అయ్యారు. గాంధీజీ కూడా తన భార్య నుండి చాలా నేర్చుకున్నానని, ఆమె సాహచర్యమే తనకు అహింసా విధానంలో ప్రథమపాఠం నేర్పిందని అనేవారు. గాంధీజీతో పాటు కస్తూరిబా కూడా దక్షిణాఫ్రికాలో వివక్షకు గురయ్యారు. తెల్లవారు భారతీయుల పట్ల అవమానకరమైన పద్ధతిలో ప్రవర్తించడం ఆమె ఎన్నోసార్లు అనుభవించారు. 1912లో దక్షిణాఫ్రికాలో ఒక చట్టం ప్రవేశపెట్టబడింది. ఆ చట్ట ప్రకారం "క్రైస్తవ సంప్రదాయం ప్రకారం జరగని వివాహాలన్నింటిని చట్టవిరుద్ధాలుగా" దక్షిణాఫ్రికా హైకోర్టు ప్రకటించింది. అక్కడ నివసిస్తున్న భారతీయులు ఈ చట్టం చాలా అమానుషం అని భావించి, మహిళలంతా ఒక ఉద్యమాన్ని చేపట్టారు. దీనికి కస్తూరిబా గాంధీ నాయకత్వం వహించారు. ఈ ఉద్యమ ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చి, ఆ చట్టాన్ని రద్దుచేసింది.

1915లో గాంధీ, కస్తూరిబా ఇద్దరూ భారతదేశం తిరిగిరావటం జరిగింది. ఆ సంవత్సరంలోనే గాంధీ సబర్మతి ఆశ్రమాన్ని ప్రారంభించారు. కస్తూరిబా కూడా అంటరానితనాన్ని పూర్తిగా విడిచిపెట్టి, గాంధీజీకి పూర్తి సహకారం అందించారు.

పైన పేర్కొన్న మహిళామణులే కాక, ఇంకా ఎంతోమంది స్వాతంత్ర్యోద్యమంలో ఉత్సాహంగా పాల్గొని, అనేక త్యాగాలు చేసి, తమ త్యాగనిరతిని, దేశభక్తిని చాటుకున్నారు.

ఒక సందర్భంలో మన ప్రప్రథమ ప్రధాని అయిన పండిట్ జవహర్ లాల్ నెహ్రూ స్త్రీల త్యాగాలను గురించి చెప్తూ ... 'భారత స్వాతంత్ర్య సముపార్జనలో స్త్రీలు పురుషులతో సమానంగా చేతులు కలిపి, తమ ఇళ్లు, వాకిళ్లని, సంసారాలను వదిలి ఎన్నో త్యాగాలు చేసి స్వాతంత్ర్య ఫలాన్ని మనకు అందించారని... వివరిస్తూ భారత మహిళా లోకానికి ఎన్నో ప్రశంసలు, నివాళులు అర్పించారు'.

మరొక సందర్భంలో డా.కరన్ సింగ్ మాట్లాడుతూ 'ప్రపంచంలో ఏ దేశస్వాతంత్ర్య పోరాటంలో కూడా... మనదేశ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నంత మంది స్త్రీలు, వారంత చైతన్యవంతులు లేనేలేరని' అన్నారు.

ఈ మాటలను బట్టి దేశస్వాతంత్ర్య పోరాటంలో స్త్రీలు ఎంత వీరోచితంగా పాల్గొన్నారో తెలుస్తుంది

## 2. 3. సంస్కరణోద్యమం - స్త్రీలు:

బ్రిటిష్ పాలనలో కొంతమంది భారతీయులు ఆంగ్లవిద్యను అభ్యసించారు. తద్వార వారిలో ఆలోచనాశక్తి పెరిగింది. వారు మనదేశ పరిస్థిని గురించి ఆలోచించడం ప్రారంభించారు. పాశ్చాత్య దేశాల్లోని స్వేచ్ఛ, సమానత్వం మేధావులైన భారతీయులకు విభ్రాంతి కలిగించింది. పరాయి దేశాలవలే మనదేశం అభివృద్ధి చెందకపోవడానికి గల ప్రధాన కారణం 'పరాయి పాలన' అని గ్రహించారు. క్రమక్రమంగా ఆంగ్లేయుల పాలనపై అసంతృప్తిని వ్యక్తం చెయ్యడం ప్రారంభించారు. భారతీయులను ఆంగ్లేయులు అనేక అవమానాలకు గురిచెయ్యడం మూలంగా, భారతీయ సమాజంలో హిందూ పునరుద్ధరణ భావాలు చోటుచేసుకున్నాయి. దీని ప్రభావంవల్ల బ్రహ్మసమాజం, ఆర్య సమాజం మొదలైన సంస్థలు వెలిశాయి. ఈ సంస్థలు తమ భావజాలాన్ని జాతీయ వాదానికి జోడించి, సాంఘిక సంస్కరణల కోసం పాటుపడ్డారు.

'బ్రహ్మసమాజాన్ని' రాజారామ మోహన్ రాయ్, 'ఆర్య సమాజాన్ని' దయానంద సరస్వతి నెలకొల్పారు. వీళ్లు సతీసహగమనం, బహు భార్యత్వం, స్త్రీల పునర్వివాహం, బాల్యవివాహ నిర్మూలన, స్త్రీ విద్య, హిందూపునరుద్ధరణ ప్రచారం చెయ్యడానికి పూనుకున్నారు.

1859 - 1900 మధ్య కాలంలో స్త్రీల పరిస్థితిని మెరుగుపరచాలనే ఉద్దేంతో మహిళా సంస్కరణవాదులు కొందరు కృషిచేశారు. వీరు సంస్కరణ కోసం పోరాడుతూనే జాతీయోద్యమంలో పాల్గొన్నారు. అలాంటి వారిలోసరళాదేవి, మహారాణి తపస్విని, పండిత రమాబాయి, స్వర్ణ కుమారిదేవి, రాణి సువర్ణమయి, రమాబాయి రెనడే, ఫ్రాన్సినా సోతాబ్జి... మొదలైనవారు సమాజ సంస్కరణల కోసం కృషిచేసిన వారిలో ప్రముఖులు. వీరి గురించి తెలుసుకుందాం!

## 2. 3. 1. సరళాదేవి:

సరళాదేవి ఆర్యసమాజ కార్యకర్తగా చాలా చురుకైనపాత్ర పోషించింది. అంతేకాక జాతీయోద్యమంలో కూడా తనదైన పాత్ర వహించింది. బాలికలవిద్య కోసం కృషిచేసింది.

సరళాదేవి మహిళాఉద్యమ నిర్మాణానికి కూడా విశేషమైన కృషిచేసింది. లాహోర్ లో 1910లో 'భారత స్త్రీ మహామండలి' అనే సంస్థను నెలకొల్పింది. అంతవరకు ఉన్న కొన్ని సంస్థలు కులం లేదా మతం ఆధారంగా పని చేసేవి. కానీ ఈమె నెలకొల్పిన మహామండలి మాత్రం కుల, మత రహితంగా, భారత స్త్రీలందరినీ అభివృద్ధిపరచడం కోసం, మహిళలనందర్నీ ఐక్యపరచడం కోసం నెలకొల్పారు. ఈ కుల, మతాలతో సంబంధం లేకుండా పనిచేసే సంస్థ కావున ఈమె అనేక రకాలైన ఒత్తిడులను వ్యతిరేకతలను ఎదుర్కొంది. అయినప్పటికీ భయపడక తన లక్ష్యసాధన కోసం కృషిచేసారు. జలియన్ వాలాబాగ్ హత్యాకాండకు ముఖ్య కారకుడైన జనరల్ డయ్యర్ ను పదవి నుండి తొలగించాలని చేసిన ఉద్యమాల్లో పాల్గొన్న పంజాబీ స్త్రీలలో ఈమె ముఖ్యులు.

## 2. 3. 2. విమల రణదివె:

విమల రణదివె మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా ప్రధానవల్లి గ్రామంలో 1915 న జన్మించారు. విమల ఇల్లు ఎల్లప్పుడూ సంస్కరణోద్యమాలతో ప్రభావితం అవుతూ, అనేకులను ప్రభావితంచేస్తూ ఉండేది. విమలకు స్కూల్లో ఉన్నప్పుడినుండే, స్వాతంత్రోద్యమంలో పాలుపంచుకోవాలనే అభిలాష కలిగింది. మొట్టమొదటి సారిగా గాంధీజీని చూచి, ఆయన ఉపన్యాసం విన్నప్పుడు స్వాతంత్రోద్యమంలో పాల్గొనాలనే కోరిక మరింత బలపడింది. గాంధీ నిరాడంబర జీవితం, ఆయన మాటతీరు విమలను ఆకట్టుకున్నాయి. అందుకే 1930 సంవత్సరాన, తన 14 ఏళ్ళ వయస్సులో స్వాతంత్రోద్యమంలో అడుగుపెట్టారు. విమల తన స్నేహితులతో కలిసి, జాతియోద్యమానికి మద్దతుగా తెల్లచీరల్ని ధరించసాగారు. 15 ఏళ్ళ చిరుప్రాయంలోనే విమల తొలిసారి అరెస్టయ్యారు.

1939 లో కమ్యునిస్టు పార్టీలో చేరి అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. విమల 1943లో అహల్య రంగ్నేకర్, ప్రేమఓక్ అహల్యా ప్రభాసావంత్, పార్వతీభాయ్ భోరే తదితరులతో కలిసి,

పారెల్ మహిళా సంఘాన్ని స్థాపించారు. అఖిల భారత మహిళా నాయకుల కమిటీని కూడా ఏర్పాటుచేశారు. పారెల్ మహిళా సంఘానికి విమల అనుబంధంగా పనిచేయాలని పారెల్ సంఘం నిర్ణయించింది. ఈ సంస్థలన్నీ కలిసి, సంయుక్తంగా అనేక ఉద్యమాలు జరిపి, మంచి ఫలితాలు సాధించారు.

సి.ఐ.టి.యు (సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్) నేతృత్వాన 1970వ సంవత్సరాన తొలి మహిళాకార్మికుల మహాసభ జరిగింది. వివిధ రాష్ట్రాల నుండి విభిన్న రంగాలకు చెందిన 400 మంది ప్రజా ప్రతినిధులుగా దీనికి హాజరయ్యారు. అఖిల భారత మహిళా సమన్వయ కమిటికీ విమల కన్వినర్ గా ఎంపికయ్యారు. అంతేకాక విమల అఖిల భారత అంగనవాడి కార్మికుల సమాఖ్యను స్థాపించారు. దీనికి ప్రధాన కార్యదర్శిగా కూడా బాధ్యతలు నిర్వహించారు.

విమల తన జీవితచరమదశలో కూడా ట్రేడ్ యూనియన్ కార్యకలాపాల్లో మమేకమై పనిచేశారు. వాయిస్ ఆఫ్ వర్కింగ్ ఉమన్ అనే పత్రికకు సంపాదకత్వం వహించారు. చివరివరకు ఏదో ఒక ప్రజాసంక్షేమ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. 1999 జులై 24న తుది శ్వాస విడిచారు.

## 2. 3. 3. సావిత్రి బాయి:

సంస్కరణోద్యమంలో ప్రధానాంశం 'స్త్రీలను చైతన్యవంతుల్ని చేయడం' దీనికి ఉపకరించిన ప్రధాన సాధనం స్త్రీ విద్య. స్త్రీ విద్య గురించి ప్రస్తావించాలంటే అందరికంటే ముందుగా గుర్తు చేసుకోదగిన వ్యక్తి "సావిత్రి బాయి ".

ప్రసిద్ధ సామాజిక కార్యకర్త, మహిళా హక్కుల ఉద్యమకారిణి అయిన సావిత్రి బాయి మహారాష్ట్రలోని నయ్ గావ్ అనే గ్రామంలో, ఒక రైతు కుటుంబంలో 1813 లో జన్మించింది. ఈమెకు తొమ్మిదవ ఏటనే జ్యోతిరావు పూలేతో వివాహమైంది. ఆనాటి సమాజంలో స్త్రీలను కనీసం సాటి మనుషులుగా కూడా గుర్తించేవారుకాదు స్త్రీలను కుటుంబానికి చెందిన ఆస్తులుగా, భౌతిక, లైంగిక, ఆర్థిక ప్రయోజనాలను అందించే యంత్రాలుగా పరిగణించేవారు. సామాజిక జీవితంలో వారికేమాత్రం స్థానం లేదు. అలాంటి పరిస్థితులలో జ్యోతిరావుపూలే సావిత్రిని చదువుకోమని ప్రోత్సహించేవాడు. ఆమెకు మొదటి గురువు జ్యోతీరావే. ఆయన సహాయ సహకారాలతో ఆమె విద్యావంతురాలైంది.

1848లో పూణేలోని ఒక ఇంట్లో పూలే దంపతులు బాలికల పాఠశాలను ప్రారంభించారు. అందులో తొమ్మిది మంది విద్యార్థినులు చేరారు. ఆ పాఠశాల నిర్వహిస్తున్నందుకు అన్ని సామాజిక వర్గాల నుండి తీవ్రమైన వ్యతిరేకత ఎదురైంది. పాఠశాలకు వెళ్ళే దారిలో సావిత్రి బాయి ఎన్నో శారీరక, మానసిక హింసలకు గురయ్యేది. వీధిలో వెళ్తున్నప్పుడు, కొంతమంది ఆమె మీద రాళ్ళు, మట్టి, బురద విసిరేవారు. మరికొంతమంది అసభ్యకరమైన పదజాలంతో ఆమెను ధూషించేవాళ్లు. వారి చర్యలకు

ప్రతిగా ఆమె "నా ధర్మాన్ని నేను నెరవేరుస్తున్నాను. భగవంతుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు" అని పలికేది. పాఠశాలకు వెళ్ళేటప్పుడు పాత చీర ధరించి, తన వెంట మరోచీర తీసుకొని వెళ్లేది. స్త్రీ విద్యను వ్యతిరేకించే ఛాందసవాదులు ఆమెపై చల్లే మట్టి, బురద వలన కట్టుకున్న పాతచీర మురికి అయిపోతే , పాఠశాలకు వెళ్ళాక మరొక చీర కట్టుకొనేది.

"శ్రమించి పని చెయ్యండి, శ్రద్ధగా అధ్యయనం చెయ్యండి, మంచి మార్గంలో నడవండి"[6] అనేది సావిత్రీబాయి నినాదం. స్త్రీ అభివృద్ధికి విద్య, శ్రమ, శ్రద్ధ అవసరం అని ఎప్పుడు చెప్తుండేది తన మాటల ద్వారా, పనుల ద్వారా స్త్రీలను చైతన్యవంతుల్ని చేయడానికి ఎంతగానో కృషి చేసేది. స్త్రీపురుషులు అన్ని విధాలా సమానులే అని, పురుషులకు స్త్రీలు బానిసలు కాదని, స్త్రీలకు విద్య అత్యావశ్యకమని ఆమె బలమైన విశ్వాసం.

క్షురకులు ఇకముందు వితంతువులకు శిరో ముండనం చేయబోమంటూ... ప్రతిజ్ఞ చేసే విధంగా వారిని చైతన్యపరచి, 1860లో ఒక సమ్మెను నిర్వహింప చేశారు.

1863లో పూలే దంపతులు 'అనాథ శరణాలయం' స్థాపించారు. ఈ అనాథలను సావిత్రి ఎంతో ప్రేమగా చూసుకునేది. 1896లో మహారాష్ట్రలో తీవ్ర క్షామం ఏర్పడింది. ఆ కరువులో ఎంతోమంది బాధితులను ఆదుకుంది. ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి, , సహాయ కార్యక్రమాలు, నిధులు మంజూరు చేయించగలిగింది. 1897లో పూణేలో అంటువ్యాధులు విజృంభించాయి. సావిత్రి రాత్రింబవళ్లు రోగులకు సేవ చేయడంవల్ల ఆమెకు ప్లేగు వ్యాధి సోకి, చివరికి 1897 మార్చి 10వ తేదీన కన్ను మూసింది.

ఆనాటి సమాజాన్ని మరి ముఖ్యంగా స్త్రీలను చైతన్యవంతుల్ని చేయడంలో ఆమె ప్రముఖ పాత్ర పోషించారు. ఆమె తన భర్తకు తోడుగా నడవడమే కాక, స్వయంగా గొప్ప విప్లవోద్యమ నాయకురాలు. ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ గొప్ప సృజనశీలిగా, స్ఫూర్తిదాయిగా, తాత్వికురాలిగా, రచయిత్రిగా ఎదిగింది. బడుగువర్గాల పాలిట పెన్నిధిగా నిలిచి, వారి హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయింది.

## 2. 3. 4. పండిత రమాబాయి:

రమాబాయి సనాతన సంప్రదాయ, చాందస బ్రాహ్మణ కుటుంబంలో పుట్టింది. తల్లిదండ్రులు ఈమెకు ఉన్నతవిద్య నేర్పించారు. ఈమెకు దేశంలో వివిధ ప్రాంతాల్లో తిరిగే అవకాశం లభించడంవల్ల అనేక ప్రాంతాల్లోని మహిళల ఆర్థిక, సాంఘిక పరిస్థితులు తెలుసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడింది. రమాబాయి కులాంతర వివాహం చేసుకోవడంవల్ల కుటుంబంలో, బంధుమిత్రుల మధ్య అనేక అవమానాలకు గురైనప్పటికీ భయపడలేదు. ఈమె పూణేలో ఆర్య మహిళాసమాజం నెలకొల్పింది. మరాఠీ ప్రాంతమంతటిలో కూడా దీనికి అనేక శాఖలేర్పడ్డాయి. తన భర్త

మరణానంతరం ఈమె పూణెలోనే ఉండిపోయింది. 1882లో భారత ప్రభుత్వం విద్య విధానాన్ని పరిశీలించడానికి ఒక కమీషన్ వేసింది. స్త్రీవిద్య కూడా అందులో ప్రత్యేక అజెండాగా ఉంది. ఆర్య సమాజంలో ఉన్న 300 వందల మంది మహిళలు ఈ కమీషన్ ను ఆహ్వానించారు. రమాబాయిని ఆ కమిషన్ ముందు స్త్రీలకు విద్య, వైద్య సదుపాయాలు లేకపోవడం వల్ల వారు ఏ విధంగా బాధలకు గురవుతున్నారో వివరించిన తీరు గొప్ప సంచలనం కలిగించింది. ఈ విషయం విక్టోరియారాణి దృష్టికి వెళ్లింది. ఫలితంగా లార్డ్ డఫ్రిన్ ఆధ్వర్యంలో మహిళల వైద్య విద్యకై ఉద్యమం ప్రారంభమైంది.

1889లో బొంబాయి లో "శారద సదనం" ప్రారంభించారు. ఉన్నత కులాల్లో ఉన్న వితంతువులకు ఆశ్రయం కలిపించడం దీని ముఖ్య లక్ష్యం. 1900లో గుజరాత్ లో దుర్భర పరిస్థితి ఏర్పడినప్పుడు ఈమె బాధిత స్త్రీల, బాలికల కోసం ఎంతో కృషిచేశారు. వాళ్లకోసం పాఠశాల నెలకొల్పి, అందులో బోధించడానికి వచ్చే ఉపాధ్యాయుల కోసం 'ఉపాధ్యాయ శిక్షణ స్కూలు' నిర్వహించింది.

రమాబాయి జీవితాంతం స్త్రీల అభ్యున్నతికై కృషిచేసి, 1922లో పరమపదించింది.

## 2. 3. 6. కనుపర్తి వరలక్ష్మమ్మ:

మహిళాభ్యుదయంకోసం తన జీవితమంతా కృషిచేసిన మణిదీపం కనుపర్తి వరలక్ష్మమ్మ. తాను చదువుకోవడమే కాకుండా, తోటి స్త్రీలను కూడా విద్యావంతుల్ని చేయడానికి కృషిచేసిన మహామనిషి. సమాజాన్ని పట్టిపీడిస్తున్న వివిధ సమస్యల్ని అర్థంచేసుకుని వాటి నిర్మూలనకై కృషిచేసిన సంస్కర్త. గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న గొప్ప దేశభక్తురాలు. మహిళాభ్యుదయవాది. జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొంది. స్త్రీల అభ్యున్నతి కోసం 'స్త్రీ హితైషిణి మండలి' ని స్థాపించారు.

ఈ మండలి పేరుకు తగ్గట్టుగానే స్త్రీల యొక్క సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహించేది. ఈ మండలిలో వారం వారం రామాయణ కాలక్షేపం, పత్రికాపఠనం కొనసాగేది. పిల్లలందరిని సమకూర్చి ప్రహసనాలు నాటికలు ప్రదర్శింపజేసేవారు. బాలబాలికలను ప్రోత్సాహపరచడానికి బహుమతులు కూడా ఇచ్చేవారు. అంతేకాక ఈ మండలిలో స్త్రీలకు సంగీతం, కుట్టు మరియు హిందీ నేర్పడం వంటి కార్యక్రమాలు నిర్వహించేవారు. స్త్రీలకు ఓటు హక్కు రాగానే ఇంటింటికి తిరిగి, స్త్రీ ఓటర్ల జాబితాను తయారు చేశారు. స్త్రీలలో విద్య, విజ్ఞానం, సామాజిక విషయాలపట్ల అవగాహన చాలా అవసరమని గ్రహించి, దానికోసం గ్రంథాలయాల నిర్మాణానికి నడుంబిగించారు.

వీటన్నింటికంటే ముఖ్యంగా శారదలేఖల గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. వరలక్ష్మమ్మ గారి రచనలో అత్యంత ప్రసిద్ధికెక్కినవి శారద లేఖలు. ఈ లేఖల్లో కల్పంత అనే ఒక స్నేహితురాలికి శారద ఉత్తరం రాస్తు న్నట్లుగా 'శారద లేఖలు' పేరుతో రాయడం జరిగింది. ఈ ఉత్తరంలో స్త్రీలకు సంబంధించిన అనేక అంశాలు వివరించడం జరిగేది. ఇవి 1928 నుండి 1934 వరకు 'గృహలక్ష్మి' పత్రికలో అచ్చయ్యాయి. ఈ ఉత్తరాలలో మూఢవిశ్వాసాలను ఖండించి, వివిధ సమస్యలపై స్త్రీలకు అవగాహన కలిగించే విధంగా రాసేవారు.

మద్రాసులో ఆకాశవాణి స్థాపించిన తొలిరోజుల్లోనే ఆకాశవాణి వారు వరలక్ష్మమ్మను రేడియో ప్రసంగానికి ఆహ్వానించారు. ఆ ఆహ్వానం మేరకు ఆమె 'స్త్రీలు - పత్రికారచన' అనే అంశంపై ప్రసంగించారు. అది ఆమె మొట్టమొదటి ప్రసంగం. ఆ తరువాత అనేక రేడియో ప్రసంగాలిచ్చి శ్రోతలను అమితంగా ఆకట్టుకున్నారు. ఆ తరువాత కాలంలో విజయవాడలో రేడియోకేంద్రం నెలకొల్పిన నాటినుండి అనేక ప్రసంగాలు, నాటకాలు వెలువడ్డాయి. ఈ విధంగా రేడియో ద్వారా అనేక ప్రసంగాలు చేసి ప్రజలను ముఖ్యంగా స్త్రీలను చైతన్యవంతుల్ని చేశారు.

ఈ విధంగా వరలక్ష్మమ్మగారు తన జీవితకాలాన్నంతా స్త్రీల శ్రేయస్సు కోసం కృషిచేసి, అనేకమంది జీవితాల్లో వెలుగులు నింపి, ఆదర్శమహిళగా నిలిచారు.

## 2. 3. 7. నివేదిత:

"మానవ సేవయే మాధవసేవ" అన్న ఆర్యోక్తి ప్రకారం మానవసేవలోనే తన జీవితాన్ని తరింపచేసుకున్న ధన్యజీవి సిస్టర్ నివేదిత. ఈమె వివేకానందుని శిష్యురాలు.

సిస్టర్ నివేదిత 1867వ సంవత్సరం అక్టోబర్ 28వ తేదీన జన్మించింది. ఈమె అసలు పేరు మార్గరెట్ నోబెల్. తండ్రి పేరు శామ్యుల్ నోబెల్. వీరు సేవానిరాతి, దైవభక్తి గలవారు. తల్లి... తోటిమనిషిని మనిషిగా ప్రేమించే స్నేహశీలి. తల్లిదండ్రుల ఇద్దరి లక్షణాలను సిస్టర్ నివేదిత పుణికిపుచ్చుకుంది. తండ్రిమరణంతో కొంత ఇబ్బందులకు గురయ్యారు. అయినా ఆమె తల్లి నిరుత్సాహపడక తండ్రిలేని పిల్లలకు ప్రేమ, ఆప్యాయతలతో పాటు క్రమశిక్షణకూడా చాలా అవసరమని భావించి, నివేదితను చాలా నేర్పుతో పెంచింది. చక్కటి విద్యను అందించింది.

మార్గరెట్ 17 ఏళ్లకే ఉపాధ్యయురాలిగా జీవితాన్ని ప్రారంభించింది. తన విద్యార్థులు ఆడుతూ, పాడుతూ విద్య నేర్చుకునేటట్లు చేసింది. విద్యార్థుల తల్లిదండ్రులు మార్గరెట్ లోని ప్రతిభను గుర్తించారు తరువాత ఆమె ఆదర్శఉపాధ్యాయురాలుగా పేరొందింది. ఆ సమయంలో భారతదేశంవెళ్లి సేవలందించాలని నిర్ణయించుకుంది.

1892వ సంవత్సరంలో స్వయంగా ఒక పాఠశాలను స్థాపించింది. దానిని అభివృద్ధిలోకి తీసుకురావడానికి ఎంతగానో కృషిచేసింది. 1895లో ఆమె జీవితం ఊహించని మలుపు తిరిగింది. ఆ సంవత్సరంలో ఆమెకు స్వామి వివేకానందతో పరిచయం ఏర్పడింది. ఆయన వేషభాషలకు ఆకర్షితురాలైంది.

ఆయనలో ఉన్న దివ్యతేజస్సుకు ముగ్ధురాలైంది. ఆయన ఉపన్యాసాలపట్ల ఆకర్షించబడింది. భారతదేశంలో స్త్రీలు చదువు లేక మూఢాచారాలతో బంధించబడి, బాల్య వివాహం, సతీ సహగమనం లాంటి దురాచారాలకు బలైపోతున్నారని విని, చలించిపోయింది. 1898 జనవరి 28వ తేదీన భారతదేశంలో అడుగుపెట్టింది. వివేకానంద ఆమెను ఆహ్వానించడానికి కలకత్తా వెళ్ళారు. ఒక శుభముహర్తా న వివేకానంద మార్గరెట్ కు 'నివేదిత' అని పేరు పెట్టారు. అప్పటి నుండి ఆమె 'సిస్టర్ నివేదిత' అయింది.

1899లో దేశమంతటా ప్లేగు మహమ్మారి విజృంభించింది. తద్వారా ప్రజల జీవితాలు చిన్నాభిన్నం అయ్యాయి. ఆ సమయంలో ఈమె బాధితుల పాలిట దేవతలా నిలిచింది. తన స్థితిగతులను మరచి, సామాజిక సేవాకార్యక్రమాల్లో పాల్గొంది. రోడ్లన్ని ఊడ్చింది, మురికి కాల్వలను పరిశుభ్ర పరచింది. రోగ పీడితులకు సేవలందించింది, క్రమశిక్షణ నేర్పింది. రాత్రి పగలు అనే తేడా లేకుండా సేవ చేసింది. దాంతో ఆమె అనారోగ్యానికి గురైంది. అయినా వెనుదిరగక ముందుకు సాగింది.

వివేకానందుని సలహా మేరకు విరాళాలకోసం అమెరికాకు వెళ్ళింది. అక్కడి ప్రజలకు భారతదేశపు ఔన్నత్యాన్ని తెలియజేసింది. దేశప్రజల దైన్యస్థితిని సవివరంగా తెలియచేసింది. ఆమె విశదపరచిన విషయాలు ఆయా దేశప్రజల హృదయాలను హత్తుకోవడంతో ధారళంగా విరాళాలు అందించారు. ఆ విరాళాలు తీసుకుని, తిరిగి భారతదేశం వచ్చి, సేవా కార్యక్రమాలు కొనసాగించింది.

స్వామి వివేకానంద 1902లో మరణించారు. మానవ సేవలో తరిస్తు న్న నివేదిత, వివేకానందుని మరణంతో స్థాణువైపోయింది. ఆయన మరణం ఆమెను చాలా కుంగదీసింది. అయినప్పటికీ మొక్కవోని ధైర్యంతో దుఃఖాన్ని దిగమింగింది. తన గురువు పాదాల సాక్షిగా భరతమాత దాస్యశృంఖలాలను తొలగిస్తా నని ప్రతిజ్ఞ చేసింది. అప్పటి నుండి 'స్వరాజ్య సిద్ధి' కోసం కృషి చేసింది. ఖద్దరు కట్టుకోవడం ప్రారంభించింది. స్వరాజ్య సాధనకోసం పాఠశాలలనే ఆయుధంగా చేసుకుంది. పాఠశాలల విద్యార్థులచే వందేమాతర గీతం పాడించేది. చరఖా సహాయంతో నూలు వడికేది. పిల్లలచేత కూడా వడికించేది. భారతీయ కళలను ప్రోత్సహించింది. తన మాటల ద్వారా స్త్రీలను చైతన్యపరిచేది. స్త్రీలు వివిధ విద్యలు నేర్చుకోవడం ద్వారా తాము ఎదుర్కొంటున్న సాధక బాధకాల నుండి విముక్తి పొందవచ్చని తద్వారా స్త్రీలు ప్రగతి పథంలో పయనించి దేశాభివృద్ధికి పాటుపడవచ్చని

హితబోధ చేసేది. అంతేకాక ప్రజలు కళలు, సాహిత్యం, చరిత్ర సంస్కృతి మొదలైన విషయాల పట్ల అవగాహన పెంచుకుని జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలని ఉద్బోధించేది.

భారతీయులకై నిరంతరం పరితపించింది. అనేక విధాలుగా స్వరాజ్య సాధనలో పాలుపంచుకున్న సిస్టర్ నివేదిత త్యాగానికి, ప్రేమాభిమానాలకు ప్రతిరూపం. బాధితుల పాలిట స్నేహహస్తం ఈమె 1905 అక్టోబర్ 13వ తేదీన శాశ్వతంగా నిద్రించింది.

## 2. 4. తెభాగా ఉద్యమం - స్త్రీలు

భారతదేశం వివిధ జాతుల, మతాల, సంస్కృతుల సమ్మేళనమే కాక వివిధ ఉద్యమాల పోరాటాల నిలయం కూడా. భారతీయ రైతాంగ పోరాట ప్రస్థానంలో 'తెభాగా రైతాంగ పోరాటానికి' ప్రత్యేకస్థానం ఉంది. ఉద్యమ తీవ్రతలోనూ, విస్తృతలోను వర్గవ్యతిరేకత వ్యక్తీకరణలోనూ ఈ ఉద్యమానికి ఒక ప్రత్యేకస్థానం ఉంది. సుమారు అరవైలక్షలమంది రైతులు తమ హక్కుల కోసం ఉద్యమించారు. ఈ ఉద్యమం భూస్వాములకు, కౌలుదారులకు మధ్య జరిగింది. రైతులు తమ హక్కుల కోసం పోరాడారు.

కౌలుదార్లు హక్కుల కోసం ప్రశ్నించడంతో ఈ తెభాగా ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమానికి ముందువరకూ భూస్వాములు ఒక్క పైసా ఖర్చు చేయకుండా, పనిచెయ్యకుండా, పంటలో సగభాగం తీసుకునేవారు. కష్టించి పనిచేసిన కౌలుదార్లకు అన్యాయం జరిగేది.

భూస్వాములు ఎప్పుడంటే అప్పుడు కౌలుదార్లను భూమి నుండి ఖాళీ చేయించేవారు. ఈ పరిస్థితుల్లో తెభాగా ఉద్యమానికి అంకురార్పణ జరిగింది.

### 2. 4. 1. పోరాట నేపథ్యం:

భారతదేశంలో జరిగిన రైతాంగ పోరాటాల చరిత్రంతా భూస్వాములకు, రైతులకు మధ్య జరిగిన వర్గ పోరాటమే. బ్రిటిష్ పాలన నుండే ఈ ఉద్యమాలు తిరుగుబాటు రూపంలో వ్యక్తం అయ్యాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనవి కొన్ని:

1. 1763 - సన్యాసి తిరుగుబాటు
2. 1767 - గజీ తిరుగుబాటు

3. 178586 - బీర్ భూమ్ తిరుగుబాటు

4. 1831 - హాబీ తిరుగుబాటు

5. 1855 - 56 - సంతాల్ తిరుగుబాటు

6. 1856 - భారత ప్రథమ స్వాతంత్ర్య తిరుగుబాటు.

ఈ తిరుగుబాట్లు జరుగుతున్న క్రమంలో 1765లో ఈస్టు ఇండియా కంపెనీ బెంగాల్ రాష్ట్ర పాలనను చేపట్టి 1793లో శాశ్వత భూమి హక్కులు ఏర్పరచి, భూస్వామ్యులకు మరింత లబ్ధిని చేకూర్చింది. ఫలితంగా రైతాంగం మరింత దోపిడికి, అణచివేతకు గురైంది. ఈ అసంతృప్తుల వెల్లువ నుండి ఉద్భవించినవే తెభాగ, తెలంగాణా ఉద్యమాలు. బ్రిటీష్ పాలకులు రైతుల హక్కులను తీసివేసి, శాశ్వతభూమి హక్కుల సెటిల్ మెంట్ ఏర్పరచడం ద్వారా ఒక కొత్త భూస్వామ్య వర్గాన్ని సృష్టించారు. ఈ విధానం ప్రజలను తీవ్ర అసంతృప్తికి గురిచెయ్యడం గమనించిన ప్రభుత్వం 1859లో 'భూమి కౌలు' చట్టాన్ని చేసింది. ఈ చట్టం ద్వారా ఒకే భూమిని అనేక సంవత్సరాలుగా సాగుచేస్తు న్న రైతులు ఏ హక్కులు లేకుండా పాత స్థితిలోనే ఉండి పోయారు. ఆ తరువాత 1885లో కౌలుదారు చట్టాన్ని సవరించి, మెజారిటీ రైతాంగానికి వర్తింపచేశారు

1929లో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానంలో తలెత్తిన సంక్షోభంవల్ల వ్యవసాయ ఉత్పత్తుల ధరలు ఘననీయంగా తగ్గిపోయాయి. దాంతో రైతుల పరిస్థితి మిక్కిలి దుర్భరమైపోయింది. అందువల్ల పేదరైతులు తమకున్న కొద్ది భూమిని తిరిగి భూస్వాములకు అమ్ముకోవడం జరిగింది. దాంతో పరిస్థితి మరల మొదటికొచ్చింది.

1939లో రెండవ ప్రపంచయుద్ధ సమయంలో ధాన్యాన్ని భారీ మొత్తంలో నిల్వ చేయ్యడం వల్ల, బ్లాక్ మార్కెటింగ్ పెరిగింది. అందువల్ల ద్రవ్యోల్బణం ఏర్పడి, ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. 1943లో బియ్యంధర ప్రపంచయుద్ధం ముందున్న ధర కంటే ఇరవై రెట్లు పెరిగింది. కుటుంబాన్ని పోషించుకోవడానికి రైతులు తమకున్న సమస్తాన్ని, అంటే... చివరకు వంటపాత్రలను సహా అమ్ముకున్నారు. గ్రామాల్లో ఎలాగు అన్నం దొరకడం లేదు, నగరాలకు పోతే కనీసం గంజినీళ్ళన్నా దొరుకుతాయి అనే ఉద్దేంలో అనేక మంది పల్లెల్ని వదిలి, నగరాలకు వలస వెళ్ళారు. 1943 బెంగాల్ లో ఏర్పడిన కరువులో దాదాపు 30 లక్షలమంది చనిపోయారు. భూస్వాములు మరింత ధనవంతులయ్యారు. పేదలు, నిరుపేదలు మరింత దరిద్రులయ్యారు. సంపద మొత్తం వడ్డీవ్యాపారుల, భూస్వాముల చేతుల్లోకి వెళ్లిపోయింది. ఆ కాలం నాటి రెవన్యూ రికార్డుల ప్రకారం భూముల అమ్మకాలు 15 రెట్లు పెరిగాయి.

ఈ కరువు కాలంలో తమకున్న సమస్తం అమ్ముకున్న రైతులు నిరాశ్రయులుగా మిగిలారు. రైతులను భూముల నుంచి ఖాళీ చేయించడంతో పాటు, పంటలేని కాలంలో ధాన్యం ఇచ్చి, పంటల కాలంలో రెట్టింపు ధాన్యం వసూలు చేసే పద్ధతి ద్వారా రైతులపై దోపిడి పెరిగింది. దీంతో పాటు భూస్వాములకు ముడుపులు చెల్లించాల్సివచ్చేది. కష్టపడి పండించిన రైతులకు ... పండిన పంటలో నామమాత్రపు భాగం మిగిలేది. తద్వారా రైతు కుటుంబాలు ఆకలితో అలమటించేవి. ఈ రైతులు క్రమక్రమంగా సంఘటితమై తెభాగా ప్రజాపోరాటంగా అవతారమెత్తా రు

## 2. 4. 2. బెంగాల్ గ్రామీణ స్త్రీలపై అణచి వేత:

బెంగాల్ గ్రామీణ స్త్రీలు ఒక వైపు భూస్వామ్య వర్గాల ఆర్థికఅణచివేతకు గురవుతూనే పురుషాధిపత్య వ్యవస్థకు తలవంచాల్సి వచ్చేది. వారు సాంఘిక ఉత్పత్తిలో పాల్గొన్నా, ఆర్థిక పరమైన క్కులు ఉండేవి కావు. పరిస్థితులు ఎలాఉన్నప్పటికీ అన్ని పనులు సక్రమంగా నిర్వర్తించాల్సిన బాధ్యత వారిపై ఉండేది. ఈ పరిస్థితి ఒక బెంగాల్ స్త్రీలకే కాక దాదాపు భారతీయ స్త్రీలందరి పరిస్థితి ఇదే అని చెప్పడం అతిశయోక్తి కాదు.

స్త్రీలు అటు భూస్వాములు, ఇటు భర్తలు మొత్తంగా పురుషాధిక్య సమాజ పీడనకు గురయ్యేవారు. డబ్బుకు, ఆస్తికి బదులుగా స్త్రీలను మారకం చేసే అమానుషమైన వివాహవ్యవస్థలో వారు తమ భర్తలకు ఆస్తు లుగా మారారు. భూస్వాముల చేతుల్లో లైంగిక దోపిడీకి గురయ్యేవారు. రైతులకుటుంబాల్లో జరిగే పెళ్లిళ్లలో కూడా భూస్వాములు కల్పించుకొని కొత్త పెళ్లికూతుర్ల పై తమ హక్కును ప్రకటించుకునేవారు. ఈ కారణాలన్నింటి మూలంగా స్త్రీలు తెభాగా ఉద్యమంలో అసమానత్వానికి, అణిచివేతకు వ్యతిరేకంగా తమదైన పాత్ర పోషించారు[7].

## 2. 4. 3. పోరాటం వెనుక చైతన్యవంతమైన కృషి:

బెంగాల్లోని గ్రామీణ రైతాంగం భూస్వాముల పీడనకు గురవుతున్న కాలంలోనే, అంటే... 1936లో కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం కింద 'అఖిలభారత రైతుసంఘం' ఏర్పడింది. 1937లో బంకురా జిల్లాలో ఒక సమావేశంలో బెంగాల్ రైతు సంఘం ఏర్పడింది.

ఈ సంఘం ఈ కింది మూడు డిమాండ్లను ప్రధానంగా పేర్కొంది.

1. భూస్వామ్య వ్యవస్థను రద్దు చేయాలి.
2. రైతుల అప్పులను రద్దు చేయాలి.
3. పాలి రైతులకు పంటపై హక్కు కల్పించాలి.

ఇదే సమయంలో భూస్వాములు అక్రమంగా కౌలు వసూలు చేస్తున్నారని వసూలు చేసిన కౌలు, ప్రభుత్వానికి సరిగా అప్పగించడంలేదని, భావించి జమిందారీ విధానాన్ని మార్చాలనే ప్రయత్నం ఆరంభమైంది. బెంగాల్, బీహార్ ఒరిస్సా ప్రాంతాల్లో భూస్వాముల ఆదాయాన్ని లెక్కకట్టి ఆ నివేదికను ప్రభుత్వానికి అందించేందుకు 1940లో బ్రిటిష్ ప్రభుత్వం 'ఫ్లవుడ్ కమీషన్'ను నియమించింది. ఈ నివేదిక ప్రకారం ప్రభుత్వమే భూమి హక్కును దాఖలు పరచుకుని, రెవెన్యు వసూలు చేయాలని డిమాండ్ చేసింది.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం 1943లో వచ్చిన కరువు మొత్తం ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయడంతో రైతులు క్రమంగా భూస్వామ్య, వలసవాద వ్యతిరేక పోరాటల్లో ఏకం కావడం ప్రారంభించారు. ఈ పరిస్థితులల్లో 1946లో కుల్నా జిల్లాలో జరిగిన ప్రాంతీయ రైతుసభ కౌలుదారుల హక్కుల కోసం డిమాండ్ చేసింది. ఆ ఏడాదే సెప్టెంబరులో ప్రాంతీయ రైతు మండలి తెభాగా హక్కును... వచ్చే పంటకాలం నుంచే పోరాటాల ద్వారా అమలు చెయ్యాలని ప్రకటించింది.

## 2. 4. 5. మహిళాభాగస్వామ్యం:

తెభాగా పోరాటంలో అమరులైన వారిలో ముప్పై 30 శాతం స్త్రీలే ఉన్నారంటే, పోరాటంలో మహిళల భాగస్వామ్యం ఎంతఉందో అర్థంచేసుకోవచ్చు.

సంవత్సరమంతా రైతు కష్టించిపనిచేసి, వచ్చిన పంటను భూస్వాముల ఇంటికి తరలించవలసి వచ్చేది. తెభాగా ఉద్యమంలో భాగంగా రైతులు తాముపండించిన పంటను స్వాధీనం చేసుకోవడానికి పోరాటం చేశారు. ఈ పోరాటం దినాజ్ పూర్ జిల్లా ఠాకూర్ సబ్ డివిజన్ లో రామ్ పూర్ గ్రామంలో 1947 జనవరి 4న ప్రారంభమైంది. ఈ పోరాట ఉధృతి చూసి ప్రభుత్వం తెభాగా చట్టాన్ని తెస్తామని హామీ ఇచ్చింది. జనవరి రెండున కలకత్తా గెజెట్ లో 'బెంగాల్ పాలి రైతుల తాత్కాలిక నియంత్రణ బిల్లు' ప్రచురించబడింది. కాని భూస్వాముల నుంచి వచ్చిన ఒత్తిడివలన అది అమలుకాలేదు. అప్పుడు భూస్వాముల గోదాముల నుండి ధాన్యాన్ని స్వాధీనపరచుకునే కార్యక్రమం ద్వారా పోరాటం యెక్క రెండవ దశ ప్రారంభమయ్యింది.

1946 జనవరి 20న అర్థరాత్రి దినాజ్ పూర్ జిల్లా కాన్పూర్ లో రైతుకార్యకర్తల అరెస్టులు ప్రారంభమయ్యాయి. వెంటనే గ్రామంలోని మహిళలంతా జోసాదా నాయకత్వంలో శంఖం ఊది, వేలాదిమంది రైతులను కదిలించారు. దీనిలో స్త్రీలంతా ప్రముఖపాత్ర పోషించారు. ఆ సమయంలో పోలీసులు జరిపిన కాల్పులలో ఉద్యమానికి నాయకులుగా ఉన్నటువంటి జోసాదా, చియార్ సి సేక్

తో సహా 20 మంది అమరులయ్యరు. వారిలో మహిళా నాయకురాలయిన కౌసల్యారాణి కూడా వీరమరణం పొందింది.

1946 డిశంబర్ 14న దినాజ్ పూర్ జిల్లా రామ్ పూర్ గ్రామంలో దాదాపు వందమంది రైతులు, దీపేశ్వరి అనే మహిళా నాయకురాలి ఆధ్వర్యంలో భూస్వాముల పొలాల్లోని పంటకోయడం ప్రారంభించారు. విజయవంతంగా భూస్వాముల పంటను చేజిక్కించుకున్నారు. కాని మర్నాడే ఒక పెద్ద సాయుధ పోలీసు దళం గ్రామాన్ని చుట్టుముట్టింది. పోలీసులను చూడగానే దీపేశ్వరి గట్టిగా అరుస్తూ ఒక చేతిలో కొడవలి, మరో చేతిలో కర్రతీసుకుని పోలీసులను తరమడం మొదలుపెట్టింది. తర్వాత అక్కడఉన్న ప్రజలంతా ఆమెతో చేతులు కలిపారు. ఊహించని ఈ పరిణామానికి పోలీసులు ఖంగుతిని వెనక్కుతగ్గారు. ఇలాంటి ఎన్నో సాహసకార్యాలు ఆమె విజయవంతంగా నిర్వర్తించారు దీపేశ్వరి కథ ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి వ్యాపించి, ధైర్యానికి ప్రతీకగా నిలిచింది.

బెంగాల్ లోని రాణి శంకయిల్ అనే గ్రామంలోకి పోలీసులు వచ్చి, స్త్రీలతో చాలా అసభ్యకరంగా మాట్లాడారు. వెంటనే అక్కడఉన్న మహిళలు 'భందానీ' అనే మహిళ నాయకత్వంలో పోలీసులను బంధించారు. భందానీ, ఆ బంధించిన ఆ పోలీసుల తుపాకీనే భుజాన వేసుకుని వాళ్లకు కాపలాకాసింది. ఉత్తరబెంగాల్ లోని 'రాజ్ బాన్సి' తెగకు చెందిన స్త్రీలు ఈ తెభాగా ఉద్యమంలో వీరోచితంగా పోరాడారు.

'రాణి శంకయిల్' కి చెందిన మరో మహిళానాయకురాలు జయమణి. ఈమె భూమిలేని ఓ రైతు భార్య. పోలీసులు వచ్చి ఆ గ్రామాన్ని చుట్టుముట్టినప్పుడు జయమణి వారితో ప్రత్యక్షంగా పోరాడింది. తెభాగా ఉద్యమం వెనుకంజ వేసిన కాలంలో కూడా ఈమె రైతాంగ పోరాటానికి ఎనలేని సహాయ సహకారాలు అందించింది.

'దామిని' అనే మరో మహిళ, కాన్పూర్ జిల్లాలో పోలీసుల చేతిలో మరణించింది. దినాజ్ పూర్ జిల్లాలో రైతుసభ నాయకుడు దోమాసింఘాను పోలీసుల చేతిలో నుండి కాపాడటానికి ఏడుగురు మహిళలు ప్రాణత్యాగం చేశారు.

పోరాటపు మూడో దశలో, రైతులు పోరాటంలో కొత్త పుంతలు తొక్కారు. మేమాన్ సింగ్ జిల్లాలో రైతు మహిళ 'రాసమణి' మొత్తం జిల్లాకు నాయకత్వం వహించింది. పోలీసులు ఆమెపై అత్యాచారం చేయబోతే, ఆమె ఆ పోలీసును పొడిచి చంపి, తనను తాను పొడుచుకొని చంపుకుంది.

మిడ్నాపూర్ జిల్లాలో భర్తవేధింపుల నుండి బయటపడ్డ 'బిమలా మాజీ' తెభాగా పోరాటంలో నాయకురాలయ్యింది. కార్యకర్తల్లో అనేకమంది జైళ్ల పాలయినప్పుడు ఆమె ఒక్కతే మొత్తం జిల్లాకు నాయకత్వం వహించి భూస్వామి అయినటువంటి 'రాజ్' ను హతం చెయ్యమని పిలుపునిచ్చింది.

హౌరాజిల్లా హంతాల్ లో జసాదామాయి, సుధామాయి, పరుల్ బాలా, మకాన్ బాలా, సత్య బాల, ఆస్తా బాల నేయబాలా మొదలైన స్త్రీలు పోలీసులతో వీరోచితంగా పోరాడి అమరులయ్యారు.

రైతులపై ప్రభుత్వ అణచివేత పెరగడంతో 1947 మార్చిలో రైతుసభ నాయకత్వం పోరాటాన్ని ఉపసంహరించమని కోరడంతో... సుందనబన్ ప్రాంతంలో "కాక్ ద్వీప్ ఉద్యమం" మరింత ఉధృతమైంది. రైతులను అణచివేయడానికి ప్రభుత్వం ఎంతగా ప్రయత్నించేదో, ఉద్యమం అంత తీవ్రతరమయ్యేది. 1949 సెప్టెంబరులో చందనపూరి గ్రామంలో ముందెన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఒక పెద్ద పోరాటం జరిగింది. రైఫిళ్ళతో వచ్చిన 36మంది పోలీసులను 14మంది రైతాంగ మహిళలు కేవలం వంటింటి బాకులు, చీపుర్లతో ఎదిరించారు. అక్కడ ఒక భూస్వామి ఒక అమ్మాయిని చెయ్యిపట్టుకుని లాగడంతో స్త్రీలంతా ఉగ్రరూపందాల్చి, అతనికి దేహశుద్ధి చేశారు. ఆ మహిళల గుంపులో నిండుగర్భిణి అయిన అహల్య కూడా ఉంది. అప్పుడు పోలీసులు కాల్పులు జరపడం ప్రారంభించి, ఒక్క నిముషంలో ఉత్తమ్మ బతీసి, ఫలేజ అనే స్త్రీలను చంపారు. నిండు చూలాలైన అహల్యను కూడా కాల్చారు. ఒక కసాయిపోలీసు ఆమె గర్భంలోకి బయొనెట్ దింపి గర్భాన్ని నిలువునా చీల్చాడు. అహల్య నేలకొరిగింది. ఆమె గర్భంలో ఉన్న శిశువు "పిడికిలి బిగించి" బయటకు కనిపిస్తు ంది అది చూసిన జనమంతా ఆ పోరాటంలో నూతనోత్సాహంతో పాల్గొనడానికి మరింత సంసిద్ధులయ్యారు.

అనేక ప్రాంతాల్లో జమిందారుల దాడుల నుండి తప్పించుకోవడానికి రైతాంగమహిళలు ఆత్మరక్షణ దళాలను ఏర్పరచుకున్నారు. వాళ్ళకు శిక్షణ ఇవ్వడానికి నళినీ ప్రభాఘోష్ నాయకత్వంలో ఒక శిక్షణా శిబిరం కూడా నిర్వహించారు. "పంటలో అర్థభాగం కాదు, మూడొంతులు కావాలి" అనే నినాదాలతో మహిళలు లాఠీలు తీసుకుని ఉద్యమంలో పాల్గొనేవారు. ఈ పోరాట క్రమంలోనే హుగ్లీ జిల్లా 'బారాకమలాఉరీ' గ్రామంలో అయిదుగురు స్త్రీలు శత్రువులతో పోరాడుతూ నేలకొరిగారు. బెంగాల్ అంతటా రైతాంగ మహిళలు చేసిన ఈ వీరోచిత పోరాటాలు తెభాగా పోరాటాన్ని చరిత్రలో చిరస్థాయిగా నిలబెట్టాయి.

చరిత్ర అందించిన సమాచారాన్నిబట్టి బెంగాల్లో ఉన్న అణగారిన మహిళల జీవితాల్లో ఈ పోరాటమే తొలిసారి చైతన్యాన్ని రలిగించింది. తెభాగా మహా ఉద్యమంలో మహిళల పాత్ర అన్నింటికన్నా వీరోచిత ఘట్టం. ఈ ఉద్యమం బెంగాల్ మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని అణగారిన స్త్రీల నుంచి కార్యకర్తలను నాయకురాళ్లను ఉద్యమకారులను తయారు చేసింది.

తెభాగా ఉద్యమంలో స్త్రీలు శత్రువులతో పోరాడారు. పంటలను స్వాధీనం చేసుకున్నారు. స్త్రీలే అంత వీరోచితంగా పోరాడుతుంటే, ఆ పోరాటం పురుషుల్లో గొప్ప స్ఫూర్తినికలిగించింది.

ఈ విధంగా బెంగాల్ లో జరిగిన తెభాగ ఉద్యమంలో స్త్రీలు అసంఖ్యాకంగా పాల్గొని ఉద్యమాన్ని విజయవంతంచేసి, మహిళాలోకానికే మణిదీపంగా నిలిచారు.

## 2. 5. శ్రీకాకుళ పోరాటం - స్త్రీలు:

శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాటం 1968లో ప్రారంభమయ్యింది. ఈ పోరాటంలో అశేషప్రజానీకం పాల్గొని, తమ ప్రాణాలు ఫణంగా పెట్టి, ఉద్యమం ముందడుగు వేయడానికి తోడ్పడ్డారు. ఈ పోరాటానికి వెంపటాపు సత్యం, ఆదిభట్టు కైలాసం, పంచాది కృష్ణమూర్తి, పంచాది నిర్మల వంటి ఎంతోమంది నాయకత్వం వహించారు. ఈ పోరాటంలో పైన పేర్కొన్న నాయకులతోపాటు, 350మంది వీరమరణం పొందారు. వీరిలో అనేక మంది స్త్రీలు కూడా ఉన్నారు.

శ్రీకాకుళం జిల్లాని భౌగోళికంగా రెండు ప్రాంతాలుగా విభజించవచ్చును.

అవి : 1. కొండ ప్రాంతాలు లేదా ఏజెన్సీ ప్రాంతాలు

2. మైదాన ప్రాంతాలు లేదా తీర ప్రాంతాలు

### 1. ఏజెన్సీ ప్రాంతాలు:

పాలకొండ, పార్వతీపురం, సాలూరు ప్రాంతాలు ఏజెన్సీ ప్రాంతాలుగా పరిగణించబడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా గిరిజనులు నివసిస్తా రు

### 2. మైదాన ప్రాంతాలు:

ఇచ్ఛాపురం, నరసన్నపేట, శ్రీకాకుళం, సోంపేట, టెక్కలి ప్రాంతాలు మైదాన ప్రాంతాలుగా పిలువబడుచున్నాయి.

సోంపేట చుట్టుప్రక్కల దట్టమైన జీడి, కొబ్బరి తోటలతో కూడిన 'ఉద్దానం' మైదాన ప్రాంతానికి సంబంధించి ఉద్యమానికి ఆయువుపట్టుగా ఉండేది. మన రాష్ట్రంలో ఉన్న షెడ్యూలు ప్రాంతాలన్నింటిలోకి శ్రీకాకుళం జిల్లాలో గిరిజన జనాభా సాంద్రత అత్యధికం. వీరిలో ప్రధానంగా సవర, కొండదొర, జాతపు, ముఖదొర, గదబలు మొత్తం జిల్లా గిరిజనుల్లో 70 శాతం ఉన్నారు. వీరిలో సవర, జాతపు తెగలవారు శ్రీకాకుళ ఉద్యమానికి వెన్నెముకగా నిలిచారు.

శ్రీకాకుళ ఉద్యమంలో అజెండాగా నిలిచిన అనేక ఆర్థికసమస్యలు ఎంతమేరకు పురుషులకు సంబంధించినవో అంతేమేరకు స్త్రీలకు సంబంధించినవి కూడా అయ్యాయి. వాటిలో ముఖ్యంగా

సాగుచేసుకునే హక్కు, పోడు వ్యవసాయంచేసుకునే హక్కు, కలప, చింతపండు, వంటచెరకు మొదలైన అటవీ ఉత్పత్తు ల వినియోగం, గిరిజన నేతల చేత గిరిజన భూముల ఆక్రమణ, అక్రమవడ్డీరేట్లు, వెట్టిచాకిరి, గిరిజనులు అమ్మే సరుకుల ధరలు, కొలతల్లో మోసం, మహిళలపై ఫారెస్టు అధికారుల మానసిక, లైంగిక వేధింపులు మొదలైన సమస్యలన్నీ కూడా ఉత్పత్తిలో పురుషులతో పాటు భాగస్వామ్యం కలిగిఉన్న స్త్రీలకు కూడా సంబంధించినవి కావడం వల్ల స్త్రీలు... ఉద్యమంలో చేరడానికి ప్రధాన కారణమైంది. ఇంతవరకు చెప్పిన విషయాలు కేవలం ఏజెన్సీ స్త్రీలకు సంబంధించినవ మాత్రమే, ఇక మైదాన ప్రాంత స్త్రీల గురించి చూద్దాం!

గిరిజన ప్రాంతాలో జరిగిన ఉద్యమంతో పోలిస్తే మైదాన ప్రాంతంలో ఉద్యమతీవ్రత తక్కువ స్థాయిలోనే ఉందని చెప్పవచ్చు. చివరకు సాయుధపోరాట రూపంతీసుకున్న వివిధ ఉద్యమాల్లో గిరిజన స్త్రీలతో పోలిస్తే... మైదాన ప్రాంత స్త్రీలు తక్కువగానే పాల్గొన్నారని చెప్పాలి.

మైదాన ప్రాంతాల్లో వున్న సమస్యలు గిరిజన ప్రాంతపు సమస్యలకంటే భిన్నమైనవి. వ్యవసాయ కూలీలు, పాలేర్ల జీతభత్యాల సమస్యతోపాటు బంజరు భూముల స్వాధీనం, తాకట్టు పెట్టిన భూములను భూస్వాములు అక్రమంగా ఆక్రమించుకోవడం మొదలైన సమస్యలను ఉద్యమంలో ప్రధాన ఎజెండాగా రూపొందించడం జరిగింది.

పై సమస్యలతో పాటు ప్రత్యేకించి స్త్రీలకు సంబంధించిన సమస్యల్లో ముఖ్యంగా స్త్రీలపై భూస్వాములు, వడ్డీవ్యాపారుల లైంగిక వేధింపులు, అప్పుల పాలైన రైతుల కుటుంబంలోని స్త్రీలు ఉన్నతవర్గాలవారి ఇళ్లలో వెట్టిచాకిరీకి పూనుకోవడం మొదలైనవి.

కొన్ని సందర్భాల్లో నిరుపేదలు తాము చేసిన పదిరూపాయల అప్పుకోసం జీవితాంతం వెట్టిపనులు చేసిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అంతేకాక మగవారి తాగుడు వ్యసనం కూడా స్త్రీల క్షోభకు కారణం అయ్యింది. అనేక చోట్ల వడ్డీ వ్యాపారులే సారాయి వ్యాపారం చేస్తూ సారాయిని అప్పుగా ఇచ్చి, మగవాళ్ళను లోబరచుకుని, వాళ్ళ కుటుంబాలను దోచుకునేవారు.

ఈ విధమైన నేపథ్యంలో స్త్రీల ఆర్థిక, సాంఘిక, ప్రతిపత్తి, కుటుంబసంబంధాలు, సాంస్కృతిక ఆచారవ్యవహారాలు స్త్రీలను శ్రీకాకుళ ఉద్యమంలో పాల్గొనేటట్లు చేశాయి.

ఈ పోరాటం మైదాన ప్రాంతంలో సోంపేట, టెక్కలి ప్రాంతాల్లోనూ, ఏజన్సీ తాలూకాల్లో 300 గ్రామాలు విస్తరించి దాదాపు 2లక్షల జనాభాను ప్రభావితం చేయడమే కాకుండా, ఆంధ్రరాష్ట్ర వ్యాప్తంగా బాధితులందరికి గొప్ప ఉత్తేజాన్ని అందించింది. ఈ పోరాటానికి పూర్వమే, ప్రజలు చిన్నచిన్న సంఘాలుగా ఏర్పడి, తమ హక్కులకోసం పోరాటం జరిపారు. ముఖ్యంగా 1960 దశకం ప్రారంభంలో మైదానప్రాంత స్త్రీలు ముఖ్యంగా ఉద్దానప్రాంత స్త్రీలు మహిళా సంఘాలు

ఏర్పరుచుకున్నారు. ఏజన్సీలో 1958 నుండి కూడా కామ్రేడ్ వెంపటాపు సత్యం నాయకత్వంలో గిరిజన సంఘాలు ఏర్పడ్డాయి.

1950 - 60 దశాబ్దం నాటికి, ఆ ప్రాంతలో ఉన్న భూమి సమస్య, కొబ్బరి, జీడి తోటల్లో దళారుల దోపిడి, వడ్డీరేట్లు మొదలైన సమస్యల నుండి విముక్తి కోసం వివిధ సంఘాలు ఏర్పడ్డాయి. అలా ఏర్పడిన సంఘాల్లో స్త్రీలు ప్రధానపాత్ర పోషించేవారు. అలాంటి సంఘాల్లో తెగింపు సంఘం ఒకటి.

## 2. 5. 1. తెగింపు సంఘం:

1960లోనే కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రహి నాయకత్వంలో తెగింపు సంఘం ఏర్పడింది. భూస్వాముల దోపిడీని ఎదురించాలన్నా, స్త్రీలపై జరిగే అత్యాచారాలను అరికట్టాలన్న, ప్రజల సమస్యలను పరిష్కరించాలన్నా, విన్నపాలు, విజ్ఞాపనల ద్వారా సాధ్యంకాదని ప్రజలు గ్రహించారు. తెగించి పోరాడడం ద్వారా మాత్రమే మనల్ని మనం విముక్తి చేసుకోగలమనే లక్ష్యంతో ఆరంభమైందే ఈ తెగింపు సంఘం.

బొడ్డిపాడు, మామిడిపల్లి, రాజం, నీలావతి, మానకపల్లి, మర్రిపాడు, గరుడభధ్రల ప్రాంతాల నుండి సుమారు 70మంది స్త్రీలు తొలిసారిగా ఆ తెగింపు సంఘంలో సభ్యులుగా చేరారు. అలా చేరిన స్త్రీలకు తెగింపు సంఘం నాయకులు వారిని మానసికంగా ధైర్యపరుస్తూ, వారిపై జరిగే అవాంఛనీయ సంఘటనలను వారే ధైర్యంగా ఎదుర్కొనే విధంగా చైతన్యపరిచేవారు. సంఘంలో స్త్రీలు చైతన్యవంతులై, తద్వారా వారి చుట్టుపక్కలవారిని కూడా చైతన్యపరచడం జరిగేది.

తెగింపు సంఘం నాయకత్వంలో సుమారు వందమంది మహిళలు బొడ్డపాడు నుండి పల్లిసారథి వరకు ఊరేగింపు జరుపుతుంటే గరుడభద్ర భూస్వామి అయిన మద్ది కామేసు, అతని అనుచరుడు గరుడభద్ర దగ్గర ఊరేగింపును ఆపి మహిళల దగ్గర జెండాలు లాక్కొని అవమానపరిస్తే కామ్రేడ్ పంచాది నిర్మల భూస్వామిని చెప్పుతో కొట్టింది. అక్కడున్న మహిళలందరు ఆ భూస్వామికి దేహశుద్ధి చేశారు.

1968 నవంబర్ 24న ఉద్దనం గరుడభద్ర గ్రామంలో భూస్వామి మద్ది కామేసు పంటనుకోసి స్వాధీనం చేసుకున్నాడు. ఈ సంఘటనలో దాదాపు 800 మంది ప్రజలు పాల్గొన్నారు. దీనిలో సగం మంది మహిళలే ఉన్నారు. ఈ మొత్తం సంఘటనకు కామ్రేడ్ పంచాది నిర్మల ప్రముఖపాత్ర వహించింది.

అక్కుపల్లి కొంచాడ భూచంద్రరావును హతమార్చిన ఘటనలో అనేక మంది స్త్రీలు పాల్గొన్నారు. కామ్రేడ్ అంకమ్మ సరస్వతి, రమణమ్మ, జయమ్మలు పాల్గొన్నారు.

మానకపల్లికి చెందిన బత్తిన రాముడు అనే ఏజెంట్ ను చంపిన సంఘటనలో ఏడుమంది మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. బాతుపురం షావుకారి అయిన ఒక భూస్వామి ఇల్లు స్వాధీనం చేసుకున్న ఘటనలో 70 మంది పాల్గొంటే, అందులో 7 మంది మహిళాకార్యకర్తలైన కామ్రేడ్ నిర్మల, అంకమ్మ, సరస్వతి, జయమ్మ, రమణమ్మ, చంద్రమ్మ, సారమ్మ పాల్గొని భూస్వామిని చంపారు. అతని దగ్గరున్న అప్పుపద్దుల కాగితాల్ని తగులబెట్టారు. అతని ఇంటిలో దొరికిన 300 తులాల బంగారాన్ని ప్రజలకు పంచారు.

కొండలోగాం, కిల్లాయి కాలనీకి సమీపాన ఉన్న బంజరు గ్రామనికి దళం చేరింది. 300 ఎకరాల భుస్వామి, వందల కొలది గేదె మందలు గల 'సార అప్పన్న'ను హతమార్చిన ఘటనలో కామ్రేడ్ నిర్మల ఎంతో సాహసాన్ని ప్రదర్శించింది. శత్రువు రక్తంలో చేయి ముంచి గోడమీద "విప్లవం వర్ధిల్లాలి" అని నిర్మల రాసింది. అప్పటికే తన సహచరుడు కామ్రేడ్ పంచాది కృష్ణమూర్తి వీరమరణం పొంది మూడు నెలలైంది.

ఈ రకంగా సాయిధ పోరాటంలో మైదానప్రాంత స్త్రీలు, పోరాట ఆరంభం నుండి ప్రముఖ పాత్ర వహించారు.

శ్రీకాకుళ పోరాటం ప్రధానంగా ఆదివాసీ పోరాటం. ఆదివాసీ స్త్రీల కదలిక ఉద్యమం సాయుధరూపంగా మారాక, ఆదివాసీ స్త్రీలు ఉద్యమంలో పాల్గోవడం ఆరంభమైంది. పోడు వ్యవసాయం చేసే హక్కులేక వెట్టిచాకిరీ చేస్తూ దోపిడీకి గురయ్యే గిరిజనులు ఉద్యమంలో అడుగుపెట్టారు.

గిరిజన నేతలైన భూస్వాములు, వడ్డీవ్యాపారులచే గిరిజనుల భూములు ఆక్రమణ, ఉప్పు, కిరసనాయులు మొదలైనవి అరువిచ్చి విపరీతమైన వడ్డీలు వసూలు చేస్తే గిరిజనుల సంపదను దోచుకునే వ్యాపారులు ఒకవైపు, ఫారెస్ట్ అదికారుల వేధింపులు మరోపక్క గిరిజనులను పోరాటానికి పురికల్పాయి.

1967 నాటికి గిరిజన సంఘం అంతటా తన ప్రాబల్యాన్ని పెంచుకొంది. స్త్రీలు సూచనలు, సమావేశాలు, ఊరేగింపులు తదితర కార్యక్రమాల్లో పాల్గొన్నారు. స్త్రీలు, పురుషులతో పాటు సమానంగా అటు వ్యవసాయసాగులో పాల్గొంటూ, ఇటు ఇంటిని తీర్చిదిద్దుకొంటూ, మరోపక్క కుటుంబానికి అన్నిరకాలైన సేవలు అందించేవారు.

స్త్రీలు ఉత్పత్తిలో భాగస్వాములైనప్పటికీ, వారు అనేక రకాలుగా సమాజం ద్వారా, కుటుంబం ద్వారా అణచివేయబడుతుండేవారు. షావుకార్ల చేతిలో, ఫారెస్ట్ అధికార్లు చేసే దోపిడి నుండి విముక్తి పొందాలంటే తప్పనిసరిగా పోరాటం చెయ్యాలి. గనుక స్త్రీలంతా ఉద్యమంలో పాల్గొన్నారు.

1967 అక్టోబర్ 7న మొండెం ఖల్లులో జరిగిన గిరిజన సభకు సుమారు 400 మంది స్త్రీలు ఎర్రచీరలు ధరించి, ఎర్ర జెండాలు పట్టుకుని, విప్లవగీతాలు పాడుతూ వెళ్తూంటే మేడి సత్యం అనే భూస్వామి అనుచరులు స్త్రీలను దుర్భాషలతో అవమానపరిచి, చీరలు చింపేసి, వారి దగ్గర ఉన్న జెండాలు లాక్కున్నారు. కొంత మంది స్త్రీలు వెళ్లి జరిగిన ఈ సంభవాన్ని మొండెం ఖల్లులో జరుగుతున్న సభలో తెలియజేయగా వెంటనే వందల కొలది స్త్రీలు, పురుషులు కలిసి లేవిడికి వెళ్లి అక్కడున్న దుండగులతో వీరోచితంగా పోరాడి, కొంతమంది దుర్మరణం పొందారు. భూస్వాముల మీద, షావుకార్లు మీద, పోలీసు ఇన్ ఫార్మర్ల మీద ప్రజలు అనేక దాడులు చేశారు. ఆస్తుల స్వాధీనం, రుణ పత్రాలను, భూమి పట్టాలను స్వాధీనం చేసుకుని తగలబెట్టడం, గిరిజనుల నుండి దోచుకున్న ధాన్యాన్ని స్వాధీనం చేసుకుని ప్రజలకు పంచడం పార్టీ కార్యక్రమాల్లో భాగంగా సాగింది. మైదాన ప్రాంతంలో జరిగిన సంఘటనలు గానీ, ఏజెన్సీలో జరిగిన పలుపోరాటాలు గానీ ఏదో ఒకరిద్దరి వీరోచిత చర్యలు కాదు, వందల, వేల మంది ప్రజలు సాగించిన ప్రతీకార చర్యలే! వీటన్నింటిలోను స్త్రీలు ఎక్కువగా పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ఆర్మడ్ పోలీసులు ప్రవేశించి గ్రామాలకు గ్రామలనే అరెస్టు చేసి, మిగిలిన వారిని తుపాకీతో పిట్టను కాలిచినట్లు కాలుస్తుంటే పురుషులు భయపడి పారిపోయినప్పటికీ స్త్రీలు ధైర్యంగా నిలబడ్డారు, అంతేకాక ప్రజాసంఘాల నాయకులను కూడా కాపాడగలిగారు. బహిర్భూమికి పోతున్నట్లు చెంబు పట్టుకుని దానిలో అంబలి లాంటి ఆహార పదార్థాలు పెట్టి దళాలకు అందజేసేవారు. కొంతమంది స్త్రీలైతే బియ్యం, పప్పు దినుసులు మొదలైన వాటిని కడుపుకు చుట్టుకుని గర్భిణీ స్త్రీలలా ప్రవర్తించి ఆ వస్తువులను దళాలకు అందజేసేవారు. దురదృష్టవశాత్తు కొన్నిసార్లు పోలీసులకు దొరికిపోతే ఇక వారి బాధ వర్ణనాతీతం. అలా దొరికిపోయిన వారు అవసరమైతే ప్రాణాలైనా త్యాగం చేసేవారే కానీ, దళాలకు సంబంధించిన ఏ విషయాలను పోలీసులకు చెప్పేవారు కాదు.

మల్లివీడు భూస్వామిని చంపిన సంఘటనలో అనేక మంది స్త్రీలు పాల్గొన్నారు. భారతి శత్రు రక్తంలో చేతులు తడిపి, గోడ మీద నినాదం రాసింది. కామ్రేడ్ వెంకటాపు సత్యం నడిపిన సెంట్రల్ దళంలో ఆయన భార్య గున్నమ్మ, కూతురు భారతి కూడ దళ సభ్యురాళ్లు.

శ్రీకాకుళ పోరాటంలో అనేకమంది ధన, మాన, ప్రాణాలను త్యాగం చేశారు. అలా త్యాగం చేసిన వారిలో కొంతమందికి చరిత్రలో పుటల్లో స్థానం దక్కింది. అనేకమంది చరిత్ర పుటల్లో కనిపించకుండా కనుమరుగైపోయారు. వారిలో ప్రధానంగా:

## 2. 5. 2. పంచాది నిర్మల:

అమరులైన స్త్రీలలో తొలుత ప్రస్తావించదగిన స్త్రీ మూర్తి పంచాది నిర్మల. నిర్మల పాలకొండ తాలుకా కావలి గ్రామంలో నిరుపేద కుటుంబంలో జన్మించింది. తన భర్త పంచాది కృష్ణమూర్తి తోడ్పాటుతో చదువు నేర్చుకుని రాజకీయాంశాలపై అవగాహన పెంచుకుంది. పార్టీ నిర్వహించే వివిధ ఉద్యమాలలో పాల్గొనడంకోసం కన్న కొడుకును, కూతురిని వదలి ఉద్యమంలో చేరింది. 1969 డిసెంబర్ 22న కామ్రేడ్ పాణిగ్రహి, అంకయ్య, సరస్వతి, నిరంజన సాహులతో పాటు పోలీసులకు చిక్కి రంగమెటిషు కొండల్లో పోలీసులచే చంపబడింది. ఈమె మరణం పార్టీకి తీరని దు:ఖాన్ని కలిగించింది.

## 2. 5. 3. తెలికల సరస్వతి:

సరస్వతి ఒక పేదరైతు కుటుంబంలో పుట్టింది. అతి చిన్నవయస్సులో ప్రజలకోసం ప్రాణం విడిచిన త్యాగజీవి. ఈమె సాయుధ పోరాటం పిలుపు విని, కామ్రేడ్ పాణిగ్రహి నాయకత్వంలో తెగింపు సంఘంలో చేరింది. పార్టీలో అనేక సాహసో పేతమైన కార్యక్రమాలో చురుగ్గా పాల్గోనేది. 19 సంవత్సరాల వయస్సులో పాణిగ్రహి బృందంతో పాటు, పోలీసుల చేత కాల్చి చంపబడింది.

## 2. 5. 4. దున్న అంకమ్మ:

అంకమ్మ రాజాం గ్రామంలో పేదరైతు కుటుంబంలో పుట్టింది. దళంలో చేరకముందు మహిళా సంఘం కార్యకలాపాలలో పాల్గొనేది. దళంలో చేరడం కోసం భర్తకు దూరమైంది. చురుకైన కార్యకర్త ఈమె కూడా రంగమెటిషు కొండల్లో పోలీసుల చేతిలో చనిపోయింది.

వీరేకాక, బిడ్డిక సుక్కు, నిమ్మక సుక్కులు, కడ్రక పూర్ణ, సవర సెల్జీ, మండంగి సాయమ్మ, సవర సుక్కు, బిడ్డక చంద్రమ్మ, ఆరిక జయమ్మ, ఆరిక గయ, బిడ్డక సురు, కోరంగి సుందరి, పత్తిక సుక్క.... మొదలైన వారెంతో మంది ఈ ఉద్యమంలో పాల్గొన్నారు.

## 2. 5. 5. శ్రీకాకుళ పోరాటం - ప్రతిఫలాలు:

శ్రీకాకుళం పోరాటం ప్రతిఫలంగా మహిళలలో చైతన్యం పెరిగింది. తమ చుట్టూ జరుగుతున్న సంఘటనలకు గల కార్యకారణ సంబంధాలను అంచనావేసి, తమకు జరుగుతున్న అన్యాయాల వెనకఉన్న మూలకారణాలను తెలుసుకుని, వాటిని విశ్లేషించగలిగే స్థాయికి చేరుకున్నారు. అంటే స్త్రీలు ఈ ఉద్యమం ద్వారా సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక అంశాలకు సంబంధించిన ఆలోచన విధానాల్లో మార్పువచ్చింది.

ఈ ఉద్యమానికి ముందు తెల్లబట్టలు వేసుకున్న ప్రభుత్వాధికారులు కనిపిస్తేచాలు పారిపోయేవారు. అలాంటి స్త్రీలు నేడు ఏ అధికారి వచ్చినా ధైర్యంగా వారితో మాట్లాడుతూ, వారి సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించగలుగుతున్నారు. అంతేకాక అధికారులను ఎదిరించి మాట్లాడగలుగుతున్నారు. నేటి ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన సంస్కరణల ద్వారా వారికి కలిగిన సౌకర్యాలను మెరుగుపర్చుకోవడానికి గ్రామాల్లో ఇళ్ళకాలనీలు, స్కూల్ భవనాలు, చెక్ డ్యామ్ లు సాధించుకోవడంలో మహిళలు ప్రముఖపాత్ర వహిస్తున్నారు. వివిధ కూలిపనులకు, తూనికలకు సంబంధించి ఏదైనా అన్యాయం జరుగుతుంటే ప్రజలంతా సంఘటితమై పరిష్కరించుకో గలుగుతున్నారు. 1/70 గిరిజన భూ బదాలాయింపు నిరోధక చట్టం కూడా గిరిజనుల పోరాట ఫలితంగా వచ్చింది.

శ్రీకాకుళ పోరాటం ద్వారా ప్రజానికం మొత్తం సాధించింది ఏమిటని ప్రశ్నిస్తే దానికి సమాధానంగా అడవి మీద తిరిగి అధికారాన్ని పొందగలిగారు. షావుకార్లు మోసంచేసి తీసుకున్న భూములను తిరిగి పొందగలిగారు. "వెట్టి"ని నిర్మూలించగలిగారు. కార్ల్ మార్క్స్ "శ్రామికులారా ఏకం కండి" అన్నట్లు శ్రామికులంతా ఏకమైతే ఏదైనా సాధించవచ్చు అనే విషయాన్ని అనుభవ పూర్వకంగా తెల్సుకోగలిగారు.

## 2. 5. 6. శ్రీకాకుళ పోరాటం - అపజయాలు:

శ్రీకాకుళ పోరాటం ద్వారా ప్రజలు వేటినైతే పొందాలని ఆశించారో, వీటన్నింటిని పొందలేక పోయారనే చెప్పవచ్చు. వీటికి అనేక కారణాలు ఉన్నాయి. శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాటాన్ని వెంగళరావు ప్రభుత్వం అతిక్రూరంగా అణచివేసి, ఆయా పోరాట ప్రాంతాలను రక్తపు మడుగుగా ముంచెత్తివేసింది A.P.S.P, C.R.P.F తదితర సైన్యలను దాదాపు పదివేల మంది పోలీసు బలగాలను ఉపయోగించి, కొండకొండనూ గూడుగూడునూ గాలించి అనేక మంది దళసభ్యులను నిర్ధాక్షిణ్యంగా చంపించింది. అనేక గ్రామాలకు నిప్పంటించి ఇలాంటి పరిస్థితుల్లొ స్త్రీలపై లెక్కలేనన్ని అత్యాచారాలకు గురిచేశారు. దీంతో ప్రజలు వెనుకకు తగ్గారనే చెప్పాలి. ఈ విధంగా ఉద్యమాన్ని ప్రభుత్వం అరాచక కార్యక్రమాలు చేపట్టి అణచివేసింది.

ఉద్యమం ముగిసాక అనేక ప్రభుత్వ సంస్థల పేరుతో అంటే G.C.C., .T.D.A. వంటి పేరుతో, గిరిజనోత్పత్తు లపై గిట్టుబాటు ధరలిస్తా మని షావుకార్ల కంటే ఘోరంగా దోపిడి చెయ్యడం మెదలైంది. గిరిజన ప్రాంతాలన్నింటికి 1/70 భూచట్టం అమలు చెయ్యలేదు. అనేక ప్రాంతాల్లో భూస్వామ్యులతో చేతులు కలిపి మంచి సారవంతమైన భూములను గిరిజనులకు దక్కకుండా చేశారు. ఈ పరిస్థితుల్లో 1990 చివరి నుండి మళ్లీ పోరాటం మొదలైంది. అలా జరిగిన పోరాటాల్లో ముఖ్యమైనవి.

1. కూలీ పోరటం

2. సారా పోరాటం

3. భూ పోరాటం

## 2. 5. 7. కూలీ పోరాటం:

1995లో శ్రీకాకుళం జిల్లాలోని మందస మండలంలో ఉన్న రట్టి, బహడపల్లి గ్రామాల నుంది అనేక మంది స్త్రీలు, ఒకొొక్క విభాగంగా ఏర్పడి ఒక్కొక్క విభాగంలోనూ, ఇరవై మంది చొప్పున, 5 గ్రూపులు పదిరోజులు పాటు ప్రచారంచేశారు. కూలీరేట్లు 15 రుపాయల నుండి 20 రుపాయలకు పెంచుకున్నారు. 1898లో శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలం కొత్తపేట కొమరల్తాడ రామకృష్ణాపురం గ్రామాలలో, మత్సకారుల భూముల్లో అటవీశాఖ వారు సరుగుడు తోటలు పెడితే, 5 రూపాయల కూలీ నుండి 8 రుపాయల కూలీ వరకు డిమాండు చేసి పెంచుకోగలిగారు. ఈ పోరాటం నడిపింది ఓ గ్రామ మహిళా సంఘం కావడం గమనర్హం

## 2. 5. 8. సారా పోరాటం:

1984 నుండి 1991 వరకు సారాకు వ్యతిరేకంగా స్త్రీలు ఎంతో ఉత్సాహంతో పాల్గొన్నారు. సారాను పూర్తిగా నిషేధించాలని 1991 నుండి మహిళలు ఉద్యమించారు. 1992లో శ్రీకాకుళం జిల్లా మందస మండలం రట్టి గ్రామంలో సారాకొట్టు పెట్టడానికి ఒక వ్యాపారి వస్తే ఆ గ్రామ స్త్రీలంతా అతన్ని ఎదిరించారు. తరువాత పోలీసులు వచ్చి, ఆ స్త్రీలను బెదిరించినా అధైర్య పడక ధైర్యంగా నిలబడ్డారు. 1993 అక్టోబర్ లో శ్రీకాకుళం జిల్లా వజ్రపు కొత్తూరు మండలం కోనేలూరు గ్రామంలో 200 మంది మహిళలు సుమారుగా 25 గ్రామాల నుండి వచ్చి సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ, మహిళా సంఘాలు ఏర్పరచుకొని మద్యపాన నిషేదం అమలు చెయ్యడానికి తీర్మానించారు.

గణపతి జిల్లాలోని వివిధ గ్రామాల్లోని స్త్రీలంతా సారా తయారు చేయకూడదనే ఎజెండాతో, సారా తయారు చేసే వాళ్లకు వ్యతిరేకంగా ప్రదర్శనలు నిర్వహించారు. అయినా సారా వ్యాపారులు పట్టించుకోకపోవడంతో ఉద్యమాన్ని ఇంకాస్త ఉధృతం చేసి సారా బట్టీలను తగులబెట్టారు.

1995 జనవరిలో శ్రీకాకుళం జిల్లా మందస మండలం అంబుగాం, లింబుగాం గ్రామాలకు చెందిన 50 మంది మహిళలు పెద్ద ఊరేగింపుగా వెళ్లి సారా తయారు చేయకూడదని, ఆ ప్రాంతమంతా ప్రచారం చేశారు. అయినా కూడా సారా వ్యాపారులు లెక్క చేయకపోవడంతో, స్త్రీలంతా కలసి వెళ్లి కుండల్లో వున్న ఊటను ధ్వంసం చేశారు. అనేక చోట్ల సారా బట్టీలకు నిప్పంటించడం కూడా చేశారు. ఇలా చేస్తుండగా, అడ్డుపడిన సారా వ్యాపారులకు స్త్రీలు చెప్పులతో బుద్ధిచెపారు.

## 2. 5. 9. భూపోరాటం:

శ్రీకాకుళం జిల్లాలో 1991 జూన్ లో వజ్రపుకొత్తూ రు మండలంలో తీరప్రాంత ఫారెస్టు భూములు, తీరవాసులకు దక్కాలని సుమారు రెండు వేలమంది పాల్గొన్నారు. ఆ ఉద్యమానికి కూడా స్త్రీలు పెద్ద ఎత్తు న తరలివచ్చారు. 1991 సెప్టెంబరులో సరుగుడు తోటలు నరికి, సాగుచేసుకుంటున్న తీరప్రాంత భూములకు పట్టాలివ్వాలని సుమారు వెయ్యి మంది ప్రజలు పలాస, వజ్రపుకొత్తు రు ఎమ్.ఆర్.ఓ కు మెమొరాండం సమర్పించారు. నరసన్నపేటలో 1991 లో తీరప్రాంత మత్స్యకారులు, కొయిరిపేట, కొత్తరేవు రాజారంపురం, గుప్పిడిపేట, దారిపేటలకు చెందిన 5 వేలమంది ప్రజలు ఫారెస్ట్ సరుగుడుతుప్పలు నరికి, చాల పెద్ద మొత్తంలో కలప అమ్ముకున్నారు, భూములను ఆక్రమించుకున్నారు. ఈ పోరాటంలో సుమారు వెయ్యి మంది మహిళలు పాల్గొన్నారు.

1993లో శ్రీకాకుళం జిల్లా భూమిని మండలం తోట్మనుగూడు గ్రామస్తు లు 45 కుటుంబాలవారు, ఏడు ఎకరాల పల్లపు భుమి కోసం పోరాటం చేసి ఆక్రమించుకున్నారు. దీనిలో సుమారు 2 వందలమంది మహిళలు పాల్గొన్నారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం ఏజన్సీ గ్రామాలైన కొత్తూ రు సింగపురం, సాబకోట తదితర 20 గ్రామాల్లో ఉన్న దేవాలయ భూములు అనేక సంవత్సరాలుగా భుస్వాములు, పెత్తందారుల ఆధీనంలో ఉండేవి. ఆదివాసీ రైతుకూలీ సంఘం నాయకత్వంలో 500 మంది ప్రజలు కలిసి మందస అనే ప్రాంతంలో పెద్ద ఊరేగింపు జరిపి, సుమారు 100 ఎకరాల దేవాలయ భుములు ఆక్రమించుకోవడం జరిగింది. ఆక్రమించుకున్న ఆ భూములకి పట్టాలివాలని డిమండ్ చేశారు[9]. 1990 నుండి 1994 వరకు ఈ పోరాటం జరిగింది. ఫలితంగా ప్రజలకు 500 ఎకరాల భూమిని పంచడం జరిగింది.

శ్రీకాకుళం జిల్లాలో ఉన్న అనేక మంది భూస్వాములు, ప్రజల యొక్క ధన, ప్రాణ, మానలను అనేక రకాలుగా దోచుకున్నారు. అలాంటి వారిలో కూర్మినాయుడు ఒకడు. ఇతడు రణస్థలం మండలంలోని జేరుపాలెం జగన్నాథపురం గ్రామానికి చెందినవాడు. ఇతడు సుమారుగా 15 సంవత్సరాలుగా తీరప్రాంత మత్స్యకారులను ఆర్థికంగా, రాజకీయంగా, లైంగికంగా దోపిడి చేస్తూ ప్రజలమీద అనైతిక పెత్తనం చలాయించేవాడు. వాడి దౌర్జన్యాలను అరికట్టాలని ప్రజలంతా సంఘటితమై అతనిపై పోరాటం చేశారు. ప్రజలనుండి అన్యాయంగా దోచుకున్న భూములన్నీ తిరిగి ఇవ్వాలని, స్త్రీలను అవమానపరచి, వారిపై చేసిన ఘోరకృత్యాలకు క్షమాపణ చెప్పాలని కూర్మినాయుడునిని ప్రజలముందుకు ఈడ్చుకొచారు. ఈ పోరాటంలో రెండువేల మహిళలు పాల్గొన్నారు.

ఈ పోరాటం మిగిలిన దుర్మార్గ భూస్వాములకు వణుకుపుట్టించింది. సామాన్య ప్రజలు తలుచుకుంటే ఏమైనా చేయగలరు అనే అభిప్రాయానికి వచ్చి, అపటి నుండి భూస్వాముల అరాచకాలు కొంచెం తగ్గుముఖం పట్టాయి.

శ్రీకాకుళ ఉద్యమం ఒరిస్సా రాష్ట్రంపై కూడా ప్రభావాన్ని చూపడం జరిగింది. గజపతి జిల్లా గుసానిబ్లాకులోని రైతాంగం 1993 నుండి సంఘటితం కావడం ప్రారంభించారు. ఒరిస్సా రాష్ట్రంలోని సామాన్య రైతులు తమ సమస్యలపై చర్చించుకోవడం, వాటిని పరిష్కార దిశగా ఆలోచించడం ప్రారంభించారు. ఒరిస్సాలోని మహిళలు కూడా ఇలాంటి సమావేశాలలో పాల్గొనడం గమనార్హం.

శ్రీకాకుళ ఉద్యమం ఇచ్చిన చైతన్యం స్త్రీలను మరింత ధైర్యవంతులుగాచేసి, వారు వివిధ రంగాల్లో పాల్గొనేటట్లు చేసింది. ఒకప్పుడు ఇంటిగడప దాటడానికి భయపడిన మహిళలు, నేటి కాలంలో వాళ్ల సమస్యలు వాళ్లే పరిష్కరించుకుకోగలగడం గమనార్హం.

## 2. 6. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం - స్త్రీలు:

1946 నుండి 1951 వరకు తెలంగాణా వీరోచిత సాయుధ రైతాంగ పోరాటం జరిగింది. దీనిలో పురుషులతో పాటు స్త్రీలు కూడా అసంఖ్యాకంగా పాల్గొన్నారు. అంతవరుకు 'నీ బానిసను దొరా! నీ కాలికి మొక్కుతా' అని నిజాం పాదాలు మొక్కిన స్త్రీలు, నిజాం అరాచకాలను భరించలేక తెలంగాణా సాయుధ పోరాటానికి శ్రీకారం చుట్టారు. మొదటిగా ఉద్యమ నేపథ్యం గురించి తెలుసుకుందాం!

తెలంగాణ సాయుధ పోరాటాన్ని గురించి తెలుసుకునే ముందు తెలంగాణ పరిపాలన, చారిత్రక పరిస్థితులు తెలుసుకోవడం ఎంతైన అవసరం.

బ్రిటిష్ ప్రభుత్వం మన దేశాన్ని పరిపాలిస్తు న్న కాలంలో మన దేశంలో అనేక సంస్థానాలుండేవి. అలాంటి వాటిలో హైదరాబాద్ ఒకటి. ఈ సంస్థానం మన దేశంలో ఉన్న అన్ని సంస్థానాల కంటే పెద్దది. మొఘల్ చక్రవర్తి అయిన షాజహాన్ చేత డెక్కన్ సుబేదార్ గా నియమించబడిన నిజాం ఉల్ ముల్కు ఖమ్రుద్దాన్ 1724లో స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు.

బ్రిటిష్ వారు క్రమ క్రమంగా ఒక్కొక్క ప్రాంతాన్ని ఆక్రమించుకుంటున్న కాలంలో నిజాం... బ్రిటిష్ వారితోఅంగీకారానికి వచ్చి మహారాష్ట్రలోని బేరార్ మరియు కోస్తా, రాయలసీమ జిల్లాలను బ్రిటిష్ వారికి అప్పగించాడు. ఆ తరువాత ప్రస్తు తం తెలంగాణలో 8 జిల్లాలు, మహారాష్ట్రలో 5 జిల్లాలు, కర్నాటకలోని 3 జిల్లాలు కలిపి ఒక సంస్థానంగా ఏర్పడింది. అదే హైదరాబాద్ సంస్థానం.

1951 నాటికి తెలంగాణ ప్రాంతపు జనాభా సుమారు కోటి 20 లక్షలు తెలంగాణాను 3 సుభాలుగా విభజించి నిజాం పాలించే వాడు సుభాకు ఒక అధికారి ఉండేవాడు. అతన్ని సుభేదార్ అనే వారు. జిల్లాకు తాలూకాదార్లు, తాలూకాలకు తహసీల్దారులు అధికారులుకు ఉండేవారు.

హైదరాబాద్ సంస్థానంలో భూమి 3 రకాల యజమానులు కింద ఉండేది.

1. దివాని లేదా ఖల్సా ప్రాంత భూమి

2. జాగిర్దారి భూమి

3. సర్వేఖాస్ భూమి

### 2. 6. 1. దివాని:

దివాని లేదా ఖల్సా ప్రాంత భూమి 60% ఉండేది. రైతులు రాజుకి శిస్తు చెల్లించి, సాగుచేసుకునేవారు. పంటలు పండాయా లేదా అనే దానితో సంబంధం లేకుండా శిస్తు వసూలు చేసే వారు. పంటలు పండకపోయినా నిర్బంధంగా శిస్తు వసూలు చేయడం వల్ల అనేకమంది ఊరు వదిలి పారిపోయేవారు. అలాంటి వారిని కూడా తిరిగి తీసుకువచ్చి, అనేక హింసలకు గురిచేసేవారు. దివాని నుండి వచ్చిన ఆదాయాన్ని సైన్య పోషణకు, పరిపాలనకు ఉపయోగించేవారు.

### 2. 6. 2. జాగిర్దారీ భూమి:

జాగిర్దారీ భూమి 30% ఉండేది. ఈ భూములు నిజాం పాలనకు రక్షకులుగా ఉంటూ సేవలందించే పైగాలు, సంస్థానాదీశులు, జాగీర్దార్లు, ఇజానాదార్లు, బంజరుదార్లు, మక్తేదార్లు ఈనాందార్లు, అగ్రహారికుల పేర్లతో పిలవబడే దొరలు లేదా పెత్తందార్ల చేతిలో ఉండేది. ఆ భూముల నుండి వచ్చే ఆదాయమంతా వీరే అనుభవించేవారు. ఎపైనా ప్రత్యేక సందర్భాలు వస్తే రాజుకు కొన్ని బహుమతులు పంపేవారు. అయితే ఈ విధానం ఐచ్ఛికంగానే వుండేది. నిర్బంధం ఏమీలేదు.

### 2. 6. 3. సర్వేఖాస్:

సర్వేఖాస్ భూమి 10% ఉండేది. అది సుమారు 80 లక్షల ఎకరాలు. దీనిపై వచ్చే ఆదాయమంతా కేవలం రాజకుటుంబ భోగలాలస జీవితాల కొరకే వినియోగించేవారు. నిజాం రాజకుటుంబీకులు ఎక్కడైనా పర్యటనకు వెళ్తే అక్కడ ప్రత్యేక కుటుంబాలు నిర్వహించుకోవడానికి ప్రత్యేక విడిది గృహాలు, గడీ లాంటి సౌకర్యాలు నిర్వహించడానికి ఆ ఆదాయాన్ని ఉపయోగించేవారు. ఈ ఆదాయానికి తోడు సంవత్సరానికి 70 లక్షల రూపాయలు ప్రభుత్వ ఖజానా నుండి చెల్లించాలి.

నిజాం ప్రభువు అనుభవించే విలాసవంతమైన జీవితాన్నీ అతని అనుచరులుగా ఉండే జాగీర్దార్లు, జమిందార్లు, దేశ్ ముఖ్ లు కూడా అనుభవించేవారు. వీరంతా చిన్న నవాబులుగా కొనసాగేవారు. వీరికి వేల ఎకరాల భూమి ఉండేది. ఈ భూములను సాగుచేయించి ఆదాయాన్ని రాబట్టుకునేందుకు సొంత రెవెన్యూ, సివిల్, క్రిమినల్, పోలీస్ యంత్రాంగాన్ని ఏర్పాటుచేసుకున్నారు. ఈ యంత్రాంగం, ఎవరికైనా మరణశిక్ష విధించినా దానికి తిరుగుండేది కాదు. వీరు స్వతంత్రంగా రాజ్యాన్ని నడిపేవారు.

## 2. 6. 4. పరిపాలన వ్యవస్థ:

నిజాం రాజరిక ప్రభుత్వ పరిపాలన వ్యవస్థలో పరిపాలన నిర్వహించడానికి ఒక లెజిస్లేటివ్ సభ ఉండేది. అందులో జాగీర్దార్ల ప్రతినిధులు ఇద్దరు ఉండేవారు. ఎప్పటికప్పుడు నిర్ణయాలు చేయడానికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఉండేది. దీనికి నాయకత్వం ప్రధానమంత్రి వహిస్తాడు. వీరందరిని రాజే నియమిస్తా డు మంత్రులకు అధికారాలు పరిమితం మరియు నామమాత్రం.

ప్రజలకు ఎలాంటి పౌరసత్వ హక్కులు ఉండేవి కావు. వాక్ స్వాతంత్ర్యం లేదు. సభలు పెట్టుకునే స్వాతంత్ర్యం లేదు. పత్రికా స్వాతంత్ర్యం. ఉర్దూనే రాజభాష. తెలుగు అంటే చిన్న చూపు ఉండేది.

## 2. 6. 5. కులపీడన:

నిజాం కాలంలో కులవివక్ష తీవ్రస్థాయిలో ఉండేది. అణగారిన వర్గాలవారు అంటారానితనానికి గురిచేయబడ్డారు. గ్రామంలో స్వేచ్ఛగా తిరిగే స్వతంత్రం లేదు. ప్రజాకూడలిలో ఉండే బావులను తాకనిచ్చేవారు కాదు. దళితులకు పాలు అమ్మే వారు కాదు. పాఠశాలలో వారి సంఖ్య దాదాపు శూన్యమని చెప్పవచ్చు. దేవాలయాల ప్రవేశం లేదు. ఇలాంటి వివక్షాలన్నింటిని అగ్రకుల సంపన్న వర్గాల వారు పెంచి పోషించారు.

రజక, మంగళి, వడ్డెరు... తదితర కులాల పరిస్థితి కూడా దాదాపు ఇలాగే ఉండేది. అయితే అగ్రకులాల వారు వీరి పట్ల అంటరానితనాన్ని పాటించేవారు కాదు. ఇలాంటి దుర్భర పరిస్థితులు భరించలేక అనేక మంది ముస్లిం మతంలోకి మారిన సంఘటనలు అసంఖ్యాకం.

## 2. 6. 6. వెట్టిచాకిరి:

వెట్టి చాకిరీ విధానం నిజాం సంస్థానం అంతటా ఉండేది. ప్రతి దళిత కుటుంబంలో నుండి ఒక్కరిని పటేల్, పట్వారి, దేశ్ ముఖ్ ల ఇళ్లల్లో వెట్టిపనులు చేయడానికి ఒకరిని తప్పని సరిగా నియమించాలి. వీరే పోలీస్ స్టేషన్లకు, తాలూకా ఆఫీసులకు రికార్డులు మోయాలి. అడవి నుండి కట్టెలు కొట్టుకురావాలి. టపా మోసుకురావాలి. దీనికి ప్రతిఫలంగా కోసుకు (రెండున్నర మైళ్ళకు) ఆరు పైసలు ఇచ్చేవారు. దొరలకు తోలు సంచులు, చెప్పులు ఉచితంగా ఇవ్వాలి. ఇలా ఇవ్వగా మిగిలినవే రైతులకిచ్చి ధాన్యం తీసుకోవాలి.

ఒక సందర్భంలో మూడు రోజుల క్రితం ప్రసవించిన బాలింతను విసునూరు దేశ్ ముఖ్ నిర్భందంగా పొలంపనికి తీసుకెళ్లి పసిపాపకు పాలివ్వడానికి వెళ్లినివ్వకుండా చేసి, ఆ బిడ్డ మరణానికి కారకుడయ్యాడు. దీనిని బట్టి ఆ కాలంలో వెట్టిచాకిరీ ఏ స్థాయిలో ఉండేదో అర్థంచేసుకోవచ్చు.

'వెట్టి' పద్ధతి వల్ల స్త్రీల జీవితాలు చిత్రమైపోయేవి. భూస్వాముల కుమార్తెలకు పెళ్ళిళ్లు చేసి అత్తింటికి పంపే సందర్భంలో బాలికలను బానిసలుగా పంపించేవారు. అలా వెళ్లిన బాలికలను ఆ ఇంటి పురుషులు అన్ని విధాలుగా ఉపయోగించుకునేవారు.

## 2. 6. 7. నిజాం పాలనలో స్త్రీల స్థితి:

నిజాం సంస్థానంలో 2, 25, 000 గ్రామాలు ఉండేవి. కాని, ఏ ఒక్క గ్రామంలో కూడా విద్య, వైద్య, రవాణా సౌకార్యాలు ఉండేవికావు. వందకి నలభై శాతం భూమి జాగిర్దార్లు, మక్తీదార్లు అగ్రహారస్తులు ఆధీనంలో వుండేవి. ప్రభుత్వం ప్రజలపై విపరీతమైన పన్నులభారం మోపేది. అంతేకాక స్త్రీలపై వరకట్నం, ఓలి మొదలైన రూపాలలో మరింత భారం వుండేది. ఆచారం ఏదైనప్పటికీ, దీని ప్రభావం మాత్రం స్త్రీలపైనే ఉండేది. తద్వారా స్త్రీలు కుటుంబ జీవితంలో చితికిపోయేవారు.

అక్షరాస్యత ఆ కాలంనాటికి 8.5% ఉండగా, స్త్రీల అక్షరాస్యత 1.5% మాత్రమే ఉండేది. ఇలాంటి పరిస్థితులలో స్త్రీలు పుట్టినిల్లు, మెట్టినిల్లు తప్ప వేరే ప్రపంచం తెలియక జీవించేవారు. ఇంత దయనీయమైన స్థితి కలిగిన మహిళలు నైజాం పాలకుల ఘోషా, పరదా సంస్కృతుల కింద నలిగిపోయేవారు. ఆర్థికంగా బాగా చితికిపోయిన స్థితివారిది. ఎవరైన కొంచెం అందంగా కనిపిస్తే ఇక దొరలు ఆ స్త్రీని తమ ఆటవస్తువుగా మార్చేసుకునేవారు. వాళ్లను ఎదిరించే ధైర్యంలేక అలాగే ఉండిపోయేవారు. ఇలాంటి స్థితిలో ఉన్న స్త్రీలు ఏవో కుట్టు పనులు, అల్లికలు అల్లుకుంటూ సీతమ్మ చెరలు, చంద్రమతి గాథలు, ఊర్మిళాదేవి నిద్ర, దయమంతి జీవిత పరీక్షలు మొదలైనవన్నీకథలు కథలుగా... పాటలుగా పాడుకుంటూ, అలాంటి గొప్ప పుణ్యమూర్తులే అంత కష్టాలు కోర్చారు. సీతమ్మ చెరల ముందు మన చెరలెంత?! అని అనుకుంటూ జీవితాన్ని వెల్లబుచ్చే వారు.

ఇలాంటి స్తబ్ధత కలిగిన స్త్రీల జీవనాన్ని తెలంగాణా ఉద్యమం ఒక్క కుదుపుకుదిపింది. సీతమ్మ చెరలు, చంద్రమతిగాథలు పాడుకున్న స్త్రీలు ఐలమ్మ భూపోరాటం, కొమరయ్య వీర మరణం గురించి గానం చెయ్యడం మొదలుపెట్టారు. గోర్కీ రాసిన "అమ్మ" నవలలోని అమ్మను ఆదర్శంగా తీసుకుని, పోరాటంలోని ప్రతి అంశంలో క్రియాశీలకమైన పాత్ర పోషించారు. గెరిల్లా దళ సభ్యులుగా, కమాండర్లుగా, వివిధ ప్రజా సంఘాలు, పార్టీలలో నాయకురాళ్లుగా, సభ్యులుగా పనిచేశారు.

తెలంగాణా ఉద్యమం అనేక రకాలైన సమస్యలను పరిష్కరించడం కోసం ఏర్పడింది గనుక, ఈ ఉద్యమంలో అనేకాంశాలు తలెత్తడంతో కొన్ని ప్రాంతాల్లో భూపోరాటం జరిగితే మరికొన్ని ప్రాంతాల్లో కూలీధర పెంచమని, మరికొన్ని చోట్ల రజకార్లపై దాడులు... ఇలా ఉద్యమం అనేక రూపాల్లో జరిగింది. ఇక తెలంగాణా పోరాటంలో పాల్గొన్న వీరవనితల గురించి తెలుసుకుందాం!

## 2. 6. 8. చిట్యాల ఐలమ్మ:

భూస్వామ్య వ్యతిరేక పోరాటంలో తొలికేక షేక్ బందగీ ఫాహె సాహెబ్. మలికేక సంఘటితమైనది. దీనికి చాకలి ఐలమ్మ ప్రతీక.

చిట్యాల నర్సయ్య, చిట్యాల ఐలమ్మ భార్యభర్తలు. వారికి ఆరుగురు సంతానం. అయిదుగురు కొడుకులు, ఒక కూతురు. వీరు నివసించింది పాలకుర్తి, విస్నూరు రామచంద్రారెడ్డికి వున్న అరవై గ్రామాల్లో ఇది ఒకటి. ఈ గ్రామంలో మల్లంపల్లి ముఖైదారు అయిన కొండలరావు కూడా భూమి ఉండేది. ఆయనకు నలభై గ్రామాలు ఉండేవి. మల్లంపల్లివారు విస్నూరు రామచంద్రారెడ్డిని తమ నాయకునిగా గుర్తించి వారి కనుసన్నలలో ఉండేవారు. ఐలమ్మ కుటుంబం మల్లంపల్లి కొండలరావు గారికి చెందిన భూమినే కౌలుదార్లుగా సేద్యం చేస్తూ ఉండేవారు.

సేద్య పరచగా వచ్చిన పంటను ఐలమ్మకుటుంబం అనుభవిస్తూ ఉండేది. ఈ భూమిని స్వాధీన పరచుకోవాలని, కౌలదార్లుగా ఉన్న వారిని వెళ్లగొట్టి తద్వారా ఆ పంటను స్వాధీనం చేసుకోవాలని, కొండలరావు విస్నూరు రామచంద్రారెడ్డి అండతో పూనుకుంటాడు. వారు పన్నిన పథకం ప్రకారం వందమంది రౌడీలను ఐలమ్మపంట పొలంలోకి పంపారు. ఐలమ్మ ఆంధ్రమహసభ కమ్యునిస్టుపార్టీల సహకారంతో మొట్టమొదటిగా భూపోరాటం చేసిన మహిళామూర్తి ఐలమ్మ. కేవలం ఎనిమిదిమంది మాత్రమే ఐలమ్మ పక్షంలో నిలబడి పోరాటం చేశారు. భీంరెడ్డి, చకీలం యాదగిరిరావు, నల్లుప్రతాపరెడ్డి, కుటూరి రామచంద్రారెడ్డి ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు. పంట ఐలమ్మ ఇంట చేరింది[10].

పండిన పంట ఐలమ్మ ఇల్లు చేరడం భూస్వాములు సహించలేకపోయారు. నైజాం పోలీసుల సహకారంతో ఐలమ్మ పక్షాన ఉన్న నాయకులను అరెస్టు చేసి, విస్నూరు పోలీసు స్టేషన్లో చిత్రహింసలకు గురిచేశారు. పైశాచికంగా వారిని హింసించారు. నిజానికి తమ నాయకులను ఆ విధంగా చిత్రవధ చెయ్యడం వల్లనే ప్రజలు మరింత సంఘటితమయ్యారని చెప్పవచ్చు. ఈ సంఘటన ప్రజలను మరింత చైతన్యవంతుల్ని చేసింది. దీని ఫలితంగా వెట్టికి వ్యతిరేకంగా పోరాటం ఆరంభమైంది.

## 2. 6. 9. ఎర్రమ్మ:

ఎర్రమ్మ హుజర్ నగర్ తాలుకా, రంగాపురం గ్రామంలో నివసించేది. ఈమె ఒక సాధారణ మహిళ. తెలంగాణ ఉద్యమంలో, తనదైన సహాయ సహకారాలను అందించింది. తన పెద్ద కుమార్తె అయిన అనసూయను గెరిల్లా పార్టీ నాయకుడైన కామ్రెడ్ మేదరమెట్ల సీతారామయ్యకు ఇచ్చి వివాహం చేసింది. ఆమె అన్న అయిన రాఘవయ్య కూడా పార్టీ అభిమాని.

రజాకార్లు ఆమె ఇంటిపై దాడిచేసి, ఇంటిని సర్వనాశనం చేశారు. అంతేకాక ఆమె భూమిలో వ్యవసాయం సాగనివ్వకుండా, పొలాలను బీడు భూములుగా చేశారు. ఈ విధంగా రజాకార్లు ఎర్రమ్మను హింసిస్తే ఆ తర్వాత భారత సైన్యాలు రక్తపాతం జరిపించి, ఆమెను అనేక చిత్ర హింసలకు గురిచేశారు.

రంగాపురం గ్రామంలో ప్రత్యేకించి ఎర్రమ్మ కుటుంబం పదే పదే దాడులకు గురయ్యేది. ఆ సమయంలో రంగాపురంలోని ఎర్రమ్మను ఆమె కూతురు అనసూయను, మరికొంతమందిని అరెస్ట్ చేసి, కొక్కిరేణి కంపుకు తీసుకువెళ్ళి, శారీరకంగా, మానసికంగా వారిని హింసించారు. చివరకు మంగళ వాళ్లను పిలిపించి గుండు చేయించి కొన్ని రోజులు నిర్భందంలో ఉంచి తరువాత విడిచిపెట్టారు.

ఎర్రమ్మ ఇక ఆ గ్రామంలో ఉండలేక ఊరు వదిలి వెళ్లిపోవలసిన దుస్థితి ఏర్పడింది. తన బంధువుల ఇళ్లకు వెళ్లి తలదాచుకోవాలన్నాగాని ఆ ఇళ్లపై కూడా దాడి చేసేవారు. అందువల్ల తన బంధుమిత్రులెవ్వరూ ఆమెను ఇంటిలోకి చేర్చుకోవడానికి ఇష్టపడేవారు కాదు సరికాదా, వేదాద్రి వెళ్లి ఆ వూరి చివర చిన్న గుడిసె అద్దెకు తీసుకుని, కడు దుర్భరమైన పేదరికంతో జీవితాన్ని సాగించింది. అయితే రజాకార్లు ఆమెను అక్కడ కూడా ఉండనివ్వలేదు. చివరకు ఆమె గుంటూరు మకాం మార్చేసింది. అక్కడ ఉన్న పొగాకు కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగించింది.

తెలంగాణా పోరాటం ముగిసిన తరువాత ఎర్రమ్మ తిరిగి తన స్వగ్రామం చేరుకుంది. ఈ విధంగా ఆమె ఉద్యమంకోసం అనేక కష్టనష్టాలు భరించింది.

## 2. 6. 10. నర్సమ్మ:

నర్సమ్మ 1950లో దళంలో చేరింది. అప్పటికి ఆమె వయసు 20 సంవత్సరాలు. నర్సమ్మ నిరక్షరాస్యురాలు. దళంలో చేరిన ఒక సంవత్సరానికే అంటే 1951 లోనే ఆమెకు పార్టీ సభ్యత్వం ఇచ్చారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందయ్య ఆమె గురించి చెప్తూ 'నర్సమ్మ పేద రైతు కుటుంబం నుండి వచ్చింది. చాల చురుకైన కార్యకర్త. ఆమెకు ఏదైన పని అప్పగిస్తే ఆ పనిని నిర్వహించడానికి కావలసిన కొత్త మార్గాలను ఆమె అన్వేషించుకునేది. ఏదైన సభలో మాట్లాడవలసి వస్తే చాలా స్పష్టంగా, అందరికీ అర్థమయ్యే విధంగా, వినేవారికి విసుగు లేకుండా మాట్లాడేది' అని ప్రశంసించారు.

## 2. 6. 11. చిలకమ్మ:

నర్సమ్మ లాగానే చిలకమ్మ కూడా నిరక్షరాస్యురాలు. సామాన్య కుటుంబం నుండి వచ్చిన స్త్రీ. చిలకమ్మది నల్గొండ జిల్లా మిర్యాలగూడెం తాలూక మగ్గెపల్లి. 1947లో ఆ గ్రామాన్ని చుట్టుముట్టిన నిజాం సైనికుల, రజాకార్ల నుండి తప్పించుకోవడానికి, వాళ్ల కళ్లలో కారంకొట్టి పరుగెత్తి పారిపోయింది. దాంతో ఆమె మీద పగపట్టి ఆమెను పట్టుకోవడానికి నిజాం. సైనికులు వెంటాడారు.

ఆమె పరుగెత్త గలిగినంత దూరం పరుగెత్తింది నిండు గర్భిణి కావడంవల్ల ఇక పరుగెత్తలేక సైనికుల చేతికి చిక్కడం ఇష్టం లేక ఒక మోట బావిలో దూకి ప్రాణ త్యాగం చేసింది. చిలకమ్మ త్యాగం ఈనాటికి నల్గొండ జిల్లా ప్రజల నాలుకలపై వినిపిస్తుంది ఈ నల్గొండ జిల్లా, శ్రామిక స్త్రీలు నాట్లు వేస్తూ, కోతలు కోస్తూ పాడుకొనే పాటల్లో చిలకమ్మ చరిత్ర ఇప్పటికీ సజీవంగా ఉంది. ఆ పాట ఈ కింది విధంగా ఉంటుంది.

ఏదేశాన బుట్టినవే - నా సెల్లెల సిలకమ్మ

ఏదేశాన బెరిగినవే - నా సెల్లెల సిలకమ్మ

కత్తికి కమినిషంటిమే - నా సెల్లెల సిలకమ్మ

ముప్పయి మంది పోలిసోల్ల - నా సెల్లెల సిలకమ్మ

నీ మీదకు పంపించి - నా సెల్లెల సిలకమ్మ

నిను జంపదలచినాడే - నా సెల్లెల సిలకమ్మ

వారయి తానూ లంచామే - నా సెల్లెల సిలకమ్మ

వాళ్ళకు నందిచ్చితివే - నా సెల్లెల సిలకమ్మ

వచ్చే పోలీసోడ్లంయినా - నా సెల్లెల సిలకమ్మ

మళ్లీ పోయినారయా - నా సెల్లెల సిలకమ్మ

దనస్యిపేట దొరోడే - నా సెల్లెల సిలకమ్మ

నిన్ను బంపం విడువడే - నా సెల్లెల సిలకమ్మ... అంటూ సాగుతుంది.

## 2. 6. 12. పూనం లచ్చక్క:

పూనం లచ్చక్క, వెంకన్న ఇద్దరూ గెరిల్లా యుద్ధంలో ఆరితేరిన దంపతలు. లచ్చక్క నేటికి సజీవంగా ఉంది. లచ్చక్క, వెంకన్న ఇద్దరూ ధైర్యసాహసాలు కలిగిన దంపతులు. దళంలో తుపాకీ చేతబట్టి పనిచేసారు. దళంలో కొనసాగుతూనే తమ బాధ్యతగా, కమట్లగూడేం, బావురగూడేం, జంగాలపల్లి గ్రామాలను పర్యవేక్షిస్తు ండేవారు వెంకన్న తుపాకీ ఎత్తా డంటే గురి తప్పేదికాదు. అంతటి నైపుణ్యం కలవాడు. ఒకసారి అశోకనగర్ గుండా రహస్యంగా వస్తు న్నప్పుడు ప్రముఖ రజాకారు నాయకుడొకడు, వందలాది మంది ప్రజలను బలవంతంగా తీసుకువచ్చి, వారికి ఉపన్యాసం ఇస్తూ, ఆ ఉపన్యాసంలో కమ్యూనిస్టుపై బురద చల్లే ప్రయత్నం చేస్తు ండగా, వెంకన్న సహించలేక, అదును

చూసి గురుపెట్టి ఆ నాయకుణ్ణి పట్టపగలే కాల్చేశాడు. ఊహించని ఈ సంఘటనకు అందరు విభ్రాంతి నొంది, భయాందోళనలకు గురై అక్కడున్న రజాకార్లంతా తమ వద్ద ఉన్న తుపాకీలను విడిచిపెట్టి పారిపోయారు.

## 2. 6. 13. లచ్చమ్మ:

లచ్చమ్మ 'నడిగడ్డ' గ్రామానికి చెందినది. ఈమె రజక వృత్తి చేసుకుంటూ జీవనం కొనసాగించేది. లచ్చమ్మ మనసున్న మనిషి. పార్టీ దళాల బట్టలు ఉతకడమే కాక, ఆ దళాలకు అవసరమైనప్పుడు ఆహారం కూడా అందించేది. ఒకసారి నిజాం సైన్యానికి దొరికిపోయింది. సైన్యం ఆమెను వివస్త్రను చేసి, తలక్రిందులుగా చెట్టుకు వేలాడదీసి, లాఠీలతో కొట్టి, దళానాయకురాలయిన 'రాములమ్మ ఎక్కడుందో చెప్పమని' అనేక రకాలుగా హింసించారు. లచ్చమ్మ మౌనమే వారికి సమాధానమైంది. ఆమెను ఎన్ని రకాలుగా హింసించినప్పటికీ, నోరు తెరవక పోయేసరికి, వారే విసిగిపోయి, ఆమెను వదిలేశారు. స్థానిక పార్టీ నాయకులంతా, ఆమెను హాస్పిటల్ లో చేర్పించి, వైద్యం చేయించి, బతికించారు.

## 2. 6. 14. మల్లికాంబ:

మల్లికాంబ భర్త పేరు బ్రహ్మయ్య. ఇతను తెలంగాణా పోరాటానికి ముందే మరణించాడు. వీరిది ఖమ్మం జిల్లా సుద్దేపల్లి. వీరికి ఆరుగురు సంతానం. వీరందరినీ పెంచి, పోషించాల్సిన బాధ్యత మల్లికాంబ మీద పడింది. తన పెద్దకొడుకు అయిన వెంకటేశ్వర్లు దళంలో చేరాడు. మల్లికాంబ కూడా పార్టీకి ఎంతో సహాయ సహకారాలు అందించేది.

ఒకసారి రజాకార్లు సుద్దెపల్లిపై దాడిచేసి, పేదప్రజలను దోచుకోవడం ప్రారంభించారు. ఈ సంగతి తెలుసుకున్న మల్లికాంబ, వీరయ్య అనేవారు దళానికి కబురు పంపారు. విషయం తెలుసుకున్న దళారులు వెంటనే వచ్చి, రజాకార్లపై విరుచుకుపడి, ఆ గ్రామం నుండి వారిని వెళ్ళగొట్టారు. ఆ దుర్మార్గులు దోచుకున్న వాటిని, ఎవరివి వారికి ఇచ్చివేయడం జరిగింది.

మల్లికాంబ ఇంటిపై రజాకార్లు ఎన్నోసార్లు దాడి చేసి అనేక రకాలుగా చిత్రహింసలు పెట్టారు. ఆమె కొడుకు దళంలో ఉన్నాడు కాబట్టి, ఆ వివరాలు చెప్పమని అనేక రకాలుగా వేదించారు. అయినప్పటికీ ఆమె నోరు తెరవలేదు. ఒకసారి వెంకటేశ్వర్లు (మల్లికాంబ పెద్దకొడుకు) దళాలకు మందులు కొనడానికి విజయవాడ వెళ్తే అతనిని అరెస్టు చేసి, నాలుగు రోజులు చిత్రవధ పెట్టారు. అతనిపై కక్ష్యతో మల్లికాంబ పంటలన్నీ నాశనం చేశారు. అయినా ఆమె భయపడలేదు. దళాలకు, పార్టీ కార్యకర్తలకు ఆమె ఇల్లు కేంద్రంగా నిర్వహిస్తూ, ఉద్యమానికి ఎనలేని సేవలు చేసింది.

## 2. 6. 15. రాంబాయమ్మ:

తెలంగాణా ఉద్యమంకోసం తన ప్రాణాల్నే త్యాగం చేసిన త్యాగశీలి రాంబాయమ్మ. ఈమె పిండిప్రోలు గ్రామవాసి. చిన్నవయసులోనే భర్తను కోల్పోయింది. పిండిప్రోలు గ్రామ ఉద్యమానికి ఆయువుపట్టుగా ఉండేది. గుట్టరజాకారు క్యాంపులపై దాడి చెయ్యడానికి ఈ గ్రామమే కేంద్రంగా ఉండేది. ఈ కేంద్రస్థానానికీ రాంబాయమ్మ సహాయ సహకారాలు అందించేది. ఉద్యమానికి చుట్టుప్రక్కల గ్రామాల్లోని స్త్రీలను సమీకరించడానికి, పార్టీకి సంబంధించిన విషయాలను ప్రజలకు చేరవేయడంలో ప్రధాన పాత్ర వహించేది.

రాంబాయమ్మ పార్టీకి సహకరిస్తోందనే నెపంతో ప్రభుత్వం ఆమెను అరెస్టు చేసి, వరంగల్ లో ఉన్న కారాగారంలో నిర్భందించారు. 18 నెలలు జైలులో ఉంచారు. ఆ రోజుల్లో జైలులో ఉన్నవారి పరిస్థితి కడుదుర్భరంగా ఉండేది. జైళ్ళో ్లఉన్న ఆ పరిస్థితి సహించలేక, రాంబాయమ్మ మరికొంతమంది తోటి ఖైదీలను సమకూర్చింది. దాదాపు 150 మంది వరకు పోగయ్యారు. అంతా కలసి, జైలులో స్త్రీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని నిరాహారదీక్ష చేపట్టారు. ఈ దీక్షను భగ్నంచేయడానికి పోలీసులు పైశాచికంగా ప్రవర్తించారు స్త్రీలు అనే స్పృహ కూడా లేకుండా వారిపై లాఠీ చార్జీ జరిపారు. పశువుల్ని కొట్టినట్టు కొట్టారు. ఆ దెబ్బలకు రాంబాయమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. ఈమె మృతి మిగిలిన మహిళాఖైదీలకు గొప్ప స్ఫూర్తిని అందించింది.

ఈ విధంగా రాంబాయమ్మ తన జీవితాన్ని ఉద్యమంకోసం వెచ్చించి, ఉద్యమంలోనే ప్రాణాలు విడిచింది.

## 2. 6. 16. మల్లు స్వరాజ్యం:

మల్లు స్వరాజ్యం 1930న భూస్వామ్యకుటుంభంలో జన్మించారు. తల్లి సొక్కమ్మ. తండ్రి బిమిరెడ్డి రామిరెడ్డి. ఈయన సూర్యపేట తాలూకాలో ఒక చిన్న భూస్వామి.

స్వరాజ్యం తన చుట్టూ ఉన్న రాజకీయ వాతావరణాన్ని, గమనిస్తూ, వాటిని అవగతం చేసుకోవడానికి ప్రయత్నించింది. ఈమె జమిందారీ కుటుంబంలోజన్మించడం వల్ల ఆ వ్యవస్థ తీరుతెన్నులను అనుభవపూర్వకంగా తెలుసుకున్నారు.

స్వరాజ్యానికి బాల్యం నుండి ప్రతిదాన్ని తెలుసుకోవాలని కుతుహలం, తనకు బోధపడని విషయాన్ని ప్రశ్నించేతత్వం అలవడింది. తండ్రి చనిపోయాక ఆమెపై అధికారాన్ని చలాయించే వారు తగ్గిపోవడం వల్ల, దానిని ఆసరాగా చేసుకుని, జమిందార్లు నివసించే కోటలాంటి "గడి" ని దాటి బయటకు వెళ్ళడం మొదలు పెట్టారు.

1940 దశకంలో తెలంగాణా ప్రాంతమంతా నిజాం వ్యతిరేక కార్యకలాపాలతో, ఉద్యమ ఉధృతితో అట్టుడికి పోతూవుంది. స్వరాజ్యం కూడా అందులో భాగస్వామ్యం కావడం ప్రారంభించారు. చిన్నవయసులోనే ఆమె జాతీయోద్యమంలో పాల్గొన్నారు

స్వరాజ్యం మొదటిసారిగా 1942లో జరిగిన "ఆంధ్ర మహిళాసభ" కార్యక్రమానికి హాజరయ్యారు. ఆంధ్ర మహిళాసభ క్రియాశీల కార్యకర్త అయిన ఆరట్ల కమలాదేవి ఇంట్లో రాజకీయ శిక్షణా తరగతులు వివిధ రాజకీయ అంశాలపై జరిగేవి. స్వరాజ్యం ఈ కార్యక్రమాల్లో ప్రధానపాత్ర వహించేవారు. ఇదే సమయంలో ఈ కార్యక్రమాల్లో పాల్గొనవద్దని కుటుంబ సభ్యుల నుండి వత్తిడి మొదలైంది. అయినప్పటికీ వాటన్నింటినీ లెక్కచేయక, అనేక అంశాల్లో క్రియాశీలక పాత్ర వహించారు.

ఒకసారి రామచంద్రరెడ్డి అనే భూస్వామి ఒక బాలింతస్త్రీ చేత బలవంతంగా పొలంపని చేయిస్తుండగా, ఆమె తన పసిబిడ్డకు పాలిచ్చి వస్తా నని వేడుకుంటుంది. ఆ భూస్వామి తిరస్కరిస్తా డు పైగా ఆ భూస్వామి గూండాలు వచ్చి ఆమె వక్షోజాలను గట్టిగా నొక్కి పాలను పిండేస్తా రు ఆ బిడ్డకు పాలివ్వకపోవడం వల్ల ఆ పాప మరణిస్తుంది ఈ సంఘటన ఆధారంగా ఆ స్త్రీ పాడిన పాటను స్వరాజ్యం ఈ కింది విధంగా రాజకీకరణం చేసారు.

నాగళ్ళు దున్నేటి - ఉయ్యాలో

నాయన్నలారా - ఉయ్యాలో

చీమునెత్తు రు లేదా - ఉయ్యాలో

తిరగబడరేమయ్య - ఉయ్యాలో

ఎవ్వరు ఈ దొరలు - ఉయ్యాలో

ఎక్కడిది ఈ భూమి - ఉయ్యాలో

నాగళ్ళు వదిలేసి - ఉయ్యాలో

సంఘంలో చేరుదాం - ఉయ్యాలో

సంఘటిత పడుదాం - ఉయ్యాలో

ఏకమై మనమంత - ఉయ్యాలో

ఈ చెరలు తీరేను - ఉయ్యాలో

ఈ భూమి మనదౌను - ఉయ్యాలో'

స్వరాజ్యం రచించిన గేయాలన్నింటిలో అత్యంత ప్రజాదారణ పొందిన పాట ఇది. 1930న ఆంధ్రమహాసభ మహిళా విభాగం ప్రారంభమయ్యింది. 1942న అంటే స్వరాజ్యం తన 12వ ఏట దీని సభ్యురాలయ్యారు. రజాకార్ల చేతిలో దోపిడికి గురవుతున్న ప్రతి స్త్రీ ఈ మహిళా విభాగంలో సభ్యులు కావాలని ఆంధ్రమహాసభ పిలుపునిచ్చింది. ఈ పిలుపునందుకొని అనేక మంది మహిళలు దీనిలో భాగస్వాములైనారు భూస్వాములు దళితమహిళల చేత వెట్టిచాకిరీ చేయించుకునేవారు. జమిందారీ మహిళలకు కూడా ఆస్తిలో హక్కు ఉండేది కాదు. ఈ రెండు అంశాలకు వ్యతిరేకంగా ఆంధ్రమహిళా సభ ఉద్యమించింది. దీనిలో స్వరాజ్యం ప్రధాన పాత్ర వహించారు.

స్వరాజ్యం పోరాటకమిటీల నాయకురాలిగా కార్యకర్తలను సమీకరించడం, దళాలకు శిక్షణనివ్వడం వంటి బాధ్యతలు నిర్వహించేవారు. శత్రువుల నుండి ఎలా తప్పించుకోవాలో సభ్యులకు శిక్షణ ఇచ్చేవారు. ఈ విధంగా శిక్షణ పొందిన అనేక మంది యువతలు తరువాత కాలంలో గ్రామస్థాయిలో నాయకురాళ్లగా ఎదిగారు. ఒడిసెలు తిప్పడంలో వీరు శిక్షణ పొందారు. పల్లెల్లోని సాధారణ స్త్రీలు తమ ఇళ్ళు, ధాన్యం మొదలైన ఆస్తు ల్ని రక్షించుకోవడంలో సుశిక్షితులయ్యారు.

తెలంగాణా సాయుధపోరాటంలో స్వరాజ్యం కీలక పాత్ర పోషించారు. పార్టీ నిర్వాహకురాలిగా, గెరిల్లా వ్యూహకర్తగా, కమాండరుగా బాధ్యతలు నిర్వహించారు. కమునిస్ట్ గెరిల్ల దళాలకు నాయకురాలయ్యరు. స్వరాజం రాజకీయ కమాండరుగా కూడ భాధ్యతలు నిర్వహించారు. ఇది ప్రతిష్టాత్మకమైన పదవి. తుపాకి పేల్చడం, పరుగెత్తడం ఈత, ధైర్యం, చొరవ తదితర విషయాల్లో పురుషులతో సమానమైన ప్రతిభ కనపరిస్తేనే ఈ బాధ్యత అప్పగిస్తా నన్నారు స్వరాజ్యం ఈ పదవిని అత్యంత సమర్థవంతంగా నిర్వహించారు[11].

నిజాం ప్రభుత్వం తప్పనిసరిగా బందీలుగా పట్టుకోవలని భావించిన కమ్యునిస్ట్ నాయకుల్లో స్వరాజ్యం ఒకరు. ప్రభుత్వం ఈమె ఆచూకి తెలిపిన వారికి పదివేల రూపాయలు ఇస్తా నని ప్రకటించింది. ఈమెకు అనేక సందర్భాలలో పోలీసులు తారసపడినప్పటికీ, ఏదో విధంగా తప్పించుకున్నారేగాని, ఏనాడు పట్టుబడలేదు.

ఆంధ్ర రాష్ట్రంలో మహిళాఉద్యమ నిర్మాణం కూడా ఇదే సమయాన ఊపందుకుంది. ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో భాగంగా ఉన్న ఆంధ్ర ప్రాంతంలో సైతం స్వతంత్ర మహిళా ఉద్యమం ఆవిర్భవించింది. మానికొండ సూర్యావతి, మోటూరి ఉదయం, రాజేశ్వరమ్మ, సీతామహాలక్ష్మమ్మ వంటి నాయకురాళ్లు దీనికి సారథ్యం వహించారు. వీరు రాష్ట్రమంతటా పర్యటించి, ప్రతి జిల్లాలోను మహిళా సంఘపు శాఖల్ని ఏర్పాటుచేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సంఘం రాష్ట్ర తొలి మహాసభలు 1981న నల్గొండ జిల్లాలో జరిగాయి.

1990వ శకాన మహిళల నాయకత్వంలో మద్యపాన నిషేదాన్ని కోరుతూ, రాష్ట్రంలో పెద్ద ఉద్యమం జరిగింది. ఈ ఉద్యమంలో స్వరాజ్యం ప్రధానపాత్ర పోషించారు.

తెలంగాణా ఉద్యమ అనంతర కాలం నుండి కూడా స్వరాజ్యం విరామం లేకుండా ప్రజాసేవ చేస్తున్నారు వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. 1981 - 2001 మధ్య కాలాన ఆమె ఐద్వా ఆంధ్రప్రదేశ్ కమిటీ అధ్యక్షురాలిగా ప్రధానపాత్ర పోషించారు. నేటికీ ఐద్వా ఉపాధ్యక్షురాలిగా పనిచేస్తున్నారు. తెలంగాణా ఉద్యమం నాటి స్ఫూర్తే నన్ను ఇప్పటి వరకు అదే ఉత్సాహంతో ముందుకు నడిపిస్తుందని స్వరాజ్యం పేర్కొన్నారు.

వీరేకాక తెలంగాణా సాయుధపోరాటంలో ఇంకా అనేక మంది, అనామిక స్త్రీలు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను పాల్గొన్నారు.

నల్గొండ జిల్లా మిర్యాలగూడెం తాలుకా ముకుందాపురంలో ఒక భూస్వామి కుమ్మరి మట్టయ్యను చిత్రహింసలు పెట్టాడు. అయినప్పటికి భూస్వామి కుతంత్రానికి మట్టయ్య లొంగలేదు. ఇక చేసేదిలేక, ఆ మట్టయ్యను చంపాడు. ఆ తర్వాత ఆయన భార్య రంగంలో దిగింది. పోలీసులు ఆమెపై అత్యాచారం చేసారు. ఆయినా ఆమె తనభూమిని వదలలేదు. "ఈభూమి నాది" అనే నినాదంతో, ఊరు ఊరంతా కదిలించి, చివరికి తన భూమిని నిలుపుకుంది.

వీరారం గ్రామంలో ఉన్న అతని భార్య కలిసి భూస్వాములను, గూండాలను, పోలీసులను తమ పొలం నుండి తరిమికొట్టారు. ఈ క్రమంలో పోలీసులు, ఆ గర్భిణీ పొట్టపై, బూటుకాళ్ళతో తన్ని తన్ని చంపారు. చివరిశ్వాస వరకు కూడా ఆమె వీరోచితంగా పోరాడింది.

అనేక గ్రామాలపై రజాకార్ దుండగులు దాడిచేసినప్పుడు, ఆ మగవారంతా కలిసి వడిసెలతో వారిని తరిమికొడుతుంటే, స్త్రీలు వారికి రాళ్లు అందిస్తూ సహకరించేవారు. ఇలాంటి పనిలో ఉండగానే ఒక మహిళను పోలీసులు కాల్చి చంపారు. పోలీసులు వ్యాన్లలో మగవారిని ఎక్కించుకుని వెళ్తున్నప్పుడు స్త్రీలంతా కలిసి ఎక్కడికక్కడ వ్యాన్లను నిలుపుజేసి, ఆ వ్యాన్లలో వాళ్లు కూడా ఎక్కివెళ్ళడం జరిగేది. ఒకసారి తమవారిని తీసుకుపోతున్న సంగతి తెలిసి పది గ్రామాల మహిళలు కదిలారు. వ్యాన్లను చుట్టుముట్టారు. పోలీసులు కాల్పులు మొదలు పెట్టినా, చెట్టు చాటునుండి రాళ్ళు విసురుతూ వారిని తరిమితరిమి కొట్టారు. పోలీసులనుండి తమ వారిని రక్షించేందుకు, రహస్య స్థలాల్లో దాగిఉండేవారు. తమతో ఉన్నచంటి బిడ్డలు ఏడిస్తే, ఎక్కడ తమజాడ తెలిసిపోతుందోనని భయపడి ఆ బిడ్డల నోళ్లు మూసేసేవారు.

బిడ్డల నోళ్ళుమూసి సహకరించారంటే ఆ తల్లులకు ఉద్యమంపై ఎంత మమకారం, ధీక్ష, పట్టుదల ఉన్నాయో అర్థమౌతుంది. ఉద్యమంలో ప్రముఖపాత్ర వహిస్తున్న వ్యక్తుల వివరాలు

తెలుసుకోవడం కోసం, ఆయా వ్యక్తులకు సంబంధించిన స్త్రీలను జైలులో పెట్టి ఎన్నో విధాలుగా హింసించి, భయపెట్టినప్పటికీ మహిళలు లొంగలేదు.

నేరడ అనే గ్రామంలో అధికారులు డెబ్బయి మంది మహిళలను పట్టుకుని, చింత బరికలతో చావగొట్టారు. వారికి పైజమాలు తొడిగి లోపల తొండలను వదిలారు. మాటల్లో వ్యక్తం చేయలేని ఆ బాధను భరిస్తూ కూడా నోరు పెగల్చలేదు. దాంతో ఆ అధికారులు కోపంతో తొండలు చేసిన గాయాలపై కారం చల్లారు. అయినప్పటికి నోరు తెరవలేకపోవడం వారి నిబద్ధతకు చిహ్నం. పార్టీ రహస్యాలకోసం బెండలపాడులో మహిళారైతు రాజమ్మకు ఇనుపకడ్డీలు కాల్చి, వాతలు పెట్టారు.

నడిగడ్డ అనే గ్రామంలో చాకలి లచ్చమ్మ దళాల బట్టలు ఉతికేది రాములమ్మ అనే దళనాయకురాలి ఆచూకి కోసం యూనియన్ సైన్యం లచ్చమ్మను బంధించారు. వివస్త్రను చేసి చెట్టుకి వేలాడదీసి, లాఠీలతో, పేముబెత్తా లతో ఒళ్ళంతా చావబాదారు.

ఖమ్మం జిల్లా సుద్దేపల్లికి చెందిన మల్లికాంబను దళనాయకులకు అండగా ఉందనే కారణంతో, ఎన్నో హింసలు పెట్టారు. కిరాతక చర్యలకు పేరుగాంచిన ఖమ్మం జైలులో నాలుగురోజులు వేధించారు. అయినా ఆమె భయపడలేదు. మరింత ఉత్సాహంతో నాయకులకు సహకరించేది. నల్గొండ జిల్లా హుజూర్ చెందిన ఎర్రమ్మ ఇంటిపై రజాకార్లు దాడిచేసారు. చేను సాగుచేసుకోనివ్వకుండా అడ్డుకున్నారు. అయినప్పటికి ఉద్యమంపై విశ్వాసం సడలని ఎర్రమ్మను, ఆమె కూతురిని, తల్లిని అరెస్ట్ చేసి, తీవ్రంగా కొట్టారు. గుండు కొట్టించారు.

ఎక్కడికెళ్లినా వేధించడం పనిగా పెట్టుకున్నారు. ఎన్ని కష్టాలనైనా భరించడానికి సిద్ధపడింది గాని పోరాటం నుండి వెనక్కు తగ్గలేదు.

చొప్పకట్లవారి పాలేనికి చెందిన ధనిక రైతు భార్య వెంకమ్మ దళాలకు భోజనం పంపేది. యూనియన్ సైన్యాలు ఆమెను అరెస్ట్ చేసి ఖమ్మం క్యాంపుకు తీసుకువెళ్లి చిత్రహింసలు పెట్టారు. చివరికి ఆమెపై అత్యాచారం చేశారు. అవమాన భారంతో ఆత్మహత్య చేసుకుంది.

తమ తమ ప్రాంతాల్లో ఉంటూ ప్రతిఘటించిన మహిళలు ఒక భాగం. గెరిల్లా దళాలలోను, పార్టీ రహస్యకార్యాలయాలలోను పాలుపంచుకున్న మహిళలు ఒక భాగం. నల్గొండ చల్లూరు గుట్టలో జరిగిన చారిత్రాత్మక పోరాటంలో బందూకుతో విజృంభించిన ఆరుట్ల కమలాదేవి మరో ముఖ్యనాయకురాలు. భర్తతో కలిసి అమెరికన్ రైఫిల్స్ తో పోరాడుతూ, దళాన్ని కాపాడింది.

తెలంగాణా పోరాటం, మహిళల్లో దాగిన శక్తులనూ లోకానికి తెలియజెప్పింది. వారి దీక్ష, ప్రతిఘటన, పోరాట పటిమ, నేటికి ఉత్తేజకరంగా ఉంది. ఈ పోరాటం ద్వారా స్త్రీలలో కలిగిన వినూత్న చైతన్యం, వారి ఆలోచనా సరళిలో వచ్చిన మార్పు వారిని గొప్ప మహిళామణులుగా మార్చాయి.

ఈ ఉద్యమాలు ఇచ్చిన ప్రోత్సాహం ద్వారా స్త్రీలు చైతన్యవంతులై, ఆతరువాత కాలంలో అన్ని రంగాల్లోను ముందంజ వేయడానికి ఎంతగానో తోడ్పడింది.

## పాదసూచికలు

1. ప్రగతి. 1984. '*పోరు ఆకాశంలో సగం*'. పుట: 2.
2. పార్వతి మీనన్. 2006. '*ధిక్కార స్వరాలు* ': పుట: 15.
3. పైదే. పుట: 33
4. శ్రీమతి ఉదయం, మోటూరు. 1996. '*స్వాతంత్ర్య సమరంలో ఆంధ్ర మహిళల మహోన్నత పాత్ర*'. పుట : 7.
5. పైదే. పుట: 10
6. మహిళామార్గం ప్రచురణలు: '*భారత శ్రామికోధ్యమంలో మహిళలు*'. 1998. పుట: 21.
7. పైదే. పుట: 29
8. పైదే. పుట: 33
9. రఘుపాల్, జి. 2006. '*వరంగల్ జిల్లా వీర గాథలు*' ; పుట: 21
10. పార్వతి మీనన్. 2006. '*ధిక్కార స్వరాలు* '. పుట: 58.

# 3. స్త్రీల అస్తిత్వ చిత్రణకథలు - వస్తు వైవిధ్యం

తెలుగుభాష ఎంత ప్రాచీనమైనదో, తెలుగు కథ కూడా అంతే ప్రాచీనమైనదిగా భావించవచ్చు. తెలుగువాళ్లు తమ భావాలను, తమ అభిప్రాయాలను, తమ ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం మొదలైనప్పటి నుంచి తెలుగులో కథ పుట్టిందని ఊహించవచ్చు. ఏ సమాజంలోనైనా, ఏ కళారూపమైనా మొదట మౌఖికంగా మొదలై ఆ తరువాత అది లేఖన రూపాన్ని సంతరించుకొంటుంది. ఇందుకు తెలుగు కథ మినహాయింపేమీ కాదు.

## 3. 1. కథ - నిర్వచనాలు:

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో తెలుగులో వెలువడ్డ వచన సాహిత్య ప్రక్రియల్లో కథానిక ఒకటి. కథానికను ఆంగ్లంలో 'short story' అంటారు. సాధారణంగా 'కథ' అంటే చెప్పడం కాబట్టి, చెప్పేక్రమంలో ఒకరు చెప్పడం ఉంటుంది. చెప్పే వ్యక్తి ఉన్నాడంటే వినే వ్యక్తి కూడా ఉండి తీరాలి. అయితే ఇది మౌఖిక కథాసాంప్రదాయనికి చెందింది. లిఖిత కథాసాంప్రదాయనికి వచ్చేటప్పటికి రాయడం, చదవడం ఉంటుంది. కథానికను అనేకులు అనేక రకాలుగా నిర్వచించారు. వాటిలో ముఖ్యమైన నిర్వచనాలు చూద్దాం!

> "short story is a literary form, a prose fiction in which mood, characters, plot and setting are perfectly harmonized"[1]
>
> - Edgar Allan Poe

ఎలన్పో అభిప్రాయం ప్రకారం- కథానిక కల్పనా సాహిత్యానికి సంబంధించిన వచన ప్రక్రియ. ఇందులో ఒక వస్తు వో; ఒక పాత్ర చిత్రణో, ఒక మానసిక స్థితో ప్రధానంగా ఉండొచ్చు. అయితే వీటన్నిటి మధ్య ఒక అమరిక, ఒక క్రమపద్ధతి ఉండాలి.

"A short story deals with a single character, or a single event, or a single emotion"[2] - Brande Matthews

బ్రాండీ మాథ్యూస్ అన్నట్లు- కథానిక ఒకే పాత్రమీద గానీ, ఒక సంఘటన మీదగానీ, ఒక ఉద్వేగం మీదగాని తన దృష్టిని కేంద్రీకరించవచ్చు.

"సహజం అనిపించే అసహజమే కథ"[3] - మల్లాది రామకృష్ణ శాస్త్రి

"కథను ఏ రూపంలో రచించినా కథ ద్వారా పాఠకులకొక సంస్కారాన్నీ, ఒక కొత్త దృష్టినీ కల్గించడం ముఖ్యం"[4] - గోపిచంద్

"కథ అనేది మొదట్లో కుతూహలాన్నీ చివర ఆలోచనల్నీ కలిగించాలి. మధ్యలో చెప్పేది రక్తి కట్టిస్తూ చెప్పుకు పోవాలి"[5]. - ఆరుద్ర

పాశ్చాత్య భాషా సాహిత్య ప్రభావాల వల్ల తెలుగులో అనేక వచన సాహిత్య ప్రక్రియలు 19వ. శ. ఉత్తరార్థంలో పుట్టుకొచ్చాయి. వాటిలో కథానిక ఒకటి. ఈ కథానికను పాశ్చాత్య రచయితలైన నికోలాయ్ గొగోల్, నెథానియల్ హథారిన్, ఎడ్గార్ ఎలన్ పో వంటి వారు ప్రత్యేకంగా తీర్చిదిద్దారు.

యథాతథ కాలక్రమంలో కథానిక అనేది రెండు పాయలుగా విడివడింది. అవి:

1. కథకథనం (The realistic story)

2. అనుభూత్యాత్మకం (The impressionist story)

'జరిగిన సంఘటనను జరిగింది జరిగినట్లుగా చెప్పడం యథాతథ కథాకథనం. అలాకాకుండా జరిగిన సంఘటనలను రచయిత తన కథన శిల్పంతో, సంఘటనలో భాగమైన పాత్రల మనసుల్లో చెలరేగిన కలవరాన్ని, ఆనందానుభూతుల్ని, పాఠకుడి మనసును హత్తుకునేటట్లు రాసే విధానాన్నే అనుభూత్యాత్మక కథాకథనం' అని అంటారు.

ఎడ్గార్ ఎలన్ పో నుంచి హెన్రీజేమ్స్ వరకు ఎందరో అమెరికన్ రచయితలు ఈ రెండో రకం కథారచనా విధానంపై విశేష కృషిచేసి, ఈ విధానానికి ప్రాచుర్యం కలిగించారు. నేటికాలంలో తెలుగుకథ కూడా ఇదే పంథాలో నడవడం గమనించదగ్గ అంశం. పంతొమ్మిదవ శతాబ్ది ఉత్తరార్థంలో ఆంగ్ల సాహిత్యప్రభావం దేశం నాలుగు మూలలకు వ్యాపించింది. ఆ దేశంలోని ఏ ఉద్యమానికైనా ఊపిరిపోసే బెంగాల్ లో ఆంగ్ల విద్యావేత్తలయిన రచయితలు... నవల, కథానిక వంటి ఆధునిక ప్రక్రియలపై కృషిచేయడం ప్రారంభించారు. సాహిత్య ప్రపంచంలో అత్యంత కీర్తిప్రతిష్టలు సంపాదించిన రవీంద్రుడు భారతీయకథానికకు కావ్యగౌరవం కలుగచేశాడు. ఆయన రాసిన కాబూలీవాలా, పోస్టాఫీసు, హోమ్ కమింగ్ మొదలైనవి అతి ముఖ్యమైనవి.

రవీంద్రుని తరువాత వంగ సాహిత్యలోకంలో మళ్లీ అంతటి సంచలనాన్ని కలిగించిన వాడు "శరత్ బాబు." ఈయన మొదటి కథ "మందిర్" 1907లో ప్రచురించబడింది. అదే సంవత్సరంలో ప్రేమ్ చంద్ ప్రచురించిన తొలి ఉర్దూకథల సంపుటిలో జాతీయోద్యమాన్ని మరింతగా పెంపొందించే భావజాలంతో కూడిన కథలు ఉండడం వల్ల బ్రిటిష్ వారు దానిని నిషేదించారు. భారతీయ కథాసాహిత్యంలో కథానిక ఇలా క్రమక్రమంగా ఎదుగుతూ 1910 నాటికి తెలుగు భాషలో సద్యో యౌవనంతో జన్మించింది.

## 3. 2. తెలుగు కథ - యుగ విభజన:

1910లో గురజాడ రాసిన "దిద్దుబాటు" కథ ఆధునిక లక్షణాలను కలిగి ఉండటం వల్ల తెలుగులో మొట్టమొదట కథగా గుర్తించారు గురజాడ తీర్చిదిద్దిన తెలుగు కథానిక ఎందరో సమర్థులైన కథకుల చేతిలో కొత్త పుంతలు తొక్కుతూ, క్రొంగొత్త ఒరవడులతో తెలుగు సాహిత్య క్షేత్రాన్ని సుసంపన్నం చేసింది. అంతేకాక పాలగుమ్మి పద్మరాజు రాసిన "గాలివాన" కథానిక తెలుగు కథానికకు ప్రపంచస్థాయి గుర్తింపును తెచ్చిపెట్టింది.

తెలుగు కథానిక మీద ప్రారంభ దినాల్లో పరిశోధన చేసిన డా. పోరంకి దక్షిణామూర్తి "కథానిక - స్వరూప స్వభావాలు" అనే పరిశోధనా గ్రంథంలో ఈ క్రింది విధంగా విభజించారు.

1. 1910 - 1918 - నిద్రాణం
2. 1919 - 1930 - విస్తరణం
3. 1931 - 1945 - వికసనం
4. 1946 - 1960 - మహోజ్వలం
5. 1960 - 1990 - ప్రాణావశిష్టం

ఒకొక్కరు ఒకొక్కరకంగా యుగవిభజన చేసినప్పటికీ, అది వారి వారి దృక్పథాన్ని బట్టి, సాహిత్య దృష్టిని బట్టి ఉంటుంది. ఎవరు ఎలాంటి విభజన చేసినా, తెలుగు కథానిక ప్రారంభమైన పాతిక ముప్పయి ఏళ్ల దాకా చక్కని రచనా వ్యాసాంగం సాగినప్పటికీ, ఫలాలు మాత్రం 1946 తరువాతనే లభించాయని చెప్పవచ్చు. అందుకే ఈ దశని 'ప్రయత్నదశ' లేదా 'తొలిదశ' అని పిలవడం జరుగుతుంది.

ఈ విభజనలనేవి పరిశీలనా సౌలభ్యం కోసమే కాని, కచ్ఛితంగా నిర్ధారణ చేసి చెప్పడానికి కాదు.

1910లో గురజాడ "దిద్దుబాటు" కథ ఇతివృత్తం దృష్ట్యా, పాత్ర చిత్రణ దృష్ట్యా, ఎత్తుగడ కథనం, శైలి, శిల్పం, ముగింపు ఇలా ఏ అంశాన్ని తీసుకున్నా అన్ని అంశాల్లోను పరిపుష్టిని పొందిన కథలా కనిపిస్తుంది తరువాత పదేళ్లపాటు మొదటి ప్రపంచయుద్ధం ప్రభావం కారణంగా తెలుగు కథ పురోభివృద్ధిలో కొంత స్తబ్ధత ఏర్పడ్డా , తరువాత కాలంలో చింతా దీక్షితులు, శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి సురవరం ప్రతాపరెడ్డి, వేలూరి శివరామశాస్త్రి లాంటి ప్రముఖ కథకులు కథా క్షేత్రంలో ప్రవేశించి బంగారు కథలు పండించారు.

ఆనాటి సమాజంలో ఉన్న సమస్యలను కథా వస్తువులుగా తీసుకొని, వాటికి అభ్యుదయ భావాలు జోడించి సమాజంలో మార్పు తీసుకురావడానికి తమ వంతు కృషిచేశారు. 1935 - 1940 వరకు తెలుగు సర్వతోముఖాభివృద్ధి చెందింది.

1940 వరకు తెలుగు కథ నడచిన తీరు ఒక విధమైతే, 1950 - 52 వరకు నడచిన తీరు మరొక విధానం. ఈ పది పన్నెండేళ్లలో ఎందరో మహామహులు కథారంగంలో ప్రవేశించారు. అలాంటి వారిలో చలం, గోపీచంద్, బుచ్చిబాబు, మల్లాది రామకృష్ణశాస్త్రి ముని మాణిక్యం నరసింహారావు, చా.సో, బలివాడ కాంతారావు, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి ఇల్లిందు సరస్వతీ దేవి, కాళీపట్నం రామారావు, రావిశాస్త్రి వంటి ఎందరో ప్రముఖులు కథాసాహిత్య క్షేత్రాన్ని సుసంపన్నం చేశారు. వీరిలో చలం, బుచ్చిబాబు, పాలగుమ్మి పద్మరాజు, కొడవటిగంటి వంటి కొందరు 1950 నాటికే ఉత్తమోత్తమ కథలను రచించారు.

ఈ క్రమంలో 1980 తరువాత తెలుగు సాహిత్యంపై స్త్రీవాదోద్యమం ప్రభావం చూపింది. ఈ ఉద్యమం ద్వారా ప్రభావితం చెందిన రచయితలు, రచయిత్రులు స్త్రీలకు సంబంధించిన అనేకాంశాలపై కథలు రాయడం జరిగింది. దీనిలో భాగంగానే స్త్రీ అస్తిత్వ కథలు వెలువడ్డాయి. ఇప్పుడు అస్తిత్వ చిత్రణ కథలను పరిశీలిద్దాం!

## 3. 3. అంటురోగం

ఈ కథ 30 జూలై 2006న ఆంధ్రజ్యోతి ఆదివారం అనుబంధంలో వెలువడింది. రచయిత్రి కె.ఎన్.మల్లీశ్వరి. సాధారణంగా స్త్రీలు బస్సులలో ప్రయాణించేటప్పుడు ఎదుర్కొనే 'లైంగిక హింస'ను గురించి వివరించడమే ఈ కథలోని వస్తు వు

### ఇతివృత్తం

ఈ కథలో ప్రధానపాత్ర నీలిమ. ఈమె ఉద్యోగస్తు రాలు ఒకరోజు బస్సులో ఆఫీసుకి వెళుతుండగా నీలిమ వెనుక సీటులో ఉన్న వ్యక్తి తన చేతివేళ్లతో నీలిమ వీపు మీద గోకుతాడు. అది గమనించిన నీలిమ అతణ్ణి గద్దిస్తు ంది నీలిమ మాటలకు అతను తిరిగి అవమానకరంగా మాట్లాడతాడు. ఆ మాటలు ఆమెను కుంగదీస్తా యి ఆ బాధతో ఆఫీసుకి చేరుకుంటుంది. మధ్యాహ్నం భోజన సమయంలో ఆ ఆఫీసు స్త్రీలంతా కలిసి, తమకెదురైన అలాంటి అనుభవాల గురించి (లైంగికహింస) చర్చించుకుంటారు. అంతేకాక ఇక ముందైనా తమపై జరిగే లైంగికహింసను ప్రతిఘటించాలనుకోవడంతో కథముగుస్తు ంది

### కథావిశ్లేషణ

ఈ కథలో నీలిమ చైతన్యవంతురాలైన స్త్రీగా కనిపిస్తు ంది ఆమెపై జరిగిన లైంగిక హింసను ప్రతిఘటిస్తు ంది నీలిమ ఎదుర్కొన్న ఈ హింస ప్రతి ఒక్క స్త్రీ ఏదో ఒక సందర్భంలో ఎదుర్కొంటుంది. నీలిమ తనను లైంగిక హింసకు గురిచేసిన వ్యక్తితో మొదటిసారి 'మీకే చెప్పేది చెయ్యితీయండి...' అంటుంది. అతను చెయ్యితీస్తా డు మళ్లీ కొంతసేపటికి అలాగే చేస్తా డు రెండోసారి నీలిమ, 'అలా మీదపడతారేంటి. సరిగా నిలుచోండి'... అని గద్దిస్తు ంది ఆ మాటలకతను "ఏంటమ్మా!... ఇందాకట్నుంచి చూస్తు న్నాను పెద్దాడినని కూడా చూడకుంటా ఒకటే అంటున్నావు. నిన్ను అంటుకోవడం నాకేమన్నా సరదానా...?"[6] అంటూ మాట్లాడతాడు. ఆ మాటలకు ఇద్దరు, ముగ్గురు మగవాళ్లు కూడా "అంతగా ముట్టుకోకుండా ఉండాలంటే కారులోనో, ఆటోలోనో వెళ్లండి"[7] అంటూ సలహా ఇస్తా రు ఆ మాటలు నీలిమను ఆశ్చర్యానికి, అవమానానికి గురిచేస్తా యి అతను తప్పుచేసి కూడా తప్పును అంత తెలివిగా సమర్థించుకున్నందుకు ఆశ్చర్యపోతుంది. అంతేకాక, సహ పురుష ప్రయాణికులు ఇచ్చిన సలహాను అవమానంగా భావిస్తు ంది

ఆఫీసుకి చేరుకున్నాక కూడా ఆమె ఇదే విషయం గురించి ఆలోచిస్తూ వుంటుంది. మధ్యహ్నాం భోజన సమయంలో ఆ ఆఫీసు స్త్రీలంతా కలసి ఇదే విషయం మీద చర్చించుకుంటారు. నీలిమ సహోద్యోగి అయిన సరళ, 'ఇంతకు ముందు పనిచేసిన మేనేజర్ పెట్టిన లైంగిక హింసను, అంటే... చూపుల్తో వేధించడం, ద్వంద్వార్థాలతో మాట్లాడటం, అవకాశం దొరికినప్పుడు తాకడం... మొదలైన చర్యలను భరించలేక ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి, ఇక్కడ చేరానని చెబుతుంది.

నీలిమ తన పాత స్నేహితురాలైన సరోజ గురించి చెప్తూ... సరోజా నేను మంచిస్నేహితులం. ఒకరోజు ఇద్దరం కాలేజీ నుంచి తిరిగివస్తు ండగా.. ఒకతను వేగంగా వచ్చి సరోజ ఛాతిని బలంగా ఢీ కొట్టాడు. ఆ దెబ్బకు సరోజ శారీరకంగా, మానసికంగా కుంగిపోతుంది. అంతవరకూ నిటారుగా నడిచిన సరోజ, వంగి నడవడం మొదలుపెట్టింది. కాలక్రమంలో 'ఫ్రిజిడిటీ' అనే మానసిక వ్యాధికి గురై, పెళ్లి తరువాత కూడా భర్తకు శారీరకంగా, మానసికంగా దగ్గరకాలేకపోతుంది. అందువల్ల భర్త విడాకులు కావాలంటూ కోర్టుకెళ్లాడు. కేసు నడుస్తు ంది.. అంటూ ముగిస్తు ంది నీలిమ చెప్పిన ఈ మాటలు ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించాయి. అక్కడున్న స్త్రీలంతా ఇకముందైనా తమపై జరిగే లైంగిక హింసను మౌనంగా భరించకుండా ధైర్యంగా ఎదుర్కోవాలని నిర్ణయించుకోవడంతో కథముగుస్తు ంది

## 3. 4 అగ్నిస్పర్శ:

ఈ కథ 2004లో ప్రచురించబడిన గీతల కావల అనే కథాసంపుటి నుండి గ్రహించబడినది. రచయిత్రి నల్లూరి రుక్మిణి. ఒక యువతి ఎదుర్కొన్న అస్తిత్వ పోరాటమే దీనిలోని వస్తు వు

**ఇతివృత్తం**

ఈ కథలో సునీత ప్రధాన పాత్ర. ఈమె స్నేహితురాలు తులసి. సునీత ఒక పేదకుటుంబంలో పుట్టిన అమ్మాయి. చిన్నతనం నుండి చాలా కష్టాలు పడుతుంది. సునీత చాలా తెలివైన అమ్మాయి కనుక అన్నింటిలోను మొదటిస్థానంలో ఉండేది. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూనే జీవితాన్ని నెట్టుకొస్తు ంది

సునీతకు చిన్నప్పటి నుంచి డాక్టర్ అవ్వాలని కోరిక ఉండేది. డాక్టర్ కోర్సు చదవడానికి అంత స్తోమత లేకపోయినప్పటికీ అనేక మంది సహాయ సహకారాలతో ఎలాగోలాగ డాక్టర్ కోర్సు పూర్తిచేస్తు ంది చదువుకుంటున్న రోజుల్లో ఆమె ఎన్నోరకాలైన ఇబ్బందులకు గురౌతుంది. వాటన్నింటికి కారణం తన పేదరికమే అని గ్రహించి, అలాంటి పేదవారిని ఉద్ధరించాలనే ఉద్దేశంతో కమ్యూనిస్ట్ పార్టీలో

చేరి కొంతకాలానికి ఎన్ కౌంటర్లో మరణిస్తుంది

**కథావిశ్లేషణ:**

ఈ కథలో సునీత ప్రాథమిక అవసరాలకోసం అస్తిత్వపోరాటం చేసినట్టు తెలుస్తోంది అంటే మానవుని కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ కోసం పోరాడినట్టు తెలుస్తోంది దీన్ని డార్విన్ 'struggle for existence' అన్నాడు. సునీత మనుగడ కోసం పోరాడుతుంది. తులసి, సునీత గురించి చెప్తూ... "సునీత వాళ్ల కుగ్రామం నుండి అప్పుడే వచ్చింది. తండ్రి పోవడం... తల్లి దిగులు, కుటుంబం గడవని స్థితిలో కకావికలమై ఉంది. పిల్లలు చిన్నవాళ్లు. కుటుంబం గడవని స్థితిలో పెద్దపిల్లవాడు చేనేతమగ్గం యజమాని దగ్గర, చిన్నాడు ఓ టైలర్ షాపులో పనికి కుదిరారు... తండ్రి ఉండగానే పోగొట్టుకున్న భూమిపోగా మిగిలిన ఇల్లు కూడా అమ్మాల్సివచ్చింది. దానితో విస్సన్నపేటతో ఆఖరిఅనుబంధం కూడా తెగిపోయింది"[8] అని చెప్తుంది ఈ మాటలు సునీత ఆర్థికస్థితిగతులను తెలియచేస్తున్నాయి మరొక సందర్భంలో సునీత, తులసితో మాట్లాడుతూ 'ఏదో ఆరాటపడి చదివానేగానీ... ఇప్పుడనిపిస్తుంది ఎందుకు చదివానా అని... నన్ను వద్దనలేక... చదివించే శక్తిలేక.. మా పెద్దన్న ఎంత యాతనపడుతున్నాడో... రెక్కలు తప్ప ఆస్తులులేని మాకు అప్పులెవరిస్తారే.. ' అంటుంది. ఈ మాటల్లో సునీత తన చదువు కోసం ఎన్ని అవస్థలుపడివుంటుందో ఊహించవచ్చు.

ఒకసారి సునీత తన ఆవేదనను తులసికి చెప్పుకోవాలనే ఉద్దేశంతో ఆమెను కలసి, "మావి ఏం బతుకులు తులసి... ఒక చిన్న గాలివాటుకు కూడా నిలబడలేవు... చూడు ఎక్కడి పత్తిపంటలు.. ఎక్కడి సింథటిక్ పైరిత్రాయిడ్స్... ఎక్కడి చేనేతమగ్గాలు... ఎక్కడి వ్యాపారస్తుల లాభాలు... ఎక్కడి చేనేత బతుకుల చావులు..."[9] అంటూ తమ జీవనాధారమైన చేనేతమగ్గం గురించి చెబుతుంది.

మరొక సందర్భంలో సునీత, తులసితో "మా బంధువులు... స్నేహితులు... మేం కనబడితే ఎక్కడ అప్పు అడుగుతామేమోనని మొహం చాటుచేసుకొనే వారు. కనబడితే పలకరించాల్సి వస్తుందేమోనని ఎలా తప్పుకొని పోయేవారో... అవి తలచుకొని మేం ఎంత అవమానం పొందేవాళ్లమో..... మేం బతికింది ఓ బతుకేనంటావా? పైకి కనపడని మా జీవితాల్లో మేమెంత గుంజాటన పడుతున్నామో ఎవరికి అర్థమౌతుంది. మా పేదరికాన్ని నిబ్బరం మాటున, గంభీరంగా అటు బయట, ఇటు కాలేజీలో ఎలా నెట్టుకొచ్చానో... నాలో నేను ఎంత ఘర్షణ పడాల్సి వచ్చిందో నాకు తెలుసు. నేను అటూఇటూ బెసికితే, నాపేదరికం ఎక్కడ వెక్కిరింతకు గురవుతుందోనని, ఊపిరి బిగపట్టుకొని సర్కస్ తాటి మీద జీవితాన్ని ఎలా నడిపానో..."[10] అంటూ ముగిస్తుంది

ఒక సందర్భంలో తులసి, తన భర్త తో సునీత గురించి మాట్లాడుతు... 'ఆకలికి పేగుల్లో నొప్పి రావడమంటే... పేదరికం మూలంగా ఆత్మాభిమానాలు దుమ్ములో కలసిపోవడం అంటే... మనకేం తెలుసండి. మనలాగ తాత, తండ్రులు సంపాదించిన ఆస్తు లు గానీ కట్నాల పేరుతో దండుకోవడం గానీ ఎలా వుంటుంది. వాళ్లు ఆకలితో పుట్టి , ఆకలితో చస్తా రు ఆ జీవితం అంచులదాకా పోయి గడిపింది. కనుకనే తనలాంటి వారి బాధను అర్థంచేసుకుంది. తానొక్కతే డాక్టరయ్యి జీవితాన్ని నాలుగు చేతులా జుర్రుకోవాలను కోలేదు. అందుకోసమే ముందు జీవితాన్ని త్యాగం చేసింది ...అంటూ చెప్తు ంది

ఈ కథలోసునీత తన ప్రాథమిక అవసరాలకోసం పోరాటంచేసినట్లు తెలుస్తో ంది సునీత తాను చేసిన అస్తిత్వపోరాటంలో గెలిచి, అనేక మంది పేదలకు సేవలందించాలనే ఉద్దేశంతో కమ్యూనిస్ట్ పార్టీలో చేరి అశువులు బాసింది.

## 3. 5. అతను:

ఈ కథ అక్టోబర్ 4, 2009న ఆంధ్రజ్యోతిలో వెలువడింది. రచయిత సాయిబ్రహ్మానందగోర్తి. ఈ కథలో మెడిసిన్ చదివిన ఒక అమ్మాయి, పెళ్లయ్యాక అమెరికా వెళ్లి భర్త ఆజ్ఞ మేరకు ఉద్యోగం లేకుండా ఖాళీగా ఉంటుంది. అలా ఉండటం ఆమెకు ఇష్టం ఉండదు. కొంత కాలానికి ఆ జీవితానికి స్వస్తి పలికి తనను ఉద్యోగం చేయకుండా ఆటంకపరుస్తు న్న భర్తను కూడా విడచిపెట్టి, తన జీవితాన్ని తనకిష్టమైనట్లు జీవించడంకోసం... తిరిగి భారతదేశం ప్రయాణమవ్వడం దీనిలోని ప్రధాన వస్తు వు.

**ఇతివృతం:**

ఈ కథలో ప్రధానపాత్ర 'ఉత్పల'. ఆమె ఒక మధ్య తరగతి కుటుంబానికి చెందిన అమ్మాయి. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలుపడి ఆమెను మెడిసిన్ చదివిస్తా రు చదువయ్యాక బంధువుల ద్వారా ప్రభాకర్ సంబంధం వస్తు ంది ఉత్పలను చూచి ఎలాంటి కట్నకానుకలు లేకుండానే ప్రభాకర్ ఆమెను పెళ్లి చేసుకుంటాడు. పెళ్లయ్యాక అమెరికా వెళ్లిపోతారు. ఉత్పల ఉద్యోగం చేస్తా నని అంటే భర్త ఒప్పుకోడు. అతణ్ణి ఒప్పించడానికి అనేక విధాల ప్రయత్నిస్తు ంది కాని తన ప్రయత్నం విఫలమవుతుంది. ఆ క్రమంలో నాలుగు సంవత్సరాలు గడచిపోతాయి. ఉత్పల ఒక బిడ్డకు తల్లవుతుంది.

ఉత్పల తల్లిదండ్రులు ఆమెను చదివించడానికిగాను పడిన కష్టాలు గుర్తొ స్తా యి పేదలకు సేవ

చేయాలి అనే ఆమె ఆశయం కలలా మిగిలిపోవడాన్ని భరించలేకపోతుంది. పెళ్లనే ఇరుకు చట్రంలో ఇరుక్కుపోవడం వల్ల తనను తాను పూర్తిగా కోల్పోయానని గ్రహిస్తుంది తన జీవితాన్ని తాను కాకుండా వేరే వాళ్లు జీవిస్తున్నారని ఆ క్రమంలో తన అస్తిత్వాన్ని కోల్పోయాననే గ్రహింపు కలుగుతుంది. ఇక అక్కడ ఉండలేక, తన భర్తకు చెప్పకుండా భారతదేశానికి బయలుదేరటంతో కథ ముగుస్తుంది

**కథావిశ్లేషణ:**

ఈ కథలో స్త్రీ బాగా చదువుకొని, ఉద్యోగం చేయాలనుకునే క్రమంలో ఆమెకు ఎదురయ్యే ఆటుపోట్లను కళ్లకు కట్టినట్లు చూపించారు రచయిత. ప్రస్తుత కాలంలో చదువుకున్న ప్రతీ స్త్రీ తన చదువుకు తగిన ఉద్యోగం చేయాలనుకుంటుంది. ఉత్పల విషయంలో కూడా అదే జరిగింది. ఆమె చదివింది డాక్టర్ కోర్సు కాబట్టి పేదలకు సేవ చెయ్యాలనే కోరిక ఆమెలో బలంగా నాటుకుపోతుంది. అయితే పెళ్లయ్యాక ఆమె కోరికలకు, ఆశయాలకు నీళ్ళొదలక తప్పలేదు. ప్రభాకర్ ఒక సందర్భంలో పరోక్షంగా ఉత్పల వాళ్ళ చెల్లితో 'ఉత్పల ఉద్యోగం చెయ్యడం తనకు ఇష్టం లేదని' చెప్తాడు ఉత్పల భారతదేశం వస్తుండగా తన సహ ప్రయాణికుడైన వర్మతో 'అమెరికాలో డాక్టర్లకి అందులోనూ సర్జన్లకు మరీ ఎక్కువ డాలర్లు వస్తాయట తనకంటే ఎక్కువ సంపాదిస్తూ ఉండటం అతను భరించలేడంట... ' అంటూ తన భర్త మనస్తత్వం గురించి చెప్తుంది

ఈ సందర్భాన్ని గమనిస్తే తరతరాలుగా వస్తున్న పితృస్వామ్యసమాజం, పురుషునిలో కలిగించిన ఆధిక్యతాభావం తేటతెల్లమవుతుంది. పురుషుడు అంటే... భర్త కానీ అన్న కానీ తండ్రి కానీ... ఇలా ఎవరైనా తన కంటే తన భార్యగాని, చెల్లి కాని, తన కంటే ఉన్నతస్థితిలో ఉంటే వారి అహం దెబ్బతినడమే కాకుండా, ఆ విషయాన్ని అసలు భరించలేరు అని స్పష్టమౌతోంది.

మరొక సందర్భంలో ఉత్పల ఉద్యోగం చేస్తానని భర్తని అడిగితే అతనికి ఏమి చెప్పాలో, ఎలా చెప్పాలో తెలియక 'నిన్ను, పాపను విడిచి ఉండలేన'ని ఏడ్చేస్తాడు అలా ఏళ్లు గడిపేశాడు గాని ఉత్పల కోరికను మన్నించలేకపోతాడు. ఏదో విధంగా ఆమె ప్రయత్నానికి అడ్డుతగిలి, ఆమె కోరికను అణిచివేశాడే తప్ప ప్రోత్సహించలేకపోతాడు. ఉత్పలకు ఎప్పుడైతే ఆస్తిత్వ స్పృహ కలిగిందో, అంటే... తను చదివిన చదువూ తన శక్తిసామర్థ్యాలన్నీ వంటింటికే అంకితమైపోవడం గ్రహిస్తుందో ఇక ఆ స్థితిని భరించలేకపోతుంది. భర్తదగ్గర ఉన్నంతకాలం వంటింటి కుందేలులాగా జీవించాలి తప్ప బయట

ప్రపంచానికి తన సేవలందించే అవకాశం ఉండదని తెలుసుకుంటుంది. ఇక మిగిలిన జీవితమన్నా తన కోసం తాను, అంటే... తన ఇష్టాలకు, అభిరుచులకు అనుగుణంగా తన జీవితాన్ని మలుచుకోవాలనే ఉద్దేశంతో స్వదేశానికి ప్రయాణమవుతుంది. ఈ కథలో ఉత్పల తన అస్తిత్వాన్ని కాపాడుకున్న స్త్రీగా మనకు కనిపిస్తు ంది

## 3. 6. ఆకాశంలో సగం:

ఈ కథ ప్రజాసాహితి మాసపత్రికలో మార్చి 2000న అచ్చయ్యింది. రచయిత్రి వి.రామలక్ష్మి. ఈ కథలో ఆడపిల్లలు తల్లి గర్భంలో పిండంగా రూపొందింది మొదలు, తమ ఉనికికి ఎదురౌతున్న పోరాటాలేమిటి, ఆ పోరాటాల్ని అధిగమించి భూమిమీద కొచ్చాక ఏ విధమైన వివక్షను ఎదురుకొంటున్నారు, సమాజం వారిని ఏవిధంగా చూస్తో ంది.. మొదలైన విషయాలన్ని హాస్యభరితంగా చిత్రించడం జరిగింది.

### ఇతివృత్తం

ఈ మధ్యకాలంలో భూమిమీద బ్రహ్మదేవుడు రాసిన రాతలేవి చెల్లడంలేదని, వాటిని మార్చేసి ఎవరో రాస్తు న్నారని అందుకే భూలోకం అల్లకల్లోలం అయిపోతుందని తెలుసుకొన్న బ్రహ్మదేవుడు, విషయం ఏమిటో తెలుసుకుందామని మనిషి రూపాన్ని ధరించి భూమ్మీదకు రావడంతో కథ ప్రారంభమవుతుంది. బ్రహ్మదేవుడు భూమ్మీదకు రాగానే ఒక ముసలాయన ఏడుస్తూ కనిపిస్తా డు కారణాన్ని విచారించగా, తన కొడుకుకి పెళ్లికాలేదని, దానికి కారణం ఆడపిల్లలు దొరకకపోవడం అని తెలుసుకుంటాడు. తన రేటు ప్రకారం ఆడపిల్లలను సరిగానే పుట్టిస్తు న్నాను మరెందుకు ఇలాంటి సమస్య ఉత్పన్నమైందో తెలుసుకోవాలనుకుంటాడు బ్రహ్మదేవుడు. అందుకోసం ఒక ఆసుపత్రికి వెళ్తా డు అక్కడ ఇసుకేస్తే రాలనంతమంది జనం ఉంటారు. బ్రహ్మదేవుడు కారణం కనుక్కోగా, అప్పటికి ఆడపిల్ల పుట్టి 20 సంవత్సరాలయ్యిందని, అందుకే అంతమంది అక్కడ ఉన్నారని ఎవరో చెప్తా రు బ్రహ్మదేవుడు అదృశ్యరూపంలో ఆసుపత్రి గదిలోకి ప్రవేశిస్తా డు అక్కడ ప్రసవించడానికి సిద్ధంగా ఉన్న స్త్రీ వేదనపడుతూ ఉంటుంది. ఎంతసేపటికీ శిశివు బయటకు రాదు. డాక్టర్లకు విషయం అంతుపట్టకుండా ఉంటుంది. అప్పుడు బ్రహ్మదేవుడు ఆ పాపను ఇలా అడుగుతాడు. ' పాపా! పాపా! ఎందుకు పుట్టట్లేదు? ' దానికి సమాధానంగా

ఆ అమ్మాయి నవ్వి, తాము పుట్టింది మొదలుకొని ఏవిధంగా వివక్షకు గురౌతున్నారో, అంటే... ఆడపిల్లలను తక్కువగా చూడ్డం, చదివించే విషయంలో అబ్బాయిలతో పోల్చుకొంటే తక్కువ ఖర్చు అయ్యే చదువులు చెప్పించడం, ఆడపిల్లలను మైనెస్ గా భావించడం... ఇలా తమ సమస్యలన్నీ ఏకరువు పెడుతుంది. ఆ మాటలకు బ్రహ్మదేవుడు స్పందించి, ఇంతకు ముందున్న పరిస్థితికి భిన్నంగా స్త్రీల తలరాత రాస్తా డు ప్రస్తు తకాలంలో పురుషలకున్న ఆధిపత్యాన్ని స్త్రీలకు చెందేటట్లు రాసి, స్త్రీల దయనీయస్థితి పురుషులకు మారుస్తా డు అది ఆ పుట్టబోయే పాపకు చూపించి ఇప్పుడు ఎలా ఉంది అని అడుగుతాడు.

దానికి సమాధానంగా ఆ పాప ఇలా కూడా వద్దు. స్త్రీ పురుషుల మధ్య అసమానత్వం లేని విధంగా రాయి అని అంటుంది. బ్రహ్మదేవుడు దానికి అంగీకరించి అలానే రాస్తా ను అని అంటాడు. 'నాకు బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిస్తే పుట్టనా!' అంటుంది పాప. బ్రహ్మదేవుడు నవ్వుముఖంతో తిరుగుప్రయాణం అవుతాడు. దాంతో కథ ముగుస్తు ంది

**కథావిశ్లేషణ:**

ఈ కథ హాస్యభరితంగా, ఊహాత్మకంగా రాయబడింది. అలా అని అభూత కల్పన కాదు. యథార్థానికి కొంత ఊహాకల్పనను చేర్చి చెప్పడం జరిగింది. తల్లిగర్భంలో పిండంగా రూపొంది, ఆ పిండం ఆడపిల్లగా నిర్ధారణ అయినప్పటి నుండి వాళ్లకు ఎదురయ్యే కష్టాలను ఈ కథ ద్వారా తెలియజేయడం జరిగింది.

ఈ కథలో బ్రహ్మదేవుడు ఎందుకు ఆడపిల్లలు పుట్టట్లేదు. నారేటు ప్రకారం నేను పుట్టిస్తు న్నాను అయినా ఇలా ఎందుకు జరుగుతుందో కనుక్కోవాలని అనుకుంటాడు. ఆయన పరిశీలనలో తేలిందేమిటంటే, తను పుట్టమని రాసినా గాని ఆడపిల్లలు అసలు పిండాలుగానే రూపుదిద్దుకోవడం లేదని, ఒకవేళ పిండాలయినా లేత నెలల్లోనే గర్భస్రావాలవుతున్నాయని తెలుసుకుంటాడు. అంతేకాక పుట్టబోయే పాపని, ఎందుకు పుట్టట్లేదు అని అడుగగా ఆ పాప స్త్రీ పురుషుల సంభాషణా రూపంలో చెప్తు ంది.

"ఏవండీ మీ మిసెస్ కి డెలివరీ అయ్యిందా?"

'ఆ!' అయ్యిందండీ

"అయితే మైనస్సన్నమాట. బాగా డబ్బు జాగ్రత్త చేయాలి మరి"

మూడు సంవత్సారాలు నిండగానే... 'అదేవిట్రా కాన్వెంట్ లో చేర్చడానికి, నాలుగు వేలు డొనేషనా! ఆడపిల్ల కూడానూ! దాని చదువుకే ఇంత తగలేస్తే పెళ్లికి ఎక్కడి నుంచి తెస్తా వురా?'

" ఏంచేస్తాం మరి. ఖర్మ! ఆడపిల్లలకి చదువుకీ ఖర్చు పెట్టాలి.' పెళ్లికీ పెట్టాలి."

పదేళ్లు దాటుతున్నప్పుడు 'ఏమిటీ ఆ ఉరుకులూ, పరుగులూ, ఎద్దులాగా! ఆడపిల్లవు కావా...', పదిహేనేళ్ళప్పుడు " నాన్న! నాకు సైన్స్ గ్రూపు తీసుకోవాలని ఉంది" అని అంటే. 'చాల్లే... ఆడపిల్లకి ఆర్ట్స్ చాలు.'

పెళ్లి అయ్యాక... 'ఎంత ఉద్యోగం చేస్తే మాత్రం... పొద్దుటే లేచి మొగుడికి కాఫీ ఇవ్వద్దూ!'

రిటైరయిన భర్త భార్యతో " అబ్బ! తొందరగా కాఫీ తేవే! పేపరొచ్చేసింది."

"ఉండండి కొంచెం నీరసంగా వుంది నాకు. చచ్చేదాక తప్పదు కదా ఈ చాకిరీ!" దానికి సమాధానంగా భర్త "ఏం చేస్తావే ఆ బ్రహ్మదేవుడు ఆడదాన్ని చాకిరీ చేయడానికి పుట్టించాడు..." [11] అని అంటాడు.

ఈ విధంగా ఆ పుట్టబోయే పాప, ఒక్కొక్క దశలో స్త్రీ ఏవిధంగా వివక్షకు గురవుతుందో తెలియజేయడం జరిగింది. అంతేకాక ఏ విధంగా అణచివేయబడుతుందో, క్రమక్రమంగా తన అస్తిత్వాన్ని ఏవిధంగా కోల్పోతుంది? మొదలైన విషయాలు చాలా స్పష్టంగా బ్రహ్మదేవుడికి తెలియజేస్తు ంది "ఏవండీ ! మీ మిసెస్ కి డేలివరీ అయ్యిందా?"

"అయ్యిందండీ ! అమ్మాయి."

ఎవరైనా ఒకటే! డెలివరీ సుఖంగా అయి, తల్లీబిడ్డా సుఖంగా ఉంటే చాలు.

మూడేళ్లప్పుడు అమ్మాయిని కూడా అబ్బాయి చదివే స్కూలోనే వెయ్యరా! కొంచెం ఖర్చు అయినాగానీ రెండు అక్షరమ్ముక్కలొస్తా యి"

అలాగేనమ్మా! పదేళ్లు దాటుతున్నప్పుడు 'తల్లి! నీకోసం, అన్నయ్యకోసం మీకు తగ్గ బట్టలు కొన్నాను. అవి వేసుకుని ఆటలకెళ్లండమ్మ, మళ్లీ చదువు వేళకి వచ్చేయ్యాలి.'

పదిహేనేళ్ళప్పుడు 'నీ ఇష్టం అయిన గ్రూపు తీసుకుని, మీక్కావలసిన చదువులు చదువుకోండమ్మా! మీ

కాళ్లమీద నిలబడ్డాక మీ పెళ్లిళ్లు కూడా మీరెవరిని ఇష్టపడితే వాళ్లని చేస్తా ను"

పెళ్ళయ్యాక "నేను కుక్కరు పెడతాను, నువ్వు కూరలు తరుగు. ఇద్దరం కలిసి తొందరగా పని పూర్తిచేస్తే పిక్చర్ కి వెళ్దాం"[12] అంటూ స్త్రీలు కోరుకుంటున్న జీవితాన్ని రచయిత్రి మన కళ్లముందు ఆవిష్కరించారు.

ఈ విధమైన సమాజం ఏర్పడినప్పుడు సమాజంలో ఉన్న రుగ్మతలు, అంటే... భ్రూణహత్యలు, శిశుహత్యలు, ఆడపిల్ల అని చెత్తకుండీలలో పడెయ్యడం, వరకట్న వేధింపులు, మొదలైన సమస్యలు నిర్మూలమై ఆరోగ్యవంతమయిన సమాజం ఏర్పడి, తద్వారా భారతజాతి గర్వించదగ్గ పౌరులుగా రూపుదిద్దుకుని, మన దేశాన్ని మరింత ప్రగతిపథం వైపు నడిపించడానికి అవకాశం ఉంటుంది.

## 3. 7. ఆధిపత్యం:

ఈ కథ 'నది' మాసపత్రికలో నవంబర్ 2007న వెలువడింది. రచయిత డాక్టర్ మంతెన సూర్యనారాయణరాజు. ఈ కథలో ఒక భర్త తన భార్యపై ఏవిధమైన పురుషాధిపత్యాన్ని ప్రదర్శించాడు, తద్వారా ఎలాంటి పరిణామాలను ఎదుర్కొన్నాడు... మొదలైన అంశాలను వివరించడం జరిగింది.

ఈ కథ లో ప్రధానపాత్ర ఇందువదన. ఈమె సాధారణ కుటుంబానికి చెందిన అమ్మాయి. ప్రైవేట్ గా డిగ్రీ చదివి, అప్పడాలు, వడియాలు తయారు చేసే కుటీర పరిశ్రమపెట్టి, అనేకమందికి పని కల్పించి, అయిదు సంవత్సరాలలోనే ఆర్థికంగా నిలదొక్కుకుని, వ్యాపారాన్ని అభివృద్ధిపథం వైపు నడిపిస్తు ంది ఈ క్రమంలో ఒక రాజకీయవేత్త ఆమెను లోపరుచుకోవాలనే ఉద్ధేశంతో డిటర్జెంట్ ఫ్యాక్టరీ పెట్టుకోవడానికి లోన్ మంజూరు చేయించి, అదును చూసి అతని మనసులోని కోరికను బయటపెడతాడు. దానికి ఇందువదన తన చెప్పుతో అతని చెంపలు వాయిస్తు ంది ఆ తర్వాత ఆమెను ఎన్నో విధాలుగా అవమానపరచాలని ప్రయత్నించి చివరకు విఫలుడవుతాడు.

ఇందువదనకు పెళ్లివయసు దాటిపోతున్నా ఆమె ఏ విధంగాను పెళ్లికోసం ప్రయత్నించకపోవడంతో అందరూ ఆమెను నానా రకాలైన మాటల ద్వారా హింసిస్తు ంటారు ఇక ఆ మాటలు భరించలేక, తనకు అనుకూలుడుగా భావించిన డాక్టర్ కురూప్ ని వివాహం చేసుకుంటుంది. కొంతకాలానికి అతని నిజస్వరూపం తెలుసుకుంటుంది. ఇక అతనితో జీవించడం, అసాధ్యం అని గ్రహిస్తు ంది తన అస్తిత్వాన్ని

కోల్పోవడం ఇష్టంలేక, అతనికి దూరంగా జీవిస్తు ంది కొన్నాళ్లకు తన భర్త వచ్చి ఆమె సహాయం కోరగా, అతనికి సహాయం చేస్తు ంది కాని తిరిగి అతణ్ణి తన జీవితంలోకి ఆహ్వానించకపోవడంతో కథముగుస్తు ంది

**కథావిశ్లేషణ:**

ఈ కథలో అస్తిత్వం కాపాడుకోవాలనుకునే స్త్రీకి ఎదురైయే కష్టాల గురించి, ఆమె తన అస్తిత్వాన్ని కాపాడుకున్నప్పుడు కలిగే ఆనందాన్ని రచయిత చక్కగా వివరించారు.

ఈ కథలో ఇందువదన సామాన్యమైన కుటుంబానికి చెందినది. అయినప్పటికి ఆత్మాభిమానం కలిగిన అమ్మాయి. అందుకే తనే స్వయంగా కుటీరపరిశ్రమ స్థాపించి, అనేకమందికి ఉపాధి కల్పించగలుగుతుంది. అంతేకాక, దుర్బుద్ధితో వ్యవహరించిన రాజకీయ నాయకునికి దేహశుద్ధి చేస్తు ంది అయితే డా. కురూప్ ని తన జీవితంలోకి ఆహ్వానించడంతో ఆమె జీవితం అనుకోని మలుపు తిరుగుతుంది. కురూప్ పెళ్లికి ముందు ఒకలా, పెళ్లి తరువాత ఒకలా ప్రవర్తించడం మొదలు పెడతాడు. అతని ప్రవర్తన ఇందువదనకి చాలా రోతపుట్టిస్తు ంది ఇక అలాంటి వ్యక్తితో కలిసి ఉండలేననుకుంటుంది. కురూప్ ఒక సందర్భంలో ఇందువదనపై చెయ్యిచేసుకోబోతే ప్రతిఘటించబోయి అశక్తురాలిగా మిగిలిపోతుంది. అంతేకాక కురూప్ ఆమె వ్యాపారాన్ని హేళన చేస్తు ండడం వల్ల ఆమె ఆత్మాభిమానం దెబ్బతింటుంది. ఒక సందర్భంలో కురూప్ ఇందువదన దగ్గరకు వచ్చి పదివేలు కావాలని డిమాండ్ చేస్తా డు అంత మొత్తం ఆమె దగ్గర లేవంటుంది. కోపంతో భార్యను కొడతాడు. ఆమె వెంటనే మెళ్లో అతడు కట్టిన తాళిని తీసి అతనికిస్తూ, "ఇదిగో! దీన్ని తీసుకెళ్లి మీఇష్టం వచ్చినట్లు చేసుకోండి. ఇవాల్టి నుంచీ మీ బ్రతుకు మీది నా బ్రతుకు నాది గెట్ అవుట్" అంటూ అరుస్తు ంది

ఈ మాటల బట్టి ఆమె తన భర్త ప్రవర్తన వల్ల ఎంత విసిగిపోయిందో అర్థమవుతుంది. అంతేకాక అలాంటి వ్యక్తితో ఇక కలిసిఉండడం అసాధ్యమని భావించి అతని నుండి విడిపోయి స్వతంత్ర వ్యక్తిత్వం గల స్త్రీగా, తన అస్తిత్వాన్ని కాపాడుకున్న స్త్రీగా ఇందువదన మనకు కనిపిస్తు ంది ఈ కథ చివరిలో ఆమె భర్త తన వద్దకు వచ్చి, తనకు ఆరోగ్యం బాగాలేదని ఆర్థికంగా సహాయం చెయ్యమని అర్థిస్తా డు అతనికి సహాయం చేస్తు ందే తప్ప, ఎలాంటి చాపల్యాలకు లొంగదు. అంటే భర్తను తిరిగి చేర్చుకోవడమో, లేదా అతని యెడల సానుభూతి ప్రకటించడమో చెయ్యకుండా సున్నిత తిరస్కారంతో అతణ్ణి పంపించేస్తు ంది ఇందువదన తన అస్తిత్వాన్ని కాపాడుకుంది అనడానికి ఇది చక్కని నిదర్శనం.

## 3. 8. ఆవర్జా:

ఈ కథ 10 డిశంబర్ 2002లో ఇండియాటుడేలో అచ్చయింది. రచయిత్రి "చంద్రలత". స్త్రీ ఉనికిని లేదా అస్తిత్వాన్ని సవాలుచేస్తు న్న అంశాలేమిటి అనే విషయాన్ని ఈ కథలో వివరించడం జరిగింది.

ఆవర్జా కథలో ప్రధానపాత్ర విధీశ. ఆమె ఒక ఉన్నత కుటుంబంలో పుట్టి పెరిగిన అమ్మాయి. ఆమె తండ్రి పేరుమోసిన ఆడిటర్. విధీశ కూడా బాగా చదువుకుని ఆడిటర్ కావాలని ఆశిస్తు ంది కాని తండ్రి దానికి అంగీకరించడు. అయినప్పటికీ ఆమె పట్టువిడువకుండా అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటుంది. పల్లె, పట్నం కానటువంటి ఊర్లో ఆమె మొట్టమొదటి మహిళా ఆడిటర్ గా రంగప్రవేశం చేస్తు ంది ఆ రోజున మిగతా ఆడిటర్లంతా, ఒక స్త్రీ ఆ రంగంలో ప్రవేశించడాన్ని వేనోళ్ల పొగుడుతారు.

విధీశకి ఉద్యోగంలో చేరిన కొద్ది దినాలకే సమాజములోని పరిస్థితులు, దాని పోకడ క్రమక్రమంగా అవగతమవుతూ వుంటాయి. విధీశ తండ్రి మాత్రం ఎప్పుడు స్త్రీ సామర్థ్యం తక్కువని, మానసిక ఒత్తిడి కలుగచేసే ఈ ఆడిటర్ ఉద్యోగం స్త్రీలకు తగినదికాదని వాదిస్తూ వుండేవాడు. విధీశ కూడా తండ్రి మాటలకు సందర్భోచితమైన సమాధానాలు చెప్పి ఆయన్ని సముదాయించే ప్రయత్నం చేసేది. విధీశ తన కోసం సుమ, యామిని మరియు రమణ అనే ముగ్గురు అసిస్టెంట్లను నియమించుకుంటుంది. వాళ్లు ఎంత శ్రద్ధగా పనిచేసినప్పటికీ ఏ చిన్న తప్పు జరిగినా వారిని పిలిచి మందలించేది. విధీశ ముక్కు సుటిగాపోయే మనస్తత్వం కలిగిన వ్యక్తి కావడం వల్ల ఎవరూ ఆమెతో స్వేచ్ఛగా మాట్లాడలేకపోతారు. బాగా పనిచేయగలిగిన నేర్పు ఆమెలో ఉన్నప్పటికీ, ఆమె ఎవ్వరి మన్ననలనూ పొందలేకపోతుంది.

విధీశ ఒక రోజు సుమ అనే తన అసిస్టెంటును ఏదో పని నిమిత్తం పిలుస్తు ంది కాని ఆమె వెళ్లదు సరికదా కనీసం నోరు తెరిచి సమాధానం కూడా చెప్పదు. విధీశకి ఆమె ప్రవర్తన చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తు ంది కాని ఏమి చెయ్యలేక మౌనంగా ఉండిపోతుంది. కొంత సేపటికి యామిని, విధీశ దగ్గరికి వచ్చి, ఆమెకు అధిక రక్త స్రావం అవుతుందని, పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని చెప్పడంతో ఆమెను ఆసుపత్రిలో చేర్పిస్తా రు అనుకోకుండా ఏర్పడిన పరిస్థితిని గురించి స్త్రీలు పనిచేసే స్థలాలలో ఎలాంటి కష్టనష్టాలు ఎదుర్కొంటున్నారు? వాటికి పరిష్కారాలేమిటి? అని విధీశ ఆలోచిస్తు ండడంతో కథ ముగుస్తు ంది

**కథావిశ్లేషణ:**

ఈకథను మనం విశ్లేషిస్తే అనేక విషయాలు అవగతమవుతాయి. స్త్రీలు పురుషులతో పాటు సమానమైన శక్తిసామర్థ్యాలు కలిగి ఉన్నప్పటికీ ఈ పితృస్వామ్యసమాజం వారిని ఎందుకు చిన్నచూపు చూస్తోంది? స్త్రీ అస్తిత్వాన్ని నిర్ణయించే అంశాలేమిటో ఈ కథలో వివరించడం జరిగింది.

ఈ కథలో విధీశ మామగారు ఆయన అనుభవాన్ని చెప్తూ "అమ్మా... నేనప్పుడు లీడ్ బ్యాంక్ మేనేజర్ని. మా గ్రామీణ బ్యాంక్ మేనేజర్ మీద బోలెడన్ని పిటీషన్లు వచ్చిపడ్డాయి. ఆ అమ్మాయి నాకు ముందు నుంచి తెలుసు. ఆ పిటీషన్ల నిండా ఆమె దారి తప్పిన చెడు ప్రవర్తన గురించిన రాతలే. ఎంక్వైరీకి వెళ్ళాం! ఆరా తీస్తే ఆమె చేసిన చెడ్డ పనేమిటో తెలుసా? సైకిలెక్కి చుడీదార్ వేసుకుని రికవరీ కోసం పల్లెల్లో తిరగడం"[13]. అంతేకాక కథ చివరిలో విధీశ అత్తమ్మ ఆమె గురించి చెప్తు "ఆ గ్రామీణ బ్యాంక్ ఉద్యోగిని గురించి 'బరితెగించిందనీ, బజారున పడిందని' గుసగుసలు పోయిన పట్టణ బ్యాంకు ఉద్యోగుల్లో మేమూ ఉన్నామమ్మా... కాని అది ఆ అమ్మాయికి పనిపట్ల ఉన్న శ్రద్ధ అని, వ్యక్తిగా ఆమె నిజాయితీ అనీ... వృతిపట్ల ఆమె నిబద్దత అనీ... మేం అనుకోలేకపోయాం. మాకు చేరిన పిటీషన్ల కళ్ళతో మేం చూసాం"[14] అని అంటుంది.

ఈ మాటల ద్వారా మనకు అనేక విషయాలు అవగతమవుతాయి. ఒక స్త్రీ తన బాధ్యతను మరింత అంకితభావంతో చెయ్యాలనే ఉద్ధేశంతో తన సౌకర్యార్థం కొంచెం భిన్నంగా వుండడానికి ప్రయత్నిస్తే అంటే... సమాజం స్త్రీని ఇలా ఉండాలని ఆదేశించిన నియమాలకు భిన్నంగా వుంటే ఇక ఆ స్త్రీని ఎన్ని రకాలుగా బాధించవచ్చో అన్ని రకాలుగా బాధిస్తా రు ఈ కథలో కూడా అలాగే జరిగింది. ఆమె చేసిన తప్పంతా చుడీదార్ వేసుకొని సైకిల్ తొక్కడమే. ఈ చిన్న విషయానికే సమాజం ఆమెను రకరకాలుగా నిందించడం జరుగుతుంది. ఒక స్త్రీ యొక్క బాహ్యరూపాన్ని చూసి ఆమె వ్యక్తిత్వాన్ని లేదా ఆమె శీలాన్ని అంచనా వేయడం ఎంత అమానుషమో ఈ సందర్భాన్ని బట్టి మనం అర్థంచేసుకోవచ్చు. ఈవిధమైన తప్పుడు అంచనాల ద్వారా స్త్రీల వ్యక్తిత్వాన్ని కించపరచి మాట్లాడటం మానసిక హింసగా పరిగణించబడుతుంది. ఈ కథలో ఈ విధమైన హింస భరించిన ఆ గ్రామీణ బ్యాంక్ మేజేజర్ స్త్రీ, కావాలని బదిలీ చేయించుకుంటుంది. దీన్నిబట్టి ఆమె మానసికంగా ఎంతగా కుంగిపోయి వుండి వుంటుందో మనం ఊహించవచ్చు.

ఒక సందర్భంలో సుమాకి అధిక రక్తస్రావం అవుతుంది. అది గమనించిన సహ ఉద్యోగిని విధీశకి

చెప్పి, ఆసుపత్రిలో చేరుస్తా రు సుమ ఈ విషయంలో సిగ్గుపడి, ఎవరికి చెప్పకుండా ఉదయం నుండి అలానే వుండి పోవడంవల్ల అప్పటికే చాలా రక్తం పోతుంది. ఆ సందర్భంలో నవ్య ఇలా అంటుంది "అదే మన పిల్లలకు, మన ఆడవాళ్లకి నేర్పాల్సింది. మన మగవాళ్లకి నేర్పాల్సింది. ఇది ఒక సహజ శరీరధర్మం. ఇందులో అవమానమూ లేదు. అసహ్యమూ లేదు. సిగ్గుపడాల్సిందీ లేదు. ఋతుచక్రం ఆడవారిని అనుక్షణం శాసిస్తూ నే వుంటుంది... నిత్యజీవితంలో నిరంతరం చెలరేగే ఈ సంఘర్షణ ఈ వత్తిడి ఈ ఆందోళన - ఆ జీవరసాయన ప్రక్రియను ప్రభావితం చేస్తు నే వుంటాయి... వి నీడ్ బ్యాలెన్స్... కాస్తంత సమతుల్యం కావలి విధీ...!"[15]

ఈ సందర్భాన్ని గమనిస్తే స్త్రీలకు ప్రకృతి సిద్ధంగా వచ్చే నెలసరి విషయంలో వీరికి సరియైన అవగాహన లేక ఇంకా ఆ విషయంలో సిగ్గుపడడం వల్ల అది వారి ప్రాణాణ్ణే హరించే పరిస్థితి ఏర్పడడం దు:ఖదాయకం. ఈ కథను మనం గమనించినట్లయితే స్త్రీ అస్తిత్వాన్ని ఆమె శక్తిసామర్థ్యాలు కాక పితృస్వామ్య భావజాలమే నిర్ణయిస్తు న్నట్లు తెలుస్తో ంది స్త్రీలు తమ అస్తిత్వం కోసం నిత్యం సమాజంతో, తమతో తాము సంఘర్షించవలసివస్తు ంది

## 3. 9. ఆశ

ఈ కథ 28 జూన్ 2009న ఆంధ్రజ్యోతి అనుబంధంలో వెలువడింది. రచయిత్రి టి. శ్రీవల్లి రాధిక. ఈ కథలో అనేక ప్రశ్నలకు తాత్విక ధోరణిలో సమాధానం చెప్పడం జరిగింది.

**ఇతివృత్తం**

ఈ కథలో ప్రధాన పాత్రలు మీనాక్షి, ఆమె స్నేహితురాలు. కథ ఉత్తమ పురుషలో మొదలౌతుంది. మీనాక్షి, ఆమె స్నేహితురాలు ఒకే కంపెనీలో పనిచేస్తూ ఉంటారు. మీనాక్షి ఉద్యోగం కౌన్సిలర్. మీనాక్షి స్నేహితురాలు సాహిత్యం పట్ల ఆసక్తి కలిగిన అమ్మాయి కనుక సాహిత్య చర్చలో పాల్గొనేది. తను ఉండేచోట సాహిత్యాభిమానులంతా కలసి ప్రతినెలా ఒక పుస్తకాన్ని గురించో ఒక రచయిత గురించో చర్చించుకుంటారు. ఈ చర్చిలో భాగంగా ఒకరోజు "కొల్లాయి గట్టితేనేమి" నవల గురించి చర్చించుకుంటుండగా ఆ నవలలో నాయకుడైన రామనాథం భార్య సుందరి, తన తండ్రి తనను కాపురానికి వెళ్లొద్దన్నాడని రామనాథానికి దూరంగా ఉంటుంది. రామనాథం ఎన్నిసార్లు కాపురానికి రమ్మని అడిగినా

ఆమె రాకపోవడంతో అతను స్వరాజ్యం అనే అమ్మాయితో సహజీవనం చేయడం మొదలుపెడతాడు.

ఒకరోజు రామనాథం, స్వరాజ్యం రైల్వేస్టేషన్లో చాలా అన్యోన్యంగా కలసి తిరుగుతుండగా ఒక పోలీసు అదంతా చూసి, స్వరాజ్యాన్ని అందరి ముందు అవమానపరుస్తా డు ఆ తరువాత రామనాథం, పోలీసు మధ్య వాగ్వివాదం జరుగుతుంది. పోలీసు రివాల్వర్ తీయడంతో రామనాథం రొమ్ము విరుచుకొని నిలబడతాడు. దాంతో పోలీసు రివాల్వర్ దించేసి వెళ్లిపోతాడు. జనమంతా రామనాథానికి జేజేలు కొడతారు.

ఆ తరువాత రామనాథం జరిగిన సంఘటనను విశ్లేషించుకుంటూ తన వల్లే స్వరాజ్యానికి అవమానం కలిగిందని గ్రహిస్తా డు.

ఈ నవలలో రామనాథం వ్యక్తిత్వం అందరికీ సహజంగా అనిపించినా, మీనాక్షి స్నేహితురాలికి మాత్రం ఈ విషయం అంతుపట్టదు. ఎందుకంటే స్వరాజ్యం విషయంలో అంత గొప్పగా ఆలోచించిన వ్యక్తి సుందరి విషయంలో ఎందుకంత నిర్దయగా ప్రవర్తించాడో అర్థంకాదు. ఇదే గందరగోళంతో ఆఫీసుకి వెళుతుంది. వెళ్లిన కొంతసేపటికి మీనాక్షిని కాఫీ తాగడానికి రమ్మని పిలుస్తు ంది అదే సమయానికి ఒక అమ్మాయి తన దగ్గరకు కౌన్సిలింగ్ కి రావడంతో మీనాక్షి స్నేహితురాలు కూడా మీనాక్షితో పాటే ఉండిపోతుంది.

కౌన్సిలింగ్ కోసం వచ్చిన అమ్మాయి తన భర్త ఆమె మీద చేయిచేసుకున్న పరిస్థితిని గురించి చెప్తూ 'ఏ విషయాన్నీ నాతో చెప్పడు. ప్రతి విషయాన్నీ రహస్యంగా ఉంచుతాడ'ని అంటుంది. ఆ మాటలకు మీనాక్షి, 'అసలెందుకు కొడతాడు? ఎలా కొడతాడు? తరచూ కొడుతుంటాడా.....?' అంటూ ప్రశ్నిస్తు ంది దానికామె 'నిన్న సాయంత్రం ఆయనకు ఫోన్ చేసి, ఇంటికి తీసుకురావలసిన సరుకుల గురించి మాట్లాడబోతుంటే... ఇంటికి వచ్చాక మాట్లడుదువుగాను అంటూ ఫోన్ పెట్టేశారు. తీరా ఇంటికి ఎవరో ఒక వ్యక్తిని తీసుకొచ్చారు. ఎవరండీ ఆయన అని అడిగాను. సమాధానం చెప్పలేదు సరికదా... వంటగది గుమ్మంలో నిలబెట్టి ప్రశ్నించానని నన్ను నిలదీసి నానా మాటలన్నాడు. దాంతో నేను నాలుగు మాటలన్నాను. వెంటనే చేయిచేసుకున్నాడు' అని అంటుంది. ఆ మాటలు విన్న మీనాక్షి, అతను కొట్టేంత వరకు నువు వాదన ఎందుకు పెంచావు? అని అంటుంది.

దానికి సమాధానంగా ఆ అమ్మాయి, 'ఇంటికొచ్చిన మనిషెవరో నేను తెలుసుకోకూడదా

చెప్పండి? అతను కొట్టిన దెబ్బల కన్నా అతను నన్ను అర్థంచేసుకోలేదన్న బాధ ఎక్కువైంది' అంటుంది. ఆ మాటలకు మీనాక్షి, ఏం చెప్పాలో తోచక, ఓ పక్క నీతప్పేంలేదంటూనే.... అన్ని విషయాలు తెలుసుకునే హక్కు నీకుందంటూ ఆమెను సమర్థిస్తుంది ఈ మాటలు వింటున్న మీనాక్షిలో ఆలోచన మొదలౌతుంది. తన భర్త కూడా ప్రపంచంలో ఉన్నవాళ్లందరిని అర్థంచేసుకోవడానికి ప్రయత్నిస్తాడు కాని తనను అర్థంచేసుకోడని అనుకుంటుంది. అంతేకాక, వారి సంభాషణలో తనకేదో జ్ఞానోదయం కలిగినట్లు భావిస్తుంది అందుకే స్వగతంలో "అన్ని బాధలకు కారణం కోరికలేనన్న విషయం చాలా రోజులక్రితమే తెలుసుకున్నాను. కానీ, అందర్నీ అర్థంచేసుకొన ప్రయత్నించే మహానుభావుడు కనపడగానే... ఆయన భార్యనీ అర్థంచేసుకోవాలని ఆశించాను. మిగిలిన వాళ్లు చదివీ, చూసీ తెలుసుకోవాల్సిన విషయాన్ని నేను స్వయంగా అనుభవించి తెలుసుకోలేకపోవడానికి కారణం ఇదే. కోరికలు... ఆశ. కోరికలు, ఎక్స్ పెక్టేషన్స్ ఉన్నంత కాలం అనుభవమూ, పాండిత్యమూ పనిచేయవు. ఆశ ఉన్న చోట కూడా అవి పనికిరాకుండా పోతాయి. వాటిలో నుంచి జ్ఞానం పుట్టదు. అవును ఒక విషయానికి స్పందిస్తున్నంత కాలం దాన్ని పరిపూర్ణంగా అర్థంచేసుకోలేం. స్థితప్రజ్ఞత అలవడ్డాకే నిజమైన జ్ఞానం చేతికందుతుంది"[16] అని అనుకోవడంతో కథ ముగుస్తుంది

**కథావిశ్లేషణ:**

ఈ కథ తాత్విక దృక్పథంతో ముగించడం జరిగింది. దీనిలో స్త్రీలు తరచుగా ఎదుర్కొనే సమస్యలు, వాటి పరిష్కారాలు వివరించడం జరిగింది. భర్త చేసే ప్రతి పని భార్య తెలుసుకోవాలనుకుంటుంది. భర్త మాత్రం, అన్నీ భార్యకు చెప్పాలనుకోడు. తద్వారా వారి మధ్య సంఘర్షణ ప్రారంభమౌతుంది. ఈ క్రమంలో భార్య తన అస్తిత్వాన్ని కోల్పోతున్నట్లు భావిస్తుంది అంతేకాక పరిస్థితులను బట్టి, భర్తను అనుమానిస్తుంది క్రమ క్రమంగా ఒకరి ఎడల ఒకరికి ప్రేమ, గౌరవం తగ్గిపోయి సమస్య తీవ్రతను బట్టి హింసకు లేదా విడాలకు దారితీస్తుంది.

ఈ కథలో రచయిత్రి స్త్రీలను ఉద్దేశించి 'భర్త నుండి ప్రేమగాని ఆదరణ గాని మితిమీరి ఆశిస్తే చివరికి నిరాశే మిగులుతుందని వివరించడం జరిగింది. స్త్రీ భార్యగా తన గౌరవం కాపాడుకోవాలనుకుంటే, భర్తతోనే లోకమనుకోకుండా తనకంటూ ఒక వ్యక్తిత్వాన్ని కలిగివుండాలని ఈ కథలో వివరించడం జరిగింది.

## 3. 10. ఇలా... ఉన్నాం:

'ఇలా... ఉన్నాం' కథ కథావార్షిక - 2003 నుంచి తీసుకోవడమైనది. రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మీదేవి. ఈ కథలో ఆధునిక కాలంలో వెలసిన కార్పొరేట్ సంస్కృతిలో స్త్రీలు తమ ఉనికి కోసం ఏవిధంగా పోరాడుతున్నారో వివరించబడింది.

ఈ కథలో రచయిత్రి నేటి సమాజంలో స్త్రీల పరిస్థితులను వివరించడానికి ప్రధానంగా నాలుగు కుటుంబాలలోని స్త్రీల జీవితాలను తీసుకున్నారు. మొదటిది లలిత, శ్రీధర్ కుటుంబం. వీరిది ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులులేని కుటుంబం. పిల్లలు, చదువు నిమిత్తం పొరుగూళ్లకు వెళ్లిపోవడం వల్ల లలితకు ఏమీ తోచక ఒక కాన్వెంట్లో టీచరుగా చేరుతుంది. ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం నాలుగుదాకా పనిచేస్తు ంది జీతం పన్నెండు వందలు.

రెండవది విజయ, మోహనరావు కుటుంబం. విజయ జెడ్పీ హైస్కూల్ టీచరు. సిటీకి పొరుగునున్న పల్లెలో స్కూలు కావడం వల్ల రోజూ సిటీ బస్సులో వెళ్లి వస్తు ంటుంది

మూడవది శారద కుటుంబం. ఆమె బి.ఎస్సీ, బి.ఇ.డి చేసి ప్రైవేట్ స్కూల్లో లెక్కల టీచరుగా పనిచేస్తు ంటుంది నెలకి మూడువేలు జీతం. భర్తది చాలా తక్కువ సంపాదన. పిల్లలు ఇంకా చదువుకుంటూ ఉండడం వల్ల, తన సంపాదన కుటుంబానికి వేణ్ణీళ్లకు చన్నీళ్లలా ఉంటాయనే ఉద్దేశంతో ఉద్యోగం చేస్తు ంటుంది

నాలుగవది నూకాలమ్మ కుటుంబం. ఈమెకు ఒక కొడుకు, ఒక కూతురు. భర్త తాగుబోతు. నూకాలమ్మ నాలుగైదు ఇళ్లలో పనిచేసి కుటుంబాన్ని నడిపిస్తూ ఉంటుంది.

ఈ నాలుగు కుటుంబాల్లో ఉన్న స్త్రీలంతా తమ అస్తిత్వం కోసం తాము పనిచేసే స్థలాల్లో ఏవిధంగా అస్తిత్వ పోరాటాన్ని ఎదుర్కొంటున్నారు? కార్పొరేట్ సంస్థలు వారి జీవితాన్ని ఎలా శాసిస్తు న్నాయి?, అలాంటి పరిస్థితుల మధ్యలో స్త్రీలు ఏమి కోరుకుంటున్నారు... మొదలైన అంశాలను ఈ కథలో చర్చించడం జరిగింది.

ఒకరోజు పక్కింటి విజయ కొడుకు, లలిత దగ్గరకు వచ్చి "ఆంటీ! అమ్మ కళ్లుతిరిగి పడిపోయింది. ఒకసారి రండి" అని అర్థిస్తా డు వెంటనే లలిత ఒక్క పరుగున వెళ్తు ంది లలిత వెళ్లేసరికి... హాల్లో టీపాయ్

పక్కన పడిపోయి ఉంటుంది విజయ. విజయ భర్త మోహన రావు, లలిత కలిసి ఆమెను లేవదీసి సోఫాలో పడుకోబెట్టి డాక్టరుకి ఫోన్ చేస్తా రు డాక్టరు ఫస్ట్ ఎయిడ్ ఎలా చేయాలో చెప్పి, హాస్పిటల్ కు తీసుకురమ్మని చెబుతాడు.

స్కూల్లో ఉండే పని ఒత్తిడి అక్కడ సౌకర్యాల లేమి, మానసిక ప్రశాంతత లేకుండా నిత్యం ఉరుకుల పరుగుల జీవితం వల్ల విజయకు ఈ విధమైన పరిస్థితి ఏర్పడుతుంది. వీటి కంటే ముఖ్యంగా ఆ రోజు స్కూల్లో జరిగిన సంఘటన విజయను కుంగదీస్తు ంది ఎప్పటిలాగే ఆ రోజు కూడా విజయ స్కూలుకి వెళ్లేసరికి ఆ ఊరి సర్పంచ్... స్కూల్ ఇన్స్పెక్షన్ కి వస్తా డు విజయ క్లాసురూముకి వెళ్లి టేబుల్ మీద ఉన్న కాంపోజిషన్ పుస్తకాలు చూసి, వాటి గురించి ఆరాతీసి క్లాస్ విద్యార్థుల సంఖ్య 62 అని కనుక్కొని కాంపోజిషన్ పుస్తకాలు 57 ఉండటంతో కారణం అడుగుతాడు. ఆ అయిదుగురు పిల్లలు స్కూల్ కి ఎప్పుడూరారని, స్కూలు హెడ్ మాస్టారు, తను ఆ పిల్లల తల్లిదండ్రులను కలిసి మాటాడినప్పటికి ప్రయోజనం లేదని వివరణ ఇస్తు ంది ఆ వివరణ అతనికి నచ్చక, ' నీ మీద డి.ఇ.ఓ. కి కంప్లేంటు రాస్తా ను మీకు గవర్నమెంటు ఇన్నేసి వేలు జీతాలిస్తు ంటే మీరు కుర్రాళ్లకు సదువులు ఇలాగేనా చెప్పేది ' అని పిల్లల ముందు అవమానకరంగా మాట్లాడతాడు. ఇదే రాద్ధంతం హెడ్ మిస్ట్రెస్ రూంలో కూడా జరుగుతుంది.

నిజానికి అతను సర్పంచ్ కాదు. సర్పంచి భర్త, ఆమె ఎప్పుడు ఎక్కడికి వెళ్లదు కాని, అవసరమైన చోట సంతకాలు మాత్రం చేస్తు ంది మిగిలిన విషయాలన్నీ ఆమె భర్త చూసుకుంటాడు. అందులో భాగంగానే స్కూలుకి వచ్చి ఇంత రాద్ధంతం చేస్తా డు

ఈ సంఘటన విజయను మానసికంగా కుంగదీస్తు ంది ఆరోజు ఎలాగో స్కూలు నుంచి ఇంటికి రాగానే కళ్లుతిరిగి పడిపోతుంది. ఇదే ఆమె కళ్లుతిరిగి పడిపోవడానికి అసలైన కారణం.

ఈ సందర్భాన్ని నిశితంగా పరిశీలిస్తే అనేక విషయాలు అవగతమవుతాయి. నిజానికి జరిగిన సంఘటనలో విజయది ఎలాంటి తప్పులేదు. బడిమానేసి పొలం పనులకి వెళ్లిపోతున్న పిల్లల తల్లిదండ్రుల వద్దకు వెళ్ళి, వాళ్ల గురించి మాట్లాడినప్పటికి ఏ విధమైన మార్పూ ఉండదు. విజయ తాను చెయ్యగలిగిన ప్రయత్నాలన్నీ చేశాక కూడా ఆ పిల్లలు బడికి రాకపోవడానికి విజయను నిందించడం చాలా అసమంజసంగా అనిపిస్తు ంది చెయ్యని తప్పుకి ఆ సర్పంచ్ భర్త విజయను నిందించాడు.

ఈ సంఘటన ఒక్క విజయ విషయంలోనే కాక, ఆ స్కూలు హెడ్ మిస్ట్రెస్ విషయంలో కూడా అదే జరుగుతుంది. ఈ సందర్భం ఆ ఇద్దరి స్త్రీల జీవితాల్లోనే కాక, ఎక్కడైతే స్త్రీలు పురుషాధిపత్యాన్ని భరించవలసి వస్తుందో అలాంటి చోట్ల స్త్రీలు ఇలాంటి అవమానాలనే ఎదుర్కొంటున్నారు. నేటి కాలంలో భార్యాభర్తలిద్దరు ఉద్యోగం చేస్తేతప్ప కుటుంబాన్ని పోషించలేనటువంటి పరిస్థితి. కుటుంబాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలనుకునే క్రమంలో స్త్రీలు ఉద్యోగాలు చెయ్యాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాంటి సందర్భాలలో స్త్రీలు తమ అస్తిత్వం కోసం పోరాడవలసిన పరిస్థితి ఎదురౌతోంది. విజయ విషయంలో కూడా ఇదే జరిగింది. ఆమె ఎదుర్కొన్న సంభవం ఆమెను మానసికంగా బలహీనపరుస్తుంది తద్వారా అనారోగ్యానికి గురౌతుంది.

విజయను ఆసుపత్రిలో జాయిన్ చేసి, అన్ని పరీక్షలు చేయించే క్రమంలో లలిత కూడా అలసిపోతుంది. భర్త కూడా ఈ 'రోజుకి స్కూలు మానెయ్యి' అని చెప్తాడు లలిత లీవ్ గురించి చెప్పడానికి స్కూల్ కి ఫోను చేస్తుంది ఆ ప్రిన్సిపాల్ సెలవు మంజూరు చెయ్యడానికి ఇష్టపడడు అంతేకాక 'ఏదోలా వీలుచేసుకొని వచ్చెయ్యండి. మీరు ఉద్యోగం చెయ్యకపోతే మానెయ్యండి. అంతేగాని మాటిమాటికి సెలవు పెడితే ఎలా? ' అంటు ఆమెతో దురుసుగా మాట్లాడతాడు.

ఇలాంటి సందర్భం ప్రతి ఉద్యోగిని ఎదుర్కొంటుంది. అధికారంలో ఉన్న ప్రతివ్యక్తి సులువుగా చెప్పేమాట 'ఉద్యోగం మానెయ్యండి' అని. స్త్రీలు ఎన్నోకష్టనష్టాలకోర్చుకొని ఉద్యోగాలు చేస్తున్నారు ఏదో అత్యవసరమై సెలవు కావాలని అడిగితే ఇక పెద్ద రాద్ధాంతమే జరుగుతుంది. ఇలాంటి వ్యవస్థ మారాలి అని రచయిత్రి ఉద్బోధిస్తున్నారు

ఇక శారద విషయానికొస్తే... శారద పనిచేసే స్కూల్లో ఆమె ఒక్కరే లెక్కల టీచరు. అన్ని క్లాసుల వాళ్లకి ఆమే లెక్కలు చెప్పాలి. అయితే శారదకు ఇది సమస్య కాదుగాని రోజు సాయంత్రంపూట పదవ తరగతి పిల్లలకు స్పెషల్ క్లాసులు చెప్పమని ఆ స్కూలు సెక్రటరీ ఒత్తిడి తెస్తాడు అంతేకాక 'మీకు కుదరకపోతే చెప్పండి. మరో టీచర్ ను స్పెషల్ క్లాసులకు వేసుకుంటాం. మీకు మాత్రం ఓ అయిదు వందలు తగ్గించాల్సి వస్తుంది..' అంటూ చెప్తాడు శారద ఆర్థికపరిస్థితి అంతంత మాత్రం. అందుకే ఆమె తప్పనిసరి పరిస్థితుల్లో ఉద్యోగం చేస్తుంది తనకు వచ్చే ఆ మూడు వేలలో అయిదు వందలు తగ్గిస్తే ఇక తన పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుంది. అందుకే తన పరిస్థితినంతా నిర్మలకి చెప్పుకోవడానికి వాళ్ల ఇంటికి వెళ్తుంది నిర్మల టీచర్ పెద్దవారు గనుక ఆమె చేత చెప్పించాలని శారద అనుకుంటుంది. నిర్మల

కూడా సహాయం చెయ్యడానికి ఇష్టపడుతుంది. ఇద్దరు కలిసి ప్రిన్సిపాల్ రూంకి వెళ్తారు స్కూల్ సెక్రటరీకి నచ్చచెప్పడానికి నిర్మల ప్రయత్నించసాగింది. అది విన్న సెక్రటరీ నిర్మలతో 'ఓ గంట ఆవిడను క్లాస్ చెప్పమనేకదండి మేం అడుగుతున్నది' అంటారు. వారి మధ్య తర్జనభర్జన జరిగిన తరువాత మధ్యాహ్నం ఖాళీ టైంలో క్లాస్ చెప్పడానికి జీతంలో కోత లేకుండా ఒప్పందం కుదురుతుంది. ఆ విధంగా శారదకు కొంత స్వాంతన లభిస్తుంది.

ఈ కథలో చివరి కుటుంబం నూకాలమ్మ కుటుంబం. పైన వివరించిన మూడు కుటుంబాలకు, నూకాలమ్మ కుటుంబానికి చాల తేడావుంది. పై ముగ్గురికి తమ ఉద్యోగాలు ఎప్పుడు పోతాయో అనే అభద్రతా భావంతో నిత్యం కుంగిపోతుంటారు. కాని నూకాలమ్మకు అలాంటి భయమేమి వుండదు. ఒక విధంగా చెప్పాలంటే నూకాలమ్మకి వున్నంత స్వేచ్ఛ పై ముగ్గురికి లేదనే చెప్పాలి. నూకాలమ్మ తన కూతురై రామలక్ష్మని ఎంతో గారాభంగా పెంచి, తన స్తోమతకు మించిన వాడికి ఇచ్చి పెళ్లిచేస్తుంది రామలక్ష్మి జీవితం సుఖంగా సాగిపోతుంది.

ఒక సంవత్సరం పంట వెయ్యొద్దని ప్రభుత్వం ఆదేశిస్తుంది ఇక చేసేదిలేక రామలక్ష్మి పుట్టింటికి వచ్చి, తన తల్లిలాగానే నాలుగైదు ఇళ్లలో పనిచెయ్యడానికి సిద్ధ పడుతుంది. తన భర్తకూడా వ్యవసాయ పనులకు వెళ్లడం మొదలుపెడతాడు.

ఈ కథలో రచయిత నూకాలమ్మ పాత్ర ద్వారా 'వృత్తి గౌరవం' (డిగ్నిటి ఆఫ్ లేబర్) గురించి తెలియచేశారు.

ఈ కథలో వివిధ ఆర్థికనేపథ్యాలు కలిగిన నాలుగు కుటుంబాల ద్వారా నేటి స్త్రీల స్థితిగతులను, వాళ్లు తమ అస్తిత్వం కోసం పడే పాట్లను రచయిత్రి చక్కగా తెలియచేశారు.

డార్విన్ అన్నట్లు ప్రతి ప్రాణి కూడా తన అస్తిత్వపోరాటంలో జయించాలని ప్రయత్నిస్తుంది ఏ జీవి అయితే అస్తిత్వపోరాటంలో నిలుస్తుందో అదే తన మనుగడ సాగిస్తుంది తక్కినవి అంతరించిపోతాయి. ఇదే సిద్ధాంతం మానవ జీవితానికి కూడా వర్తిస్తుంది ఈ కథలో వున్న స్త్రీల జీవితాలన్నీ డార్విన్ మాటల్ని తలపింపచేస్తున్నాయి నేటికాలంలో దాదాపు ప్రతీ స్త్రీ అస్తిత్వపోరాటాన్ని ఎదుర్కొంటుందనడం అతిశయోక్తి కాదు.

## 3.11. ఎంతో చిన్నది జీవితం

ఈ కథ 21 సెప్టెంబర్ 2008న ఆంధ్రజ్యోతి అనుబంధంలో వెలువడింది. రచయిత్రి వి.రామలక్ష్మి, ఈ కథలో ఒక స్త్రీ వృద్ధాప్యంలో ఏ విధంగా తన అస్తిత్వాన్ని కాపాడుకుందో తెలియజేయడం జరిగింది.

**ఇతివృత్తం**

ఈ కథలో రమ, ఆమె తల్లిదండ్రులు ప్రధాన పాత్రలు. రమ అమెరికాలో ఉంటుంది. తల్లిదండ్రుల్ని అమెరికా రమ్మని ఆహ్వానిస్తుంది అమెరికా వెళ్లడం కోసం తల్లిదండ్రులిద్దరూ మెడికల్ టెస్టులు చేయించుకుంటారు. రమ తల్లికి గుండె బలహీనంగా ఉందని, ఎక్కడికీ ప్రయాణం చేయకూడని డాక్టర్ చెప్తాడు అందువల్ల భర్త ఒక్కడే అమెరికా వెళతాడు. భర్త అమెరికా వెళ్లాక, ఆమె ఒక్కతే ఇంట్లో ఉంటుంది. ఆ సమయంలో తన జీవితమంతా ఏ విధంగా గడిచిపోయిందో ఆలోచిస్తుంది ఆ ఆలోచనల పరంపరలో తన ఆస్తిత్వాన్ని ఎలా కోల్పోయిందో గ్రహిస్తుంది ఇక మిగిలిన జీవితంలోనైనా తన ఆస్తిత్వాన్ని కాపాడుకోవాలని నిర్ణయించుకోవడంతో కథ ముగుస్తుంది

**కథావిశ్లేషణ**

ఈ కథలో భార్యాభర్తలిద్దరూ అన్యోన్య దంపతులే. కాని భర్త ప్రతీ విషయంలో తన మాటే గెలవాలనే పట్టుదల కలిగిన మనిషి. అందువల్ల అతని భార్య తన ఇష్టాఇష్టాలు, కోరికలు, ఆలోచనలు వదిలేసుకొని చివరికి తనను తాను కోల్పోతుంది. ఆమె తినేతిండి దగ్గర నుంచి కట్టుకునే బట్ట వరకు అన్నీ భర్త ఇష్టప్రకారమే జరిగిపోతాయి.

భర్త అమెరికా వెళ్లాక తన గత జీవితాన్ని గురించి ఆలోచిస్తుంది ఈ విషయాలన్నీ ఆమె మనుసుని కలచివేస్తాయి అంతేకాక ఒకరోజు పక్కింటి సుశీల ఇంటికి వెళ్లినప్పుడు ఆ ఇంటి వాతావరణం, ఆమె గతజీవితాన్ని గుర్తుచేస్తాయి ఆమె స్వగతంలో 'చిన్నప్పుడంతా తల్లిదండ్రుల ఇష్టప్రకారం గడచిపోతుంది. పెళ్లయ్యాక ఆడపడుచులు మరుదులు, వాళ్ల చదువులు, పెళ్లిళ్లు, పిల్లలు, అనారోగ్యంతో గడచిపోతుంది. తీరా సమయం దొరికేసరికి శరీరంలో ఓపిక నశించిపోయి, ఏ పనీ చేయలేకపోతున్నాను. జీవితమంతా ఇతురుల కోసం, ఇతరుల ఇష్టప్రకారం జీవించడానికి సరిపోయింది' అని అనుకుంటుంది.

సుశీల తన జీవితాన్ని తనకు నచ్చిన రీతిలో తీర్చిదిద్దుకోవడం ఆమెను మరింత ఆలోచింపచేస్తుంది సుశీలకు తన జీవితం గురించి చెప్పినపుడు ఆమె బాధపడి, తనకు తోచిన సలహా చెబుతుంది. ఆ సలహా విన్నాక, ఆమె స్వగతంలో 'సుశీల ఎంత నేర్పుగా చెప్పింది, అది నేను ఆచరించగలనా? దానికి ఆయన సహకరిస్తారా? సహకరించకపోతే ఏం చేయాలి? ఇన్నాళ్లూ లేనిది

ఇవాళ మారగలనా? సుశీల చెప్పినట్టు దేనికైనా ప్రయత్నం చేయాలి. ముందే నిరాశపడకూడదు' అని అనుకుంటుంది. ఆ మాటలు... వ్యక్తి అస్తిత్వానికి సంబంధించిన అనేక విషయాలను వెల్లడిచేస్తు న్నాయి ఒక్కమాటలో చెప్పాలంటే ఎప్పుడైతే ఆమె తన అస్తిత్వాన్ని కోల్పోయానని గ్రహించిందో, అంటే... అస్తిత్వపు స్పృహ కలిగిందో అప్పటి నుంచి ఆమెలో 'నేనేమిటి, నా జీవితమేమిటి?' అనే ప్రశ్నల పరంపర మొదలైంది. అందుకే ఇక మిగిలిన ఆ కొద్ది జీవితాన్నైనా తన ఇష్టాఇష్టాలకు అనుగుణంగా మార్చుకోవాలని ఆశిస్తు ంది భర్త అమెరికా నుంచి తిరిగివచ్చాక, వారి మధ్య ఈ కింది విధంగా సంభాషణ జరుగుతుంది.

**భర్త:** ఏమిటీ పొద్దుటి టిఫినే మళ్లీ తినాలా? ఇంకోటి చేయలేదా?

**భార్య:** రెండు పూటలా రెండు రకాలు చేయలేకపోతున్నానండీ!

**భర్త:** సరేలే (వాకింగ్ కు బయలుదేరుతాడు)

**భార్య:** నేనూ వస్తా ను మీతో. రేపు నాకు కూడా వాకింగ్ షూ కొనరూ...

**భర్త:** ఇది వరకు ఎప్పుడురమ్మన్నా ఇంట్లో పనుంది అనే దానివి. నేను అమెరికా వెళ్లి వచ్చేసరికి ఇంత మారిపోయావు! (ఆ రాత్రి మధ్యాహ్నం చేసిన కూరలే వడ్డించేసరికి అతనికి పట్టరాని కోపం వస్తు ంది)

**భర్త:** నీకు పెళ్లయి ఎన్నేళ్లయ్యింది? ఎప్పుడైనా అలాంటి సద్దినీళ్లు మనింట్లో అలవాటుందా? (తీవ్ర స్వరంతో అడుగుతాడు)

**భార్య:** ఇన్నాళ్లూ నేను అన్నీ ఓపిగ్గా మీకు చేసిపెట్టానా లేదా?

**భర్త:** మరిప్పుడేం వచ్చింది.

**భార్య:** రోజల్లా పనైతే నాకు ఊపిరాడ్డం లేదు. కొంచెం పని తగ్గించుకోవాలంటే ఇలా చేస్తే సరిపోతుందనిపించింది.

**భర్త:** ఇన్నేళ్లు గడిచిపోయాక ఇంకెంత జీవితం ఉంటుందంటావ్? ఇప్పుడు ఈ చిరాకేమిటే చెప్పు?

**భార్య:** నాకు మాత్రం ఇంకెంత జీవితం ఉంటుంది చెప్పండి? నాకున్నది కూడా ఒకటే జీవితం కదా! ఇన్నేళ్లూ మీకు నచ్చినట్టే చేసిపెట్టానా లేదా...? ఇలా పని తగ్గించుకుంటే సమయం మిగులుతుంది. ఆ సమయాన్ని నాకు నచ్చినట్టే గడపాలనుకుంటున్నానని చెబుతుంది. ఆ మాటలు విన్న భర్త కోపంతో కంచంలో చెయ్యి కడిగేసుకొని బయటకు వెళ్లిపోతాడు. ఆమె ఏమాత్రం భయపడకుండా ఉంటుంది. అంతేకాక, స్వగతంలో "ఇది సాధించగలిగితే సగం విజయం సాధించినట్టే. పూర్తి విజయం సాధించడానికి నేనింకా చాలా మారాల్సివుంది. పరిస్థితులను

మార్చుకోవలసివుంది. నాకోసం నేను పోరాడాలి. ఏది ఏమైనా నాకు కావలసినదాన్ని సాధించి తీరుతాను"[17] అని అనుకుంటుంది.

ఈ మాటలు గమనించినట్లయితే స్త్రీ తన అస్తిత్వాన్ని కోల్పోవడానికి గల కారణాల్లో పని ఒత్తిడి ఒకటి. దీని వలన తనను తాను పట్టించుకోలేకపోవడం జరుగుతుంది. పని ఒత్తిడిలో ప్రధాన భాగం వంటిల్లు. ఎప్పుడైతే స్త్రీ వంటిల్లును తన జీవితంగా భావించడం జరుగుతుందో ఇక అప్పటి నుంచి తన పూర్తి సమయాన్ని వంటింటికే పరిమితం చేస్తుంది అలా కాకుండా వంటిల్లు, జీవితంలో భాగం మాత్రమే అని గ్రహిస్తుందో ఇక తన సమయాన్ని ఎంతోకొంత మిగుల్చుకొని తనకోసం తాను జీవిస్తూ తనలో ఉన్న అసంతృప్తిని జయించి తన అస్తిత్వాన్ని కాపాడుకుంటుంది. ఈ కథలో స్త్రీ తన అస్తిత్వాన్ని కాపాడుకున్నట్లు తెలుస్తోంది

## 3. 12. ఒక రాత్రి గడవాలి:

ఈ కథ 2003, జూన్ 15న 'వార్త' పత్రిక అనుబంధంలో ప్రచురించబడింది. రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మిదేవి. స్త్రీ అస్తిత్వం అంటే ఏమిటి, కెరియర్ అంటే ఏమిటి, స్త్రీ స్వేచ్ఛ అంటే ఏమిటి?... మొదలైన ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన కథ ఇది.

ఈ కథలో వినీల అనే అమ్మాయి, 'విహాయస' అనే కలం పేరుతో రచనలు చేసిన సర్వలక్ష్మి కథలను చదివి, వాటిద్వారా చైతన్యం పొంది ఒక పైలట్ గా ఎదుగుతుంది. వినీల ఆ ఉద్యోగంలో చేరడానికి ముందు తన లక్ష్యసాధనకు బాటలు వేసిన సర్వలక్ష్మిని కలవడానికి వెళ్లడంతో కథ ప్రారంభమవుతుంది.

వినీల, తన అభిమాన రచయిత్రి అయిన సర్వలక్ష్మి ఇంటికి వెళ్తుంది వెళ్లిన దగ్గర నుండి ఆమెను గమనిస్తూ ఉంటుంది వినీల. సర్వలక్ష్మి జీవనవిధానం వినీలను ఆశ్చర్యానికి గురిచేస్తుంది ఆ రచయిత్రి తన రచనల్లో చెప్పిన భావాలకు, అభిప్రాయాలకు భిన్నంగా ప్రవర్తిస్తున్నట్లు అనిపిస్తుంది వినీల భావాలను గ్రహించిన సర్వలక్ష్మి ఆమె ప్రశ్నలన్నింటికీ జవాబు చెప్పడంతో కథ ముగుస్తుంది ఇది ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం

**కథావిశ్లేషణ:**

ఈ కథలో స్త్రీ అస్తిత్వాన్ని చాలా వినూత్నమైన రీతిలో పాఠకుల కళ్ళ ముందు ఆవిష్కరించారు రచయిత్రి. స్త్రీ తనకు కావల్సినది పొందడం కోసం సమాజంతో పోరాడడంతో పాటు, ఆ పోరాటంలో తన వ్యక్తిగత కుటుంబ జీవితాన్ని కూడా సమన్వయం చేసుకుని ఒక ఉన్నత పంథాలో పయనించడమే అసలైన అస్తిత్వం అని రచయిత్రి చిత్రించారు.

సర్వలక్ష్మి తన భర్త అయిన శంకరం గారికి అన్నివిధాలుగా సేవ చేస్తుంది భర్త లేచే సరికి అతనికి కాఫీ అందించడం, దినపత్రిక అందివ్వడం చేస్తుంటుంది అవసరం అనుకున్నప్పుడు భర్తకు వంటపని అప్పగిస్తుంది ఇలా వారిరువురు సాగిస్తున్న జీవనవిధానం వినీలకు అంతుపట్టదు. సర్వలక్ష్మి ఆమెకు అర్థమయ్యీ అర్థమవ్వనట్టు అనిపిస్తుంది వినీల ఇక ఉండబట్టలేక తన మనసులో ఉన్న సందేహాలన్నీ నివృత్తి చేసుకుంటుంది. మొదటిగా వినీల సర్వలక్ష్మిని ఇలా అడుగుతుంది. 'గత పదేళ్లుగా మీరు ఏమీ రాయలేదు. ఎక్కడా ఏ సభలోనూ కనిపించడంలేదు. ఇలా వంటింటికి, ఇంటికి, ఇంటి వెనుక పూల మొక్కలకి మీ తెలివి జ్ఞానాన్ని అప్పగించి ఉండిపోతారనుకోలేదు. మీరు ఇంతకాలం చెప్పిందేమిటి? మీరు ఇక్కడ... ఇలా... ఉంటారని ఊహించలేదు. ఆడవాళ్లు వంటిళ్లు వదిలి బయటకి రాకపోతే జీవితం లేదన్న మీరే ఇలా ఇంటికి బందీ అయిపోయారంటే నాకు దిగులుగా ఉంది. మీ రచనలు చదివి నేను ఇలా బయట ప్రపంచాన్ని గెలిచాను. తీరా ఇక్కడికి వచ్చి చూస్తే మీరూ మా అమ్మమ్మలాగా వడియాలు పెడ్తూ, పెసరట్లు వేస్తూ, ఇల్లు సర్దుతూ, సాధారణ గృహిణి అయిపోయారు. అందుకే అర్థంకావట్లేదు' అని అంటుంది. దానికి సమాధానంగా సర్వలక్ష్మి 'నేను చాలా చిన్నప్పుడే వంటిళ్ల ట్రెజ్జరీని, ఇళ్ల పెత్తనాన్ని గ్రహించాను. అందుకే ఎదిరిస్తూ బయటికొచ్చాను. బయటి ప్రపంచాన్ని నువు చెప్పినట్లు అర్థంచేసుకోవడమూ, గెలవడమూ చేసాను. ఆ తర్వాతనే ఇంటిని కూడా గెలవొచ్చని తెలిసింది. 'మరి సభలూ సమావేశాలు ఎందుకు మానేశారు ' అదే నీ కంప్లయింట్! నా ఫోటో నీకు పేపర్లో కనిపించడంలేదని. అది నీ ఫ్యాన్సీ ఆలోచన కదూ! నాకు అర్థమయిదేమిటంటే బయటికి వచ్చేకొద్దీ మనకి వచ్చే పాపులారిటీ, పేరు మనల్ని 'క్యాప్చర్' చేస్తాయి మనం ఎందుకొచ్చామో మర్చిపోతాం. ఒక కెరీరిస్టుగా కాకుండా ఉండడం కోసం, ఒక మానవిగా మిగలడం కోసం నా స్వేచ్ఛని ఉపయోగించుకున్నానని అదే నన్ను ఇలాంటి జీవన విధానంలోకి తెచ్చిందని చెప్తే నీకు సులువుగా అర్థమవుతుందా?...."[18] అంటూ తన ప్రశ్నలన్నింటికి సమాధానం చెప్తుంది వినీల తన ప్రశ్నలకు సమాధానాలు ఆమె మాట్లాడిన మాటల్లో వెతుక్కుని తృప్తి పడుతుంది.

అంతే కాక పెళ్లి కాకుండా కలసి జీవించే జీవన విధానాన్ని (live together) గురించి సర్వలక్ష్మి వివరిస్తూ "ఆడవాళ్లు ఎందుకు మోసపోతారో చెప్పనా? 'ఆడవాళ్లు, అన్నింటికీ మగవాళ్ల మీద ఆధారపడిపోతారు. అన్నింటికీ అంటే డబ్బు సరే, సాంఘిక భద్రత నుంచి, ఉద్వేగాల ఉపశమనందాకా! ఒక మనిషి మీద ఆధారపడకుండా సంఘ నిర్మాణం నడవదు. నిజమే. నువ్వు అతని మీద ఎంతగా ఆధారపడుతున్నావో, అదే స్థాయిలో అతను కూడా నీ మీద ఆధారపడేలా నువ్వు తయారు కాగలవా? దాన్ని అతను కూడా గ్రహించుకునే లాగ చెయ్యవలవా ?"[19] అంటూ వినీలాను ఆలోచింప చేసింది.

ఈ విధంగా సాగిన వారిరువురి సంభాషణ వినీలాకు సంతృప్తిని కలిగిస్తు ంది ఆమె ప్రశ్నలన్నిటికి సమాధానం దొరికినందుకు సంతోషిస్తు ంది ఈ కథలో సర్వలక్ష్మి తమ అస్తిత్వాన్ని కాపాడుకుని, ఒక మానవిగా జీవించడం గమనించదగ్గ విషయం.

## 3. 13. కంచె మేసిన చేను:

ఈ కథ 'భూమిక' మాసపత్రికలో జూన్ 2008న వెలువడింది. రచయిత్రి గంటి భానుమతి. భర్తచేతిలో మోసపోయిన స్త్రీ ఎలాంటి నిర్ణయం తీసుకుంది, ఆ నిర్ణయంవల్ల తన అస్తిత్వాని తాను ఏవిధంగా కాపాడుకోవడానికి ప్రయత్నించిందో ఈకథలో వివరించబడింది.

ఇందులో శాంత, శంకర్ రావు ప్రధానపాత్రలు. శాంత స్కూల్లో చదువుతున్నప్పటినుండి 'నిన్ను ప్రేమిస్తు న్నాను' అంటూ వెంటపడి, పెళ్లికాకుండానే గర్భవతిని చేస్తా డు మాయమాటలు చెప్పి అబార్షన్ చేయిస్తా డు తీరా పెళ్లిచేసుకోమని అడిగితే తప్పించుకుంటాడు. శాంత, సమాజం యొక్క అపహాస్యాలు భరించలేక, ధైర్యంగా మహిళా సంఘాలను ఆశ్రయించి, శంకర్ రావుని వివాహం చేసుకుంటుంది. పెళ్లి తరువాత అయన మారతాడేమో అని శాంత అనుకుంటుంది. కాని శంకర్ రావు కసాయి వాడని, మళ్ళీ జీవితంలో రెండో దెబ్బ తగిలితేగాని గుర్తించలేకపోతుంది

శాంత ఒక స్కూల్లో టీచర్ గా పనిచేస్తు ంది శంకర్ రావు అదే స్కూలు యజమాని యొక్క రైస్ మిల్లులో పనిచేస్తా డు ఒకరోజు స్కూలు యజమాని అయిన సంతోష్ బాబు సాయంత్రం సమయంలో శాంత ఇంటికి వచ్చి, జరగబోయే ఏడో తరగతి పరీక్షలలో బోర్డుపై సమాధానాలన్ని రాయాలని ఆజ్ఞాపిస్తా డు అలాంటి తప్పుడుపని చెయ్యలేనని ఖండితంగా చెప్తు ంది ఆ విషయాన్ని సాకుగా తీసుకుని

ఆమెపై అత్యాచారం చేస్తా డు ఆ నిస్సహాయస్థితిలో ఏమీ చేయలేక అలానే ఉండిపోతుంది. శంకర్ ఇంటికి వచ్చాక జరిగిన విషయం చెప్పి, కేసుపెడదాం అంటుంది. శాంత బలవంతంమీద పోలీస్ స్టేషన్ కి వెళ్లి రిపోర్టు ఇచ్చాక పరీక్షలకోసం రేపు రమ్మని చెప్తా డు ఇన్ స్పెక్టర్. ఇంటికి వచ్చాక శంకర్ రావు ఆమెను లాలించి, ఆమెను వశపరచుకుంటాడు. శాంత ఆ రాత్రి అతను చూపించిన ప్రేమ నిజమేనని నమ్ముతుంది. తీరా ఉదయాన్నేలేచి, పరీక్షలు చెయ్యించుకున్నాక, ఆ రిపోర్టులో శాంతపై అత్యాచారం జరిగింది నాలుగైదు గంటల క్రితమే అని రాస్తా రు ఆ రిపోర్టు చూసి శాంత ఆశ్చర్యపోతుంది. భర్త యొక్క కసాయితనం మరోకసారి చవిచూస్తు ంది డబ్బుకు ఆశపడి సంతోష్ తో చేతులుకలిపి, ఆ రాత్రి తనను అంతగా లాలించి వశపరచుకున్నాడని గ్రహిస్తు ంది అలాంటి వ్యక్తికి గట్టిగా బుద్ధిచెప్పాలని భావించి, మహిళా సంఘాలను ఆశ్రయించడానికి బయలు దేరడంతో కథముగుస్తు ంది

**కథావిశ్లేషణ:**

ఈ కథను నిశితంగా పరిశీలిస్తే అనేక విషయాలు అర్థమవుతాయి. ప్రేమించినవాడిని ఏదోవిధంగా పెళ్లిచేసుకున్నానని పొంగిపోయిన శాంత, భర్తయొక్క నిజస్వరూపాన్ని గ్రహించలేకపోతుంది. ఆమె పాముపడగనీడనున్న సంగతి మర్చిపోవడంవల్ల భర్త రెండోసారి ఆమె జీవితాన్ని నాశనం చేస్తా డు ఆమెపై అత్యాచారం జరిగిన వెంటనే పోలీసు రిపోర్టు ఇవ్వాలంటూ భర్తతో 'ఓ స్త్రీకి అన్యాయం జరిగింది. ఆ అన్యాయాన్ని పోలీసుల వరకు తీసుకెళ్లకపోవడం మహానేరం. నాకేం చెప్పకు. చదువుకున్నదాన్ని. చదువు విజ్ఞానం కోసమే కాదు, అవసరం అయినప్పుడు చేతల్లో చూపించినప్పుడే బాధ్యతాయుతమైన సిటిజెన్ గా ప్రవర్తించగలను నన్ను పిరికిదాన్ని చేయకు... ఆ పోలీసులకి నిజం నిర్భయంగా చెప్పి, సంతోష్ ని కటకటాల వెనక్కి తోయించాలి. ఈ క్షణంలో మన చుట్టుపక్కల వాళ్లు సాక్షులు' అని అంటుంది. ఈ మాటలను బట్టి ఆమెలో ఉన్న చైతన్యాన్ని అర్థంచేసుకోవచ్చు. స్త్రీకి సమస్య ఎదురైనప్పుడు దానిపై సరియైన రీతిలో స్పందించాలనే భావన ఆమె మాటల ద్వారా మనకు అర్థమవుతోంది. వచ్చిన సమస్యను బయటకు చెప్తే సమాజం ఏమనుకుంటుందో, తన పరువు సంగతి ఏమి కావాలి... మొదలైన ప్రశ్నలకు అవకాశం లేకుండా శాంత ధైర్యంగా నిలబడుతుంది. అంతేకాక శంకర్ ఆమె మాటలను వ్యతరేకిస్తూ, 'కేసు వద్దు, గోడకి ఢీ కొడితే తలకి బొప్పికడ్తు ందని నీకు తెలియడం లేదు. లాభంలేని పోరాటంతో మనసు అలసిపోతుంది తప్ప మరొకటి ఉండదు...' అంటూ ఆమెను బలహీనపరుస్తా డు అయినప్పటికీ ఆమె నిర్భయంగా భర్తతో 'ఇంక లాభనష్టాలేమిటి? న్యాయం కోసం పోరాటం. నేరాలు

చీకట్లోనే జరుగుతాయనడానికి మరో నిదర్శనం. దోచుకునేవాడికి అనుకూలించే అజ్ఞానంతో నువ్వు మాట్లడకు. ఆలస్యం అయిపోతుంటే కేసులు, అందులో ఇలాంటివి వీక్ అయిపోతాయి. నా సహనం సంతోష్ కి శక్తినే ఇస్తు ంది' అని అంటుంది.

ఈ మాటల ద్వారా శాంత యొక్క ఉన్నత వ్యక్తిత్వం తెలుస్తో ంది తప్పుచేసిన వారికి శిక్షపడాలి అనే అభిప్రాయం స్పష్టమౌతుంది. చివరికి తన భర్త కూడా ఆమెను మోసం చేశాడని గ్రహించి, అతనికి సరియైన రీతిలో గుణపాఠం చెప్పాలనుకుని మహిళాసంఘాలను ఆశ్రయించడం ఆమె చైతన్యాన్ని తెలియజేస్తు ంది.

## 3. 14. కూటి కోసం - కూలి కోసం:

ఈ కథ చినుకు మాసపత్రికలో ఏప్రిల్ 2009న వెలువడింది. రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మీదేవి. ఈ కథలో ఉద్యోగినులు ఎదుర్కొనే సమస్యలను గూర్చి, వారి జీవితాలలో ఎదుర్కొనే అభద్రతాభావం గురించి వివరించబడింది.

ఇందులో అనిమిష ప్రధానపాత్ర, ఆమె ఎం.ఎస్.సి పూర్తిచేసి కార్పొరేట్ కాలేజీలో రెండువేల జీతానికి లెక్చరర్ గా పనిచేస్తు ంటుంది ఆమె తల్లి తెలుగు టీచర్. ఒకరోజు అనిమిష కాలేజీకి రెండు నిమిషాలు ఆలస్యంగా వెళ్తు ంది అందుకుగాను ఆమెకు, ఆమెతో పాటూ ఆలస్యంగా వచ్చిన మరో ముప్పై మంది లెక్చరర్స్ కి మెమో ఇస్తా రు దాంతో అందరూ ఆశ్చర్యపో తారు. ఆ మెమో గురించి వాళ్లల్లో వాళ్లు చర్చించుకొని, ఎవరికి వారు సంజాయిషీ ఇచ్చుకుంటారు.

ఆ తరువాత అనిమిష కూడా సంజాయిషీ రాస్తూ దానిలో కాలేజీ యాజమాన్యాన్ని అనేక ప్రశ్నలతో సంధిస్తు ంది ఆ తరువాత ఉద్యోగం మానేసి, మరొక ఉద్యోగంలో చేరడంతో కథ ముగుస్తు ంది

**కథావిశ్లేషణ:**

ఈ కథలో వస్తు వు సాధారణమైనదే అయినప్పటికీ స్త్రీలు తమ అస్తిత్వం కోసం ఏ విధంగా పోరాడుతున్నారో వివరించడం జరిగింది. కాలేజీ యాజమాన్యం అనిమిషకి మెమో ఇచ్చిన సందర్భంలో

ఆమె తన సహాధ్యాయులతో "అసలు ఈ మెమోకి మనం జవాబు ఎందుకివ్వాలి రెండు నిమిషాలు ఆలస్యం అంత పెద్ద తప్పు కాదే ఇది చాలా అన్యాయం అనిపిస్తోంది మా పెరడంతా గడ్డిమొక్కలు పీకి, శుభ్రం చేసినందుకు రోజు కూలీ వంద రూపాయలిస్తాం ఒక మనిషికి. ఈ లెక్కన అతనికి మూడువేలు గిడుతుంది నెలకి. మాకంటే అతనే నయమేమో!" అంటుంది.

ఈ మాటలను గమనించినప్పుడు వారి జీవితాలు ఎంత దుర్భరపరిస్థితుల్లో ఉన్నాయో అర్థమవుతోంది. అంటే వారు కష్టపడి చదువుతున్న చదువులకు ఎంతమాత్రం ప్రతిఫలం దక్కుతుందో అర్థమవుతుంది. అంతేకాక మరొక సందర్భంలో అనిమిష 'ఈ పారిశ్రామికరంగం పెద్దఎత్తున కొనసాగాలంటే, మేం ముఖ్యంగా పెద్దచదువులు చదువుకునీ పొరుగూరికి వెళ్లలేని ఆడవాళ్లం ఎంత బాగా పనికి వస్తాం మేం విద్యలో పరిశ్రమిస్తే వీళ్లు మాత్రం మాతో పరిశ్రమ నడుపుతున్నారు' అని అంటుంది. ఈ సందర్భాన్ని గమనిస్తే కార్పొరేట్ కళాశాలలు స్త్రీల విద్యను, వారి శ్రమను ఏ విధంగా దోచుకుంటున్నారో అర్థమవుతుంది. ఈ కథలో అనిమిష తన వ్యక్తిత్వాన్ని చంపుకుని ఆ ఉద్యోగంలో కొనసాగలేక రాజీనామా చేసి, తన అస్తిత్వాన్ని కాపాడుకుంటుంది. తను చైతన్యవంతురాలై తన చుట్టువున్న వారిని కుడా చైతన్యపరుస్తుంది.

ఈ సందర్భంలో కార్ల్ మార్క్స్ అన్న మాటలను తప్పక గుర్తుచేసుకోవాలి 'పోరాడితే పోయేదేమి లేదు బానిస సంకెళ్లు తప్ప.' ఈ మాట ప్రకారం అనిమిష పోరాడి, సమస్య నుండి విముక్తి పొందినట్లు తెలుస్తోంది. ఇదే విధంగా స్త్రీలు తమకు ఎదురైన సమస్యలను పరిష్కరించుకోవడానికి పట్టుదలతో కృషిచేస్తే తప్పక విజయంసాధిస్తారు తద్వార తమ అస్తిత్వాన్ని కాపాడుకుని, అభివృద్ధిపథం వైపు పయనించడానికి అవకాశం వుంటుంది.

## 3. 15. గంగ జాతర

ఈ కథ మే, 2000న ప్రజాశక్తి ఆదివారం సంచికలో వెలువడింది. రచయిత్రి వి. ప్రతిమ. ఈ కథలో ఒక స్త్రీ తన రాజకీయ అస్తిత్వాన్ని ఎలా కాపాడుకుందో వివరించడం జరిగింది.

**ఇతివృత్తం**

ఈ కథలో ప్రధానపాత్రలు రాజేంద్రరెడ్డి, అతని భార్యమాధవి. రాజేంద్రరెడ్డి ఉంటున్న పంచాయితీ

చాలా పెద్దది. పది సంవత్సరాలుగా అతనే ఆ ఊరి సర్పంచ్. ఒక సంవత్సరం ఆ ఊరి సర్పంచ్ సీటు మహిళకు రావడంతో రాజేంద్రరెడ్డి తన భార్యను ఎన్నికలలో నిలబెడతాడు. ఆమె ఎన్నికలలో గెలుస్తుంది అంతవరకు రాజేంద్రరెడ్డి ఆమెను ఒక మరమనిషిలా భావిస్తాడు మాధవి ఎన్నికలలో గెలిచాక తన బాధ్యతను తానే నిర్వహించాలనుకోవడంతో కథ ముగుస్తుంది

**కథావిశ్లేషణ:**

మహిళా రిజర్వేషన్ల ద్వారా ఎన్నికయిన మాధవి అంతఃసంఘర్షణని ఈ కథలో చిత్రించడం జరిగింది. మాధవి ఎన్నికల ప్రచారం కోసం వెళ్లినపుడు, తనతో ఉన్నవాళ్లంతా "రాజేంద్రరెడ్డి భార్య... వీర్రాఘవరెడ్డి కోడలు... పంచాయితీ ఎలక్షన్లో సర్పంచ్ గా నిలబడింది. మీ ఓట్లన్నీ ఆమెకే వేసి గెలిపించాలంటూ..." మైక్ లో చెప్తుంటారు ఈ మాటలు మాధవిలో కలవరాన్ని రేపుతాయి. 'వద్దు నాకు గెలవాలని లేదు...' అంటూ పెద్దగా అరవాలనుకుంటుంది కాని బలవంతం మీద అణచుకుంటుంది. అందరూ ఆమెను రాజేంద్రరెడ్డి భార్యగా, వీర్రాఘవరెడ్డి కోడలుగానే గుర్తిస్తారు తప్ప మాధవిగా గుర్తించరు మాధవి తన పేరుకు గుర్తింపులేదని గ్రహిస్తుంది అందుకే స్వగతంలో 'నాకు పేరులేదు. జీవితం లేదు... గెలుపు లేదు. ఫలానా ఆయన కూతుర్ని, ఫలానా ఆయన భర్తనీ.. యింకా... యింకా... ఫలానా ఆయన అమ్మని అంతే... వద్దొద్దు నాకు గెలుపొద్దు... ఈ విజయం కూడా అతడిదే' అనుకుంటూ బాధపడుతుంది.

ఆ ప్రచారంలో భాగంగా ఆమె సహచరులంతా 'మా ట్రాక్టర్ గుర్తుకే మీ ఓటు... మర్చిపోవద్దు. ట్రాక్టర్... ట్రాక్టర్... మీకే సమస్య వచ్చినా అయ్యే చూసుకుంటారు'... అంటూ అరుస్తుంటారు ఆ మాటలకు మాధవి మనసులో... 'అవునవును! ఓట్లేసి అమ్మని గెలిపిస్తే అన్నీ అయ్యే చూసుకుంటారు. అమ్మకేమీ తెలియదు. తెలియనివ్వరు. నామినేషన్ వేయడానికి పది నిముషాల ముందు వరకు కూడా నేను ఎలక్షన్లలో నిలబడబోతున్నట్లు నాకే తెలియదు. నా అభిప్రాయమెవరూ అడగలేదు...' అని అనుకుంటుంది.

మాధవి ఎన్నికలబరిలో దిగిన తరువాత అనేకమంది స్నేహితులు ఫోన్ చేసి 'నీ ప్రవృత్తికి రాజకీయం ఎంతమాత్రం సరిపడదు. ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నావా...? ' అంటూ ప్రశ్నిస్తారు అలాంటి పరిస్థితులల్లో ఏమిచెయ్యాలో తెలియక, తన చిన్ననాటి స్నేహితుడయిన రవీంద్రకు ఫోన్ చేసి తన బాధంతా చెప్తుంది అది విన్న రవీంద్ర "ఆమెతో మాధవీ ! రాజేంద్ర మంచి నిర్ణయం తీసుకున్నాడు. అంతా ఎవరికి వాళ్లు రాజకీయం బురదగుంట, బురదగుంట అంటూ ముక్కు మూసుకుని కూర్చోకపోతే ఒక్కరయినా దిగి, బాగుచేయొచ్చు కదా... కనీసం ప్రయత్నించొచ్చు కదా... ఎలాగూ సంతకం చేశావు

కాబట్టి డోన్ట్ స్టెప్ బ్యాక్... నీ వూరిని బాగుచేసుకోవడానికి యిదొక అవకాశంగా తీసుకో... లైఫ్ ఈజ్ ఛాలెంజ్... ఫేసిట్. బ్రేవిట్..."[20] అంటూ ధైర్యం చెప్పా . ఈ మాటలు విన్న మాధవిలో కొత్త ఉత్సాహం ప్రవేశిస్తుంది ఇక అప్పటి నుంచి ప్రజలతో మాట్లాడడం మొదలుపెడుతుంది. వారి సమస్యలు తెలుసుకుంటుంది. ఎలాగైతేనేం ఎన్నికలలో గెలుస్తుంది అప్పుడు తనలో తాను 'ఏ మహిళ అయినా పార్టీపేరు చెప్పుకుని భర్త చాటు రాజకీయం చేస్తూ మనుగడ సాగించడం కంటే చురుగ్గా వ్యవహరిస్తూ ప్రజల్లోకి చొచ్చుకుపోగలగాలి ' అని అనుకుంటుంది. ఈ మాటలు అనుకుంటున్నపుడు కొత్త వెలుతురులోకి వెళుతున్నట్లుగా... తనలో ఏదో మార్పు వచ్చినట్లుగా భావిస్తుంది ఆ మరుసటిరోజు అకౌంటెంట్ కి ఫోన్ చేసి, పంచాయితీ పాత అకౌంట్ పుస్తకాలన్నీ, మిగిలిన అన్ని లెక్కల్ని తీసుకొని ఆఫీసుకొచ్చేయమని చెప్పడంతో కథ ముగుస్తుంది

ఈ కథలో మాధవి, భర్త చాటు భార్యగా కాకుండా ప్రజలు తనకిచ్చిన అధికారాన్ని సద్వినియోగం చేసుకొని తన రాజకీయ అస్తిత్వాన్ని కాపాడుకుంటుంది.

## 3. 16. గూడు:

ఈ కథ 3 జూన్ 2007న ఆంధ్రజ్యోతి అనుబంధంలో ప్రచురించబడింది. రచయిత్రి కొండవీటి సత్యవతి. ఇందులో ఒక స్త్రీ తన ఉద్యోగజీవితంలో అస్తిత్వం కోసం ఏవిధంగా పోరాడుతుంది, ఏవిధంగా ఆమె విజయం సాధించిందో వివరించబడింది.

**ఇతివృత్తం**

ఇందులో చందన ప్రధానపాత్ర. ఈమె ఒక ప్రభుత్వాధికారి. తన ఉద్యోగాన్ని అంకితభావంతో చేసే స్త్రీ. తను పనిచేసే తండాలో ఉన్న ప్రజలకు ఇందిరమ్మఇళ్ళు మంజూరు అవుతాయి. వారిచేత ఆ ఇళ్లు కట్టించే పనిలో ఆమె ఎదుర్కొన్న ఒత్తిడే ఈ గూడు కథ. చందన, తండా ప్రజలకు ఏ విధంగానైనా ఇళ్లు కట్టించాలని దృఢంగా నిర్ణయించుకోవడంతో కథ ముగుస్తుంది

**కథావిశ్లేషణ:**

చందన తన ఉద్యోగంలో భాగంగా తన మండలంలో ఉన్న అరవై తండాలకు వెళ్లి అర్హులైన

వారందరికి ఇందిరమ్మ ఇళ్లు రాయిస్తుంది ఆమె అర్హులుగా నమోదు చేసిన వారందరికి ఇళ్లు మంజూరవుతాయి. అయితే ఆ తండాలో ఉన్న ప్రజలు ఏ పూటకాపూట సంపాదించుకోవాల్సిందే గనుక మంజూరయిన ఇళ్లకు పునాదులు కూడా వేయించుకోలేని దుస్థితిలో సతమతమవుతూ ఉంటారు.

ఒకసారి చందన, డివిజన్ మీటింగ్ కు వెళ్తుంది అక్కడ ఒక్కొక్కరు తమ మండలంలో పూర్తయిన ఇళ్ల వివరాలు అధికారుల ముందు వెల్లడిస్తుంటారు అన్ని చోట్లా ఇళ్లు బాగానే కడుతున్నారు. తన మండలంలోనే సమస్య వుంది అని అనుకుంటుంది. ఇక చందన వంతు వస్తుంది అప్పుడు ఆమె ఆర్డీవోతో ఇళ్ల విషయంలో ప్రోగ్రెస్ ఏమీలేదని, ఎంత సర్దిచెప్పినా పునాదులు వెయ్యడానికి ఎవరూ ముందుకురావడంలేదని చెబుతుంటే అతడు మండిపడతాడు. అంతేకాక 'ఎలాగోలా వాళ్లని ఒప్పించాలి. మీరిలా నిల్ రిజల్ట్స్ చూపిస్తే పై వాళ్లకి నేనేం సమాధానం చెప్పుకోవాలి? ' అని అంటాడు. దానికి సమాధానంగా చందన 'మీరు చెప్పింది కరక్టే సార్. నేనెంతో కష్టపడి మూలమూలలా తిరిగి అర్హులందరిని లిస్టులో చేర్చాను. ఎంత ఒత్తిడి తెచ్చినా ఎవరూ ముందుకు రావడంలేదు ' అని చాలా స్పష్టంగా ఉన్న విషయం చెబుతుంది. దానికి ఆర్డీవో సమాధానం 'అసలు మీరు గ్రామాల్లోకి వెళితే కదా! కడుపులో చల్ల కదలకుండా ఆఫీసులో కూర్చుంటే పనులెలా అవుతాయి?... 'అంటూ అరుస్తాడు ఆ మాటలకు చందన మనసు గాయపడుతుంది. అవమానం అనిపించినా ఏమీ మాట్లాడలేకపోతుంది.

మరుసటి రోజు మళ్లీ తండాకు వెళ్తుంది అందరూ సమకూడి వస్తారు కాని వాళ్లు ఏమీ మాట్లాడరు. చందనకు ఏమి చెయ్యాలో తెలియదు. ఈ ఇళ్ల విషయంలో తప్ప, మిగిలిన అన్ని విషయాల్లో చందన పనితీరు బావుందని అధికారులు మెచ్చుకునేవారు.

ఒకరోజు ఆఫీసుకి వెళ్లి, ఆ తండాలకు సంబంధించిన రాజకీయనాయకులతో తండాల ఇళ్ల నిర్మాణం గురించి మాట్లాడుతుంది. ఇక ఆ తండాప్రజలు ఇళ్లపునాదులు వేసుకుంటారనుకోవడం భ్రమ. కావున మనమే ఏదో ఒకటి చెయ్యాలని వారిని అభ్యర్థిస్తుంది వారు తమ ఎమ్మెల్యేతో కూడా మాట్లాడితే బావుంటుందని అంటారు. దానికి సమాధానంగా తప్పకుండా మాట్లాడుదాం సార్ అని అంటుంది చందన. అందరు కలిసి, కొన్ని ఇళ్లయినా కట్టించగలిగితే బావుంటుందని అంటుంది. తప్పకుండా ప్రయత్నం చేద్దాం. మళ్లీ సాయంత్రం కలుస్తాం అంటూ అంతా వెళ్లిపోయారు.

ఆ తరువాత చందనకు 'ఉత్తమ అధికారి' అవార్డుకు ఎంపికైనట్టు ఆమెకు ఉత్తరం అందుతుంది. ఆ అవార్డు ఆమెకు ఎందుకు వచ్చిందో అర్థంకాదు. మర్నాడు ఉదయం, చివరి ప్రయత్నంగా తండాలోని

జనంతో మాట్లాడడానికి వెళ్తుంది కాని పరిస్థితి ఎప్పటిలానే ఉంటుంది. అంతలో దేవుల అక్కడకు వస్తాడు చందన అతని యోగక్షేమాలడిగిన తరువాత అతను 'మీరంతా కష్టపడి నాకోసం ఇల్లు రాసింద్రు, గిప్పుడది పోతే ఎట్ల ?... నేను పునాదులేస్తా. నాపేరు కొట్టకండ్రి 'అంటాడు. దానికి చందన సరేనంటుంది. మిగిలిన వారంతా 'పునాదులు కుడా మీరే ఏసి ఇవ్వొచ్చు కదా, నెలకింత డబ్బు కట్టుకుంటాం' అంటారు. చందన ఇక చేసేది ఏమీ లేదని గ్రహించి, అక్కడ నుండి నిష్క్రమిస్తుంది మరుసటి రోజు దేవుల అనే ఒక వ్యక్తి చందన ఆఫీసుకు వస్తాడు చందన అతనితో 'నువ్వయిన ఇల్లు కట్టుకుంటున్నావు. చాలా సంతోషంగా ఉంది. పైసలు ఏడకెళ్ళి తెచ్చావు' అని అడుగుతుంది. దేవుల 'కాడి ఎద్దులు అమ్మేన కదమ్మా' అని అంటాడు. ఆ మాటలు చందనను కొట్టినట్లనిపిస్తాయి కళ్లు మూసుకుంటే మొండిగోడల మధ్య ధైర్యంగా నిలబడ్డ దేవుల కనబడతాడు. ఇల్లు పూర్తికాదు ఇల్లు గడవదని చందన గ్రహిస్తుంది ఇందుకా నాకా అవార్డు ఇస్తున్నది అది తీసుకోకూడదని నిర్ణయించుకుంటుంది. ఇదే విషయాన్ని ఆర్డీవోతో ఇలా అంటుంది. "వాళ్ళను ఒప్పించలేకపోతున్నందుకు నాకు ఆనందంగా ఉంది. కలెక్టర్ తిట్టినా పర్వాలేదు. నిరుపేదల్ని మరింత పేదరికంలోకి దింపటం నాకు ఇష్టంలేదు. మనం చేసిన ఒత్తిడి వల్ల ఈ రోజు తండాల్లో ముందుకు వచ్చిన వారంతా అప్పుల పాలయ్యారు. తమ జీవనాధారాల్ని సైతం తెగనమ్ముకున్నారు. నేను యంత్రంలా పని చేయలేను సార్!... నేను ఈ అవార్డు తీసుకోలేను. కారణాలు కలెక్టర్ గారికి టెలిగ్రామ్ ద్వారా తెలియజేస్తాను"[21] అని చెప్పి వెళ్లిపోతుంది.

తరువాత కలెక్టర్ చాంబర్లో అతనితో మాట్లాడవలసిన సందర్భంలో ఆయన అనేక ప్రశ్నలు సంధిస్తాడు వాటికి సమాధానంగా 'నా మండలంలో ఉన్న తండా ప్రజలంతా కూటికి గతిలేనివారు. నా ఒత్తిడి వల్ల చాలా మంది అప్పుల పాలయ్యారు. కొంతమంది తమ జీవనాధారాలే్న అమ్ముకున్నారు సార్. నేను కొంతమంది నాయకుల్ని అడిగాను. వాళ్లేమీ సహాయం చేయకపోతే ఐ.టి.డి.ఏ ద్వారానైనా ఇళ్ళు కట్టిస్తే బాగుంటుంది. లేకపోతే గిరిజనులు ఈ స్కీములను ఎప్పటికీ వినియోగించుకోలేరు' అని చెప్తుంది ఆమె మాటలు కలెక్టర్ లో కూడా ఒక నూతన ఆలోచనను పుట్టిస్తాయి ఆ అంశం మీద ప్రభుత్వానికి ఒక రిపోర్టు పంపించాలని నిర్ణయించుకుంటాడు.

చందన నిర్ణయం అందర్నీ ఆశ్చ్యర్యచకితుల్ని చేస్తుంది పత్రికలు ఆమె నిర్ణయాన్ని అభినందిస్తూ, ఆ పథకం యొక్క లాభనష్టాల గురించి, అవి నిరుపేదలకు చేరాలంటే చేయవలసిన మార్పు చేర్పుల గురించి వ్యాసాలు వెలువడ్డాయి.

ఈ కథలో అనేక అంశాలు పాఠకుల్ని ఆలోచింపచేస్తా యి చందన ఒక స్త్రీ అయి ఉండి, తన ఉద్యోగంలో పైఅధికారుల నుండి అనేక ఒత్తిళ్ళు ఎదుర్కొంటూ కూడా తన ధైర్యాన్ని, వ్యక్తిత్వాన్ని కోల్పోకుండా నిలబడింది. ఆమె తీసుకున్న నిర్ణయం అనేక మందిని చైతన్యపరచడం గమనించదగ్గ విషయం.

## 3. 17. ఛ!

ఈ కథ 18 ఫిబ్రవరి 2007న "ఈనాడు" ఆదివారం అనుబంధంలో వెలువడింది. రచయిత్రి చంద్రలత. ఈ కథలో భారతి తన అస్తిత్వాన్ని ఎలా కాపాడుకుందీ, తను అస్తిత్వం కోల్పోవడానికి కారకుడైన తన భర్తలో ఎలాంటి మార్పు తీసుకువచ్చిందో దీనిలో వివరించబడింది.

**ఇతివృత్తం**

ఈ కథలో చంద్రమౌళి, భారతి దంపతులు. భార్గవి, భరత్ వారి సంతానం. చంద్రమౌళి మొదటి తరగతికి చెందిన ప్రభుత్వాధికారి. ఓ ప్రతిష్టాత్మక యూనివర్సిటీలో డాక్టరేటు సాధిస్తా డు స్వచ్ఛంద పదవీవిరమణ చేసి, వ్యాపారం ప్రారంభిస్తా డు భారతి ఫిజిక్స్ లెక్చరర్ గా పనిచేసి, పిల్లలు పుట్టాక మానేస్తు ంది పిల్లలిద్దరు అమెరికాలో స్థిరపడతారు.

దంపతులిద్దరూ అమెరికాలో ఉన్న తమ పిల్లలతో తరచుగా మాట్లాడుతూ ఉంటారు. అలాంటిది వారం రోజుల పాటు భారతి, పిల్లలతో మాట్లాడకపోయే సరికి, భార్గవి కంగారుగా ఇండియాలో ఉన్న తన చిన్నాన్న కూతురైన బృందాకి ఫోన్ చేసి, విషయం చెప్పి, ఒకసారి అమ్మా నాన్నను చూసి రమ్మని బతిమాలుతుంది. బృంద వెళ్లేసరికి పెద్దనాన్న, తోటలో ఉంటారు. పెద్దమ్మ పైన గదిలో ఉంటుంది. ఏమైందని ఆరాతీస్తే చంద్రమౌళి చాలా దురుసుగా 'తన గురించి తాను ఏమనుకుంటుంది. మూడు వారాలు చూడలేదు. పలుకలేదు. ఆమెకే అంత అహం ఉంటే నాకెంత ఉండాలి' అని అంటాడు. బృంద, భారతి ఉన్నగదికి వెళ్లి... కారణం అడుగుతుంది. అప్పటివరకు భారతి తనలో దాచుకున్న నలభై సంవత్సరాల బాధని వెళ్లగక్కుతుంది. మీ పెద్దనాన్న ఏరోజూ నాతో మనసువిప్పి మాట్లాడలేదు. నేను కూడా ఆయనతో చనువుగా మాట్లాడిన సందర్భాలు లేనే లేవు. ఆయన ప్రవర్తనతో నన్ను ఒక మూగజీవిగా మార్చేశారు. అందుకే విసిగిపోయాను. ఇక మిగిలిన జీవితమంతా ఇలాగే గడపాలని నాకు లేదు. ఒక మార్పును

కోరుకుంటున్నాను... అంటూ తన ఆవేదనను, అస్తిత్వపు ఆర్తిని వెళ్లగక్కుతుంది. ఆ మాటలు విన్న చంద్రమౌళిలో పశ్చాత్తా పం కలగడంతో కథ ముగుస్తు ంది

**కథావిశ్లేషణ:**

ఈ కథను పరిశీలిస్తే... భారతి ఉన్నత చదువులు చదివి లెక్చరర్ గా పనిచేస్తు ంది కాని, ఆమె భర్త ఆమెను ఏ రకంగానూ గౌరవించడు. భర్త ప్రవర్తన ఆమెను భయపెట్టడం వల్ల, కనీసం ఆమె స్వేచ్ఛగా మాట్లాడడం కూడా మానేస్తు ంది దాంతో ఆమె ఒక మూగ వ్యక్తిగా మారిపోయింది. ఏనాడూ భర్తతో తన కష్టసుఖాలు పంచుకోదు. అంతేగాక భర్తకు తనవల్ల ఏమైనా బాధ, కష్టం కలుగుతాయేమోనని చాలా అప్రమత్తంగా వ్యవహరించేది. భర్తను కంటికిరెప్పలా చూసుకున్నా, అతడు ఏనాడూ ఆమెను మనిషిగా గుర్తించలేదు ఇది అతని యొక్క నైజాన్ని ప్రతిబింబిస్తు ంది

భారతిలో ఉన్న అణకువను చూసి 'భార్య అంటే ఇలా ఉండాలి' అని పొగిడేవాడే తప్ప ఆమెకు ఒక మనసుందని ఆమెకు కొన్ని ఇష్టాయిష్టాలుంటాయని అతడు ఎన్నడు గుర్తించడు దాంతో ఆమె చాలా మానసిక వేదనకు గురౌతుంది. ఇక చేసేది లేక అతనితో మాట్లాడడం మానేస్తు ంది ఆ సందర్భంలో కూడా కారణం ఏమిటని భర్త అడగడు సరికదా ఆమె బాధపడేవిధంగా అనేక మాటలంటాడు. చివరికి బృందా వచ్చి ఆమెతో వ్యక్తిగతంగా మాట్లాడినపుడు తన గుండెల్లో దాగివున్న బడబాగ్ని బద్దలై అన్ని విషయాలు ఏకరువు పెట్టి చెప్తు ంది ఆ సందర్భంలో బృంద, చంద్రమౌళితో 'అహానికి అహం, పొగరుకి పొగరు లెక్క సరికాదు పెద్దనాన్న. ఎదుటివారిలోని అహాన్ని అధిగమించగల సంస్కారం మనలో ఉండవచ్చు కదా? నువ్వు ఈ కుటుంబానికి పెద్దవి... ఇన్నాళ్లు ఎవరు ఎవరిని భరించారంటావ్ పెదనాన్న?... ' అంటూ అతన్ని ప్రశ్నిస్తు ంది ఆ ప్రశ్నల పరంపరకి అతను మౌనంగా ఉండిపోయి, తన తప్పు తాను తెలుసుకుంటాడు.

ఈ కథలో భారతికి అస్తిత్వపు ఆర్తి కలిగినప్పుడు దాన్ని తీర్చుకోవాలనుకుంటుంది. కాని, దానికి ఏ మార్గం ఎన్నుకోవాలో ఆమెకు తెలియలేదు. భర్తతో ప్రచ్ఛన్నయుద్ధానికి దిగుతుంది. అందుకే ఆమె బృందతో 'ఒక మార్పును కోరుకుంటున్నాను. ఎలాంటి మార్పును కోరుకుంటున్నానో కూడా నేను స్పష్టంగా చెప్పగలను. కానీ... ఆ మార్పును తీసుకురాలేని అశక్తత నన్ను నిరాశలో ముంచెత్తు తోంది.. ' అంటూ తన బాధను వెల్లబుచ్చుకుంటుంది. ఈ మాటలు ఆమెలో ఉన్న ఒక నిస్సహాయ స్థితిని తెలియజేస్తు న్నాయి అయినప్పటికీ ఆమె మార్పును కోరుకోవడం, తన గతజీవితానికి ఒక

ముగింపునివ్వాలని ఆశించడం ఆమెలో వచ్చిన చైతన్యానికి నిదర్శనంగా కనబడుతుంది.

## 3. 18. జారుడు మెట్లు:

ఈ కథ 'రచన' మాసపత్రికలో ఏప్రిల్ 2009న వెలువడింది. రచయిత్రి గంటి భానుమతి. ఒక స్త్రీ తన జీవితాన్ని నాశనం చేసిన వ్యక్తిపై ప్రతీకారం తీర్చుకోవడమే ఈ కథలోని వస్తువు

**ఇతివృత్తం**

ఈ కథలో జాహ్నవి, ఆర్యా ప్రధానపాత్రలు. వీరిద్దరూ ఒకే ఆఫీసులో పనిచేస్తుంటారు ఆర్యా ఎప్పుడు ఆమె రాకపోకల్ని గమనిస్తూ ఉండేవాడు. ఆర్యాకి పెళ్లయినప్పటికీ జాహ్నవి అందానికి మంత్రముగ్ధుడవుతాడు. క్రమంగా ఆమెతో పరిచయం పెంచుకుంటాడు. ఆ పరిచయం ప్రేమకు దారితీస్తుంది ఒక రోజు జాహ్నవి ఆర్యాతో 'మీకు పెళ్లయ్యిందన్న సంగతి నాకు తెలీదు. తెలిసి ఉంటే విషయం ఇంతవరుకు వచ్చేది కాదు. ఇకముందు మనం కలవకుండా ఉండడం ఇద్దరికీ మంచిదని' చెప్తుంది ఆ మాటలు ఆర్యాను చాలా కలవరానికి గురిచేస్తాయి ఆ రాత్రి బాగా తాగి ఇంటికి వెళ్తాడు అతని భార్య మానస, అతని కంటికి రాక్షసిలా కనిపిస్తుంది ఆమె వల్లే జాహ్నవి తనకు దూరం అయిపోతుందని భావించి, ఆమెను ఏదోలా వదిలించుకోవాలని ఆలోచిస్తాడు ఈ ఆలోచనల పరంపరలో ఆమెతో చాలా ఛీత్కారంగా మాట్లాడతాడు.

ఆ మాటలు విన్న మానస ఆర్యాతో 'ఎవరినైనా ప్రేమిస్తున్నారా' అని సూటిగా అడుగుతుంది. ఆ మాటకు ఆర్యా పట్టుబడ్డట్టుగా భావించి వెంటనే 'అవును ప్రేమించాను. ఎనీ ప్రాబ్లం? నా ఇష్టం వచ్చినట్లు నేను ఉంటాను. ఏం చెయ్యగలవు? ఏం చేస్తావు? విడాకులులిస్తావా? ఇయ్యి... విడాకులియ్యగలవా!... ' అంటూ ఆమెను భయపెడుతాడు. ఆ తరువాత రోజు జాహ్నవికి ఫోన్ చేసి, తమ విషయం మానసకు తెలిసిపోయిందని, అవసరమైతే విడాకులు ఇస్తానన్నాదని ఈ విషయాన్ని సాయంత్రం మాట్లాడుకుందాం, రెస్టారెంట్ కి రమ్మని చెప్పి ఫోన్ పెట్టేస్తాడు ఆరోజు సాయంత్రం రెస్టారెంట్లో ఆమెకోసం ఎదురు చూస్తుంటాడు ఎంత సేపటికి రాకపోయే సరికి, ఇంటికి బయలుదేరతాడు. ఇంట్లో జాహ్నవి లేదన్న సంగతి గ్రహించి, ఇంటి తలుపు తీసుకొని లోపలికి వెళ్లగానే అతనికి ఒక కవరు

కనిపిస్తు ంది అది తీసి చదవడం ప్రారంభిస్తా డు ఆ ఉత్తరం జాహ్నవి రాసింది. ఆమె గతజీవితంలో జరిగిన ఒక విషాద సంఘటనను వివరిస్తు ంది జాహ్నవి పదో తరగతిలో ఉన్నప్పుడు లెక్కలు మాస్టారు లెక్కలు, భౌతిక శాస్త్రం బోధిస్తా డు క్రమ క్రమంగా జాహ్నవిని లోపరచుకుని ఆమెతో శారీరక సంబంధాన్ని పెట్టుకుంటాడు. దాని ఫలితంగా ఆమె గర్భవతి అవుతుంది. అప్పటికి ఆమె పదో తరగతి పూర్తవ్వడం ఆ లెక్కలు మాస్టారు హైదరాబాద్ వెళ్లడం జరిగిపోతుంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆమెను తీసుకుని ఆ మాస్టార్ ఇంటికి వెళ్తా రు అతను నాకేం తెలీదని తప్పించుకుంటాడు. ఇక చేసేది లేక తండ్రి ఆమెకు అబార్షన్ చెయ్యించడానికని హాస్పిటల్ కి తీసుకెళ్లి అక్కడ వదిలేసి ఇంటికి వెళ్లిపోతాడు. జాహ్నవి తండ్రి, తనను వదిలేసి వెళ్లిపోయాడని గ్రహిస్తు ంది అక్కడ ఉన్న డాక్టరమ్మ జాహ్నవిని ఒక కుటుంబానికి అప్పగిస్తు ంది వాళ్లు ఆమెను, ఆమె కడుపులో ఉన్న శిశువును కూడా ఆదరిస్తా రు క్రమక్రమంగా పై చదువులు చదివి ఉద్యోగంలో స్థిరపడుతుంది. ఉద్యోగ బదిలీ నిమిత్తం ఆర్యా పనిచేస్తు న్న ఆఫీసుకి రావడం జరుగుతుంది. ఆర్యా ఆమెను చూసే చూపులను బట్టి అతణ్ణి గుర్తు పడుతుంది తన జీవితాన్ని నాశనం చేసింది ఆర్యే అని గ్రహిస్తు ంది అతని బుద్ధి ఇంకా మారలేదని గ్రహించి అతనికి గుణపాఠం చెప్పాలనుకుని, అతనితో పరిచయం పెంచుకుంటుంది. ఈ క్రమంలో ఆర్యా తన భార్యను దూరం చేసుకుంటాడు. జాహ్నవి ఈ ఉత్తరం ద్వారా జరిగిన విషయాన్ని వివరిస్తు ంది అతనికి అందనంత దూరంగా వెళ్లిపోతుంది. చివరికి ఆర్యా తను చేసిన తప్పు గ్రహిస్తా డు దాంతో కథముగుస్తు ంది

ఈ కథలో జాహ్నవి ఆర్యాకు గుణపాఠం చెప్పిన తీరు ప్రశంసనీయంగా ఉంది. ఈ కథలోని ఆర్యాలాంటి పురుషులు అనేకమంది నేటిసమాజంలో కూడా వున్నారు. ఇలాంటి వారికి బుద్ధిచెప్పడానికి జాహ్నవి లాంటి వాళ్లు వుంటే కనీసం సాటి స్త్రీలకు అన్యాయం జరగకుండా వుండే అవకాశం వుంటుంది.

## 3. 19. టెన్షన్:

ఈ కథ ముళ్ళదోవ అనే కథాసంపుటి నుండి గ్రహించబడింది. రచయిత్రి ఎం.కె. దేవకి. ఉద్యోగంచేసే స్త్రీల పరిస్థితిని వివరించడం దీనిలోని ప్రధాన వస్తు వు

**ఇతి వృత్తం**

ఈ కథలో ప్రధానపాత్రలు శ్యామల, ఆమె భర్త కిరణ్ కుమార్. వీరిద్దరు ఉద్యోగస్తులే శ్యామల కాలేజీలో లెక్చరర్ గా పనిచేస్తుంది ఒక రోజు శ్యామల మధ్యాహ్నం కాలేజీ నుండి ఇంటికి వస్తుండగ తన ఇంటిదగ్గర చాలా మంది జనం కనిపిస్తారు అది చూసిన శ్యామల మనసు కీడు శంకిస్తుంది తన నాలుగేళ్ల పాపకు ఏదో అపాయం జరిగి ఉంటుందని భయపడుతుంది. ఇంటికి చేరేసరికి నిజంగానే తన కూతురు చిన్న ప్రమాదంలో చిక్కుకుందని తెలుసుకుంటుంది. శ్యామల ఇంట్లో పనిచేసే అమ్మాయి, శ్యామల కూతురిని దాగుడుమూతల ఆట ఆడించే క్రమంలో ఆ పాప గది లోపల ఉండగా అనుకోకుండా తలుపు గడి పడిపోతుంది. గదిలో ఆ చిన్న పాప ఒక్కర్తె ఉండడం వల్ల ఏడవడం మొదలు పెడుతుంది. ఆ గది తలుపు ఎలా తీయాలో ఎవరికీ అర్థంకాదు. ఈ లోపు శ్యామల ఆ పాపను బుజ్జగించి, ప్రోత్సాహకరమైన మాటలు చెప్పి, చివరికి ఆ పాపే గది తలుపులు తీసేటట్లు చేస్తుంది తను ఆ సమయానికి రాబట్టి సరిపోయింది. లేకపోతే ఎంత ప్రమాదం జరిగేదో అనుకుంటూ ఊపిరి పీల్చుకుంటుంది.

ఈ సంఘటన జరిగిన రాత్రి భర్త చాలా ఆలస్యంగా ఇంటికి వస్తాడు కనీసం ఆలస్యంగా వస్తానని కూడా చెప్పకపోవడంతో శ్యామల నొచ్చుకుంటుంది. ఆ రాత్రి వారిద్దరి మధ్య వాగ్వివాదం జరుగుతుంది. భర్త బాధ్యతా రాహిత్యనికి శ్యామల ఎంతో బాధపడుతుంది.

శ్యామల అటు ఉద్యోగాన్ని, ఇటు కుటుంబ బరువు బాధ్యతల్ని సమన్వయం చేసుకోలేక సతమతమవుతుంటుంది. ఆమె భర్త కాని, అత్త మామలు కాని ఆమెకు సహకరించరు. అందువల్ల నిత్యం ఒత్తిడికి గురవుతుంటుంది. తన సమస్యకు పరిష్కారం ఏమిటా అని అన్వేషిస్తుంది ఆ అన్వేషణలో తనకు పరిష్కారం దొరుకుతుంది. ప్రతిరోజూ కుటుంబసభ్యులందరికి లేచిన దగ్గర నుండి పడుకునే వరకు అన్ని పనులు చేయకుండా, ఎవరి పనులు వాళ్లు చేసుకునేటట్లు చేయడం వల్ల, శ్యామల ఏ విధమైన ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన జీవితాన్ని గడపడంతో కథ ముగుస్తుంది

**కథావిశ్లేషణ:**

ఈ కథను విశ్లేషిస్తే అనేక విషయాలు అవగతమవుతాయి. ఉద్యోగం చేసే స్త్రీలు అటు కుటుంబ జీవితంలోనూ ఇటు ఉద్యోగ జీవితంలోనూ ఎన్నిరకాలైన ఒత్తిడిలకు లోనవుతున్నారో ఈ కథలో

వివరించడం జరిగింది. ఈ కథలో ప్రధాన పాత్రయిన శ్యామల, ఉదయం లేచిన దగ్గర నుండి రాత్రి పడుకునే వరకు తన కుటుంబస్తులందరికి ఏ సమయానికి ఏది అవసరమో తెలుసుకుని మరీ చేసేది. తద్వారా పనుల ఒత్తిళ్లమధ్య నలిగిపోయేది.

ఒకసారి తన కూతురు ప్రమాదంలో చిక్కుకున్న రోజు, తన భర్త ఆలస్యంగా ఇంటికి వస్తాడు అతని బాధ్యతారాహిత్యానికి బాధపడుతుంది. ఆ సందర్భంలో స్వగతంలో 'మగమహారాజులు ఎంజాయ్ చేయడానికే పుట్టారు. ఇల్లు గురించి, పిల్లల్ల గురించి అసలు పట్టించుకోరు. ఆఫీసులో పని లేకపోయినా గంటలు గంటలు కబుర్లతో గడిపేస్తారు బుద్ధిపుట్టినప్పుడే ఇంటికి రావడం' అంటూ వాపోతుంది.

ఈ మాటలను గమనిస్తే పితృస్వామ్య సమాజం పురుషుణ్ణి నిజంగానే మహారాజులా తయారు చేసినట్లు స్పష్టమౌతోంది. అయితే ఈ విధమైన ధోరణి వల్ల స్త్రీలు ఎన్ని అవస్థలు పడుతున్నారో తెలుస్తోంది

మరొక సందర్భంలో రచయిత్రి, శ్యామల పాత్ర గురించి వివరిస్తూ 'తనూ ఉద్యోగం చేస్తుంది ఇంట్లో పని, బయట పనితో సతమతమవడం వల్ల టైం చాలదు. ఎక్కడున్నా ఇంట్లో వాళ్ల తిండి, తిప్పల గురించి ఆలోచించాలి. ఏ టైం కు జరగాల్సిన పని, ఆ టైం కు జరగకుంటే భరించలేనంత టెన్షనవుతుంది. దానివల్ల రోగాలు. వాటితో పనిచేసుకోలేక తిప్పలు' - ఈ మాటల్లో కుటుంబ జీవితంలో స్త్రీలు పడే అవస్థ అర్థమవుతోంది. అంతేకాక వాళ్ల అస్తిత్వాన్ని పోగొట్టుకోవడలో ప్రధాన పాత్ర వహించేది 'పని వత్తిడి' అనే విషయాన్ని స్పష్టపరచడమైనది.

ఈ కథలో శ్యామల తన సమస్యకు పరిష్కారాన్ని వెతుక్కునే క్రమంలో తన భర్త గురించి ఆలోచిస్తూ... "నా సుఖసంతోషాల గురించి పిసరంతయినా ఆలోచించని మనిషి గురించి నేనెందుకు ఓవర్ సిన్సియారిటీ ఫీల్ కావాలి" అని అనుకుంటుంది. అనుకున్నదే తడవుగా ఆ మరసటి రోజు నుండి కుటుంబస్తులందరికీ మితిమీరి సేవలు చేయకుండా తన పరిధిలో తాను పనులు చేయసాగింది. ప్రతి ఒక్కరికి తమ బాధ్యతలు తెలిసేటట్లు చేస్తుంది తద్వారా తన ఒత్తిడిని తగ్గించుకొని, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అటు కుటుంబాన్ని, ఇటు ఉద్యోగాన్ని సమన్వయం చేసుకోసాగింది.

ఈ కథలో స్త్రీ సమస్యనే కాకుండా, సమస్య పరిష్కారాన్ని కూడా తెలియచేయటం

గమనించదగ్గ విశేషాంశం.

## 3. 20. తృషిత:

ఈ కథ మార్చి 2004న ప్రచురించబడింది. రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మీదేవి. స్త్రీలు ఏవిధంగా పురుషుల ప్రేమకోసం పరితపించి, తమ అస్తిత్వాన్ని కోల్పోతారో ఈ కథలో వివరించడం జరిగింది.

**ఇతివృత్తం**

ఈ కథలో ప్రధానపాత్రలు తృషిత, వివేక్. తృషిత డిగ్రీ చదువుతున్న సమయంలో ఆమె సహ విద్యార్థి అయిన వివేక్ ఆమెను ప్రేమిస్తాడు ఆమె ప్రేమను పొందడం కోసం ఎన్నోరకాలైన ప్రయత్నాలు చేస్తాడు ప్రయత్నాలతో పాటు త్యాగాలు కూడా చేస్తాడు చివరికి తృషిత హృదయంలో చోటు సంపాదిస్తాడు పెద్దలను ఒప్పించి పెళ్లిచేసుకుంటారు. పెళ్లయిన రెండు సంవత్సరాల వరకు ఎంతో అన్యోన్యంగా జీవిస్తారు వారికి ఒక పాప పుడుతుంది. కాలక్రమంలో ఆమె భర్తకి ఆమె మీద ప్రేమ తగ్గిపోతుంది. ఒకప్పుడు తృషిత స్వతంత్రవ్యక్తిత్వంకు ఆకర్షితుడైన వివేక్ పెళ్లై, ఆమెపై ప్రేమ తగ్గిపోయిన తర్వాత అదే వ్యక్తిత్వం అతనికి అహంభావంగా, పొగరుగా కనిపిస్తుంది తృషిత మాత్రం తొలిరోజుల్లో వారి మధ్యఉన్న ప్రేమను ఆశిస్తుంది కాని అది ఆమెకు అందని ద్రాక్షగా మిగిలిపోతుంది. అలాంటి సందర్భంలో తృషిత పిన్ని ఆమెకు "నీ వ్యక్తిత్వం నువ్వు కాపాడుకో " అని హితోపదేశం చేయడంతో కథముగుస్తుంది

**కథావిశ్లేషణ:**

ఇది భారతీయ స్త్రీ యొక్క అంతరంగాన్ని చిత్రించిన కథ. భారతదేశంలో దాదాపు ప్రతీ స్త్రీ వివాహానంతర జీవితం ఇదే విధంగా ఉంది అనడం అతిశయోక్తి కాదు. కుటుంబ జీవితంలో స్త్రీలకెదురయ్యే వాస్తవ పరిస్థితులకు ఈ కథ అద్దంపడుతోంది.

పెళ్లికి ముందు ప్రతీ పురుషుడు స్త్రీని ఆరాధ్యదేవతగా చూస్తాడు పెళ్లి తర్వాత అతనికి వ్యామోహం తగ్గి ఆమె చేసే ప్రతీ పని తప్పుగానే కనిపిస్తుంది ఇదే విషయం తృషిత జీవితంలో కూడా జరుగుతుంది. తృషితకు పెళ్లయిన కొత్తలో ఆమెను చాలా అపురూపంగా చూసుకునేవాడు. నిద్రలేచేసరికి ఫిల్టర్ కాఫీ

కోసం అన్ని సిద్ధంచేసి ఉంచేవాడు. అన్నం తినిపించేవాడు. తృషిత తనకు ఎక్కడ దూరమైపోతుందో అనే భయంతో ఆమె చేతివేళ్ళ మధ్య తన వేళ్ళు ఇరికించి గట్టిగాపట్టుకునేవాడు. అలాంటి తన భర్తలో అనూహ్యమైన మార్పులు రావడం తృషిత తట్టుకోలేక పోతుంది.

తృషిత తన మనసులోని బాధనంతా పిన్నికి చెప్పుకుని బోరున విలపిస్తు ంది తృషిత పిన్ని, పెళ్లికి ముందే తృషితకు అనేక విషయాలు చెప్తు ంది కాని ఆ సమయంలో అవేవి ఆమె మనసుకు పట్టలేదు. అందుకే ఆమె ఇలాంటి క్లిష్టపరిస్థితులను ఎదుర్కోవలసివస్తు ంది

తృషిత స్వగతంలో 'అతని అనురాగమంతా ఆరిపోయింది. నేను ప్రాథేయపడి, లొంగివుండి, అతను అప్పుడప్పుడు కనపరిచే ఆ మెరుపులాంటి ప్రేమకోసం ఎదురుచూస్తూ నా సర్వస్వం వదులుకుంటే అతనికి ఎంతో బావుండి వుండును. కాని ఆ పని చెయ్యలేకపోయాను. ప్రేమతో పాటే అందవలసిన గౌరవం అనేది ఒకటుంది. అది కూడా కావాలి నాకు. అది దొరకదని తెలిసిపోయింది. అదిలేని వివేక్ ప్రేమ నాకు వద్దు. తోకాడించే కుక్కలా అతని చేతిలో బిస్కెట్ కోసం తిరగలేను. దాన్ని వివేక్ పొగరు అన్నాడు. ఔనా? పిన్ని మాత్రం పొగరుకాదంది. 'ఆత్మాభిమానం' అని, ఆడవాళ్లు మరచిపోయిన మాటను గుర్తు చేస్తు ంది' అని అనుకుంటుంది.

తృషిత పిన్ని, ఆమె కళ్లు తుడిచి "మనం కోరుకున్న ప్రేమలు మనకు దొరకవు. ఈ మగవాళ్లు ఇవ్వలేరు ఎంతకీ వాళ్ల అహాలు తృప్తిపరుస్తూ ఉంటే తప్ప మనల్ని పట్టించుకోరు. నువ్వు అతని కాళ్లముందు జీవితమంతా పడిఉన్నా జాలిపడగలడేమో గాని ఆ పూర్వపు ప్రేమ ఇవ్వలేడు. అతని హృదయంలోంచి ఆ ఆకర్షణ, ఆరాటం, పోయాయి. కనీసం నీ వ్యక్తిత్వం నువ్వు కాపాడుకుంటేనైనా ఎప్పుడైనా తిరిగి అతనికి ఆ పూర్వపు మోహం కలగొచ్చు. ఇతను కాకపోతే మరో కొత్త వ్యక్తి నీ జీవితంలోకి ఇలాగే ప్రవేశించినా కథ ఇలాగే నడుస్తు ంది ఆడవాళ్లందరమూ మనల్ని నిలువెల్లా ముంచేసే ప్రేమల కోసం ఎంతగానో ఎదురుచూస్తాం కొందరికి కొంత కాలమయిన దొరుకుతాయి. కొందరికి దొరకనే దొరకవు. అయినా జీవితమంతా ఈ దాహం వదలదు..."[22] అంటూ స్త్రీ జీవితానికి సంబంధించిన అనేక సత్యాలు వెల్లడిచేస్తు ంది

ఆ మాటలు విన్న తృషిత, తన తప్పు తాను తెలుసుకుంటుంది. ఈ కథలో స్త్రీలు ఏవిధంగా తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నారో వివరించడం జరిగింది. ఇక ముందు జీవితంలోనైనా తన అస్తిత్వాన్ని కాపాడుకుని జీవించాలని నిర్ణయించుకుంటుంది.

## 3. 21. దృశ్య కీచకం

ఈ కథ 12, మార్చ్ 2009న ఆంధ్రజ్యోతి అనుబంధంలో ప్రచురించబడింది. రచయిత్రి కొండేపూడి నిర్మల. ఈ కథలో ఉద్యోగం చేసే స్త్రీ ఒక పురుషుని ద్వారా ఎదుర్కొన్న సమస్యను వివరించడం దీనిలోని ప్రధాన వస్తువు.

**ఇతివృత్తం:**

ఈ కథలో ప్రధాన పాత్ర ప్రసన్న. ఈమె కార్పొరేట్ సంస్థలో ఉద్యోగిని. ఒకసారి ఉద్యోగంలో భాగంగా ఒక కాంట్రాక్ట్ కోసం ఇంటర్వ్యూకి వెళుతుంది. ఇంటర్వ్యూ బాగా చేశానని నమ్మకం కలిగి, ఆ కాంట్రాక్ట్ తనకు వస్తుందని ఆశిస్తుంది. ప్రసన్నను ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి, ఇంటర్నెట్ చాటింగ్ లో కలసి ఆమె ఎడల అసభ్యంగా ప్రవర్తిస్తాడు. దాంతో ఆమె ఆందోళనకు గురవుతుంది. క్రమక్రమంగా తనను తాను ధైర్యపరచుకొని ఎలాగైనా ఆ కాంట్రాక్ట్ పని దక్కించుకుని ఆ పనిని విజయవంతంగా ముగించాలని నిర్ణయించుకోవడంతో కథ ముగుస్తుంది.

**కథావిశ్లేషణ:**

ఈ కథ సాంకేతిక విజ్ఞానం అభివృద్ధి చెందుతున్న నేటి కాలంలో ఉద్యోగం చేసే స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను కళ్లకుకట్టినట్లు చిత్రించడం జరిగింది. ప్రసన్న ఎదుర్కొన్న మానసిక వేదనను లైంగిక వేధింపుగా చెప్పవచ్చు.

ప్రసన్నను ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి, ఆమెను 'సెక్సువాలిటీ, డ్యూయల్ రిలేషన్స్, ఆర్గాజయం విత్ స్టాండింగ్ పవర్ - వీటి గురించి ఎయిడ్స్ వచ్చిన వాళ్లకి క్లాస్ తీసుకోవాలి. ఒక ఆడదానిగా నువ్వు సౌకర్యంగా మాట్లాడగలవా' అని ప్రశ్నిస్తాడు. అందుకు ప్రసన్న 'తెలుసండీ, వీటి గురించి చదివాను. ఏ విషయమైనా పనిచేస్తున్న క్రమంలోనే కందండీ తెలిసేది' అని అంటుంది. ఆ తరువాత నుండి అవసరార్థం ప్రసన్న అతనితో మాట్లడవలసి వస్తుంది.

ప్రసన్నను ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి, ఆమెతో చాటింగ్ చేసే ప్రతిసారి డియర్ అని, డార్లింగ్ అని సంబోధిస్తుంటాడు. మరొక సందర్భంలో కంప్యూటర్ వెబ్ క్యామ్ ఆన్ చేయమని అడుగుతాడు. ఇలా రోజురోజుకి అతను శృతిమించి మాట్లాడుతుంటాడు. ఈ మాటలన్నీ ఆమెకు చాలా ఇబ్బందికరంగా అనిపిస్తాయి.

ఒకసారి చాంటింగ్ చేస్తూ ఉండగా ప్రసన్నను ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి, కంప్యూటర్ లో ఉన్న ప్రసన్న బొమ్మను ముద్దుపెట్టుకుంటాడు. ఆ సంఘటన ఆమెను చాలా కలవరానికి గురిచేస్తుంది. ఆ సమస్యను ఎలా అధిగమించాలో తెలియక సతమతమౌతుంది. ఒక సందర్భంలో ప్రసన్న సహోద్యోగి అయిన ఫణి, ఆమెను చూసి 'అబ్బో, కార్పొరేట్ సెక్టార్ లోనా నీ ఉద్యోగం...' అంటూ మాట్లాడతాడు. ప్రసన్నకు ఇంటర్నెట్ వల్ల ఎదురైన చేదుఅనుభవం తరువాత, ఫణి ఎందుకలా అన్నాడో గ్రహించుకోగలుగుతుంది.

ఇక అలాంటి వ్యక్తులతో కలసి పనిచేయలేనని ఆ కాంట్రాక్ట్ వదిలేసుకోవాలనుకుంటుంది ప్రసన్న. కాని ఆమె మనసు అంగీకరించదు. తనలో తాను ఎంతో సంఘర్షణకు గురవుతుంది. చివరికి 'తనను తాను ధైర్యపరచుకుని స్వగతంలో 'వాడు ఉన్నందుకు ఉద్యోగం మానేసే దశ నుంచి ఎలాగోలా తప్పించుకునే దశకు ఎదగాలి' అని అనుకుంటుంది.

'ఎదురుగుండా అద్దాల అల్మారాలో గాజు స్టాండులో నగిషీలు చెక్కిన కత్తి... ఈ మధ్యే ఎవరో బహుమతిగా ఇచ్చారు. చెయ్యి తెగకుండా కేకు కోసుకోమంటూ సవాలు చేస్తుంది' అంటూ కథ ముగుస్తుంది.

సమస్యను చూసి భయపడి పారిపోకుండా సమస్య ఉన్న చోటే నిలబడి, ఆ సమస్య ఎడల జాగ్రత్త వహించి తమ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ జీవితంలో ముందుకు సాగిపోవాలని తెలియచేయడం జరిగింది.

## 3. 22. నింగీ నేల:

ఈ కథ 1 జనవరి 2006న ఆదివారం ఆంధ్రభూమిలో ప్రచురించబడింది. రచయిత గుమ్మా ప్రసాదరావు. ఈ కథలో వెంకటరావు, కనకరాణి దంపతులు. వారి కుమార్తె అపర్ణ. వెంకటరావు పెద్దగా ఆస్తిపాస్తులున్నవాడు కాదు కాని తనకున్న దానిలో కుమార్తెను చదివిస్తాడు. అపర్ణ చిన్నప్పటి నుండి తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉండాలని భావించేది. అనుకోకుండా అపర్ణకు పెళ్లి కుదరడంతో ఆమె తండ్రి నానాకష్టాలుపడి, అప్పు చేసి పెళ్లి చేస్తాడు. తన పెళ్లి నిమిత్తం తండ్రి అప్పుల పాలవ్వడం అపర్ణకు బాధ కలిగిస్తుంది.

అపర్ణకు పెళ్లై అత్తా రింటికి వెళ్లిన తరువాత ఉద్యోగం సంపాదించి, భర్తను ఒప్పించి ఉద్యోగంలో చేరుతుంది. తను సంపాదించినదంతా తన పెళ్లికోసం తండ్రిచేసిన అప్పులుతీర్చమని తండ్రికి పంపుతుంటుంది. ఈ విషయంలో అపర్ణకూ తన భర్త మోహనరావుకూ మధ్య గొడవలు మొదలవుతాయి. అపర్ణ స్వతంత్రవ్యక్తిత్వం కలిగిన స్త్రీ గనుక అలాంటి భర్తతో కలసి ఉండలేక, తన పుట్టింటికి రావడంతో కథ ముగుస్తు ంది

**కథావిశ్లేషణ:**

అపర్ణ ఒక సామాన్య కుటుంబానికి చెందిన అమ్మాయి. అంతేకాక చదువుకుని ఉద్యోగం సంపాదిస్తు ంది అపర్ణ ఉద్యోగం చెయ్యడం మోహనరావుకు అసలు ఇష్టముండదు. కాని అపర్ణ బలవంతం మీద ఒప్పుకుంటాడు. తన సంపాదనంతా తండ్రికి ఇవ్వడం వల్ల వారి మధ్య మనస్పర్థలు ఏర్పడతాయి.

ఒక బాధ్యత కలిగిన అమ్మాయిగా అపర్ణ తనతండ్రి కష్టసుఖాల్లో పాలుపంచుకోవాలనుకోవడంలో ఆశ్చర్యంలేదు. ఆ పని తప్పు కాదు. కాని మోహనరావు దృష్టిలో ఈ విషయమే పెద్ద తప్పుగా కనిపిస్తు ంది అందుకే వారి మధ్య మనస్పర్థలు ఏర్పడతాయి. మోహనరావు మాత్రం తన తల్లిదండ్రులను కంటికి రెప్పల కాపాడుకుంటాడు.

ఈ సందర్భాన్ని గమనిస్తే పితృస్వామ్య వ్యవస్థ స్త్రీలను ఏవిధంగా లోపరచుకుందో అర్థమవుతుంది. స్త్రీ కి ఒక న్యాయం, పురుషుడికి ఒక న్యాయం అన్న ధోరణి కనిపిస్తు ంది

ఒక సందర్భంలో అపర్ణ మోహనరావుతో "నాకు మీ అమ్మ, నాన్న అంటే ఎంత గౌరవమో. మీరు వారిని కంటికి రెప్పలా చూసుకుంటున్నారు. అదేపని నేను చేస్తే తప్పు ఏముందని" అంటుంది. దానికి సమాధనంగా భర్త "తప్పులేదా? కన్నవారికోసం సంసారాన్నే వదులుకుంటావా? అంతాగా వారిమీద నీకు అభిమానం ఉంటే వారిని ఏ వృద్ధాశ్రమంలోనో చేర్చు. నెలనెలా వారికి డబ్బు పంపించు" అంటాడు. అపర్ణ "బావుంది, ఆపని ముందు మీరు చేయండి"[23] అంటుంది. అలా వారి మధ్య ఘర్షణ పెరిగిపోతుంది.

మరొక సందర్భంలో అపర్ణ పెళ్లికి మధ్యవర్తిగా వ్యవహరించిన చంద్రశేఖరం కూడా అపర్ణతో 'తల్లిదండ్రుల మీద మీకు ఆదరాభిమానాలు ఉండొచ్చు కాని ఇంత బరితెగిస్తా వా.. ?' అంటూ అపర్ణను మందలిస్తా డు ఈ మాటల్ని గమనిస్తే, సమాజం కూడా మత్స్యన్యాయాన్నే(పెద్దచేప చిన్న చేపను

మింగివేయడం) పాటిస్తు ంది తప్ప వివక్షణను ఉపయోగించడం లేదనే నగ్న సత్యం బహిర్గతమవుతుంది.

అపర్ణ, తన భర్త అంత సంకుచితంగా ఆలోచించి, తనను అపార్థంచేసుకోవడం భరించలేకపోతుంది. అందుకే తన అస్తిత్వాన్ని పోగొట్టుకోవడం ఇష్టంలేక అతనికి దూరంగా జీవించాలని నిర్ణయించుకుంటుంది. చివరికి తామిద్దరం ఒకరు నింగి, ఒకరు నేల అని గుర్తెరిగి అవి రెండు ఎలాగైతే ఒకదాన్నొకటి కలుసుకోలేవో తాము అంతేనని గ్రహించుకుంటారు.

## 3. 23. నిర్ణయం:

ఈ కథ ఓల్గా రాసిన "మృణ్మయనాదం" అనే కథల సంపుటి నుండి గ్రహించబడింది. ఈ నిర్ణయం కథలో స్త్రీలు యెంతమంది పిల్లల్ని కనాలి, వారిలో ఆడపిల్లలు ఎంతమంది, మగపిల్లలు ఎంతమంది... మొదలైన అంశాల్లో స్త్రీలు ఎదుర్కొనే మానసిక సంఘర్షనను చిత్రించడం జరిగింది.

ఈ కథలో కమల, విశ్వనాథం అన్యోన్య దంపతులు. విశ్వనాథం, కమలను ఇష్టపడి పెళ్లిచేసుకుంటాడు. కమల నర్సుగా పనిచేస్తు ంటుంది విశ్వనాథం మందుల కంపెనీలో పనిచేస్తా డు వారికి తొలి సంతానం ప్రియాంక. రెండోసారి కమల గర్భవతి అని తెలుసుకున్న విశ్వనాథం, కమలను స్కానింగ్ చెయ్యించుకోమని, ఆడపిల్లని నిర్ధారణ అయితే అబార్షన్ చెయ్యించుకోమని ఆజ్ఞాపిస్తా డు కమల పనిచేస్తు న్న హాస్పిటల్లోని డాక్టరమ్మ (శైలజ) కు ఆడపిల్లలని తెలుసుకొని అబార్షన్ చెయ్యించుకోవడం అస్సలు నచ్చదు. అలాంటిది తన హాస్పిటల్లో నర్సుగా పనిచేస్తు న్న కమల, ఆ మాట తన భర్త చెప్పేసరికి ఆమె జీర్ణించుకోలేకపోతుంది. ఆ తరువాత శైలజ కమలతో 'నీకు అలాంటి ఉద్దేశం ఉంటే, లెక్కచూసి నీ జీతం తీసుకొని వెళ్లిపో, మళ్లీ రావద్దు' అని చెప్తు ంది కమల ఏమీ చెయ్యలేని పరిస్థితిలో ఉంటుంది. కమల, అటు భర్త ఆధిపత్యాన్నీ, ఇటు డాక్టరమ్మ ఆధిపత్యాన్నీ భరించలేకపోతుంది.

ఒకరోజు కమల కాలుజారి పడిపోతుంది. పొట్టకు బలమైనగాయం అవుతుంది. అందువల్ల డాక్టర్ ప్రమేయం లేకుండానే ఆమెకు అబార్షన్ అయిపోతుందని భయపడుతుంది. భర్త ఆమెను హస్పిటల్ కు తీసుకొని వెళ్తా డు. కమల తొందరగానే కోలుకుంటుంది. కమలను ఇంటికి తీసుకుపోవచ్చని డాక్టర్ చెప్తు ంది అందుకు కమల డాక్టర్ తో నాకు ఆపరేషన్ చేసేయ్యండి. నాకు ఒక కూతురు చాలు. ఈ

నిర్ణయంలో మీ ప్రమేయంగాని, మా ఆయన ప్రమేయంగాని లేదు డాక్టర్. నా సొంత నిర్ణయం ఇది అని అనడంతో కథ ముగుస్తుంది

ఈ కథను విశ్లేషిస్తే అనేక అంశాలు వెల్లడవుతాయి. దీనిలో ప్రతి స్త్రీ సంతానం విషయంలో ఎదుర్కొనే అంతరంగ పోరాటాన్ని, భర్త వల్ల ఎదురయ్యే ఇబ్బందులను చిత్రించటం జరిగింది. కమల రెండవసారి గర్భవతిగా ఉన్నప్పుడు భర్త విశ్వనాథం స్కానింగ్ తీయించుకోమని, ఆడపిల్లయితే అబార్షన్ చేయించుకోమని, తన మనసులోని మాట బయటపెడతాడు. ఆ మాటకు కమల చాలా భయపడుతుంది. ఆమె భయానికి అనేక కారణాలున్నాయి. వీటిలో మొదటిది: ఉద్యోగం గురించి. కమల నర్స్ గా పనిచేస్తున్న హాస్పిటల్లోని డాక్టరమ్మకు ఈ విషయం తెలిస్తే, ఆ ఉద్యోగం నుండి తీసేస్తుందని రెండవది: అబార్షన్ చెయ్యించుకోకపోతే ఇక భర్త పెట్టే హింస.

ఈ సందర్భాన్ని గమనిస్తే సమాజంలో సగభాగంగా ఉంటున్న స్త్రీలను ఎవరు కూడా ఒక మనిషిగా, ఇంకా చెప్పాలంటే మనసున్న మనిషిగా గుర్తించడంలేదు అందుకే ప్రతి ఒక్కరూ ఆమెపై పెత్తనాన్ని చెలాయించి, వారివారి అభిరుచి మేరకు, సౌకర్యార్థం, స్త్రీ జీవించాలనే ఆలోచన కలిగివున్నట్లు స్పష్టమౌతోంది. పిల్లలకు జన్మనిచ్చే విషయంలో ప్రధాన భూమిక వహించేది స్త్రీ. నవ మాసాలు మోసి, తన ప్రాణాలను ఫణంగా పెట్టి బిడ్డకు జన్మనిస్తుంది అలాంటి స్త్రీ యొక్క ఇష్టాఇష్టాలతోకాని ఆరోగ్య సంబంధమైన విషయాలతోకాని ఏమి సంబంధం లేకుండా పురుషుడు తనకు అనుకూలంగా స్త్రీ జీవితాన్ని మలచుకోవడం వెనుక అతని స్వార్థం వుంది.

ఈ కథ ప్రారంభంలో కమల కూడా పురుషస్వామ్యం ఉక్కుపాదాల కింది నలిగిపోతూ ఉంటుంది. కాని ఎప్పుడైతే ఆమె తన అస్తిత్వం గురించి, తన ఇష్టాఇష్టాలను గురించి ఆలోచించిందో అప్పుడు ధైర్యంగా, ఇక తనకు పిల్లలు వద్దనుకుని ఆపరేషన్ చెయ్యించుకోవడానికి సిద్ధపడడం ఆమెలో కలిగిన చైతన్యానికి సాదృశ్యంగా వుంది. తన అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో అలాంటి నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతుంది.

అస్తిత్వవాద పితామహుడైన కీర్కగార్డ్ చెప్పిన 'మనిషి తనను గురించి తాను ఆలోచించుకోవాలి. తన జీవితానికి తన మనుగడకు ఒక అర్థాన్ని ఆపాదించుకోవాలి. జీవిత అసంతృప్తిలోంచే అస్తిత్వసంబంధమైన ఆలోచన పుట్టుకొస్తుంది' అనే మాటల్ని గుర్తుచేసుకోవాలి కీర్క గార్డ్ చెప్పినట్లు

కమల విషయంలో కూడా ఇలానే జరిగింది. ఎప్పుడైతే ఆమెలో తన జీవితం యెడల అసంతృప్తి కలిగి, ఆమె అస్తిత్వం ప్రశ్నార్థకంగా మారిందో ఇక అప్పటి నుండి తన గురించి తాను ఆలోచించడం మొదలు పెడుతుంది. అందువల్లే తను ఒక నిర్ణయం తీసుకుని దాన్ని ధైర్యంగా ప్రకటించి, తన అస్తిత్వాన్ని కాపడుకోగలిగింది.

## 3. 24. పరివర్తన

ఈ కథ ఆంధ్రజ్యోతిలో 16 ఆగష్టు 2009న ప్రచురించబడింది. రచయిత ఆరి సీతారామయ్య. దీనిలో ఒక స్త్రీ తనపై జరుగుతున్న శారీరకహింస నుండి తనను తాను ఏ విధంగా కాపాడుకుందో చెప్పబడింది.

**ఇతివృత్తం**

ఈ కథలో దీపికారావు ప్రధానపాత్ర. ఈమె, డాక్టర్ రామారావు భార్య. వీరిద్దరూ అమెరికాలోని డిట్రాయట్లో నివసించేవారు. వీరు పుట్టింది భారతదేశంలో అయినప్పటికి ఉద్యోగరీత్యా భర్త అక్కడ ఉండడం వల్ల దీపిక కూడా అమెరికా వెళ్తుంది వారికి పెళ్లైన రెండు నెలలు బాగానే గడుస్తుంది ఆ తరువాత నుండి రామారావు దీపికారావుకి రాత్రి సమయంలో అసభ్యకరమైన వీడియోలు చూపించి, ఆమెను కూడా ఆ వీడియోలోని స్త్రీలు చేస్తున్నట్లు చెయ్యమని బలవంతం చేసేవాడు. అతని ప్రవర్తన ఆమెను మానసికంగా చాలా కుంగదీస్తుంది ప్రతిరోజూ ఆమెకు నరకప్రాయంగా ఉండేది. ఇక ఆ బాధ భరించలేని ఒకానొక మానసికవ్యాధికి గురై అతణ్ణి హత్య చేయడం, అమెరికా ప్రభుత్వం ఆమెపట్ల వ్యవహరించిన తీరు గురించి వివరించడం జరిగింది.

ఈ కథలో ప్రధానపాత్ర అయిన దీపికారావు తన అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి గాను తన భర్తను హత్యచేసినట్లు తెలుస్తోంది అంటే... భర్త పెట్టే హింస భరించలేక దానినుండి విముక్తి కోరుకుంటుంది. ఆమె మానసిక స్థితి దెబ్బతిని, అతన్ని హత్య చేస్తుంది ఆమె అనుభవించిన మానసిక, శారీరక హింస ఆమె చేత ఆ పని చేయించింది అని చెప్పవచ్చు. ఎందుకంటే ఆమె భర్తను చంపిన తరువాత కూడా ఆమె అతని కోసం బాధపడినట్లు కథలో వివరించడం జరిగింది.

అమెరికా న్యాయస్థానం భారతీయుల విషయంలో కొంత కఠినంగానే వ్యవహరిస్తున్నట్లు కథలో వివరించడం జరిగింది. ఈ కథలో దీపికారావు తన కేసును వాదించడానికిగాను ఒక లాయరును నియమించుకోగలిగిన ఆర్థిక స్థోమత లేనందువల్ల అమెరికా ప్రభుత్వమే ఆమెకు ఒక లాయరును నియమించి, రామారావు మరణానికి పూర్తిగా దీపికారావే బాధ్యురాలని, భర్త ఆమెను ఏవిధంగానూ హింసించలేదని నిరూపిస్తుంది అందువల్లే ఆమెకు ఆరు సంవత్సరాలు కఠిన కారాగారశిక్ష విధిస్తుంది అమెరికా న్యాయస్థానం ప్రకారం విధించిన శిక్షలో రెండు సంవత్సరాలు గడిచాక ఖైదీ ప్రవర్తనలో గనుక పరివర్తన వస్తే, శిక్షలో కొంత సడలింపు ఉండే అవకాశం ఉంది. దీపికారావు మానసికంగా తిరిగి మామూలు స్థితికి చేరుకున్నాక, తనచేత ఆ హత్య చేయించడానికి వెనుక వున్న పరిస్థితులను విశ్లేషించి చూసుకుంటే, తను చేసినది పెద్దతప్పుగా అనిపించదు. అయితే తనభర్త చేసిన అరాచక కార్యక్రమాలను న్యాయస్థానం ముందు నోరువిప్పి చెప్పలేకపోతుంది. అంతేకాక ఆమె తన తరఫున వాదించడానికి లాయరు కూడా లేకపోవడం వల్ల ఆమె శిక్షలో ఎలాంటి సడలింపు ఉండక పోవడం శోచనీయం.

ఆమె భర్త ద్వారా అనుభవించిన శారీరక, మానసిక హింస కంటే ఆ శిక్ష తక్కువే అని భావిస్తుంది అందుకే సంతోషంగా శిక్షను భరిస్తుంది ఒక సందర్భంలో దీపికారావు మాట్లాడుతూ 'జైలుకి రాకముందు అమెరికా గురించి నాకు అంతగా తెలియదు. బయట ఉంది రెండు నెల్లేగా. అదీ ఎప్పుడు ఇంట్లోనే ఉండేదాన్ని. ఇల్లొక ప్రైవేట్ జైలు. కాకపోతే ఇప్పటి నా జైలుగది కంటే విశాలమైంది. మంచి వసతులున్న జైలు. నా భర్త డాక్టర్. మరీ అంత అడవిమృగంలా ప్రవర్తిస్తాడని నేననుకోలేదు...' అంటూ తనను ఇంటర్వ్యూ చేయడానికి వచ్చిన వ్యక్తితో చెప్పుకుంటుంది.

ఈ మాటలనుబట్టి ఆమె అంతరంగాన్ని గ్రహించవచ్చు. అంతేకాక ఆమె మాట్లాడుతూ 'నాకొంచెం జ్ఞానం ఉండి ఉన్నట్లయితే... భర్త అలాగ కూడా ప్రవర్తించవచ్చని ముందుగా తెలిసివున్నట్లయితే ... ఏమయ్యేదో' అంటూ తనను ఇంటర్వ్యూ చెయ్యడానికి వచ్చిన వ్యక్తితో చెప్తుంది ఈ మాటల్లో భర్తను హత్య చెయ్యడానికి ఉన్న ప్రధాన కారణం తనను హింసించడం తప్ప వేరేది కాదని స్పష్టమౌతుంది. దీపికారావు తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం ఎంతటి కష్టాన్ని భరించడానికైనా వెనుకాడలేదు. ఆమె తన అస్తిత్వాన్ని కాపాడుకున్న స్త్రీగా మనకు కనిపిస్తోంది.

## 3. 25. పారిజాతం:

ఈ కథ 19, ఏప్రిల్ 2009న ఈనాడు అనుబంధంలో వెలువడింది. రచయిత్రి సుధారమ. ఈ కథలో శారద ఒక మధ్యతరగతి యువతి. ఆమె పెళ్ళికి ముందు ఎలా ఉండేది, పెళ్లి తరువాత ఆమె జీవితం ఎలా మారిపోయింది, కొంతకాలానికి ఆమెలో ఏర్పడిన అసంతృప్తి ఏవిధంగా పెల్లుబికిందో... వివరించిన కథే పారిజాతం.

పారిజాతం కథలో శారద ప్రధానపాత్ర. ఆమె చిన్నప్పటి నుండి ఆటపాటల్లో, చదువుల్లో, కుట్లు, అల్లికలలో అందెవేసిన చేయి. ఆమె ఇంటర్ చదువుతూ ఉండగా పెళ్లి నిశ్చయమవుతుంది. భర్త డాక్టర్. అయినప్పటికీ ఆమెకు ఆ పెళ్లి ఇష్టముండదు. తనకు ఇంకా చదువుకోవాలని ఉందని, అప్పుడే పెళ్లి చేయవద్దని తండ్రిని బతిమలాడుతుంది. కాని ఏమి ప్రయోజనం ఉండదు. శారద తల్లిదండ్రులు ఆమెను ఏదోలా పెళ్లికి ఒప్పిస్తా రు పద్దెనిమిదెళ్లకే శారదకు పెళ్లయి అత్తా రింటికి వెళ్లిపోతుంది.

శారద భర్త మహాకోపిష్టి. అయినదానికీ కానిదానికీ ఆమెను తిట్టేవాడు. శారద అణకువగల స్త్రీ గనుక అన్నీ మౌనంగా భరించేది. అత్త మామలకు ఎదురుచెప్పేదికాదు. ఆ ఇంట్లో తన ఇష్టాయిష్టాలన్నీ చంపేసుకుని గుణవతియైన భార్యగా పేరు తెచ్చుకుంటుంది. ఒక సంవత్సరానికి రాఘవకు తల్లి అవుతుంది. రాఘవ కూడా బాగా చదివి తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుంటాడు. రాఘవకు పెళ్లవుతుంది. అతని భార్య ఉద్యోగిని కావడంతో అప్పటి నుండి శారద ఇంకా ఎక్కువగా సర్దుకుపోవలసి వస్తు ంది కోడలు ఆర్థిక స్వాతంత్ర్యం కలది గనుక కొన్ని సందర్భాల్లో అనవసరంగా శారదను అవమానించేది. శారద ఇక ఆ ఇంట్లో ఒక నిర్జీవ పదార్థంగా ఉంటూ వారి చీత్కారాలను తట్టుకోలేనని గ్రహించి, ముంబాయిలో ఉన్నటువంటి తన తమ్ముడైన సూర్యం దగ్గరికి వెళ్లిపోయి, తనకున్న శక్తిసామర్థ్యాలతో, కళానైపుణ్యాలతో నెలకి పదిపదిహేను వేల వరకు సంపాదిస్తు ంది శారదకు ఎప్పుడైతే ఆర్థిక స్వాతంత్ర్యం లభించిందో అప్పటినుండి ఎంతో మానసిక ఆనందాన్ని పొంది, హాయిగా తన జీవితాన్ని గడపడంతో కథ ముగుస్తు ంది

### కథావిశ్లేషణ:

ఈ కథను మనం విశ్లేషించి చూస్తే అనేక విషయాలు అర్థమవుతాయి. ఈ కథలో 'శారద' తన వ్యక్తిత్వాన్ని కోల్పోయినప్పుడు, అందరు ఆమెను ఒక పరాన్నబుక్కులా చూసినప్పుడు ఆమె ఎంతో

మానసిక సంఘర్షణకు గురౌతుంది. ఈ మానసికి సంఘర్షణే ఆమె తన అస్తిత్వాన్ని కాపాడుకునేటట్లు చేస్తుంది.

శారద బొంబాయి వెళ్లిపోయినప్పటినుండి శారద భర్తకు కోడలికి చాలా ఇబ్బంది అనిపిస్తుంది రఘు తన తల్లికి చాలాసార్లు ఫోన్లు చేస్తాడు కాని ఆమెకు అక్కడికి వెళ్లాలనిపించదు. తనను ఎవరూ అక్కడ ఒక మనిషిగా గుర్తించడంలేదని భావించి, ముంబాయిలోనే ఉండిపోతుంది.

ఒక రోజు శారద భర్త హఠాత్తుగా ముంబయి వస్తాడు తన తప్పు తెలుసుకున్నానని, తన ఆరోగ్యం క్షీణించిందని, ఇక ఎక్కువ రోజులు బతకనని, ఇక తాను జీవించే కొంతకాలమైనా భార్యతో కలిసి జీవించాలనుకుంటున్నానని, సూర్యంతో చెప్తాడు ఆ మాటలకు సూర్యం ఏమీ సమాధానం చెప్పడు. శారద ఇప్పుడు ఒక స్వతంత్ర వ్యక్తి, ఆమె పరాధీన కాదు కాబట్టి ఆమె ఈ విషయంలో తనదైన నిర్ణయం తీసుకోవాలని భావించి, మౌనంగా వుండిపోతాడు.

ఈ కథ ద్వారా స్త్రీ తన అస్తిత్వాన్ని కాపాడుకోవాలంటే ఆర్థిక స్వాతంత్రం తప్పనిసరిగా వుండాలని తెలియచెయ్యడం జరిగింది.

## 3. 26. పేరెంట్

ఈ కథ ఆదివారం 9 జనవరి, 2000న వార్త అనుబంధంలో వెలువడింది. రచయిత్రి వాడ్రేవు వీరలక్ష్మీదేవి. ఈ కథలో ఒక గిరిజన స్త్రీ యొక్క కుల అస్తిత్వాన్ని గురించి వివరించబడింది.

ఇందులో ప్రధానపాత్ర బాలమ్మ. ఈమె ఒక గిరిజన స్త్రీకి, ఒక ఉన్నత కులస్తుడికి పుట్టిన అమ్మాయి. బాలమ్మ తల్లి, భూషయ్య అనే ఆసామి ఇంట్లో పనిమనిషిగా ఉండేది. ఆ సమయంలో భూషయ్య ఆమెను రేప్ చేస్తాడు దానికి ఫలితంగా బాలమ్మ జన్మిస్తుంది బాలమ్మకు అన్ని తండ్రి రూపురేఖలు, గుణగుణాలు వస్తాయి చూసిన వారందరూ ఆమె ఎవరి కూతురో చాలా సునాయాసంగా గుర్తుపట్టి ఏడిపించేవారు. బాలమ్మ పెరిగి పెద్దయ్యాక, ఆమెకు తన పుట్టుక సంగతి తెలుస్తుంది తల్లి ఒక గిరిజన స్త్రీ గనుక తల్లి కులంతోనే ఆమె సమాజంలో గుర్తించబడుతుంది ఆమెకున్న కుల రిజర్వేషన్

ద్వారా తన సొంత ఊరికే వి.ఏ.ఓ (విలేజ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్) గా ఉద్యోగంలో నియమింపబడుతుంది. తనకున్న అధికారంతో భూషయ్య చేసిన అక్రమాలన్నీ బయటపెట్టి, అతనికి చెందిన ఆస్తు లన్నీ ఎవరికి చెందాలో వారికి చెందే విధంగా కృషిచేస్తుంది తను అనుకున్న పనులన్నీ నెరవేర్చి, తనలా తండ్రిలేని పిల్లలకు తండ్రిలా నిలవాలనే ఉద్దేశంతో గిరిజన పాఠశాలలో టీచర్ గా చేరడంతో కథముగుస్తుంది

**కథావిశ్లేషణ:**

ఈ కథలో గిరిజనులను ఉన్నతకులస్తులు ఏవిధంగా మోసగిస్తున్నారో స్పష్టంగా వివరించబడింది. అంతేకాక చదువుకున్న గిరిజనులు ఉన్నతవర్గాలవారు చేస్తున్న దోపిడిని గుర్తించి.. ఏవిధంగా తమ ఉనికి కోసం పోరాడతున్నారో ఈ కథలో చెప్పబడింది.

భూషయ్య ఉన్నత కులస్తుడు అంతేకాక ఏభై అయిదు ఎకరాల ఆసామి. అతని ఆస్తులన్ని అమాయకులైన గిరిజనులను మోసంచేసి సంపాదించినవే. అతని ఆగడాలను ప్రశ్నించే ధైర్యం ఎవరికిలేక అందరు మౌనంగా అతని అన్యాయాలను భరిస్తారు.

భూషయ్య దుర్మార్గపు చర్యల్లో భాగమే 'బాలమ్మ' పుట్టుక. బాలమ్మ రూపురేఖలు చూసినప్పుడు తల్లి హృదయం దరికోసుకుపోయేది. సమాజం, బాలమ్మ పుట్టుకను ఛీత్కరించేది. కాని భూషయ్య మాత్రం చాలా ధైర్యంగా జీవించేవాడు. ఒక సందర్భంలో బాలమ్మ ధైర్యంచేసి, అతణ్ణి 'నాన్నా' అని పిలుస్తుంది వెంటనే అతను ఆమె చెంపమీద కొడతాడు. అంతేకాక, ఇంకొక సారి అలా పిలిస్తే నీ అంతుచూస్తాను అని బెదిరించి వెళ్లిపోతాడు.

ఈ సందర్భం గమనిస్తే ఒక పసిహృదయం తండ్రిప్రేమ కోసం ఏవిధంగా పరితపిస్తోందో అర్థమవుతుంది. "నాన్న" అని పిలవాలని ఆమెలో ఉన్న ఆరాటం ఆమె చేత భూషయ్యను "నాన్న" అని పిలిపిస్తుంది తీరా ఆ పిలుపు తరువాత ఎదురైన పరిణామం ఆమెకు చేదైన అనుభవాన్ని మిగుల్చుతుంది. ఇక ఎప్పుడు అంతటి సాహసానికి పూనుకోదు. ఇవన్ని బాలమ్మ తన అస్తిత్వాన్ని ప్రశ్నించుకునే విధంగా చేశాయి.

బాలమ్మ బాగా చదువుకొని వి.ఏ.ఓ గా చేరిన తరువాత భూషయ్య ఇంటికి వెళ్తుంది ఆమె అతనివన్నీ అక్రమ ఆస్తులని అతనిపై కేసుపెట్టిందనే ఆక్రోశంతో భూషయ్య ఆమెతో ఇలా మాట్లాడుతాడు

'ఏమే! నీకెంత పొగరు! నామీదే పిటీషన్లు పెట్టిస్తావా! నీ అంతు తేలుస్తాను చూడు... నువ్వు నాన్- ట్రైబల్ కూతురివి అని చెప్పి నీ ఉద్యోగం పీకించేస్తాను' అంటాడు. దీనికి సమాధానంగా బాలమ్మ 'భూషయ్య! నేను నీ కూతుర్నే. ఆ సంగతి నువ్వు ఈ నాలుగు గోడల మధ్యే చెప్పగలవు. అది కూడా కష్టంతో, కాని నాకు తండ్రి లేడు. తల్లి ఉంది. తల్లి ఒక్కతే తండ్రిని నిర్ధారించేదని ప్రపంచానికీ, న్యాయస్థానానికీ అందరికీ తెలుసు. ఆమె నీ పేరు చెప్పదు. నీలాగా పరువు భయంతో కాదు. నా భవిష్యత్తు మీద ప్రేమతో ' అని సమాధానం చెప్పి, అక్కడ నుండి వెళ్లిపోతుంది. ఆ మాటలు మాట్లాడిన తరువాత ఆమెలో మరింత ధైర్యం, ఉత్సాహం, ఆనందం కలుగుతుంది. అప్పుడు తనలో తాను బాలమ్మ బేల కాదు, ధీర అని అనుకుంటుంది. తన తల్లిని మనిషిని చెయ్యగలనన్న నమ్మకంతో ముందడుగు వేస్తు ంది

ఈ మాటల్లో బాలమ్మ చైతన్యం, ఆమె కులానికి సంబంధించిన అస్తిత్వ ప్రశ్నల పరంపర నుండి తన అంతరంగంలో అంతవరకూ దాగిఉన్న బడబాగ్ని బద్దలై ఒక ప్రశాంతమైన మానసిక వాతవరణం ఆమెలో కలిగినట్టు తెలుస్తో ంది

బాలమ్మ చిన్నతనంలో తన కులం వల్ల చిన్నబుచ్చుకున్నప్పటికీ, అనేక అవమానాలు నిందలు భరించినప్పటికీ ఇప్పుడు అదే కులం ఆమెను అంత ఉన్నత స్థితిలో ఉంచడం ఆమెకు ఆనందాన్ని కలిగిస్తు ంది.

## 3. 27. పోరాటం:

'పోరాటం' కథ ఈనాడు వార్త పత్రిక ఆదివారం అనుబంధంలో 27 ఫిబ్రవరి 2005న వెలువడింది. రచయిత్రి మల్లీశ్వరి. ఈ కథలో భర్త నిరాదారణకు గురైన స్త్రీ కుంగిపోకుండా ఏవిధంగా తన అస్తిత్వాన్ని కాపాడుకుందో వివరించడం జరిగింది.

### ఇతివృత్తం

ఈ కథలో ప్రధాన పాత్రలు లలిత, ప్రభాకర్. వీరిరువురు దంపతులు. వీరికి ఇద్దరు పిల్లలు. పెళ్ళయిన కొంత కాలానికి ప్రభాకర్ కి 'మానస ' అనే అమ్మాయితో పరిచయం ఏర్పడుతుంది. క్రమక్రమంగా ఆ పరిచయం ప్రేమకు దారితీసి, లలితను విడాకులు ఇమ్మని అడిగే స్థితికి చేరుకుంటుంది.

లలిత భర్త విడాకులిమ్మని అడిగిన మాటలు విని ఆశ్చర్యపోతుంది. తను విన్నది నిజమని గ్రహించి, తను చేసిన తప్పేమిటో అర్థంకాక సతమతమవుతుంది. ప్రభాకర్ లలితను విడాకులు అడిగే సందర్భంలో 'నువ్వు నా రచనలకి ప్రోత్సాహంగా నిలవలేదు ' అనే అభియోగం ఆమెపై మోపుతాడు. లలిత ఇక చేసేది లేక తనకు తానే ధైర్యం తెచ్చుకుని అతనికి విడాకులు ఇవ్వడానికి సిద్ధపడుతుంది. అంతేకాక తను మధ్యలో ఆపేసిన చదువును కొనసాగించి ఏదో ఒక ఉద్యోగం సంపాదించాలని నిర్ణయించుకుంటుంది. ఇక ముందు జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లన్నిటిని ధైర్యంగా ఎదుర్కొని, వ్యక్తిత్వం ఉన్న మనిషిలా జీవించాలని అనుకోవడంతో కథముగుస్తుంది

**కథావిశ్లేషణ:**

ఈ కథను మనం కూలంకుషంగా పరిశీలిస్తే అనేక విషయాలు అవగతమవుతాయి. ప్రభాకర్, లలితను విడాకులు అడిగినప్పుడు ఆమె అనుభవించిన మానసిక వ్యధను ఈ కథలో కళ్లకు కట్టినట్లు చిత్రించారు. నేటి సమాజంలో అనేకమంది స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్య ఇది. ఈ కథలో లలిత పరిస్థితి కూడా ఒక సామాన్య స్త్రీ పరిస్థితే. ఎందుకంటే వివాహానంతరం కుటుంబ బరువు, బాధ్యతలను తలకెత్తుకుంటుంది నిరంతరం ఇంటిని శుభ్రం చెయ్యడం, పిల్లలకు, భర్తకు సేవలు చెయ్యడం, అత్తమామలను మెప్పించడం కోసం ఇతరత్ర కార్యక్రమాలు చెయ్యడంతోనే ఆమె సమయమంతా గడిచిపోతుంది. లలిత దినచర్యలో ఎక్కువ భాగం భర్తకు కేటాయించలేకపోవడం వల్ల అతను అసంతృప్తికి గురై, చివరికి పరస్త్రీ వ్యామోహంలోపడి లలితను విడాకులు ఇవ్వమని కోరతాడు. ఆ మాటలు విన్న లలిత, అది నిజమో అబద్ధమో తెలియక సందిగ్ధావస్థలో ఉండగా, భర్త ఆమెతో 'నాకోసం నువ్వేమీ చెయ్యలేదు. నేనో కవినని తెలుసు నీకు. ఏనాడు నా రచనలకి ప్రోత్సాహంగా నిలువలేదు. ఎంతసేపూ యిల్లూ, పిల్లలు, వంటలు ఇదే నీ లోకం... నిన్ను తప్పుపట్టడం వృథా... మిగిలిన జీవితాన్ని కూడా యిలా జీవంలేకుండా గడపడాన్ని ఊహించుకుంటే, గుండె బేజారెత్తుతోంది.. కానీ నా అదృష్టమో ఏమో మానస పరిచయమైంది. ఆమె నా ఎదుగుదల గురించే ఆలోచిస్తుంది ఆమెను గురించిన ఊహలే నా రచనలకి ప్రాణాధారం. తనని విడచి నేనుండలేను. మేమిద్దరం పెళ్లిచేసుకోవాలనుకుంటున్నాం ' అని అంటాడు.

ఈ మాటలు పరిశీలిస్తే ప్రభాకర్ ఆలోచనలను తెలుసుకోవచ్చు. లలిత అంతవరకు ఎవరికోసమైతే తన సమస్తం ధారపోసిందో అతనే తిరిగి 'నాకోసం నువ్వేమి చెయ్యలేద'నడంలో అతని ప్రవృత్తి బయలుపడుతుంది. అంతేకాక, ఆ మాటల్లో లలిత యెడల తిరస్కారభావం కనబడుతుంది. తన స్వార్థం

కోసం కుటుంబానికి అన్యాయం చేయడానికి సిద్ధపడినట్లు తెలుస్తోంది ఎలాంటి పరిస్థిల్లో భార్య అలా మారిపోయిందో అర్థంచేసుకునే ప్రయత్నం చేయలేకపోతాడు. వారికి పెళ్లయిన కొత్తలో అతను మాటిమాటికి పడక గదిలోకి పిలిచి ఏవో కవితలని చదివి వినిపిస్తాడు లలితకి కూడా అవి విని, మెచ్చుకోవాలనే వుండేది. కాని ఇంట్లో ఉన్న అత్తగారు చూపులతో వ్యక్తపరిచే భావాలు అర్థమయ్యాక అసలు పగలు ఆ బెడ్ రూం వైపు వెళ్లడానికే భయపడుతుంది. అటు అత్తగారు ఇటు భర్త మనస్తత్వాల మధ్య ఆమె నలిగిపోవడమేకాక తనదైన ఇష్టాయిష్టాలను వదులుకోవలసివస్తుంది ఇలాంటి విషయాలేమీ భర్త అర్థంచేసుకోలేకపోతాడు.

భర్త పలికిన మాటలు లలితను ఆలోచింపచేస్తాయి అందుకే స్వగతంలో 'డిగ్రీ ఫైనలియర్ లో ఉండగా పెళ్లయింది. పరీక్షలూ పెళ్లి ఒకే సమయంలో వుండడంతో పరీక్షలు రాయడం మానేసాను. యిన్నేళ్ళలో ఒక్కసారి కూడా డిగ్రీ కంప్లీట్ చెయ్యమని ప్రోత్సాహించలేదు. ప్రోత్సాహం... అవునూ... అతను తనని ఎప్పుడూ ప్రోత్సాహించలేదుగా మరి తనకేందుకు విడాకులు తీసుకోవాలనిపించలేదు. తను అతని మీద ఆధారపడి ఉంది. అతను సంపాదిస్తున్నాడు తనకదిలేదు. అందుకే అతను నిర్ణయం తీసుకోగలిగాడు...' అని అనుకుంటుంది. ఈ ఆలోచనల పరంపరలో ఆమెకు జ్ఞానోదయం అవుతుంది. అందుకే ఆర్థికస్వాతంత్ర్యాన్ని గురించి ఆలోచిస్తుంది ఆర్థికస్వాతంత్ర్యం లేకపోవడంవల్లే నాడు తను అలాంటి నిస్సహాయస్థితిలో ఉన్నానని గ్రహిస్తుంది అ గ్రహింపుతోనే స్వగతంలో "నేలంతా తళతళ మెరిసేలా తుడిచి తుడిచి, అతనివీ, పిల్లలవీ బట్టలు తెల్లగా అయ్యేలా రుద్దిరుద్ది వుతికి, అతను లేచిన దగ్గర నుంచీ బ్రష్ మీద పేస్టు వెయ్యడం, స్నానానికి నీళ్లు తోడడం... చివరికి కాళ్లకు షూ అందించడం..... అన్నీ ఎంతో నిబద్ధతతో క్రమంతప్పకుండా ఒంట్లో బాగాలేకపోయినా చేసాను. దానికి తను ప్రతిఫలం ఆశించలేదే! ఈ శ్రమంతా తనూ ఇంకో రంగంలో చూపించి ఉంటే అందులో విజయం సాధించడం పెద్ద కష్టమేమీ కాదే" అని అనుకుంటుంది. ఈ ఆలోచనలన్నీ ఆమెను చైతన్యపరుస్తాయి అందుకే భర్తతో "నేను విడాకులకి సిద్ధం... లాయర్ని సంప్రదించి నాకు, పిల్లలకి ఎంత భరణం వస్తుందో లెక్క కట్టించండి... ఆ డబ్బుతో నాలాంటి అభాగినులను అక్కున చేర్చుకొనే ప్రయత్నంచేస్తాను నా రెక్కలకష్టంతో పిల్లలను పోషించుకుంటాను. నేను ఇంతవరకు కూతురిగానో, భార్యగానో, తల్లిగానో బ్రతికాను తప్ప, ఓ మనిషిగా ఆత్మాభిమానంతో బ్రతికే ప్రయత్నంచేయలేదు. అదృష్టవశాత్తూ నా ఒంట్లో ఓపిక ఉండగానే మీరు నా కళ్లు తెరిపించారు"[25] అని అంటుంది. ఈ మాటల్లో ఆమె భవిష్యత్ ప్రణాళిక కనబడుతుంది. అంతేకాక ఇంతవరకు ఇతరుల కోసం జీవించి తనను తాను కోల్పోయాను అనే గ్రహింపు కలిగినట్లు స్పష్టమవుతుంది.

అందుకే ఇకముందు తనదైన వ్యక్తిత్వంతో జీవించాలనుకుంటుంది.

ఈ కథలో లలితకు పెళ్లి సంబంధం కుదిరింది అనే నెపంతో తల్లితండ్రులు ఆమె చదువును మధ్యలో ఆపెయ్యడం జరిగింది. తద్వారా ఆమె ఉద్యోగం చేసే అర్హతను సంపాదించలేకపోతుంది. కాబట్టి ఆర్థికస్వాతంత్ర్యం లేకుండా పోతుంది. ప్రతి చిన్నదానికి పెద్దదానికి భర్తను అడగడం జరుగుతుంది. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం వల్ల... భర్త అధికారానికి లోబడడం, అతని ఆదరణ కరువైనప్పుడు కుంగిపోవడం జరుగుతుంది.

ఈ పోరాటం కథ ద్వారా రచయిత్రి పాఠకులకు ప్రధానంగా రెండు విషయాలను చెప్పదలిచారు.

1. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరమని.
2. పెళ్లి నెపంతో అమ్మాయి చదువుని మధ్యలో ఆపివేయకూడదl r

## 3. 28. ప్రగతి

ఈ కథ 4 జూన్ 2000న విశాలాంధ్రలో ప్రచురించబడింది. రచయిత రహమతుల్లా. ఒక స్త్రీ భర్తతో కలసి కుటుంబ జీవితం చేస్తేనే జీవితం కాదని, అదే స్త్రీ అస్తిత్వం కాదని తెలియచేయడమే ఈ కథలోని వస్తు వు

**ఇతివృత్తం**

ఈ కథలో ప్రధాన పాత్రలు ప్రగతి. ఈమె స్నేహితులు కరుణ, విజయ. ప్రగతికి పెళ్లయిన వెంటనే భర్త... కట్నకానుకలు తీసుకొని పారిపోతాడు. ఆమె వివాహానంతరం తల్లిదండ్రులు ఆర్థికంగా చితికిపోతారు కనుక తిరిగి ఆమెకు మళ్లీ పెళ్లిచేయలేకపోతారు. ప్రగతికి నలభై సంవత్సరాలు వచ్చాక ఆమె కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకొని ప్రగతికి మళ్లీ పెళ్లి చేయలనుకుంటారు. కాని అప్పటికే ఆమెకు వయసుదాటిపోతుంది. అందువల్ల ప్రగతి అవివాహితురాలుగానే మిగిలిపోతుంది.

ప్రగతి తనకు 'పెళ్లికాలేదనే ఆలోచన' ఆమెను దినదినం కుంగిపోయేలా చేస్తు ంది తద్వారా శారీరకంగా, మానసికంగ, బలహీనమౌతుంది. ఒకసారి సైకియాట్రిస్టు దగ్గరికి వెళ్లివస్తు ండగా... తన చిన్ననాటి స్నేహితురాలైన కరుణ కనిపిస్తు ంది ఇద్దరూ ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్నాక కరుణ నన్స్ లోకి వెళ్లిపోయినట్లు తెలుసుకుంటుంది.

ప్రగతి, మరుసటిరోజు స్కూల్ కి వెళ్లాక ఆ రోజు స్కూల్లో జరిగే ఫంక్షన్ కు కలెక్టర్ విజయ వస్తు న్నట్లు తెలుస్తు ంది ఆ కలెక్టరమ్మగారికి అతిథి మర్యాదలు చేయడనికి ప్రగతి నియమించబడుతుంది. ఆ ఫంక్షన్ ముగిశాక, విజయ తన స్నేహితురాలని ప్రగతి గుర్తిస్తు ంది విజయ, ప్రగతిని ఇంటికి ఆహ్వానిస్తు ంది

ఒక ఆదివారం ప్రగతి, విజయను కలవడానికి వెళుతుంది. వెళ్లాక, ఇద్దరూ వారివారి జీవితాలను గురించి మాట్లాడుకుంటారు. ఆ మాటల ఫలితంగా ప్రగతి 'స్త్రీ జీవితానికి పెళ్లి ఒక్కటే పరమావధికాదని, భర్త ఒక్కడే స్త్రీ అస్తిత్వానికి కారకుడు కాదని, భర్తలేకపోయినా సుఖంగా, సంతోషంగా జీవించవచ్చని' గ్రహించడంతో కథ ముగుస్తు ంది

**కథావిశ్లేషణ:**

ఈ కథను నిశితంగా పరిశీలిస్తే... అనేక విషయాలు అవగతమౌతాయి. ఆధునిక కాలంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైనవి: 1. ఆలస్యంగా పెళ్లికావడం, 2. పెళ్లియ్యాక భర్త ద్వారా సమస్యలు ఎదుర్కోవడం, 3. అనేక పరిస్థితుల మూలంగా పెళ్లికాకపోవడం.

నేటి సమాజంలో దాదాపూ ప్రతి యువతి (ఎక్కువగా మధ్య తరగతి యువతులు) ఏదో ఒక ఉద్యోగం చేసి కుటుంబానికి ఎంతో కొంత ఆర్థికసహాయం అందించవలసి వస్తు ంది ఈ క్రమంలో వారికి తగిన సమయంలో పెళ్లిళ్లు కాకపోవడం వల్ల అనేక సమస్యలు ఎదురౌతున్నాయి.

ఈ కథలోని ప్రగతి పరిస్థితి కూడా దాదాపూ అలాంటిదే. ప్రగతికి పెళ్లయిన వెంటనే భర్త కట్నకానుకలతో పరారౌతాడు. తల్లిదండ్రులు ఆమెకు వెంటనే మళ్లీ పెళ్లిచేయలేకపోతారు. ఆ విధంగా ఆమె ఒంటరిగా మిగిలిపోతుంది.

ప్రగతి వివాహజీవితం గురించి ఎన్నో కలలుకంటుంది. మాతృత్వంపై మమకారం పెంచుకుంటుంది. తీరా ఆమె ఆశలన్ని అడియాశలైపోయే సరికి తట్టుకోలేకపోతుంది. ఈ పరిస్థితులన్నీ ఆమె మనసుపై ప్రభావం చూపడం వల్ల, శారీరకంగా, మానసికంగా కుంగిపోతుంది.

స్త్రీ అస్తిత్వాన్ని నిర్ణయించే వారిలో పురుషుడిదే ప్రథమస్థానం. ఈ కథలో కూడా అదే జరిగింది. ప్రగతిని వివాహం చేసుకొని పారిపోయిన వ్యక్తి వల్ల ఆమె జీవితం ఎడారిగా మారిపోతుంది. తరువాత ఎదురైన పరిస్థితులు ఆమెను ప్రోత్సాహపరిచి, ఒక సంతోషకరమైన జీవితం జీవించడానికి సహకరిస్తా యి

ప్రగతి, తన చిన్ననాటి స్నేహితురాలైన కరుణను కలిసినప్పుడు ఆమెతో... తను మాతృత్వం పొందలేకపోయాననే విషయం గురించి చెబుతూ 'స్త్రీ జీవితానికి పరిపూర్ణతను సంతరింపచేసే మాతృత్వాన్ని నోచుకోలేదనే బెంగ నన్ను కుంగదీస్తు ంది.. ఆ దిగులుతోనే ఆరోగ్యం దెబ్బతింటుంది' అని

అంటుంది. ఆ మాటలకు కరుణ 'చూడు ప్రగతీ! తల్లనిపించుకోవడానికి మన పేగు తెంచుకునే బిడ్డలు పుట్టాల్సిన అవసరం లేదు. మా మథర్ ను యావత్ ప్రపంచం 'మథర్' అని ప్రేమాభిమానాలతో పిలుస్తుంది నీకు తెలుసా, ఆమె వర్జిన్! పెళ్లిచేసుకోకుండానే కోట్లాది మందికి తల్లయ్యింది. అదృష్టంకొద్దీ నీకు టీచర్ ఉద్యోగం ఉంది. స్కూల్ పిల్లలంతా నీ పిల్లలే అనుకో. వాళ్లను మంచి పౌరులుగా తీర్చిదిద్దు. వందల మంది విద్యార్థులకు అమ్మవౌతావు..." అంటూ చెప్తుంది ఈ మాటలు ప్రగతికి కొంత ఓదార్పు కలిగిస్తాయి

ప్రగతి తన స్నేహితురాలైన కలెక్టర్ విజయను కలిసినప్పుడు ఆమెతో 'జీవితాంతం తోడుగా ఉండే భర్త లభించలేదే అనే దిగులు నన్నావరించుకొని ఉంది. అందుకే ఉత్సాహంగా ఉండలేకపోతున్నాను' అని అంటుంది. ఆ మాటలకు విజయ 'అవివాహితులంతా నీలా దిగాలుగా ఉండే రూలేదన్నా ఉంటే లక్షలాదిగా ఉన్న విధవలు, డైవోర్సీలు ఏడుస్తూ కూర్చోవాలి. మరి వాళ్లెవరు ఏడుస్తూ అలా కనిపించడంలేదు. నాకు పెళ్లయిందనుకుంటున్నావా?... లేదు. డిగ్రీలో ఒకతన్ని ప్రేమించాను. ప్రమాదవశాత్తు చనిపోయాడు. ఆ తరువాత పెళ్లివైపు మనసుపోలేదు. సివిల్ సర్వీసు పరీక్షలు రాశాను. విజయం సాధించాను. జాబ్ శాటిస్ ఫ్యాక్షన్ బాగా ఉన్నందున పెళ్లి గురించి సీరియస్ గా ఆలోచించలేదు. రకరకాల కారణాల వల్ల మనలాంటి చాలామంది భర్తలు లేకుండానే ఒంటరిగా జీవితాన్ని గడపాల్సి వస్తున్నది నీలాంటి వాళ్లను చూస్తుంటే నాకో విషయం అర్థమవుతుంది. భర్తలేనందువల్ల కలిగే నష్టం కన్నా లేడనే ఫీలింగే స్త్రీలను ఎక్కువ అశాంతికి గురిచేస్తుంది నావరకు నాకైతే ఏదైనా ఒక ఉన్నతాశయం వైపు చిత్తశుద్ధితో ప్రయాణం సాగిస్తుంటే మనలోని నెగిటివ్ అంశాలన్నీ కొట్టుకుపోతాయి... ' అంటూ ఆమె మాటలు ముగిస్తుంది

ఈ మాటలన్నీ ప్రగతి మనసుకు ప్రశాంతత కలిగిస్తాయి ఇంటికి చేరాక, తన డైరీలో "స్త్రీ జీవితానికి భర్తా - పిల్లలే ఏకైక ఆదర్శం కాకూడదు. సమాజంలో తృప్తినిచ్చే ఉన్నతాశయాలు ఎన్నో ఉన్నాయి. ఆ బాటలో ప్రయాణించే కరుణ, విజయ లాంటి స్త్రీ లెందరో మన చుట్టూ ఉన్నారు. అయితే స్త్రీలు కూపస్థ మండుకాల్లా కాకుండా వాటినుంచి బయటపడి, మారుతున్న ప్రపంచాన్ని చూడగలిగితే అశాంతి దరిచేరదు"[25] అని రాసుకుంటుంది.

ఈ మాటలను బట్టి ప్రగతి తన స్నేహితులైన కరుణ, విజయ మాటల ద్వారా తనలో ఒక స్ఫూర్తి కలిగి, ఇకముందు జీవితంలోనైనా ఉన్నతంగా, అర్థవంతంగా జీవించాలనుకోవడం గమనించదగ్గ విషయం.

## 3. 29. బింబ ప్రతిబింబం:

ఈ కథ నవ్యవారపత్రిక లో (దీపావళి ప్రత్యేక సంచిక) 2009న ప్రచురించబడింది. రచయిత్రి గంటి భానుమతి. ఈ కథ, ఒక స్త్రీ ఏ విధంగా బయట ప్రపంచాన్ని అధిగమించి, తన ఉనికిని ఎలా కాపాడుకుందో వివరంచబడింది.

ఈ కథలో ప్రధానపాత్ర రుక్మిణి. ఆమె భర్త మాధవ్. వారికి ఇద్దరు పిల్లలు. రుక్మిణి ఉద్యోగస్తు రాలు ఉదయంలేచి వంటచేసి, అందరికి బాక్సులు పెట్టి, హడావిడిగా ఉద్యోగానికి వెళ్తుంది ఎప్పుడు తన గురించి తాను పట్టించుకోదు. అంతేకాక ఎప్పుడు కూడా ఎదుటివారు ఏమనుకుంటారో అనే ధ్యాసే తప్ప అసలు నేనేంటి? నా ఉనికి ఏమిటి? నేను ఎవరికోసం జీవిస్తున్నాను? అనే ఆలోచనలకు ఆమె మనసులో తావులేదు. కానీ, అద్దంముందు నిలబడి తన ప్రతిబింబాన్ని చూసుకుంటే మాత్రం, ఆ ప్రతిబింబం ఆమెతో మాట్లాడున్నట్లు అనిపించేది. అద్దంముందు నిలబడిన ప్రతిసారి ఆమె అంతరాత్మ ఆమెతో 'ఏం రుక్మిణి, మారవా! ఇంత పిరికిదానిలా ఉంటావెందుకు? నీ చుట్టూ ఉన్నవాళ్లలో ఉండే కొద్దిపాటి ధైర్యం కూడా లేదు. ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వం అస్తిత్వం వెన్నుముకని నిటారుగా ఉంచడం లాంటి పదాల అర్థం నీకు తెలుసా! అసలు అలాంటి పదాలు నీ డిక్షనరిలో లేవా' అని ప్రశ్నిస్తూ వుంటుంది. రుక్మిణికి తనలో తనకు పోరాటం ఉండేది. తన అంతరాత్మ చెపుతున్నది యథార్థం అని తెలిసినప్పటికీ, తన విధానాన్ని మార్చుకోవాలని అనుకున్నప్పటికీ అది అమెకు సాధ్యమయ్యేది కాదు. అంతేకాక ఎవరైనా ఏదైనా పనిచెప్తే 'చెయ్యను' అని అనలేని బలహీనత ఆమెది. అందుకే తనకు ఇష్టంలేకపోయిన, కష్టమైన, బాధయినా చేసేది. అలా చేస్తున్నప్పుడు కూడా ఆమె అంతరాత్మ 'ఎందుకు ఇతరుల కోసం నిన్ను నీవు కోల్పోతున్నావు' అని నిలదీసేది. కాని ఆ ప్రశ్నకు ఆమె దగ్గర జవాబు వుండదు.

రుక్మిణి క్రమక్రమంగా తన ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలని దృఢనిశ్చయంతో ముందుకుసాగుతుంది. ఆమె బలహీనతను గ్రహించిన ఆ కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రతిసారీ ప్రతిపనిని రుక్మిణికే అప్పగిస్తుంది రుక్మిణి తనను తాను సరిదిద్దుకోవాలని నిర్ణయించుకుంటుంది. ఒక సందర్భంలో ప్రిన్సిపాల్ స్టాఫ్ రూంకి వచ్చి, 'సంస్కృతి సంస్థ మన ఏరియాలో ఉన్న స్కూళ్లకి, కాలేజీలకి ఏవేవో పోటీలు పెడుతోం+ది. ఓ పదిమందిని సెలెక్టు చేశాం. వాళ్లని హరిహర కళాభవన్ కి తీసుకెళ్లాలి. మీలో ఎవరో ఒకరు వాళ్లతో వెళ్ళాలి' అంటుంది. అందరూ నిశ్శబ్దంగా ఉంటారు. ఎవ్వరు మాట్లాడలేదు. ఆమెవైపు చూడ్డానికే భయపడతారు. 'రుక్మిణీ... నువ్వు...' అని ప్రశ్నిస్తుంది ప్రిన్సిపాల్. రుక్మిణి గుండె గుబేలుమంటుంది.

'ఇంతమందిలో తనొకత్తే ఈవిడగారికి కనిపిస్తున్నాను' అని స్వగతంలో అనుకుంటుంది. అంతేకాక నాకెందుకు ఇంత మొహమాటం. నా తోటి లెక్చరర్లకి లేదేం? అనుకొని, వెంటనే తల అడ్డంగాఊపుతుంది. అంతేకాక 'పని ఉంది మేడం... నవరాత్రులు మొదలవుతున్నాయి కదా.... షాపింగ్ ఉంది' అంటూ సున్నితంగా తిరస్కరిస్తుంది

రుక్మిణి జీవితంలో మొట్టమొదటిసారిగా మొహమాట పడకుండా తన వల్లకాని పనికి 'నో' అని చెప్తుంది ఇది ఆమె మొదటి విజయంగా భావిస్తుంది అందులోనుంచే 'నేను ఎందుకు అన్న' ప్రశ్న పుట్టి, ఆ ప్రశ్నకు జవాబు వెతకడంలో చైతన్యంవస్తుంది తద్వారా రుక్మిణిలో మార్పురావడంతో కథముగుస్తుంది.

ఈ కథలో అనేక మంది అంతరంగస్థితిని చిత్రికపట్టి చూపించారు రచయిత్రి. రుక్మిణి, ఇతరులు తననేమనుకుంటారో అనే సంశయం, మొహమాటం కొద్దీ తమ ఇష్టాయిష్టాలను వదులుకొని తన అస్తిత్వాన్ని కోల్పోతుంది. తన అంతరంగం ఎల్లప్పుడు 'పిరికిగా ఉండొద్దని, ఎవరికోసం నీ ఇష్టాయిష్టాలనువదులుకోవద్దని' చెప్పడం ద్వారా ఆమెలో మార్పు కలిగి, తన అస్తిత్వాన్ని కాపాడుకోగలుగుతుంది.

## 3. 30. భూలక్ష్మి:

ఈ కథ డిసెంబర్ 2009న ప్రచురించబడింది. రచయిత రహమతుల్లా. ఈ కథలో కుటుంబజీవితంలో స్త్రీ ఏ విధంగా తనను తాను కోల్పోయిందో వివరించడం జరిగింది.

**ఇతివృత్తం:**

ఈ కథలో ప్రధాన పాత్రలు భూలక్ష్మి, ఆమె భర్త కృష్ణమాచార్యులు. భూలక్ష్మి తండ్రి నరసింహాచార్యులు. ఈయన ఉపాధ్యాయుడు. కూతురిని ఎంతో గారాబంగా, స్వేచ్ఛగా పెంచుతాడు. భూలక్ష్మి రూపసి. సంస్కారవంతురాలు. ఆమెకు కృష్ణమాచారితో పెళ్లిజరుగుతుంది. ఇక అప్పటి నుంచి ఆమె జీవితం నరకంలా మారుతుంది. ఆమె ఆ కుటుంబంలో శారీరకంగా, మానసికంగా ఏ విధంగా నలిగిపోయిందో తెలియజేయడం దీనిలోని ప్రధానాంశం.

**కథావిశ్లేషణ:**

ఈ కథలో భూలక్ష్మికి పెళ్లయిన మొదటిరోజు నుండి ఆమె ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండా అన్నీ జరిగిపోతుంటాయి. పెళ్లయిన మొదటి రాత్రిని ఆమె ఎంతో ఉన్నతంగా ఊహించుకుంటుంది. తీరా

ఆ రోజు ఆమెకు చేదైన అనుభవం మిగులుతుంది.

భూలక్ష్మి గదిలోకి ప్రవేశించేసరికి భర్త గాఢనిద్రలో ఉంటాడు. అర్థరాత్రి దాటాక అత్తగారు తలుపు తట్టి, లోపలికి వచ్చి, 'చెబుదామనుకుంటూనే నిద్రపోయాను. నేనే రెండు నిద్ర మాత్రలిచ్చాను. పెళ్లిపనుల్తో అలిసిపోయాడు. ఈ చాప, మంచం పక్కనే వేసుకుని నువ్వూ పడుకో' అని అంటుంది. ఆ మాటలు భూలక్ష్మికి అవమానంగా, హీనంగా అనిపిస్తా యి తను గాఢ నిద్రలోకి వెళ్లాక... తనకెంతో అసహ్యమైన గొంగళిపురుగు మానవరూపం ధరించి తనపై పాకుతున్నట్లు అనిపిస్తు ంది అది కలా నిజమా అనుకుంటూ కళ్లుతెరిచే సరికి భర్త వెకిలిగా నవ్వుతూ పక్కకు ఒరుగుతాడు. ఈ సంఘటన ఆమెను ఎంతో అశాంతికి గురిచేస్తు ంది 'తనతో ఒక్క మాటన్నా మాట్లాడి ఎరుగని అపరిచితునితో తనకు తెలియకుండా, తన అనుమతి లేకుండా... తన శరీరానికో చేదుఅనుభవం' అనుకుంటూ అవమానంగా భావిస్తు ంది భర్త ఆమెపై అత్యాచారం చేసినట్లు భావిస్తు ంది

పెళ్లికి ముందే పోటీపరీక్షలు రాసి, వరంగల్ జిల్లా టెలికాం ఆఫీసులో స్టెనో ఉద్యోగం సంపాదించుకుంటుంది. కాని తన సంపాదన మీద తనకు స్వేచ్ఛలేకుండా పోతుంది. ప్రతి చిన్న చిన్న ఖర్చులకు భర్తను డబ్బు అడగాల్సిరావడం ఇబ్బందిగా భావిస్తు ంది ఒకరోజు పువ్వులకు డబ్బులిమ్మని భర్తను అడుగుతుంది. అందుకతను 'అమ్మో! నా జీతం నేనేనాడు మొదటిరోజు ఖర్చుపెట్టలేదు. పూల సింగారం నీకూ, డబ్బాముదం నాకూనా? ఎట్లా కనిపిస్తు న్నాను నీకు నేను... ' అంటూ అక్కడి నుండి వెళ్లిపోతాడు.

మరొక సందర్భంలో భూలక్ష్మి ఆఫీసు నుండి వచ్చేసరికి ఒళ్లు హూనమవుతుంది. ఇంటికి వచ్చాక ఇంటిపని, వంటపనితో ఉన్న కాస్త ఓపిక పోతుంది. పనంతా అయ్యాక మంచం మీద నడుం వాల్చగానే భర్త వచ్చి పశువులా ప్రవర్తించి ఆమె శరీరాన్ని, మనసును మరింత హింసిస్తా డు భూలక్ష్మి పరిస్థితి గమనిస్తే ఆమె శారీరక, మానసిక హింసకు గురైనట్లు స్పష్టమవుతుంది.

ఆఫీసుల్లో పనిచేసే స్త్రీల అనుభవాలను గురించి రచయిత వివరిస్తూ "ఛండాలపు ప్రపంచానికి ఆఫీసొక నమూనా. పురుషుల్తో పక్కపక్కనే కలిసి పనిచేయాల్సిన అనివార్యత. స్త్రీలను మనుషుల్లా మెదలనివ్వని పురుషులు. మాటా, చూపూ, చర్యా, ఆలోచనా అంతా అసహజం. కామంతో లొంగదీయడానికి పన్నే పద్మవ్యూహాలు. కుటుంబ సభ్యుల అనుమానాలూ, నిఘాచర్యలు. తన ప్రమేయమేమీలేకనే తన జీవితం నరకం. పైకంతా సుఖంగానే, స్వేచ్ఛగానే. లోనంతా చెదపురుగులాంటి వత్తిడి రాక్షసి..."[26] అంటూ వివరిస్తా డు ఈ మాటలు ఉద్యోగం చేసే స్త్రీలు ఎదుర్కొంటున్న కష్టాలను

తెలియచేస్తున్నాయి కథ చివరిలో భూలక్ష్మి జీవితాన్ని గురించి చెప్తూ "ఆమెకు పని, ఆహారంలా అత్యంత అవసరంలా అయిపోతుంది. కుటుంబానికి, సమాజానికి భూలక్ష్మి ఒక సేవ, సౌకర్యం, ఆనందం, విశ్రాంతి. కాని ఆమె యెడల అవి స్వార్థంగా సంకుచితంగా, అహంకారంగా, ప్రేమరాహిత్యంగా అయిపోయినాయి. పైకి ఆమె చుట్టూ ఏ కంచె కనిపించదు. ఆమె పంజరంలో లేదు. ఏ పంజరమూ కన్పించకుండానే ఖైదీలాంటి జీవితం భూలక్ష్మిది" అని కథ ముగిస్తాడు రచయిత.

ఈ మాటల ద్వారా ఆమె సమాజ చట్రంలో బంధించబడి, తన అస్తిత్వాన్ని ఎలా కోల్పోతుందో అర్థమవుతుంది. ఈ కథలో భూలక్ష్మి తన అస్తిత్వాన్ని కోల్పోవడానికి ప్రధాన కారణాలు...

1. స్త్రీకి తన సంపాదన పై హక్కులేకపోవడం.
2. స్త్రీ పురుషుల మధ్య అసమానత.

ఈ రెండింటిని అధిగమించగలిగితే స్త్రీలు తమ అస్తిత్వాన్ని కాపాడుకొని మరింతగా ప్రగతిపథంలో పయనించడానికి ఆస్కారం ఉంటుంది. దీనికిగాను అటూ ప్రభుత్వం, ఇటు సమాజం సహకరించాలి.

## 3. 31. మదుపు

ఈ కథ 20 ఆగస్టు 2006న ఆంధ్రజ్యోతి అనుబంధంలో ప్రచురించబడింది. రచయిత డాక్టర్ ఎ.సీతారత్నం. ఈ కథలో ఒక స్త్రీ తన భర్త ద్వారా, అన్న ద్వారా మోసగించబడి కూడా, ఏ విధంగా తన అస్తిత్వాన్ని కాపాడుకుందో వివరించడం జరిగింది.

**ఇతివృత్తం**

ఈ కథలో ప్రభాత్, అపర్ణ భార్యాభర్తలు వాళ్ల ఇంట్లో పనిచేసే స్త్రీ నూకి. కథంతా ఈమె చుట్టూనే తిరుగుతుంది. నూకీ నాలుగైదు ఇళ్లలో పాచి పనులు చేసుకుంటూ జీవిస్తుంది నూకి అన్న ఇల్లు కట్టిస్తానని చెప్పి, ఆమె దగ్గర డబ్బులు తీసుకొని మోసం చేస్తాడు భర్త కూడా ఆమెను మోసం చేస్తాడు అలాంటి పరిస్థితుల్లో ఆమె ఇకపై ఎవ్వరి మీద ఆధారపడకుండా, స్వతంత్రంగా జీవించాలని నిర్ణయించుకోవడంతో కథ ముగుస్తుంది.

**కథావిశ్లేషణ**

ఈ కథలో పేద స్త్రీ అయిన నూకిని తన కుటుంబస్తులు ఏ విధంగా మోసగించారో వివరించడం జరిగింది. నూకి తన రెక్కల కష్టం మీద బతికే మనిషి. భర్త తాగుబోతు. కుటుంబం గడవడానికి ఏమాత్రం

సహకరించడు సరికదా, నూకి దాచుకున్న డబ్బులు కూడా పట్టుకెళ్లి తాగేవాడు. నూకి తన కష్టాలను అపర్ణతో చెప్తూ 'మొగుడు దగ్గరకి పోదామంటే ఆడు ఇంకోత్తిని ఉంచుకున్నాడు. మిషన్ కొనడానికి మదుపు పెట్టమంటాడు. అన్ని వేలు ఎలా తేవాలి. అదెవర్తో కలెక్టరాఫీసులో పనిచేస్తాందంట అది మదుపెట్టగలదు. కుట్టు మిషన్ కొనేయగలదు. అందుకని నన్ను, నా కూతుర్ని వదిలేశాడు' అని అంటుంది. ఈ మాటల ద్వారా భర్త ఆమెను ఏ విధంగా మోసంచేశాడో అర్థమౌతుంది.

నూరి తన అన్న గురించి చెప్తూ 'మా అన్న ఏటన్నాడంటే... కొండమీద జాగా రాళ్ల గుర్తు లెట్టి బాగుచేసి ఇల్లేసుకో. బావకి వాచ్ మెన్ ఉద్యోగం ఇప్పిస్తా నన్నాడు నిజమేననుకుని నానా పాట్లు పడ్డాను. ఒంటి రెక్కతో చేశాను. ముచ్చటగా మూడు నెలలు కూడా ఆ ఇంట్లోలేను. ఓ రాత్రేల ఫోను చేసి కొత్త కలెక్టరు పోలీసుల్ని పంపుతున్నాడు. ఇవన్నీ సర్కారు భూములు గదా! నువ్వు అమ్మమ్మ దగ్గరికి వెళ్లు' అని పంపేడు. నిజమే అనుకున్నాను. నిన్న వచ్చి చూసేసరికి ఎవరికో అద్దెకిచ్చేశాడు... అని వివరిస్తూ ఏడుస్తుంది అన్న చేసిన అన్యాయాన్ని భరించలేక పెద్దల ద్వారా అడిగించినందుకు నూకి అమ్మయిన అప్పాయమ్మ సహించలేక, అపర్ణ భర్తయిన ప్రభాత్ తో "దీని యవ్వారం మీకే తెలీదు బాబు. దీనికి ఎవరన్నా ఖాతరు లేదు. దీనికి పెనిమిటి అక్కర్లేదు. దీన్తో గొప్ప బాధంగా ఉంది బాబూ!..... అంటూ చెప్తుంది.

ఈ సందర్భాన్ని గమనిస్తే అప్పాయమ్మ కూడా తన కొడుకునే సమర్థిస్తున్నట్టే అనిపిస్తుంది కన్న కొడుకు అన్యాయం చేసినా, తల్లి మౌనంగా భరించి నూకిదే తప్పన్నట్లు మాట్లాడుతుంది.

అందరిచేతిలో మోసపోయిన నూకి ఇక ఎవ్వరినీ నమ్మకూడదని, ఎవ్వరిమీద ఆధారపడకూడదని గ్రహించి ఇలా అంటుంది 'నా కూతుర్ని నేనే పెంచుకుంటాను. నేనే కుట్టు నేర్చుకొని, మిషన్ కొనుక్కుంటా. మా ముత్యాలమ్మ బాప్పకు ఏడొందలు నెలకు ఇస్తే నన్ను, నా కూతుర్ని ఉండనిస్తుంది నేను అక్కడే ఉంటా' అని ఆత్మవిశ్వాసంతో చెప్తుంది ఆ మాటల్లో ఉన్న గాంభీర్యాన్ని చూసి ఇక ఎవరు మాట్లాడలేకపోతారు.

ఈ మాటలను గమనించినట్లయితే నూకి ఇక ముందైనా స్వతంత్రంగా వ్యవహరించి, తన అస్తిత్వాన్ని కాపాడుకోవాలని అనుకోవడంతో కథ ముగుస్తుంది.

## 3. 32. మసిగుడ్డ:

"మసిగుడ్డ" కథ ఆంధ్రప్రభ వార్తా పత్రికలో ఏప్రిల్ 4, 2000న వెలువడింది. రచయిత సింహ ప్రసాద్. ఒక స్త్రీ తన భర్త మరణానంతరం ఏవిధంగా అస్తిత్వపోరాటం చేసిందో వివరించడమే దీనిలోని ప్రధాన వస్తు వు

**ఇతివృత్తం:**

ఈ కథలో సీతమ్మ ప్రధానపాత్ర. ఆమెకు ఇద్దరు కొడుకులు. భర్త మరణానంతరం సీతమ్మ కొడుకుల వద్దే ఉండి, ఆ పనీ ఈ పనీ చేస్తూ కాలం గడుపుతుంది. ఆ కుటుంబం నివసిస్తు న్న ఇల్లు సీతమ్మ పేరు మీద ఉంటుంది. ఒకరోజు పెద్దకొడుకు తల్లి దగ్గరకు వచ్చి, కూతురి పెళ్లిచెయ్యడం కోసం డబ్బు అవసరం గనుక ఇల్లు అమ్మాలనుకుంటున్నాను. దానికి నువ్వు ఒప్పుకోవాలని చెప్పి తల్లిని బలవంతంగా ఒప్పిస్తా డు ఇల్లు అమ్మకం తరువాత సీతమ్మ కొడుకులిద్దరూ వేరుపడతారు. సీతమ్మ కొంతకాలం పెద్దకొడుకు వద్ద, మరికొంతకాలం చిన్నకొడుకు దగ్గర కాలం వెళ్లబుచ్చుతుంది. ఇల్లు అమ్మకం తరువాత కొడుకులు తల్లిపై చూపించే ప్రేమ తగ్గిపోతుంది. కోడళ్ల సూటిపోటి మాటలు ఎక్కువవుతాయి. ఇక తల్లి దగ్గర ఏవిధమైన ఆస్తిగాని డబ్బుగాని లేదని భావించిన కొడుకులు తల్లిని దూరంగావుంచుతారు. పరిస్థితిని అర్థంచేసుకున్న సీతమ్మ చిన్నపిల్లల సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకొని, స్వతంత్రంగా జీవించాలని నిర్ణయం తీసుకోవడముతో కథముగుస్తు ంది

**కథావిశ్లేషణ:**

ఆర్థికస్వాతంత్ర్యంలేని స్త్రీ జీవితంలో ఎన్ని కష్టాలు పడుతుందో ఈ కథలో చక్కగా వివరించబడింది. సీతమ్మ భర్త బతికున్నంత కాలం ఆమెకు ఏ కష్టాలూ వుండవు. ఎప్పుడైతే భర్తచనిపోయి పిల్లలమీద ఆధారపడవలసివచ్చిందో ఇక అప్పటినుండి ఆమె కష్టాలు ప్రారంభమవుతాయి. కొడుకులు, కోడళ్లు ప్రతిచిన్న విషయానికి ఆమెపై కోప్పడ్డం మొదలుపెడతారు. ఒకసారి సీతమ్మ ఉదయాన్నే లేచి బయటకి వస్తు న్న సందర్భంలో ఆమె కాలుతగిలి టీపాయ్ కిందపడిపోతుంది. అది విన్న పెద్దకొడుకు, 'ఏవో కొంపలు మునిగిపోతున్నట్టు ఇంత పొద్దున్నేలేవడం ఎందుకు' అని విసుక్కుంటాడు. మరొక సందర్భంలో సీతమ్మ తన పెళ్లిరోజున పాలన్నం వండుతానని కోడలితో అంటుంది. దానికి కోడలు 'చాల్లెండి సంబడం! కూతురు పెళ్లిచేయడం ఎలా భగవంతుడా అని మేము ఇదవుతుంటే మీకు పాయాసాలు

కావాల్సివచ్చాయా...?' అంటూ బుగ్గలు నొక్కుకుంటుంది. ఇలా సీతమ్మ అడుగడుగున అవమానాలు పొందుతుంటుంది.

ఆర్థికంగా ఎలాంటి స్వతంత్రం లేనందువల్ల తను వారికి లోకువై పోయానని సీతమ్మ గ్రహిస్తు ంది అదే సమయంలో పక్కింటి రమణ, తన పాపను తీసుకువచ్చి, చూసుకోమని సీతమ్మకు అప్పగిస్తు ంది కొంత కాలానికి మీనాక్షి కూడా కూతురిని సీతమ్మ దగ్గర వదిలి ఆఫీసుకు వెళ్లడం మొదలుపెడుతుంది. సీతమ్మ అది మంచి అవకాశంగా భావించి పిల్లలను సంరక్షించే 'క్రెష్' ని ప్రారంభిస్తా నని వారితో ధైర్యంగా చెప్తు ంది.

సీతమ్మ తన అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే తహతహ ప్రతి విషయంలో కనిపిస్తు ంది అందుకే వారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడకూడదని భావించి, క్రెష్ ని ప్రారంభించాలనే ఆలోచనతో ముందుకు సాగుతుంది. నేటి సమాజంలో ప్రతి స్త్రీకి ఆర్థికస్వాతంత్ర్యం అవసరం. లేకపోతే స్త్రీజీవితం, సీతమ్మ జీవితంలా 'పరాన్న బుక్క'గా జీవించవలసివస్తు ందని రచయిత తెలియచేశారు. ఈ కథ చివరిలో సీతమ్మ తన అస్తిత్వాన్ని కాపాడుకున్నట్లు స్పష్టమౌతుంది. ఎవరికోసం తన వ్యక్తిత్వాన్ని, ఆత్మాభిమానాన్నివదులుకోక, స్వతంత్రజీవనం సాగించడం కోసం సొంతంగా క్రెష్ ఏర్పాటు చెయ్యాలనుకోవడం ఆమెలోని చైతన్యాన్ని, అస్తిత్వపు ఆర్తిని కనపరుస్తు ంది

## 3. 33. ముసుగు:

ఈ కథ స్వాతి మాసపత్రికలో జూన్ 2003న వెలువడింది. రచయిత సింహప్రసాద్. ఈ కథలో ఒక యువతి తన తల్లిదండ్రుల దృక్పథంలో మార్పుతీసుకురావడం ప్రధాన వస్తు వు

**ఇతి వృత్తం**

ఈ కథలో ప్రధానపాత్ర అరుణ. ఆమె తల్లిదండ్రులు వైష్ణవి మరియు మూర్తి. ఒకసారి వైష్ణవి ఆఫీసు నుండి ఇంటికి వస్తు న్న సమయంలో అరుణ ఒక అబ్బాయితో రెస్టారెంటులో కనిపిస్తు ంది వైష్ణవి వాళ్లను తదేకంగా చూస్తు ండగానే వాళ్లిద్దరు కలసి బండిమీద ఎటో వెళ్లిపోతారు. ఈ సంఘటన వైష్ణవి

హృదయంలో చాలా కల్లోలాన్ని రేపుతుంది. ఇంటికి వచ్చి భర్తతో విషయం చెప్తుంది అరుణ ఇంటికి రాగానే కూతురిని నిలదీస్తారు అంతేకాక అమెరికాలో ఉంటున్న మా చెల్లిలి కొడుకుతో నీ పెళ్లి ఖాయం చెయ్యదలిచాం అని చెబుతారు. ఆ మాటలకు అరుణ మనసు గాయపడుతుంది. తల్లిదండ్రులు ఎందుకంత సంకుచితంగా ఆలోచిస్తున్నారో అర్థంకాక కొంతసేపు మదనపడుతుంది. ఆ తరువాత రెస్టారెంట్లో కలిసిన అబ్బాయికి, తనకి ఎలాంటి సంబంధంలేదని అతను తనకు కేవలం స్నేహితుడు మాత్రమేనని, మీరు శాసించినట్లు నేను బావను పెళ్లిచేసుకోనని ఖండితంగా చెప్పి, తల్లిదండ్రుల సంకుచిత మనస్తత్వం వల్ల తను ఏ విధంగా ఇబ్బందిపడిందో వివరించడంతో కథముగుస్తుంది

**కథావిశ్లేషణ:**

ఈ కథలో రచయిత నేటి యువతరానికి, తల్లిదండ్రులకు మధ్య ఏర్పడుతున్న సంఘర్షణ చిత్రించారు. అంతేకాక తల్లిదండ్రులు పిల్లలతో ఎలా వ్యవహరించాలో అరుణ పాత్ర ద్వారా చెప్పించారు.

అరుణ యుక్తవయసు వచ్చిన అమ్మాయి. ఏది మంచీ ఏది చెడూ అని గ్రహించగలిగే విచక్షణ కలిగిన అమ్మాయి. అంతేకాక తల్లిదండ్రులు కూడ ఎంతో ఆదర్శవంతంగా అరుణను పెంచుతారు. అలాంటి అరుణ ఒక అబ్బాయితో కలిసి తిరగడం తల్లిదండ్రులు సహించలేకపోతారు. వాళ్లమధ్య అక్రమసంబంధం ఉందని ఊహించి, అరుణను మందిలిస్తారు

ఈ సందర్భాన్ని గమనిస్తే... నేటి యువతరాన్ని తల్లిదండ్రులు సరిగా అర్థంచేసుకోలేకపోతున్నారని అర్థమౌతుంది. ఎందుకంటే తల్లిదండ్రులు తాము పెరిగి పెద్దయిన రీతిగానే పిల్లలు కూడా ఉండాలని భావిస్తారు పిల్లలేమో స్వేచ్ఛగా జీవించాలని భావిస్తారు ఈ ఇద్దరి దృక్పథాలలో వ్యత్యాసం ఉండడం వల్ల వారి మధ్య అవగాహన లోపించి, తరచు గొడవలకు దారితీస్తుందనడానికి 'అరుణ' మంచి ఉదాహరణ. ఈ కథలో అరుణ తల్లిదండ్రులయిన వైష్ణవి, మూర్తి కులాంతర వివాహం చేసుకుంటారు. తీరా కూతురు ఒక అబ్బాయితో బయట కనిపించిందని తెలియగానే ఆ అబ్బాయి కులం ఏమిటో అని ఆలోచిస్తారు అందుకే అరుణ తల్లిదండ్రులు "సమజంలో గొప్పగా గౌరవంగా బతకాలంటే మీ పిల్లలు, వాళ్ల పిల్లలూ సుఖంగా ఎలాంటి సమస్యలు లేకుండా బతకాలంటే కులం, ప్రాముఖ్యాన్నీ కాదనలేం. మనకి ఇష్టమున్నా లేకపోయినా అగ్రకులపు స్థాయినీ సంస్కారాన్నీ గుర్తింపునీ తోసివేయలేం" అంటారు. ఆ మాటలకు సమాధానంగా అరుణ "ఒప్పుకుంటాను డాడీ, అందుకనే అభ్యుదయ మంత్రాలు పఠించే వాళ్లు కూడా పిల్లల పెళ్లి దగ్గరకొచ్చేసరికి కులం గుర్తొస్తుంది"

అని అంటుంది. అంతేకాక తల్లితో 'మమ్మీ! నీకివాళేమయ్యింది. ప్రతీదీ కూలంకుషంగా సమీక్షించి, హేతుబద్ధత గురించి ఆలోచించే నువ్వు నీ కుతురి దగ్గరకొచ్చేసరిగా అడ్డంగా వాదిస్తున్నావేంటి? ' అని ప్రశ్నిస్తుంది ఈ మాటలకు తల్లి సమాధానం చెప్పలేక మౌనం వహిస్తుంది అరుణ ప్రవర్తన తనకు నచ్చకపోవడంవల్ల వెంటనే అత్తకొడుకుతో పెళ్లి నిశ్చయిస్తారు విషయం తెలుసుకున్న అరుణ తల్లిదండ్రులతో "బావుంది డాడీ తెలుగు సినిమలో క్లైమాక్స్ కు ముందు అమెరికా వరుడొస్తాడు అతడికి వ్యక్తిత్వం మన్ను, మశానం ఏమి ఉండవు. హీరో ఎలా తిరిగినా హిరోయిన్ని పెళ్లిచేసుకోవడానికి రెడీ అయిపోతాడు అఫ్ కోర్స్ ఆఖరికి హిరోయిన్ అతడిని పెళ్లిచేసుకోదనుకో... మీరు సైతం మిగతవాళ్లలా ప్రవర్తిస్తారని కలలో కూడా అనుకోలేదు డాడీ. వయస్సు పెరిగినకొద్దీ మీ మనసులు కుంచించికుపోతున్నాయేం? యువతంటే దారీదిక్కూ తెలీని పిచ్చివాళ్ల సముహంలా కనిపిస్తుందా మీకు. ఏదేదో జరిగిందని ఊహించుకుని బెంబేలుపడి మీ కూతురి వ్యక్తిత్వాన్ని అవమానించేంత స్థాయికి దిగజారిపోయారు..." అంటూ తన తల్లిదండ్రులను నిలదీస్తుంది ఆ మాటలు వారికి కనువిప్పును కలగచేస్తాయి.

అరుణ మాటలు పరిశీలిస్తే... అవి నేటి యువతరం అభిప్రాయలుగా చెప్పవచ్చు. తల్లిదండ్రులు, పిల్లలు ఒకరినొకరు అర్థంచేసుకోవాలని, తల్లిదండ్రులు పిల్లలతో స్నేహభావాన్ని ప్రదర్శించాలి కానీ అధికారదర్పం చూపించకూడదని రచయిత తెలియజేసారు. ఈ కథలో అరుణ తన వ్యక్తిత్వాన్ని కాపాడుకున్న యువతిగా కనిపిస్తుంది

## 3. 34. మొదటి అడుగు:

ఈ కథ భూమిక మాసపత్రికలో 2001 లో వెలువడింది. రచయిత్రి కొండవీటి సత్యవతి. మహిళారిజర్వేషన్ల ద్వారా వివిధ పదవులకు ఎన్నికైన స్త్రీల అస్తిత్వం ఎలా ఉంది? వారు తమ అధికారాలను ఎంత వరకు సద్వినియోగం చేసుకోగలుగుతున్నారు? తమ అధికారాన్ని, సద్వినియోగం చేసుకోవడంలో వారికి ఎదురవుతున్న అవరోధాలేమిటి?... మొదలైన విషయాలు ఈ కథలో వివరించడం జరిగింది.

**ఇతివృత్తం**

ఈ కథలో ప్రధానపాత్రలు గాయత్రి, ఆమె భర్త రాఘవరావు మరియు విమల. గాయత్రి పి.జి. వరకు చదివి, బంధుమిత్రుల బలవంతం మీద తన మేనమామ అయిన రాఘవరావును వివాహం చేసుకుంటుంది. పెళ్లికి ముందు గాయత్రి ఎంతో స్వేచ్ఛగా తన జీవితాన్ని కొనసాగిస్తుంది పెళ్లి తరువాత ఆమె జీవితం ఇంటికే పరిమితమవుతుంది. ఈ విషయంలో ఆమె చాలా అసంతృప్తికి గురవుతుంది. ఒక రోజు విమల అనే ప్రభుత్వాధికారి పని నిమిత్తం గాయత్రి వాళ్ల ఊరికి వెళ్ళడం, వారి మధ్య స్నేహం ఏర్పడడం జరుగుతుంది. ఓసారి గాయత్రి మాటల మధ్యలో తన జీవితంమీద తనకున్న అసంతృప్తిని ఆవేదనని విమల ముందు వెల్లబుచ్చుతుంది. గాయత్రి ఆవేదనను అర్థంచేసుకున్న విమల, తన మాటలతో గాయత్రిని చాలా ప్రోత్సాహిస్తుంది అనేక సూచనలు, సలహాలు ఇస్తుంది విమల చెప్పిన సూచనలు, సలహాలు పాటించి గాయత్రి, వ్యక్తిత్వం ఉన్న స్త్రీగా మారడంతో కథముగుస్తుంది

**కథావిశ్లేషణ**

ఈ కథలో మహిళారిజర్వేషన్ల అమలును, వాటిలోని లోపాలను ఎత్తిచూపడం జరిగింది. గాయత్రి, మహిళా రిజర్వేషన్ ద్వారా పూలపల్లికి సర్పంచ్ గా ఎన్నుకోబడుతుంది. పేరుకి గాయత్రి సర్పంచేకాని, సర్పంచ్ విధులన్నీఆమె భర్త అయిన రాఘవే నిర్వర్తిస్తుంటాడు అవసరమైన చోట్ల మాత్రం గాయత్రి సంతకాలు చేస్తుంది పెళ్లికి ముందు గాయత్రి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తిలా జీవిస్తుంది స్నేహితులతో కలసి అనేక చర్చాకార్యక్రమాల్లో పాల్గొంటూ, తనదైన అభిప్రాయాలను తెలియచేస్తుంది వివాహానంతరం భర్తకు నచ్చేటట్లు ఉంటేనే వారిమధ్య సజావుగా సంసారం సాగుతుంది. లేనిపక్షంలో భర్త ఆమె స్వతంత్రతను సహించలేకపోయేవాడు. ఇక వారిమధ్య గొడవలు లేకుండా ఉండడం కోసం గాయత్రి ఒక నిర్జీవిగా మారుతుంది.

ఒక సందర్భంలో తన మనసులో బాధనంతా విమలకు చెప్తూ "తాతయ్య కోరిక మేరకు నాకు మావయ్యతో పెళ్లి జరిపించారు. పైగా నీ చదువుకేమి అభ్యంతరం పెట్టమని మభ్యపెట్టారు. నా ఆశలు, నా ఆశయాలు అన్నీ మంటగలసి పోయాయి. విశాల ప్రపంచంలోకెగిరిపోదామనుకున్న నేను రెక్కలు విరిగిన పక్షిలాగా ఆ మండువా లోగిలికి అంకితమైపోయాను. లెక్కలేనంత ఆస్తిగాని వీళ్లు పెట్టిన బంగారం కాని నాకు సంతోషాన్ని కలిగించలేవు. మా ఆయనకు డబ్బు తప్ప ఇంకేమి పట్టదు. ఇప్పుడు చెప్పు విమల!

నాదీ ఒక జీవితమేనా! నాకు ఆ ఇల్లంటే ఎందుకంత అసహ్యమో అర్థమైందా!" అని అంటుంది.

పై మాటలను గమనించినట్లయితే గాయత్రి అస్తిత్వసంవేదన తేటతెల్లమవుతోంది. గాయత్రి తన అస్తిత్వాన్ని కోల్పోయానని ఎరిగి, ఆ స్థితి నుండి బయటకురాలేని ఒక నిస్సహాయస్థితిలో తన మనోదుఃఖాన్నంతటిని విమలకు చెప్తుంది ఈ మాటల్లో గాయత్రీ తన అస్తిత్వం కోసం ఎంతగా పరితపిస్తుందో అర్థమవుతుంది. తిరిగి గాయత్రి తన అస్తిత్వాన్ని ఎలా పొందాలో తెలియని ఒక స్థితి కనబడుతుంది.

గాయత్రి స్థితిని, సాత్రే చెప్పిన అస్తిత్వ పొరల్లో "ఇతరుల కోసం తాను" అనే పొరలో తనను తాను కోల్పోయినట్లు, అంటే... తన అస్తిత్వాన్ని కోల్పోయినట్టు తెలుస్తుంది ఇక్కడ ఇతరులకు అంటే భర్త, భర్తను సంతోష పెట్టే క్రమంలో గాయత్రీ తన అస్తిత్వాన్ని కోల్పోయినట్లు స్పష్టమవుతుంది.

గాయత్రి తన బాధనంతా విమలకు చెప్పుకున్న తరువాత, ఆ మాటలకు విమల "నీ విషయం కూడా నాకు ఆశ్చర్యంగా ఉంది. చదువుకున్నావు, మంచి నేపథ్యంలోంచి వచ్చావు. నా జీవితం నాశనమైపోయింది అంటున్నావే కాని నీ ఆశలు, ఆశయాలు సాధించుకోవడానికి మంచి ఛాన్సు దొరికిందని ఎందుకనుకోవడంలేదు. ఈ ఊరికి సంబంధించి నువ్వెంతైనా చెయ్యవచ్చు. స్త్రీ సమస్యల మీద పనిచేసిన దానివి కదా! ఈ పల్లెటూళ్లలో ఆడవాళ్లకేమి సమస్యలు లేవంటావా? నువ్వు చెయ్యదలుచుకుంటే యిక్కడ కూడా చెయ్యవచ్చు"[27] అంటుంది విమల. ఆ మాటలకు గాయత్రిలో నిద్రాణమైయున్న శక్తులు మేల్కొంటున్న భావన కలిగి విమలతో "ఎవరో నన్ను అడ్డుకుని ఏమి చేయనీయడంలేదని నన్ను మభ్యపెట్టుకున్నాను ఇంతకాలం. నా ఆత్మాభిమానాన్ని, ఆత్మవిశ్వాసాన్ని వదిలేసుకుని యింత బేలగా అయిపోయానేమిటి? అని అంటుంది. అంతేకాక అప్పటినుండి తనదైన సొంత వ్యక్తిత్వాన్ని ప్రదర్శించడం జరుగుతుంది. ఆ ఊరి సర్పంచ్ గా బాధ్యతలన్నీ నెరవేర్చడం, అనేక మంది స్త్రీలను చైతన్యవంతుల్ని చేయడం జరుగుతుంది.

ఈ కథ ప్రారంభంలో అస్తిత్వం కోల్పోయిన గాయత్రి చివరకు తన అస్తిత్వాన్ని కాపాడుకుని ఒక చైతన్యవంతురాలైన స్త్రీగా కనిపించడం ముదావహం. ఈ కథలో గాయత్రీ తన సామాజిక, రాజకీయ అస్తిత్వం కోసం పోరాడి, సంపాదించుకున్నట్లు తెలుస్తోంది

## 3. 35. రెక్కలున్న పిల్ల:

ఎస్. జయ రాసిన 'రెక్కలున్న పిల్ల' కథ ప్రతీకాత్మకంగా చెప్పబడిన కథ. దీనిలో స్వతంత్ర భావాలు, ఆర్థికస్వాతంత్ర్యం కలిగిన స్త్రీ తనకు ఎదురైన అవరోధాలను ఏ విధంగా అధిగమించి తన అస్తిత్వాన్ని నిలుపుకుందో వివరించడం జరిగింది.

ఈ కథలో 'ఆశ' ప్రధానపాత్ర. ఆశకు రెక్కలుంటాయి. రెక్కలనేవి ఆర్థికస్వాతంత్ర్యానికి, అభ్యుదయ భావాలకు ప్రతీకగా చెప్పబడింది. తల్లిదండ్రులు ఆమె రెక్కల్ని కత్తిరించే ప్రయత్నం చేస్తారు కాని, ఆశ తప్పించుకు తిరుగుతుంటుంది. అదే విధంగా తను ప్రేమించిన మురళీఇంటికి వెళ్లినప్పుడు మురళీవాళ్ల అమ్మ, ఆశ అందచందాలను చూసి సంతోషపడినప్పటికీ ఆమెకు రెక్కలున్నాయన్న విషయం గ్రహించి, భయపడి వివాహానికి అంగీకరించదు. కాని మురళీ ఆమెను వివాహం చేసుకుంటాడు. వివాహానంతరం మురళీ కూడా కొన్ని విషయాలలో ఆశకు అభ్యంతరకరంగా ఉండడంతో ఆ విషయాన్ని ఆశ చాలా సున్నితంగా అతనికి తెలియజేస్తుంది ఆశకు అడుగడుగునా, ఎదురైన అస్తిత్వ సమస్యల్ని ధైర్యంగా ఎదుర్కొని తన అస్తిత్వాన్ని కాపాడుకోవడం ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం

**కథావిశ్లేషణ:**

రెక్కలున్న పిల్ల కథను మనం విశ్లేషించినప్పుడు కొన్ని చీకటికోణాలు స్పష్టంగా కనిపిస్తాయి మురళీ స్నేహితుడయిన రవిశంకర్ మురళీతో ఆశను పెళ్లిచేసుకోవద్దని హితోపదేశం చేస్తూ, "ఆశకు రెక్కలున్నాయి. ఎప్పుడైనా నీ చేతుల్లోంచి ఎగిరిపోవచ్చు!" అంటాడు.

ఈ మాటల్నిబట్టి- స్త్రీ ఆర్థిక స్వాతంత్రం కలిగి ఉంటే పురుషుడి చెప్పుచేతల్లో ఉండదనే భావన పురుషుల మనసుల్లో నాటుకు పోవడంవల్ల ఆర్థిక స్వతంత్రం కలిగిన స్త్రీ అంటే ఒక భయం ముందుగానే ఏర్పడిపోయింది. స్త్రీ ఆర్థిక స్వతంత్రం కలిగి ఉండడం అనే విషయాన్ని పితృస్వామ్యసమాజం ప్రతికూలంగానే ఆలోచిస్తుంది తప్ప సానుకూలంగా ఆలోచించలేకపోతుంది.

ఒక సందర్భంలో ఆశ తల్లిదండ్రులు ఆమె రెక్కల్ని కత్తిరించడానికి ప్రయత్నించడంతో భద్రతలేని ఆ ఇంట్లో ఉండలేక శ్యామలటీచర్ ఇంటికి వెళ్లిపోతుంది. ఆశ చేసిన ఈ సాహసం వల్ల తల్లిదండ్రులు తమ తప్పును గ్రహిస్తారు అంతేకాక వారి ఆలోచనా ధోరణిలో కూడా మార్పువస్తుంది ఇది గమనించదగ్గ విషయం.

ఈ కథలో ఆశ, విద్యార్థి దశలో ఉన్నప్పుడు తల్లి ఒకసారి ఆమెను కొట్టే ప్రయత్నం చేస్తుంది అప్పుడు ఆశ తల్లితో 'ఒకటి గుర్తుంచుకో అమ్మా. నేనేం చిన్నపిల్లను కాను. మంచి చెడ్డ నిర్ణయించుకోగలను. ఇంకెప్పుడు నామీదికి చేయి ఎత్తొద్దు' అంటుంది. ఈ నాటి యువతరానికి ప్రతీక అయిన ఆశ, తన మనోభావాలను తల్లికి చాలా స్పష్టంగా తెలియజేస్తుంది

అదే విధంగా వివాహనంతర జీవితాన్ని చిత్రించిన తీరులో కూడా ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది సాధారణంగా ప్రతి ఆడపిల్ల పుట్టింట్లో కొద్దోగొప్పో తమ ఇష్టాలకు అనుగుణంగా స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించినా, వివాహనంతరం వాటన్నిటికి ఫుల్ స్టాప్ పెట్టక తప్పదు. దాంపత్య జీవితంలో స్త్రీ సర్దుకుపోవాలనే అభిప్రాయం సమాజంలో ఉండటం వల్ల దాదాపు ప్రతి గృహిణి తన జీవితాంతం సర్దుకుపోతూ జీవిస్తుంది అయితే ఈ కథలో ఆశ, వివాహానంతరం తన ఇష్టాలకు అనుగుణంగా భర్త లేకపోవడంతో, అతనితో సర్దుకుపోవడానికి కాని, తన ఇష్టాలను చంపేసుకోవడానికి గాని ఇష్టపడదు. అందుకే తన అభిప్రాయాలను చాలా స్పష్టంగా భర్తకు చెబుతుంది.

ఒక సందర్భంలో ఆశ తన భర్తతో "ఇంత ఇరుకుగా జీవించవద్దు. మనం అన్నింటిలో పూర్తిగా కలిసిపోవడం, ఎప్పుడు ఎవరో ఒకరికి నష్టం కలుగుతుంది" అని అంటుంది. ఒకసారి ఆశ, మురళికి చెప్పకుండా పార్టీకి వెళ్లినప్పుడు మురళీ ఆమెను ప్రశ్నించిన సందర్భంలో ఆశ "ప్రతీదీ ఎందుకు చెప్పాలి?... నాకిష్టంలేదు. కొన్ని పనులు నేను చేసుకుంటేనే నాకు హాయిగా ఉంటుంది"[28] అని తన మనోభావాల్ని చాలా స్పష్టంగా చెప్తుంది ఆశ స్వతంత్రవ్యక్తిత్వాన్ని చూసి మురళీ మొదట నొచ్చుకున్నా తరువాత ఆమె అభిప్రాయాన్ని గౌరవిస్తాడు

'రెక్కలున్న పిల్ల' కథలోని వస్తువు చాలా నూతనమైనది. ఎందుకంటే వివాహనికి ముందు స్త్రీ తన అస్తిత్వాన్ని నిలుపుకోవడానికి ప్రయత్నించడం ఒక ఎత్తయితే వివాహానంతరం కూడా తన అస్తిత్వాన్ని కాపాడుకొని, నిలబడటం మరోఎత్తు.

## 3. 36. వల

ఈ కథ సూర్య దినపత్రిక, ఆదివారం అనుబంధంలో 2009న వెలువడింది. రచయిత డా. మంతెన

సూర్యనారాయణ రాజు. ఒక స్త్రీ తన శీలం గురించి వచ్చిన తప్పుడు వదంతులను ఖండిస్తూ చేసిన పోరాటమే దీనిలోని ఇతివృత్తం

దీనిలో ప్రధానపాత్ర నారాయణమ్మ. ఈమె తాయారు ఇంట్లో పనిమనిషిగా ఉంటుంది. ఒకరోజు ఇంట్లో ఎవ్వరూ లేకపోవడం గమనించి, తాయారు కొడుకు తన కోరిక తీర్చమని అడుగుతాడు. అంతేగాక కావలసినంత డబ్బు ఇస్తానని కూడా ఆశ చూపెడతాడు. దానికి నారాయణమ్మ తన స్థితిని గుర్తెరిగి 'యిలాంటి నీచమైన పనులకు ఒడిగట్టనని, నీకంత ప్రేముంటే నన్నుపెళ్లిచేసుకో, అప్పుడు ఇద్దరం కలిసి బ్రతుకుదాం! అంతేగానీ పెళ్లికి ముందు అలాంటి పనులకు తలొగ్గను' అని ఖండితంగా చెప్తుంది ఎంత చెప్పినా అతను వినిపించుకోడు సరికదా, డబ్బుల కట్ట తెచ్చి ఆమెకు ఇస్తాడు అతను ఎంత చెప్పినా ఆమె డబ్బు తీసుకోకపోయేసరికి 'నేను ఇచ్చింది తీసుకో, తిరిగిస్తే మా అమ్మ మీదొట్టు' అంటాడు. ఆ మాటలకు ఆమెకు ఏమి చెయ్యాలో అర్థంకాక ఆ డబ్బులన్నీ బొడ్లో పెట్టుకుంటుంది. ఈలోపు తాయారు వస్తుంది అక్కడున్న పరిస్థితిని అర్థంచేసుకోగలుగుతుంది. అంతేగాక నారాయణమ్మకు దొంగతనం అంటగడుతుంది. అనరాని మాటలంటుంది. ఆ పరిస్థితుల్లో తాయారు కొడుకు అక్కడ నుండి తెలివిగా తప్పించుకుంటాడు.

మరుసటిరోజు నారాయణమ్మ తరఫు పెద్దవాళ్ళంతా ఆ ఇంటిని చుట్టుముడతారు. నారాయణమ్మ శీలాన్ని శంకించి ఆమెను అవమానించినందుకు క్షమాపణలు చెప్పాలని పట్టుబడతారు. దాంతో తాయారు అహం దెబ్బతిని, క్షమాపణ చెప్పడానికి నిరాకరిస్తుంది దాంతో నారాయణమ్మ తరఫు పెద్దలు మరింత అలజడి సృష్టిస్తారు ఇక చేసేదిలేక తాయారు తరఫున ఆమె భర్త వరహాలరావు క్షమాపణలు చెప్పడంతో కథముగుస్తుంది

**కథావిశ్లేషణ:**

ఈ కథలో ఒక స్త్రీ శీలాన్ని శంకించినప్పుడు ఆమె పడే మానసికవేదన వివరించబడింది. నారాయణమ్మ తాయారు ఇంటిలో పనిచేయటానికి వచ్చినప్పటి నుండి తాయారు కొడుకు ఆమెను మోహిస్తాడు ఆమెను ఎప్పుడెప్పుడు లొంగదీసుకోవాలని అదును కోసం కనిపెడతాడు. ఒక సందర్భంలో అతను నారాయణమ్మతో "నేను సెప్పినట్టు నువ్వినావనుకో... నీకు మనూళ్లో సిన్మాలన్నీ చూడ్డానికి బోలెడు డబ్బులిస్తాను నాకోరిక తీరిస్తే చెవులకు కమ్మలు చేయిస్తాను అరకాసెట్టి ఉంగరం కూడ చేయించేస్తా. ఒక్క మాటలో చెప్పాలంటే ఇంకా... ఇంకా... బోల్డు చేయిస్తా" అంటాడు. ఆ మాటల్లోని గూఢార్థాన్ని గ్రహించిన నారాయణమ్మ అతనితో "మీ యవ్వారం సూత్తూంటే నాకేటో భయం భయంగా

ఉంది బాబో! ఆనక మోజు తీరిసేసుకొని కరీపాకునాగ నన్ను ఇసిరి పారేత్తేనూ! నన్నొగ్గేత్తేనూ!" అంటూ చెప్తుంది.

ఈ మాటల్లో నారాయణమ్మ భవిష్యత్ దృష్టి కనబడుతుంది. యవ్వనంలో ఉన్న కోర్కెలను అనుసరించి జీవిస్తే తరువాత వచ్చే దుష్పరిణామాలకు బాధ్యతవహించక తప్పదు అనే హెచ్చరిక కనిపిస్తుంది నారాయణమ్మ నిరక్ష్యరాస్యురాలైనప్పటికి ఆమె మాటల ద్వారా జీవితం యెడల ఉన్న అవగాహన అర్థమవుతుంది.

నారాయణమ్మకు రంగబాబు నోట్లకట్ట ఇచ్చిన తరువాత తాయారు అక్కడకు వచ్చి పరిస్థితినంతా గమనించి నారాయణమ్మను అనరాని మాటలంటుంది. ఇక ఆ మాటలను భరించలేని నారాయణమ్మ కంటనీరు పెట్టుకొని తాయారుతో "అమ్మా! నాను కూటికి పేదదాన్ని కావొచ్చు. గుణం తక్కువదాన్ని, పరువు తక్కువదాన్ని మాత్తరం కాదు. నీ కొడుకు రంగంబాబే ఈ నోట్లు సేతిలో పెట్టి, తన కోరిక తీర్చమంటూ ఎంట బడ్డాడు. నాకు వల్లకుంటే మీమీన ఒట్టేసినారు. అందుకు తీసుకున్నాను" అని జరిగింది జరిగినట్టు చెప్తుంది.

ఈ మాటల్లో నారాయణమ్మ తన నిర్దోషత్వాన్ని నిరూపించుకునేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది ఎందుకంటే స్త్రీకి అన్నింటికంటే 'శీలం' ప్రధానమైనదని పితృస్వామ్య సమాజం బోధిస్తూ వస్తుంది శీలవతి కాని స్త్రీకి సమాజంలో గౌరవంలేదు. అందుకే ఈ కథలో నారాయణమ్మ తను పవిత్రురాలినని నిరూపించుకునే ప్రయత్నం చేస్తుంది ఈ పితృస్వామ్య సమాజంలో స్త్రీ యొక్క అస్తిత్వాన్ని నిర్ణయించే అంశాల్లో శీలం లేదా గుణం చాలా ప్రధానమైనది. సమాజం ఎవరి శీలం అయితే పవిత్రమైనది కాదు అనే అభిప్రాయాన్ని వెలిబుచ్చుతుందో ఇక ఆ స్త్రీ తన సామాజిక అస్తిత్వాన్ని కోల్పోతుందని చెప్పవచ్చు. అంటే సమాజంలో ఎవరు ఆమెను సాటిమనిషిగా గుర్తించరు ఎక్కడికెళ్లినా అవమానాలు, సూటిపోటు మాటలు తప్పవు. అందుకే ఈ కథలో నారయణమ్మ తాను సౌశీల్యవతినని నిరూపించుకోవడానికి ప్రయత్నించి విజయంసాధిస్తుంది ఇది ఆమెలోని చైతన్యానికి చిహ్నంగా చెప్పవచ్చు.

## 3. 37. విముక్తి:

ఓల్గా రాసిన విముక్తి కథ 29 అక్టోబర్, 2000 ఆదివారం ఆంధ్రజ్యోతి అనుబంధంలో వెలువడింది. ఈ కథలో పదేళ్ల పసికందు శీలం కామంధుల చేతుల్లో ఏ విధంగా చిత్రమైపోయిందో వివరించబడినది. స్త్రీ శీలం ఆమె అస్తిత్వాన్ని ఎలా ప్రశ్నార్థకంగా మార్చుతుందో వివరించడం జరిగింది.

**ఇతి వృత్తం**

ఈ కథలో ఇందిర, వెంకటలక్ష్మి, వెంకటలక్ష్మి చిన్నాన ప్రధానపాత్రలు. ఇందిర ఒక ప్రభుత్వాసుపత్రిలో వైద్యురాలు. వైద్యురాలు అనడం కంటే సేవాతత్పరురాలు అనడం సమంజసం. ప్రభుత్వాసుపత్రి కావడం వలన వైద్యాన్ని డబ్బుపెట్టి కొనలేని బీదాబిక్కి జనంతో ఆ ఆసుపత్రి ఎప్పుడు రద్దీగా ఉంటుంది. ఆసుపత్రి చుట్టుపక్కల కుగ్రామాలు, బాలికల వసతి గృహం ఉండడం వల్ల అత్యాచారానికి గురైన కేసులు ఎక్కువగా ఉండేవి. అత్యాచారానికి గురైన పదీ పన్నెండేళ్ల పిల్లలను వాళ్ల వాళ్ల బంధువులో లేక హాస్టల్ వార్డెనో తీసుకుని వచ్చి ఆసుపత్రిలో చేర్పిస్తు ండేవారు కొంచెం బాధ్యత కలిగిన వారైతే ఆ బాధితురాలితో పాటు ఆసుపత్రిలో ఉండి, వాళ్లకు పూర్తిగా తగ్గిన తరువాత ఇంటికి తీసుకెళ్లేవారు. హాస్టల్ పిల్లలకు అయితే హాస్టల్ వార్డెన్లు వచ్చి, ఆసుపత్రిలో చేర్పించి, వారి తల్లిదండ్రులకు కబురు పంపేవారు. ఆ తల్లిదండ్రుల ఆర్థికపరిస్థితులు అంతంత మాత్రం గనుక, ఈ ఘోరానికి పాల్పడిన వారిని నిలదీసి అడగలేక- అది తమకర్మఫలం అనుకుని వెళ్లిపోయేవారు. ఇలాంటి సంఘటనలతో ఆ ఆసుపత్రి నిత్యం రద్దీగా ఉండేది. అలాంటి బాధితుల యెడల ఇందిర చాలా దయ కలిగి, ఓర్పుతో వాళ్లకు వైద్యం చేసేది.

ఒకరోజు ఇందిర యథావిధిగా ఆసుపత్రికి వచ్చే సరికి వార్డులో పదేళ్ల అమ్మాయి పడుకుని మూల్గుతూ ఉంటుంది. నర్సుని పిలిచి విషయం అడుగుతుంది ఇందిర. దానికి ఆ నర్సు 'అత్యాచారానికి గురైన కేసు' అని సమాధానమిస్తు ంది ఇంకా పసిచాయలు తొలిగిపోని ఆ అమ్మాయిని, ఆ దీనస్థితిలో చూసే సరికి ఇందిరకు కడుపులో దేవినట్లవుతుంది.

ఇందిర, ఆ అమ్మాయి దగ్గరకు వెళ్లి ఆ గాయాన్ని తుడిచి, కుట్లు వేస్తు ంది ఆ అమ్మాయి ఆ బాధనుండి తేరుకున్నట్లు కనిపించాక, దగ్గరకు వెళ్లి 'పేరేమిటని' ప్రశ్నిస్తు ంది దానికి సమాధానంగా ఆ అమ్మాయి 'వెంకటలక్ష్మి'అని చెప్తు ంది అక్కడున్న నర్సుని చూచి, 'ఈ అమ్మాయి తరపున ఎవరు

వచ్చారు' అని ఇందిర ప్రశ్నిస్తుంది దానికి ఆ నర్సు 'వార్డెన్ వచ్చి వెళ్ళాడని, మళ్ళీ సాయంత్రం వస్తానని' చెప్పాడని చెప్తుంది ఇందిర మిగిలిన రోగులను చూడడానికి వెళ్లి, పనంతా ముగించుకుని వచ్చేసరికి... లక్ష్మి ఏడుస్తూ కనిపిస్తుంది అది చూసిన ఇందిర చలించిపోయి, ఆమె దగ్గరకు వెళ్లి 'నీకెనేళ్లు' అని లక్ష్మిని ప్రశ్నిస్తుంది 'ఏడేళ్లు' అని లక్ష్మి సమాధానమిస్తుంది 'తగ్గిపోతుంది మరేం భయంలేదు' అని ఆ పాపకు ధైర్యం చెప్తుంది ఆ మాట విని, లక్ష్మి "నాకు భయం లేదు. అలవాటే కానీ ఏడుపొస్తే ఆపుకోలేను" అని చెప్పి ఏడవడం ప్రారంభిస్తుంది ఆ మాట వినేసరికి ఇందిరకు జీవనాడులు ఆగిపోయినంత పనౌతుంది. కొంత సేపటికి తేరుకొని ఇంతకు ముందు ఎవరన్నా ఇట్లా చేశారా? అని ప్రశ్నిస్తుంది దానికి లక్ష్మి "మా చిన్నయ్య, యింకా..." అంటూ చెప్పుకొచ్చింది. అది విన్న ఇందిర ఇంకేమి మాట్లాడలేకపోయింది.

వారం తరువాత లక్ష్మిగాయం మానుతుంది. కొంచెం తేరుకుని, ఇక తిరిగి హాస్టల్ కు వెళ్లడానికి సిద్ధమౌతుంది. ఇందిర, లక్ష్మిని చూచి, 'మా ఇంటి దగ్గర వారం రోజులు ఉండి వెళ్లు' అని అడుగుతుంది. లక్ష్మి మౌనం వహిస్తుంది అది విన్న నర్సు 'మీకెందుకు వచ్చిన తలనొప్పి' అన్నట్లు ఇందిర వైపు చూస్తుంది అందుకు ఇందిర 'ఫరవాలేదు. పాపం! చిన్నపిల్ల బలహీనంగా ఉంది. ఆ హాస్టల్లో తినడానికేముంటుంది. కొంతకాలం మా ఇంట్లో ఉండి వెళ్తుంది వార్డెన్ కు కబురు పంపుదాం' అని అంటుంది. ఆ సాయంత్రం ఇందిర, లక్ష్మిని ఇంటికి తీసుకెళ్లి, కొత్త బట్టలు ఇచ్చి, తలదువ్వి, ఎంతో జాగ్రత్తగా చూసుకుంటుంది. వారం రోజులు గడిచేసరికి లక్ష్మి ముఖంలో అందం, ఆనందం వెల్లివిరుస్తాయి.

ఒక నెల రోజులకు లక్ష్మి చిన్నన్న వచ్చి, ఆమెను పంపమని ఇందిరను అడుగుతాడు. లక్ష్మిని చూడగానే అతనిలో కలిగిన భావనను ఇందిర చూసి, ఛీత్కరించుకుంటుంది. లక్ష్మికి మళ్లీ ఎదురుకాబోయే పరిస్థితిని ఊహిస్తుంది ఇందిర అతనితో 'లక్ష్మిని నేను పెంచుకుటాను బాగా చదివిస్తాను' అని అంటుంది. దానికి అతను 'మా పిల్లను నేను తీసుకుపోతాను, మధ్యలో నువ్వెవరవు?...' అంటూ మొరటుగా మాట్లాడతాడు. ఇందిర ఇక చేసేది లేక, లక్ష్మిని అతనితో పంపుతుంది.

ఒక రోజు నర్స్ డాక్టర్ని చూసి, 'వెంకటలక్ష్మిని చూశారా... వాళ్ళు మనుష్యులు కాదు పశువులు' ....అంటూ గబగబ మాట్లాడసాగింది. ఆ మాటలకు ఇందిర 'లక్ష్మీ ఎక్కడుంది' అని నర్స్ ని అడుగుతుంది. నర్స్ 'సుశీలా మేడం హ్యాండిల్ చేస్తున్నారు అబార్షన్. రక్తం తెగపోతుంది. వాళ్ల చిన్నాయనంట...' అంటూ సమాధానమిస్తుంది ఇందిర, సుశీల డాక్టర్ దగ్గరకు వెళ్లి 'ఏదైనా సహాయం చెయ్యనా' అని

అడుగుతుంది. దానికి సమాధానంగా సుశీల 'ఏముంది ఎవరు చెయ్యడానికైనా? పిల్ల చూడు, ఈ అవతారం చూడు. నాల్గు నెలలు నిండాయి. నాటు వైద్యం చేశారు. చాలా కష్టం. లోపలంతా ఇన్ఫెక్షన్ అయింది. ఇప్పుడెవరు యేం చెయ్యలేం' అంటుంది. వెంకటలక్ష్మిని చిన్నాయన నుండి, వార్డన్ల నుండి, దొడ్డికి పోయే చోటా, పనులు చేసే చోట, కాపుకాసే పెద్ద పులుల పంజా నుండి విముక్తి లభించబోతుందని గ్రహించిన ఇందిర దుఃఖాన్ని గొంతులో నుండి బయటకు రానివ్వకుండా జాగ్రత్తపడి ఆ గది నుండి బయటపడడంతో కథ ముగుస్తుంది

ఈ కథ ద్వారా చిన్నపిల్లల బాల్యం, శీలం కామందుల చేతిలో ఏవిధంగా ఛిద్రమై, వారి అస్తిత్వం ఏవిధంగా ప్రశ్నార్థకంగా మారుతుందో వివరించబడింది.

## 3. 38. శిల కోల:

ఈ కథ 24 మే 2009న ఆంధ్రజ్యోతి, ఆదివారం అనుబంధంలో ప్రచురించబడింది. రచయిత మల్లిపురం జగదీశ్. ఈ కథలో ఒక గిరిజన స్త్రీ ఒక ఉన్నత కులస్థుడి చేతిలో ఎలా మోసపోయింది? ఆ తరువాత ఆమె ఎలాంటి నిర్ణయం తీసుకున్నదీ ఈ కథలో ప్రధాన వస్తువు

**ఇతివృత్తం**

ఇందులో ప్రధానపాత్ర చామంతి. ఈమె గిరిజన తెగకు చెందిన అమ్మాయి. ప్రభుత్వ హాస్టల్లో ఉండి చదువుకుంటూ ఉంటుంది. ఒకసారి వేసవి సెలవులకు ఇంటికి వెళ్తుంది అదే సమయంలో ఆ ఊరికి హాస్టల్ బిల్డింగ్ మంజూరు కావడం, ఆ పని నిమిత్తం జగన్నాథం అనే కాంట్రాక్టర్ ఆ ఊరికి రావడం జరుగుతుంది. ఆ క్రమంలో చామంతి తండ్రికి జగన్నాథానికి సన్నిహిత సంబంధం ఏర్పడుతుంది. జగన్నాథం రోజూ చామంతి వాళ్ళ ఇంటికి వస్తూ పోతూ ఉండేవాడు.

ఒక రోజు చామంతి ఇంటికి ఉత్తరం వస్తుంది అది చింపి చూస్తే దానిలో ఇంగ్లీషులో ఏదో రాసి ఉంటుంది. చామంతికి అది అర్థంకాక, మరుసటి రోజు జగన్నాథం రాగానే అతనికి చూపిస్తుంది దానిలో ఉన్నది చదివి, నీకు మనూర్లో టీచరమ్మగా ఉద్యోగం వచ్చిందని చెప్తాడు అంతేకాక దానికి సంబంధించిన లాంచనాలన్ని అతనే దగ్గరుండి చేయించి, ఆమెను ఉద్యోగంలో చేర్పిస్తాడు తద్వారా చామంతికి

జగన్నాథానికి స్నేహం ఏర్పడి, అది వారిమధ్య శారీరక సంబంధానికి దారితీస్తుంది ఇద్దరిది ఒకే కులం కాకపోయిన పెళ్లి చేసుకుంటారు. పెళ్లయిన కొంత కాలానికి జగన్నాథానికి ఇంతకుముందే పెళ్లయ్యిందని చామంతికి తెలుస్తుంది అప్పటికే చామంతికి పాప పుట్టి ఏడాది నిండుతుంది. ఇక చేసేదిలేక మౌనంగా అతణ్ణి భరిస్తుంది

రోజులు గడుస్తున్న కొద్దీ అతని నిజస్వరూపం బయటపడుతూ వస్తుంది అతను డబ్బు కోసం చామంతిని అనేక రకాలుగా హింసించేవాడు. అంతేకాక ఆ సంవత్సరం జరగబోయే ఎన్నికల్లో చామంతిని ఎమ్.ఎల్.ఏ.గా పోటిచేయమని బలవంతంచేస్తాడు దానికోసం తన కూతురి యవ్వనాన్నికూడా ఫణంగా పెట్టడానికి సిద్ధమైనట్లు తన మాటల్లో వ్యక్తం చేస్తాడు ఆ మాటలకు చామంతికి పట్టరాని కోపంవచ్చి, అతను కూర్చున్న కుర్చీతో సహా బయటకు విసిరేస్తుంది ఇక అతనితో కలసి జీవించడం అసంభవం అని భావించి, ఆ ఇంటి నుండి బయటకు వెళ్లిపోతుంది.

**కథావిశ్లేషణ:**

ఈ కథలో గిరిజనుల అమాయకత్వాన్ని, మంచితనాన్ని ఉన్నత కులస్తులు ఉపయోగించుకుని వారిని ఎలా మోసం చేస్తున్నారో చాలా స్పష్టంగా వివరించడం జరిగింది.

ఈ కథలో జగన్నాథం ఒక ఉన్నత కులానికి చెందినవాడు. అతని చాకచక్యంతో చామంతిని లొంగదీసుకుంటాడు. ఆమెను పెళ్లి చేసుకోవడానికి వెనుక ఉన్న కారణం కూడా అతని స్వార్థమే. అతను అనుకున్న కార్యాలన్ని నెరవేర్చుకోవడానికి చామంతిని, ఆమె కులాన్ని ఒక సాధనంగా వాడుకుంటాడు. అతని కుయుక్తిని అర్థంచేసుకోలేని చామంతిని ప్రతీసారి 'కొండజాతి దానివి ఇలాంటి విషయాలు నీకెలా తెలుస్తాయి..' అంటూ ఛీత్కరించేవాడు.

ఒక సందర్భంలో జగన్నాథం చామంతితో 'నీకో గుడ్ న్యూస్' అంటాడు. ఆమెకు అర్థంకాక, ఏమిటి అన్నట్టు అతని వైపు చూస్తుంది 'మనది ఎస్టీ నియోజక వర్గం తెలుసుకదా! ... పార్టీ వాళ్లంతా ఆ టికెట్ నీకివ్వడానికి నిర్ణయించారు ' అని చెప్పుకొస్తాడు దానికి సమాధానంగా ఆమె 'పార్టీ టికెట్ నాకు ఇస్తే... జనం నన్ను గెలిపిస్తారు గెలిస్తే పేరుకు మాత్రం నేను ఎమ్మెల్యేని. కాని, చక్రం తిప్పేదెవరు?...' అంటూ భర్తను నిలదీస్తుంది కాని ఆమె అతని మాటల్ని కాదనలేని నిస్సహాయురాలు. దానికి జవాబుగా భర్త 'ఓసీ జిడ్డు మొహమా! నీకేమి తెలియదు. ఒకటికి పదిసార్లు చెప్పాలి. ఎమ్మెల్యే సీటంటే ఆషామాషీ

కాదు. అది మనకు వస్తుందంటే వదులుకుంటామా?' అంటూ ఆమెను హేళన చేస్తాడు ఈ మాటలను గమనిస్తే చామంతి జీవితాన్ని కూడా అతనే జీవించేస్తున్నట్లు ఆమెకంటూ ఒక వ్యక్తిత్వాన్ని స్వతంత్రాన్ని లేకుండా చేస్తున్నట్లు తెలుస్తోంది

మరొక సందర్భంలో జగన్నాథం ఏవో కాగితాలు తెచ్చి దానిమీద సంతకం చేయమని చామంతిని అడుగుతాడు. దానికి చామంతి 'ఇష్టంలేదు, ఇంక మాటలనవసరం' అంటుంది. తన స్వగతంలో 'ఎప్పుడో చెప్పాల్సిన సమాధానం ఇన్నాళ్లకి కాస్త మొండిగా నిలబడ్డాను' అని అనుకుంటుంది. ఈలోపు అతను వచ్చి ఆమె జుట్టు పట్టుకుని కిందికి వంచి బలంగా ఆమె వీపు మీద కొడతాడు. ఆమె లేచి నిలబడే లోపు చెంప ఛెళ్లుమనిపిస్తాడు ఈ గొడవకి పాప లేస్తుంది "నాన్న" అని అరుస్తూ తండ్రిని అడ్డుకుంటుంది. ఆ మాటలకు జగన్నాథం కోపంతో ఊగిపోతూ 'ఎవడే నీకు నాన్న? నేననుకున్నావా? మీయమ్మ ఎందరితో తిరిగిందో... నువ్వు ఏ కొండోడికి పుట్టావ్... లం.... కూతుల్లారా..'అంటూ తిట్టి, ఆమె దగ్గరున్న డబ్బు లాక్కుని వెళ్లిపోతాడు. ఆ మాటలు చామంతికి కొత్తేమీకాకపోయిన పాప ముందు ఇలాంటి సంఘటనలు జరిగితే అవి పాపమీద ఎలాంటి ప్రభావం చూపుతాయో అని బయపడుతుంది.

ఈ సందర్భాన్ని మనం గమనిస్తే ఒక స్త్రీని అవమానించడానికి 'మీయమ్మ ఎందరితో తిరిగిందో' అనే మాట పురుషుడికి బ్రహ్మాస్త్రంలా ఉపయోగపడుతుంది. అందుకే ఆ ఒక్క మాటతో స్త్రీ యొక్క మానసిక, శారీరక బలాన్ని కుంగదీయడం పురుష ప్రవృత్తిగా కనిపిస్తుంది

కథ చివరిలో జగన్నాథం చామంతితో 'చామంతీ నిన్న విజయనగరం వెళ్ళేను... అంటూ మొదలుపెట్టి, జిల్లా ఇన్ ఛార్జిని కలిసాను. అన్ని వివరంగా మాట్లాడేము. టిక్కెట్టు మనకే వస్తుంది ఆయన రేపు మన ఊరు వస్తున్నారు గెస్ట్ హౌస్ లో వుంటారు...'పాపనోసారి ఇంటికి పిలిపించు...' అంటాడు. ఆ మాటలకు చామంతికి మతిపోతుంది. వింటి బద్దను బలంగా లాగి శిలకోలను గుండెల్లోకి గురిచూసి వదిలినట్టు అవుతుంది. అంతేకాక పట్టరాని కోపంవచ్చి, శక్తినంతటిని కాళ్లలోకి తెచ్చుకుంటుంది. ఆ తరువాత ఏమి జరుగుతుందో ఆమెకే తెలియదు. తరువాత చూస్తే కూర్చున్న కుర్చీతో సహా, ద్వారం అవతల పడివుంటాడు. తలపులు మూసేసుకుంటుంది. కొంతసేపటికి ఒక నిర్ణయానికి వచ్చి బయటకు వెళ్లిపోతుంది.

ఈ సందర్భాన్ని గమనిస్తే స్త్రీని అనవసరంగా అవమానించి, హింసిస్తే ఆమె కూడా ఎదురుతిరుగుతుంది అనడానికి చామంతి చక్కని ఉదాహరణ. చామంతి కూడా అదే విధంగా

తయారవుతుంది. అంతవరకూ ఆ నరకాన్ని మౌనంగానే భరిస్తూ వచ్చిన చామంతి, తన కూతురి విషయంలో జగన్నాథం అంత దిగజారి మాట్లాడిన మాటలను ఆమె సహించలేకపోతుంది. జగన్నాథం మాటలకు చలించిపోయిన చామంతి, తగిన శాస్తిచేసి ఆ ఇంటి నుండి బయటకి వెళ్లిపోతుంది.

## 3. 39. సంకట విమోచన:

ఈ కథ 6 & 13 ఏప్రిల్ 2003 న ఆంధ్రప్రభలో వెలువడింది. రచయిత కేతు విశ్వనాథరెడ్డి. ఈ కథలో ఒక మైనారిటీ స్త్రీ అనుభవించిన అస్తిత్వ ఘర్షణ ప్రధానాంశం.

**ఇతివృత్తం**

సంకట విమోచన కథలో చౌడేశ్వరి, చెన్నారెడ్డి ప్రధానపాత్రలు. చెన్నారెడ్డి ఉన్నత కులానికి చెందిన సంపన్నుడు. చౌడేశ్వరి చేనేత వృత్తికి చెందిన అమ్మాయి. ఇద్దరు దాదాపు ఒకే వయసు వాళ్లే. చెన్నారెడ్డి కుటుంబస్తులు చౌడేశ్వరివాళ్ల ఆర్థికపరిస్థితులు చూచి, దయదలచి వారి ఇంటి వెనుక ఉన్న చిన్న ఇల్లు అద్దెకు ఇస్తారు ఆ ఇంట్లోనే ఉంటూ తండ్రి చేసే పనుల్లో చేదోడువాదోడుగా ఉంటూనే చదువు కూడా కొనసాగిస్తుంది చౌడేశ్వరి. కష్టపడి చదివి పదో తరగతిలో పాఠశాలలో మొదటి స్థానం సంపాదిస్తుంది చెన్నారెడ్డి మొదటి తరగతిలో పాసవుతాడు. ఇద్దరూ పైచదువులు చదివి, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీలో ఉపన్యాసకులుగా చేరతారు. చౌడేశ్వరి తనకున్న రిజర్వేషన్ వల్ల చెన్నారెడ్డి కంటే ముందే రీడరవుతుంది. ఆమెను చూసినప్పుడల్లా చెన్నారెడ్డికి ఏదో తెలియని అసూయ భావన కలిగేది. క్రమక్రమంగా ఆమెతో మాట్లాడడం మానేస్తాడు.

ఒక సందర్భంలో చౌడేశ్వరిని అసోసియేషన్ ఎన్నికల్లో పానెల్ అభ్యర్థిగా ఉండమని అడిగితే, దానికి ఆమె 'నేను బి.సిల్లో ఒక కులానికి చెందిన దాన్నే, కాదనను. దానికి నేను కారణం కాదు. ఈ కారణంగా మీ కుల కోటా రాజకీయాల ఎన్నికల్లో తల దూర్చలేను' అని అంటుంది. చౌడేశ్వరి యొక్క స్వతంత్ర వ్యక్తిత్వాన్ని, ఆర్థికంగా స్థిరపడడం.... ఇవన్నీ చెన్నారెడ్డి సహించలేకపోతాడు. అతని ప్రవర్తన ఆమెను ఎంతగానో మానసిక వేదనకు గురిచేస్తుంది ఇక చేసేదిలేక ఒక సందర్భంలో చాలా ధైర్యంగా, ముక్కుసూటిగా అతనితో ఇలా అంటుంది.

"జీవితాన్ని సాధించేవాళ్లూ, జీవితంలో సాధించుకునే వాళ్లూ అని రెండు రకాల మనుష్యులున్నారు. నువ్వు మొదటి రకం మనిషివి అన్నా!.... చూడన్నా! మీ ఇంటి వెనుక మీరు బడుగ లేకుండా ఇచ్చిన ఇంట్లో చీరల పోగుల్ని చక్కదిద్దిన చౌడేశ్వరినే నేను. చీరలు నేసిన చౌడేశ్వరినే. మీ ప్రేమలు దొరికాయి. అంతో ఇంతో ఆదరణ దొరికింది. ఆస్తులూ, కులం దొరకలేదు కదా? నా అభద్రతే నామీద ఒత్తిడి దాన్ని పోగొట్టుకోవడమే నా ఘర్షణ. ఇది నేను సాధించుకున్న జీవితం. ఎవరో అప్పనంగా ఇచ్చినది కాదు"[29] అని తన మనసులో ఉన్నదంతా అతనికి చెపుతుంది. ఆ మాటలు అతని కళ్లకున్న అజ్ఞానపు పొరలు ఊడిపోయేటట్లు చేసి, అతణ్ణి ఒక మనసున్న మనిషిలా మార్చడంతో కథ ముగుస్తుంది

**కథావిశ్లేషణ:**

ఈ కథలో నేటి సమాజంలో సర్వసాధరణంగా కనిపించే రిజర్వేషన్ల అంశాన్ని ప్రధాన ఇతివృత్తంగా తీసుకోవడం జరిగింది. ప్రస్తుతకాలంలో అనేకమంది ఈ రిజర్వేషన్ల ద్వారా ఉన్నతస్థితికి చేరుతున్న వారిని చూసి ఈర్ష్య చెందుతున్నారే తప్ప వారి పూర్వపు స్థితిగతులు, వెనుకబడిన కులాల్లో పుట్టడంవల్ల వారు అనుభవించిన సంవేదనను అర్థంచేసుకోలేకపోతున్నారు.

సంకట విమోచనం కథలో ఇదే అంశాన్ని చాలా చక్కగా వివరించారు రచయిత. రిజర్వేషన్ల వల్ల వెనుకబడిన కులాల వాళ్లు పొందిన లాభాన్ని ఉన్నతకులాల వాళ్లు చీత్కారంగా మాట్లాడం వాళ్ల హృదయాన్ని చిత్రవధ చేస్తున్నాయి అనడాన్ని చౌడీశ్వరి మాటలే నిదర్శనం.

ఒక సందర్భంలో చౌడీశ్వరి, చెన్నారెడ్డితో 'మా నాయన సంగతి నీకు తెలుసు. తను నమ్మిన రాజకీయాలూ, చేనేత సంఘపు ఐక్యతా దెబ్బతిన్నాయి. కుంగిపోయినాడు. వెనుకడుగు వెయ్యలేదు. చీరలు నేసికొని, ఊరూరూ తిరిగి అమ్మి, నన్ను చదివించినాడు. వేణ్ణీళ్ళకు చన్నీళ్ళు తోడుగా ఏదో ఒక స్కాలర్ షిప్ వస్తూనే ఉండేది. అన్నా! నేను నీకంటే రీడరుగా ముందు అయినా, నామీద కోపానికి అదే కారణం అనుకోమంటావా? కులం వల్లా, ఆ కులానికుండే రిజర్వేషన్ వల్ల మాత్రమే ఆ రీడర్ అయ్యానని కోపమా? నా అర్హతలు నీకు తెలియదనుకోవాలా? పదో తరగతి స్కూలు ఫస్టు. ఇంటర్, బి.ఏ లో ఫస్టు క్లాసులు. ఎం.ఏ లో యూనివర్సిటీ సెకండ్, పి.హెచ్.డి గొప్పదని విదేశీ పరీక్షకుల సిఫారసు, పరిశోధన పత్రాలు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో వచ్చాయి. పోనీ నాకు ఏవో పెద్ద అర్హతలు లేవే అనుకుందాం! తప్పా....?' అంటూ అతణ్ణి నిలదీస్తుంది ఆ మాటలకు చెన్నారెడ్డి

మారుమాట్లాడలేకపోతాడు. అంతేకాక చౌడేశ్వరి తన మాటల ముగింపులో ఈ విధానానికి పరిష్కారం సూచించే ధోరణిలో 'రేపో మాపో అట్లాంటి కనీస అర్హతలున్న నా కులం కంటే కింద కులం మనిషి నాకంటే ముందుగా ఏ పై పదవో వచ్చిందనుకుందాం!. ఈర్ష్య పడడం ఎందుకు? చరిత్రలో జరిగిన, జరిగే తప్పులన్నీ పోయేవరకు ఇవి తప్పవు' అని అంటుంది.

చెన్నారెడ్డి, చౌడేశ్వరి ప్రగతి చూచి తన జీవితాన్ని తానే నిందించుకోవడం, మానసికంగా బలహీనుడవ్వడం గమనించిన చౌడేశ్వరి తన మాటల ద్వారా అతనిలో ఒక మానసిక పరివర్తన చైతన్యాన్ని తీసుకురాగలగడం గమనించదగ్గ అంశం. ఈ కథలో చౌడేశ్వరి తన అస్తిత్వాన్ని కాపాడుకుంటూనే, తనకి వచ్చిన సమస్యలను ఎంతో ధైర్యంగా ఎదుర్కొని విజయం సాధించిన స్త్రీగా మనకు కనిపిస్తు ంది.

## 3. 40. సర్పంచెవరు?

ఈ కథ ఫిబ్రవరి 11, 2007న ఆంధ్రజ్యోతి అనుబంధంలో వెలువడింది. రచయిత్రి జూపాక సుభద్ర. ఈ కథలో మహిళా రిజర్వేషన్ల గురించి వివరించబడింది.

**ఇతివృత్తం**

ఇందులో సంగీత, ఆమె స్నేహితురాలు రుద్రమణి ప్రధాన పాత్రలు. సంగీత పంచాయితీ రాజ్ లో 'దళిత మహిళలు' అనే అంశం మీద ప్రాజెక్ట్ చేస్తూ ఉంటుంది. ఒకసారి సంగీత, రుద్రమణి కలసి వరంగల్ లోని ఏటూర్ నాగరం దగ్గర 'బొబ్బలోని పల్లె' సర్పంచ్ ను ఇంటర్వ్యూ చేయడానికి వెళతారు. అక్కడ వాళ్లు ఎదుర్కొనే పరిస్థితులు, వాళ్లు చూసిన చేదు నిజాలే ఈ కథలో ప్రధాన ఇతివృత్తం.

**కథావిశ్లేషణ**

సర్పంచెవరు కథలో మహిళా రిజర్వేషన్ల అమలు, పనితీరును చక్కగా వివరించడం జరిగింది. సంగీత 'బొబ్బలోని పల్లె' సర్పంచ్ ను ఇంటర్వ్యూ చేయడానికి తన స్నేహితురాలైన రుద్రమణిని తీసుకొని బయలుదేరుతుంది. తనకు తోడుగా ఉంటుందని భావించి, సంగీత ఆమెను తీసుకెళుతుంది. రుద్రమణిది వరంగల్ జిల్లా కావడం వల్ల ఆ ఊరికి బొబ్బలోనిపల్లె అనే పేరు ఎందుకు వచ్చిందో రుద్రమ్మ వివరిస్తూ 'పాతకాలంలో ఈ ఊరంతా అడవులుండేవి. అడవిని పోడు వ్యవసాయంగా మార్చుకొని ఈ ఊరు ఏర్పడింది. ఒకప్పుడు ఈ ఊళ్లో అందరూ ఎస్సీ, ఎస్టీలే ఉండే వారంట. వీళ్లు ఇంటికో గుడుంబా గుందా

పెట్టేవారంట. ఆ ఊరిలో గొడ్ల కాసే ఒకాయన అబ్కారోలొస్తుండ్రంటే లేలేలేలే వోయి..... అని బొబ్బ పెట్టేవాడట! పోలీసులు వస్తుండ్రు జాగర్త సుమా అని ఆ అరుపుకు అర్థం. ఆ అరుపులు విని, ఊరిలో ఎక్కడోళ్లక్కడ అడవులకు పరారయ్యే వారట. అట్లా ఆ ఊరికి బొబ్బలోని పల్లె అని పేరొచ్చింది' అని చెప్తుంది.

ఈ కథలో 'బొబ్బలోనిపల్లె గ్రామం పేరు వెనుకున్న చారిత్రక నేపథ్యం వివరించడం జరిగింది. వారు ఆ గ్రామాన్ని సమీపిస్తున్న సందర్భంలో సంగీత ఒకామెను 'సర్పంచ్ ఇంటికి ఎటు పోవాలే' అని అడుగుతుంది. దానికామె 'సర్పంచ్ గీడేడుంటడు. హన్మకొండలుంటాడు' అంటుంది. ఆ మాటలు విన్న సంగీత, రుద్రమణి ఒక్క క్షణం ఆశ్చర్యపోతారు. అంతేకాక, వాళ్లలో వాళ్లు 'అదేంది. సర్పంచ్ ఊళ్ళుండకుంద ఎక్కడుండది. సర్పంచ్ ఆడామె కదా. మరి గీమేంది. దమాక్ లేకుండ ఉంటడు అంటదేంది? ఉంటది అనాలే కాని' అని అనుకుంటారు. అలా అడుగుతూ అడుగుతూ వెళుతుంటే ఆగమ్మ ఇల్లు దగ్గరలో ఉందని తెలుసుకొని కారు ఆపి, నడుచుకుంటూ వెళతారు. వాళ్లను చూసిన ఆ ఊరి వాళ్లంతా 'ఎవలు, ఈ కొత్తోళ్లు ఎవరింటికంట' అని మాట్లాడుకుంటారు. ఆ ప్రశ్నకు సమాధానంగా ఒకామె 'సర్పంచ్ ఇంటికి బోవాలంట. సర్పంచ్ ఇక్కడెందుకు దొర్కుతడు. ఆయన హన్మకొండలుంటడు గదా. గీడకచ్చేం చేస్తడు' అంటుంది. ఆ మాటలకు సంగీతకి మళ్లీ అనుమానం వస్తుంది జిల్లా లిస్టులో ఏమైనా తప్పు పడిందా? సర్పంచ్ మగాయనని వీరి మాటలు చెబుతున్నాయి. ఏమన్నా రాంగ్ రూట్లో వచ్చినామా అంటూ వాళ్లల్లో వాళ్లు తర్జనభర్జన చేసుకుంటారు. ఎందుకైనా మంచిదని సంగీత తన బంధువులతనికి ఫోన్ చేస్తుంది అతను ఆ ఊరి సర్పంచ్ ఆగమ్మేనని చెప్తాడు చివరికి ఎలాగో ఆగమ్మ ఇంటికి చేరుకుంటారు. అక్కడ కూడా వారికి చేదు అనుభవం ఎదురౌతుంది. సంగీత ఆ ఇంటి గుమ్మం దగ్గర నిలబడి, సర్పంచిగారిల్లిదేనమ్మా అని అడుగుతుంది. ఆ మాటలకు అక్కడున్న ఒకామె 'ఆ... సర్పంచ్ ఇల్లా...? గిదెందుకాయె. గిది కాదు అంటుంది. ఆ మాటలకు సంగీత 'అయ్యో కాదా! ఇదే అని చెప్పిండ్రు' అంటుంది. అందుకామె 'ఆయనిక్కడుండడు. ఎప్పుడన్నొక్కసారొస్తాడు ఆల్లమ్మింటది' అంటుంది. వారి మధ్య సంభాషణ ఈ కింది విధంగా కొనసాగుతుంది.

**సంగీత:** ఈ ఊరి సర్పంచ్ మగాయన కాదు... ఆడామె గదా?

**ఆగమ్మ కోడలు:** ఆ... నా మరిదే, సర్పంచి పనులన్ని జేత్తడు సుత్తడు

**సంగీత:** స ర్పంచ్ పేరు ఆగమ్మేనా ?

**ఆగమ్మ కోడలు :** ఆ... ఆమె మా అత్తే (భయంగా చూస్తూ...)

అప్పుడు సంగీతకు విషయం అర్థమౌతుంది. ఆ ఊళ్లోవాళ్లంతా తమను ప్రభుత్వాధికారులమనుకొని భయపడుతున్నారని గ్రహించి, అమ్మా! మేము అధికారులం కాదు ఎమ్మార్వో, కలెక్టర్ ఆఫీసు నుంచి రాలేదు. ఎస్సీ మహిళా సర్పంచులతోని మాట్లాడేదానికొచ్చినం"[30] అని అంటుంది. అంతేకాక ఆమెకు ఇంకా నమ్మకం కలగడం కోసం నిలబడిన ఆమెను మంచం మీద కూర్చోబెట్టి వాళ్లు కూడా కూర్చుంటారు. అంతేకాక మంచినీళ్లు అడిగి మరీ తాగుతారు. అప్పుడు సంగీత ఆమెతో 'ఆగమ్మను కొంచెం పిలవవా అని అడుగుతుంది. అప్పుడామెకు వారిపై నమ్మకం కలిగి 'పక్కనున్న చర్చికి వెళ్లిందని' చెబుతుంది.

ఈ మాటలను గమనిస్తే మనకు అనేక విషయాలు తెలుస్తాయి ఈనాటికి కూడా తెలంగాణా పల్లెల్లోని ప్రజలకు ప్రభుత్వాధికారుల పట్ల ఒక రకమైన భయం, నిరసన భయం ఉందని తెలుస్తోంది అలాంటి భావన ఏర్పడటానికి అనేక కారణాలున్నాయి. వరంగల్ జిల్లా చారిత్రాత్మక నేపథ్యం గనుక మనం గమనిస్తే; తెలంగాణ ప్రాంతానికి స్వతంత్ర్యం రాకముందు ఆ ప్రాంతమంతా నిజాం పాలనలో ఉండేది. నిజాం అనుచరులైన రజాకార్లు... ప్రభుత్వం పేరు చెప్పుకొని ప్రజలపై విధ్వంసం సృష్టించేవారు. ప్రజలను అన్ని విధాలుగా అంటే... ఆర్థికంగా, శారీరకంగా దోచుకునేవారు. అందువల్లే ఆ ప్రాంత ప్రజల్లో నేటికీ ప్రభుత్వంపై ఈసడింపు భావన ఉంది.

సంగీత, రుద్రమ్మ కలసి ఆగమ్మ కోసం చర్చంతా వెతుకుతారు. ఆగమ్మ ఆ ఊరి సర్పంచ్ గనుక చర్చిలో ఉన్న వేదిక మీద వెతుకుతారు. అక్కడందరూ వీదేశీయులే కనిపిస్తారు చివరికి ఆగమ్మను చర్చిలో ఒక మూలన కనుక్కుంటారు. ఆగమ్మ వాళ్లను చూసి, "ఎవలు, ఎందుకొచ్చిండ్రు, నాతోనేంపని, ఆ..." అని భయభయంగా వాళ్లను చూస్తుంది అందుకు సంగీత "మేము పట్నం నుంచి వచ్చినామవ్వా. ఎస్సీ సర్పంచుల సర్పంచితనం ఎట్లా జేస్తుండ్రు జేసేటప్పుడు మీరుపడే కష్టాలేమున్నాయని మీతో మాట్లాడి తెలుసుకునేదాకొచ్చినం" అని అంటుంది. ఆ మాటలు ఆగమ్మ "అవ్వో బాంచన్, గిదంతా నాకు తెల్వది. అంతా నా కొడుక్కే ఎర్క, వాన్నే అడగండ్రి"[31] అని చర్చిలోకి వెళ్లిపోతుంది. దాంతో కథముగుస్తుంది

ఈ కథలో మహిళా రిజర్వేషన్లు ఏ విధంగా నీరుకారిపోతున్నాయో అర్థమౌతుంది. పేరుకే ఆగమ్మ ఆ ఊరి సర్పంచ్. అసలు ఆమెకు సర్పంచ్ అంటే ఎవరు? సర్పంచ్ విధులేమిటి, అధికారాలేమిటి?... మొదలైన విషయాలేమీ తెలియవు. ఇలాంటి పరిస్థితి ఒక్క ఆగమ్మ విషయంలోనే కాక, మహిళారిజర్వేషన్ల వల్ల పదవులధిష్టించిన అనేకమంది ఇదే తరహాలో ఉన్నారంటే అతిశయోక్తి కాదు.

ఈ కథలో ఆగమ్మ తన రాజకీయ అస్తిత్వాన్ని పోగొట్టుకున్నట్టు తెలుస్తోంది ఈ పరిస్థితులు

మారాలంటే ఇటు ప్రభుత్వం, అటు ప్రజలు సమష్టిగా కృషిచేయాలి. ఎవరైతే మహిళా రిజర్వేషన్ల ద్వారా ఎన్నికవుతారో అలంటి వారికి ప్రభుత్వం ఆయా పదవుల గురించి అవగాహన, శిక్షణా కార్యక్రమాలను రూపొందించాలి. వారి పదవులకు సంబంధించిన బాధ్యతలు, విధి నిర్వహణ స్పష్టపరచాలి. ప్రజలు కూడా వారికి సహాయ సహకారాలందించాలి. ఎప్పుడైతే స్త్రీలు తమ రాజకీయ అధికారాన్ని సద్వినియోగం చేసుకుంటారో అప్పుడు మరింతగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంటుంది.

## 3. 41. స్వాభిమానం:

ఈ కథ 2అక్టోబర్ 2008న ఆంధ్రభూమి వారపత్రికలో అచ్చయ్యింది. రచయిత్రి గంటి భానుమతి. ఒక స్త్రీ తన అస్తిత్వాన్ని కోల్పోతున్నాననే స్పృహ కలుగగానే, తన అస్తిత్వాన్ని కాపాడుకోవటానికి చేసిన ప్రయత్నమే దీనిలోని వస్తు వు.

**ఇతివృత్తం:**

ఈ కథలో ప్రధానపాత్ర శ్యామల. ఆమె కొడుకు నరసింహ. కోడలు అస్మిత. వారి పిల్లలు ప్రతీక్, ప్రీతి. శ్యామల కొడుకు చదువుకోసం ఎన్నో కష్టాలుపడుతుంది. చివరికి తన ఇంటిని కూడా తాకట్టుపెట్టి పైచదువులు చదివిస్తు ంది నరసింహ బాగా చదువుకుని అమెరికాలో మంచి ఉద్యోగం సంపాదించి, అక్కడే స్థిరపడతాడు. కొడుకు కోరికమేరకు ఆమె అమెరికా వెళ్తు ంది తీరా అక్కడికి వెళ్లాక తన మనవరాలిని, మనవడిని, సంరక్షించటానికే తనను అక్కడికి రప్పించుకున్నట్లు గ్రహిస్తు ంది తన కోడలు ఆమెను ఒక ఆయాగానే పరిగణిస్తు ంది తప్ప ఒక అత్తలా భావించదు. అస్మిత ఎప్పుడూ ఏదో విధంగా శ్యామలను మాటలతో బాధిస్తు ండేది శ్యామల తన స్వాభిమానాన్ని వదులుకొని అక్కడ ఒక జడపదార్థంలా ఉండలేకపోయింది. ఇక అక్కడ ఉండడం తన వల్లకాదని ఎవ్వరికీ చెప్పకుండా భారతదేశానికి తిరుగుప్రయాణమవుతుంది. అంతటితో కథముగుస్తు ంది

**కథావిశ్లేషణ:**

ఈ కథను విశ్లేషణాత్మకంగా పరిశీలిస్తే అసలు స్త్రీలు ఏమి కోరుకుంటున్నారో అర్థమవుతుంది. శ్యామల స్వాభిమానంగల స్త్రీ. ఎన్నడు ఎవ్వరి దగ్గరా నోరుతెరిచి ఏదీ అడగదు. ఉన్నదాంట్లో సర్దుకుపోతుంది. ఎవ్వరిమీదా ఆధారపడకుండా స్వతంత్రంగా జీవిస్తు ంది అలాంటి శ్యామల, కొడుకు

వద్దకు వెళ్లాక మనుష్యుల మధ్య ఏర్పడిన కృతక పరిస్థితులను గమనిస్తుంది ఒక సందర్భంలో శ్యామల కొడుకు నరసింహ, తన తల్లితో 'అమ్మా... అస్మితకి ఉద్యోగం వచ్చింది. మేం ఇద్దరం ఉద్యోగాలకి వెళ్తాం' అంటాడు. ఇవే మాటలు కోడలు చెప్పివుంటే తను ఎంత సంతోషించేది. అని మనసులో అనుకుంటుంది. నరసింహ ఇంకా తన మాటలను పొడిగిస్తూ 'అందుకే నిన్ను రమ్మన్నది. ప్రీతి పుట్టడం. దగ్గరలోనే మంచి ఉద్యోగం దొరకక అస్మిత ఇంట్లోనే ఉండిపోయింది. ఇప్పుడు నువ్వున్నావు పిల్లల్ని చూడ్డానికి...' అంటాడు. 'నువ్వొచ్చావు, నువ్వున్నావు' అనే మాటల్లోని అర్థాలు వెతకాలనుకోలేదు శ్యామల. డివిజన్ ఆఫ్ లేబర్ అనుకుంటుంది. అది తన ఇల్లుగా, ఆ ఇంటి మనుష్యులు తన వాళ్ళుగా భావించి, సర్దుకుపోతుంది. ఈ మాటలను గమనించినట్లయితే, నరసింహ మాటలకు శ్యామల ఒక తల్లిగా స్పందించింది గనుక సర్దుకుపోయింది. అస్మిత ఉద్యోగంలో చేరిన తరువాత శ్యామలకు అసలు తీరికే ఉండకుండా పోతుంది. ఇద్దరు పిల్లల్ని సంరక్షించడం ఆ వయసులో కొంచెం కష్టంగానే అనిపించినా కొడుకు మీదవున్న ప్రేమతో అన్నింటిని సహిస్తూ వస్తుంది

ఒక సందర్భంలో శ్యామలకు కొంచెం జ్వరంగా అనిపించి పడుకుంటుంది. అలా పడుకుందో లేదో... మనమడైన ప్రతీక్ 'పార్కుకు వెళ్దామని' మారాం చెయ్యడం ప్రారంభిస్తాడు వాడిని సముదాయించే క్రమంలో నిద్రపోతున్న ప్రీతి లేచి ఏడుపు మొదలు పెడుతుంది. వారిని ఎలా సముదాయించాలో తెలియక సతమతమవుతున్న క్రమంలో కొడుకు, కోడలు వస్తారు ఆ దృశ్యాన్ని చూచి అస్మిత 'ఏమిటీ ఏడుపులు? ఇవాళేనా? లేకపోతే రోజూ ఇంతేనా? మీరు పిల్లల్ని ఎలా చూస్తున్నారో తెలిసింది. లేకపోతే పిల్లలు మీ దగ్గర బావున్నారని అనుకుంటూ ఓ రాంగ్ నోషన్ లో ఉండే వాళ్ళం' అంటూ అత్తపై తన కోపాన్ని ప్రదర్శిస్తుంది. ఆ మాటలు విన్న నర్సింహ 'అస్మితా స్టాపిట్...' అంటాడు. ఆ మాటలకు అస్మిత 'ఏం అంత కోపం ఎందుకూ? మా మమ్మీ వచ్చే వరకూ పిల్లలిద్దర్ని డే కేర్ సెంటర్లో పెడదామంటే నువ్వేమన్నావ్? గుర్తుందా! అమ్మ పిల్లల్ని చూస్తే పదిహేను వందల డాలర్లు మిగుల్తాయని అన్లేదా! అన్నవా లేదా! చూడూ... ఈవిడకయ్యే ఖర్చుకి, ఈ డేకేర్ సెంటర్ ఖర్చుకి ఏం తేడాలేదు. అంతా ఒకటే. పోనీ పిల్లలేమన్న....' అంటూ శ్యామల వైపు చూస్తుంది ఆ మాటలకు శ్యామల హృదయం విలవిల్లాడిపోతుంది. ఆమె ఆత్మాభిమానాన్ని ఎవరో చిత్రవధ చేస్తున్నట్లుగా భావిస్తుంది ఇక ఆ ఇంటిలో ఉండడం సాధ్యంకాదని భావించి తన సొంత ఇంటికి బయలు దేరుతుంది.

హైదరాబాదులో దిగి, కొడుకుకి ఫోన్ చేసి 'క్షేమంగా చేరుకున్నానని చెప్పి, అల్మారాలో ఒక

కవరు పెట్టాను తీసుకో' అని చెప్పి ఫోన్ పెట్టేస్తుంది ఆ మాటకు నరసింహ నిశ్చేష్టుడవుతాడు. వెళ్లి ఆ కవరులో ఉన్న ఉత్తరాన్ని తీసి చదవడం మొదలుపెడతాడు. దానిలో ఈ విధంగా ఉంటుంది. "నర్సింహానికి, అస్మితకి... యుద్ధం పక్క దేశంతోనో, పొరుగునున్న శత్రువుతోనో అయితే నిస్సంకోచంగా, నిర్భయంగా చేయవచ్చు. కాని, ఇంట్లోవాళ్లతో అయితే... ఎలా చెయ్యడం. ఆ పరిస్థితి రాకుండానే మేలుకున్నాను. నా తరం నుండి మనవల తరానికి అందించాల్సినవి ఎన్నో ఉన్నాయి. మన సంస్కృతి, పండుగలు, వంశం, పుట్టుపూర్వోత్తరాలు ఆచారవ్యవహారాలు గురించి, నేనున్న సమాజం గురించి చెప్పాలి. ఈ తరాల మధ్య వంతెనలు వేయాలని, అది నా బాధ్యతని అనుకున్నాను. అందుకే నువ్వు రమ్మనగానే వాలంటరీగా రిటైరయ్యి, ఓ పెద్దధర్మకార్యం నిర్వర్తించాలనుకుని వచ్చాను. మీరు జీతబత్తెంలేని ఆయాగా అనుకోవడం నా దురదృష్టం... నేను మీ ఇంట్లో ఉన్నప్పుడు ఒంటరిగా ఫీలయ్యేదానిని. ఆ ఒంటరితనం నాకు హైదరాబాదులో లేదు..."[32] అంటూ ఉత్తరం ముగుస్తుంది

ఈ ఉత్తరంలో శ్యామల యొక్క అంతరంగాన్ని ఆవిష్కరింప చేశారు రచయిత్రి, హైదరాబాద్ వదిలి అమెరికా ఎందుకు వెళ్లింది, ఎలాంటి ధర్మకార్యం నిర్వర్తించడానికి వెళ్ళింది, ఎందునిమిత్తం అక్కడ ఉండలేకపోయింది, ఆమె తన కొడుకు నుండి ఏమి ఆశించింది, తనకు దొరికిన ప్రతిఫలం ఏమిటి... మొదలైన ప్రశ్నలన్నింటికి ఈ ఉత్తరం సమాధానం చెప్తుంది

శ్యామల అమెరికా వదిలి రావడానికి కారణాలు... కోపమో, ఉద్రేకమో, బాధో కాకుండా ఆమె నిర్వర్తించాలనుకున్న ధర్మకార్యం నిర్వర్తించలేక ఒక తరానికి మరొక తరానికి మధ్య వారధిలా నిలవాలన్న ఆమె ఆశయం నెరవేరకపోవడం వల్ల ఆమె తిరుగుప్రయాణమైనట్లు తెలుస్తోంది దానికి తోడు ఆమె తన ఆత్మాభిమానాన్ని, తన అస్తిత్వాన్ని కోల్పోవడానికి ఇష్టపడక ఇలాంటి నిర్ణయం తీసుకుం టుంది. ఆమె తీసుకున్న నిర్ణయం ఆమెను ఒక వ్యక్తిత్వంగల స్త్రీగా, తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోవాలనే తహతహ కలిగినట్లుగా, విశాలదృక్పథం కలిగిన మనిషిగా మనకు స్పష్టంచేస్తుంది

## 3. 42. క్షతగాత్ర

ఈకథ 29 మార్చ్ 2009న ఆంధ్రజ్యోతి అనుబంధంలో వెలువడింది. రచయిత్రి కె.వరలక్ష్మి. ఒక స్త్రీ తన భర్త చెడు ప్రవర్తనకు విసుగుచెంది, అతనిలో మార్పు వచ్చేవరకు అతనికి దూరంగా

జీవించాలనుకోవడం ఈ కథలోని వస్తు వు.

**ఇతివృత్తం**

ఈ కథలో ప్రధానపాత్ర అభిరాం. అతనికి సుజనతో పెళ్లవుతుంది. అప్పటినుంచి ఆమెను మాటలతో హింసిస్తూ వుంటాడు అంతేకాక, ఆడవాళ్ల గురించి చులకనగా మాట్లాడతాడు. ఇక అలాంటి వ్యక్తితో కలసివుండటం అసాధ్యమని భావించి, అతనికొక ఉత్తరం రాసి, వెళ్లిపోతుంది.

**కథావిశ్లేషణ**

ఈ కథలో అభిరాం సాఫ్ట్ వేర్ ఉద్యోగస్తు డు అందుకే సుజన తండ్రి, చాలా కట్నం ఇచ్చి కొంటాడు. అభిరాంకి మంచి ఉద్యోగం వున్నప్పటికీ మంచి వ్యక్తిత్వం ఉండదు. అలాంటి వ్యక్తితో కాపురం చేయడం సుజనకు చాలా కష్టంగా వుంటుంది.

సుజనకి పెళ్లయిన మొదటిరాత్రి అభిరాం, ఆమెతో 'ఏంటిలా బిగుసుకుపోయావ్, దీని గురించి నీకేమీ తెలియదని నేననుకోవాలనా? ' అంటూ మాట్లాడతాడు. ఆ మాటలకు సుజన కుంగిపోతుంది. పెళ్లయిన కొత్తలో ఇద్దరూ కలసి గుడికి వెళతారు. అక్కడ చాలా రద్దీగా ఉంటుంది. దర్శనం పూర్తిచేసుకొని ఇంటికొచ్చాక, అభిరాం, సుజనతో 'నా వెనుకున్న ఆంటీ తన అవయవాల్ని నాకు తాకిస్తూ నా వీపుమీద గీరడం మొదలుపెట్టింది. కొందరంతే నాలాంటి మగాళ్లు కనిపిస్తే కోరికతో రగిలిపోతార' అంటాడు. ఆ మాటలను సుజన భరించలేకపోతుంది. ఏమీచేయలేని నిస్సహాయురాలిగా వుండిపోతుంది.

ఒకసారి అభిరాం సహోద్యోగి, అభిరాం దంపతుల్ని భోజనానికి ఆహ్వానిస్తు ంది భోజనం చేసి, ఇంటికి వస్తు ండగా ఇద్దరికీ షేక్ హ్యాండ్ ఇస్తు ంది. ఇంటికి వచ్చాక అభిరాం, సుజనతో 'గమనించేవా. అది నాకు షేక్ హ్యాండిస్తూ అరచేతిలో ఎలా గోకిందో' అంటాడు. ఇలా ప్రతి సందర్భంలో అతని చెడ్డ మనస్తత్వతం బయటపడుతుంది. అలాంటి వ్యక్తితో కలసి జీవించడం అసాధ్యమని భావించి, అతనికి ఈ విధంగా ఉత్తరం రాస్తు ంది "అభిరాం గారు! మీలో నాకు నచ్చని లక్షణమేంటో మీకు తెలుసు. మీకు స్త్రీలంటే చులకన భావమో లేక మీ మానసిక వైకల్యమో నాకర్థంకావడంలేదు. మిమ్మల్ని మీరొకసారి అనలైజ్ చేసుకొని చూడండి. నేను కొన్ని రోజులు మా ఊరికి వెళుతున్నాను. మిమ్మల్ని మీరు

సరిదిద్దుకోగలిగితే తప్పకుండా కలుసుకుందాం. లేకుంటే నా చదువు నాకొక ఉద్యోగాన్ని సంపాదించి పెట్టకపోదు."[33]

ఈ ఉత్తరం ద్వారా సుజన, భర్తకు చెప్పదలచిన విషయాన్ని స్పష్టంగా వివరిస్తుంది అంతేకాక తన వ్యక్తిత్వాన్ని వదులుకొని జడపదార్థంగా ఉండలేక అతనిలో మార్పువచ్చేంత వరకు అతనికి దూరంగా ఉండాలనుకుంటుంది. ఈ కథలో సుజన తన అస్తిత్వాన్ని కాపాడుకున్న స్త్రీగా కనిపిస్తోంది.

# 3. 43. 2000 సంవత్సరానికి ముందు వచ్చిన స్త్రీల అస్తిత్వ చిత్రణ కథలు

2000 సంవత్సరానికి ముందుకూడా బలమైన అస్తిత్వ చిత్రణ కథలు వెలువడ్డాయి. అలాంటి కథల్లో కొన్నింటిని చూద్దాం!

## 3. 43. 1. అతని భార్య:

కొండేపూడి నిర్మల రాసిన కథల్లో 'అతని భార్య' స్త్రీ అస్తిత్వానికి సంబంధించిన కథ. వివాహానంతరం స్త్రీ జీవితం ఎలా ఉంటుందో వివరించడం ఈ కథలో వస్తువు

ఈ కథలో భార్యాభర్తలిద్దరు సంగీతంలో మంచి ప్రావీణ్యం కలిగినవారు. అయితే వివాహానంతరం భార్య, పనుల ఒత్తిడితో సతమతమవుతూ సంగీతాన్ని సాధనచేసే తీరికలేక సంగీతానికి పూర్తిగా దూరమౌతుంది. అయితే భర్త మాత్రం సంగీతంలో ఆరితేరి, పేరు ప్రఖ్యాతలు సంపాదించుకొని 'గానగంధర్వ విజయరాఘవాచారి' అనే బిరుదు పొందుతాడు.

ఆమె తన భర్త కోసం ఎలా కొవ్వొత్తిలా కరిగిపోయిందో, అతని ఎదుగుదల, తన పతనానికి ఎలా కారణమైందో గుర్తుచేసుకుని అసంతృప్తికి గురై, ఇంతకాలం తనని బంధించిన బంధనాలను చేధించుకోవాలని అనుకోవడంతో కథ ముగుస్తుంది.

**కథావిశ్లేషణ:**

నిర్మల రాసిన 'అతని భార్య' ఆమూలాగ్రం చదివితే పితృస్వామ్యవ్యవస్థ కుట్ర తెలుస్తుంది 'ప్రతి పురుషుని విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుంది' అనే వాక్యం వెనుక ఉన్న రాజకీయం అర్థమౌతుంది.

ఈ కథలో భార్య, అతని భార్యగానే గుర్తించబడుతుంది తప్ప ఆమెకు ఎలాంటి అస్తిత్వం ఉండదు. సంగీతాన్ని ప్రాణంగా ప్రేమించి, మృదుమధురంగా పాటలుపాడే ఆ అమ్మాయి, భార్య స్థానంలోకి రాగానే తన స్వరం విని, తనే బాధపడే విధంగా మారిపోతుంది. సంగీతసాధన చేసే తీరిక లేక గొంతు మూగబోతుంది. వివాహబంధంలో స్త్రీ తన అభిరుచులన్నీ కోల్పోతుంది. అయితే తన భర్త మాత్రం సంగీతంలో ఉన్నతస్థానానికి చేరుకోవాలనే తపనతో, అన్నివిధాల అతనికి సహకరిస్తుంది తంబురను శుభ్రం చేసి, శృతిచేసి, కచేరీకి ముందు, వెనుక మిరియాలపాలు అందించి, అతని కళాతపస్సు భగ్నం

కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటుంది. అయితే భార్యకు కూడా సంగీతంలో ప్రవేశం ఉన్నప్పటికీ భర్త ప్రోత్సాహం ఎంత మాత్రం ఉండదు. అంతేకాక 'శారద' అనే విద్యార్థిని గురించి భర్త నిరక్షరకుక్షి అనో, అపస్వరాల పుట్ట అనో, గార్ధబ గానమనో, నిందించడం వల్ల ఆ మాటలన్నీ తనను ఉద్దేశించే అన్నట్లు భావించి మనోవేదనకు గురవుతుంది.

అంతేకాక ఎవరైనా 'నీ భార్యకు కూడా నీ సహవాసం అంటలేదటోయ్... ' అని చమత్కరిస్తే 'పాడతావేమిటోయ్ పోనీ, పసలేదంటావా' అనే వాడు.

ఇదంతా గమనిస్తే, భార్యను ఒక రకంగా అణచివేసినట్లు కనిపిస్తుంది అంతేకాక, ఒకవేళ ప్రోత్సహిస్తే తనని మించిపోతుందేమోననే భావం కూడా భర్త హృదయంలో నిగూఢంగా వుంటుంది.

కాత్యాయని, తన అస్తిత్వాన్ని కోల్పోయిన స్థితిని గ్రహించి అసంతృప్తికి గురై, తిరిగి అస్తిత్వాన్ని నిలుపుకొనే ప్రయత్నం చెయ్యడానికి సిద్ధపడుతుంది.

## 3. 43. 2. అదెక్కడ?

ఈ కథ రచయిత్రి కె. రామలక్ష్మి. దీనిలో పితృస్వామ్య సమాజంలో మనిషి అనే పదాన్ని పురుషునికి మాత్రమే పర్యాయపదంగా వాడడం జరుగుతోంది. స్త్రీత్వం స్త్రీని మనిషి కాకుండా చేస్తోంది ఈ స్త్రీత్వ భావనకు జెండర్ మూలం. అమ్మతనం, అమ్మమ్మతనం ముసుగులో స్త్రీ ఎంతో వంచనకు గురవుతోంది. ఈ వంచన, దోపిడీలకు 'అదెక్కడ' కథ అద్దంపడుతోంది.

ఈ కథలో పరంధామయ్య, పద్మావతి దంపతులు. వారికి ఒక కొడుకు. ఆ కొడుకు, అతని భార్య, వాళ్ల ఇద్దరి పిల్లలు అంతాకలసి ఉమ్మడి కుటుంబంగా జీవనం సాగిస్తుంటారు ఆ కుటుంబంలో పద్మావతిది పనిమనిషి స్థానం మాత్రమే. అందుకే ఆమెను అందరు అది, ఇది, అదెక్కడ, దీనికి అని సంబోధిస్తుంటారు ఆ మాటలు విన్నప్పుడల్లా ఆమె హృదయం విలవిల్లాడిపోయేది. ఎందుకు తనని అంత నీచంగా సంబోధిస్తారని ఆమె ఆవేదన పడుతుండేది.

ఆ ఇంటిలో ఒక జడపదార్థంలా జీవించడం అసాధ్యం అని నిర్ణయించుకొని ఇంటి నుండి వెళ్లిపోయి, ఒక ఉద్యోగుల వసతిగృహంలో చేరి, స్వగతంలో "ఇక నన్నెవరు అదీ ఇదీ అని సంబోధించరు. ఇక్కడ నేనొక మనిషిని"[34] అని అనుకోవడంతో కథ ముగుస్తుంది

**కథా విశ్లేషణ:**

ఈ కథను మనం నిశితంగా పరిశీలిస్తే అనేక అంశాలు వెల్లడవుతాయి. మొదట పద్మావతి పాత్ర గురించి తెలుసుకుందాం!

ఈ కథలో పద్మావతి పీడితురాలు, బాధితురాలు. ఈమెను పీడించినది పితృస్వామ్య సమాజం ద్వారా తయారుచేయబడ్డ ఆమె భర్త, కొడుకు. పద్మావతి హింసించబడిన స్త్రీగా కనిపిస్తుంది ఈమెపై హింస రెండు రకాలుగా జరిగింది. ఒకటి కుటుంబ హింస, సామాజిక హింస. కుటుంబ హింసను తిరిగి శారీరక హింస, లైంగిక హింస, మానసిక హింసగా విభజించవచ్చు. వీటిలో ప్రధానంగా శారీరక, మానసిక హింస ఎలా ఉంటాయో చూద్దాం!

## 3. 43. 2. 1. శారీరక హింస:

పరంధామయ్య కుటుంబంలో అందరూ వారివారి పనుల (ఉద్యోగం, చదువు) నిమిత్తం అందరూ బయటకు వెళ్లిపోతారు. ఇక పద్మావతి ఒక్కతే మిగిలుతుంది. అప్పుడు ఇంటిపని ప్రారంభిస్తుంది గదులన్నీ తడిబట్టతో తుడవడం, బట్టలు ఉతకడం, గిన్నెలు కడగడం, బట్టలు ఇస్త్రీ చెయ్యడం మొదలైన ఇంటిచాకిరీ అంతా చేస్తుంది ఇంటి పనంతా ఒక్కతే యాభై సంవత్సరాలు పైబడిన తరువాత చెయ్యడమంటే... అదీ కేవలం శారీరక శ్రమే కాదు, శారీరక హింసతో కూడిన పని.

పద్మావతి కోడలు ఇంటిపని గురించి పద్మావతితో మాట్లాడే సందర్భంలో... 'చిన్న ఇల్లు, చిన్న కుటుంబం. రోజంతా ఎవరూ ఉండనే ఉండరు... దీనికో లాండ్రి... పనిమనిషి ఎందుకు' అంటుంది.

ఇంటిపని స్త్రీకి కేటాయించబడినప్పటికి, ఆ ఇంటి కోడలు కూడా ఒక స్త్రీయే. అయినా ఆమె పనిలో భాగస్వామ్యం పొందకపోవడానికి ప్రధాన కారణం ఆర్థికనేపథ్యం. కోడలు ఉద్యోగస్తురాలు సంపాదిస్తుంది అందుకే పరంధామయ్య కూడా ఆమెకు భయపడతాడు. పద్మావతి తన అస్తిత్వాన్ని కోల్పోవడానికి ప్రధాన కారణం ఆర్థిక స్వతంత్రం లేకపోవడం.

## 3. 43. 2. 2. మానసిక హింస:

శారీరక హింసతో పోల్చితే మానసిక హింస భరింపరానిది. కొడుకు, భర్త కోడలు ఆమెను 'అది, ఇది' అన్నప్పుడల్లా విలవిల్లాడేది. ఆ సంబోధన విన్నప్పుడల్లా ఆమె మనసు గాయపడేది. అంతేకాక ఇంటికి వచ్చిన పెద్దమనిషి ముందు ఆమెను గురించి, చులకనగా మాట్లాడుతుంటే స్వగతంలో ఆమె "ఇంట్లో తనకెంత గౌరవముందో గ్రహించి నొచ్చుకుంటాడా? తానూ లోకువగా మాటాడతాడా! ఏమో... మొగుడు కొడితే, మాదాకోళం వాడు కొట్టాడని సామెత...." అని అనుకుంటుంది. ఆ ఆలోచనలో పరాయివాళ్ల

చేతులో కూడా అవమానించబడాలేమో అన్న భయం వ్యక్తం అవుతుంది.

## 3. 43. 3. ఆమె ఇల్లు:

సర్వసాధారణంగా ప్రతి స్త్రీ ఎదుర్కొనే సమస్యల్లో 'తన కంటూ సొంత ఇల్లు లేకపోవడం' ఒకటి. ఈ సమస్యనే ప్రధానవస్తువుగా తీసుకుని కవనశర్మ "ఆమె ఇల్లు" అనే కథ రాసారు.

ఈ కథలో కమల ఒక చిరుద్యోగి. ఆమె ఉద్యోగం చెయ్యడం భర్తకు గాని, పిల్లలకుగాని ఇష్టంలేకపోయినా వ్యక్తిగత ఆసక్తితో ఆ ఉద్యోగంలో చేరిన తరువాత తనకంటూ ఒక ఇల్లు కావాలని అనుకుంటుంది. శతవిధాలుగా ప్రయత్నించి, చివరకు ఒక ఇల్లు అద్దెకు తీసుకుని దానిలో జీవిస్తుంది కుటుంబసభ్యులంతా ఆమె నిర్ణయాన్ని వ్యతిరేకిస్తారు అంతేకాక, ఏదోవిధంగా ఆమెను భర్త ఇంటికి చేర్చడానికి అష్టకష్టాలుపడి విఫలమౌతారు. కమల మాత్రం తనకంటూ ఒక ఇల్లు ఉన్నందుకు, అంటే... "ఈ ఇల్లు నాది" అని చెప్పుకునే స్వాతంత్ర్యం కలిగినందుకు సంతోషిస్తుంది ఇది "ఆమె ఇల్లు" కథలోని ప్రధాన ఇతివృత్తం.

**కథావిశ్లేషణ:**

ఆమె ఇల్లు అనే కథను మనం పరిశీలిస్తే- హిందూ ధర్మశాస్త్రం ప్రకారం స్త్రీ అబల గనుక ఆమె బాల్యంలో తండ్రిచేత- యవ్వనంలో భర్తచేత- వృద్ధాప్యంలో కొడుకుల చేత సంరక్షింపబడుతుంది. ఈ భావన భారతీయుల్లో జీర్ణించుకుపోయింది. అందుకే ఎక్కడకూడా స్త్రీకి స్వాతంత్ర్యం కాని, సొంత ఆస్తిగాని లేకుండా పోయింది.

ఇంట్లో ఆడపిల్ల గనుక జన్మిస్తే ఆమెను పరాయి వస్తువుగా లేదా పరాయి మనిషిగా చూస్తారు అందుకే ఆడ, మగ (పిల్లల) పెంపకంలో వైవిధ్యం కనిపిస్తుంది అంతేకాక చిన్నతనం నుండి ఆడపిల్లను 'ఈ ఇల్లు నీది కాదు' నువ్వు ఎప్పటికైనా పరాయి పంచన చేరవలసినదానివే అంటూ తల్లితండ్రులు ఆమెను మానసికంగా సిద్ధంచేసి, భర్త ఇంటికి పంపుతారు.

వైవాహిక జీవితంలో భార్యాభర్తల మధ్య ఏవైనా మనస్పర్థలువచ్చి, భర్త అహం దెబ్బతినే పరిస్థితివస్తే... వెంటనే అతను 'ఈ ఇల్లు నాది నువ్వెక్కడికి పోతావో పో' అంటాడు. అంతేకాక అనేక రకాలుగా 'ఈ ఇల్లు నాది' అని చాటిచెప్పుకుంటాడు. తండ్రి వారసత్వాన్ని అందిపుచ్చుకుని బయలుదేరే

కొడుకులు కూడా తల్లిని ఇదే ధోరణిలో ధూషించడం మనం సమాజంలో నిత్యం చూస్తూ వుంటాం

స్త్రీ పెళ్లికాకముందు పుట్టినింటికి, పెళ్లయిన తరువాత మెట్టినింటికి తన సర్వశక్తు లు ధారపోసినా, ఆ ఇల్లు తనది కాకుండా పోతుంది. దీనంతటికి కారణం స్త్రీకి "ఆస్తిహక్కు" వాస్తవ రూపంలో అమలుకాకపోవడం.

అందుకే నేటి స్త్రీలు తమకంటూ ఆస్తి ఉండాలని కోరుకుంటున్నారు. పితృస్వామ్య భావజాలం ప్రకారం స్త్రీకి సొంతగా "నాది" అని చెప్పుకోదగ్గదేదీ కూడా ఉండనక్కరలేదు. కాని ఆధునిక స్త్రీల దృక్పథం మారింది. తమకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తెరిగి తమకంటూ సొంతఆస్తి ఉండాలని కోరుకుంటున్నారు. అది సొంతఇంటి రూపంలో కావచ్చు, డబ్బు రూపంలో కావచ్చు, చరాస్థి రూపంలో కావచ్చు, స్తిరాస్థి రూపంలో కావచ్చు.

## 3. 43. 4. ఆర్తి:

ఓల్గా రాసిన "ఆర్తి" కథ, స్త్రీ చైతన్యానికి లేదా అస్తిత్వపు కాంక్షను వ్యక్తీకరించే కథగా కనిపిస్తు ంది ఈ కథలో సీత తన జీవితంలో ఎలా అణచివేతకు గురయ్యింది, తద్వార ఆమె ఏ విధమైన మానసిక సంఘర్షణకు లోనైంది... మొదలైన విషయాలు ఈ కథలో వివరించబడ్డాయి.

సీత చిన్నప్పటినుంచి అభ్యుధయభావాలు కలిగివుంటుంది. సమాజం స్త్రీ గురించి కలిగివున్న అభిప్రాయాలు, అంటే... స్త్రీ అణిగిమణిగి ఉండాలని, ఎదురుచెప్పకూడదని, గట్టిగా నవ్వకూడదని... ఇలా ముందే నిర్ణయించబడిన అభిప్రాయాల (pre-consive ideas) కంటే భిన్నంగా ఉంటుంది. అయితే ఆమె కుటుంబంలో ఎవరు ఆమె వ్యక్తిత్వాన్ని ఇష్టపడరు సరికదా అనేక విధాలుగా ఆమెను నిందిస్తూ అణిచివేస్తూ ఉంటారు. వివాహానంతరం భర్త ద్వారా కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొంటుంది. సీత స్వతంత్ర వ్యక్తిత్వాన్ని సహించలేని భర్త ఇంట్లోనుంచి బయటకు నడవమని శాసిస్తా డు కాని పిల్లల్ని కావాలని కోరుకుంటాడు. సీత కూడా పిల్లలు తన దగ్గరే ఉండాలని ఆశిస్తు ంది ఈ విషయంలో చట్టం కూడా భర్తకే అనుకూలంగా ఉంటుంది. దాంతో సీత చట్టంతో పోరాడైనా, లేదా తన రక్తం ధారపోసైనా సరే కన్నపిల్లలపై హక్కు సంపాదించుకోవాలని నిర్ణయించుకోవడంతో కథ ముగుస్తు ంది

**కథావిశ్లేషణ:**

ఆర్తి కథలోని వస్తు వు ఆధునిక స్త్రీ భావాలకు అద్దంపట్టేదిగా ఉంది. ప్రతి స్త్రీ 'చట్టం' అలా ఉంది దానికి మనమేమి చేస్తా మని వాపోవడం తప్ప ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిని వ్యక్తపరుస్తా రు కానీ ఈ కథలో సీత దానికి భిన్నమైన భావాలు కలిగి ఉంటుంది. స్త్రీ నవమాసాలూ మోసి, తన రక్తమాంసాలు

పంచుకుపుట్టిన బిడ్డలు తనకు చెందకుండా పోవడం అనేది చాలా అన్యాయం అని వాదిస్తుంది చట్టంతోనైనా పోరాడి తన పిల్లల్ని తను దక్కించుకోవాలని దృఢంగా నిశ్చయించుకుంటుంది.

ఈ కథలో సీత, స్త్రీ చైతన్యానికి ప్రతీకగా నిలుస్తుంది అనేకమంది స్త్రీలకు స్ఫూర్తినిచ్చేదిగా ఉంది. స్త్రీ పుట్టింది మొదలు ఆమె ఎన్ని ఆంక్షలకు గురవుతుందో ఈ కథ ద్వారా స్పష్టమౌతుంది. ఆర్తి కథ దృక్పథం పరిశీలిస్తే స్త్రీ తమ జీవితంపై, తాముకన్న పిల్లలపై తమకి స్వాతంత్ర్యం హక్కుకావలని ఎంతగా ఆరాటపడుతున్నారో అర్థమౌతుంది.

## 3. 43. 5. యిన్‌స్టెంట్ లైఫ్

కుప్పిలి పద్మకు మంచిపేరు తెచ్చిపెట్టిన కథ ఇది. ప్రపంచీకరణ మూలంగా మనుష్యుల మధ్య ఉండే సంబంధాలు కూడా ఏవిధంగా మారిపోతున్నాయో తెలియజేయడమే ఈ కథలోని వస్తువు ఈ కథలో ప్రపంచీకరణ పుణ్యమా అని, ప్రేమించినవ్యక్తి కూడా మారిపోతాడు. అయితే అతడిని పొందడం కోసం తన అస్తిత్వాన్ని కోల్పోవడానికి ఇష్టపడని ఒక యువతి మనస్తత్వాన్ని ఈ కథలో చిత్రించడం జరిగింది.

మునీరా, సందీప్ లు మొదట స్నేహితులు. తర్వాత ప్రేమించుకుంటారు. పెళ్లికూడా చేసుకోవాలనుకుంటారు. అయితే సందీప్ సాంకేతిక విద్యను అభ్యసిస్తాడు మునీరా సాంఘికశాస్త్రాన్ని అధ్యయనం చేస్తుంది సందీప్ కి అమెరికా వెళ్లే అవకాశం వస్తుంది దాంతో మునీరాని పెళ్లిచేసుకోవడానికి ఆసక్తి చూపడు. ఒక వేళ మునీరాని పెళ్లిచేసుకుంటే ఆమెకు అమెరికాలో మంచి ఉద్యోగం దొరకదని దానివల్ల ఎన్నో సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని భయపడతాడు. అయితే మునీరా తండ్రి ఆమెను కూడా ఏదో ఒక కంప్యూటర్ కోర్సు చేసి, సందీప్ తో జీవితం పంచుకోమని చెబుతాడు. కానీ మునీరా, సందీప్ కోసం తన చదువును, వ్యక్తిత్వాన్ని వదులుకోవడం ఇష్టంలేక అతన్ని వదులుకొని తన అస్తిత్వాన్ని కాపాడుకోవడం దీనిలోని ఇతివృత్తం

**కథావిశ్లేషణ:**

యిన్‌స్టెంట్ లైఫ్ కథలో ప్రధాన ఇతివృత్తాన్ని 1980కి ముందున్న కథాసాహిత్యంతో పోల్చిచూస్తే ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది పెళ్లీడొచ్చిన అమ్మాయికి మంచి సంబంధం వస్తే తల్లిదండ్రులు ఏదో ఒకవిధంగా ఆ సంబంధం కుదుర్చుకోవడానికి ప్రయత్నిస్తారు అంతేకాక తమ తాహతుకు మించి కట్నం ఇవ్వడానికి కూడా వెనుకాడరు. అమ్మాయి చదువు కొనసాగుతున్నప్పటికీ మధ్యలో మాన్పించేసి

పెళ్లిచేస్తా రు అంతేకాక ఒకవేళ ఆ అబ్బాయి అమెరికా వెళ్లినట్టుగానీ, వెళ్లే అవకాశాలు గాని వున్నట్లు తెలిస్తే ఇక అమ్మాయిల తల్లిదండ్రులుపడే అవస్థలు చెప్పనవసరంలేదు. ఇది ఈనాడు సమాజంలో కొనసాగుతున్న పరిస్థితి.

అయితే ఈ కథలో పెళ్లికోసం తన చదువుని, వ్యక్తిత్వాన్ని వదులుకోవడం ఇష్టంలేని ఒక యువతి మనస్తత్వాన్ని చాలా చక్కగా చిత్రించడం జరిగింది. ఈ కథ ద్వారా జీవితం అంటే పెళ్లి ఒక్కటే కాదని, అది జీవితంలో ఒక భాగం మాత్రమే అని చెప్పడం జరిగింది.

మానవ సంబంధాలను గురించి మార్క్స్ వివరిస్తూ... 'మానవ సంబంధాలన్ని ఆర్థిక సంబంధాలే' అన్నాడు. అయితే ప్రస్తు త సమాజంలో మానవ సంబంధాలన్నీ ప్రపంచీకరణలో భాగమే లేదా ప్రపంచీకరణ సంబంధాలే అని చెప్పుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. దీనికి నిదర్శం ఈ కథలోని సందీప్. ప్రపంచీకరణ నేపథ్యంలో మారిపోతున్న చదువులు, పరిస్థితులతో పాటు మనుషులు... ప్రేమలు, ఆప్యాయతలు మరచిపోవడం శోచనీయం.

ప్రపంచీకరణ అనేది మానవజీవితాన్ని ఎలా శాసిస్తు ందో, మానవ జీవితానికి సంబంధించిన ప్రతీ పార్శంలోనూ ప్రపంచీకరణ తాలూకా చిహ్నాలు ఏ విధంగా ప్రతిఫలిస్తు న్నాయో ఈ కథ ద్వారా మనకు అర్థమవుతుంది.

### 3. 43. 6. ఇల్లలగానే పండగౌనా:

పి. సత్యవతి రాసిన 'ఇల్లలగానే పండగౌనా' కథ స్త్రీ అస్తిత్వానికి సంబంధించిన మౌళికప్రశ్నల్ని రేకెత్తించే కథ. ఇందులో ముఖ్యపాత్రయిన శారద తన పేరును మరచిపోవడం దగ్గరనుండి కథ మొదలవుతుంది.

అందచందాలతో పాటు తెలివితేటలు కలిగిన శారద అనే యువతి పెళ్లికాగానే భర్తను సంతోషపెట్టే క్రమంలో ఇల్లు అలికి ముగ్గులు పెట్టడమే జీవితధ్యేయంగా పెట్టుకుంటుంది. దానివల్ల తనను తాను కోల్పోతుంది. అంటే పూర్తిగా తన అస్తిత్వాన్ని కోల్పోతుంది. చివరికి తనపేరు కూడా గుర్తు లేని స్థితికి చేరుకుంటుంది. ఒకరోజు నా పేరేంటి అని ప్రశ్నించుకుని ఆ ప్రశ్నకు సమాధానం దొరకక చాలా బాధ పడుతుంది. తనపేరు తెలుసుకోవాలనే ప్రయత్నంలో ఇక ముందైనా తన అస్తిత్వాన్ని నిలుపుకోవాలనుకోవడంతో కథ ముగుస్తు ంది ఇది కథలోని ఇతివృత్తం

**కథావిశ్లేషణ:**

ఈ కథలోని వస్తు వు పేరుకు సంబంధించినది. పేరుపెట్టడం వెనుకవున్న ప్రధాన ఉద్దేశం సులువుగా గుర్తించడం మనకు తెలిసినవ్యక్తి పేరుచెప్పగానే 'ఫలానా వ్యక్తి' అని మనకు వెంటనే స్ఫురిస్తుంది అంతేకాక ఆ వ్యక్తి రంగు, రూపు, ఊరు, హోదాయే కాక ఆ వ్యక్తికి సంబంధించిన విషయాలన్నీ గుర్తుకువస్తాయి ప్రతి వ్యక్తిపేరువెనుక ఒక అస్తిత్వం వుంటుంది. ఆ అస్తిత్వమే ఆ వ్యక్తికి జీవితం. సృష్టిలో ప్రతి వ్యక్తికి వస్తువుకి పేరు వుంటుంది. ఆయా సంబంధిత పేరుతో గుర్తింపుపొందడం జరుగుతుంది. అయితే ఆ పురుషుడి పేరును గుర్తించిన విధంగా... స్త్రీ పేరును గుర్తించరు ప్రతి కుటుంబానికి యజమాని పురుషుడే కాబట్టి... ప్రతి స్త్రీ తన తండ్రి లేదా భర్తద్వారా గుర్తింపు పొందాలి. స్త్రీకి తనదైన ప్రత్యేక గుర్తింపు ఉండదు. కాబట్టి స్త్రీ తన అస్తిత్వాన్ని కోల్పోవడం వల్ల ఆమె తనకు తెలియకుండానే పరాయికరణకులోనైపోతుందని చెప్పవచ్చు.

స్త్రీ జన్మించింది మొదలు చనిపోయే వరకు ఆమె పేరుకి ఎలాంటి గుర్తింపు ఉండదు. స్త్రీకి సంబంధించిన సంబోధనలన్నీ కూడా తక్కువ స్థాయిలోనూ నీచంగానూ ఉంటాయి. ఆడపిల్ల పుట్టిన తరువాత తల్లిదండ్రులు ఆమె పుట్టిన క్రమాన్ని బట్టి పెద్దమ్మాయి అని లేక చిన్నమ్మాయి అని సంబోధిస్తారే తప్ప పేరుపెట్టి పిలవరు. అత్తింటికి వచ్చిన తరువాత భర్త 'ఒసేయ్ అని లేక ఏమోయ్' అని పిలుస్తారు అత్తకూడా పెద్దకోడలని, చిన్నకోడలని లేదా పెద్దబ్బాయి పెళ్లామనో, చిన్నబ్బాయి పెళ్లామనో సంబోధిస్తుంది

స్త్రీ తను ఒక పేరు కలిగి ఉన్నా... తన జీవితదశలన్నిటిలోనూ పేరు లేనట్టుగానే జీవిస్తుంది ఈ కథలో వాడిన సందర్భాల ద్వారా ఈ విషయాన్ని వివరించవచ్చు.

ఇల్లలకగానే పండగౌనా కథలోని ఇల్లాలు, తనపేరు మరిచిపోయి పేరుకోసం తల్లిని అడిగిన సందర్భంలో తల్లి ఆతురతతో ఇలా అంటుంది. 'నువ్వు మా పెద్దమ్మాయి. బి.కాం. దాకా...చదివించాం' అని అంటుంది. భర్తను అడిగినప్పుడు 'నిన్ను పెళ్ళయిన దగ్గరనుండి ఏమోయ్' అని పిలవడం అలవాటయిపోయింది.

పిల్లల్ని అడిగితే 'నువ్వు మా అమ్మవి, నీ పేరు అమ్మే...' అంటారు. ఇలా ఎవరిని అడిగినా ఆమెపేరు చెప్పలేకపోతారు.

తన అస్తిత్వాన్ని కోల్పోయిన శారద, తిరిగి దానిని ఎలా పొందాలి అనే ప్రశ్నకు సమాధానంగా రచయిత్రి, శారదస్నేహితురాలు గురించి చెప్తూ "ఆ స్నేహితురాలు తనతోనే చదువుకుని తనలాగే పెళ్లిచేసుకొని, తనలాగే బతుకు ఇల్లలకడం కాకుండా, ఇల్లలకడం బతుకులో ఒక భాగంగా బతుకుతూ తన

పేరును, తన స్నేహితురాళ్ళ పేర్లను కూడా గుర్తుంచుకున్న వ్యక్తి" అని శారద స్నేహితురాలు గురించి వివరించారు. అంటే స్త్రీ కుటుంబం కోసం చేసేపని ఏద్దైనప్పటికీ ఆ పనే సర్వస్వంగా భావించకుండా, పని జీవితంలో ఒక భాగం మాత్రమేనని గ్రహించాలని రచయిత్రి తెలియచేశారు.

ఈ కథలో ప్రధానంగా చెప్పదల్చుకున్నదేమిటంటే - స్త్రీ తన జీవితంలో తన అస్తిత్వం కోల్పోకూడదు. అస్తిత్వం కోల్పోయిన మనిషి ఉన్నాలేనట్లే! అందువల్ల శారద కానీ మరొకరు కానీ జీవితంలో దేనికి ఎంత ప్రాధాన్యం ఇవ్వాలో అంతే ప్రాధాన్యం ఇవ్వాలి కాని ఇల్లలకడం, ముగ్గులుపెట్టడం, ఇంటిని అందంగా అలంకరించడం, భర్తని సంతోషపెట్టడం మొదలైన పనులే జీవిత పరమావధి కాదు. తమకూ ఒక జీవితం ఉంది. ఆ జీవితానికి ఒక విలువ వుందని గ్రహించి, తమ అస్తిత్వాన్ని నిలుపుకున్నప్పుడే ఆ జీవితాలకు ఒక గుర్తింపు విలువ ఉంటుందనే వాస్తవాన్ని ఈ కథ ద్వారా తెలియచేయడం జరిగింది.

## 3. 43. 7. (తొలి) నిర్ణయం:

కనకదుర్గ రాసిన (తొలి) నిర్ణయం కథలో ప్రధానపాత్ర అరుంధతి. ఈమె తన మరణాంతరం జరిగే కర్మకాండల విషయంలో తీసుకున్న నిర్ణయం ఈ కథలో ప్రధాన వస్తువు

ఈ కథలో అరుంధతికి 16 సంవత్సరాలవయసులో పెళ్లవుతుంది. అయిదు సంవత్సరాలు తిరిగేసరికి ముగ్గురు పిల్లలకి తల్లవుతుంది. తరువాత భర్త పరాయిస్త్రీల వ్యామోహంలోపడి ఆమెను పూర్తిగా మరచిపోతాడు.

అరుంధతి తన స్నేహితురాలయిన 'శాంత' మరణవార్త తెలిసి ఆమెను చివరిసారిగా చూడడానికి వెళ్తుంది శాంత శవంచుట్టూ బంధుమిత్రులంతాచేరి కన్నీరు కార్చడం చూసి, అరుంధతి ఆలోచనలో పడుతుంది. శాంతకు క్యాన్సర్ అని తెలిసినప్పుడు, తమకెక్కడ ఆ రోగం సోకుతుందో అనే భయంతో ఇంటిల్లిపాది ఆమెకు దూరం దూరంగా తిరిగి, తీరా ఆమె చనిపోయాక ఆమె శవాన్ని అమితంగా గౌరవిస్తూ అంత్యక్రియలు జరపడం అరుంధతికి అర్థంకాదు. అంతేకాక, తన కుటుంబసభ్యులు కూడా తను చనిపోయాక... లేనిప్రేమ చూపిస్తా రేమోనని ఆలోచిస్తుంది తన జీవితమంతా తల్లిదండ్రుల ఇష్టప్రకారం, భర్త ఇష్టప్రకారం, గడిచిపోయిందని గ్రహిస్తుంది ఇక చివరిగా, తన మరణాంతరం అయినా తన ఇష్టప్రకారం తన దేహానికి అంత్యక్రియలు జరగాలని భావించి, ఆ విధంగా వీలునామ రాయిస్తుంది ఇది ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం

(తొలి) నిర్ణయం కథ, కుటుంబవ్యవస్థలోని డొల్లును, స్త్రీ స్థానాన్ని శాంత మరియు అరుంధతి జీవితాల ద్వారా చక్కగా వివరించడం జరిగింది. మొదటిగా అరుంధతి జీవితాన్ని చూద్దాం.

అరుంధతికి పదహారు సంవర్సాల వయస్సప్పుడే కుటుంబ బరువుబాధ్యతలు నెత్తినపడతాయి 16 సంవత్సరాల వయస్సంటే అప్పుడప్పుడే బాల్యపు ఛాయలు తొలిగే దశ. ఆ దశలో ఒక గృహిణిగా బాధ్యతలు చేపట్టవలసి వస్తుంది తత్ఫలితంగా ఆమెలోని అందచందాలన్నీ అయిదు సంవత్సరాలకే హరించుకుపోయి భర్త నిరాదరణకు గురవుతుంది. భర్త రోజులతరబడి ఇంటికి రాకపోవడంతో కుంగిపోతుంది. దోషిలా కుళ్లికుళ్లి ఏడుస్తుంది ఈ సందర్భాన్ని గమనిస్తే తప్పుచేసింది భర్త గనుక అతను దోషి అవుతాడు. కాని భార్య తనను తాను దోషిగా భావించుకుంటుంది. ఎందుకంటే పురుషుడు ఎంత విచ్ఛల విడిగా తిరిగినా తప్పులేదని, పురుషుడు పరాయి పంచన చేరుతున్నాడంటే దానికి కారణం స్త్రీ చేతకాని తనమని, పురుషాధిపత్య భావజాలం బోధిస్తూ వచ్చింది. అందువల్లే ఈ కథలో అరుంధతి తనను తాను ముద్దాయిగా భావించుకుంటుంది.

ప్రతి స్త్రీ తన పెళ్లికి ముందో, పెళ్లికి తరువాతో చైతన్యవంతురాలై, తన అస్తిత్వాన్ని కాపాడుకునేప్రయత్నం చేయడం గమనించాం. కాని ఈ కథలో అరుంధతి వృద్ధాప్యంలో ఒక స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా జీవించాలని భావిస్తుంది అందుకుగాను ఆమెకున్న ఒకే ఒక్క అవకాశం 'మరణాంతరం తన ఇష్టప్రకారమే తనకు అంత్యక్రియలు జరగాలనే కోరికను తీర్చుకోవడం' ఈ కథలో గమనించదగ్గ అంశం.

### 3. 43. 8. పక్షులు:

ఈ కథ 1993 జాగృతి దీపావళి ప్రత్యేక సంచికలో వెలువడింది. రచయిత అనామకుడు. ఈ కథలో ప్రధానపాత్ర అమూల్య. ఆమె ఎం.ఏ రెండవ సంవత్సరం చదువుతున్నప్పుడు ఒక అబ్బాయిని ప్రేమిస్తుంది అతను ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు తల్లిదండ్రులకు ఇష్టంలేకపోయినా అమూల్య అతన్ని పెళ్లిచేసుకుంటుంది. అమూల్య పెళ్లి విషయంలో శ్రీమతి అనే లాయర్ మరియు ఆమె భర్త సహాయం చేస్తారు పెళ్లయిన రెండు సంవత్సరాలకు అమూల్యకు కొడుకు పుడతాడు. ఇక అప్పటి నుంచి వారి మధ్య గొడవలు మొదలవుతాయి. భర్త ఉద్యోగంలో తీరికలేకుండా అయిపోతాడు. అమూల్య కూడా ఉద్యోగస్తురాలు కావడంవల్ల అటు కుటుంబాన్ని, ఇటు ఉద్యోగాన్ని సమన్వయం చేయలేక ఇబ్బంది

పడుతుంది. ఈ ఒత్తిళ్లవల్ల ఇద్దరి మధ్య మనస్పర్థలు పెరిగి ఒకరినొకరు నిందించుకుంటారు. ఇక అలాంటి జీవనాన్ని కొనసాగించడం అసాధ్యమని భావించి అమూల్య, భర్త నుండి విడాకులు తీసుకుని తన కొడుకుతో కలసి జీవిస్తుంది కొంతకాలానికి అమూల్య తనకు నచ్చిన వ్యక్తితో జీవితాన్ని పంచుకోవడంతో కథ ముగిస్తుంది

**కథావిశ్లేషణ:**

ఈ కథలో కుటుంబవ్యవస్థలో ఉన్న లోటుపాట్లను వివరించడం జరిగింది. సాధారణంగా ప్రతి స్త్రీకి వివాహజీవితంలో ఎదురయ్యే సమస్యలను చిత్రించడం జరిగింది. అంతేకాక, వ్యక్తి తనకున్న స్వేచ్ఛను ఏ మేరకు ఉపయోగించుకోవాలి, మితిమీరిన స్వేచ్ఛ వల్ల సమాజ అభివృద్ధికి ఎదురయ్యే అవరోధం ఏమిటో వివరించడం జరిగింది. ఈ కథలో అమూల్య ఉన్నత చదువులు చదివిన అమ్మాయి. అంతేకాక, పరిణితి చెందిన వ్యక్తి, ప్రేమించి పెళ్లిచేసుకుంటుంది. లెక్చరర్ గా ఉద్యోగం చేస్తుంది కొంతకాలం వారి దాంపత్యం అన్యోన్యంగా సాగుతుంది. తీరా కొడుకు పుట్టాక, వారి మధ్య మనస్పర్థలు ఏర్పడతాయి. దీనికి కారణం అమూల్య ఉద్యోగాన్ని, కుటుంబాన్ని సమన్వయంచేసుకోలేకపోవడం.

అమూల్య ఎదుర్కొన్న సమస్యే నేటికాలంలో ఉద్యోగస్తులైన స్త్రీలు కూడా ఎదుర్కొంటూన్నారు. దీనివల్ల అనేక కుటుంబాలు విడిపోతున్నాయి. ఈ సమస్యకు సరైన పరిష్కారం పని విభజన జరగడం.

స్త్రీవాదులు లేవనెత్తిన అంశాలలో ఇది ఒకటి. పూర్వకాలం నుండి ఈ పనివిభజన అనేది వుంది. అయితే ఈ విభజనలో మార్పు రావాలి. పూర్వం ఇంటి పనులు స్త్రీలు, బయట పనులు పురుషులు చెయ్యాలి అనే విధానం ఉండేది. అయితే ఆధునిక కాలంలో స్త్రీలు కూడా పురుషులతో పాటు సమానంగా అన్ని రకాలైన బరువు, బాధ్యతలను నిర్వహిస్తున్నారు గనుక ఈ పనివిభజనలో, పని గంటల్లో మార్పు వచ్చినట్లయితే ఈ సమస్యను పరిష్కరించాడానికి అవకాశం ఉంటుంది.

ఈ కథలో అమూల్య, భర్తతో కలిసి జీవించడం అసాధ్యం అనుకున్నప్పుడు సులభంగా భర్తనుండి విడాకులు తీసుకుని, తన కొడుకుతో కలసి జీవిస్తుంది తద్వారా తన అస్తిత్వాన్ని కాపాడుకున్నట్లు తెలుస్తోంది అయితే ఈ సందర్భంలో అమూల్య కొడుకు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుంది. అతను తండ్రిలేని కొడుకుగా సమాజంలో జీవించవలసి వస్తుంది కాలక్రమంలో అతని ఆలోచనా విధానంలో అనేక రకాలైన మార్పులు చోటుచేసుకుని అతని ప్రవర్తనపై వాటి ప్రభావం వుంటుంది. ఒక సందర్భంలో అమూల్య ఇంటికి శ్రీమతి వెళ్తుంది ఇంటిదగ్గర దిగులుగా ఉన్న అమూల్య కొడుకుని ప్రశ్నించినప్పుడు వారిమధ్య ఈ విధంగా సంభాషణ సాగుతుంది.

శ్రీమతి: డాడీ ఇంటికి వస్తుంటారా?

అమూల్యకొడుకు: రారు. ఎప్పుడన్నా వస్తా రు

శ్రీమతి: నీతో ఆడుకోరా?

అమూల్యకొడుకు: డాడీకి నేనంటే ఇష్టంలేదు. అమ్మ కోసమే వస్తా రు నాతో మాట్లాడరు.

శ్రీమతి: నువ్వే మాట్లాడొచ్చుగా

అమూల్యకొడుకు: నాకు డాడీ ఇష్టంలేదు.

శ్రీమతి: ఎందుకని?

అమూల్యకొడుకు: డాడీ లేనప్పుడు అమ్మ నాతోనే ఉండేది. డాడీ వచ్చాక బయటకెళ్లిపోతుంది[35].

ఈ సంభాషణ ద్వారా అహల్య కొడుకుమనసు మనకు అర్థమవుతోంది. అందుకే రచయిత ఈ కథలో శ్రీమతి పాత్ర ద్వారా స్వేచ్ఛ గురించి చెప్తూ... 'ఎలా గుండాలన్నది ఎవరికి వాళ్ళు నిర్ణయించుకోవాల్సిందే. అయితే ఓ నిర్ణయం తీసుకునే ముందు దాని పర్యవసానాలు పూర్తిగా ఆలోచించుకోవాలి. మంచిచెడ్డల్ని బేరీజు వేసుకోవాలి. మనకేది కుదురుతుందో దాన్ని ఎన్నుకోవాలి' అని చెప్పించారు. దాన్నిబట్టి స్వేచ్ఛ అనేది ఒక ఆయుధం లాంటిదని, దాన్ని అవసరమైతే మేలుకి లేదా కీడుకి, అంటే... ప్రాణరక్షణకు, ప్రాణహానికి కూడా ఉపయోగించుకోవచ్చు. ఇక్కడ ప్రాణహాని అంటే వ్యక్తిగతంగా కాకుండా సమాజాభివృద్ధికి ఆటంకం అనే అర్థంలో అన్వయించుకోవచ్చు.

## 3. 43. 9. పనికి (రాని) సగం:

పి.శేషులత రాసిన పనికి (రాని) సగం అనే కథపేరులోనే స్త్రీలకు జరిగే అన్యాయాన్ని ఎత్తిచూపుతుంది ఏదైనా గౌరవం, మెప్పు, ఘనత లాంటి విషయాలొస్తే అవి పొందటానికి స్త్రీలను పనికిరాని సగంగా గుర్తిస్తా రు ఏదైనా పని చెయ్యవలసిన పరిస్థితి ఏర్పడితే ఆ పనులలో స్త్రీ పురుషులిద్దరికి సమభాగం పంచుతారు.

స్త్రీల విషయంలో జరుగుతున్న అన్యాయాలను, అణచివేతలను చెప్పడానికి రచయిత్రి ఇలాంటి శీర్షికను ఉపయోగించినట్లు తెలుస్తో ంది

ఈ కథలో ముకుందరావు, పార్వతి భార్యభర్తలు వీరిద్దరు, తమ పిల్లలు, రక్తసంబంధీకులు ఉన్నత స్థితికి రావడానికి ఎంతగానో శ్రమపడతారు. శ్రమకు తగ్గట్టు, అందరూ బాగా స్థిరపడతారు. ముకుందరావుకి షష్టిపూర్తి సన్మానం చెయ్యాలని కుటుంబ సభ్యులందరూ కలసి, ఆ కార్యక్రమం ఏర్పాటు చేస్తా రు అయితే ఆ కార్యక్రమంలో అందరు ముకుందరావు సేవలను గుర్తు ంచి ఆయన్ని

ప్రశంసిస్తారు పార్వతి ముకుందరావు సేవల్ని గుర్తుంచినట్టు తన సేవలకు గుర్తింపు లేకుండా పోవడంతో, ఆత్మపరిశీలన చేసుకుని, కుటుంబజీవితంలో తనని తాను ఏ విధంగా కోల్పోయిందో గ్రహించి, కనీసం తన కోడళ్లు అయినా తను చేసిన తప్పు చేయకూడదని, వాళ్లు తమకంటూ ఒక జీవితాన్ని ఏర్పరచుకోవాలని హితోపదేశం చెయ్యడం ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం

**కథావిశ్లేషణ:**

పనికి (రాని) సగం కథలోని వస్తువు చాలా వైవిధ్యంగా ఉంది. స్త్రీకి స్త్రీయే శత్రువని ముందే ఏర్పడిన భావన ఒకటి పురుషులు స్త్రీల హృదయాలలో బలంగా నాటారు. దీని వెనుక ఉన్న పితృస్వామ్య ప్రయోజనాన్ని స్త్రీలు గుర్తించలేక వాళ్లు స్త్రీల పై వేసిన ముద్రను అంగీకరిస్తూనే ఉన్నారు. కాని ఈ కథలో పార్వతి తన కోడళ్లతో చాలా అన్యోన్యంగా ఉంటుంది. వారి మధ్య ఎలాంటి గొడవలు ఉండవు. పార్వతి అత్తగా తన అధికారాన్ని కాక తల్లిలాంటి ప్రేమను చూపిస్తుంది

పార్వతి సంసారసాగరంలో మునిగిపోయి, ఏ విధంగా తన్నుతాను కోల్పోయిందో గ్రహించి, అలాంటి తప్పు చెయ్యొద్దని కోడళ్లకు జీవిత సత్యాన్ని తెలియజేస్తుంది అంతేకాక, మీకంటూ ఒక వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకోండి అని ఉపదేశిస్తుంది

సాహిత్యంలో ఇంతవరకూ అత్తకోడళ్ల సంబంధాన్ని ఈ విధంగా చిత్రించిన తీరు అరుదు. కాని ఈ కథలో అత్త, కోడళ్లు అనే వస్తువుని చాలా ఉన్నతంగా తీర్చిదిద్దడం జరిగింది. అత్తా, కోడళ్ల మధ్య ఉండవలసిన, అన్యోన్యతను వివరించడం జరిగింది.

## 3. 43. 10. బొమ్మలో చైతన్యం

ఈ కథ 'విసుర్రాయి' కథాసంపుటి నుండి తీసుకోవడం జరిగింది. రచయిత్రి ముదుగంటి సుజాతారెడ్డి. ఈ కథలో అలంకరణే జీవితం అనుకొని బ్రతికిన స్త్రీ తన భర్త పరాయి స్త్రీ వ్యామోహంలో పడిపోయాడని గ్రహించి, ఎలాంటి నిర్ణయం తీసుకుందో వివరించడమే దీనిలోని వస్తువు

**ఇతివృత్తం**

ఈ కథలో ప్రధాన పాత్రలు వరలక్ష్మి, ఆమె భర్త సత్యప్రసాద్. వరలక్ష్మి ఉన్నత కుటుంబంలో పుట్టడం వల్ల చిన్నప్పటి నుండి విలాసవంతమైన జీవితం కొనసాగిస్తుంది వివాహానంతరం కూడా వరలక్ష్మి

భర్త ఆమె ఏమి అడిగినా కాదనేవాడుకాదు.

వరలక్ష్మికి పెళ్లయిన కొంతకాలానికి ప్రసాద్ లో మార్పు గమనిస్తుంది ప్రసాద్ వరలక్ష్మి యెడల ముభావంగా వుండేవాడు. వ్యాపారం నిమిత్తం ఎప్పుడు వేరే వేరే ప్రాంతాలకు వెళుతుండేవాడు. కాలక్రమంలో వరలక్ష్మిలో జీవితం పట్ల అసంతృప్తి మొదలవుతుంది. ఉన్నట్టుండి బెంగళూరులో ఉన్న భర్త దగ్గరకి బయలుదేరుతుంది. తీరా అక్కడికి వెళ్లాక... భర్త మరో స్త్రీతో ఉండడం గమనిస్తుంది వెంటనే అక్కడ నుండి బయలుదేరి నేరుగా లాయరు దగ్గరకు వెళ్లి విడాకులు కోరడంతో కథ ముగుస్తుంది

**కథావిశ్లేషణ:**

ఈ కథలో వరలక్ష్మికి చిన్నప్పటి నుండి అలంకరణ యెడల, బట్టల యెడల విపరీతమైన ఆసక్తి వుండేది. ఉన్నత కుటుంబంలో జన్మించడం వల్ల ఎలాంటి లోటు లేకుండా పెరుగుతుంది. వివాహానంతరం భర్త కూడా వరలక్ష్మి అడిగింది కాదనకుండా కొనిపెట్టేవాడు. కొంతకాలానికి ప్రసాద్, వరలక్ష్మి యెడల అసంతృప్తి కలిగి ఉండడం గమనిస్తుంది ఆ సందర్భంలో ఆమె స్వగతంలో 'ఇదంతా ఏందబ్బ! (అనుకుంది బాధగా...) ముసలిదాన్నయ్యానా? నేను! అదేం లేదు. తన అందంలో లోటు లేదు. తన అలంకరణలో లోటు లేదు. తన కోరికలో లోపం లేదు. మరి ప్రసాద్ లో ఈ మార్పేంటి?... ' అని అనుకుంటుంది. ఇక అప్పటి నుండి ఆమెకు మనశ్శాంతి కరువవుతుంది. తనలో ఉన్న బాధనంతా తల్లికి చెప్తుంది దానికి సమాధానంగా తల్లి 'వరం! మగవాళ్లంతా అంతే! వ్యాపారం, డబ్బు సంపాదనలోపడి అట్లానే చేస్తారు' అదంతా పట్టించుకోకు... మగాళ్ల పరపతి, డాబు, దర్పం అంతా భార్యవల్లనే కదా బయటపడేది. అందుకే ప్రసాద్ నువ్వు అడిగినదల్లా కొనిపెట్టాలి. నువ్వు ఆ నగలు, బట్టలు అందంగా వేసుకొని నలుగురి ముందు తిరగాలి! అప్పుడే కదా అందరికీ తెలుస్తుంది ప్రసాద్ అంటే ఏమిటో? అని నవ్వుతుంది. తల్లి చెప్పిన సమాధానం గమనిస్తే పితృస్వామ్యం ఆలోచనాధోరణి మనకు తెలుస్తుంది

తల్లి మాటలు విన్న వరలక్ష్మి మరింత అయోమయానికి గురై, స్వగతంలో "తను ధరించే నగలు, బట్టలు అంతా అతని దర్పాన్ని ప్రదర్శించడానికా?! అందుకే నేను పుట్టినప్పటి నుంచి నన్ను వీళ్లంతా అలంకరిస్తున్నది దీని కోసమా?!" [36] అని అనుకుంటుంది. ఇక అప్పటి నుంచి తను వేసుకునే బట్టలు, అలంకరణ విలువలేనివిగా భావిస్తుంది

ఒకసారి వరలక్ష్మి బెంగళూరులో ఉన్న భర్త దగ్గరకు బయలుదేరుతుంది. తీరా వెళ్లాక, తన భర్త

వేరే స్త్రీ తో ఉండడం గమనిస్తుంది అప్పుడు తనలో తాను "ఇదేమిటి? తన భర్త మరో ఆడదానితోనా? ఎన్నడు ఊహించలేదు. ఆయన అటువంటి వాడు అని నేను అనుకోలేదు. నేను మరో మగాడితో మాట్లాడితేనే సహించలేని వ్యక్తి మరో స్త్రీతోనా?" అని అనుకుంటుంది. అంతేకాక తను ఇలాంటి పరిస్థితుల్లోనే ధైర్యంగా ఉండాలని, తనకు తాను ధైర్యం చెప్పుకుంటుంది. లాయరు దగ్గరకు వెళ్లి "నాకు విడాకులు కావాలి! అని అడుగుతుంది." దాంతో కథ ముగుస్తుంది

ఈ పరిస్థితిని పరిశీలిస్తే; ఒక స్త్రీ తన భర్త పరాయి స్త్రీ వ్యామోహంలో పడిపోయడని తెలిశాక ఆమె బాధ వర్ణనాతీతం. మానసికంగా బలహీనత కలిగిన స్త్రీ అయితే, ఆవేశంలో ఏదో ఒక అఘాయిత్యానికి పాల్పడుతుంది. కాని ఈ కథలో వరలక్ష్మిని ఉన్నత వ్యక్తిత్వం కలిగిన స్త్రీగా చిత్రీకరించడం జరిగింది. అందుకే తనకు ఎదురైన కష్టంలో ధైర్యంగా నిలబడింది. అంతవరకు నిర్జీవమైన బొమ్మలా ఉన్న వరలక్ష్మికి తన భర్త నిజస్వరూపం తెలియగానే ఇక అలాంటి వ్యక్తితో కలిసి ఉండలేనని గ్రహించి, విడాకుల కోసం ప్రయత్నిస్తుంది వరలక్ష్మి తన అస్తిత్వాన్ని కాపాడుకున్నట్లు తెలుస్తోంది.

## 3. 43. 11. బోన్సాయి బ్రతుకు:

అబ్బూరి ఛాయాదేవి రాసిన "బోన్సాయి బ్రతుకు" కథలో స్త్రీకి ఆర్థికస్వాతంత్ర్యం లేకపోతే ఆమె జీవితం ఎలా ఉంటుంది? స్త్రీ పురుషుల పెంపకంలో తేడాలు వల్ల స్త్రీకి జరిగే నష్టం ఏమిటో వివరించడం జరిగింది.

ఈ కథలో అక్క, చెల్లెల్ని చూడడానికి వెళుతుంది. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకున్న తరువాత ఇద్దరూ బాల్కనిలో కూర్చుని అనేక విషయాలు మాట్లాడుకుంటారు. వారి సంభాషణలో బోన్సాయి పద్ధతిలో పెంచే మొక్కల గురించి ప్రస్తావన వస్తుంది ఈ పద్ధతిలో మొక్కను కుండీల్లో పెంచుతారని, ఆ మొక్కల్ని చాలా జాగ్రత్తగా పెంచాలని, బోన్సాయి ఒక కళ అని... చెల్లి అక్కకు వివరిస్తుంది అక్క, చెల్లెలు చెప్పిన బోన్సాయి కళ గురించి విని అక్క మౌనంగా వుంటుంది.

బోన్సాయి పద్ధతిలో పెంచే మొక్కలు ఏ విధంగా అయితే ఇతరులకు నీడ ఇవ్వలేవో, అదే విధంగా ఆర్థికస్వాతంత్ర్యం లేని స్త్రీ జీవితం కూడా ఇతరులకు ఏ విధంగానూ ఉపయోగపడదని, స్త్రీ జీవితం బోన్సాయి మొక్కలా మారిపోవడం వెనుక ఉన్న ప్రధాన కారణం స్త్రీ పురుషుల పెంపకంలో ఉన్న అసమానత్వమేనని అక్క పాత్ర ద్వారా రచయిత్రి పాఠకులకు తెలియజేయడం ఈ కథలోని ప్రధాన

ఇతివృత్తం

**కథావిశ్లేషణ:**

"బోన్సాయి బ్రతుకు" కథను లోతుగా పరిశీలిస్తే పితృస్వామ్య వ్యవస్థ స్త్రీని ఏవిధంగా తన స్వార్థం కోసం ఎదగనీయకుండా చేస్తోందో అర్థమౌతుంది.

ఈ కథలో అక్క స్థానంలో ఉన్న అమ్మాయికి తన తల్లిదండ్రులు పెద్దగా చదువు చెప్పించరు. దీనికి ప్రధానంగా రెండు కారణాలను రచయిత్రి చూపిస్తారు.

1. ఆ నాటి సమాజపు ఆలోచన.
2. స్త్రీ పురుషుల మధ్య వున్న అసమానత్వం.

## 3. 43. 11. 1. ఆ కాలం నాటి సమాజపు ఆలోచన.

మొదటి కారణాన్ని గమనిస్తే ఆ కాలంలో అంటే దాదాపు 1970 ముందు కాలంలో స్త్రీకి 'చదువు అక్కరలేదు' అనే భావన ప్రజలలో బలంగా నాటుకొని ఉండేది. ఒకవేళ చదువు అవసరం అనుకుంటే అదీ చాకలి పద్దు రాయడం వస్తేచాలు అని భావించే వారు. ఈ 'చాకలిపద్దు రాయడం' వెనుక ఉన్న పితృస్వామ్య సమాజపు రాజకీయాన్ని రాజకీయం మనం అర్థం చేసుకోవచ్చు.

స్త్రీ అంటే ఒక గృహిణి మాత్రమే. ఆమె చక్కగా ఇంటి పనులతో పాటు కుంటుంబ సభ్యుల పనుల కూడా చేయాలి. చాకలికి బట్టలు ఉతకడానికి ఇస్తే ఆ బట్టల వివరాలన్నీ జాగ్రత్తగా రాసుకోవాలి. కనుక స్త్రీలకు ఆమాత్రం చదువు నేర్పిస్తే చాలని భావించేవారు.

## 3. 43. 11. 2. స్త్రీ పురుషుల మధ్య నెలకున్న అసమానత్వం:

స్త్రీ, పురుషుల మధ్యవున్న అసమానత్వం అనేది తరతరాలుగా స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యే. ఈ కథలో తండ్రి తన పెద్దకూతుర్ని చదువుమాన్పించి, కొడుకు చదువుపై ఎక్కువ శ్రద్ధ చూపడం గమనించాల్సిన విషయం. ఈ కథలో తండ్రి, తన పెద్ద కూతుర్ని చదువు మాన్పించడం వెనుక ఉన్న కారణాన్ని గమనిస్తే - తండ్రి అడిగిన నోటిలెక్కకి టక్కున సమాధానం చెప్పలేదని "ఆ, ఆడదానికి చదువెలా వస్తుంది?"[37] అంటూ చదువు మాన్పించెయ్యడం హాస్యాస్పదంగా కనిపిస్తుంది అంతేకాక కూతురు నోటిలెక్క చెప్పని సందర్భంలో తండ్రి నీచంగా మాట్లాడటం ఎంత మూర్ఖత్వమో అర్థమౌతుంది.

స్త్రీ , పురుషుల పెంపకంలో వున్న తేడాలవల్ల స్త్రీలు చదువుకు దూరమైపోతున్నారు. దానివల్ల ఆర్థికస్వతంత్రం లేకుండా పోతుంది. వీటి మొత్తం ఫలితం పెళ్లిమీద, సంసారజీవితంమీద పడుతోంది. అంటే చదువు లేకపోవడం వల్ల ఎవడో ఒకడికి కట్టబెట్టటం, ఆర్థికస్వాతంత్ర్యం లేకపోవడం వల్ల బతికినంతకాలం భర్త దగ్గర బానిసలా ఉంటూ, ప్రతి విషయానికి భర్తపై ఆధారపడి బతకవలసివస్తుంది

స్త్రీ , పురుషుల పెంపకంలో తేడాల వల్లే వాళ్ల మధ్యలో అన్నిరకాలైన అసమానతలు చోటుచేసుకుంటున్నాయి. సృష్టిలో ఆడ, మగ సమానమేనని ఇద్దరినీ సమానంగా పెంచాలని రచయిత్రి ఈ కథ ద్వారా తెలియజేసారు.

## 3. 43. 12. మురళీ వాళ్ళమ్మ:

రంగనాయకమ్మ రాసిన 'మురళీ వాళ్ళమ్మ' కథ స్త్రీ అస్తిత్వ చిత్రణలో భాగంగా వెలువడిన కథ. ఈ కథలో మురళీ వాళ్ళ అమ్మ పేరు రుక్మిణి. మురళీకి పదమూడు సంవత్సరాల వయస్సు వచ్చేనాటికి అతని తండ్రి వేరే స్త్రీతో అక్రమసంబంధం పెట్టుకుని మరో ఇంటిలో కాపురం పెడతాడు. ఈ విషయం తెలుసుకున్న రుక్మిణి, తన భర్తతో కలిసి ఉండలేక అతని నుండి విడిపోయి కొడుకుతో కలిసి విడిగా జీవిస్తూ ఉంటుంది. రుక్మిణి తన రెక్కల కష్టంతో మురళీని ప్రయోజకుణ్ణి చేస్తుంది మురళీ ఒక ఇంటివాడైన తరువాత, రుక్మిణీ ఒకప్పుడు భర్త చేత ఏ విధంగా అయితే మోసగించబడిందో, తరువాత అదేస్థితి తన కోడలికి వస్తుంది కొడుకు సంపాదన మీద ఆధారపడుతూ, ఆ అన్యాయాన్ని చూస్తూ 'మురళీ వాళ్ళ అమ్మ'లాగ ఉండలేక, తనొక వ్యక్తిత్వంగల మనిషిగా, 'రుక్మిణి'లా జీవించాలని నిర్ణయించుకోవడం ఈ కథలోని ఇతివృత్తం

**కథావిశ్లేషణ:**

మురళీ వాళ్ళమ్మ కథను పరిశీలిస్తే మనకు కొన్ని విషయాలు అవగతమవుతాయి. రుక్మిణి ఒకప్పుడు తన భర్తచేతిలో మోసపోయి ఇక అతనితో కలిసి జీవించలేకపోతుంది. అంతేకాక అతని భార్యలలో ఒక భార్యగా ఉండడం ఆమెకు ఇష్టం ఉండదు. అందుకే అతని నుండి విడిపోతుంది. ఒకప్పుడు బాగాబతికిన రుక్మిణి, భర్తనుండి వేరుపడిన తరువాత చాలా కష్టాలు అనుభవిస్తుంది చివరికి, ఒక స్కూల్లో 'ఆయా' గా కూడా పనిచేస్తుంది వాటన్నిటిని ఓప్పిగ్గా భరించి, కొడుకుని చదివించి ప్రయోజకుణ్ణి చేస్తుంది ఇంతటి కష్టాన్ని భరించడంవెనుక ఆమె ఆంతర్యం ఏమిటి అని ఆలోచిస్తే తన భర్తతో ఆ రొంపిలో ఉండలేక, అతని అక్రమసంబంధాన్ని సంహించలేక ఒక స్వతంత్రవ్యక్తిగా తన అస్తిత్వాన్ని కాపాడుకోవాలనే తపన ఆమెలో ఉన్నట్లు కనిపిస్తుంది

## 3. 43. 13. మోక్షం:

ముదిగంటి సుజాతారెడ్డి రాసిన మోక్షం కథలో స్వతంత్రభావాలు కలిగిన స్త్రీ తన భర్త పురుషాధిపత్యాన్ని ప్రదర్శిస్తు ంటే అలాంటి మనస్తత్వం కలిగిన వ్యక్తితో కలసి జీవించలేక, తన అస్తిత్వాని నిలుపుకునే ప్రయత్నం చేసిన ఒక ఇల్లాలి గాథే ఈ కథలోని వస్తు వు

ఈ కథలో రజని, శ్రీకాంత్ దంపతులు. రజని ఉద్యోగాన్ని చూసి శ్రీకాంత్ ఆమెను పెళ్లిచేసుకుంటాడు. వివాహానంతరం భార్య సంపాదన తనకు దక్కాలని, తనకు లోబడివుండాలని, ఆశిస్తా డు కాని రజని చదువు, ఉద్యోగం ఉన్న స్త్రీ కనుక అతని ఆటలు సాగనివ్వదు. ప్రతిరోజూ వారి మధ్య ఏదో ఒక గొడవ జరుగుతుండేది. ఒకరోజు జరిగిన గొడవలో శ్రీకాంత్ అహం దెబ్బతిని, తోక తొక్కిన పాములా కోపాన్ని ప్రదర్శిస్తూ దుర్భాషలాడతాడు. ఇక అలాంటి భర్తతో కలసి వుండలేక 'భార్యను ఒక మనసున్న మనిషిగా గుర్తించే సంస్కారం అలవడే వరకు' అతనికి దూరంగా జీవించాలని నిర్ణయించుకుంటుంది. భర్తకోసం తన అస్తిత్వాన్ని కోల్పోడానికి ఇష్టంలేక అతనికి దూరంగా జీవిస్తు ంది ఇది ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం

**కథావిశ్లేషణ:**

మోక్షం కథలో వస్తు వు చాలా ఆధునికమైనది. మనదేశంపై కర్మసిద్ధాంత ప్రభావం అధికంగా ఉంది. అంతేకాక దాన్ని నమ్మేవారి సంఖ్య కూడా అధికమే. సాధారణంగా స్త్రీలు తమకు ఏ కష్టం ఎదురైనా 'కర్మ' పేరుతో సర్దుకుపోతుంటారు. బాధను జీవితాంతం అయినా భరిస్తా రు కాని ఎదురుతిరగరు. కాని ఈ కథలోకి స్త్రీ ఆర్థిక స్వతంత్రం ఉండటం వల్ల భర్తచేసే ప్రతి తప్పుడు పనిని ప్రశ్నిస్తు ంది అది భర్తకు నచ్చక వారి మధ్య తరచు గొడవలు తలెత్తు తుంటాయి నాకెందుకులే అని ఆమె ఏ నాడు అనుకోలేదు. అతన్ని నిలదీస్తు ంది భర్తకున్న వ్యాపార మనస్తత్వాన్ని, డబ్బుపై అతనికి గల వ్యామోహాన్ని గుర్తెరిగి అతనితో జీవించడం అసాధ్యం అని భావిస్తు ంది అంతేకాక భర్త కోసం తన్ను తాను కోల్పోవడం ఇష్టంలేక, భర్తలో మార్పు వచ్చేవరకూ అతనికి దూరంగా జీవించాలని నిర్ణయించుకుని వేరే ఇల్లు వెతుక్కుంటుంది.

వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకొని జీవించడంలోనే నిజమైన సంతోషం, సుఖముందని ఈ కథ ద్వారా చెప్పడం జరిగింది.

## 3. 43. 14. యాష్ ట్రే:

చాగంటి తులసి రాసిన 'యాష్ ట్రే' కథ... మిగిలిన కథల కంటే కొంచెం భిన్నమైనది. జీవితపు మలిదశలో తన అస్తిత్వాన్ని నిలబెట్టుకోవాలా? లేదా జీవితంలో ఒకసారి మోసంచేసిన వ్యక్తిని తిరిగి తన జీవితంలోకి ఆహ్వానించాలా? అనే మీమాంస ఎదురైనప్పుడు ఆమె ఎలాంటి నిర్ణయాన్ని తీసుకొని తన అస్తిత్వాన్ని కాపాడుతుందో తెలియచేయడం ఈ కథలో ప్రధాన వస్తు వు

ఈ కథలో శేఖర్ ఒక అమ్మాయిని ప్రేమిస్తా డు కాని ఆ అమ్మాయివాళ్లు శేఖర్ ఆశించినంత కట్నం ఇవ్వరనే ఉద్దేశంతో డబ్బుకోసం వేరే అమ్మాయిని వివాహం చేసుకుని విదేశాలకు వెళ్లిపోతాడు. అయితే ఆ అమ్మాయి, తనను ప్రేమించిన వాడు మోసం చేసాడని కుంగిపోకుండా, జీవితంలో ఉన్నతదశకు చేరుకుంటుంది. ఒంటరిగానే జీవితాన్ని గడుపుతుంది. ఆమె మలిదశలో శేఖర్ వచ్చి, తన భార్య చనిపోయిందని, నా కొడుకు తల్లిలేనివాడు అయ్యాడని, వాడికి తల్లిగా తన జీవితంలోకి రమ్మని ఆహ్వానిస్తా డు అయితే ఆమె మారని మగవాళ్ల మనస్తత్వాన్ని గురించి ఆలోచిస్తూ అతని ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించి, తన అస్తిత్వాన్ని నిలుపుకోవడం ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం

**కథావిశ్లేషణ:**

'యాష్ ట్రే' కథలో ప్రధానంగా చర్చించవలసిన విషయాలు రెండు.

1. పురుష మనస్తత్వం
2. స్త్రీ మనస్తత్వం

## 3. 43. 14. 1. పురుష మనస్తత్వం:

ఈ కథలో శేఖర్ పాత్రద్వారా పితృస్వామ్యం పురుషులకు ఎలాంటి మనస్తత్వాన్ని అలవరిచిందో మనం అర్థంచేసుకోవచ్చు. పురుషుడు పుట్టినప్పటినుంచి చనిపోయే వరకు మహారాజులా భోగాన్ని అనుభవిస్తా డు ఈ దొంతర్ల సమాజం లో స్త్రీ అట్టడుగున వుంటూ తనకంటే పైనున్న పురుషుడికి దాస్యం చేస్తు ంది పురుషుడు ఎలాంటి ఆర్థిక నేపథ్యం కలిగివున్నప్పటికీ అతడు స్వార్థపరుడుగా ఉంటాడు. పురుషుడు అనుభవించే సుఖసంతోషాల వెనుక స్త్రీ శ్రమ, త్యాగం దర్శనమిస్తా యి ఆ స్త్రీ తల్లికావచ్చు చెల్లికావచ్చు లేదా భార్యకావచ్చు. పురుష స్వార్థానికి స్త్రీ బలైపోతుంది. 'యాష్ ట్రే' కథలో కూడా ఇలాగే జరిగింది.

శేఖర్, తను ప్రేమించిన అమ్మాయి ఇంటికి వస్తూ పోతూ ఉండేవాడు. ఆ అమ్మాయి అందించే

రుచికరమైన తేనీటిని సేవించి ఆనందించేవాడు. ఆమెను ప్రేయసిగా భావించి, జీవిస్తాడు వివాహసమయం వచ్చే నాటికి శేఖర్ మనస్తత్వం బయటపడుతుంది.

శేఖర్ అవకాశవాది. ఇంకోమాటలో చెప్పాలంటే 'గోడ మీద పిల్లి లాంటి వాడు'. ధనాశాపరుడు. అందుకే ప్రేమించిన అమ్మాయినిసైతం లెక్కచేయకుండా, డబ్బుకు అమ్ముడుపోతాడు.

శేఖర్ భార్య చనిపోయాక, తనచేతిలో మోసపోయిన అమ్మాయిని మళ్లీ తన జీవితంలోకి రమ్మని ఆహ్వానించడం వెనుక అతని స్వార్థపూరిత మనస్తత్వం బయటపడుతుంది.

## 3. 43. 14. 2. స్త్రీ మనస్తత్వం

స్త్రీని పితృస్వామ్య సమాజం వారి అవసరాలకనుగుణంగా నిర్వచించి, ఆ నిర్వచనాలకు లోబడివుండేటట్లు చేసింది. దీనికి నిదర్శనం శేఖర్ చేతిలో మోసపోయిన అమ్మాయే.

'క్షమయాధరిత్రీ' అంటూ స్త్రీకి భూదేవి అంత సహనం ఉండాలని మతగ్రంథాలు స్త్రీలకు ఉపదేశించాయి. ఈ ఉపదేశాలే ఈ కథలోని అమ్మాయికి శేఖర్ చేసిన మోసాన్ని భరించేటట్లు చేశాయా?! అనే సందేహం కలుగుతోంది.

స్త్రీ అంటే 'భోగవస్తువు' అని డబ్బు, హోదా, అధికారంతో పురుషుడు, స్త్రీని వశపరచుకోగలడని పితృస్వామ్యసమాజం భావిస్తుంది అయితే ఈ అభిప్రాయం తప్పని, స్త్రీకి కూడా ఒక మనసుంటుందని, ఆమె కొన్ని విలువలకు కట్టుబడివుంటుందని ఈ కథ ద్వారా రచయిత్రి తెలియజేయటం జరిగింది.

శేఖర్ వచ్చి, తన 'కొడుకు'కి తల్లిగా రమ్మని ఆ స్త్రీ ని ఆహ్వానించినప్పుడు ఆమె తిరస్కరిస్తుంది ఒకసారి మోసంచేసిన వ్యక్తి, తిరిగి ఆమెను కోరుకుంటున్నా, ఆమె ఎలాంటి బలహీనతలకు లొంగిపోదు. దీనిద్వారా ఆమె స్వతంత్ర వ్యక్తిత్వాన్ని, మనోధైర్యాన్ని రచయిత్రి చక్కగా వివరించారు.

## 3. 43. 15. రచయిత పెళ్ళాం:

వారాల కృష్ణమూర్తి రాసిన 'రచయిత పెళ్ళాం' కథలో ఒక మధ్యతరగతి యువతి, తనకు కాబోయే భర్త గురించి కన్నకలలన్నీ పెళ్లయిన తరువాత కలలుగానే మిగిలిపోవడమే గాక, భర్త నిజస్వరూపం తెలుసుకున్న తరువాత ఆమె ఏ విధంగా తన అస్తిత్వాన్ని నిలబెట్టుకుంది అనే అంశం ఈ కథలోని వస్తువు

ఈ కథలో అరుణ తండ్రి నానా అవస్థలుపడి కుటుంబ భవిష్యత్ అగాథంలో పడేసి అరుణ

కోరుకున్న ప్రభాకర్ తో పెళ్లిజరిపిస్తాడు పెళ్లికాక ముందు అరుణ, ప్రభాకర్ గురించి చాలా గొప్పగా ఊహించుకుంటుంది. తన భర్త రచయిత కనుక, భర్తతో పాటు తనకు కూడా గౌరవమర్యాదలు, సన్మానాలు జరుగుతాయని ఆశిస్తుంది తీరా పెళ్లయిన తరువాత, ప్రభాకర్ ఒట్టి డబ్బు మనిషని, వైవాహికజీవితానందాన్ని కూడా డబ్బుతో కొలవగలిగే సమర్థుడని, అతని దృష్టిలో స్త్రీ అంటే 'అలసిన తన శరీరానికి ఆనందాన్నిచ్చే ఒక సాధనం' అని గ్రహిస్తుంది అంతేకాక ప్రకాశ్ అనే వ్యక్తి ద్వారా తన భర్త రచనలు సమాజానికి పనికిరావని వాటిలో సామాజిక స్పృహ లేదని తెలుసుకుంటుంది. అలాంటి రచయిత కోసం తన జీవితాన్ని త్యాగంచెయ్యడానికి ఇష్టపడక, ఒక చిన్న ఉద్యోగం సంపాదించుకొని, భర్త నుండి వేరుగా జీవిస్తూ తన అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటుంది.

## 3. 43 .16. వ్యక్తిత్వం

ఇసుకపల్లి సుజాత రాసిన 'వ్యక్తిత్వం' కథలో మధ్యతరగతి యువతి, తనకు పెళ్లయ్యే సందర్భంలో అనుభవించే మానసికవ్యథను చిత్రించడం జరిగింది.

ఈ కథలో సుహాసిని పెళ్లికి ఎదిగిన అమ్మాయి. పెళ్లిచూపులకు వచ్చిన వారంతా సుహాసినికి ఉద్యోగం ఉంటేనే వివాహం చేసుకుంటామని అంటారు. దాంతో సుహాసినికి ఇష్టం లేకపోయినా, ఎంతో కష్టపడి ఉద్యోగం సంపాదిస్తుంది ఇక తన పెళ్లి కావడానికి ఎలాంటి అడ్డంకులు లేవని సంతోషిస్తుంది

సుహాసినికి ఉద్యోగం వచ్చిన తరువాత మదన్ అనే వ్యక్తితో పెళ్లిచూపులు జరుగుతాయి. మదన్ తల్లిదండ్రులకు సుహాసినికి సంబంధించిన అన్ని విషయాలు నచ్చుతాయి కాని ఆమె ఉద్యోగం చెయ్యడం మాత్రం వాళ్లకు నచ్చదు. సుహాసిని ఉద్యోగం మానేస్తానంటేనే వెంటనే ముహూర్తాలు పెట్టుకోవచ్చు అంటారు. దాంతో సుహాసిని తీవ్ర మనస్తాపానికి గురౌతుంది. కాబోయే భర్తకోసం తన వ్యక్తిత్వాన్ని, ఉద్యోగాన్ని వదులుకోనని తన మనసులో ఉన్న భావాలను స్పష్టంగా మదన్ తల్లిదండ్రులతో చెప్తుంది సుహాసిని మాటల్లో ఉన్న అంతరార్థాన్ని మదన్ గ్రహించి, తను కూడా ఇక ముందు సొంత వ్యక్తిత్వం గల వ్యక్తిగా జీవించాలని నిర్ణయించుకుంటాడు. మదన్ సుహాసినిని వివాహం చేసుకోవడంతో కథ ముగుస్తుంది ఇది ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం.

**కథావిశ్లేషణ:**

ఈ కథలో ప్రధానవస్తువు 'పెళ్లి చూపుల సందర్భంలో సుహాసిని ఎదుర్కొన్న మానసిక ఘర్షణ,

వ్యక్తిత్వానికి సంబంధించిన అస్తిత్వ సంఘర్షణ.'

ప్రతి స్త్రీ తన వివాహ సమయంలో ఏదో ఒక రకంగా అస్తిత్వ సంఘర్షణను ఎదుర్కొనక తప్పదు. అది ఉద్యోగానికి సంబంధించినది కావచ్చు లేదా వ్యకిత్వానికి సంబంధించినది కావచ్చు, లేదా ఆమె ఇష్టాయిష్టాలకు సంబంధించినది కావచ్చు.

ఈ కథలో సుహాసినికి ఉద్యోగం చెయ్యడం ఇష్టం వుండదు. కాని ఉద్యోగం ఉంటేగాని పెళ్లి అయ్యేటట్లు లేదని అనుభవపూర్వకంగా తెలుసుకుంటుంది. అందుకే కష్టపడి ఉద్యోగం తెచ్చుకుంటుంది. ఉద్యోగం వచ్చిన తరువాత వచ్చిన సంబంధం వాళ్లు, ఉద్యోగం చెయ్యకూడదంటారు. సుహాసిని తనకు పెళ్లికావడం కోసం ఉద్యోగం సంపాదిస్తే, తిరిగి పెళ్లికావడం కోసమే ఆ ఉద్యోగం వదులుకోవలసిన సందర్భం ఏర్పడుతుంది. ఈ సందర్భాన్ని గమనిస్తే స్త్రీ జీవితాన్ని స్త్రీయే జీవిస్తుందా? లేదా ఎవరైనా శాసిస్తూ వున్నారా? అనేది అర్థంకాని ప్రశ్నగా మిగిలిపోతుంది. అంటే స్త్రీ జీవితానికి సంబంధించి ప్రతి విషయం కూడా ఇతరులచేత నిర్ణయించబడుతోంది. స్త్రీకి కూడా సొంత వ్యక్తిత్వం సొంత ఇష్టాయిష్టాలు ఉంటాయని ఈ పితృస్వామ్య వ్యవస్థ గుర్తించకపోవడం శోచనీయం.

ఈ కథలో సుహాసిని తన వ్యక్తిత్వాన్ని లేదా ఉద్యోగస్తురాలిగా తన అస్తిత్వాన్ని వదులుకోవలసిన సందర్భం ఏర్పడినప్పుడు ప్రవర్తించిన తీరు ప్రశంసనీయంగా ఉంది. ఎప్పుడైతే మదన్ తల్లి 'ఉద్యోగం గనుక మానేస్తే వెంటనే ముహుర్తాలు పెట్టుకోవచ్చు' అంటుందో ఆ మాటలకు సుహాసిని మదన్ ని అనేక రకలుగా ప్రశ్నిస్తుంది చివరిగా "మీరు స్వతంత్రంగా వ్యవహరించగలరా? అలా వ్యవహరించే వాళ్లనే నేను చేసుకుంటానని" చాలా నిర్భయంగా చెప్తుంది సుహాసిని ధైర్యానికి మదన్ తల్లిదండ్రులు నిశ్చేష్టులైపోతారు.

సుహాసిని, మదన్ ని ప్రశ్నించినందుకు మదన్ తల్లి కోపంతో "ఏమిటమ్మాయ్ ఎంత ఉద్యోగం చేస్తున్నా, ఇంత తలబిరుసుదనం పనికిరాదు, మా వాడినే ప్రశ్నలు వేస్తున్నావా? అంటూ నిలదీస్తుంది దీనికి సమాధానంగా సుహాసిని ' క్షమించండి. ఉద్యోగం చేస్తున్నానని నాలో గర్వం యీషణ్మాత్రం కూడాలేదు... మీరు ఉద్యోగం చెయ్యమంటే చెయ్యలి, మానమంటే మానాలి అంతేగాని నాకంటూ ప్రత్యేకంగా నిర్ణయం తీసుకునే స్వాతంత్ర్యం లేదా? అమ్మయి సద్గుణవంతురాలు, అన్ని కళలలోనూ ఆరితేరినదై ఉండాలి అని మీరు అనుకున్నారు. ఆ విషయం నన్ను నిలదీసి అడిగారు. అదే విధంగా నేను కూడా నాకు కాబోయే వారు సకలవిద్యాభిరాముడై ఉండాలని నేను ఆశించడం తప్పా? కనీసం అందులో ఎన్ని వచ్చో తెలుసుకోవడం కూడా నేరమేనా? "[38] అని ప్రశ్నిస్తుంది

అంతేకాక సుహాసిని మాటలు మదన్ లో కొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయి అంతవరకు తల్లి

చెప్పుచేతల్లో ఉంటూ తన ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా సొంత వ్యక్తిత్వం లేని వ్యక్తిగా జీవించిన మదన్ తన గతాన్ని గురించి విచారపడి, ఇకముందైనా స్వతంత్ర వ్యక్తిత్వంతో జీవించాలనుకోవడం గమనించదగ్గ విషయం.

ఈ కథను సాధారణ దృష్టితో చూస్తే, అంటే పితృసమాజ కోణం నుండి చూస్తే, మదన్ వాళ్లు డిమాండ్ చేసినట్లు సుహాసిని ఉద్యోగం వదులుకుంటానని మాట ఇచ్చి, పెళ్లికి ముహుర్తా లు పెట్టుకోవాలి. కాని ఈ కథ ద్వారా స్త్రీలు సొంత వ్యక్తిత్వం కోసం పోరాటపడుతున్నట్లు స్పష్టమౌతుంది.

## 3. 43. 17. శివాని:

ఈ కథా రచయిత్రి జె. భాగ్యలక్ష్మి. దీనిలో శివాని ప్రధాన పాత్ర. శివాని చదువుకునే వయసులో తోటి విద్యార్థి ద్వారా ఎదురైన సమస్యలు, అవి ఆమెకు కలిగించిన క్షోభ, తద్వారా ఆమె అస్తిత్వం ప్రశ్నార్థకంగా మారటం ఈ కథలోని ప్రధాన ఇతివృత్తం

శివాని పద్దెనిమిదేళ్ల అమ్మాయి. గంగాధరం, సావిత్రి ఆమె తల్లిదండ్రులు. శివానిని డిగ్రీలో చేర్పిస్తా రు దాంతోపాటు కంప్యూటర్ స్పెషల్ కోర్సు చేస్తా నంటే చాలా ఫీజు కట్టి, ప్రైవేటు ఇన్ స్టిట్యూషన్లో చేర్పిస్తా రు అలా చేరినప్పటి నుండి ఆమెకు ఇబ్బందులు ఎదురౌతాయి.

శివాని ఇంటికి, ఎవరో ముక్కూముఖం తెలియని వ్యక్తు లు ఫోన్ చేసి లేకుండా 'శివాని కావాలి' అంటూ..., అసభ్యకరంగా మాట్లాడుతూ వెకిలిగా నవ్వేవారు. మీరు ఎవరు అని ప్రశ్నించినా, సమాధానం చెప్పేవారు కాదు. ఈ ఫోన్ కాల్సుతో విసిగిపోయిన శివాని తల్లిదండ్రుల్సు శివానిని నిలదీసి అడుగుతారు. దానికి ఆ అమ్మాయి, నాకు ఆ అబ్బాయిలతో ఎలాంటి స్నేహాలు లేవు. ఎదురుపడితే పలకరించడం తప్ప, అంతకుమించి ఎలాంటి పరిచయాలు లేవు అని చెప్తుంది నిజానికి ఆ ఫోన్లు ఎవరు చేస్తు న్నారో శివానికి కూడా తెలియదు. తనకు ఎదురైన ఈ వింత పరిస్థితికి తనలో తానే కుమిలిపోయేది.

శివాని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేస్తా రు ఫిర్యాదు చేసిన నాలుగు రోజులకు పోలీసు స్టేషను నుండి ఫోన్ వస్తుంది శివానిని వెంటబెట్టుకొని స్టేషన్ కు రమ్మని పోలీసు ఇన్ స్పెక్టర్ చెప్తా డు గంగాధరం శివానిని తీసుకొని పోలీస్ స్టేషన్ కు వెళతాడు. అక్కడున్న ఇన్ స్పెక్టర్ ఒక అబ్బాయిని చూపించి 'ఈ అబ్బాయి నీకు తెలుసా?' అని శివానిని అడుగుతాడు. శివాని కామేశ్ ని చూసి ఆశ్చర్యపోయి, తెలుసుననన్నట్లు తలూపుతుంది. అంతేకాక ఇతను నాతో పాటే కంప్యూటర్ ఇన్

స్టిట్యూషన్ లో కోర్సు నేర్చుకుంటున్నాడు అని చెప్తుంది ఇన్ స్పెక్టర్ గంగాధరంతో "వీడు మీ అమ్మాయి వివరాలు, ఫోన్ నెంబరు వెబ్ సైట్ లో ఇచ్చాడు. అందులో డిస్కోలు, డాన్సులు సరదా అయినట్లు, మరెన్నో హాబీలున్నట్లు, అబ్బాయిల కంపెనీ తనకు చాలా ఇష్టమని, ఇష్టమున్న వాళ్లు కాంటాక్టు చేయవచ్చని రాశాడు. దానితో రకరకాలవాళ్లు, సమయంకాని సమయంలో ఫోన్లు చెయ్యడం ప్రారంభించారు"[39] అని వివరిస్తాడు

ఈ విషయం విన్న గంగాధరానికి పట్టరాని కోపం వస్తుంది అతణ్ణి కొట్టడానికన్నట్లు పైకి లేస్తాడు ఇన్ స్పెక్టర్ అతన్ని వారించి 'వీడి సంగతి మేము చూసుకుంటాం. మీరేమి బాధపడవద్దు. వీడి తల్లిదండ్రులకు కూడా కబురు పంపాం ' అని తెలియజేస్తాడు ఈ లోపే కామేశ్ తల్లిదండ్రులు వచ్చి విషయం తెలుసుకొని, కామేశ్ చెంపలు వాయిస్తారు కేసు పెడితే కామేశ్ జీవితం నాశనమౌతుందని, దయతో క్షమించమని గంగాధరాన్ని వేడుకుంటారు. కామేశ్ కూడా వారికి క్షమాపణలు చెప్పడంతో, కేసు లేకుండానే అతను పోలీసు స్టేషను నుండి బయట పడడంతో కథ ముగుస్తుంది.

**కథావిశ్లేషణ:**

ఈ కథను పరిశీలిస్తే స్త్రీ అస్తిత్వం వెనుక అడుగడుగునా పురుషుని హస్తం కనిపిస్తుంది మరో మాటలో చెప్పాలంటే స్త్రీ అస్తిత్వాన్ని పురుషుడే శాసిస్తున్నట్లు స్పష్టమౌతుంది. స్త్రీకి తన జీవితంతో ఉన్న ప్రమేయం కంటే , పురుషుడి ప్రమేయమే స్త్రీ జీవితాన్ని ఏలుబడి చేస్తున్నట్లు స్పష్టమౌతుంది.

ఈ కథలో కామేశ్ తన ఆకతాయితనంతో శివానికి మానసిక క్షోభ కలుగజేస్తాడు శివాని తల్లిదండ్రులు విద్యావంతులు కావడం వల్ల ఆమెను ఏవిధంగాను మాటలతో హింసించకుండా, తిరిగి చదువు కొనసాగించడానికి అనుమతిస్తారు శివాని తల్లిదండ్రుల స్థానంలో నిరక్ష్యరాస్యులైన తల్లిదండ్రులు గనుక ఉండి ఉంటే, ఇక అప్పటితో శివాని చదువుకి చరమగీతం పాడేవారు. నేటి సమాజంలో ఇలాంటి సందర్భాలు అనేకం జరుగుతున్నాయి.

నేర్చుకున్న విద్యను సరియైన మార్గంలో ఉపయోగించి, పురోభివృద్ధి సాధించాలి కాని అక్రమమార్గంలో దుర్వినియోగపరచరాదనీ రచయిత ఈ కథ ద్వారా తెలియజేయడం జరిగింది.

## 3. 43. 18. శీలమా? అదియేమి?

ఈ కథ ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో 21 జూన్ 1985లో వెలువడింది. రచయిత అనామకుడు (రామశాస్త్రి). ఈ కథలో స్త్రీ అస్తిత్వాన్ని నిర్ణయించే అంశాల్లో అత్యంత ప్రధానమైన శీలాన్ని గురించి, 'పవిత్రత' భావం వెనుక గల నేపథ్యాన్ని గురించి వివరించడం జరిగింది.

**ఇతివృత్తం**

ఈ కథలో రామచంద్రుడు, జానకి భార్యాభర్తలు. వారి కొడుకు రంగనాథం. రామచంద్రుని చెల్లెలు విశాలాక్షి. రామచంద్రుని కుటుంబం ఆధునిక భావాలు కలిగిన కుటుంబం. రామచంద్రుని ఇంటికి ఎవరు వచ్చిన విశాలాక్షి వారితో మాట్లాడి, విషయం కనుక్కునేది. రంగనాథం పనిచేసే కళాశాలలో ఆంగ్లోపన్యాసకుడైన విశ్వనాథం, రంగనాథంతో చాలా సన్నిహితంగా ఉండేవాడు. వారి మధ్య గురుశిష్యుల సంబంధం కన్నా స్నేహబంధమే ఎక్కువ. అందుకే తరచు రంగనాథంఇంటికి వస్తు పోతూ ఉండేవాడు. క్రమక్రమంగా విశాలాక్షితో అతనికి అనుబంధం ఏర్పడుతుంది. విశ్వనాథం, విశాలాక్షి అనేక పుస్తకాలు గురించి, చలనచిత్రాల గురించి మాట్లాడుకునేవారు. విశ్వనాథం విశాలాక్షిని వివాహం చేసుకోవాలని నిర్ణయించుకుంటాడు. దానికి ఇరు కుటుంబాలవారు అంగీకరిస్తా రు

విశాలాక్షి ఒకరోజు రాత్రి బయట నుండి ఇంటికి వస్తు న్న సమయంలో, ఎవరో ఒక వ్యక్తి ఆమెను బలత్కరిస్తా డు విశాలాక్షి అవమానంతో కుంగిపోయి, ఇంటికి వచ్చి ఆత్మహత్యాయత్నం చేస్తు ంది అది చూసిన జానకి, ఆమెను రక్షిస్తు ంది విషయం తెలుసుకున్న రంగనాథం ఇక తన చెల్లెల్ని విశ్వనాథం వివాహం చేసుకోడని భావిస్తా డు ఈ సంఘటన జరిగిన మరుసటిరోజు విశ్వనాథం, రంగనాథం ఇంటికి వస్తా డు ఇంటిల్లిపాది విచారంగా ఉండడం గమనించి, కారణం అడుగుతాడు. వాళ్లంతా ఏదో కారణం చెప్పి అతణ్ణి పంపిస్తా రు కాని, విశ్వనాథానికి నమ్మబుద్ధి కాదు. చివరికి విషయం తెలుసుకుంటాడు. జరిగిన సంఘటనలో విశాలాక్షి ప్రమేయం లేదు గనుక విశాలాక్షిని నేను వివాహం చేసుకుంటానని చెప్పి, వారికి ధైర్యాన్నిస్తా డు అంతేకాక, అసలు శీలం అంటే ఏమిటి ? పవిత్రత నేపథ్యం ఏమిటో వివరించడంతో కథ ముగుస్తు ంది

**కథావిశ్లేషణ**

ఈ కథలో స్త్రీ శీలాన్ని గురించి, పవిత్రత అనే భావాన్ని గురించి విశ్లేషనాత్మకంగా వివరించబడింది. అంతేకాక నిజమైన ప్రగతి అంటే ఏమిటో కూడా వివరించబడింది. విశాలాక్షి అత్యాచారానికి గురైన తరువాత ఆమె అపరాధభావనతో కుంగిపోతున్న సమయంలో రంగనాథం వచ్చి

ఆమెతో 'మనిషి ఆహారం కొరకు వేటమాని ఆహారోత్పత్తి చేయుట మొదలిడిన తరువాత ఆస్తి వ్యవహారాలు వచ్చినవి. పితృస్వామ్యవ్యవస్థ స్థానంలో మాతృస్వామ్యవ్యవస్థ వచ్చెను. తండ్రిఆస్తి కొడుకునకు రాసాగెను. తనఆస్తి తన కొడుకునకే చెందవలయునన్న తండ్రికోరిక కారణమున భార్యకి ఎన్నో కట్టుబాట్లు వచ్చెను. ఆ కుటుంబ వ్యవస్థ పటిష్టపరుచుటకే స్త్రీకి శీలమును ఆభరణము తొడగబడెను' అని చెప్పెను. ఈ మాటలను బట్టి పితృస్వామ్యవ్యవస్థను పటిష్టపరచటానికి స్త్రీకి "శీలం", "పవిత్రత" అనే ముసుగు తొడగబడినట్టు స్పష్టమవుతుంది. అంతేకాక ఒక స్త్రీని పురుషుడు బలత్కారించినపుడు ఆమె తన శీలం పోగొట్టుకున్నట్టు కాదు అని చెప్పడానికి రంగనాథం ఈ విధంగా అంటాడు. 'ఒక స్త్రీ ఒక పురుషుని ప్రేమించినదనుకొనుము. ఆమెను ఆమెతండ్రి ఏదో కారణమున వేరొక పురుషునికిచ్చి పెండ్లి చేసెననుకొనుము. వారిరువురి సంసారము సాగుచున్నది. ఆమెకాసంసారము చేయుట కొంచెమైన ఇష్టంలేదు. ఆమె పోగొట్టుకున్నది ఏవి? "సుఖము", "సంతోషము", "ఆనందము," "శీలము" పోయినదా? "శీలమెట్లుపోవును"... బలత్కారంవల్ల మరేదియో పోయినది అని బాధపడుటకర్థంలేదు'. ఈ మాటలను గమనించినట్లయితే "శీలం" అనేది మనసుకి సంబంధించినది కానీ శరీరానికి సంబంధించినది కాదు అనే విషయాన్ని రచయిత తెలియజేశారు.

ఈ కథ చివరిలో విశ్వనాథం, ప్రగతి గురించి చెపుతూ... "వాడెవ్వడో నిన్ను బలత్కరించెను. పోలీసులకు తెలుపుటకు ఎందుకు సిగ్గుపడుతున్నావు? నలుగురు నిన్నుచూసి నవ్వెదరా? అటుల నవ్విన వారితో నీకు పని ఏమి? వారు నిన్ను చూసి నవ్వుట కాదు. నువ్వే వారిని చూసి అసహ్యించుకోవలెను. సంఘమేమి ప్రగతి సాధించుటకు, సాధించునది మనము. మనమిటుల కూర్చున్నంత కాలమిది ఇటుల సాగుచునే ఉండును. కాళ్ళకి ఎత్తు మడమలు చెప్పులు, పెదాలకు ఎర్రని రంగులు ప్రగతి కాదు. ప్రగతి ఆలోచనలో రావలెను, ఆచరణలో రావలెను"[40] అని విశాలాక్షితో అంటాడు. ఈ కథలో స్త్రీ శీలం గురించి దాని నేపథ్యాన్ని గురించి విశ్లేషనాత్మకంగా చెప్పడం బావుంది.

### 3. 43. 19. సత్యపాలన:

ఈ కథ 3 జూన్ 1998న ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రికలో వెలువడింది. రచయిత సింహప్రసాద్. ఈ కథలో ఒక స్త్రీ తన రాజకీయ అధికారాన్ని సద్వినియోగం చేసుకోవడానికిగాను అడ్డుగావున్నవ్యక్తులతో సంఘర్షించి, విజయం సాధించడం దీనిలోని ప్రధాన వస్తువు

**ఇతివృత్తం**

ఈ కథలో సత్య, రాజశేఖరం ప్రధాన పాత్రలు. వారిరువురు భార్యాభర్తలు ఒక సంవత్సరం మున్సిపాలిటి ఛైర్ పర్సన్ పదవిని మహిళలకు కేటాయించడం జరుగుతుంది. రాజశేఖరం బాగా రాజకీయం తెలిసిన వ్యక్తి కావున, తన భార్యను ఆ పదవికి పోటీ చెయ్యిస్తాడు వారికున్న పలుకుబడితో మున్సిపల్ ఛైర్ పర్సన్ గా అతని భార్య అయిన సత్య ఎన్నికవుతుంది. పేరుకు సత్య ఛైర్ పర్సన్. కాని దానికి సంబంధించిన వ్యవహారాలన్నీ భర్తే చూసుకుంటాడు. సత్య విద్యావంతురాలు. కావున ఈ విధానం ఆమెకు నచ్చదు. వారిద్దరికి ఈ విషయంలో ఎంతో గొడవ జరుగుతుంది. సత్య తన అధికారంతో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేనని గ్రహించి, భర్త చేసే ప్రజావ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకోలేక ఒక ఉపాయం ఆలోచిస్తుంది దాని ప్రకారం, మీడియా వారందరిని పిలిపించి, రాజీనామా చేయబోతున్నానని ప్రకటిస్తుంది ఆ ప్రకటన విని భర్త, మామగారు విస్తుపోతారు వారు ఇక చేసేది లేక, నీ దారికి మేము అడ్డురాము. నీ ఇష్టప్రకారం పరిపాలన కొనసాగించు అని చెప్పడంతో, సత్య సంతోషించి, తను అనుకున్న రీతిలో ప్రజాప్రయోజన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడంతో కథ ముగుస్తుంది

**కథావిశ్లేషణ**

ఈ కథ, నేటి కాలంలో జరుగుతున్న "మహిళా రిజర్వేషన్ల పనితీరును" కళ్లకు కట్టినట్లు చూపించింది. భారత ప్రభుత్వం స్త్రీల అభివృద్ధి కోసం, వారిని చైతన్యవంతుల్ని చేయడం కోసం మహిళా రిజర్వేషన్లను ప్రవేశపెట్టడం జరిగింది. అయితే అది ఎంతవరకు సఫలమవుతోంది అనే విషయం మాత్రం ప్రశ్నార్థకం.

ఈ కథలో విద్యావంతురాలయిన సత్య, మున్సిపల్ ఛైర్ పర్సన్ పదవికి పోటీ చేసి, ప్రజలవద్దకు వెళ్లి, తాను అనేక ప్రజాప్రయోజన కార్యక్రమాలను చేపడతానని, ప్రజల సమస్యలను తీరుస్తానని వాగ్దానం చేస్తుంది తీరా ఎన్నికల్లో గెలిచిన తరువాత ఏమీ చెయ్యలేని పరిస్థితి ఏర్పడుతుంది. సత్యను ఒక ఆటబొమ్మగా భావించి, ఆ పదవికి సంబంధించిన అధికారాలన్ని రాజశేఖరే నిర్వహిస్తాడు ఆ క్రమంలో అనేక మంది కాంట్రాక్టర్లతో ఒప్పందం చేసుకుని, అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదిస్తూ ఉంటాడు.

సత్య తనభర్త చేసే అన్యాలను ఎదిరించి, తనదైన విధానంలో పరిపాలన చెయ్యడానికి పూనుకొనే

క్రమంలో భర్త ద్వారా, మామ ద్వారా అనేక అవమానాలు పొందుతుంది. ఒక సందర్భంలో భర్త తన కింద వాళ్లతో లాలూచీ పడినట్లు తెలుసుకొని అతన్ని ఈ విధంగా ప్రశ్నిస్తుంది

"నాకు తెలియకుండా మీరు కమీషనర్ తో ఒప్పందానికొచ్చారా?" అని సూటిగా ప్రశ్నిస్తుంది దానికి అతను "చూడు సత్యా! రాజకీయాల గురించి నీకు ఓనమాలు తెలీవు, నిన్నగాక మొన్న కళ్ళు తెరిచిన పిల్లకాకివి. మా డాడీ పలుకుబడితో, మేం విరజిమ్మిన డబ్బుతో ఎన్నికైన మున్సిపల్ ఛైర్ పర్సన్ వి! అప్పుడే స్వంత గొంతుతో మాట్లాడేదాకా వచ్చావన్నమాట. అసలు నీ గురించి నువ్వేమనుకుంటున్నావ్? నువ్వేమైన ఇంధిరాగాంధీననుకుంటున్నావా? మరింకేం తర్కించక నేను చెప్పినట్టు నడుచుకో. అంతకంటే ఎక్కువగా పెత్తనం చెలాయించాలని కలలుగనకు అని అంటాడు. ఈ మాటలకు సత్య "మౌనంగా మీ పలుకే పలకడానికి నేనేం చిలుకని కాదు" అని అంటుంది. భర్త "ఇంక తగ్గు ఊరికే రెచ్చిపోకు. నువ్వు నా భార్యవనీ నేనాడమన్నట్లల్లా ఆడాల్సిన బొమ్మవనీ మరచిపోకు. నేను గీచిన గీటు దాటాలని చూశావో మర్యాద దక్కదు. ఏదో ఈ సీటు మహిళలకి రిజర్వు చేయబట్టి నిన్ను కూర్చీలో కుర్చోబెట్టాం. అంతే మేం చెప్పినట్టు నడుచుకుంటూ, పట్టుచీర కట్టుకొని సభలకీ, సన్మానాలకీ గెస్ట్ గా వెళ్ళడమే నీ పని"[41] అంటాడు.

ఈ మాటలను గమనిస్తే అతనిలో ఉన్న పురుషాహంకారం, అధికార దాహం కనిపిస్తుంది అందుకే సత్యతో అంత ధైర్యంగా మాట్లాడగలిగాడు. ఇలాంటి పరిస్థితి ఒక్క సత్యకే కాకుండా, నేటి కాలంలో రాజకీయ పదవుల్లో వున్న ప్రతి స్త్రీ ఎదుర్కొంటుందనడం అతిశయోక్తి కాదు.

మరొక సంధ్భంలో సత్య, తన భర్తతో "మమ్మల్ని అడ్డంపెట్టుకొని మీరు రాజ్యం ఏలేట్టయితే ఇక తమ రిజర్వేషనిచ్చి ప్రయోజనమేంటి?" అని అడుగుతుంది. దానికి అతను "అది కంటితడుపు చర్య. మీ ఓటు కోసం విసిరిన మాంసం ముక్క, అంతేతప్ప నిజంగా మీ ఆడవాళ్ళకి అధికారం ఇచ్చేసి మేం గాజులు తొడుక్కొని కూర్చుందామని కాదు"[42] అని హేళనగా మాట్లాడతాడు.

ఈ మాటలు గమనిస్తే అతని ప్రవృత్తి తెలుస్తోంది మహిళారిజర్వేషన్ల గురించి అనేక మందిలో ఇలాంటి అభిప్రాయమే ఉంది. అందుకే రాజకీయంలో ఉన్న స్త్రీలను కీలుబొమ్మలుగా భావించడం జరుగుతోంది. ప్రజల్లో కూడా ఇదే అభిప్రాయం వుండటంవల్ల మహిళారిజర్వేషన్ల అమలు, పనితీరు అంతగా విజయం సాధించడంలేదని చెప్పవచ్చు.

సత్య తనకు ఎదురైన క్లిష్టపరిస్థితి నుండి బయటపడడానికి ఒక ఉపాయం ఆలోచిస్తుంది తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు అన్ని పత్రికలకి ఫోన్ చేసి చెప్తుంది కారణమేమిటని అడిగినా చెప్పదు. ఆ వార్త విని రాజశేఖర్ భయపడతాడు. కాంట్రాక్టర్లంతా రాజశేఖర్ మీద ఒత్తిడితెస్తారు రాజశేఖర్ సత్యతో

"ఇలాంటి పిచ్చి పనులు చెయ్యకు" అంటాడు. దీనికి సత్య "రెండింటికీ న్యాయం చెయ్యలేకపోతున్నాను. అందుకే ఇల్లాలిగానే మిగిలిపోదామనుకుంటున్నాను" అని చెప్తుంది ఆ సందర్భంలో వారిమధ్య ఈ విధంగా సంభాషణ జరుగుతుంది.

రాజశేఖర్: మన అధికారం, మన పరువు రాబడీ అన్నీ పోయినా సరే రిజైన్ చేస్తా నంటావా!

సత్య: తోలుబొమ్మను కాదు కదా అందుకే అలాంటి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది.

రాజశేఖర్: అబ్బో రక్తమాంసాలున్న బొమ్మ బయలుదేరిందండి. మొగుడి మాట ఖాతరుచెయ్యదు గాని ఊరిని ఉద్ధరిస్తుందట!

సత్య: మీరెన్ని చెప్పినా, తిట్టినా సరే, నా నిర్ణయం మారదు. నాకిష్టంలేని పాత్ర నేను ధరించలేను దట్సాల్"[43].

సత్య మాట్లాడిన మాటలకు రాజశేఖర్ బిత్తరపోతాడు మామగారు కూడా ఇక ఏమీచెయ్యలేక "నువ్వు రాజీనామా చెయ్యక్కర్లేదు సత్య. ఇక నేనుగాని, అబ్బాయిగాని నీ దారికి అడ్డురాము. నీకేది మంచి అనిపిస్తే అది చెయ్యి. నువ్వేమిటో నీ సత్తా ఏమిటో రుజువు చేసుకో" అంటాడు. ఆ మాటలకు సత్య ఆనందపడుతుంది. కొత్త ఉత్తేజం ఆమెలో ప్రవేశించి, స్వేచ్ఛగా మున్సిపల్ ఆఫీసుకి బయలుదేరుతుంది. ఈ కథలో సత్య తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడి గెలిచిన స్త్రీగా కనబడుతుంది.

## 3. 43. 20. సూపర్ మామ్ సిండ్రోమ్:

పి. సత్యవతి రాసిన "సూపర్ మామ్ సిండ్రోమ్" కథ స్త్రీ అస్తిత్వానికి సంబంధించి మౌళికప్రశ్నల్ని రేకెత్తించిన కథ. ఈ కథ 1998లో వెలువడింది. ఈ కథలో ముఖ్యపాత్ర అనురాధ. ఈమె తన కుటుంబాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దే క్రమంలో ఏ విధంగా తన అస్తిత్వాన్ని కోల్పోయిందో దీనిలో వివరించడం జరిగింది.

### ఇతివృత్తం

"సూపర్ మామ్ సిండ్రోమ్" కథలో అనురాధ, సూర్యారావు భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగస్తులే వారి కూతురు రజిని. వారు తమ కుమార్తె భవిష్యత్ కోసం ఎంతగానో శ్రమిస్తారు అంతేకాక దేనికెంత డబ్బు ఖర్చుపెట్టాలో ముందే నిర్ణయించుకుని అన్ని విషయాల్లో చాలా ప్రణాళికాబద్ధంగా జీవితాన్ని గడుపుతుంటారు. అనురాధ చురుకుదనం, చాకచక్యం, నేర్పుకలిగిన స్త్రీ. తద్వారా అందరి మన్ననలను పొందుతుంది.

ఒకరోజు ఉదయం తొమ్మిది గంటలైనా అనురాధ నిద్రలేవదు. భర్తకు అనుమానంవచ్చి వెళ్లి చూసేసరికి ఆమె చనిపోయివుంటుంది. అంతకు ముందురోజువరకూ ఆరోగ్యంగా వున్న అనురాధ ఎందుకు చనిపోయిందో ఎవరికీ అంతుపట్టదు. ఆమె "సూపర్ మామ్ సిండ్రోమ్" అనే జబ్బువల్ల (అంటే జీవిత ధ్యేయమంతా కుటుంబాన్ని ఉన్నతస్థాయిలో నిలబెట్టాలని, తద్వారా అందరి దృష్టిలో గొప్పపేరు తెచ్చుకోవాలనుకోవడం) చనిపోయిందని ఫేథాలజీ ప్రొఫెసర్ ప్రకాశరావు తేల్చిచెప్తాడు. అనురాధ తన కుటుంబాన్ని ఉన్నతస్థాయిలో నిలబెట్టే క్రమంలో తనను తాను కోల్పోతూ వస్తుంది చివరికి తన శరీరంలో వున్న అవయవాలను కూడా కోల్పోయింది అని ప్రకాశరావు వివరించడంతో కథ ముగుస్తుంది

**కథావిశ్లేషణ:**

ఈ కథ అధివాస్తవిక ధోరణిలో సాగుతుంది. స్త్రీ అస్తిత్వానికి సంబంధించిన అనేక ప్రశ్నల్ని మనముందు వుంచింది. వాటిలో ప్రధానంగా స్త్రీలు ఎలాంటి పరిస్థితుల్లో తమ అస్తిత్వం కోల్పోతున్నారు? వాటికిగల కారణాలేమిటి ?... మొదలైన అంశాలను వివరిస్తుంది

మొదటిగా ఎలాంటి పరిస్థితుల్లో స్త్రీలు తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నారో చూద్దాం!

ప్రముఖ అస్తిత్వవాది అయిన సాత్రే వివరించిన మూడు పొరల్లో, మూడవ పొర అయిన 'ఇతరుల కోసం తాను' అనే పొరలో స్త్రీ తన అస్తిత్వాన్ని కోల్పోవడం మనం గమనించవచ్చు. ఈ కథలో కుటుంబం కోసం ఆమె తన అస్తిత్వాన్ని కోల్పోయిందని చెప్పవచ్చు.

పితృస్వామ్య వ్యవస్థ స్త్రీ అంటే ఓర్పు, త్యాగం, నిరంతరశ్రమ, ప్రేమ... మొదలైన లక్షణాలు ఉండాలని, అలా ఉన్న స్త్రీ మాత్రమే ఉత్తమురాలని అవి లేనటువంటి స్త్రీని పొగరుబోతని, గర్విష్టురాలని, తలబిరుసు అని... ఇలా రకరకాలైన పేర్లతో దూషించడం జరుగుతుంది. పితృస్వామ్యసమాజం స్త్రీలను తమకు అనుకూలంగా తయారుచేయడం జరిగింది. దీని ఫలితమే అనురాధ కుటుంబం కోసం తన సర్వస్వాన్ని త్యాగం చేయడానికి కారణం.

ఈ కథలో ఒక సంసందర్భంలో అనురాధ భర్త ఆమె గురించి చెప్తూ "పాలు తెచ్చే వ్యక్తి ఈ మధ్య ప్యాకెట్టుకు పదిరూపాయలు చేసిం దగ్గరనుంచి అనురాధ మోర్నింగ్ వాక్ మొదలుపెట్టింది. అవసరార్థం బండి కొన్నప్పటినుంచి, ట్రాఫిక్ ని మనసులో పెట్టుకుని గంట ముందే ఆఫీసుకి బయలుదేరుతుంది. పనిమనిషిని పెట్టుకుంటే డబ్బులివ్వాలిగనుక 'నా పని నేను చేసుకుంటేనే నచ్చుతుంది' అనే సాకుతో పనిమొత్తం తనే చేసుకుంటుంది"[44] అని అంటాడు. ఈ మాటలనుబట్టి ఆమె తన కుటుంబంకోసం అహర్నిశలూ ఏ విధంగా శ్రమించిందో అర్థంచేసుకోవచ్చు.

ఆమె శరీరాన్ని తన అవసరానికి అనుగునంగా మార్చుకునే క్రమంలో తను సొంతవైద్యం చేసుకోవడం ప్రారంభిస్తుంది పగలంతా చేసిన పనుల అలసట తీరడం కోసం ఉపయోగించే టాబ్లెట్ల దగ్గర్నుంచి రాత్రి నిద్రపట్టడానికి వేసుకునే టాబ్లెట్ల వరకూ ఎన్నోమందులు మింగేది. అవన్నీ ఆమె శరీరాన్ని పూర్తిగా మార్చివేస్తాయి ఆమె శరీరం దహనం చేస్తున్నప్పుడు జరిగిన సంఘటన గురించి రచయిత్రి వివరిస్తూ... అనురాధ శరీరం రంగురంగుల మంటలతో మండుతోంది. టాబ్లెట్సు కెమికల్సు నుంచి వచ్చే రంగులు... వున్నట్టుండి ఏదో పగిలిన శబ్దం వచ్చింది. చితిలోంచి ఒక ఆకుపచ్చగా పాచిపట్టిన పదార్థం ఎగిరివచ్చి సూర్యారావు పాదాల దగ్గర పడింది. దాన్ని ప్రకాశరావు తీసుకొని, చాకుతో పాచినంతా గీస్తాడు అందులో తళతళలాడుతూ ఉంది అనురాధ మెదడు. "పెళ్ళయిన కొత్తలో తనతో చెస్ ఆడిన మెదడు. బ్యాంక్ టెస్టుల్లో మంచిర్యాంక్ తెచ్చుకున్న మెదడు. ఇదేమిటిలా పాచిపట్టి పోయింది..."[45] అంటూ వివరించడం జరిగింది.

ఈ సందర్భాన్ని గమనిస్తే ఆమె తన కుటుంబ వ్యవహారాలను చక్కబెట్టే విషయంలో ఏ విధంగా తనను తాను కోల్పోయిందో స్పష్టమౌతుంది.

అరుంధతి ఎప్పుడుకూడా తన కుటుంబం ఉన్నతస్థాయిలో ఉండాలని, అందరూ తమను మెచ్చుకోవాలనే ఆరాటం ఆమెను ఆ స్థితికి నెట్టేశాయని చెప్పవచ్చు. దానిలో భాగంగానే ఆమె తన శరీరానికి, మనసుకి ఏమి కావాలో కూడా చూసుకోకుండా సమస్తం త్యాగం చేస్తుంది తద్వారా తన అస్తిత్వాన్ని కోల్పోతుంది.

**ఈ కథల్లో వున్న వస్తు వైవిధ్యాన్ని పరిశీలించినట్లయితే**

ఈ ఇరవై ఒకటో శతాబ్దంలో సమాజం అత్యంత వేగవంతంగా ముందుకు దూసుకుపోతున్నప్పటికీ, సృష్టికి మూలకారణం, ఆకాశంలో సగమైన స్త్రీకి మాత్రం అడుగడుగునా అస్తిత్వ పోరాటం ఎదురౌతున్నట్లు స్పష్టమౌతోంది. తల్లి గర్భంలో బీజ రూపంలో ఉన్న పిండం 'ఆడబిడ్డ' అని నిర్ధారణ అయినప్పటి నుండి, చనిపోయే వరకు 'స్త్రీ జీవితం మొత్తం పోరాటాల ప్రస్థానం అని చెప్పవచ్చు.

ప్రతీ వ్యక్తికి కొన్ని ఆశలు, ఆశయాలు ఉన్నట్లే, స్త్రీకి కూడా కొన్ని ఆలోచనలు, కోరికలు, అభిరుచులు ఉంటాయి. కాబట్టి స్త్రీ తన ఇష్టాయిష్టాలను తనకు నచ్చిన వారితో పంచుకోవాలనుకుంటుంది. అయితే మనది పితృస్వామ్య సమాజం గనుక స్త్రీ తను కోరుకున్నంత స్వేచ్ఛ పొందలేకపోతోంది. అందువల్ల తన ఇష్టాలను పొందే క్రమంలో ఆమెకు ఎన్నో రకాలైన అవరోధాలు ఎదురౌతున్నాయి. అలా ఎదురైన అవరోధాలను అధిగమించ డానికి నిత్యం సమాజంతో సంఘర్షిస్తుంది

అంటే స్త్రీ తన పేరు గురించి, ఇష్టాయిష్టాల గురించి, సొంత వ్యక్తిత్వం గురించి, సంసారం గురించి, శీలం గురించి... ఇలా తన జీవితానికి సంబంధించిన ప్రతి అంశంలో ఆమె అస్తిత్వ పోరాటాన్ని ఎదుర్కొంటున్నట్లు స్పష్టమౌతోంది.

ఈ మూడో అధ్యాయంలో వివరించిన కథల్లో అస్తిత్వస్పృహ కలిగిన ప్రతి స్త్రీ తమ అస్తిత్వంకోసం పోరాడినట్లు స్పష్టమౌతోంది.

## పాదసూచికలు

1. సత్యనారాయణ మూర్తి, పోలా ప్రగడ. 1999. తెలుగు కథానిక. పుట: 4
2. పైదే. పుట: 4
3. పైదే. పుట: 4
4. పైదే. పుట: 5
5. పైదే. పుట: 6
6. అంటురోగం (కథ). పుట: 17
7. పైదే. పుట: 17
8. అగ్నిస్పర్శ. పుట: 55
9. పైదే. పుట: 61
10. పైదే. పుట: 66
11. ఆకాశంలో సగం. పుట: 135, 136
12. పైదే. పుట: 137
13. ఆవర్జా. పుట: 159
14. పైదే. పుట: 172
15. పైదే. పుట: 171
16. ఆశ. పుట: 29
17. ఎంతో చిన్నది జీవితం. పుట: 28
18. ఒక రాత్రి గడవాలి. పుట: 22

19. పైదే. పుట: 19, 20

20. గంగ జాతర. పుట: 126

21. గూడు. పుట: 16

22. తృషిత. పుట: 101

23. నింగి - నేల. పుట: 19

24. పోరాటం. పుట: 19

25. ప్రగతి. పుట: 19

26. భూలక్ష్మి. పుట: 107

27. మొదటి అడుగు. పుట: 75

28. రెక్కలున్న పిల్ల. పుట: 20

29. సంకట విమోచన. పుట: 92

30. సర్పంచెవరు?. పుట: 20

31. పైదే. పుట: 20

32. స్వాభిమానం. పుట: 20

33. క్షతగాత్ర. పుట: 28

34. అదెక్కడ. పుట: 64

35. పక్షులు. పుట: 151

36. బొమ్మలో చైతన్యం. పుట: 79

37. బోన్సాయి బ్రతుకు. పుట: 178

38. వ్యక్తిత్వం పుట: 411

39. శివాని. పుట: 13

40. శీలమా? అదిమేమి?. పుట: 209

41. సత్యపాలన. పుట: 34

42. పైదే. పుట: 35

43. పైదే. పుట: 39

44. సూపర్ మామ సింర్డ్రోమ్. పుట: 2

45. పైదే. పుట: 6

# 4. స్త్రీల అస్తిత్వ చిత్రణ కథలు - భాషాశిల్పం

మానవ పరిణామక్రమంలో మనిషి ఎన్నో ఉత్థానపతనాలను ఎదుర్కొన్నాడు. తన మనోభావాలను భాష ద్వారా ఇతరులకు వ్యక్తంచేయడం అతి గొప్ప విజయంగా చెప్పవచ్చు. అంటే మనిషి సైగలుచేసే స్థితి నుండి మాట్లాడే స్థితికి ఎదగడం. సైగలుచేసే కాలంలో మానవుడు తన మనసులో వున్న భావాలన్నింటిని స్పష్టంగా చెప్పి వుండలేకపోవచ్చు గాని, భాష ఏర్పడ్డ తర్వాత మానవుడు త్రికాలాలకు సంబంధించిన అంశాలను భాష ద్వారా వ్యక్తంచేస్తున్నాడు. భాష అనేది మానవునికి మాత్రమే సంక్రమించిన గొప్ప వరప్రసాదంగా చెప్పవచ్చు. భాష అనేది లేకపోతే ఇంత గొప్ప నాగరికత అభివృద్ధిని, మానవ మనుగడ ఊహించలేం.

మానవుడిని జంతుప్రపంచం నుండి వేరుచేసింది భాషే. భాష సామాజిక అవసరాల వల్ల పెరుగుతూ వస్తుంది పితృస్వామ్యసమాజంలో భాష కూడా, పితృస్వామ్య భావసంబంధంగానే రూపుదిద్దుకుంది. అందువల్ల నేటి స్త్రీవాద రచయిత్రులు స్త్రీ అణచివేత, లింగవివక్ష, దోపిడి, పీడనలకు భాష కూడా ఒక ప్రధాన సాధనంగా ఉపయోగపడుతోందని భావిస్తున్నారు పురుషాధిపత్య సమాజం స్త్రీల అణచివేతకు భాషను ప్రధాన సాధనంగా ఉపయోగించుకుంది.

సంఘజీవనంలో పరస్పర సహకారం అనేది తప్పనిసరి అంశం. మానవుడు తన కష్టసుఖాలను, ఆలోచనలను ఇతరులతో పంచుకోవడానికి, ఇతరుల కష్టసుఖాలను తాను తెలుసుకోవడానికి భాష ప్రధాన మాధ్యమంగా ఉపయోగపడుతుంది. పరస్పర భావ వినిమయసాధనమే భాష.

గురజాడ 1897లో కన్యాశుల్కం నాటకానికి (మొదటి కూర్పు) పీఠిక రాస్తు... 'Language is a great civilizing media' అని అన్నారు. దీన్నిబట్టి మానవ నాగరికత నిర్మాణంలో భాష ఎంతటి ప్రాముఖ్యత వహిస్తుందో అర్థమౌతుంది.

కథాసాహిత్యంలో 'శిల్పం' అనేది అత్యంత ప్రాముఖ్యమైనది. ఎందుకంటే కథ నిడివి తక్కువ కాబట్టి, చెప్పే అంశాన్ని తక్కువ మాటల్లో, అత్యంత ప్రభావవంతంగా పాఠకులకు అందించాలి. రచయిత రచనావిధానాన్నే 'శిల్పం' అంటారు. ఆంగ్లంలో దీన్ని 'Technique' అంటారు.

ఒక్క మాటలో చెప్పాలంటే రచయిత చెప్పదలచిన వస్తువు ఏ రూపంలో అభివ్యక్తం అవుతుందో ఆ రూపాన్ని శిల్పం అని చెప్పవచ్చు.

కథారచనలో రచయిత స్వేచ్ఛకు కొత్త వ్యాఖ్యానాలు వెలిశాయి. ఎత్తుగడలో; పాత్ర ప్రవేశంలో, సన్నివేశ చిత్రణలో, వర్ణనలో, సంభాషణలో, సంఘర్షణలో, సంక్షిప్తత నిర్భరత, చోటుచేసుకున్నాయి. తన మనసులో ఉన్నదంతా చెప్పేయాలన్న నియమాలు సడలిపోయాయి. రచయిత ఒక్కొక్కసారి 'ముగింపు' కూడా పాఠకుడికి వదిలేసి పరిష్కారం నీవే చూసుకోమన్నదాకా మార్పు వచ్చింది.

శిల్పం గురించి వివరిస్తూ వల్లంపాటివారు ఇలా అంటారు... "ఆధునిక కథలో కథనశిల్పం ప్రధానలక్షణం. దాదాపు ప్రాచీన కథలన్నీ ఒక నాయకుని చుట్టూరానో, ఒక నాయిక చుట్టూరానో తిరుగుతాయి. అంతేగాక వారి శృంగారవీర రసానుభవాల చుట్టూరా అవి పరిభ్రమిస్తుంటాయి ఈ కథల్లోని పాత్రకు మానసిక జీవితమూ, మనస్తాత్వికమైన లోతూ దాదాపు ఉండవు. కొత్తకథలో నాయకుల మనస్తత్వం ముఖ్యం. ప్రాచీన కథలో దేశ కాలాలు వుండవు. అక్కడక్కడ కొన్ని నగరాల పేర్లు వినిపించినా, ఆ నగర జీవిత చిత్రణలో ప్రత్యేకత వుండదు. సాధారణీకరణ చేయడం చేత ప్రాచీన కథలో తక్షణత్వం, సమకాలీనత ఉండవు. ఈ రెండు గుణాలు ఆధునిక కథకు ప్రాణం"[1] అంటారు.

శిల్పం ప్రాధాన్యతను గురించి వివరిస్తూ రాచమల్లు రామచంద్రారెడ్డి ఇలా వివరిస్తారు 'శిల్ప దృష్ట్యా పరమహీనమైన రచనలో భావాలు అభ్యుదయకరంగా ఉన్నప్పుడు, రాజకీయ దృష్టి మాత్రమే గల రాజకీయ నాయకులు ఆ రచనను ఆకాశానికెత్తితే అప్పుడు జరిగే నష్టం ఒక వ్యక్తికో, ఒక రచనకో కాదు, మొత్తం తెలుగు సాహిత్యానికీ, మొత్తం అభ్యుదయసాహిత్యానికీ... మన అభ్యుదయ సాహిత్యకారులు సాహిత్యంలో శిల్పానికి గల విలువనూ స్థానాన్ని గుర్తిస్తారనిఆశిస్తాను'

రా.రా మాటలు చదివితే సాహిత్యరచనలో శిల్పం ప్రాముఖ్యత అర్థమవుతుంది.

'వస్తువు మానవజీవితానికి సంబంధించింది ఏదైనా కావచ్చు. అయితే ఆ వస్తువును పాఠకునికి చేరవేసే తీరులో జవం, జీవం ఉండాలి. దానిని 'round of' చేసే విధానం శిల్పం' అంటారు... డి. రామలింగం.

రచయిత కథ ద్వారా పాఠకుడికి ఏమైతే చెప్పదలచాడో అదంతా పాఠకుడికి అందించడానికి అతడు ఎన్నుకునే పద్ధతే శిల్పం. శిల్పాన్ని తీర్చిదిద్దడంలో రచయిత కృతకృత్యుడు కాగలిగితే, తన కథలో అతడు ప్రవేశపెట్టిన శిల్పం ఉన్నతమైనదని చెప్పవచ్చు.

రచనలో రచయిత ఉపయోగించే శిల్పం సమర్థవంతంగా ఉండాలి. అంటే పాఠకుణ్ణి చదివింపచెయ్యాలి, తద్వారా అతని ఆలోచనల్ని విస్తరింపచెయ్యాలి సక్రమమైన మార్గంలో

పెట్టగలగాలి. శిల్పం బాగోలేకపోతే పాఠకుడి ఏకాగ్రత దెబ్బతిని, విషయంపట్ల విముఖత కలుగుతుంది. తన రచనలో రచయిత ప్రదర్శించిన శిల్పం ద్వారా విముఖుల్ని కూడా విషయోన్ముఖులుగా చెయ్యగలిగినట్లయితే ఆ శిల్పాన్ని ఉత్తమశిల్పంగా చెప్పవచ్చు. ఒక్కొక్క రచయిత ఒక్కొవిధంగా తన భావాల్ని వ్యక్తపరుస్తా డు కాబట్టి శిల్పం అనేది కథకుడి నిష్ఠం అని చెప్పవచ్చు. రచయిత శిల్పం అనేది ప్రధానంగా అతని అధ్యయనం, పరిశీలన, అభ్యాసం మొదలైన వాటివల్ల అలవడుతుంది. అంతేకాక శిల్పం ద్వారా రచయిత నేర్పును, రచయిత వ్యూహాన్ని అర్థంచేసుకోవచ్చు.

ఆధునిక కథానిక శిల్పంలో వచ్చిన మార్పు గురించి వివరిస్తూ రంగాచార్యులు - "కథానిక శిల్పంలో, కథానికా రచనలో రచయిత స్వేచ్ఛకు కొత్త వ్యాఖ్యానాలు వెలిసాయి. ఎత్తు గడలో; పాత్ర ప్రవేశంలో, సన్నివేశ చిత్రణలో, వర్ణనలో... సంక్షిప్తత నిర్భరత చోటుచేసుకున్నాయి. తన మనసులో ఉన్నదంతా చెప్పేయాలన్న నియమాలు సడలిపోయాయి. ఒకొక్కసారి రచయిత ముగింపు కూడా పాఠకుడికి వదిలేసి పరిష్కారం నీవే చూసుకోమన్నదాకా మార్పు వచ్చింది"[2] అంటారు.

కథాశిల్పాన్ని పరిశీలించవలసి వచ్చినప్పుడు పరిగణలోకి తీసుకోవాల్సిన విషయాలను గురించి తెలుసుకుందాం!

1. వస్తు వు
2. కథాకథనం
3. కథాసంవిధానం
4. పాత్రలు
5. నేపథ్యం
6. దృష్టికోణం

## 4. 1. వస్తు వు

రచయిత చెప్పదలచుకున్న విషయమే వస్తు వు రచయిత కథ రాయాలని అనుకున్నప్పుడు ముందుగా వస్తు వును ఎన్నుకుంటాడు. వస్తు వు అనేది ఏ ప్రక్రియకైనా ముడిసరుకు వంటిది. రచయిత వస్తు వును మానవ జీవితంలోనుంచే ఎన్నుకుంటాడు. అంటే తన జీవితఅనుభవం నుండి గాని, లేదా తనకు పరిచయమున్న వ్యక్తు ల జీవితంనుండి గాని లేదా తనను గాఢంగా ప్రభావితంచేసిన సంఘటనల

నుండి గాని వస్తు వును ఎన్నుకుంటాడు.

కథకుడు, వస్తు వును ఎన్నుకోవడంతో పాటు ఆయా సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కలిగి ఉండాలి. లేదంటే తాను చెప్పదలచిన విషయాన్ని పాఠకులకు అందివ్వడంలో విఫలమవుతాడు.

కథకుడు ఏ వస్తు వును ఎన్నుకోవాలి? అనే అంశానికి సంబంధించి ఎలాంటి నియమ, నిబంధనలు లేవు. కాని ఆ రచయిత సమకాలానికి చెందినవాడై ఉంటే ఆ వస్తు వుపై సరియైన అవగాహన వుండి రచనకు కొంత అదనపు ప్రయోజనానాన్ని చేకూర్చే అవకాశం ఉంటుంది. శ్రీ శ్రీ "కాదేది కవితకు అనర్హం" అన్నట్టు ఆధునికకాలంలో "కాదేది కథకు అనర్హం" అని చెప్పవచ్చు. అయితే కథావస్తు వు అనేది వాస్తవాలకు దగ్గరగా ఉండేటట్లు చూసుకోవాలి.

## 4. 2. కథాకథనం:

కథచెప్పే పద్ధతినే 'కథనం' అంటారు. కథారూపంలో 'కథనం' అనేది చాలా ప్రాముఖ్యమైన అంశం. కథను ప్రధానంగా ఉత్తమపురుషలో గాని, ప్రథమ పురుషలోగాని నడిపిస్తా డు

కథా కథనంలో అనేక ధోరణులున్నాయి. అవి 1. వాస్తవిక కథనం 2. లేఖాకథనం 3. ఊహా కల్పన (ఫాంటసి) 4. అంతరార్థ కథనం (అలిగరీ) 5. చైతన్య స్రవంతి కథనం.

రచయిత సృష్టించిన కల్పిత ప్రపంచానికీ, కథ బయటవున్న ప్రపంచానికి మధ్యవున్న సంబంధాన్ని రచయిత పాఠకునికి అందజేయడమే కథనం అంటారు వల్లంపాటి వెంకట సుబ్బయ్య గారు.

## 4. 3. కథా సంవిధానం:

కథ యొక్క నడక తీరు ఎలా ఉండాలో వివరించేదే కథా సంవిధానం. కథలోని సంఘటనల మధ్యవున్న కార్యకారణ సంబంధాన్ని తెలియచేయడమే కథాసంవిధానం. కథలో ఏదైనా సంఘటనకు సంబంధించిన కారణాన్ని తెలియచేయడమే కథా సంవిధానం యొక్క ఉద్దేశం, ప్రయోజనం. సంవిధానం హేతువాదానికి అనుగుణంగా లేక వాస్తవానికి దగ్గరగా లేకపోతే కథకు అర్థంలేకుండాపోతుంది. కథలో సంఘటనకు - సంఘటనకు మధ్య కార్యకారణ సంబంధం తప్పని సరిగా ఉండాలి.

## 4. 4. పాత్రలు:

కథలోని ప్రధాన భావాన్ని లేదా వస్తు వులను పాఠకులకు అందించడానికి ఉపయోగపడే వాటినే పాత్రలు అంటారు. అంటే కథావస్తు వులను భరించేవారూ, కథాంశాన్ని సూచించేవారు పాత్రలు. రచయిత మనసులో రూపొందిన పాత్ర పాఠకుని ముందుకొస్తు ంది కథలోని పాత్రలు కూడా సాధారణ మానవులే కాబట్టి, ఆ పాత్రలకు భిన్న పార్శాలు వుండే అవకాశం వుంది. కథారచయిత వాటిలోంచే కథాంశానికి దోహదపడే పాత్రలను ఎన్నుకోవలసి ఉంటుంది. ఈ ఎన్నికలలోనే కథారచయిత జీవితానుభవం, శిల్ప సామర్థ్యం వ్యక్తమవుతుందంటారు వల్లంపాటి వారు.

ప్రసిద్ధ కథారచయిత, విమర్శకుడు L.A.G. స్ట్రాంగ్, కథలో పాత్రపోషణ గురించి ఇలా అంటాడు. 'కథారచయిత తన పాత్రల్ని నేరుగా కాకుండా ఒక కిటికీలో నుంచి చూపిస్తు న్నట్లుగా చూపిస్తా డు అప్పుడు ఆ పాత్ర చేస్తు న్నపని ఆ పాత్ర వ్యక్తిత్వానికి నమూనాగా, మచ్చుగా ఉంటుంది. అది రచయిత చెప్పకుండా వదిలి పెట్టిన అనేక విషయాలను పాఠకుడు ఊహించుకోవడానికి దోహదం చేస్తు ందని' పేర్కొన్నారు.

సంఘర్షణ, సంఘటన, పాత్ర ఒక అవిభాజ్యమైన త్రయం. ఈ మూడు అంశాలు ఒకదానొ్నకటి ప్రభావితం చేసుకుంటూ కథ ముందుకు కొనసాగడానికి దోహదం చేస్తా యి.

కథలోని పాత్ర పోషణ అనేది రచయత చెప్పడం, 'పాఠకుడు తెలుసుకోవడం' అనే విధంగా వుండదు. ఒక వేళ అలావుంటే అది పాఠకునిలో ఎలాంటి ఆలోచనను రేకెత్తించదు సరికదా, కాలక్షేపానికి చదువుకునే కథలా మిగిలిపోతుంది. అందుకే కథ అనేది ఆలోచింపచేసేదిగా ఉండి, తద్వారా పాఠకుల ఆలోచన విధానాన్ని ఉన్నతీకరించగలిగితే అది పదికాలాల పాటు సాహిత్యలోకంలో నిలుస్తు ంది

'పాత్రలు ఎలా వుండాలి' అనే అంశం గురించి ఎవరు ఏమీ చెప్పినా, అవి మానవజీవితంలో మనకు కనిపించేవిగా ఉంటే చాలు. అలాంటి పాత్రల్లో పాఠకులు తమను తాము చూసుకుని, అవసరమయితే తమ ప్రవర్తనసరిచేసుకునే ప్రయత్నం చెయ్యడానికి అవకాశం ఉంటుంది.

## 4. 5. నేపథ్యం:

నేపథ్యం అనే పదానికి కథ జరగడానికి ముందున్న పరిస్థితి అని అర్థం. అంటే కథ జరగడానికి స్థలం ఉన్నట్టే, కాలం కూడా ఉంటుంది. స్థల, కాలాల చిత్రణే కథాసాహిత్యంలో నేపథ్య చిత్రణ.

1. కొన్ని కథల్లో నేపథ్యం అలంకారప్రాయంగా మాత్రమే ఉంటుంది. అంటే కథ, వస్తువూ పాత్రలూ ఆ నేపథ్యంలో నుంచి పుట్టే అవకాశం ఉండదు.

2. నేపథ్యానికున్న రెండవ లక్షణం కాలం. స్థలాన్ని చిత్రీకరించడం కంటే కాలాన్ని చిత్రీకరించడం చాలా కష్టమైన పని.

## 4. 6. దృష్టికోణం:

సాధారణంగా ప్రతీ కథను, ఆ కథలోని పాత్రలను అనేక కోణాల నుండి చూడవచ్చు. పాఠకుని ప్రతిస్పందనను తన అభిప్రాయానికి అనుకూలంగా దిద్దుకోవడానికి దోహదం చేసే ముఖ్యమైన అంశాలలో దృష్టికోణం మొదటిది. కథ చెప్పే దృష్టికోణాలను మూడు రకాలుగా విభజించవచ్చు.

1. సర్వసాక్షి దృష్టికోణం
2. ఉత్తమ పురుష దృష్టికోణం
3. నాటకీయ దృష్టికోణం

### 4. 6. 1. సర్వసాక్షి దృష్టికోణం:

ఈ దృష్టికోణాన్నే "రచయిత దృష్టికోణం" అని కూడా చెప్పవచ్చు. ఎందుకంటే రచయత స్వయంగా, అంటే తన దృష్టికోణం నుండి కథ చెప్పడం. కథాంగాలైన కథావస్తువు కథాంశం, పాత్రలు... మొదలైన అన్నింటిని గురించి కథ చెబుతున్న రచయితకు తెలుసు.

రచయిత, కథలోని అన్ని సంఘటనలకూ సాక్షి. అంటే కథ జరిగే అన్ని స్థలాల్లోనూ తాను ఉన్నట్టుగా పాత్రల మాటల్ని వింటున్నట్టుగా ఊహించుకుంటాడు. పాత్రల మనస్తత్వాన్ని గురించి కూడా ఇతనికి క్షుణ్ణంగా తెలుసు. కథకుడు పాత్రలను "అతడు", "ఆమె" అని ప్రథమ పురుషల్లో సంబోధిస్తూ ఉండడం చేత ఈ దృష్టికోణాన్ని ప్రథమ పురుష దృష్టికోణం అని అంటారు.

### 4. 6. 2. ఉత్తమ పురుష దృష్టికోణం:

ఈ కథనంలో రచయిత కథ చెప్పడానికి ఒక కథకుణ్ణి సృష్టించుకుంటాడు. అతడు సాధారణంగా ఆ కథలోని ముఖ్యమైన పాత్రగా ఉంటాడు.

## 4. 6. 3. నాటకీయ దృష్టికోణం:

సుప్రసిద్ధ విమర్శకుడు వేన్ బూత్ చెప్పినట్లు రచయిత, పాఠకునికి కనిపించకుండా దాక్కునే ప్రయత్నం చేయవచ్చు. కాని, కథలోనే లేకుండా చేసుకోలేడు. అలాంటి ప్రయత్నమే నాటకీయ కథనం లేదా నాటకీయ దృష్టి కోణంలో కథ చెప్పడం.

అస్తిత్వకథ వున్న భాషాశిల్పాలను చూద్దాం!.

## 4. 7. అంటురోగం:

ఈ కథలో ఎత్తుగడ ఇలా ఉంటుంది. "నాకేగనక వివేకం లేకపోయి ఉంటే... నాకేగనక చక్కగా జీవితాన్ని గడపాలన్న కోరిక లేకపోయి ఉంటే... నాకేగనక మొండి ధైర్యం ఉండుంటే... ఈపాటికి నిండు బస్సులో సీటుకి ఇవతలివైపు కూర్చొని నన్ను మాటిమాటికి ఏదో మిష మీద అంటుకుంటున్న ఈ నలభై యేళ్లు పైబడిన వ్యక్తిని హత్యచేసి వుందును"[3]

ఈ మాటలు నీలిమ వ్యక్తిత్వాన్ని అంచనావేయుటకు ఉపయోగపడతాయి. ఆమె ఒక వివేకం కలిగిన అమ్మాయిగా జీవితం గడపాలన్న కోరిక కలిగిన వ్యక్తిగా కనిపిస్తోంది

బస్సులో ఉన్న వ్యక్తి నీలిమను తాకుతున్నప్పుడు, ఆమె భరించలేక మొదటిసారిగా అతన్ని సీరియస్ గా చూస్తుంది ఆ చూపులకు అతను స్పందించిన విధానాన్ని వర్ణిస్తూ... 'నా చూపులకు అతను చాలా ముచ్చటగా చూశాడు. బహుశా ఓ ఆడది తనవైపు చూసేలా చలింపచేయగలిగానన్న ఆనందం కాబోలు... . ఆ మాటల్లో పురుషుల మానసికస్థితిని రచయిత్రి తెలియచేశారు.

నీలిమ అతని స్పర్శను ఏవిధంగా భావించిందో వివరిస్తూ...

"వీపుమీద వేళ్ళ కదలికలు... ఒళ్ళంతా జుగుప్సతో జలదరించింది... తల వెనక్కి తిప్పి చూశాను... సీట్కి ఉన్న ఐరన్ కమ్మని అయిదు పిల్లపాములు చుట్టు కున్నట్లు అతని చేతివేళ్ళు... " అని రచయిత్రి అంటారు. ఈ మాటల్లో నీలిమకు అతని యెడల జుగుప్స కలిగినట్లు స్పష్టమౌతుంది.

ఈ కథ ముగింపు ఇలా ఉంటుంది. "ముందుమనలో చైతన్యం రావాలి...

సమస్యని నాకెందుకులే అని వదిలివేయకుండా సమస్యగా గుర్తించాలి.. నలుగురిలోనూ చర్చించాలి... చర్చల్లోనే కదా పరిష్కారాలు దొరికేది... మనం ఎదుర్కొంటున్న ఈ సమస్యని వాళ్లు

అసలు సమస్యగా గుర్తిస్తేచాలు... వాక్సిన్ అదే తయారవుతుంది."

ఈ కథలో సమస్యను వివరించి ఆ సమస్యకు పరిష్కారాన్ని కథ ముగింపులో చెప్పడం బావుంది. అంతేకాక కథకు 'అంటురోగం' అనే శీర్షిక ఇచ్చి కథ చివరిలో... సమస్యగా గుర్తిస్తేచాలు "వాక్సిన్" అదే తయారవుతుంది అంటూ ముగింపునివ్వడ గమనించదగ్గ అంశం.

## 4. 8. అతని భార్య:

ఈ కథలోని భాషాశిల్పాన్ని పరిశీలిస్తే పితృస్వామ్యవ్యవస్థ స్త్రీని ఏవిధంగా అణిచివేసిందో అర్థమవుతుంది.

ఈ కథలో రాఘవాచారిని ఎవరైన "నీ భార్యకు కూడా నీ సహవాసం అంటలేదటోయ్ ఇంకా !" అని చమత్కరిస్తే, భర్త ఇంటికి వచ్చి "పాడతావేమిటోయ్ పోని, పసలేదంటావా"[4] అని అంటాడు. ఈ మాటల ద్వారా భర్త ప్రవర్తనని రచయిత్రి కళ్లకు కట్టినట్లు చూపించారు. అంతేకాక అతని మాటల అంతరార్థాన్ని చెప్పడానికి రచయిత్రి 'తేలిగ్గా' అనే పదప్రయోగం చేసారు. దీన్నిబట్టి అతని మాటల్లో అయిష్టత లేదా చులకనభావం వెల్లడవుతుంది. అంతేకాక 'పాడతావేమిటోయ్ పోని' అని భర్త అడిగిన ధోరణిని బట్టి, ఆమె "నా బొంద నేను పాడడ మేమిటి మీముందు వినడమే ఇష్టం నాకు" అని సమాధానం ఇస్తుంది ఈ మాటలు హృదయంలో నుండి కాక నోటి నుండి వచ్చిన మాటలని పాఠకులకు స్పష్టపరచడానికి వారి మధ్య సంభాషణ సందర్భానికి తగినట్లుగా రచయిత్రి భాషాశిల్పాలను ప్రయోగించారు.

ఈ సందర్భంలో మనం మరొక విషయాన్ని కూడా గుర్తించాలి భర్త గనుక 'నువ్వు కూడా బాగాపాడతావు కదా; పాడు. నీకున్న సంగీత పరిజ్ఞానాన్ని పోగొట్టుకోవద్దు. రోజూ నాతోపాటే సాధన చెయ్యి' అని అనివుంటే అప్పుడు ఆమె, భర్తతో పాటు సమానస్థితిలో ఉండి ఉండేది. అయితే పురుషుడు తన స్వప్రయోజనం కోసం స్త్రీని ఉపయోగించుకుని ఆమె తన అస్తిత్వాన్ని కోల్పోయేటట్లు చేస్తున్నాడు అని తెలియచెప్పడానికి రాఘవ అనే పాత్రను సృష్టించినట్లు స్పష్టమౌతోంది.

## 4. 9. అదెక్కడ:

ఈ కథలోని వస్తు వు 'స్త్రీ సంబోధనకు' సంబంధించినది. ఆ కథలో 'పద్మావతి'ని అందరూ అది, ఇది, అని జంతువుని సంబోధించినట్లు సంబోధిస్తా రు దానివల్ల ఆమె మనస్తా పానికి గురౌతుంది. ఆమె తన భర్తన్ను కొడుకుని, కోడల్ని చాలా మర్యాదగా సంబోధిస్తూ ఉంటుంది. కాని ఆమెను అందరూ హీనంగా సంబోధిస్తా రు

ఒకసారి పరందామయ్య ఇంటికి వచ్చేసరికి పద్మావతి కనిపించదు. ఆ సందర్భంలో పరందామయ్య ఆమెను ఉద్దేశించి "నీకెన్నిసార్లు చెప్పింది కోడలు సాయంత్రం పూట కాస్త ముందు గదిలో ఏడవమని... కాస్త కాఫీనీళ్ళు కలిపి చావు... అని చాలా సార్లు ఆమెని హీనంగా సంబోధిస్తా డు భర్తే కాకుండా కోడలు కూడా ఆమెని అలానే సంబోధిస్తుంది అని చెప్పడానికి రచయిత్రి " కోడలు అనిఅన్నట్లు " అని అంటారు. ఈ మాటల్లో రచయిత్రి కోడలి మనస్తత్వాన్ని తెలియచేసారు.

కథకు పెట్టిన శీర్షిక కథలో వున్న వస్తు వును ప్రతిఫలిస్తుంది

ఈ కథలో స్త్రీలను హీనంగా, నీచంగా పిలవకూడదనీ, స్త్రీలను సాటిమనిషిగా గుర్తించాలని చెప్పడం జరిగింది.

## 4. 10. ఆకాశంలో సగం:

కథలో ఇలా మొదలవుతుంది "ఈ మధ్య భూమి మీద బ్రహ్మదేవుడు రాసిన రాతలేవో చెల్లడంలేదట. ఆయన రాసిన రాతలు మార్చేసి ఎవరు రాస్తు న్నరో గానీ వేరే రాతలు రాస్తు నారట అందుకే భూమంతా అల్లకల్లోలం అయిపోతుందట. విషయం ఏమిటో తెలుసుకుందామని బ్రహ్మదేవుడు భూమండలానికి బయల్దేరాడు. అందుకోసం ఆయన మనిషి రూపాన్ని ధరించాడు"... అంటూ కథ మొదలవుతుంది. ఈ కథలో ఎత్తు గడ కథలో ఉన్న సమస్యకు, ఆ సమస్యకు గల కారణాన్ని తెలియజేయడం జరిగింది. ఈ కథంత నాటకీయ రూపంలో సాగుతుంది. పాఠకుడికి నాటకం చూస్తు న్నట్టే అనిపిస్తుంది బ్రహ్మదేవుడు మనిషి రూపాన్ని ధరించి భూమి మీదకు వచ్చి, ఒక ముసలాయన ఏడుస్తూ ఉండటం చూసి దానికి గల కారణాలు విచారించగా... 'చివరికి తన కొడుకుకు పెళ్లిచేద్దామంటే పిల్లలు దొరకడం లేదని తెలియజేస్తా డు ఆ సందర్భంలో బ్రహ్మదేవుడు అమ్మాయిలతో "అమ్మాయిల్లార! అమ్మాయిల్లార ! మీరు వాళ్లకి పెళ్లాడ్డానికి ఎందుకు దొరకట్లేదు?" అని

అడుగుతాడు. దీనికి సమాధానంగా వారు "ఎందుకు దొరకట్లేదంటే..., ఎందుకు దొరకట్లేదంటే, మేం పుట్టటమే లేదు"[5] అని సమాధానమిస్తారు కథ ఎత్తుగడలో బ్రహ్మదేవుడు భూమి మీదకు రావడానికి గల కారణానికి సంబంధించిన వివరణను ఈ కథలో వివరించడం జరిగింది.

ఈ కథలో నాటకీయ శిల్పాన్ని ప్రదర్శించడం జరిగింది. అయితే ప్రత్యేకించి పాత్రలపేర్లు పేర్కొనకపోయినా, సందర్భాన్ని బట్టి మనం ఎవరు ఎవరితో అంటున్నారు అర్థంచేసుకోగలం. ఈ కథలో హాస్యంతో పాటు కొంత వ్యంగ్యాన్ని కూడా జోడించడం జరిగింది.

## 4. 10. ఆర్తి:

ఈకథలో ఓల్గా, స్త్రీల స్వీయానుభవాల్ని వ్యక్తంచేయడానికి తగిన పదప్రయోగాలు చేసారు. ఆ పదప్రయోగాలు కథకు మరింత బలంచేకూర్చాయి. ఈ కథలో సీతను పితృస్వామ్య సమాజం ఎలా అణచివేసిందో చెప్పే సందర్భంలో "నా చుట్టూ వున్న ప్రతి మనిషీ నా సంతోషాన్ని నేలపాలు చేయడానికి, నా గర్వాన్ని హరించడానికి సిద్ధంగా వుండేవారు"[6] అని అనడం ద్వారా స్త్రీ పుట్టింది మొదలకుని ఎలా అణచివేతకు గురౌతుందో తెలియచేయడానికి ఈ వాక్యం చక్కగా సరిపోతుంది.

సీత తండ్రి తన కొడుకుని సిగరెట్ తీసుకురమ్మని బయటకి పంపిన సందర్భంలో అతను ఆలస్యంగా రావడం గమనించిన తండ్రి "ఆడ ముండలా తలొంచుకుని ఆ కాళ్లీడ్చుకోవడం యేమిట్రా. ఒక్క పరుగున వెళ్లిరాలేవు" అని అంటాడు. ఈ సందర్భాన్ని గమనిస్తే "ముండ" అనే పదాన్ని భర్త చనిపోయిన స్త్రీలకు ఉపయోగిస్తారు కాని ఆపదం క్రమంగా స్త్రీలను దూషించడానికి వాడే పదంగా మారింది. తలవంచుకోవడం, కాళ్లీడ్చుకుంటూ నడవడం స్త్రీ లక్షణాలుగా పితృస్వామ్యం పేర్కొంది. ఇవే లక్షణాలు పురుషులు కలిగివుంటే వారిని కూడా ఈ మాటలతో నిందించడం గమనించదగ్గ విషయం. దీన్నిబట్టి సమాజం స్త్రీలను ఏ విధంగా చూస్తుందో అర్థమౌతుంది.

సీత తన భర్త గురించి చెప్పే సందర్భంలో "నా శక్తిని ఉత్సాహాన్ని నశింపచేయటమే జీవితాదర్శంగా పెట్టుకున్నాడు' అని అనడం ద్వారా సీత తన భర్తవల్ల ఎంతగా విసిగిపోయిందో అర్థమౌతోంది. ఇది ఒక్క సీత జీవితంలోనే కాక అనేక మంది స్త్రీలు ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు.

## 4. 12. ఆవర్జా:

ఈ కథలో ప్రధానపాత్ర విధీశ. ఆమె తండ్రి ప్రసిద్ధి చెందిన ఆడిటర్. ఒక సందర్భంలో విధీశ తండ్రి, తన తల్లినుద్దేశించి "జమా ఖర్చుల వ్యవహారం ఆడవాళ్లు మీకేం తెలుస్తుంది" అంటూ ఉండేవాడు. అంటే ఆర్థిక వ్యవహారాల్లో ఆడవాళ్లకు ఏమీ తెలియదని అతని ఉద్దేశం. ఆ తరువాత విధీశ తన తల్లి గురించి చెప్తూ... "నాన్నకన్నా అమ్మే మా ఇంటి బడ్జెట్ ని చక్కగా ప్లాన్ చేసేది. ఎంత ఖర్చుపెట్టాలో, ఎంత పొదుపుచెయ్యాలో ఆమెకే బాగా తెలుసు. మల్లెపూల దగ్గర నుంచి మైక్రోవేవ్ ఓవెన్ దాక... పాలప్యాకెట్ నుండి పార్టీల ఖర్చులదాక... అన్నీ రసీదులతో సహా పద్దులు రాసిపెడుతుంది. ఈనాటికి... ఆమె ఓ సమర్థవంతమైన ఆడిటర్ అని... ఓ ఫైనాన్సియల్ మేనేజర్ అని అమ్మకే తెలియదు. రచయిత్రి ఈ మాటలను విధీశ పాత్ర ద్వారా చెప్పించడం ద్వారా ఆమె తండ్రి, తన తల్లిని తక్కువచేసి మాట్లాడిన మాటలను కొట్టివేసినట్లయ్యింది. అంతేకాక ఈ కథలో విధీశ ఆడిటర్ గా ఉద్యోగం చెయ్యడం ద్వారా స్త్రీలు ఏ పనినైనా సమర్థవంతంగా నిర్వహించగలరు అనే విషయాన్ని వివరించడం జరిగింది.

విధీశ తండ్రి విధీశతో మాట్లాడుతూ "ఆడవాళ్ల చుట్టూ కనిపించని గాజుగోడలు ఉన్నాయమ్మా... పైకి ఎదగనీయకుండా గాజుకప్పు పొరలు పొరలుగా కదలనీయవు, కదలలేవు" అని అంటాడు. ఈ మాటల్లో ప్రయోగించిన "గాజు గోడలు" అనే ప్రయోగంలో శబ్దమాధుర్యం కనిపిస్తోంది సమాజంలో స్త్రీ ఎదుగుదలకు అవరోధంగా ఉన్న పరిస్థితులను "గాజు గోడల" తో పోల్చడం కొత్త ప్రయోగంగా కనిపిస్తోంది

ఒకసారి యామిని తమ క్లైంట్ల ప్రవర్తన గురించి విధీశతో మాట్లాడుతూ "మీతో మర్యాదగా ఉంటారు మేడం... మాతో వారి ధోరణి వేరుగా ఉంటుంది" అని అంటుంది. ఈ ఒక్క వాక్యం ద్వారా మహిళా ఆడిటింగ్ అసిస్టెంట్లు ఎదుర్కొనే సమస్యలను వ్యక్తపరచడం జరిగింది. మహిళా ఆడిటింగ్ అసిస్టెంట్లు ఏదైనా పని నిమిత్తం తమ క్లైంట్ల దగ్గరికి వెళ్లినప్పుడు అక్కడ ఉండే మగవాళ్లు స్త్రీలతో ద్వంద్వార్థలతో అసభ్యంగా మాట్లాడటం, చూపులతో వేధించడం వంటి పనులన్నీ స్త్రీలకు చాలా ఇబ్బందికరంగా ఉంటాయి. ఈ విషయాన్ని రచయిత్రి నవ్యపాత్ర ద్వారా వివరించడం జరిగింది. 'స్త్రీ పురుషుల నడుమ ఉన్న తేడా ఎంతో తెలుసా? ఒక్క క్రోమోజోమ్. నలభైయ్యారు సోమాటిక్ క్రోమోజోమ్స్ ఇద్దరిలో సరిసమానమే. మిగిలిన రెండు సెక్సువల్ క్రోమోజోమ్స్ లో ఒకే ఒక్కటి తేడా. అంటే మొత్తం నలభై ఎనిమిదిలో ఒకటి తేడా. ఒక చిన్న తేడా ఎన్ని తిప్పల్ని తెచ్చిపెడుతుందో చూశావా' అని వివరించారు. ఈ మాటల్లో స్త్రీ పురుషుల మధ్య అగాధంలా ఏర్పడిన వివక్షకు గల

కారణాన్ని "ఒక్క క్రోమోజోమ్" అనే మాట ద్వారా తేల్చిచెప్పడం జరిగింది.

ఈ కథ చివరిలో "ఆవర్జా" అనే పేరుకు తగినట్టుగా, గణంకాల పదజాలంతో ఈ కింది విధంగా కథ ముగించడం జరిగింది.

"బ్యాలెన్స్ షీట్ ట్యాలీ కావడం లేదు, శరీరధర్మాలకు... కుటుంబ జీవనానికి... వ్యక్తి స్వతంత్రానికి... సంఘు వైఖరికి వృత్తి గౌరవానికి... సమాజ ధోరణికి... అస్తిత్వ సాధనకు... అనంత వేదనకు బ్యాలెన్స్ షీట్ ట్యాలీ కావడం లేదు. ఎక్కడో ఏదో ఎంట్రీ తప్పిపోయింది. కూడికలోనో తీసివేతలోనో అంకణాలోనో ఆవర్జాలోనో!"[7]

## 4. 13. ఇన్ స్టెంట్ లైఫ్:

ప్రపంచీకరణ అనేది మానవజీవితాన్ని ఎలా శాసిస్తు ందో; మానవజీవితానికి సంబంధించిన ప్రతి విషయంలోనూ ప్రపంచీకరణ తాలుకా చిహ్నాలు ఏ విధంగా కనిపిస్తు న్నాయో, ఈకథలోని పలు సంధర్భాలను బట్టి అర్థంచేసుకోవచ్చు. ప్రపంచీకరణ పేరుతో మానవజీవితం ఎలా మారిపోతుందో మనం అర్థంచేసుకో వచ్చు.

"గ్లోబలైజేషన్ బ్యాంకు దగ్గరే ఆగిపోదమ్మ, బెడ్ రూంలోకీ వచ్చేస్తు ంది" అని మునీరా తన తల్లితో అంటుంది. ప్రంపంచీకరణ వల్ల మానవజీవితంలో అనేకరకాలైన మార్పులు, చేర్పులు చోటుచేసుకుంటున్నప్పటికీ పురుషుల స్వభావం ఇసుమంత కూడా మారడంలేదు అనడానికి ఈ కింది సందర్భం ఉదాహరణగా చెప్పవచ్చు.

మరొక సందర్భంలో భర్త, భార్యతో "షటప్ నన్నెవరూ ప్రశ్నించరు. నాతో ఎవ్వరూ యిలా మాట్లాడరు. నువ్వు తప్పు. నువ్వూ నీ బోడి ఫెమినిజం యెవరిక్కావాలి... ? ఇంకెప్పుడూ హాఫ్ నాలెడ్జ్ తో ప్రశ్నించకు." అంటాడు.

ఈ మాటలు అతని పురుషాధిపత్యాన్ని తెలియజేస్తు న్నాయి నన్నేవరూ ప్రశ్నించరు అనడం వెనుక అతనికెంత ధైర్యం ఉందో, అతడు మగవాడు కాబట్టి ఏ విధంగా డబ్బు సంపాదించినా... అంటే, అక్రమమార్గాల్లో డబ్బు సంపాదించినా అడిగేవాళ్లు లేరని అతనికి గర్వం. అంతేకాక ఎవరూ అతణ్ణి ప్రశ్నింకూడదని అతని ఉద్దేశ్యం. "హాఫ్ నాలెడ్జుతో ప్రశ్నించకు నువ్వూ నీ బోడి ఫెమినిజం"[8] అనడం వెనుక స్త్రీ పట్ల అతనికి కలిగివున్న చిన్నచూపు ఏంటో అర్థమవుతుంది.

ఈ కథలో భర్త ఎలాంటి నీతినియమాలు నైతికవిలువలు లేని వ్యక్తి, ఏ చట్రంలోనైనా హాయిగా కుదించుకుపోయి, సంకుచిత ఆలోచనలతో జీవించే వ్యక్తిగా మనకు దర్శనమిస్తాడు. ఈ కథలోని పలు సందర్భాల్లో ప్రపంచీకరణ నేపథ్యంలో మారుతున్న మనుష్యుల మానసిక సంఘర్షణలను, పరిస్థితులను రచయిత్రి వివరించారు.

## 4. 14. ఇలా... ఉన్నాం:

ఈ కథలో రచయిత్రి ఉద్యోగం చేసే స్త్రీల పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చిత్రీకరించారు. ఈ కథలో విజయ స్కూల్ కి వెళ్లాక ఆ ఊరి సర్పంచ్ భర్త వచ్చి టేబుల్ మీద ఉన్న కంపోజిషన్ నోట్సులు చూసి ఈ పుస్తకాలేంటీ ఇన్నున్నాయి అన్నాడు. విజయ ఏమీ జవాబు చెప్పలేదు. నిన్నే టీచరమ్మా... అంటూ ఏకవచనప్రయోగం చేస్తాడు ఈ మాటల్లో అతని పురుషహంకారం కనిపిస్తోంది స్కూల్లో పనిచేసే టీచర్ ను ఏకవచనప్రయోగం తో మాట్లాడడం ద్వారా అతని సంస్కారమేపాటిదో తెలుస్తోంది ఇలా ఎవరైనా స్త్రీలను తక్కువచేసి సంబోధించడాన్ని నేటి స్త్రీలు వ్యతిరేకిస్తారు.

మరొక సందర్భంలో లలిత భర్త ఆమెతో "మనం చాలా పనులు చేసుకోగలమని మర్చిపోతున్నాం. మేం (పురుషులు) మీమీద, మీరు (స్త్రీలు) సౌకర్యాల మీద, పనివాళ్లమీద ఆధారపడుతున్నాం"[9] అని అంటాడు. ఈ మాటల్లో స్త్రీ పురుషులు ఒకరి మీద ఒకరు ఏవిధంగా ఆధారపడిపోయి, పరాన్న జీవులుగా మారిపోతున్నారో రచయిత్రి వివరించారు.

మరొక సందర్భంలో లలిత స్వగతంలో 'నూకాలమ్మకి, రామలక్ష్మికి ఉన్న స్వేచ్ఛ తమకెందుకులేదు. వాళ్ల కష్టాలతో పోలిస్తే తమవి లెక్కలోవి కావు. వాళ్లకి సౌకర్యాల మీద లక్ష్యం, ఇబ్బందుల పట్ల భయంలేకపోవడం కారణమా? అదే కారణమయితే స్వేచ్ఛ అంటే అదికాక మరేమిటి?' అని ప్రశ్నించుకుంటుంది. ఈ మాటల ద్వారా ప్రపంచీకరణ నేపథ్యంలో కార్పోరేట్ సంస్కృతి మనల్ని ఎంతగా చుట్టుముట్టింది. దాని భారిన పడిన వాళ్లంతా నిత్యం భవిష్యత్తు ను గురించిన భయంతో పీడించబడుతున్నారనడానికి లలిత, రామలక్ష్మి నిదర్శనంగా కనిపిస్తున్నారు నానోయుగంలో జీవిస్తున్న మానవుడు ఏవిధంగా భయాందోలనకు గురవుతున్నాడో వివరించడం జరిగింది.

## 4. 15. ఇల్లలకగానే పండగౌనా:

ఈ కథలోని భాషాశిల్పాలను పరిశీలించినట్లయితే... శారద వివాహానంతర జీవితాన్ని గురించి చెప్తూ "... ఆమె జీవితం అలుకు గుడ్డలూ - ఆరు ముగ్గు బుట్టలుగా సాగిపోతూ వచ్చింది" (ఇల్లలకగానే... పుట 25) అని అనడం ద్వారా శారద జీవితం ఇల్లు అలుక్కోవడం, ముగ్గులు పెట్టుకోవడంగా మారిపోయిందని ఒకే ఒక్క వాక్యం ద్వారా తెలియజేయడం జరిగింది.

శారదను పుట్టింటికి వెళ్లొద్దని భర్త అన్నప్పుడు శారద స్వగతంలో "అవును నిజమే మరి... తనందరికన్నా బాగా అలుకుతుందని గదా... ఆ పని ఎవరినీ చెయ్యనివ్వలేదు ఇన్నాళ్లు. ఎవరి పనులు వాళ్లకున్నాయి. ఆయనికి ఉద్యోగం, పిల్లలకి చదువులు. వాళ్లకెందుకులే శ్రమ పాపం... అనుకొని తనే ఆ పనిని చేస్తూ వచ్చింది. వాళ్లకి అసలు చేతకాదు మరి"[10] అని అనుకుంటుంది. ఈ మాటల వెనుక ఉన్న నేపథ్యాన్ని గ్రహిస్తే- స్త్రీలు, పురుషుల పొగడ్తలకు లొంగిపోయి, పాపం - పుణ్యం అనుకుంటూ, ఏ విధంగా తమని తాము కోల్పోతున్నారో శారద పాత్ర ద్వారా రచయిత్రి తెలియజేశారు.

శారద తన స్నేహితురాలు గురించి ఆలోచిస్తూ 'తనతోనే చదువుకొని తనలాగే పెళ్లిచేసుకొని తనలాగ బతుకు. ఇల్లలకడం కాకుండా, ఇల్లలకడం బతుకులో ఓ భాగంగా బతుకుతూ తన పేరునూ, తన స్నేహితురాళ్ల పేర్లను కూడా గుర్తుంచుకున్న వ్యక్తి' అని స్వగతంలో అనుకోవడం ద్వారా ఈ కథ ముఖ్య ఉద్దేశాన్ని ఈ వాక్యంలో వ్యక్తం చెయ్యడం జరిగింది. శారద తన గురించి తాను ప్రమీలతో చెప్పుకుంటూ 'నా మెదడులోని అరలన్నీ కూడా ఇల్లు ఎంత బాగా అలకాలి అనే విషయం మీదే కేంద్రీకృతం అయిపోయాయి. ఇంకేం గుర్తు లేదు' అని అంటుంది. స్త్రీకీ ఉన్న తెలివితేటలన్ని అని అనకుండా 'మెదడులోని అరలనీ' అని అనడం ద్వారా ఆమె జ్ఞానమంతా కూడా ఏ విధంగా వృథా అయిపోతుంది అని స్పష్టంగా వివరించడం జరిగింది. అంతేకాక 'ఇల్లు బాగా అలకాలి' అనేది ఆమె ధ్యేయంగా చేసిన పితృస్వామ్యవ్యవస్థ రాజకీయాన్ని ఈ కథ ద్వారా రచయిత్రి తెలియచేశారు.

శారద తన పేరేమిటో చెప్పమని భర్తను అడిగిన సందర్భంలో భర్త 'నిన్ను పెళ్లినాటి నుండి ఏమోయ్ అని పిలవడం అలవాటైపోయింది. నువ్వు కూడా అలా పిలవకండి నా పేరు నాకుంది కదా అని చెప్పలేదు' అని అంటాడు. ఈ మాటల్లో భర్త దబాయింపు- భార్య పేరు గుర్తులేదు అని చెప్పకుండా తిరిగి భార్య మీద నేరం మోపడానికి భర్త చేసిన ప్రయత్నం ద్వారా పురుష మనస్తత్వాన్ని రచయిత్రి మరొకసారి తెలియచేశారు.

## 4. 16. ఒక రాత్రి గడవాలి:

కథ ఎత్తు గడ ఇలా ఉంటుంది. 'రాత్రంతా నిద్రలేదు. లేదుకాదు, పోలేదు. లేకపోవడానికి కారణం నిద్రరాలేదు. బెర్త్ దొరికింది. చక్కగా టిఫిన్ తిని పడుకున్నాను. అయినా నిద్ర పట్టలేదు. ఉత్కంఠం, ఆమెతో ఎలా మాట్లాడాలి? ఎలా ఎదురు పడాలి?' అసలు ఎలా ఉంటారు? ఈ కథ ఎత్తు గడంతా... ఆ పాత్ర మనసులో ప్రశ్నల పరంపరను, మానసికస్థితిని కళ్లకు కట్టినట్లు చూపించారు.

వినీల, సర్వలక్ష్మిని కలవడానికి వెళ్లినప్పుడు సర్వలక్ష్మి ఆమెను ఆహ్వానించిన సందర్భాన్ని రచయిత్రి వివరిస్తూ... "కాలింగ్ బెల్ కోసం చూస్తు ంటే.. గ్రిల్ కి క్లిప్ చేసి పెట్టిన కాయితం, దాని వెనుక పూలగుత్తి... బెల్ కోసం ఎత్తిన చెయ్యి ఆగిపోయింది. గగనపథ విహారికి పూల ఎదుర్కోలులివే"[11] అని వుంటుంది.

ఈ మాటలన్నీ సందర్భోచితంగా, సహజంగా ఉన్నాయి. అంతేకాక వినీల పైలట్ గా ఉద్యోగంలో చేరబోతుంది గనుక తన పదవిని, చక్కని తెలుగు పదాలతో, పూలతో స్వాగతించడం తెలుగువారి ఆచారాన్ని తెలియచేస్తు ంది

సర్వలక్ష్మి, వినీలాని తన గదికి తీసుకెళ్లాక, ఆ గదిలో పుస్తకాలు కంప్యూటరు, ప్రింటర్... అన్ని చెల్లాచెదురుగా పడిఉంటాయి. ఆ గదిని రచయిత్రి వర్ణిస్తూ 'గది ఆమె అంతరంగంలా ఉంది' అని రాస్తా రు ఈ మాటలు సర్వలక్ష్మి మానసికస్థితిని తెలియచేస్తు న్నాయి

## 4. 17. గంగజాతర:

ఈ కథలోని భాషాశిల్పాలను పరిశీలించినట్లయితే... మాధవీ తన ఇంట్లో నెలకొన్న రాజకీయ సందడిని గురించి ఆలోచిస్తూ... 'అందరికీ అన్నీ సకాలంలో అమరిపోతాయి. మాటిమాటికి టీలు, కాఫీలు, భోజనాలు... ఇళ్లంతా చెప్పలేనంత హడావిడిగా ఉంది. ఒక్కోసారి నా యింట్లో నేనే పరాయి దానిలా... ' అని అంటుంది.

ఈ మాటలద్వారా మాధవి ఏ విధంగా పరాయికరణకు గురౌతుందో అర్థమౌతోంది. ఎల్లప్పుడు ఇతరులకు కావలసినవన్నీ సమకూర్చిపెట్టడం వల్ల తన గురించి తాను పట్టించుకునే సమయం లేక, క్రమక్రమంగా తన అస్తిత్వాన్ని కోల్పోవడం జరుగుతుంది.

ఎన్నికలలో భాగంగా మాధవీ ప్రచారానికి వెళ్లినప్పుడు ప్రజలు ఆమెను చూసి స్పందించిన తీరు గురించి ఆమె తన స్వగతంలో 'వీధివీధిలో రాజేంద్రరెడ్డి భార్య... రాజేంద్రరెడ్డి భార్య అంటూ... జూ లో వింత జంతువును చూసినట్లు చూస్తున్నారు ఆత్మాభిమానంలేని నా శరీరం సిగ్గుతెరలనొదిలేసినట్టుగా ఉంది. నా ఆలోచనలు వేరు... అభిప్రాయాలు వేరు. నేను జీవిస్తున్న జీవితం వేరు... ' అని అనుకుంటుంది. ఈ మాటల ద్వారా ఆమె పేరుకు, వ్యక్తిత్వానికి ఏవిధమైన అస్తిత్వం లేదని, అందువల్ల ఆమె ఎంతో మానసిక క్షోభకు గురవుతున్నట్లు స్పష్టమవుతుంది.

మాధవీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఒక ఓటరు ఇంటికి వెళ్లినప్పుడు వాళ్ల అలికిడికి, అక్కడ చెట్ల మీద ఉన్న పక్షులు ఎగిరిపోవడాన్ని గురించి రచయిత్రి వివరిస్తూ... 'వాటిని చూస్తుంటే ఒకింత ఈర్ష్యగానూ, హాయిగానూ అనిపించింది' అని అంటారు. ఈ మాటలు మాధవీ మానసికస్థితికి అద్దంపడుతున్నాయి. మాధవీ తన అస్తిత్వాన్ని కోల్పోయి, ఆ ఇంట్లో ఒక జడపదార్థంలా ఉండటాన్ని, పంజరంలో ఉన్న పక్షిలా తన స్వేచ్ఛ కోల్పోయింది అని చెప్పడానికి పై మాటలను ఉపయోగించడం జరిగింది.

## 4. 18. టెన్షన్:

ఈ కథలో ఎత్తుగడ ఇలా ఉంటుంది. "వీధి వైపు నుండి ఇంటి వైపునకు దృష్టిసారించిన శ్యామల పై ప్రాణాలు పైనే పోయాయి. తన ఇంటి పోర్షన్ దగ్గర గుంపుగా జనం." ఈ మాటలు పాఠకుడిలో ఉత్సుకతని, ఏదో కీడు సంభవించబోతుందనే వాతావరణాన్ని కలిగిస్తుంది అంతేకాక, శ్యామల ఆఫీసు నుండి వస్తూ ఆ దృశ్యాన్ని చూసి, కీడు జరిగిందేమో అనే భావనతో మనసులో "సాయీ నా బిడ్డ నాకు క్షేమంగా కనిపించేట్టు చేయి తండ్రీ" అని అనుకుంటుంది. ఈ మాటలు పాఠకుణ్ణి మరింత శ్రద్ధగా కథను చదివించేటట్లు చేస్తాయి. అంతేకాక ఆమె మనసులో 'వీరనారాయణ స్వామి దగ్గరికి పోక సంవత్సరమైంది. ఏమి జరగకుండా ఉంటే ఎల్లుండి ఆదివారము నీ దగ్గరికి వస్తాను' అని అనుకుంటుంది. ఈ మాటల్లో సాధారణ భక్తుడి స్వభావం కనిపిస్తుంది ఆపదలో ఉన్నప్పుడు దేవుడిని తలచుకోవడం, ఏవైనా పాత మొక్కులు ఉంటే తీర్చుకోవాలనుకోవడం ఆస్తికుల సహజ స్వభావం. ఈ సందర్భంలో రచయిత్రి ఆ విషయాన్ని వివరించారు. ఈ కథ సగ భాగం వరకు నాటకీయ శిల్పంలో సాగుతుంది. పాఠకుడు కథ మొదటి సగ భాగం చదువుతుంటే, చిన్నపాటి నాటకాన్ని చూస్తున్నట్టే ఉంటుంది.

ఈ కథకు ఇచ్చిన 'టెన్షన్' అనే పేరు సమంజసంగా ఉంది. కథ ప్రారంభంలో శ్యామల తన కూతురి గురించి టెన్షన్ పడి, కథ మధ్య నుండి తన కుటుంబీకుల కోసం, ఆమె చెయ్యవలసిన పనుల గురించి ఏవిధంగా టెన్షన్ పడిందో వివరించి, చివరిలో టెన్షన్ నుండి ఏవిధంగా విముక్తి పొందిందో వివరించడం బావుంది.

## 4. 19. (తాళి) నిర్ణయం:

అరుంధతి భర్త అరుంధతిని ఉద్దేశించి "ఏమిటా దరిద్రపు మొహం, కొంచెం శుభ్రంగా వుండి, నవ్వుతూ ఉండాలని తెలియదు. ఛీ ఛీ... " అని విసుక్కుంటాడు. ఈ ఒక్క వాక్యం ద్వారా పురుష మనస్తత్వాన్ని అర్థంచేసుకోవచ్చు. పురుషుడు స్త్రీ బాహ్య సౌందర్యాన్ని చూస్తున్నాడే తప్ప, ఆమె ఆంతరంగిక సౌంద్యర్యానికి అంటే ఆమె అభ్యుదయకరమైన ఆలోచనలు, భవిష్యత్తు ప్రణాళికలు, మానవత్వపు విలువలుతో జీవించడం వంటి వాటికి ప్రాధాన్యత నివ్వడంలేదు. కనుక కుటుంబవ్యవస్థలో పటిష్టత కొరవడిందని... తద్వారా స్త్రీ పురుష సంబంధాలు అన్యోన్య సంబంధాలుగా కాక, అధికార సంబంధాలుగా ఉండి, కుటుంబ విచ్ఛిన్నతకు దారితీస్తున్నాయి అని చెప్పవచ్చు.

అరుంధతి 'భార్య అంటే కేవలం పిల్లలకు అన్నీ అమర్చిపెట్టడం వరకే ఆమె బాధ్యత. వారి జీవితాల గురించి తుది నిర్ణయం భర్తదే' అనడం ద్వారా కుటుంబజీవనంలో స్త్రీ హోదా ఏమిటో అర్థమవుతుంది. స్త్రీ అంటే కేవలం శరీర సంబంధమైన పనులు మాత్రమే చెయ్యగలదని, పిల్లల జీవితాలకు సంబంధించినంత కీలక నిర్ణయాలు తీసుకోవడం భర్త మాత్రమే చెయ్యాలి, చెయ్యగలడు అనే తప్పుడు భావన మరొకసారి వెలుగు చూసింది.

అరుంధతి, శాంత శవాన్ని అలంకరించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ... 'ముత్తయిదువుగా తనువు చాలించాలనుకునేది ఇందుకోసమేనా?' అని స్వగతంలో అనుకుంటుంది. ఈ వాక్యం ద్వారా స్త్రీలు అతి పవిత్రంగా భావించే ముత్తయిదుతనం అనేది అర్థంపర్థంలేని ఒక భావనని రచయిత్రి తెలియచేసారు. అరుంధతి గురించి రచయిత్రి చెప్పే సందర్భంలో - 'తన జీవితం తన ఇష్టప్రకారం ఎలాగో జీవించలేదు, ఇతరుల నిర్ణయం ప్రకారమే అన్నీ జరిగాయి ' అనడం ద్వారా అరుంధతి ఏవింధగా తనను తాను కోల్పోతుందో, తన జీవితం ఇతరుల నిర్ణయాలకు లోబడి ఏ విధంగా గడిచిపోయిందో తెలియచేయడానికి ఈ రెండు వాక్యాలు చాలు.

అరుంధతి స్వగతంలో 'తన మరణానికి వీరందరూ చింతించడం తనకు అవమానం' అని

కుటుంబ సభ్యుల గురుంచి అనుకోవడం ద్వారా, ఆమె కుటుంబ సభ్యుల ద్వారా ఎన్నికష్టాలు అనుభవించి ఉంటే, అలాంటి మాట అన్నాదో పాఠకులు అర్థంచేసుకోగలరు. ఈ కథలో అరుంధతి జీవితం గురించి చెప్తూ 'పెళ్ళి అన్నారు.... చేసుకుంది. తల్లయ్యింది. మురిసిపోయారందరూ... ఆనందించారందరు' అనడం ద్వారా స్త్రీ ఏ విధంగా పరాయి వాళ్ల సొత్తుగా మారిపోయిందో అర్థమవుతుంది. ఆమెకు పెళ్లి జరిగినా, పిల్లలు పుట్టినా అరుంధతి కంటే కూడా తన బంధువులు రక్తసంబంధీకులే ఎక్కువగా సంతోషించారు. ఎందుకంటే ఆమెను ఒక మరమనిషిగా భావించి ఇతరుల(తండ్రి, భర్త) నిర్ణయాలు ఆమెపై రుద్దడం, ఆమె మౌనంగా వాటికి తలవంచడం తమ గౌరవంగా భావించి, నా భార్య నా మాటను కాదనదని, నా మాటను జవదాటదని, గొప్పలు చెప్పుకుంటారే తప్ప, వారి హృదయాన్ని వారి మనోవేదనను ఎవరూ పట్టించుకోరు అని రచయిత్రి తెలియజేశారు.

## 4. 20. తృషిత:

'పేరు తృషితట. ఎప్పుడూ, ఎక్కడా వినలేదు నేను. అర్థమేమిటి అని ఎందరినో అడిగాను. చెప్పలేకపోయారు. మా తెలుగు మేడమ్ ని అడగొచ్చు. కానీ ఆవిడ ఆ క్లాస్కే వెళ్తుంది ఆ అమ్మాయి పేరు గురించే అడిగేనని తెల్సిపోతుంది. ఇంక ఆ తర్వాత ఆవిడ నా భరతంపడుతుంది...' అంటూ (తృషిత అనే పేరుకు అర్థంతెలుసుకోవాలనే తహతహ కలిగినట్లు) కథ ప్రారంభమవుతుంది. ఈ కథలో వివేక్ తృషితని ప్రేమిస్తాడు ఆ ప్రేమ గురించి రచయిత్రి వర్ణిస్తూ... "ఒక్కనాడు నోరువిడిచి చెప్పనేలేదు. కానీ ఎంతో ఆరాధనతో వుండేది అతని చూపు. పూజిస్తున్నట్టే చూసేవాడు నాకేసి. ఇలా కూడా చూడగలరా మనుషులు అని ఆశ్చర్యపోయేలోపు ఆ చూపుల వాన నన్ను నిలువెల్లా తడిపేసింది"[12] అంటూ ప్రేమ యొక్క సహజస్థితిని వర్ణించారు. ఆ తరువాత వాళ్లకు పెళ్లయిన రెండు సంవత్సరాలకే అతని ప్రేమ కాస్త ద్వేషంగా మారిపోతుంది. రచయిత్రి ఆ విషయాన్ని వివరిస్తూ 'ఇప్పుడతనికి చీకటే తప్ప వెలుగు కనపడటం లేదు. అతని ఉధృతమైన మోహావేశం మొదటి రెండేళ్లకే చల్లారిపోయింది. నా స్వతంత్రమైన నడత అహంభావంగానూ, పొగరుగానూ కనిపించడం మొదలైంది. నీ స్వంత వ్యక్తిత్వమే నన్ను ఆకర్షించిందనేవాడు. ఇప్పుడు అదే అతనికి పెద్ద అవరోధమైంది'... అంటూ చెప్తారు

ఈ రెండూ సందర్భాలలో రచయిత్రి సందర్భోచితమైన పదజాలాన్ని ఉపయోగించి, కథను రక్తికట్టించారు అంతేకాక కథ 'తృషిత' అనే పదానికి అర్థం వెతుకుతూ మొదలైనా, కథ చివరి వరకు ఎక్కడ కూడా పాఠకుని అర్థందొరకదు.

తృషిత అంటే ఆశించేది, దప్పిక కలిగినది అని అర్థం. శీర్షికకు తగినట్టే కథలో తృషిత భర్త ప్రేమకోసం తహతహలాడుతుంది. కథాశీర్షక కథలోని వస్తు వుని ప్రతిబింబింపచేస్తు ంది.

## 4. 21. నిర్ణయం:

ఈ కథ ఎత్తు గడ ఇలా ఉంటుంది. "తెల్లవారుజాము నుంచీ ఒకటే తుంపర. కురవనూ కురవదు, వెలవనూ వెలవదు. కిటికీలోంచి వానతుంపర చూస్తు న్న కమలకు తన పరిస్థితికీ బైట వాతావరణానికి పోలిక ఉన్నట్టనిపించింది" అంటూ కథ మొదలవుతుంది. ఈ మాటల్లో ప్రయోగించిన 'కురవనూ కురవదూ, వెలవనూ వెలవదు' అనడం ద్వారా కమల ఏదో జంజాటంలో ఉన్న స్థితిని రచయిత్రి తెలియజేశారు.

వాతావరణపరిస్థితి సరిగా లేకపోవడంతో కమల హాస్పిటల్ కి బయలుదేరకుండా ఉండడంతో ఆమెభర్త విశ్వనాథం ఆమెను ఉద్దేశించి "వాన వెలిసేట్టు లేదుగానీ గొడుగు తీసుకుని పద. మీ డాక్టరమ్మతో ఇవాళ్టైనా చెప్పి చావు" [19] అంటాడు. ఈ మాటల ద్వారా కమలపై అతనికి ఉన్న అధికారాన్ని, ఆమె కడుపులో పెరుగుతున్న పిండం ఆడపిల్లేమో అనే భయం వ్యక్తమవుతున్నాయి అంతేకాక విశ్వనాథం స్వభావాన్ని కూడా తెలియజేస్తు న్నాయి

ఇటు భర్త, అటు హాస్పిటల్ లో డాక్టరమ్మ పెత్తనం కింద నలిగిపోతున్న కమల పరిస్థితిని తెలియజేయడానికి రచయిత్రి "ఒళ్ళో నిప్పులు మోస్తు న్నట్లుగా ఉంది కమలకు" అంటూ సందర్భానికి తగినట్లు చెప్పడం జరిగింది.

## 4. 22. పట్ట పగటి చీకటి:

ఈ కథ 'పరిశుభ్రమైన నీటి మడుగులో చిక్కగా చేరుతున్న కశ్మలం, కుదించుకుపోతున్న నీళ్లు, విస్తరిస్తు న్న మురికి చేస్తు న్న విజయహాసం. మడుగు చుట్టూ చేరిన వారందరూ ఆ మురికిని చూసి సంతోషిస్తు న్నారు ఇష్టంగా ఒంటికి రాసుకుంటున్నారు. తనకు రాయబోతున్నారు...' అంటూ మొదలౌతుంది. ఈ మాటలు జరగబోయే కథను సూచన ప్రాయంగా తెలియచేసినట్లయింది. అంతేకాక పరిశుభ్రమైన నీటి మడుగుని విశాలికి సాదృశ్యంగా, (మంచికి పోలికగా) కశ్మలాన్ని సమాజంలో పెరిగిపోతున్న అక్రమానికి సాదృశ్యంగా చెప్పడం జరిగింది.

విశాల తనకు వచ్చే జీతంలో పదిహేను వందలు హాస్టల్ కి పోగా... అటూ ఇటుగా వెయ్యి రూపాయలు చేతిఖర్చులకే అయిపోతుంది. ఎలాగైనా పదివేలు కూడబెట్టి, ఇంటికి తీసుకువెళ్ళాలన్నది విశాల ధ్యేయం. కాని ఏ నెలకు ఆ నెలే ఏదో ఖర్చు. ఒకసారి విశాలకి వైరల్ ఫీవర్ వచ్చి, హాస్పిటల్లో చేరవలసిన పరిస్థితి ఏర్పడుతుంది.

ఆ సందర్భాన్ని రచయిత్రి వర్ణిస్తూ... 'కడుపు కట్టుకుని దాచుకున్న ఐదువేలలో మూడువేలు ఖర్చయ్యాయి. విశాల కళ్ల నుంచి రక్తం కారింది...' అంటారు. ఈ మాటలు పాఠకుడి కళ్లలో నుండి నీళ్లు రప్పించగలిగేటట్లున్నాయి. అంతేకాక విశాల దైన్యస్థితిని తెలియపరుస్తున్నాయి కథ చివరిలో పక్కింటి పిన్ని 'ఎందుకొచ్చావు? ఇక్కడేముంది? నెలకు మూడువేలు యిస్తుంటే చేదయిందా?' అని అంటుంది. ఆ మాటలు విన్న విశాలి, తనలో తాను 'చేదయింది జీతం కాదు. తన బతుకు. ఎట్లా చెప్పాలి? ఇప్పుడు తనకా ఉద్యోగంకుడా లేదని ఎట్లా చెప్పాలి? చెప్పి ఏమి ప్రయోజనం?' అని అనుకుంటుంది. నాలుగు రోజులు తర్వాత నగరానికి తిరిగి వచ్చి, సువర్ణ ప్లాట్ తలుపు తట్టింది విశాల. రాధికకు ఫోన్ చేసి "నీ ఫ్రెండ్ ఫ్రెండ్ కి యింకా నేనంటే యిష్టమేనా? అని ముందే అడిగింది."[13] అని కథ ముగుస్తుంది ఈ ముగింపు ద్వారా విశాల ఎలాంటి పరిస్థితుల్లో మురికి కూపంలోకి దిగవలసి వచ్చిందో రచయిత్రి చక్కగా వివరించారు.

## 4. 23. పనికి (రాని) సగం:

ఈ కథలో "కృతజ్ఞతతో కూడిన ప్రేమ, మాటల రూపాన్ని వెతుక్కుంటోంది" అనడం ద్వారా తండ్రి యెడలవున్న ప్రేమను వ్యక్తంచేయడానికి పిల్లలకు మాటలు దొరకడం లేదని, తండ్రి యెడల ఎంత అనురాగాన్ని కలిగివున్నారో తెలుస్తోంది

"హృదయంలో సున్నితమైన భాగంలో బాణం తాకినట్లుగా విలవిల్లాడుతోంది" అన్న వాక్య ప్రయోగాన్ని గమనిస్తే; బాణం శరీరంలో ఏ భాగానికి తగిలినా తట్టుకోలేం. హృదయం సున్నితమైన భాగం. ఆ హృదయంలో కూడా ఇంకా సున్నితమైన భాగానికి బాణం తగిలింది అనడం ద్వారా ఆమె హృదయం ఎంత తీవ్రంగా గాయపడిందో వివరించడానికి రచయిత్రి ఈ మాటలను ప్రయోగించారు.

సుందరం ఒక సందర్భంలో "నీకీ మంకుపట్టు ఏమిటి?... నాన్న ఎంత బాధపడ్డారో తెల్సా?" అని తల్లిని ప్రశ్నిస్తాడు సుందరం గనుక తల్లిని ప్రేమగా అడిగి, ఆమె బాధకు కారణం ఏమిటో తెలుసుకోకుండా ముద్దాయిని ప్రశ్నించినట్లు అధికారంతో కఠినంగా ప్రశ్నిస్తాడు ఈ సందర్భాన్ని బట్టి

బాధని గుర్తించేకొడుకుగానే కనిపిస్తున్నాడు తప్ప గాయపడిన తల్లి మనసుని గ్రహించలేకపోయాడని అర్థమౌతోంది.

## 4. 24. పరివర్తన

ఈ కథలో రచయిత ప్రధానపాత్రగా ఉండి కథను చెప్తాడు కథ ఇలా మొదలవుతుంది "2008 జూన్ 11వ తేదీన అమెరికాలోని ఒక స్థానిక పత్రికలో వచ్చిన వార్త- మిచిగన్ పెరోల్ బోర్డువారి ప్రకటన ప్రకారం ఖైది 83729463 దీపికారావు మీద అక్టోబర్ 25వ తేదీన విచారణ జరుగుతుంది..." అంటూ మొదలౌతుంది. ఈ కథ ప్రారంభంలోనే ఇది హత్యానేరానికి సంభందించిన కథ అని స్పష్టమౌతోంది. ప్రాణభీతితో దీపికారావు, తన భర్తను హత్యచేస్తుంది ఆమెను కలవడానికి రచయిత వెళ్లడం, అమెరికా జైళ్లపరిస్థితి, న్యాయవ్యవస్థ తీరు ఈ కథలో వివరించారు. ఈ కథలో ఉపయోగించిన భాష ద్వారా అమెరికా న్యాయవ్యవస్థ పదజాలం తెలుస్తుంది

**ఉదాహరణ:**

కరెక్షన్ ఫెసిలిటీ = నేరాలు చేసిన వారిని సరిదిద్దడానికి ఉపయోగించే వసతి గృహం.

ఔట్రీచ్ = రక్తసంబంధం స్నేహబంధం కానిది.

దీపికారావు ఉంటున్న జైలుకి కొంతమంది క్రైస్తవులు వచ్చి, ఖైదీలను క్రైస్తవులుగా మార్చే ప్రయత్నం చేస్తుంటారు ఆ విషయాన్ని దీపికారావు వివరిస్తూ "దేవుడి మీద నమ్మకం ఉంది. నమ్మినా నమ్మకపోయినా దేవుడితో ఏ చిక్కూ లేదు. ఈ దేవుడి దళారులున్నారే, వీళ్లతోనే గొడవ" అంటూ వివరిస్తారు ఈ మాటలను బట్టి అక్కడి పరిస్థితులను అర్థంచేసుకోవచ్చు.

దీపికారావుని లాయరు ప్రశ్నించే సందర్భంలో "నీ గర్భానికి కారణం ఫస్ట్ కజిన్ తో... నీ కంటే చిన్నవాడైన తమ్ముడిలాంటి సత్యం (తమ్ముడిలాంటి వాడితో అన్న పదాలను ఒత్తి పలికాడు) అనే అతనితో... శారీరక సంబంధం. అంటాడు. ఆ మాటలకు దీపికా "అతను మా చిన్న మామయ్య కొడుకు. మా దేశంలో అతన్ని తమ్ముడు అనం"[14] అని చెప్తుంది ఈ మాటలను గమనిస్తే భాష ద్వారా ఎదురయ్యే సమస్యలు అర్థమౌతాయి. కజిన్ అనే పదాన్ని అమెరికన్లు 'తమ్ముడు', లేదా అన్న అనే అర్థంతో వాడుతుండవచ్చు. కాని తెలుగులో ఆ పదానికి సమానమైన అనువాదం లేకపోవడంతో దీపికాకు ఈ విధమైన సమస్య ఏర్పడినట్లు స్పష్టమౌతోంది.

## 4. 25. పేరెంట్:

ఈ కథ ఇలా మొదలౌతుంది. 'ఈ రోజు సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికొచ్చేటప్పుడు బస్ లో హేమ కనిపించింది. హేమ నాతో చిన్నప్పటి నుండి కలిసి చదువుకుంది'... అంటూ కొనసాగుతుంది. బాలమ్మతల్లి హృదయంలో ఉన్న బాధను రచయిత్రి వర్ణిస్తూ... 'తరచుగా అమ్మగొంతు అలా వొణుకుతుంది. పైకి ఏడుపురాదు, లోపల దు:ఖం పోదు. ఆ లోపలి ఏడుపుకే ఆవిడ కుంగిపోయి ఎండిపోయింది' అంటారు. ఆమె గుండెల్లోని ఆవేదన మాటలకందనిదని రచయిత్రి వాడిన భాషే చెప్తోంది బాలమ్మ గిరిజన కులంలో పుట్టినా, గిరిజనుల అమాయకత్వం, అందర్నీ ప్రేమించేగుణం లేకపోవడానికి గల కారణాన్ని రచయిత్రి బాలమ్మపాత్ర ద్వారా... "నా రక్తంలో మోసగించే గుణం, దగాచేసే లక్షణమూ ఉన్నాయి"[15] అని చెప్పిస్తారు ఈ మాటల్లో బాలమ్మ గిరిజనుడికి, గిరిజనేతరుడికి పుట్టిందని స్పష్టపరచడం జరిగింది. అంతేకాక గిరిజనుల ఔన్నత్యాన్ని, ఉన్నత కులస్థుల మోసపూరితమైన స్వభావాన్ని తెలియచేశారు.

ఒక రచయిత బాధితుని బాధను పూర్తిగా అర్థంచేసుకోలేడు అని చెప్పడానికి 'చీలిన గుండె పోటు చెప్పే గోడు హేమా వాళ్ల అక్కకి ఏమి అర్థమవుతుంది? !' అని రచయిత్రి వివరిస్తారు కథ చివరిలో 'ఈ బాలమ్మ ఇప్పుడు బేల కాదు. ధీర అని ఆమెకి రాస్తాను ఆమె అయితే ఈ కథని ఇంకా బాగా శిల్పనైపుణ్యంతో, శైలీ విన్యాసంతో చెప్పగలుగునేమో! కానీ నేను చెప్పుకోవడంలో నా తృప్తి ఇంకొకరికి ఎలా సాధ్యం?! '... అంటూ కథ ముగుస్తుంది అలాగే స్త్రీ సమస్యలు స్త్రీలైతేనే చక్కగా రాయగలుగుతారు అనడానికి ఈ మాటలు తోడ్పడుతాయి. స్త్రీల సమస్యల గురించి పురుషులు రాస్తే సానుభూతిగాను, స్త్రీల సమస్యల గురించి స్త్రీలే రాసి, చర్చిస్తే అది స్వానుభవంగాను, సహానుభవంగాను ఉంటుందని చెప్పవచ్చు.

ఈ కథకు ఇచ్చిన 'పేరెంట్' అనే పేరు, కథలో వున్న విషయాన్ని సూచనప్రాయంగా తెలియచేస్తోంది

## 4. 26. ప్రగతి:

ఈ కథలో ప్రధాన పాత్ర అయిన ప్రగతి తనకున్న సమస్య నిమిత్తం డాక్టర్ని సంప్రదిస్తుంది సైకియాట్రిస్టు ప్రగతితో "మానసిక ఒత్తిడికి మందుల కన్నా, ఆలోచనల్లో మార్పు శాశ్వత పరిష్కారం. భయంకరమైన సమస్యలున్నప్పటికీ మనం జీవితాన్ని పాజిటివ్ యాంగిల్ నుంచి

చూడాలి. భవిష్యత్తు ను ఆశాజనకంగా ఊహించుకుంటూ ఉండాలి" అని చెప్తాడు. ఈ మాటలు ఈ కథలోని ప్రగతికి మాత్రమే కాకుండా, ఎవరైతే నిత్యం మానసికఒత్తిడికి లోనవుతుంటారో అలాంటి వారందరికీ కూడా ఒక సలహాగా రచయిత చెప్పారు. సైకియాట్రిస్టు ఆమెకు చెప్పవలసిన విషయాలు చెప్పి, ఫీజు తీసుకున్నాక అక్కడ నెలకొన్న పరిస్థితిని వివరిస్తూ... 'ఇక మీరు పోవచ్చు' అనే అర్థం స్ఫురించే నవ్వొకటి నవ్వాడు' అని అంటారు రచయిత్రి. ఈ మాటల్లో సహజత్వం ఉట్టిపడుతుంది.

ప్రగతి స్నేహితురాలయిన విజయ, ప్రగతి విషయాలన్ని తెలుసు కున్నాక... చివరిలో "అవివాహితులంతా నీలా దిగులుగా, డిప్రెసివ్ గా ఆలోచిస్తే పిచ్చాసుపత్రులు నిండిపోతాయి. వాళ్లదాకా ఎందుకు? నన్నుచూడు నాకు పెళ్లయిందనుకుంటున్నవా? "[16] అని అడుగుతుంది. అంతవరకు ప్రగతితో పాటు కథ చదివే పాఠకుడుకి కూడా విజయకు పెళ్లికాలేదు అనే సంగతి తెలియదు సరికదా, విజయ సుఖసంతోషాలతో ఉంది గనుక, కష్టాల్లో ఉన్నవారికి ఎన్నిమాటలైనా చెప్తుంది అనే భావన కలుగుతుంది. కాని, చివరికి ఆమె మాటల్లో పెళ్లికాలేదని విషయం, పెళ్లికాకపోయిన పట్టుదలగా చదివి కలెక్టరు అయ్యిందనే విషయం పాఠకుణ్ణి ఆశ్చర్యానికి గురిచేస్తుంది

## 4. 27. భూలక్ష్మి:

ఈ కథలో భూలక్ష్మికి తన జీవితం పట్ల ఉన్న నిరాసక్తతని వివరిస్తూ రచయిత్రి "జీవితం ఎలా నడుస్తున్నా... బతుకు తప్పదు. బతక్కా తప్పదు. కాకుంటే పరిశీలనతో అవగాహన పెంచుకోవచ్చు. ఆ పరంపరలో ఒక విషయం స్పష్టమైంది. తన సంపాదన మీద తనకు స్వేచ్ఛలేకపోవడమే తన నరకానికి ప్రధాన కారణమని"[17] అంటారు. ఈ మాటల్లో స్త్రీలకు ఎదురయ్యే అనేక సమస్యలకు ప్రధాన కారణాన్ని వివరించడం జరిగింది. ఎప్పుడైతే స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండదో ఇక అప్పటి నుండి ఆమెకు సమస్యలు ప్రారంభమవుతాయని తెలియచెప్పడం జరిగింది. ఈ కథలో భూలక్ష్మి చిన్నతనం గురించి వివరిస్తూ... 'భూలక్ష్మి ఒంటిరంగే కాదు, వ్యక్తిత్వమూ బంగారమే. రోడ్డు మీద బస్సు నడుపుతున్నట్లు ఉరికేది. ఆకాశంలో పక్షిలా ఎగిరేది'. ఈ మాటల ద్వారా ఆమె బాల్యంలో అనుభవించిన స్వేచ్ఛను, స్వాతంత్ర్యాన్ని, చురుకుదనాన్ని తెలియచెప్పారు.

భూలక్ష్మి వివాహానంతరం భర్త బాధ్యతా రాహిత్యాన్ని భరించలేక, అతనితో 'మీరెందుకు ఇంత బాధ్యతా రహితంగా ఉంటారు. మీ నిద్రను నేను భరించలేకపోతున్నాను. సమయం దొరికినప్పుడల్లా నిద్ర లేదా టీవీ. మీ సోమరితనంతో మీరంటే అసహ్యం కలుగుతుంది' అని

అంటుంది. ఈ మాటలు భర్త యెడల ఆమెకు కలిగిన బాధను వివరించడం జరిగింది. అలాంటి భర్తను భరిస్తు ంది గనుకే ఆమె భూలక్ష్మి అయ్యింది. భూదేవికున్నంత సహనం ఆమెలో ఉన్నట్లు తెలుస్తో ంది

కథకు ఇచ్చిన శీర్షికకు, కథలోన ప్రధానపాత్రయిన భూలక్ష్మి స్వభావానికి పొందిక కుదిరింది.

## 4. 28. మదుపు:

ఈ కథలో ప్రభాత్ తన భార్య అపర్ణతో 'రేపు ఉగాది కదా మా చెల్లి వాళ్లను పిలవనా? అంటాడు దానికి అపర్ణ: పనిమనిషిలేక నేనేడుస్తు ంటే.. ప్రభాత్: ఇంట్లో చెయ్యలేకపోతే బయటకొనుక్కొని తెస్తా. పండగనాడైనా పిలవకపోతే ఏం సంబంధాలుంటాయి. పిల్లలకి అసలు అభిమానాలే ఉండవు' అంటాడు. ఈ మాటలనుబట్టి, పండగలకి చుట్టాలని, కుటుంబస్తు లని ఇంటికి ఆహ్వానించడం అనే మంచి సంప్రదాయాన్ని కాపాడాలనే ప్రయత్నం కనిపిస్తు ంది

మరొక సందర్భంలో ప్రభాత్ భార్యతో 'చూడు, కిటికిలో నుండి కన్పించే మెత్తని మబ్బుల్ని చూస్తూ, చక్కని సంగీతం వింటూ పేపర్ ప్రశాంతంగా తిరగేస్తు ంటే.. భార్యామణి ఒక కప్పు కాఫీ అందిస్తే... ఆ అనుభూతే వేరేయ్...' అంటూ వివరిస్తా డు ఆ మాటలకు అపర్ణ "అనుభూతులు పంచడానికే ఆడవాళ్లు పుట్టారు పాపం..."[18] అంటుంది. ఆ మాటకు భర్త వ్యంగ్యంగా 'మరిదేనికట...? అంటాడు. వీరిద్దరి సంభాషణలు 'ఆడవాళ్లు అందరికి అనుభూతులు పంచడానికే పుట్టారా' అన్నట్టుగా అనిపిస్తు ంది భర్త వ్యంగ్యంగా అన్న మాటల్లో పితృస్వామ్యసమాజం స్త్రీని ఏ విధంగా చూస్తు ందో అర్థమౌతోంది. మరొక సందర్భంలో నూకి, తన ఇంటి పరిస్థితిని వివరిస్తూ 'మా ఇంట్లో అయితే కూలికి పోయి డబ్బులు తెస్తా ము.. ఉడుకు నీళ్లెట్టి వీపుతోమి, వేడన్నం పెట్టినా, ఫుల్లేగా మందుకొట్టేసి వచ్చి ఒళ్లు గుల్లచేస్తా రు..' అని చెప్తు ంది ఈ మాటలను బట్టి... పేదరికంలో ఉంటే స్త్రీలు, భర్తలకు ఎంతగా ప్రేమాప్యాయతలు పంచిపెట్టినా, వారిచేతిలో దెబ్బలుతినక తప్పడం లేదని ఈ మాటల ద్వారా రచయిత్రి తెలియజేసారు.

## 4. 29. మురళీ వాళ్లమ్మ:

పితృస్వామ్యపు సమాజం స్త్రీలను అణచివేసి, తద్వారా తమ సొంత ప్రయోజనాల్ని నెరవేర్చుకోవడానికి భాషను ఎక్కువగా ఉపయోగించారు. ఏ కుటుంబంలోనైనా స్త్రీలు ఐక్యత కలిగి జీవిస్తే, అంటే అత్త - కోడలు, వదిన - ఆడపడుచు సఖ్యతగా ఉంటే పురుషుల ఆగడాలు సాగవు.

అందుకే "స్త్రీకి స్త్రీయే" శత్రువని "అత్తలేని కోడలు ఉత్తమురాలని" ఇలా పలురకాలైన సామెతలకు భాషలో స్థానం కల్పించి, వాటిని స్త్రీలు నమ్మేటట్లు చేశారు. అయితే ఈ కథలో వీటన్నిటినీ అవాస్తవాలుగా తెలియచేయడం జరిగింది.

రజనీ జీవితం అన్యాయమైపోతున్నప్పుడు, మురళీ వాళ్లమ్మ ఆమెతో "మురళికి నీమీద ప్రేమ పోయిందని నీకు అర్థంకావడం లేదు రజనీ! మనసులేని కాపురం ఎందుకని అతనికి చెప్పెయ్యరాదు? అతని దారిని అతన్ని వెళ్లిపొమ్మని వదిలెయ్యరాదు? నీకు ఇంకో దారి ఏర్పడేదాకా నీకు అండగా నేను ఉంటాను. నన్ను నమ్ము"[19] అన్న మాటల ద్వారా అత్త మంచితనం తెలియచేయడం జరిగింది.

ఈ కథలో మురళీ చదువు, సంస్కారంతో పాటు జీవితానుభవం కలిగినవాడు. అంటే, తన తల్లి ఏ విధంగా భర్తచేతిలో మోసపోయిందో ఆ సమయంలో మురళీ ఏ విధంగా తండ్రిని చీత్కరించుకొన్నాడో ఆ విషయాలన్నీ అతనికి చేదుజ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. అయినప్పటికీ, మురళీ కూడా తన సమయం వచ్చేసరికి, తండ్రి మార్గాన్నే అనుసరించడం అనేది పాఠకుడుకి ఆశ్చర్యానికి కలిగిస్తుంది తప్పు స్త్రీ చేస్తేనే తప్పు, పురుషుడు చేస్తే అది ఒప్పుగానే లేదా అది పురుషుడికి ఉపాంత ప్రయోజనంగానే సమాజం భావిస్తుంది గనుక పురుషుడికి నా ఇష్టం, నన్నెవరు ప్రశ్నిస్తారు? నేను ఏది చేసినా సరైనదే అనే ఆలోచనలు అతనిలో వుండటంవల్ల మురళీ కూడా తండ్రి పంథాలోనే నడిచాడు.

## 4. 30. మోక్షం:

ముదుగంటి సుజాతారెడ్డి రాసిన మోక్షం కథలో భాషాశిల్పాన్ని పరిశీలించినట్లయితే- ఆలోచించదగ్గ విషయాలు కనబడతాయి.

'స్త్రీ ఎంతకాలం క్షమ, శాంతం చూపుతుంది! ... ఎన్నాళ్లనీ మానసిక హింసను భరిస్తుంది' అనడం ద్వారా ఏ స్త్రీ అయినా కొంతకాలం అన్నింటిని మౌనంగా భరించవచ్చేమో కానీ జీవితాంతం భరించదని అర్థమౌతోంది.

రజిని, ఫ్లాటు కొనడానికి తన భర్తను డబ్బు అడిగిన సందర్భంలో 'పెళ్ళికాగానే నీ సంపాదన నాకిచ్చావా?' అని భర్త ప్రశ్నించడం ద్వారా అతని మనస్తత్వం అర్థమౌతుంది. రజిని ఒంటరిగా రోడ్డుమీద నిలబడినప్పుడు ఎదురైన సంఘటన వలన నిశ్చేష్టురాలై స్వగతంలో "అంతభయమైతే ఎట్లా! ధైర్యంగా వుండడం నేర్చుకోవాలి"[20] అని అనుకోవడం ద్వారా ఆమెకు భవిష్యత్తులో అలాంటి కష్టాలు

ఎదురుకావచ్చు, వాటిని ఎదుర్కోవాలంటే ధైర్యసాహసాలు అవసరం అనే భావాన్ని వెల్లడి చేయడం జరిగింది.

## 4. 31. యాష్ ట్రే:

యాష్ ట్రే కథలోని ఎత్తు గడ ఇలా ఉంది. "చిన్న తేడాతో ఎంత అందం వచ్చింది, బతుకూ అంతే" దీని ద్వారా రాబోయే కథను సూచన ప్రాయంగాను, జీవితంలో మోసపోయినప్పటికీ, ఏ విధంగాను నిరాశ చెందక, ఉన్నతస్థాయికి చేరుకోగలిగిందనే భావాన్ని వెల్లడిచేయడం జరిగింది.

రచయిత్రి 'మంచీ, మర్యాద మొహాన్న పూసుకొని... మనసులోపల జరిగే మథనానికీ మొహం మీద రంగుకీ ఏ సంబంధం లేదు' అని అనడం ద్వారా స్త్రీ బాహ్యజీవితానికి, అంతరంగ జీవితానికి మధ్యవున్న అంతరాన్ని ఈ మాటల ద్వారా తెలియచేయడం జరిగింది.

పెళ్లి ఒక్కటే ఆడదాని జీవితంలో మహత్తరమైన విషయం కాదనీ, డబ్బు కూడా ప్రధానం కాదని ఒక స్త్రీ పాత్రచే చెప్పించడం ద్వారా, స్త్రీలకు హితోపదేశం చేసినట్లయింది.

రచయిత్రి శేఖర్ మనస్తత్వాన్ని వివరించే సందర్భంలో "డబ్బే కావాలని సరిగ్గా ఏడిస్తే ఇల్లు అమ్మి అయినా ఇచ్చేవాణ్ణి" అని ఆ అమ్మాయి తండ్రి ద్వారా చెప్పిస్తారు. ఈ మాటలు శేఖర్ డొంకతిరుగుడు మనస్తత్వాన్ని తెలియచేస్తు న్నాయి.

ఈ కథలో ఎక్కడ కూడా శేఖర్ పాత్ర చేత 'నువ్వు తిరిగి నా జీవితంలోకి రమ్మని' ఆమెను ప్రత్యక్షంగా ఆహ్వానించినట్లుగా కాక "యాష్ ట్రే కొంటారా ?" అన్న ఒక పదం ద్వారా ఆ భావాన్ని వెల్లడి చెయ్యడం జరిగింది. అంతేకాక దీనికి సమాధానంగా రచయిత్రి "నా ఇల్లు చాలా చిన్నది, యాష్ ట్రే పెట్టడానికి జాగాలేదు"[21] అనడం ద్వారా ఆమె తిరస్కారాన్ని తెలియచేశారు రచయిత్రి.

## 4. 32. రెక్కలున్న పిల్ల:

ఈ కథలో భాషాశిల్పాలను పరిశీలించినట్లయితే ఆలోచించదగ్గ అనేక అంశాలు వెల్లడౌతాయి. 'పెళ్లికాక ముందే మా అక్కను మంచి గృహిణిగా చేసింది మా అమ్మ' అని ఒక పురుష పాత్రచేత చెప్పించడం ఈ కథకు మరింత బలం వచ్చింది. ఈ సందర్భంలో 'తయారుచేయడం' అనే మాట

గమనించదగ్గది. వస్తువులు ఏవిధంగా తయారుచేస్తారో అదేవిధంగా ఆడపిల్లని స్త్రీగా తయారు చేయడం జరుగుతుంది. దీన్నిబట్టి జండర్ భావన ఏవిధంగా ఏర్పడుతుందో మనకు తెలుస్తోంది

ఆశ ఒక సందర్భంలో 'నాతప్పేమి లేకపోయినా నన్ను కొప్పడితే గంగిరెద్దులా తలాడిస్తూ వుండలేను' అని అంటుంది. ఏ స్త్రీ అయితే తన వ్యక్తిత్వాన్ని వదులుకొని అన్నింటికీ తలూపుతుందో ఆ స్త్రీని సమాజం గౌరవిస్తుంది అణుకువగల స్త్రీ అనే పొగడ్తతో అణచివేయడంజరుగుతుంది. ఈ సందర్భం ద్వారా స్త్రీలను గంగిరెద్దులా వుండవద్దని హెచ్చరించడమే ఈ పదప్రయోగంలో అంతరార్థం.

గంగిరెద్దులా తలూపే సీత జీవితాన్ని గురించి ఆశ మాట్లాడుతూ 'అందరిచేత మంచి అనిపించుకోవడానికి, ఎన్నిబాధలొచ్చినా భరిస్తూ బతకడానికి తయారవుతుంది జీవితమంతా దుఖఃస్తుంది' అంటుంది. ఈ మాటల ద్వారా ఒక జీవితసత్యాన్ని వెల్లడి చేయడం జరిగింది. ఒకరి మెప్పు కోసం అన్నింటినీ భరిస్తూ బతకకూడదని, ఇతరులకోసం జీవించడం ద్వారా స్త్రీ తనను తాను కోల్పోతుందనే సత్యాన్ని తెలియచేయడం జరిగింది.

ఆశ, మురళీ మాటలకు ఇబ్బందిపడిన సందర్భంలో 'అంత ఇరుకుగా జీవించవద్దు మనం' అంటుంది. ఈ ఒక్క వాక్యం ద్వారా స్త్రీ పురుషులు సంకుచితభావాలు విడిచి, విశాలదృక్పథాన్ని అలవరచుకోవాలని రచయిత్రి వ్యక్తపరచడం జరిగింది. "అన్నిట్లో పూర్తిగా కలిసిపోవడంలో ఎప్పుడూ ఎవరో ఒకరికి నష్టం కలుగుతుంది"[22] అని ఆశ అంటుంది. ఈమాటల ద్వారా భార్యాభర్తల మధ్య 'అన్యోన్యత' అనే పదానికి కొత్త అర్థాన్నిచెప్పడం జరిగింది. కలిసి జీవించడమంటే ఒకరికోసం ఒకరు తమ వ్యక్తిత్వాన్ని లేదా అస్తిత్వాన్ని కోల్పోయి జీవించడం కాదని, ఎవరికి వారు స్వతంత్ర భావాలతో జీవిస్తూ ఒకర్నొకరు అర్థంచేసుకుని జీవించడమని రచయిత్రి తెలియజేసారు.

## 4. 33. శిలకోల:

ఈ కథ ప్రారంభం ఇలా ఉంటుంది. "తలుపు తీస్తే....? సిగరెట్ పొగ వాసన? ఆ వెనుక అతనొస్తాడు మందు వాసన గుప్పుమంటుంది. ముక్కుని చేత్తో అడ్డుకోకుండా నిలబడాలి. నవ్వాలి. తింటానంటే వడ్డించాలి. ఆ తర్వాత అసహ్యాన్నంత భరించాలి..."[23] అంటూ రచయిత జగన్నాథం గురించి వివరిస్తాడు ఈ మాటలు గమనిస్తే జగన్నాథం తాగుబోతని, తిరుగుబోతని, సంస్కారహీనుడని అతని లక్షణాలని ప్రత్యక్షంగా చెప్పకుండా, అతను ఇంటికి వచ్చేటప్పుడుండే

తీరును, అతను ప్రవర్తించేతీరును వర్ణిస్తూ వర్ణిస్తూ చెప్పడం జరిగింది.

గిరిజన ప్రజల స్థితిని రచయిత వివరిస్తూ... "వలసలు, గూడులు ఇంకా కొండ చాటునే ఉన్న రోజులవి... సొండీలు, షావుకార్లు అడవిని వదిలి వెళ్లిపోయేరనుకునే రోజులు. అడవికయిన గాయాలు మానలేదు. కొత్తవాళ్లెవరొచ్చినా అనుమానంగానే, మౌనంగానే మాటున నలిగి, వణికి పోతున్న రోజులవి..." అని వర్ణిస్తుంటాడు ఈ మాటల్లో గిరిజనుల అభద్రతా భావాన్ని, తాము నమ్ముకుని స్వేచ్ఛగా సంచరిస్తున్న అడవీ ప్రాంతాల్లోకి దళారులు ప్రవేశించి వారిని దోచుకోవడం, దళారులతో సంఘర్షించి, వారిని వెళ్లగొట్టినప్పటికీ, వారిలో నెలకొన్న అభద్రతాభావాన్ని... మొదలైన గిరిజన ప్రజల సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను రెండు వాక్యాల్లో వివరించడం జరిగింది.

## 4. 34. సూపర్ మామ్ సిండ్రోమ్

"సుమతి సూర్యుణ్ణి ఆపేసినట్లు, అనురాధ కాలచక్రాన్ని నిలిపివేసిందా, ఏం?" అని అనుకున్నాడు సుర్యారావు. ఉల్లికిపడి పక్క మీద నుంచి లేచి కూర్చుంటూ..." ఈ మాటల్లో సుమతి యొక్క క్రమశిక్షణను తెలియజేయడం జరిగింది. ఆ తరువాత కథ ఇలా జరుగుతుంది. "కాలచక్రం ఆగిపోలేదు. అనురాధ ఆగిపోయింది. అనురాధ లేచి సగం పనులు పూర్తిచేస్తే గాని సూర్యుడు ఉదయించడు. వంట ఇల్లు మేల్కోదు. లోకమే చైతన్యంలోకి రాదు. ఈ మాటల్లో అనురాధ మరణించిందని తెలియజేయడం జరిగింది."[24]

అనురాధ మృతదేహాన్ని వర్ణిస్తూ రచయిత్రి "అనురాధ శరీరమంతా తెల్లగా సున్నం కొట్టినట్లుగా మారిపోయింది. కళ్లు తెరుచుకొని ఉన్నాయి. కాని కాళ్ళు, చేతులు సీమ సున్నంతో చేసినట్లున్నాయి. కళ్లు ప్రశాంతంగా, నిర్మలంగా, ఎన్నడూ లేనంత ప్రశాంతంగా ఉన్నాయి" అని వర్ణిస్తారు ఈ కథ అధివాస్తవికధోరణిలో రాయబడింది. అనురాధ శరీరానికి దహన సంస్కారాలూ చేస్తుండగా ఆ సందర్భాన్ని వివరిస్తూ... "అనురాధ శరీరం రంగు రంగు మంటలతో మండుతుంది. టాబ్లెట్ లో కెమికల్స్ నుంచి వచ్చే రంగులు, ఉన్నట్టుండి ఏదో పగిలిన శబ్దం. చితిలో నుంచి ఆకుపచ్చ రంగులో ఉండే పాచిపట్టిన పదార్థం ఎగిరివచ్చి సూర్యారావు పాదాల దగ్గర పడింది"[25]. ప్రకాశరావు దానిని చాకుతో పాచినంతా శుభ్రంచేయగా, అది అనురాధ మెదడు అని గుర్తిస్తాడు

నిజానికి మెదడు పాచిపట్టడం అంటూ జరగదు. కాని ఈ కథ అధివాస్తవికధోరణిలో

రాయబడింది కాబట్టి, ఈ విధమైన రచనాశైలి సాధ్యమైంది.

## 4. 35. క్షతగాత్ర:

ఈ కథలోని భాషాశిల్పాలను పరిశీలించినట్లయితే- సుజనకు పెళ్లయిన తరువాత మొదటి రోజున, అభిరాం ఆమెను ఉద్దేశించి "ఏంటిలా బిగుసుకుపోయావు దాని గురించి నీకేమి తెలీదని నేననుకోవాలా?"[26] అంటాడు. ఈ మాటలు ఆమె మనసులో గుచ్చుకుపోయి, చాలాసేపు బాధిస్తా యి ఈ మాటల్లో అతని అధికార, ధిక్కార స్వరాలు మేళవించినట్లు తెలుస్తు ంది

మరొక సందర్భంలో అభిరాం సహోద్యోగి అయిన సుజాత, సుజన దంపతులను డిన్నర్ కి పిలుస్తు ంది డిన్నర్ ముగించుకొని ఇంటికి వస్తు ండగా అభిరాంకి, సుజనకి షేక్ హ్యాండ్ ఇస్తు ంది ఇంటికొచ్చాక అభిరాం సుజనతో "గమనించావా...! అది నాకు షేక్ హ్యాండిస్తూ అరచేతిలో ఎలా గోకిందో..."[27] అంటాడు. ఈ సందర్భాలన్నీ అభిరాం మనస్తత్వాన్ని అర్థంచేసుకోవడానికి రచయిత్రి పాత్రోచితమైన భాషను ఉపయోగించడం జరిగింది.

## 4. 36. సామెతలు, జాతీయాలు:

ప్రపంచంలో చాలా భాషలున్నాయి. ప్రతీ భాషా తనదైన ప్రత్యేక లక్షణాలు, ప్రత్యేక గుణాలు కలిగి వుంటుంది. కొన్ని కొన్ని భాషల మధ్య సమాన లక్షణాలుంటాయి. వీటిని బట్టి, భాషలను వివిధ కుటుంబాలుగా విభజించడం జరిగింది. ప్రతీ భాషలోనూ సామెతలూ జాతీయాలూ వుంటాయి. ఇవి ఏర్పడ్డానికి ఆయా ప్రజల సాంఘిక, ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక నేపథ్యాలు ప్రధాన కారణం అవుతాయి. సాహిత్యకారులు ప్రాంతీయతను బట్టి లేదా వారి అనుభవాలను బట్టి వారి వారి సృజన రూపాల్లో సామెతలు, నుడికారాలు, పదబంధాలు, జాతీయాలు పుట్టుకొస్తా యి

పరిశోధనకు ఎన్నుకున్న కథల్లో వున్న సామెతలు, జాతీయాలు.

**సామెతలు:**

1. మూడు అలుకు గుడ్డలు: ఆరు ముగ్గు బుట్టలు (ఇల్లలకగానే పండగౌనా: 25)
2. మొగుడు కొడితే మాదాకోళం వాడు కొట్టాడు (అదెక్కడ: 62)
3. బంగారు కొడవలని గొంతు కోసుకోగలమా? (రచయిత పెళ్లాం: 417)

4. శవానికి గతంలో ఎంత పేరున్నా ఇంటిలో పెట్టుకోలేం కదా (రచయిత పెళ్లాం: 417)
5. వివాహం విద్య నాశయాః (అతని భార్య: 22)
6. ఇంట గెలిచి రచ్చ గెలవాలి (బోన్సాయి బ్రతుకు: 177)
7. దూరపు కొండలు నునుపు (బోన్సాయి బ్రతుకు : 177)

**జాతీయాలు:**

జాతీయాన్ని ఆంగ్లంలో 'ఇడియమ్' అంటారు. జాతీయానికి చమత్కారం, నుడికారం, నుడికట్టు మొదలైన పర్యాయ పదాలున్నాయి. ఒక జాతికి సంబంధించిన పదబంధాన్ని జాతీయం అనవచ్చు.
1. చచ్చినంత నిశ్శబ్దం: చిన్న శబ్దం కూడా లేకపోవడం (అదెక్కడ: 65)
2. తలబిరుసు: పొగరు (వ్యక్తిత్వ: 404)
3. తటపటాయించు: సందేహించు (వ్యక్తిత్వం: 416)
4. గొంతు పూడుకుపోవడం: నోటి నుంచి మాట రాకపోవడం (అతని భార్య: 22)
5. కొట్టుమిట్టాడ్డం: అదా ఇదా అని తేల్చుకోలేకపోవడం (అదెక్కడ: 65)
6. మునిగితేలటం: ఒక విషయంలో నిమగ్నం కావడం (అదెక్కడ: 65)
7. జీవచ్ఛవం: బతికి వుండి కూడా చచ్చినట్లుగా వుండటం (అదెక్కడ: 65)

**జంటపదాలు:**

సాధారణంగా ప్రతి ప్రాంతంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక సందర్భంలో జంటపదాలను వుపయోగిస్తుంటారు జంటపదాల్లో మొదట పదానికి ప్రాధాన్యం వుంటుంది. రెండో పదం మొదటి పదానికి అనుకరణలా వుంటుంది. అయితే రెండు పదాల్లోనూ యతి స్థానం వుంటుంది. కొన్నింట్లో ఆది ప్రాసలు, కొన్నింట్లో అంత్య ప్రాసలుంటాయి.
1. పిల్లా - పీచు (బోన్సాయ్ బ్రతుకు: 175)
2. గొడ్డూ - గోతాం (బోన్సాయ్ బ్రతుకు: 175)
3. ఉద్యోగం - సద్యోగం (బోన్సాయ్ బ్రతుకు: 175)
4. ఆలన - పాలన (పనికి (రాని) సగం: 176)
5. అలక - గిలక (పనికి (రాని) సగం: 179)
6. అర్థరాత్రి - అపరాత్రి (పనికి (రాని) సగం: 179).

## పాదసూచికలు

1. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. కథాశిల్పం. పుట: 54
2. రంగాచార్యులు, మాడపాటి. తెలుగు కథానిక ఆవిర్భావ వికాసాలు. పుట: 10
3. అంటురోగం. పుట: 16
4. అతని భార్య : పుట : 22
5. ఆకాశంలో సగం. పుట: 134
6. ఆర్తి. పుట: 61
7. ఆవర్జా. పు : 172
8. ఇన్ స్టెంట్ లైఫ్. పుట: 16
9. ఇలా... ఉన్నాం. పుట: 107
10. ఇల్లలకగానే.... పండగౌనా. పుట: 27
11. ఒక రాత్రి గడవాలి. పుట: 11
12. తృషిత. పుట: 95
13. పట్టపగటి చీకటి. పుట: 98
14. పరివర్తన పుట. 1
15. పేరెంట్. పుట: 52
16. ప్రగతి. పుట: 21
17. భూలక్ష్మి. పుట: 103
18. మదుపు. పుట: 17
19. మురళీ వాళ్లమ్మ. పుట: 24

20. మోక్షం. పుట: 77
21. యాష్ ట్రే. పుట: 42
22. రెక్కలున్న పిల్ల. పుట: 20
23. శిలకోల. పుట: 25
24. సూపర్ మామ్ సిండ్రోమ్. పుట: 2
25. పైదే. పుట: 2
26. క్షతగాత్ర. పుట: 29
27. క్షతగాత్ర. పుట: 30

# 5. స్త్రీల అస్తిత్వ చిత్రణ కథలు - దృక్పథం

ఆంగ్లంలో Point of view, Approach అనే మాటలకు తెలుగులో దృక్పథం అనే మాటను ఉపయోగిస్తున్నారు దృక్పథం అనే మాటకు 'ఆలోచనా విధానం' అని అర్థం. ఈ సిద్ధాంత గ్రంథంలో 'ఆలోచనా విధానం' అనే అర్థాన్నే ప్రధానంగా గ్రహించడం జరిగింది. దృక్పథాలు ప్రధానంగా రెండు రకాలు.

1. భావవాద దృక్పథం
2. భౌతికవాద దృక్పథం

ఒక్కొక్క రచయిత ఒక్కొక్క దృక్పథం కలిగి వుంటాడు. ఆయా రచయితలు తమ తమ దృక్పథాలను అనుసరించి రచనలు చెయ్యడం జరుగుతుంది. ఏ రచనలోనైనా ప్రధానంగా భావవాద దృక్పథం కాని భౌతికవాద దృక్పథం కాని వుంటుంది. భావవాదం నమ్మకాలతోనూ, భౌతికవాదం వాస్తవాలతోనూ ముడిపడి ఉంటుంది.

స్త్రీల స్థితిగతులకు శరీర నిర్మాణం, విధిరాత, సృష్టి... మొదలైనవాటిని కారణాలుగా భావించేవారిని భావవాదులని, అలాకాకుండా స్త్రీ అస్తిత్వం వెనుక, పురుషాధిపత్యబలం, పితృస్వామ్యపు రచనలు, సమాజ నిర్మాణం కారణమనే వారిని భౌతికవాదులని చెప్పవచ్చు.

భౌతికవాద దృక్పథంతో సామాజిక వాస్తవాలను తెలియచేసే రచనలు పదికాలాలపాటు సాహిత్యలోకంలో నిలుస్తాయి అయితే సామాజిక వాస్తవం అంటే ఏమిటో అర్థంచేసుకోవాలి. మానవ జీవితానికి సంబంధించిన వాస్తవాలను తమ తమ రచనల్లో ప్రతిఫలింపచెయ్యడమేకాక ఆయా సమస్యల వెనుకవున్న శక్తులను అంటే... జీవితంలో జయాపజయాలకు, సుఖదుఃఖాలకు, అనర్థాలకు గల కారణాలను విశ్లేషిస్తూ సాహిత్య రచనలు చేస్తే ఆ రచనలను సామాజిక వాస్తవంతో రచించిన రచనలుగా చెప్పవచ్చు.

ఇక్కడ జీవితవాస్తవం అంటే సామాజిక వాస్తవం అని అర్థం. యాదృచ్ఛికంగా కాక అత్యధిక సంధర్భాలలో జరిగే వాస్తవం నూటికో, కోటికో జరిగే విషయాలు సామాజిక వాస్తవాలు కావు అనే విషయాన్ని గమనించాలి.

స్త్రీ అస్తిత్వ చిత్రణ కథల్లో కథకుల దృక్పథం ఏమిటి? వాళ్లు భావవాద దృక్పథాన్ని ప్రోత్సహిస్తున్నారా?! లేక భౌతికవాద దృక్పథాన్ని ప్రోత్సహిస్తున్నారా!? అనే అంశాల్ని ఈ అధ్యాయంలో వివరించడం జరిగింది.

## 5. 1. అంటు రోగం:

ఈ కథను స్త్రీల దృక్పథంతో చూస్తే అనేక విషయాలు అవగతమవుతాయి. ఈ కథ

ప్రారంభంలో నీలిమ స్వగతంలో "ఇదే మొదటిసారా? ఇతనే మొదటి వ్యక్తా? కాదుకదా... ఇన్నాళ్లూ భరించలేదూ... ఒంటిమీద గొంగళిపురుగులు పాకుతున్నట్లు... గొంగళిపురుగే అయితే దులిపి పారెయ్యొచ్చు... కాని ఇంతమంది మధ్య ఈ మగమహానుభావుడిని దులిపి పారెయ్యాలంటే ఏదో సంకోచం... ఏదో మొహమాటం... వాడు చేస్తున్న తప్పుని బయటపెట్టడానికి మొహమాటం... సిగ్గుపడతాం..." [1] అని అనుకుంటుంది. ఈమాటలు గమనిస్తే స్త్రీలు సమస్యల ఎడల ఎందుకు స్పందించడంలేదు? ఎందుకు అన్నింటిని సహిస్తున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి.

స్త్రీలలో ఉండే సిగ్గు, మొహమాటం, సంకోచం... ఇలాంటి లక్షణాలు వుండడం వల్ల కొన్ని ఇబ్బందులను మౌనంగానే భరిస్తున్నారు తప్ప వాటిని ప్రతిఘటించలేకపోతున్నారు. అయితే నేటి స్త్రీవాదులు, ఇలాంటి మొహమాటాలను వదిలిపెట్టమని స్త్రీలకు ప్రబోధిస్తున్నారు స్త్రీలు లేనిపోని మొహమాటాలకు పోయి తమ అస్తిత్వానికే ప్రమాదం కొనితెచ్చుకుంటున్నారని అర్థమవుతోంది. ఈ కథలో సరోజ పరిస్థితి అలాగే అయ్యింది. అయితే ఈ పరిస్థితి మారాలని స్త్రీలు కోరుకుంటున్నారు. అంతేకాక స్త్రీలకు రక్షణ కల్పించేందుకు ప్రభుత్వం ఐ.పి.సి సెక్షన్ 375, 376, 376బి మరియు సి, 354, 509, 511, 498ఎ, 304బి... మొదలైన చట్టాలను చేసింది. ఈ చట్టాలను స్త్రీలు ఉపయోగించుకోగలిగితే తమ అస్తిత్వాన్ని కాపాడుకోగలరని చెప్పవచ్చు. ఈ కథను బట్టి స్త్రీలు భౌతికవాద దృక్పథాన్ని కలిగి వున్నట్లు చెప్పవచ్చు. అంటే స్త్రీలు హింసకు గురౌతుంటే, దానికి కారణం కర్మ అనో, తలరాత అనో, సృష్టి అనో కాకుండా, 'లింగవివక్ష' అని గుర్తించారు అంతేగాక స్త్రీలంతా చైతన్యవంతులై తమపై హింసను ప్రతిఘటించాలని తెలియజేయడం జరిగింది.

## 5. 2. అదెక్కడ:

'అదెక్కడ' కథను మనం స్త్రీల దృక్పథంతో పరిశీలిస్తే-

అనేక సందర్భాలలో పద్మావతి భర్త, కొడుకు, కోడలు ఆమెని జంతువుని లేదా జడపదార్థాన్ని సంబోధించినట్లు సంబోధిస్తారు

**ఉదాహరణకు:** భర్త భార్యనుద్దేశించి ఆయా సందర్భాల్లో...

- "అది కోంపలోనే ఉందండీ" అని,
- "నీకెన్నిసార్లు చెప్పింది కోడలు. సాయంత్రంపూట కాస్త ముందుగదిలో ఏడవమని ?"[2]
- "దాని బుద్ధి అలాంటిదిరా!"
- "కాస్త కాఫీనీళ్లు కలిపి చావు... "[3]

ఈ మాటలన్ని ఆమె హృదయాన్ని చిత్రవధ చేస్తా యి అందుకే ఒకసారి భర్తన్ని కొడుకుని నిలదీసి అడగాలనుకుంటుంది. ఈ ఆలోచనరావడం వెనుక ఆమెకున్న అస్తిత్వ స్పృహే కారణమని చెప్పవచ్చు. ఆ ఇంటిలో మానసికహింసను భరించలేక, భయటకు వచ్చేస్తు ంది రోడ్డుమీద నడుస్తు న్నప్పుడు ఆమె ముఖానికి చల్లగాలి తగిలి ప్రాణంలేచివచ్చినట్టయి "నేను మనిషిని. ఇంకా స్పర్శాజ్ఞానం పోలేదు" అని స్వగతంలో అనుకుంటుంది. ఇప్పుడిక కష్టపడినా జీవం వున్నట్లు బతకడానికి ప్రయత్నిస్తా ను" అనుకుంటూ నడస్తు ంది ఈ మాటల వెనుకగల ఆంతర్యాన్ని గ్రహిస్తే- అంతవరకూ ఆమె జీవించిన జీవితాన్ని తలచుకొని, ఆ జీవితం పట్ల ఒక ఏవగింపు, తన అస్తిత్వాన్ని కాపాడుకోవలనే కోరిక వెల్లడవుతున్నాయి. పద్మావతి వసతిగృహానికి చేరి స్వగతంలో "ఇక్కడ నేనో మనిషిని. నన్నెవరు 'అది' అనరు. నాకంతకంటే ఏం అక్కరలేదు, మనిషిన్నేను"[4] అని అనుకుని ఆనందంతో పరవశిస్తు ంది

ఈ కథ ద్వారా స్త్రీలు తమ అస్తిత్వాన్ని కోల్పోతే మానసికంగా ఎంతగా కుంగిపోతారో, అస్తిత్వాన్ని తిరిగి పొందడానికి ఎంతగా ప్రయాసపడతారో తెలుస్తో ంది అంతేకాక స్త్రీలు తిరిగి తమ అస్తిత్వాన్ని నిలబెట్టుకుంటే, ఎంతగా సంతోషిస్తా రో తెలుసుకోవడానికి పద్మావతి పాత్ర చక్కని ఉదాహరణ. ఈ కథ ద్వారా స్త్రీలు తమకు అస్తిత్వం కావాలని కోరుకుంటున్నట్లు స్పష్టమౌతుంది.

## 5. 3. ఆకాశంలో సగం:

ఈ కథ నాటకీయ రూపంలో కొనసాగుతుంది. కథలో వుపయోగించిన పదజాలం భావవాదానికి సంబంధించినది. అంటే సృష్టికర్త బ్రహ్మదేవుడని, అతనే తలరాత రాస్తా డని కాని రచయిత్రి కథ ద్వారా అందించిన సందేశం మాత్రం సామాజిక వాస్తవంతో కూడివున్నది.

నేటికాలంలో స్త్రీలు ఏమి కోరుకుంటున్నారో స్పష్టంగా తెలియజేయడం జరిగింది. ఎప్పుడైతే మాతృస్వామ్య వ్యవస్థ పోయి, దాని స్థానంలో పితృస్వామ్య వ్యవస్థ ఏర్పడిందో ఇక అప్పటి నుండి స్త్రీ పురుషుల మధ్య అసమానత్వం అగాథంలా పెరిగిపోయింది. నేటికి ఆ అసమానత్వం కొనసాగుతూనేవుంది. ఇలాంటి పరిస్థితుల్లో స్త్రీలు ఏ విధమైన సమాజాన్ని ఆశిస్తు న్నారో ఈ కథలో స్పష్టంగా తెలియజేయడం జరిగింది. ఆడపిల్లల్ని, మగపిల్లల్ని సమానదృష్టితో చూడాలని పేర్కొనడం జరిగింది. పిల్లలు పుట్టింది మొదలు తల్లిదండ్రులు వారి యెడల నిర్వర్తించాల్సిన బాధ్యతలన్నింటిలో సమానత్వం చూపించాలని రచయిత్రి వివిధ పాత్రల ద్వారా వివరించడం జరిగింది. ఈ కథ భావవాద దృక్పథంలో సాగుతుంది. కాని రచయిత్రి చెప్పిన విషయం భౌతికవాదానికి సంబంధించింది.

స్త్రీ , పురుషుల మధ్య ఉన్న అసమానత్వం అనేది అనాదిగా కొనసాగుతూనే ఉంది గనుక ఈ సమస్య అంత సులువుగా పోయేది కాదు. కనుక ప్రజలు, ప్రభుత్వం ఈ సమస్య పరిష్కారానికి కృషిచెయ్యాలి. ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు రూపొందించి ప్రజలను చైతన్యవంతుల్ని చెయ్యాలి. స్త్రీ పురుషుల మధ్య అసమానతలు తొలగిపోతే... సమాజం మరింత ప్రగతి సాధిస్తు ందని చెప్పవచ్చు.

## 5. 4. ఆవర్జ

ఆవర్జ కథలో ప్రధానపాత్ర అయిన విధీశ ఆడిటర్ గా ఉద్యోగంలో చేరడం ఆమె కుంటుంబంలో ఎవరికీ నచ్చదు. అందుకే విధీశ తల్లి ఒక సందర్భంలో 'కొందరి రాతలంతే. అదృష్టం అందలమెక్కిస్తే బుద్ధి బుదరలోకి లాగుతుందట' అని విధీశ గురించి అంటుంది. అంతేకాక విధీశ భర్త అయిన ప్రద్యుమ్నతో 'నువ్వయినా చెప్పరాదు బాబూ' అని విధీశ తల్లి అంటుంది. ఆ మాటలకు ప్రద్యుమ్న "నలుగురిలోకి వెళితేనే కదండి లోకం పోకడ తెలిసేది. ఆమె ఇష్టప్రకారమే కానివ్వండి. అందరికీ మంచిది"[5] అని అంటాడు.

ఈ మాటలన్నీ స్త్రీ సామర్థ్యం తక్కువన్నట్లుగా ఉన్నాయి. అయితే ప్రద్యుమ్న మాత్రం విధీశను ప్రోత్సాహపరుస్తూ 'ఆమె ఇష్టప్రకారమే కానివ్వండి' అనడం గమనార్హం. ఈ సందర్భాన్ని గమనిస్తే పురుషులు గనుక స్త్రీలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తే వారు మరింతగా అభివృద్ధి చెందగలరనే విషయం స్పష్టమౌతోంది. స్త్రీ పురుషుల మధ్య శారీరక నిర్మాణంలో తప్ప మరేవిధమైన బేధాలు లేవనేది నేటి స్త్రీల అభిప్రాయం. ఈ కథలో విధీశ తన ఉద్యోగ బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహించడం స్త్రీ చైతన్యానికి ప్రతీకగా కనిపిస్తో ంది

## 5. 5. ఆర్తి

కథలో ఓల్గా స్త్రీల స్వీయానుభవాల్ని వ్యక్తంచేయడానికి అవసరమైన పదప్రయోగాలు చేసారు. ఆ పదప్రయోగాలు కథకు మరింత బలం చేకూర్చాయి. ఈ కథలో సీతను పితృస్వామ్య సమాజం ఎలా అణచివేసిందో చెప్పే సందర్భంలో "నా చుట్టూ వున్న ప్రతి మనిషీ నా సంతోషాన్ని నేలపాలు చేయడానికి... నా గర్వాన్ని హరించడానికి సిద్ధంగా వుండేవారు"[6] అని అనడం ద్వారా... స్త్రీ పుట్టింది మొదలుకొని ఎలా అణచివేతకు గురౌతుందో తెలియచేయడానికి ఈ వాక్యం చక్కగా సరిపోతుంది.

సీత తండ్రి, తన కొడుకుని సిగరెట్ తీసుకురమ్మని బయటకి పంపిన సందర్భంలో అతను ఆలస్యంగా రావడం గమనించిన తండ్రి "ఆడ ముండలా తలొంచుకుని ఆ కాళ్లీడ్చుకోవడం యేమిట్రా.

ఒక్క పరుగున వెళ్లి రాలేవు"[7] అని అంటాడు. ఈ సందర్భాన్ని గమనిస్తే 'ముండ' అనే పదాన్ని భర్త చనిపోయిన స్త్రీలకు ఉపయోగిస్తారు కాని ఆ పదం క్రమంగా స్త్రీలను దూషించడానికి వాడే పదంగామారింది. తలవంచుకోవడం, కాళ్లీడ్చుకుంటూ నడవడం స్త్రీజాతి లక్షణాలుగా పురుషస్వామ్యం చెబుతోంది. ఇవే లక్షణాలను కలిగిన పురుషులను ఇలాంటి మాటలతో నిందించడం గమనించదగ్గ విషయం. సీత తన భర్త గురించి చెప్పే సందర్భంలో "నా శక్తిని ఉత్సాహాన్ని నశింపచేయటమే జీవితాదర్శంగా పెట్టుకున్నాడు"[8] అని అనడం ద్వారా సీత తన భర్త వల్ల ఎంతగా విసిగిపోయిందో అర్థమౌతోంది. ఇది ఒక్క సీత జీవితంలోనే కాక అనేక మంది స్త్రీలు ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు.

## 5. 6. ఇలా... వున్నాం:

ఈ కథలో విజయ పనిచేస్తున్న స్కూల్ కి ఒకసారి ఆ ఊరి సర్పంచ్ యొక్క భర్త వెళ్తాడు అక్కడున్న టీచర్ని, హెడ్ మిస్ట్రెస్ ని అకారణంగా కించపరచి మాట్లాడతాడు. ఈ సందర్భాన్ని గమనిస్తే స్కూల్ ని పరిశీలించడాని వెళ్లిన వ్యక్తి కేవలం సర్పంచ్ కి భర్త మాత్రమే. ఆ ఊరి సర్పంచ్ 'మహిళ'. కాని ఆమె భర్త అధికారమంతా ఛలాయిస్తాడు ప్రభుత్వం మహిళా రిజర్వేషన్లు కల్పించినప్పటికి ఆచరణలో అవి ఏవిధంగా ఉన్నాయో తెలుసుకోవడానికి ఈ కథలో మహిళా సర్పంచ్ పాత్ర మంచి ఉదాహరణ. ఒక్కమాటలో చెప్పాలంటే ఈకథలో అధికార దుర్వినియోగం జరిగిందని చెప్పవచ్చు.

ఈ విధానం మారాలి. ఎందుకంటే స్త్రీలు ఎన్ని రంగాల్లో ముందున్నప్పటికీ రాజకీయ రంగంలో వెనుకబడి వుండడం వల్ల స్త్రీలు ఇంకా అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. కాబట్టి ప్రభుత్వం తమకు అందించిన మహిళా రిజర్వేషన్లు స్త్రీలు సక్రమంగా ఉపయోగించుకొని మరింత ప్రగతి సాధించాలని రచయిత్రి ఉద్బోధించారు.

## 5. 7. ఇల్లలగానే పండగౌనా:

ఈ కథను స్త్రీవాద దృక్పథంతో చూస్తే... స్త్రీలు తమ అస్తిత్వం కోసం ఎంతగా పరితపిస్తున్నారో తెలుస్తుంది

ఈ కథలోని ఇల్లాలు తనపేరు తెలుసుకోడానికి పుట్టింటికి వెళ్తానని భర్తను అడుగుతుంది. మొదటసారి అడిగినప్పుడు భర్త 'బాగానే ఉంది. పేరు కోసం ఊరెళ్లాలా ఏం?... ఇల్లెవరు

అలుకుతారు' అంటాడు. అందుకు ఆమె, 'పేరు గుర్తు కులేకపోతే వచ్చిన నష్టం ఏమిలేదనే లేక ఇంత ప్రయాసపడినా పేరు తెలుసుకున్న తరువాత ఆ పేరుతో నన్నెవరు పిలుస్తా రు లేక ఇది నా కర్మ అనో అనుకోలేదు. రెండవసారి భర్తను అడిగి అతని అనుమతి పొందుతుంది. ఈ సందర్భాన్ని గమనిస్తే... శారద తన అస్తిత్వాన్ని కోల్పోయినట్లు గ్రహించిన వెంటనే, అస్తిత్వం కాపాడుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తు ంది

మరొక సందర్భంలో భర్తను 'నా పేరెంటి?' అని అడిగినప్పుడు ఆ ప్రశ్నకు సమాధానంగా భర్త 'పోని ఏదో ఒక పేరు పెట్టేసుకో కొత్తది' అంటాడు. ఆ సమాధానం విన్న భార్య "బావుందండీ. మీ పేరు సత్యనారాయణమూర్తి అయితే మిమ్మల్ని శివరావు అని, సుందరరావు అని పెట్టుకోమంటే ఊరుకుంటారా?"[9] అని ప్రశ్నిస్తు ంది భర్తను ఇంత ధైర్యంగా ప్రశ్నించడానికి వెనుక వున్న కారణం ఆమెకు కలిగిన అస్తిత్వపు ఆర్తి అని చెప్పవచ్చు.

మరొక సందర్భంలో 'పేరు కనుక్కుని రాకపోతే బతకలేకుండా ఉన్నాను' అని అంటుంది.

ఇలా పలు సందర్భాలు గమనిస్తే స్త్రీ తనకు అస్తిత్వ స్పృహలేనంత కాలం అస్తిత్వం కోల్పోయి జీవిస్తు ంది గాని ఎప్పుడైతే అస్తిత్వ స్పృహ కలుతుందో ఇక అప్పటినుండి అస్తిత్వం కాపాడుకోవడం కోసం ఆరాటపడుతుంది.

అంతేకాక పితృస్వామ్య సమాజం స్త్రీని వంటింటి కుందేలుగానే చూసింది. స్త్రీ అంటే వండడం, వడ్డించడం, తుడవడం, కడగడం ఇదే ఆమె జీవితంగా చిత్రించడం జరిగింది. అయితే ఈ కథలో స్త్రీ జీవితం అది కాదని, స్త్రీలు వంటింటికే పరిమితమైపోయి, అస్తిత్వాన్ని కోల్పోతున్నారనే బహిరంగ రహస్యాన్ని వెల్లడిచెయ్యడం జరిగింది.

ఈ కథలోని ఇల్లాలు తన పేరుకు సంబంధించిన అస్తిత్వాన్ని, అంటే... అందరి చేత 'శారద' అని పిలిపించుకోవాలని అనుకోవడం ద్వారా స్త్రీలు తమ అస్తిత్వాన్ని కోరుకుంటునట్లు ఈ కథ ద్వారా తెలుస్తో ంది

## 5. 8. ఒక రాత్రి గడవాలి.

ఈ కథను స్త్రీల దృక్పథం నుంచి పరిశీలిస్తే... ఒక సందర్భంలో వినీల, సర్వలక్ష్మిని 'ఆడవాళ్లు ఎందుకు మోసపోతారు?' అని అడుగుతుంది. దానికి సమాధానంగా "ఆడవాళ్లు అన్నింటికీ మగవాళ్ల మీద ఆధారపడిపోతారు. అన్నిటికి, అంటే... డబ్బుసరే, సాంఘిక భద్రత నుంచి, ఉద్వేగాల ఉపశమనం దాకా"[10] అని అంటుంది. ఈ మాటల్లో వాస్తవ విషయాలను రచయిత్రి తెలియజేశారు. ఈ క్రమంలోనే స్త్రీలు, పురుషులు మీద పూర్తిగా ఆధారపడిపోయి తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నట్లు

స్పష్టమవుతోంది. ఈ సమాధానం విన్న వినీల, తిరిగి 'ఒక మనిషి మీద ఆధారపడకుండా సంఘ నిర్మాణం ఉందా? మానవ జీవితం నడుస్తుందా?' అని ప్రశ్నిస్తుంది దానికి సమాధానంగా, "నడవదు, నిజమే. నువ్వు అతని మీద ఎంతగా ఆధారపడుతున్నావో, అదే స్థాయిలో అతను కూడా నీ మీద ఆధారపడేలా నువు తయారుకాగలవా? దాన్ని అతను గ్రహించుకునేలాగ చెయ్యగలవా?"[11] అని సమాధానమిస్తుంది ఈ రెండు సమాధానాలు స్త్రీల ఆలోచనలకు పదునుపెట్టేవిగానూ తమ అస్తిత్వం కాపాడుకోవడానికి ఉపయోగపడే సమాధానాలుగాననూ ఉన్నాయి.

## 5. 9. క్షతగాత్ర :

స్త్రీల దృక్పథం నుంచి ఈ కథను పరిశీలించినట్లయితే... సుజన తన చదువు పూర్తయ్యాక ఉద్యోగంలో చేరతానంటే... తండ్రి "అమ్మా, ఆడపిల్ల సంపాదన తినేఖర్మ పట్టించకు. నీ వెనుక ఇంకా ఇద్దరు ఆడపిల్లలున్నారు. ముందు నీ భారం వదిలితేగాని, వాళ్ల బరువు వదిలించుకోలేను. పెళ్లయ్యాక నీ ఇష్టం. అతనొప్పుకుంటే ఏమైనా చేసుకోండి"[12] అంటాడు. ఈ మాటల ద్వారా స్త్రీలు ఉద్యోగం చెయ్యడం, ఆమె సంపాదన కుటుంబానికి ఉపయోగపడటం అనేది ఇంకా కొంతమంది తల్లిదండ్రులు అవమానంగా భావిస్తున్నట్లు స్పష్టమౌతుంది. అయితే ఈ దృక్పథం మారాలంటున్నారు నేటి స్త్రీలు.

అంతేకాక స్త్రీ , పురుషులు మధ్య అసమానత్వం వుండటం వల్ల సుజన తండ్రి ఆమెను ఒక బరువుగానే భావిస్తున్నాడు తప్ప భాధ్యత అనుకోవటంలేదని అతని మాటల్లో తేటతెల్లమౌతోంది. అయితే నేటి స్త్రీలు ఈ ధోరణి మారాలని అంటున్నారు. ఎప్పుడైతే స్త్రీ , పురుషులు మధ్య సమానత్వం ఏర్పడుతుందో అప్పుడే సమాజం మరింత అభివృద్ధి చెందగలదని చెప్పవచ్చు.

## 5. 10. టెన్షన్:

స్త్రీలు తమ అస్తిత్వం కోల్పోవడానికి గల కారణాన్ని రచయిత్రి వివరిస్తూ... "ఆఫీసులో ఉన్నంతసేపు ఇంటిపైనే మనసంతా. ఇది అన్నింటి కంటే పెద్ద టెన్షన్. దాంతో ఎప్పుడెప్పుడు ఇంటికెళ్దామా అన్న అలోచన. తప్పని పరిస్థితుల్లో గంటో, అరగంటో ముందుగా ఆఫీసు నుండి బయటపడడం. హెడ్ దగ్గర, కొలీగ్స్ దగ్గర గిల్టీ ఫీలింగ్. ఇన్ని రకాలుగా నలిగిపోతున్నా ఇంట్లోవాళ్ల సహకారం లేకపోవడంతో మరింత ఇబ్బందిగా ఫీల్ అవుతుంది."[13] ఈ మాటల్లో కుటుంబం కోసం స్త్రీలు పడే ఆరాటం, ఆ క్రమంలో స్త్రీలు ఏ విధంగా తమ అస్తిత్వాన్ని

కోల్పోతున్నారో వివరించడం జరిగింది.

ఈ కథలో శ్యామలకు, తన భర్తకు మధ్య జరిగిన గొడవలో వారి మధ్య సంభాషణ ఈ విధంగా కొనసాగుతుంది.

శ్యామల: అన్నీ చూసుకోవడం నాకు కష్టంగా ఉంది.

కిరణ్: ఉద్యోగం మానేయి.

శ్యామల: ఉద్యోగమెందుకు మానేయడం. మనేయడానికా అంత చదువుకొనింది.

కిరణ్: మరి అవ్వా కావాలి, బువ్వా కావాలంటే ఎలా?

శ్యామల: మీ సహకారం ఉంటే అన్ని ఉంటాయి.

భర్త: అయితే నన్నేం చేయమంటావు?

శ్యామల: మిమ్మల్ని కూడా రెస్పాన్సిబిలిటీగా ఫీల్ అవమంటాను. మిమ్మల్ని నాకు పనిచేసి పెట్టమనడం లేదు. ఎప్పుడూ అడగను కూడా. వేళకు తినడం, ఇంటికి రావడం, పిల్లల విషయం కాస్త పట్టించుకోవడం[14] ... అంటూ చెబుతుంది.

ఈ సంభాషణ ద్వారా స్త్రీలు ఏమి ఆశిస్తున్నారో అర్థమవుతోంది. నేటికాలంలో ఉద్యోగంచేసే స్త్రీల సంఖ్య అధికం. కాబట్టి... అటు ఉద్యోగం, ఇటు కుటుంబాన్ని చక్కదిద్దుకోవడం వారికి కొంచెం కష్టతరమైన పనే. ప్రాచీన కాలంలో వంటపని, ఇంటిపని, పిల్లలపని అంతా స్త్రీలే చూసుకునేవారు. అయితే నేటికాలంలో స్త్రీలకు అటు ఇంటిపని, ఇటు ఉద్యోగ భాద్యతలు కూడా నిర్వహించవలసివస్తోంది కాబట్టి పని విభజనలో మార్పురావాలని నేటి స్త్రీవాదులు డిమాండ్ చేస్తున్నారు

## 5. 11. తృషిత:

ఈ కథలో తృషిత స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన స్త్రీ, ఆమె తన అస్తిత్వాన్ని కాపాడుకొని జీవిస్తుంది అలాంటి స్వభావం కలిగిన తృషితని వివేక్ మొదట ప్రేమించి, పెళ్లిచేసుకున్నాక, క్రమక్రమంగా అతనిప్రేమ తగ్గిపోతూ వుంటుంది. ఈ సందర్భంలో రచయిత్రి "నేను ప్రాధేయపడి లొంగివుండి, అతను అప్పుడప్పుడు కనపరిచే మెరుపులాంటి ప్రేమకోసం ఎదురుచూస్తూ నా సర్వస్వం వదులుకుంటే అతనికి ఎంతో బావుండి వుండును కానీ ఆ పని చేయలేకపోయాను"[15] ... అంటూ

వివరిస్తుంది ఈ మాటల ద్వారా స్త్రీలను స్వతంత్ర వ్యక్తిత్వం కలిగిన వారిగా వుండమని రచయిత్రి ఉద్బోధించింది. అంతేకాక కేవలం పురుషుడి ప్రేమ మాత్రమే కాకుండా ప్రేమతో పాటూ గౌరవాన్ని కూడా పొందాలని వివరిస్తూ... "ప్రేమతో పాటే అందవలసిన గౌరవం అనేది ఒకటుంది. అది కూడా కావాలి నాకు. అది దొరకదని తెలిసిపోయింది. అదిలేని వివేక్ ప్రేమ నాకు వద్దు. తోకాడించే కుక్కలా అతని చేతిలో బిస్కట్ కోసం తిరగలేను. దీన్ని వివేక్ పొగరు అన్నాడు. పిన్ని మాత్రం ఆత్మాభిమానం అంది"[16]. ఈ మాటల్లో స్త్రీలు తమ ఆత్మాభిమానం కాపాడుకొనే సందర్భంలో ఎంతటి వారితోనైనా సంఘర్షించడానికి సిద్ధపడి, తద్వారా తమ అస్తిత్వాన్ని కాపాడుకోవాలన్నట్లు స్పష్టమౌతుంది. ఈ కథకు తృషిత అని పేరుపెట్టడం జరిగింది. తృషిత అంటే తృష్ణగొన్నది, ఆశించేది అని అర్థం. ఈ కథలో పురుషుడి ప్రేమకోసం స్త్రీ పరితపిస్తుందని వివరిస్తూనే పురుషుడి ప్రేమను అధికంగా ఆశిస్తే చివరకు ఆవేదనే మిగులుతుందని తెలియజేయడం జరిగింది.

## 5. 12. (తాళి) నిర్ణయం:

ఈ కథలో స్త్రీ జీవితం ఏ విధంగా ఒక ఇరుకైన చట్రంలో తనను తాను ఏ విధంగా కోల్పోతుందో చక్కగా అర్థంచేసుకోవచ్చు.

ఒక సందర్భంలో భర్త "ఏమిటా దరిద్రపు మొహం... నవ్వుతూ ఉండాలని తెలియదూ"[17]... అని దూషించినప్పుడు, ఇంకెప్పుడు అలాంటి పరిస్థితి రాకుండా చూసుకుంటుంది. ఈ సందర్భాన్ని గమనిస్తే స్త్రీ అందంగాని, ఆమె సంతోషం గాని పురుషుని కోసమేనా అన్న అనుమానం వస్తుంది భర్తకు ఇష్టమైనట్లే ప్రవర్తిస్తుందితప్ప- ఎక్కడా కూడా తన ఇష్టాఇష్టాలకు చోటులేదని తెలుస్తోంది ఈ రెండు వాక్యాలలో ఒక లోతైన భావాన్ని వెల్లడిచేయడం జరిగింది.

... 'తుది నిర్ణయం భర్తదే' - అనడం ద్వారా స్త్రీ అంటే ఒక యంత్రంగా ఇంటిల్లిపాదికీ కావలసినవన్నీ సమకూర్చేదే తప్ప, ఆమెని ఒక మనిషిలా గుర్తించడంలేదని అర్థమవుతోంది. అంతేగాక ముఖ్యమైన నిర్ణయాలన్నీ భర్తే తీసుకోవడం వల్ల ఆమెను ఒక అజ్ఞానిగా పురుషులు భావిస్తున్నారని చెప్పవచ్చు.

'... మాములు అయిపోయినా గుండెల్లో గునపాలు దిగినట్టుగా ఉంటుంది.' - అనడం ద్వారా ఆమె మానసికంగా ఎంత హింస అనుభవించిందో అర్థమౌతోంది. రచయిత్రి- అలవాటు అయిపోయింది అని చెప్పకుండా "గుండెల్లో గునపాలు దిగినట్టుగా..."[18] అనడం ద్వారా స్త్రీ సున్నితహృదయాన్ని భర్త మాటలు ఎంతగా గాయపరిచాయో కళ్లకు కట్టినట్లు చూపించింది రచయిత్రి.

'శాంత అంత్యక్రియలు చూసి... కడుపులో దేవినట్టయ్యింది' - అనడం ద్వారా ఆమె ఎంతగా బాధపడిందో గ్రహించవచ్చు. ఈ అనుభవం ఆడవాళ్లకే పరిమితమేమో! అనిపిస్తు ంది

"తన జీవితం తన ఇష్టప్రకారం ఎలాగూ జీవించలేదు. ఇతరుల నిర్ణయం ప్రకారం అన్నీ జరిగిపోయాయి"[19] - అనడం గొప్పయిన శిల్పచాతుర్యం అని చెప్పవచ్చు. దీని ద్వారా స్త్రీ ఏ విధంగా పరాయికరణకు గురియ్యిందో అర్థమవుతోంది.

ఈ కథలో రచయిత్రి, అరుంధతి జీవితం గురించి చెప్తూ 'పెళ్లి అన్నారు... చేసుకుంది. తల్లయ్యింది. మురిసిపోయారందరూ... ఆనందించారందరు' అనడం ద్వారా స్త్రీ తన జీవితంలోని ప్రతి ఘట్టంలో ఆమె ఏ విధంగా పరాయి వాళ్ల సొత్తు గా మారిపోయిందో స్పష్టమౌతోంది. ఆమెకు పెళ్లిజరిగినా, పిల్లలు పుట్టినా అరుంధతి కంటే కూడా తన బంధువులు, రక్తసంబంధీకులే ఎక్కువుగా సంతోషించారు.

ఎందుకంటే ఆమెను ఒక మరమనిషిగా భావించి, వారివారి నిర్ణయాలు ఆమెపై రుద్దడం, ఆమె మౌనంగా వాటికి తలవంచడం ద్వారా వారివారి శాసనాలు అమలుచేసే వ్యక్తు లు ఉన్నారంటే ఏ పురుషునికైనా ఆనందమే కదా! అంతేగాక అది తమ గౌరవంగా భావించి, నా భార్య నా మాటను కాదనదని, నా మాటను జవదాటదని, గొప్పలు చెప్పుకుంటారే తప్ప, వారి హృదయాన్ని, వారి మనోవేదనను ఎవరూ పట్టించుకోరు అని రచయిత్రి తెలియజేసింది.

## 5. 13. నిర్ణయం:

ఈ కథలో స్త్రీ పిల్లల్ని కనే విషయంలో ఎదుర్కొన్న సంఘర్షణను వివరించడం జరిగింది.

లింగనిర్ధారణ పరీక్ష చేయించుకొని, ఆడపిల్లని తెలిస్తే... నిర్మూలించాలని ఎంతమంది ఆడవాళ్లు కోరుకుంటున్నారు? ఇందుకు వాళ్లని ప్రేరేపించే శక్తు లు ఏమిటి? ఈ విధంగా ఎంచుకోటానికి నిజంగా ఆడవాళ్లకు అవకాశం ఉందా? స్వచ్ఛంధ సంస్థలు కొంతమంది మహిళలతో మాట్లాడి చేసిన సర్వేలో వెల్లడైన అంశాలను ఈ కింద పేర్కొనడం జరిగింది.

### 5. 13. 1. ఆత్మగౌరవం లేకపోవటం:

తమలాంటి బతుకులు గడపకూడదని మహిళలు ఆడపిల్లలు కావాలని కోరుకోరు. రాజీపడి, ఇతరుల ఆధీనంలో బతికే జీవితాలు నిరర్థకంగా కనిపిస్తా యి మహిళలు తాము అనుభవిస్తు న్న దుర్భరపరిస్థితిని తమకు పుట్టబోయే ఆడబిడ్డ అనుభవించకూడదనే ఉద్దేశంతో ఆడపిల్లల్ని వద్దనుకుంటారు. 'నేను బాధపడినట్లు నా పిల్లలు బాధపడగూడదు' అని మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి వాళ్లు అనుకోవటం పరిపాటి అయిపోయింది.

### 5. 13. 2. భయం:

భర్త, అత్తమామల చేతిలో వేధింపులు, నిర్లక్ష్యం, వదిలేస్తారేమో వంటి భయాల వల్ల ఆడపిల్లల్ని వద్దనుకుంటున్నారు. కొడుకులు లేని మహిళ పట్ల సమాజం ప్రవర్తించే తీరుకి కూడా భయపడి ఇటువంటి పద్ధతులు పాటిస్తున్నారు ఇటువంటి వాటినుండి బయటపడి, ఈ వత్తిడులను తట్టుకునే వాళ్లు చాలా కొద్దిమంది ఉంటారు. చాలామంది నిస్సహాయులమని భావిస్తారు

### 5. 13. 3. సామాజిక - ఆర్థిక వత్తిడులు:

ఆడపిల్లలను ఆదాయంగాకాక ఖర్చుగా చూస్తారు మద్దతుగా కాకుండా భారంగా భావిస్తారు ఆనందదాయినిగా కాక దుఃఖకారకురాలిగా అనుకుంటారు. బట్టలు, నగలు, పుష్పావతి అయినపుడు, పెళ్లికి, వరకట్నానికి ఖర్చులు తడిసి, మోపెడవుతాయని పుట్టకముందే పుట్టి, ముంచుతున్నారు అని బాధకు గురవుతారు.

### 5. 13. 4. సామాజిక గుర్తింపు కోరుకోవటం:

కొడుకు పుట్టడంతో కుటుంబంలోనే కాక, సమాజంలో కూడా మహిళలకు హోదా పెరుగుతుంది. కొడుకు ద్వారా ఆమె సమాజ గౌరవాన్ని పొందుతుంది, కనీసం అలా అనుకుంటున్నారు. కొడుకు(ల) తల్లిగా మాత్రమే మహిళకు సమాజంలో స్థానమున్నది కూడా వాస్తవమే కాబట్టి కొడుకుని కనాలనే తపన పెరుగుతుంది. పితృస్వామ్య విలువలను మహిళలు కూడా అంతర్గతంగా చేసుకోవటం వల్ల మగపిల్లవాడు పుడితే సంతోషించి, ఆడపిల్ల పుడితే చీత్కరించుకుంటారు. 'మగవాళ్లను' ఈ ప్రపంచంలోకి తీసుకొచ్చినందుకు ఎంతో గర్వపడతారు. కొంత నియంత్రణ, కొడుకుల (వాళ్లు మగవాళ్లే) మీద నియంత్రణ సాధించగలగటం వాళ్లకి మానసికంగా సంతృప్తినిస్తుంది

### 5. 13. 5. అభద్రతా భావన:

మహిళలపై జరిగే హింస కూడా ఆడపిండాల హత్యకు కారణభూతమౌతుంది. కుటుంబంలో ఆడపిల్ల వున్నపుడు మహిళలు మరింత అభద్రతా భావానికి గురవుతారు. కుటుంబంలోని మగవాళ్లే ఆడపిల్లతో సంబంధం పెట్టుకోవటం, లైంగిక హింస, అపహరణ, అత్యాచారం, వాళ్ల కన్యాత్వరక్షణ, వైవాహిక జీవితంలో హింస లాంటివన్నీ తలచుకుంటే... ఆడపిల్ల లేకపోతేనే నయమనిపిస్తుంది

### 5. 13. 6. భవిష్యత్తుకిపెట్టుబడిగా కొడుకు:

వృద్ధాప్యంలో కొడుకు అండ కావాలని ఆశిస్తారు వాస్తవం ఇందుకు విరుద్ధంగా ఉన్నా, కొడుకు పుట్టాలని ఆశపడతారు. అంతిమ సంస్కారాలు చెయ్యటానికి, వంశం పేరు నిలబెట్టడానికి కొడుకులు అవసరమని మతం, సాంప్రదాయం చెబుతున్నాయి. ఆస్తికి సంరక్షకుడిగా, వారసునిగా

కూడా కొడుకు కావాలనుకుంటారు. అందుకే మగసంతానం కోసం వెంపర్లాడతారు.

ఈ అంశాలన్నింటినీ అణచివేతకు గురిచేసే పితృస్వామ్య వ్యవస్థకు ముడిపెట్టి సమగ్రంగా ఎదుర్కోకపోతే మహిళకు ఇష్టమున్నా లేకపోయినా కొడుకుల కోసం తన శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టవలసిన పరిస్థితి ఏర్పడుతుంది[20].

ఈ సర్వేలో వెల్లడైన అంశాలు చూస్తే నేటి కాలంలో స్త్రీలు భౌతిక వాద దృక్పథాన్ని కలిగి వున్నట్లు స్పష్టమౌతోంది

## 5. 14. పట్ట పగటి చీకటి:

ఈ కథలో విశాల తన స్నేహితులవలే తను కూడా మురికి కూపంలో దిగడానికి సిద్ధపడడానికి గల ప్రధాన కారణాల్లో ఒకటి- ఆమె ఇంటి ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగా వుండడం. హైదరాబద్ లో చేస్తు న్న ఉద్యోగం వదిలేసి, తిరిగి తన సొంత ఊరుకి వచ్చేయడం వెనుక వున్న కారణాలను తల్లి అడగలేదు. కూతురు మనసు గ్రహించలేకపోతుంది. ఇరుగుపొరుగు వారంతా "అయ్యో! హైదరాబాదులో ఉద్యోగం మానేసి ఇక్కడకు వస్తా వా? ఇంకానయం వెళ్లు, వెళ్లు, తొందరగా వెళ్లు. మా పిల్లలకి అవకాశం రాలేదని మేం ఏడుస్తు ంటే.."[21] అని అంటారు. విశాల తల్లి కూడా అదే మాటలు అంటుంది. ఈ పరిస్థితి మారాలంటున్నారు రచయిత్రి. తల్లిదండ్రులు, పిల్లల మధ్య అధికార సంబంధాలు కాక, స్నేహపూరిత సంబంధాలు నెలకొనాలి. అప్పుడు పిల్లలు తమకు సంబంధించిన అన్ని విషయాలను నిర్భయంగా తల్లిదండ్రులతో చెప్పుకుంటారు. అంతేకాక వాళ్ల అంటున్న మాటలని భరించలేని విశాల మౌనంగా రోధిస్తు ంది ఇలాంటి పరిస్థితి కూడా మారాలని నేటి స్త్రీలు అంటున్నారు. ఏదైనా కష్టంవస్తే తల్లిదండ్రులతో చెప్పి, ఆ అంశం మీద చర్చించి, వాటికి పరిష్కార మార్గాలు వెతుక్కోవాలి గాని, ఆవేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోకూడదని ఈ కథ ద్వారా తెలియజేయడం జరిగింది.

## 5. 15. పరివర్తన

ఈ కథలో రచయిత ప్రధానపాత్రగా ఉండి కథ చెప్తా డు. కథ ఇలా మొదలవుతుంది '2008 జూన్ 11వ తేదీన అమెరికాలోని ఒక స్థానిక పత్రికలో వచ్చిన వార్త - మిచిగన్ పెరోల్ బోర్డువారి ప్రకటన ప్రకారం ఖైదీ 83729463 దీపికారావు మీద అక్టోబర్ 25వ తేదీన విచారణ జరుగుతుంది'. ఈ

కథ ప్రారంభంలోనే ఇది హత్యానేరానికి సంభందించిన కథ అని స్పష్టమౌతోంది. ప్రాణభీతితో దీపికారావు, తన భర్తను హత్య చేస్తుంది ఆమెను కలవడానికి రచయిత వెళ్లడం, అమెరికా జైళ్ల పరిస్థితి, న్యాయవ్యవస్థ తీరుతెన్నులు ఈ కథలో చక్కగా వివరించాడు.

ఈ కథలో దీపికారావు తన భర్తను హత్యచెయ్యడానికి గల కారణాన్ని వివరిస్తూ... 'నాకు సెక్సువాలిటి గురించి అప్పటికి సరైన జ్ఞానంలేదు. నాకెవ్వరూ ఏమీ చెప్పలేదు. నాక్కొంచెం జ్ఞానం ఉన్నట్లయితే... భర్తలు అలాగ కూడా ప్రవర్తిస్తారనిముందుగా తెలుసున్నట్లయితే... ఏమయ్యేదో...'[22] అంటుంది. ఈ మాటలను గమనిస్తే పెళ్లికిముందు స్త్రీలకు దాంపత్య జీవితాన్ని గురించిన సరియైన అవగాహన లేకపోవడం వల్ల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ విధానం మారాలని నేటి స్త్రీలు అంటున్నారు. పెళ్లికిముందు వీరికి దాంపత్య జీవితాన్ని గురించిన అవగాహన కలిగి ఉండాలని రచయిత తెలియజేయడం జరిగింది.

## 5. 16. పేరెంట్:

ఈ కథలో 'స్త్రీ'ని చైతన్యవంతురాలుగా చిత్రించడం జరిగింది. ప్రాచీన సాహిత్యంలో స్త్రీని దయ, కరుణ, ప్రేమలకు ప్రతీకగా చెప్పారు. కాని ఈ కథలో 'దెబ్బకు దెబ్బ' అన్నట్టు బాలమ్మ తన తల్లికి, తన కుటుంబానికి, గ్రామానికి చేసిన అన్యాయానికి తిరిగి ప్రతీకారం తీర్చుకోవాలనే విధంగా ఈ పాత్రను సృష్టించటం జరిగింది. అంతేకాక స్త్రీ ప్రతి పరిస్థితినీ భౌతికవాద దృక్పథంతో ఆలోచించి, సమస్యల పరిష్కారానికి, ప్రయత్నిస్తున్నట్టు స్పష్టమౌతోంది.

## 5. 17. ప్రగతి:

ప్రగతి, తన పరిస్థితిని కరుణకు వివరిస్తూ... "స్త్రీ జీవితానికి పరిపూర్ణతను సంతరింపచేసే మాతృత్వాన్ని నోచుకోలేదనే బెంగ నన్ను కృంగదీస్తుంది నా జీవితానికి పెళ్లి అదృష్టం ఇకలేనట్టే"[23] అంటుంది. పెళ్లికాని స్త్రీలు కలిగివున్న ఈ విధమైన ఆలోచనా విధానం మారాలని రచయిత్రి వివరిస్తూ... "తల్లనిపించుకోవటానికి మన పేగు తెంచుకునే బిడ్డలే పుట్టాల్సిన అవసరం లేదు. మా మదర్ ను యావత్ ప్రపంచం 'మదర్' ని ప్రేమాభిమానాలతో పిలుస్తోంది అదృష్టంకొద్దీ నీకు టీచరుద్యోగం ఉంది. వాళ్లను మంచి పౌరులుగా తీర్చి దిద్దు. వందల మంది విద్యార్థులకు అమ్మవవుతావు. ఎంత అదృష్టం! మామూలు స్త్రీని, ఇద్దరు లేక ముగ్గురు పిల్లలు మాత్రమే అమ్మా అంటారు"[24] అని అంటుంది. ఈ మాటల ద్వారా అవివాహితులకు చక్కని సందేశాన్ని అందించింది రచయిత్రి.

## 5. 18. బొమ్మలో చైతన్యం:

ఈ కథను స్త్రీల దృక్పథంలో నుంచి చూస్తే; వరలక్ష్మి తన అస్తిత్వాన్ని కాపాడుకున్న స్త్రీ గా మనకు కనిపిస్తుంది ఈ పరిస్థితులన్నీ అనుకూలంగా ఉన్నంత వరకు ఆమె ఒక 'బొమ్మ'లా తన జీవనాన్ని కొనసాగింది. ఎప్పుడైతే అననుకూల పరిస్థితులు ఏర్పడ్డాయో, ఇక అప్పటి నుండి ఆమెలో అస్తిత్వపు ఆర్తి మొదలైంది. నేనేమిటి? నా పరిస్థితి ఏమిటి? అనే ఆలోచనల పరంపర మొదలై, తన అస్తిత్వాన్ని కాపాడుకోవాలని, స్వతంత్రంగా జీవించాలనుకోవడం ప్రశంసించదగిన విషయం.

## 5. 19. మదుపు:

స్త్రీలు ఎదుర్కొనే అనేక సమస్యలకు గల కారణాల్లో ప్రధానమైనది ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం అని ఈ కథ ద్వారా రచయిత్రి చాలా స్పష్టంగా తెలియచేసింది. అంతేకాక స్త్రీలకు చదువులేకపోవడం వల్ల పురుషులు, స్త్రీల మంచితనాన్ని ఉపయోగించుకొని, వాళ్లను ఎలా మోసంచేస్తున్నారో తెలియజేయడం జరిగింది.

## 5. 20. మురళి వాళ్ళమ్మ:

ఈ కథలో 'రుక్మిణి' (మురళి వాళ్ళమ్మ) తన అస్తిత్వం కాపాడుకోవాలనుకుంటోందని, అందుకుగాను ఎంతటి పోరాటానికైనా సిద్ధంగా ఉందనడానికి నిదర్శనంగా కనిపిస్తుంది ఈ కథలో రుక్మిణి భర్తతో రాజీపడి, అతని భార్యల్లో ఒక భార్యగా ఉండలేకపోతుంది. అంతేకాక భర్త చేసిన తప్పే కొడుకు కూడా చేస్తున్నప్పుడు సహించలేక నిలదీస్తుంది మురళి తన ప్రవర్తన సరిచేసుకోకపోతే, ఆ ఇంటి నుండి వెళ్లిపోయి స్వతంత్రంగా జీవిస్తానని కొడుకుతో చెప్తుంది అంతేకాక మురళితో "ఆ మనిషితో ఎందుకు తెగతెంపులు చేసుకున్నాం?... భర్తని ఎదిరించి బతికింది బిడ్డలతో రాజీపడడానికా...? ఎవరిదారి వాళ్లు చూసుకుందాం. నా కుట్టుపని నాకుంది. నా ఆయా పని మళ్లీ దొరక్కపోదు"[25] అని అంటుంది. ఈ మాటలు పరిశీలిస్తే రుక్మిణి స్వతంత్రవ్యక్తిగా బతకాలని, తన అస్తిత్వాన్ని కాపాడుకోవాలనుకుంటున్నట్లు స్పష్టమౌతుంది. ఈ కథ చివరిలో రుక్మిణి తన కోడలికి 'అస్తిత్వం కొల్పోయి, మరమనిషిలా జీవించవద్దని' హితోపదేశం చేస్తుంది

స్త్రీలు ఎలాంటి కష్టాలనైనా ఎదుర్కోవడానికి ఇష్టపడుతున్నారు గాని, పురుషులు (భర్తలు కొడుకులు...) చేసే అన్యాయాలను భరిస్తూ తమ అస్తిత్వాన్ని కోల్పోవడానికి ఇష్టపడడంలేదని అర్థమౌతోంది. దీన్ని బట్టి స్త్రీల అస్తిత్వ కాంక్ష మనకు తెలుస్తోంది

## 5. 21. యాష్ ట్రే:

స్త్రీల దృక్పథం నుంచి ఈ కథను పరిశీలిస్తే స్త్రీలు ఏమి కోరుకుంటున్నారో అర్థమవుతుంది.

ప్రేమించినవాడు మోసంచేసి కొన్నాళ్ల తర్వాత మళ్లీ జీవితంలోకి రమ్మని ఆహ్వానిస్తే ఈ కథలోని స్త్రీ మాత్రం, రానని తిరస్కరించడం... అస్తిత్వం కోరుకునే స్త్రీల మనస్తత్వానికి చక్కని అద్దంపడుతుంది. స్త్రీ అంటే అబలని, చపలచిత్తురాలని భావించే ఈ సమాజానికి స్త్రీ యొక్క మరో కోణాన్ని చూపించింది ఈ కథ.

జీవితంలో ఒకసారి మోసపోయిన ఆ యువతి అందరిలా లబోదిబోమని ఏడవకుండా, ధైర్యంగా నిలబడి కళాశాల ప్రిన్సిపాల్ స్థాయికి ఎదుగుతుంది. అంతేకాక స్త్రీ అంటే ఒక శరీరం కాదని, ఆమెకు ఒక మనసుందని, పురుషుడు వద్దన్నప్పుడు వెళ్లిపోయి, రమ్మనప్పుడు తిరిగి అతని జీవితంలో ప్రవేశించే ప్రై_వేట్యక్తి కాదని తెలియజెయ్యడం జరిగింది. స్త్రీలు తమకంటూ సొంత వ్యక్తిత్వం కలిగి, తమ జీవితానికి సంబంధించిన నిర్ణయాలు తామే తీసుకోవాలనే ఆలోచన కలిగివున్నారని ఈ కథ ద్వారా స్పష్టమౌతోంది. అంటే స్త్రీలు తమ అస్తిత్వం కాపాడుకోవలనుకుంటున్నట్లు తెలుస్తోంది

## 5. 22. వ్యక్తిత్వం

వ్యక్తిత్వం అనే కథను స్త్రీల దృక్పథంతో పరిశీలిస్తే; స్త్రీలు తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడానికి ఎంతగా పోరాడుతున్నారో అర్థమవుతుంది. ఈ కథలో ప్రధానంగా స్త్రీ పురుషుల సంఘర్షణ మనకు కనిపిస్తుంది మొదటిగా స్త్రీ ఎదుర్కొన్న సంఘర్షణను చూద్దాం.

### 5. 22. 1. స్త్రీ అంతః సంఘర్షణ:

ఈ కథలో సుహాసిని తీవ్రమైన మానసిక సంఘర్షణకు లోనవుతుంది. ఆమెకు ఉద్యోగం చేయడం అస్సలు ఇష్టం వుండదు. ఉద్యోగం చేయకపోతే పెళ్లికాదేమో అని, తద్వారా తల్లిదండ్రులకు భారంగా ఉంటానేమో అనే సంశయాల వల్ల చివరకు తన ఇష్టాన్ని చంపుకొని పరిస్థితులకు లొంగి ఉద్యోగప్రయత్నంలో అనేక కష్టాలు ఎదుర్కొని చివరకి ఉద్యోగం సంపాదిస్తుంది ఇది మొదటి ఎత్తు.

ఇక రెండవ విషయానికి వస్తే ఉద్యోగం వచ్చిన తరువాత పెళ్లిచూపులకు వచ్చినవాళ్లు

ఉద్యోగం వదిలేస్తే పెళ్లికి ముహూర్తం పెట్టుకుద్దాం అంటారు. ఆ సమయంలో సుహాసిని పడిన అంతఃసంఘర్షణ వర్ణనాతీతం. ఎందుకంటే ఉద్యోగం లేకపోతే 'వద్దని' కొందరంటే, ఉద్యోగం ఉంది కాబట్టి వద్దని కొందరన్నారు. దీన్నిబట్టి చూస్తే అసలు అమ్మాయిలు కూడా ఒక మనిషని, ఆమెకు ఒక మనసుంటుందనే స్పృహ ఈ పితృస్వామ్య సమాజంలో లేదేమో అనిపిస్తుంది

అంతేకాక తన అభిప్రాయాలను చక్కగా వివరించిన తీరు చూసి, అబ్బాయి తరపు వాళ్లు బిత్తరపోతారు కాని తరువాత ఆమె అభిప్రాయాలు పెళ్లికొడుకు అంగీకరించడం సుహాసినికి ఆశ్చర్యం కలిగిస్తుంది వీటన్నింటి మధ్య ఆమె మనసు ఎలా నలిగిపోయి వుంటుందో, మనం అర్థంచేసుకోవచ్చు. అంతేకాక అందరూ ఒక బొమ్మతో ప్రవర్తించినట్టు ప్రవర్తించారే తప్ప, ఒక సాటిమనిషిలా ప్రవర్తించినట్లు కనిపించదు.

## 5. 22. 2. పురుష అంతః సంఘర్షణ:

ఈ కథలో పెళ్లికొడుకు అనుభవించిన సంఘర్షణ వివరించవలసిన అవసరం లేదు. కాని, సుహాసిని మాటల ద్వారా ఆ వ్యక్తి కూడా తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకున్నాడు కాబట్టి ఈ సంధర్భంలో అతని సంఘర్షణ కూడా పరిశీలించాలి.

మదన్, సుహాసిని కంటే ముందు వేరే అమ్మయిని చూడడానికి వెళ్తాడు. కాని, మదన్ తల్లిదండ్రులు డిమాండ్ చేసినంత కట్నం వాళ్లు ఇవ్వలేకపోవడంతో ఆ సంబంధం రద్దయినందుకు మదన్ బాధపడతాడు. దీనికి కారణం తనకంటూ సొంత వ్యక్తిత్వం లేకుండా వుండడం.

స్త్రీలు గానీ, పురుషులు గాని, జడపదార్థంలాగో లేదా ఎవరి చెప్పుచేతల్లోనో కాకుండా ప్రతి ఒక్కరూ తమకంటూ ఒక వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకొని స్వతంత్రంగా జీవించాలని ఈ కథ ద్వారా రచయిత్రి తెలియచేయడం జరిగింది.

## 5. 23. శిలకోల:

ఈ కథలో చామంతి భర్త చామంతిని ఉద్దేశించి, 'పట్టుచీర కట్టుకోవడానికిస్తే చింకిపాతకి సాపిందట ఒకర్తి అలాగుంది నీ వరుస... అందుకే అన్నారు మిమ్మల్ని కొండోళ్లని' అని చీత్కారంగా మాట్లాడతాడు. మరొక సందర్భంలో డబ్బుకావాలని, ఏవో కాగితాలమీద సంతకం పెట్టమని అడిగితే నాకిష్టంలేదు. నేను పెట్టను[26] అంటుంది. ఆ మాటలకు అతను చామంతిని గట్టిగా కొడతాడు. కూతురు అడ్డుకోబోతే ఆమెను కూడా దూషిస్తాడు

ఈ కథలో చామంతి కుటుంబ హింసకు గురైనట్లు తెలుస్తోంది తను చదువుకొని, ఉద్యోగం చేస్తున్నప్పటికీ భర్త అధికారాన్ని భరించక తప్పలేదు. అయితే ఈ పరిస్థితుల్లో మార్పు తేవాలని నేటి స్త్రీల ఆలోచన. పురుషుడితో పాటు సమానంగా కష్టపడుతూ, కుటుంబాన్ని ఉన్నత స్థితిలోకి

తీసుకురావడానికి అహర్నిశలూ పాటుపడుతున్నప్పటికీ అకారణంగా భర్తచేత ఎందుకు తిట్లు, తన్నులు తినాలని నేటి స్త్రీల ప్రశ్న. ప్రభుత్వం తమకు ఇచ్చిన చట్టాలను స్త్రీలు సక్రమంగా వినియోగించుకోగలితే ఈ కుటుంబహింస నుండి తమను తాము కాపాడుకోవచ్చని స్పష్టంగా చెప్పవచ్చు.

## 5. 24. సత్య పాలన:

ఈ కథని స్త్రీల దృక్పథంలో పరిశీలిస్తే, ఈ కథలో 'సత్య' చైతన్యవంతురాలైన స్త్రీగా కనిపిస్తోంది ఆమెకు ఇష్టంలేకపోయినా ఎన్నికల్లో బలవంతంగా నిలబెడతాడు ఆమెభర్త, తీరా ఎన్నికల్లో గెలిచిన తరువాత భర్తే పెత్తనమంతా చలాయిస్తాడు అలాంటి పరిస్థితిల్లో సత్య, నాకెందుకులే అని అనుకోకుండా తన రాజకీయ అస్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం సమాజంలో సంఘర్షిస్తుంది ఆ సంఘర్షణలో కుటుంబస్తులెవ్వరినీ లెక్కచేయదు. చివరికి భర్తని కూడా! తన అధికారాన్ని తానే వినియోగించుకునేటట్లు ఎవ్వరికీ తలవంచకుండా ప్రజలకు సమర్థవంతమైన పాలనను అందిస్తుంది.

నాటి కాలంలో రాజకీయాధికారాన్ని దుర్వినియోగం చేస్తున్న స్త్రీలకు సత్య పాత్ర మింగుడుపడని ముద్దగా అనిపిస్తుంది మహిళలు ఎవరైతే రాజకీయ రంగంలోకి ప్రవేశిస్తున్నారో, వారు తమ అధికారాలను దుర్వినియోగం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారిమీదే ఉన్నట్లు, ఒకవేళ తమ అధికారాన్ని భర్తగాని మామగాని చెలాయించడానికి ప్రయత్నిస్తే వారికి తగిన విధంగా తెలియజేసి, స్త్రీలు తమ రాజకీయ అస్తిత్వాన్ని కాపాడుకోవాలని రచయిత్రి వెల్లడించింది.

## 5. 25. సూపర్ మామ్ సిండ్రోమ్:

స్త్రీల దృక్పథం ద్వారా ఈ కథను పరిశీలిస్తే... స్త్రీలు తమ అస్తిత్వం కోల్పోవడం వెనుక ఉన్న కారణాలు: స్త్రీలు చేసే కుటుంబశ్రమ, త్యాగం, ఒత్తిడికి గురవ్వడం అన్నింటికి సర్దుకుపోవడం... మొదలైన సమస్యల గురించి చెప్పడం జరిగింది. కాబట్టి ఈ కథలో స్త్రీలు భౌతికవాద దృక్పథాన్ని కలిగివున్నట్లు స్పష్టమౌతుంది. అయితే ఈ విధానంలో మార్పురావాలని నేటిస్త్రీలు అంటున్నారు. స్త్రీలు తమ శక్తికి మించి, కుటుంబం కోసం ప్రయాసపడటం వల్ల అనేక రకాలైన సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటిలో ప్రధానంగా అనారోగ్యానికి గురవ్వడం. తద్వారా బలహీనతలు ఏర్పడటం జరుగుతోంది. ఈ క్రమంలో తమ అస్తిత్వాన్ని కోల్పోవడమే కాక ప్రాణాలను కూడా కోల్పోతున్నారు. స్త్రీలు కుటుంబం కోసం శ్రమించేటప్పుడు తమను గురించి తాము స్పృహ కలిగి ఉండాలని రచయిత్రి తెలియజేశారు.

## 5. 26. గంగజాతర

ఈ కథలో ప్రధానపాత్ర అయిన మాధవీ ఒక సందర్భంలో స్వగతంలో "నాకు పేరులేదు... జీవితంలేదు... గెలుపులేదు. ఫలానా ఆయన కూతుర్ని, ఫలానా ఆయన భార్యని..." వద్దు వద్దు నాకు గెలుపొద్దు... ఈ విజయం కూడా అతనిదే "[27] అని అనుకుంటుంది.

ఈ మాటల్లో ఆమెకు తనకంటూ ఒక గుర్తింపులేదనే బాధ కనిపిస్తోంది నేటి స్త్రీలు ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు అంటే తనకంటూ ఒక మనసుందని, వ్యక్తిత్వం ఉందని, వాటిని ఈ పితృస్వామ్య సమాజం గుర్తించి తమకు పురుషులతో పాటు సమాన భాగస్వామ్యం కల్పించాలని ఆశిస్తున్నారు

ఒక సందర్భంలో మాధవి, తనలో తాను "రాత్రులలో శవాలను వెదుకుతూ మౌనంగా రోధిస్తున్న ద్రౌపతికి వారసురాలిలా ఉంటాను. జీవితంనిండా అనేక రకాల యుద్ధాలు... మనం యుద్ధం చేయాలని ప్రారంభించకపోయినా, అనివార్యంగా యుద్ధంలోకి నెట్టివేయబడుతున్నాం. ఏమాత్రం ఆసక్తిలేని రాజకీయాల్లోకి నేను నెట్టబడ్డట్టు... ఎవరో బెత్తం పట్టుకొని నాకిష్టంలేని పనిని చేయమని అదిలిస్తున్నట్లుగా ఉంది... "[28] అని అనుకుంటుంది.

ఈ మాటల ద్వారా ఆమె జీవితం ఏవిధంగా ఇతరులచేత శాసించబడుతుందో అర్థమౌతుంది. నిజానికి మాధవి ప్రవృత్తికి రాజకీయాలు చాలాదూరం కానీ తన భర్తకు పదవులంటే ఇష్టం కాబట్టి, ఆమెను బలవంతంగా ఆ పదవికి పోటీచేయించాడు.

ఈ పరిస్థితి మారాలని స్త్రీలు అంటున్నారు. భర్త గాని, అన్నగాని తండ్రి గానీ ఎవ్వరూ మమ్మల్ని శాసించొద్దు. మా జీవితాల్ని మేమే జీవించనివ్వండి. మీ అభిప్రాయాలు, ఇష్టాలు మా మీద రుద్దొద్దు అంటున్నారు.

## 5. 27. భూలక్ష్మి

ఈ కథను స్త్రీల దృక్పథంతో పరిశీలిస్తే, భూలక్ష్మి ఉద్యోగస్తురాలైనప్పటికీ.. ఆమె సంపాదన మీద ఆమెకు అధికారంలేదు. ఒక సందర్భంలో "చిన్న చిన్న ఖర్చులకు సైతం తన భర్తను అడగాల్సి రావడం, ఆధారపడి ఉండాల్సి రావడం తనకు చాలా ఇబ్బందిని కలిగిస్తుంది మానసికంగా, శారీరకంగా లొంగిపోవాల్సి వస్తున్నది ఇంటి సరుకులకు, అత్తమామల మందులకు, పాల బిల్లుకు, ఫోను బిల్లుకు... "[29] అన్నీ తనే కట్టాలి... అని భూలక్ష్మి అనుకుంటుంది.

ఈ మాటల్లో భూలక్ష్మికి తన సంపాదనపై హక్కులేదనే విషయం స్పష్టమౌతోంది. నేటి స్త్రీలు ఇలాంటి పరిస్థితులు మారాలని ఆశిస్తు న్నారు తాము నెలంతా కష్టపడి సంపాదించిన డబ్బుపై తమకు హక్కు కావాలంటున్నారు.

మరొక సందర్భంలో భూలక్ష్మి పని ఒత్తిడిని గురించి రచయిత్రి వివరిస్తూ.... "పిల్లలకు పరీక్షలొస్తే ఆమెకు అగ్నిపరీక్ష. కుదురూ బాధ్యతా, అణకువ, సేవల పర్యవసానం నిరంతరం నడిచే గిర్నీలా శ్రమించడం"[30] అని అంటుంది. ఈ మాటల ద్వారా స్త్రీలు ఏ విధంగా పని ఒత్తిడికి గురవుతున్నారో స్పష్టంగా అర్థమౌతుంది. అటు ఆఫీసు పని, ఇటు ఇంటిపని, వంట పని, పిల్లల పనితో స్త్రీలు ఎంతగా సతమవుతున్నారో తెలుస్తోంది అయితే దీనికి పరిష్కారంగా పనివిభజన జరగాలంటున్నారు.

అంతేకాక, ఈ కథలో "దు:ఖం భరించలేనప్పుడు పగటి పూటయితే స్నానాల గదిలోకి పోయి ఏడుస్తుంది రాత్రి పూటయితే దుప్పట్లో దూరి ఏడుస్తుంది అందుకే తనను తాను మరచిపోయేంత పనిని ఎప్పుడూ సృష్టించుకునేది. పనిలో నిమగ్నమై బాధను మరచేది. ఒక గంట ఖాళీగా ఉన్నా... ఒంటరితనం తరిమేది."[31] ఈ మాటల్లో ఆమెలో ఉన్న అస్తిత్వపు ఆర్తి కనబడుతుంది. అంతేకాక, చివరికి మనసారా ఏడవడానికి కూడా ఆమెకు సమయం లేకుండా పోతుందనడానికి భూలక్ష్మి నిదర్శనం.

**ఈ పరిశోధనకు తీసుకున్న కథలను పరిశీలించినప్పుడు —**

ఈ కథలన్నీ భౌతికవాద దృక్పథంతో రాసినట్లు తెలుస్తోంది అంటే స్త్రీ, పురుషులు మధ్య సమానత్వం లేకపోవడానికి సృష్టి నిర్మాణం, లేక శరీర నిర్మాణం, లేదా మతపరంగా చెప్పాలంటే కర్మ... మొదలైన వాటిని కారణాలుగా చెప్పకుండా, వాస్తవ అంశాలైన పురుషాధిపత్యం, పితృస్వామ్యరచనలు, సహజ నిర్మాణం... లాంటి వాటిని కారణాలుగా చెప్పడం జరిగింది.

ఎప్పుడైతే మనిషి భౌతికవాదాన్ని విశ్వసిస్తాడో అప్పుడు మరింత చైతన్యవంతుడవడానికి అవకాశం వుంటుంది. ఈ కథల్లో కథకులు భౌతికవాద దృక్పథాన్ని కలిగి, ఆ విధంగానే రచనలు చేయడం ద్వారా ప్రజలను చైతన్యవంతుల్ని చేయడానికి అవకాశం ఉందని చెప్పవచ్చు.

ఈ కథలన్నీ స్త్రీలలో చైతన్యం నింపడానికి ఎంతగానో తోడ్పడతాయి. 1936లో లక్నోలో జరిగిన అఖిల భారత అభ్యుదయ రచయితల ప్రథమ సమావేశానికి అధ్యక్షత వహించిన హిందీ నవలా రచయితైన ప్రేమ్ చంద్ ఉత్తమ సాహిత్యాన్ని గూర్చి చెప్తూ "మా గీటురాయి ప్రకారం ఏ సాహిత్యంలో ఉన్నతమైన ఆలోచన వుంటుందో, స్వాతంత్ర్యభావం ఉంటుందో, సౌందర్యసారం

ఉంటుందో, సృజనాత్మకత ఉంటుందో, జీవితవాస్తవికతల అభివ్యక్తి ఉంటుందో ఆ సాహిత్యం మనలో గతిశీలన సంఘర్షణ, ఆతురత కలిగిస్తుందో అది ఉత్తమ సాహిత్యం అవుతుంది" అని అన్నారు.

ప్రేమ్ చంద్ మాటల్ని గమనిస్తే సాహిత్యం అనేది ప్రజలను అభ్యుదయపథంవైపు నడిపించాలని, ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని అర్థమవుతుంది. అలాంటి సాహిత్యాన్ని ఉత్తమ సాహిత్యంగా అభివర్ణించారు. ఈయన అభిప్రాయాన్ని అనుసరించి ఈ స్త్రీల అస్తిత్వ చిత్రణ కథలన్నీ స్త్రీలను చైతన్య పరుస్తూ, వారిలో అస్తిత్వ స్పృహను కలిగించే విధంగా వున్నాయి గనుక దీన్ని ఉత్తమ సాహిత్యంగా పరిగణించవచ్చు.

# పాదసూచికలు

1. అంటు రోగం. పుట: 16
2. అదెక్కడ. పుట: 62
3. పైదే. పుట: 62
4. పైదే. పుట: 64
5. ఆవర్జా. పుట: 158
6. ఆర్తి. పుట: 61
7. ఆర్తి. పుట: 62
8. ఆర్తి. పుట: 78
9. ఇల్లలకగానే పండగౌనా. పుట: 27
10. ఒక రాత్రి గడవాలి. పుట: 19
11. పైదే. పుట: 20
12. క్షతగాత్ర. పుట: 28
13. టెన్షన్. పుట: 3
14. పైదే. పుట: 6
15. తృషిత. పుట: 100
16. పైదే. పుట: 100
17. (తొలి) నిర్ణయం. పుట: 271
18. పైదే. పుట: 273
19. పైదే. పుట: 273
20. మహిళామార్గం ప్రచురణలు. 2001. '*మొగ్గలను తుంచేసింది ఎవరు*'. పుట: 36, 37
21. పట్టపగటి చీకటి. పుట: 44
22. పరివర్తన పుట: 25
23. ప్రగతి. పుట: 66
24. ప్రగతి. పుట: 66
25. మురళీ వాళ్ళమ్మ. పుట: 17
26. శిలకోల. పుట: 27
27. గంగజాతర. పుట: 125
28. గంగజాతర. పుట: 128

29. భూలక్ష్మి. పుట: 104, 105
30. భూలక్ష్మి. పుట: 107
31. భూలక్ష్మి. పుట: 108

# అధ్యయన ఫలితాలు

***'తెలుగు కథ - స్త్రీల అస్తిత్వ జీవిత చిత్రణ (2000 - 2009)'*** అనే పరిశోధన వల్ల తెలిసే అంశాలు - నా పరిశోధనకు తీసుకున్న స్త్రీల అస్తిత్వ జీవిత చిత్రణ కథలను అస్తిత్వ వాదుల దృక్పథాలతో పరిశీలిస్తే - కీర్క్ గార్డు - 'అస్తిత్వ స్పృహ అనేది విషమ పరిస్థితి సంభవించినప్పుడు కలుగుతుంది' అని అన్నారు. ఈయన చెప్పినట్లు స్త్రీలలో కూడ అస్తిత్వ స్పృహ వారికి వివిధ రకాలైన సమస్యలు వచ్చినప్పుడు అంటే భర్త, పిల్లల ఆదరణ కోల్పోయినప్పుడు, ఆర్థికావసరత ఏర్పడినప్పుడు, ఇతరులు తన గురించి తక్కువగా మాట్లాడినప్పుడు, స్వేచ్ఛ కోల్పోయినప్పుడు, అసంతృప్తి కలిగినప్పుడు, ఇతరులు మితిమీరి తనపై అజమాయిషి చేసినప్పుడు, కారణం లేకుండా తనను అవమానపరిచినప్పుడు... ఒక్క మాటలో చెప్పా లంటే స్త్రీ తన స్వాభిమానాన్ని కోల్పోవలసిన సందర్భాలలో ఆమెకు అస్తిత్వ స్పృహ ఏర్పడుతున్నట్లు స్పష్టమౌతోంది.

అస్తిత్వ స్పృహ కలిగిన తరువాత స్త్రీలు తమ అస్తిత్వం కోసం పోరాడుతున్నట్లు తెలుస్తోంది దీనికి ఆవర్జా కథలో విధీశ, శిలకోల కథలో చామంతి, పారిజాతం కథలో శారద, ఛ! కథలో భారతి, నింగి నేల కథలో కనకరాణి, గూడు కథలో చందన, సంకట విమోచన కథలో చౌడేశ్వరి, పేరెంట్ కథలో బాలమ్మ, అతను కథలో ఉత్పల, స్వాభిమానం కథలో శ్యామల, మసిగుడ్డ సీతమ్మ, రెక్కలున్నపిల్ల కథలో ఆశ, గంగజాతర కథలో మాధవి... నిదర్శనంగా కనిపిస్తు న్నారు .

ప్రముఖ అస్తిత్వవాది అయిన సాత్రే చెప్పిన మూడు పొరల్లో మూడవ పొర అయిన 'ఇతరుల కోసం తను' అనే పొరలో స్త్రీ తన అస్తిత్వాన్ని కోల్పోతున్నట్టు ఈకథల ద్వారా తెలుస్తోంది దీనికి విముక్తి కథలో ఇందిర, సూపర్ మామ్ సిండ్రోమ్ కథలో అనురాధ, ఇల్లలకగానే పండగౌనా కథలో శారద వివిధ కథల్లో పాత్రలైన భూలక్ష్మి, చామంతి, శారద...ఉదాహరణగా చెప్పవచ్చు. ఇక్కడ ఇతరులు అంటే కుటుంబంలో వారు కావచ్చు, బంధువులు కావచ్చు, స్నేహితులు కావచ్చు. అయితే ఈ కథల్లో ఎక్కువగా కుటుంబస్తు ల కోసం స్త్రీ తనను తాను కోల్పోతున్నట్లు స్పష్టమౌతుంది.

ప్రాచీన కాలంలో అంటే పాత, కొత్త రాతియుగాల్లో స్త్రీలు ఎవరి ఆధిపత్యం కింద ఉండకుండా స్వతంత్రంగా జీవించడానికి గల ప్రధాన కారణం స్త్రీ 'స్వయం పోషకురాలు' గా ఉండడం. అంటే ఆహారం కోసం ఎవరిమీద ఆధారపడకుండా తనంతట తానే సంపాదించుకోవడం. అందువల్ల స్త్రీ మీద ఎవరి ఆధిపత్యం లేకుండా, స్వతంత్రంగా జీవించింది. స్త్రీకి చెందిన వస్తు వులనే పిల్లలు తమ ఆస్తిగా భావించడం

గమనించదగ్గ విషయం. గుంపు పెళ్లిళ్ల నుండి ఎప్పుడైతే జంట పెళ్లిళ్ల వ్యవస్థ మొదలైందో అంటే 'ఒక స్త్రీ - ఒక పురుషుడు తద్వారా కుటుంబం' ఏర్పడిందో అప్పటి నుండి స్త్రీ పరాన్న బుక్కుగా, పురుషుడి ఆస్తిగా మారిపోయింది. ఈ క్రమంలో మాతృస్వామ్య వ్యవస్థ పోయి, పితృస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. తద్వారా స్త్రీ తన స్వేచ్ఛను కోల్పోయి, పురుషుడి ఆధిపత్యాన్ని అంగీకరించక తప్పలేదు.

మొదటి అధ్యాయంలో వివరించిన 'వివిధ యుగాల్లో స్త్రీ' అనే అంశాన్ని గమనిస్తే- ఎప్పుడైతే స్త్రీ ఎవరి మీద ఆధారపడకుండా తనంతట తాను జీవించగలుగుతుందో ఒక్క మాటలో చెప్పాలంటే ఆర్థిక స్వతంత్రం కలిగి ఉంటుందో అప్పుడు ఎవరి అజమాయిషీలోను ఉండనవసరం లేదు. అలా కాకుండా, ప్రతి చిన్న విషయానికి ఇతరుల మీద ఆధారపడవలసి వస్తుందో తద్వారా పురుషుల ఆధిపత్యాన్ని (అంటే తండ్రిగాని, అన్నగాని, భర్తగాని..) అంగీకరించక తప్పదు.

కాబట్టి స్త్రీ గనుక ఆర్థిక స్వతంత్రాన్ని కలిగి ఉంటే తన అస్తిత్వాన్ని కాపాడుకొని ఎంతో కొంత స్వేచ్ఛగా జీవించడానికి అవకాశం ఉంటుంది.

ఈ పరిశోధనను స్వీకరించిన కథల్లో స్త్రీని చిత్రించిన తీరు చూస్తే స్త్రీ తన అస్తిత్వం కోల్పోవడానికి గల ప్రధాన కారణాలు: స్త్రీకి సొంత ఆస్తి లేకపోవడం (ఆస్తి అనేది డబ్బు, భూమి, ఇల్లు, ఇలా ఏ రూపంలోనైనా కావచ్చు ), విద్య లేకపోవడం, సమకాలీన పరిస్థితుల పట్ల సరియైన అవగాహన లేకపోవడం, తనకున్న ప్రతికూల పరిస్థితులను ఎదిరించి ధైర్యంగా నిలబడే శక్తి లేకపోవడం, అవగాహన లోపం, కర్మ సిద్ధాంతాన్ని విశ్వసించడం, కార్యకారణ సంబంధాలను విశ్లేషించి సమస్యలకుగల కారణాలను తెలుసుకోకపోవడం, జీవితం పట్ల సరియైన దృక్పథం లేకపోవడం... మొదలైనవని. వీటిని అధిగమిస్తే స్త్రీలు మరింతగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంది. అంతేకాక 'స్త్రీ లు ఎదుర్కొంటున్న సమస్యలను స్త్రీల సమస్యలుగా కాక అవి సామాజిక సమస్యలుగా గుర్తించి ఇటు సమాజం, అటు ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తే మరింత ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పరచడానికి అవకాశం ఉంటుంది'.

ఈ కథల్లో ఉన్న భాషను, సామెతలను పరిశీలించడం ద్వారా స్త్రీల జీవితాల చుట్టూ పురుషుడు కల్పించిన భయాలు, భ్రమల వెనుక ఉన్న రాజకీయాలను నేటి స్త్రీలు గుర్తిస్తున్నట్లు స్పష్టమౌతోంది. ఈ కథల్లో భావ స్పష్టతకు, కథా కథనానికి ఎక్కువ ప్రాధాన్యం యిచ్చినట్లు తెలుస్తోంది భాషా విన్యాసాల ఆడంబరం తగ్గి, అంటే కఠిన శబ్దాలు, దీర్ఘసమాసాలు లేకుండా, సామాన్య పాఠకులకి కూడా అర్థమయ్యేవిధంగా కథలు రాయడం ముదావహం.

నేటి కాలంలో స్త్రీలు అనే రంగాల్లో ముందంజ వేస్తున్నప్పటికి ఇంకా వివక్షకు గురవుతున్నరు.

అయినప్పటికి ఇంకా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. స్త్రీల రక్షణ కోసం న్యాయస్థానంఅనేక చట్టాలు ఏర్పాటుచేసినప్పటికి ఆచరణలో మాత్రం అంతంత మాత్రమే. స్త్రీల సమస్యలన్ని పరిష్కరించబడాలంటే మరింతమంది స్త్రీలు తప్పనిసరిగా రాజకీయ రంగంలో ప్రవేశించి, స్త్రీల అభివృద్ధికి కృషిచెయ్యాలి.

స్త్రీలు గనుక ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పొంది, తమకు ప్రభుత్వం అందిస్తున్న రాజకీయ అవకాశాలను పూర్తిగా వినియోగించుకోగలిగితే స్త్రీలు మరింతగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంది.

చివరిగా... ఈ కథలకు కథకులు ఇచ్చిన ముగింపు అంత సమంజసంగా లేదు. ఎందుకంటే దాదాపు అన్నికథల్లోను స్త్రీలు తమ అస్తిత్వం కోసం కుటుంబ జీవితాన్ని విడిచిపెట్టి సమాజంలోకి ఒంటరిగా వెళ్లిపోయినట్లు చిత్రించారు. స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలకు ఇలాంటి పరిష్కారాలు మంచిఫలితాలను ఇవ్వలేవు. నిజజీవితంలో ఆచరణలోకి వచ్చేసరికి చాలా యిబ్బందులు ఎదురౌతాయి. అంతేగాక ప్రతి స్త్రీ తన అస్తిత్వం కోసం కుటుంబాలను వదిలేస్తే భారతీయ సమాజం అనారోగ్య సమాజంగా మారి, మళ్ళీ మానవ సమాజం జంతు సమాజంగా మారిపోతుంది. తద్వారా సమాజంలో అనేక రుగ్మతలు ఏర్పడతాయి. ఈ విషయాన్ని కథకులు గమనిస్తే మరింత ఉత్తమ కథాసాహిత్యాన్ని సృష్టించడానికి అవకాశం వుంటుంది. తద్వారా సాహిత్యం అనే పదానికి సార్ధకత్వాన్ని చేకూర్చిన వారవుతారు.

స్త్రీవాద కవిత్వం వచ్చినంత బలంగా, ఉధృతంగా స్త్రీవాద కథలు రాలేదనే చెప్పాలి. దీనికి ముఖ్యకారణం కవిత్వం అనేది వ్యక్తి అనుభవాలకు, స్పందనలకు సంబంధించినది. కాని కథ అలా కాదు. కథ రాయడానికి వ్యక్తిగత అనుభవాలతో పాటు సమకాలీన సామాజిక పరిస్థితులపై అవగాహన ఉండాలి, సమాజపోకడ తెలిసి ఉండాలి. ఈ రెండు ఉన్నప్పుడే ఉత్తమ కథలు వెలువడే అవకాశం ఉంటుంది. నేటి కాలంలో స్త్రీలు స్వేచ్ఛగా సమాజంలో తిరిగే అవకాశాలు అంతగా లేకపోవడం వల్ల వారు సమాజ పోకడను పెద్దగా గమనించలేకపోతున్నారు. ఈ పరిస్థితులు మారి, స్త్రీలు మరింత స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలతో జీవనం సాగించగలిగితే ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించడానికి అవకాశం ఉంటుంది.

# ఉపయుక్త గ్రంథాలు


1. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం. 2001: '*మహిళలు - హింస*'. హైదరాబాద్. ప్రజాశక్తి బుక్ హౌస్.
2. అనామకుడు. 2006. '*శీలమా? అదియేమి*'. వాహిని బుక్ ట్రస్ట్, హైదరాబాద్.
3. అప్పారావు, గురజాడ. 1998. '*కన్యాశుల్కం* ' (నాటకం). హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్. 2003. '*కుటుంబ హింస*'. సికింద్రాబాద్. అస్మిత.
5. ఆంజనేయశర్మ, వేమూరి. 2009. 'అస్తిత్వవాదం... *అబ్సర్డ్ నాటకం - వ్యాసాలు కొన్ని కథలు*'. హైదరాబాదు: వేమూరి ఆంజనేయశర్మ స్మారక ట్రస్టు.
6. ఆంధ్రప్రదేశ్ చైతన్య మహిళ సమాఖ్య. 1998. '*భారత శ్రామికోద్యమంలో మహిళలు*'. తిరుపతి. మహిళామార్గం ప్రచురణలు.
7. ఆచార్య శ్రీ. ఎన్. సి. ఎస్. 2005: '*మహిళామణులు*'. విజయవాడ: ఎస్.ఆర్ పబ్లిషర్సు.
8. ఉదయం, మోటూరు. 1996. '*స్వాతంత్ర్య సమరంలో ఆంధ్ర మహిళల మహోన్నత పాత్ర*' విజయవాడ: మహిళాభ్యుదయ ప్రచురణలు.
9. ఓల్గా, వసంత కన్నాభిరాన్, కల్పన కన్నబిరాన్. 2007. '*సామాన్యుల సాహసం - ఆంధ్రప్రదేశ్ చరిత్ర నిర్మాణంలో స్త్రీలు*' సికింద్రాబాదు. అస్మిత ప్రచురణలు.
10. ఓల్గా. 1993 . '*రాజకీయ కథలు*'. విజయవాడ: స్వేచ్ఛాప్రచురణలు.
11. ఓల్గా. 2003. '*తొలివెలుగులు* '. హైదరాబాదు: స్వేచ్ఛాప్రచురణలు.
12. ఓల్గా. 2009. '*అక్షర యుద్ధాలు - దక్షిణాసియా రచయిత్రుల సదస్సు*'. హైదరాబాద్. అస్మిత.
13. కనక ముఖర్జీ. 2009. ద్వితీయ ముద్రణ. 'భారతదేశంలో స్త్రీ విముక్తి'. హైదరాబాద్ : ప్రజాశక్తి బుక్ హౌస్.
14. కమలాభసీన్ (అనువాదం - ఓల్గా). 2005. 'పితృస్వామ్యం - ఒకపరిచయం'. హైదరాబాదు. అస్మిత ప్రచురణలు.
15. కల్పన కన్నాబిరాన్. 2006. 'అసమ్మతి స్వరాలు'. సికింద్రాబాద్.
16. కాత్యాయని విద్మహే. 2009. 'తెలుగు నాట మహిళల ఉద్యమం: వివర్శనాత్మక అంచనా' న్యూఢిల్లీ - సాహిత్య అకాడమీ.
17. కాత్యాయని విద్మహే. 2010. 'సామాజిక విప్లవ కారిణి సావిత్రిబాయి'. హైదరాబాద్. హైదరాబాద్ బుక్ ట్రస్టు.

18. కుటుంబరావు, కొడవటిగంటి. 1980. 'సాహిత్యప్రయోజనం (వ్యాసావళి)'. విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
19. గోపిచంద్. 'తత్వవేత్తలు - సిద్ధాంతాలు - జీవిత విశేషాలు' - అలకానంద ప్రచురణలు; విజయవాడ: 2005
20. ఛాయాదేవి, అబ్బూరి. 1991. 'అబ్బూరి ఛాయాదేవి కథలు1'. హైదరాబాదు: ఉద్యమ పబ్లికేషన్సు.
21. జయప్రభ. 1998. 'భావకవిత్వంలో స్త్రీ'. హైదరాబాదు: చైతన్య - తేజ పబ్లికేషన్స్
22. జయ, ఎస్. 1998. 'రెక్కలున్న పిల్ల '(కథా సంపుటి).
23. జోగారావు, ఎస్వీ. మే. 1991. 'కథానిక' (వ్యాసం) తెలుగు పత్రిక.
24. జ్యోతిరాణి, తోట., గిరిజారాణి హజారీ. 1998. 'మహిళాజీవన అధ్యయన దృక్పథం అర్థశాస్త్రం'. స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ. వరంగల్లు.
25. జ్యోతిరాణి, తోట., గిరిజారాణి, కాత్యాయనీ విద్మహే, రాములు బుర్ర హజారీ. 2005. 'స్వాతంత్ర్యానంతర భారత దేశ స్త్రీల స్థితీ గతీ': స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ. వరంగల్లు.
26. నవీన్ వాసిరెడ్డి, శివశంకర్ పాపినేని (సం.) 1994. 'కథ93'. సికింద్రాబాద్: కథాసాహితీ ప్రచురణలు.
27. నవీన్, వాసిరెడ్డి., శివశంకర్ పాపినేని (సం.) 2010. 'కథ2009'. సికింద్రాబాద్: కథాసాహితీ ప్రచురణలు.
28. పద్మ, కుప్పిలి .2001. 'సాలభంజిక'. హైదరాబాదు: మాతా పబ్లికేషన్సు.
29. పద్మారావు, కత్తి: 2003.'పితృసామ్య వ్యవస్థలో స్త్రీ': లోకాయత ప్రచురణలు. హైదరాబాదు.
30. పద్మారావు, కత్తి. 1993. 'భారతీయ సంస్కృతిలో స్త్రీ'. పొన్నూరు: లోకాయత ప్రచురణలు.
31. పార్వతీమీనన్. 2006. 'ధిక్కారస్వరాలు' ప్రముఖ మహిళా ఉద్యమనేతల జీవితాలు. హైదరాబాదు. ప్రజాశక్తి బుక్ హౌస్.
32. ప్రగతి: 1994. పోరు. 'ఆకాశంలో సగం - భారత జాతీయోద్యమంలో మహిళల పాత్ర' ఆంధ్రప్రదేశ్ ప్రగతిశీల మహిళా సంఘం ప్రచురణలు.
33. ప్రతిమ, వి. 2004. 'పక్షి'.హైదరాబాద్
34. భాగ్యలక్ష్మి, జె. 2007. 'మాదీ స్వతంత్ర దేశం'. హైదరాబాదు: సూర్యా ప్రచురణలు.
35. భానుమతి, గంటి. 2010. స్వాభిమానం. హైదరా బాద్. గంటి ప్రచురణలు.
36. మూర్తి, డి.బి.ఎస్.ఆర్.సి.హెచ్.2006.'సమాజ పరిణామంలో స్త్రీ'. హైదరాబాదు: ప్రజాశక్తి బుక్

హౌస్.
37. మృణాళిని.2003. 'నిశ్శబ్ద విప్లవాలు'. హైదరాబాదు: మృదులా పబ్లికేషన్స్.
38. రంగనాథాచార్యులు, కె.కె. 2008. 'తొలినాటి తెలుగు కథానికలు'. . హైదరాబదు: డా.మాడభూషి రంగాచార్య స్మారకసంఘం
39. రంగనాయకమ్మ.2007(తృతీయ ముద్రణ).'ఇంటిపని బైటిపని'.హైదరాబాదు: స్వీట్ హోమ్ పబ్లికేషన్స్
40. రఘు, ఆర్. 2006. ద్వితీయ ముద్రణ. 'భారత స్వతంత్ర్యోద్యమం' .హైదరాబాదు.
41. రఘుపాల్, జి.2006. 'వరంగల్ జిల్ల వీర గాథలు'. వరంగల్ జిల్లా కమిటీ, సి.పి.ఐ(ఎం).
42. రజని, ఎన్.2007; 'తొలితరం తెలుగు కథా రచయితలు - స్త్రీ సమస్యల చిత్రణ': హైదరాబాద్
43. రమ మార్కేట్, సజయ.కె. (సంపాదకులు) 2008. 'స్త్రీ వాద రాజకీయాలు వర్తమాన చర్చలు': అన్వేషి ప్రచురణలు: హైదరాబాదు.
44. రాంబాబు, వేదగిరి.2000.'కథానిక లక్ష్యము - లక్షణాలు' .హైదరాబాద్ : పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
45. రాజారాం, మధురాంతకం.1996'తొలినాటితెలుగుకథకులు'. హైదరాబాదు: పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
46. రామకృష్ణారావు, వై. 1987. 'ఆధునికాంధ్ర సాహిత్యంలో చైతన్య స్రవంతి '. హైదరాబాదు
47. రామలక్ష్మి, వి. 2007. 'నాకు విశ్రాంతి కావాలి'. హైదరాబాద్: 'వాహిని బుక్ ట్రస్ట్,
48. రామలింగం, డి. 1994.'ఒక తరం తెలుగు కథ ' . న్యూఢిల్లీ :సాహిత్య అకాడమి ప్రచురణలు.
49. రాములు, జి. 'తెలంగాణా పోరాట వారసత్వం'.2009.హైదరాబాదు.భారత కమ్యునిష్టు పార్టీ(మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్
50. రామ్మోహన్, సొదుం.1979. 'సాహిత్యావలోకనం '. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లికేషన్స్.
51. లక్ష్మి రంజనం, ఖండవల్లి; బాలేందు శేఖర్,ఖండవల్లి .1985.'ఆంధ్రుల చరిత్ర -సంస్కృతి '.
52. లలిత(మూలం), సూరి (అనువాదం): 2001. 'ముగ్గలను తుంచేసింది ఎవరూ?' మహిళా మార్గం ప్రచురణ.
53. లాయర్స్ కలెక్టివ్ ఉమెన్స్ రైట్స్ ఇనిషియేటివ్.2003.'మహిళాకుటుంబ హింస'. సికింద్రాబాద్: అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్
54. వసంత కన్నబిరాన్. 1996. 'కఠోర షడ్జమాలు '- పర్ స్పెక్టివ్స్ పబ్లిషర్స్ - హైదరాబాదు:
55. వరలక్ష్మి, జె.1997.'యుగయుగాల్లోభారతీయమహిళ' హైదరాబాదు.

56. విద్యహే,కాత్యాయని.2003. '20వ శతాబ్ది రాజకీయ ఆర్థిక పరిణామాలు : తెలుగులో స్త్రీల సాహిత్యం'.
57. విద్యహే, కాత్యాయని.2005. 'జండర్ స్పృహ '. వరంగల్.
58. వీరలక్ష్మీదేవి, వాడ్రేవు.2009. 'కొండఫలం'. శ్రీ ప్రచురణలు : హైదరాబాద్
59. వీరేశలింగం, కందుకూరి.2001.'రాజశేఖరచరిత్ర '(నవల).హైదరాబాదు :విశాలాంధ్ర పబ్లికేషన్స్
60. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి.1995.'కథాశిల్పం '.హైదరాబాదు :విశాలాంధ్ర పబ్లికేషన్స్.
61. శ్రీరామమూర్తి,కోడూరి.1979. 'తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ '. కిశోర్ పబ్లికేషన్స్.
62. శ్రీరామ మూర్తి,కె., సంజీవమ్మ,పి., వెంకట్రమయ్య,డి., నవీన్. 2009. 'తెలుగు కథానిక1925 - 1980 పరిశీలన' డా.మాడభూషి రంగాచార్య స్మారకసంఘం హైదరాబాద్.
63. శ్రీశ్రీ.1994. 'మహాప్రస్థానం '.హైదరాబాదు:విశాలాంధ్ర పబ్లికేషన్స్
64. సంజీవమ్మ, పి. 1985. 'తెలుగు నవలలో సామాజిక చైతన్యం' (1వ భాగం) - అభ్యుదయ రచయితల సంఘం: కడప.
65. సత్యనారాయణ.ఎస్.వి.(సంపాదకులు) 2007: 'స్త్రీ వాద వివాదాలు': ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాదు.
66. సత్యనారాయణ, పోలాప్రగడ.1999. 'తెలుగు కథానిక'.హైదరాబాదు :తెలుగు అకాడమీ.
67. సత్యన్నారాయణ, పి.1984. ' భారత స్త్రీ సంకెళ్ళు : స్వాతంత్ర్యం '.హైదరాబాదు : సౌత్ ఇండియా పబ్లికేషన్స్
68. సత్యవతి, పి.1995. 'ఇల్లలకగానే... 'విజయవాడ :విశాలాంధ్రపబ్లికేషన్స్.
69. సుదర్శనం, ఆర్.ఎస్. 1989. 'సాహిత్య నేపథ్యం ' నవోదయ పబ్లిషర్సు.
70. సుబ్రహ్మణ్యం, జి.వి.1994. 'స్త్రీవాదధోరణులు - సమకాలీన సాహిత్యం '.హైదరాబాదు : యువభారతి ప్రచురణలు.

ఆంగ్ల గ్రంథాలు:

1. Barnes,Hazele.1978. ' *Existentialist ethics* '.Chicago university press. Metha P.P- The short story (A study in poem) - prakash Bookdepot, U.P:1987.
2. Carl michalson- '.1987: *what is existentiatism* '. Oxford Clarendon.
3. George Alfred.1967. *'Existential Philosphers: Kierkegaard to Merleaponty'* aveter:schradered: Newyork,Mc Grawhill.
4. Macquaricie,j: 1982 'Existentialism' Newyork Penquin books.

# సిద్ధాంత గ్రంథ సంగ్రహ పత్రం

నేను ఎం.ఏ. చదివే రోజుల్లో (2004 - 2006) జరిగిన జాతీయ సదస్సులు నన్ను పరిశోధన వైపు ఆకర్షించాయి. సాహిత్య రంగంలో పరిశోధన చేస్తే మానవుల అంతరంగ, బాహ్య స్వభావాలను కొంతవరకైనా అర్థంచేసుకోవడానికి అవకాశం ఉందని భావించి, పరిశోధనలో ప్రవేశించాను.

వందమంది పరిశోధకులు తమ జీవితమంతా పరిశోధన చేసినా, ఇంకా అనేక కోణాలు మిగిలి ఉండే అంశం స్త్రీ జీవితం. ఎందుకంటే స్త్రీ జీవితం అనేక అంశాలతో ముడిపడి ఉంటుంది. అందువల్ల ఆమె జీవితం చాలా సంక్లిష్టమైనది. తల్లి కడుపులో ఆడపిల్లగా రూపొందింది మొదలు ఆమె తన చుట్టు ఉన్న సమాజంతో సంఘర్షించవలసి వస్తుంది అడుగడుగున ఆమె అభివృద్ధికి ఆంటంకాలే. ఆమె జీవితంపై సమస్త అధికారలు పురుషులవే ఆ పురుషుడుతండ్రి కావచ్చు, అన్న కావచ్చు, భర్త కావచ్చు. దీన్నిబట్టి స్త్రీ ఒక పరాన్న బుక్కుగా జీవిస్తోందని అర్థమౌతుంది

నా పరిశోధనకు స్త్రీ జీవితమే కేంద్రబిందువయ్యింది. అయితే ఇప్పటికే స్త్రీకి సంబంధించిన అనేక విషయాలను వివిధ కోణాల్లో పరిశోధన చెయ్యడం జరిగింది కానీ తెలుగు కథాసాహిత్యంలో స్త్రీ అస్తిత్వానికి సంబంధించి పరిశోధన జరగలేదు. అందుకే నేను ***"తెలుగు కథ - స్త్రీల అస్తిత్వ జీవిత చిత్రణ(2000 - 2009) "*** అనే అంశాన్ని నా పరిశోధనకు స్వీకరించాను.

నా పరిశోధనను ఒక దశాబ్దానికి పరిమితం చెయ్యడం జరిగింది. ఈ దశాబ్దిలో అంటే 2000 నుండి 2009 వరకు వచ్చిన వివిధ కథాసంపుటులు, సంకలనాలు, ఈనాడు, వార్త, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, సూర్య మొదలైన దినపత్రికల ఆదివారం అనుబంధాలను పరిశీలించడం జరిగింది. పరిశోధనలో భాగంగా కాళీపట్నం 'కథానిలయాన్ని', అస్మిత, అన్వేషి రిసోర్స్ సెంటర్స్ ని, సందర్శించిచడం జరిగింది. వీటన్నింటిలో నుంచి స్త్రీ అస్తిత్వానికి సంబంధించిన నలభై కథలను నా పరిశోధన కోసం స్వీకరించడం జరిగింది. అయితే 2000 సంవత్సరానికి ముందుకూడా బలమైన అస్తిత్వ చిత్రణ కథలువచ్చాయి అలా వచ్చిన కథల్లో ఇరవై

కథలను కూడా తీసుకోవడం జరిగింది. మొత్తం అరవై కథలపై పరిశోధన చేయడం జరిగింది.

పరిశోధనా సౌలభ్యం కోసం పరిశోధనన అయిదు అధ్యాయాలుగా విభజించడం జరిగింది. మొదటి అధ్యాయం ***"అస్తిత్వవాదం - ఆవిర్భావ వికాసాలు"***. ఈ అధ్యాయంలో - అస్తిత్వవాదం అంటే ఏమిటి?, అస్తిత్వ స్పృహ అంటే ఏమిటి?, ప్రముఖుల అస్తిత్వవాదుల అభిప్రాయాలు వివరించడం జరిగింది.

నేటి కాలంలో అస్తిత్వ పోరాటాన్ని కొనసాగిస్తు న్న స్త్రీల పరిస్థితుల అవగతం కావాలంటే, తరతరాలుగా స్త్రీలు ఏ విధమైన అస్తిత్వాన్ని కలిగివున్నారో తెలుసుకోవడం అవసరం గనుక వివిధ యుగాల్లో స్త్రీలు కలిగివున్న అస్తిత్వాన్ని వివరించడం జరిగింది.

ఆధునిక కాలంలో స్త్రీలు చైతన్యవంతులై, సాహిత్యం ద్వారా తమ గొంతు వినిపించడానికి మార్గాన్ని సులభతరం చేసింది స్త్రీవాదోద్యమం. నా పరిశోధన కోసం స్వీకరించిన కథలు కూడా స్త్రీవాదోద్యమంలో భాగంగా వెలువడినవి గనుక ఈ అధ్యాయంలో స్త్రీ వాదం గురించి కూడా వివరించడం జరిగింది.

తరతరాలుగా అణచివేయబడిన స్త్రీ నేటికాలంలో చైతన్యవంతురాలవుతుందంటే, అది ఒక్కసారిగా వచ్చిన మార్పు కాదు. చైతన్యవంతురాలైన నేటి స్త్రీ వెనుక అనేక మంది స్త్రీ మూర్తు ల త్యాగఫ వారందించిన స్ఫూర్తి ఉంది. గనుక రెండో అధ్యాయం ***"వివిధ ఉద్యమాలు -     - చైతన్యం"***.     ద్యమం, తెభాగ ఉద్యమం, శ్రీకాకుళ ఉద్యమం, తెలంగాణా ఉద్యమాలలో స్త్రీలు పాల్గొన్న తీరుతెన్నుల గురించి, మా వారి త్యాగ నిరతి గురించి వివరించడం జరిగింది.

మూ   అధ్యాయం ***"స్త్రీల అస్తిత్వ చిత్రణ కథలు - వస్తు వైవిధ్యం"***. ఇక్కడ స్త్రీల అస్తిత్వ చిత్రణ కథలు అంటే స్త్రీలు రాసిన కథలు కాదు స్త్రీలకు సంబంధించిన కథలు. ఈ కథల్లో స్త్రీలు ఏఏ విషయాల్లో అస్తిత్వం కోసం పోరాడుతున్నారో వివరించడం జరిగింది.

ఈ మూడో అధ్యాయం చివరిలో ***"2000 సంవత్సరానికి ముందు వచ్చిన అస్తిత్వ చిత్రణ కథలు"*** అనే ఉప అధ్యాయాన్ని చేర్చడం జరిగింది.

నాలుగో అధ్యాయం ***"స్త్రీల అస్తిత్వ చిత్రణ కథలు - భాషాశిల్పం"***. పరిశోధనకు తీసుకున్న కథల్లోని భాషా శిల్పాలను పరిశీలించడం జరిగింది.

అయిదో అధ్యాయం ***"స్త్రీల అస్తిత్వ చిత్రణ కథలు - దృక్పథం"*** 'ఈఅధ్యాయంలో పరిశోధనకు తీసుకున్న కథల్లో వున్న స్త్రీల దృక్పథాలను పరిశీలించడం జరిగింది. చివరిలో పరిశోధన ఫలితాలు, ఉపయుక్త గ్రంథ సూచి ఇవ్వడం జరిగింది.

ఈ పరిశోధన వల్ల తెలిసే అంశాలు: నా పరిశోధనకు తీసుకున్న స్త్రీల అస్తిత్వ జీవిత చిత్రణ కథలను అస్తిత్వవాదుల దృక్పథాలతో పరిశీలిస్తే-

- 'అస్తిత్వ స్పృహ అనేది విషమపరిస్థితి సంభవించినప్పుడు కలుగుతుంది' అని అన్నాడు. చెప్పినట్లు స్త్రీలకు వివిధ రకాలైన సమస్యలు వచ్చినప్పుడు అంటే భర్త, పిల్లల ఆదరణ కోల్పోయినప్పుడు, ఆర్థికావసరత ఏర్పడినప్పుడు, ఇతరులు తన గురించి తక్కువగా మాట్లాడినప్పుడు, స్వేచ్ఛ కోల్పోయినప్పుడు, జీవితంలో అసంతృప్తి కలిగినప్పుడు, ఇతరులు మితిమీరి తనపై అజమాయిషీ చేసినప్పుడు, కారణం లేకుండా తనను అవమానపరచినప్పుడు... ఒక్క మాటలో చెప్పాలంటే స్త్రీ తన స్వాభిమానాన్ని కోల్పోయే సందర్భాలలో ఆమెకు అస్తిత్వ స్పృహ ఏర్పడుతున్నట్లు స్పష్టమౌతోంది.

అస్తిత్వ స్పృహ కలిగిన తరువాత స్త్రీలు తమ అస్తిత్వం కోసం పోరాడుతున్నట్లు తెలుస్తోంది దీనికి ఆవర్జా కథలో విధీశ, శిలకోల కథలో చామంతి, పారిజాతం కథ శారద, ఛ! కథ రతి, నిం నేల కథలో కనకరాణి, గూడు కథలో చందన, సంకట విమోచన కథలో చౌడేశ్వరి, పేరెంట్ కథలో బాలమ్మ, అతను కథలో ఉత్పల,

స్వాభిమానం కథలో శ్యామల, మసిగుడ్డ కథలో సీతమ్మ, రెక్కలున్న పిల్ల కథలో ఆశ, గంగజాతర కథలో మాధవి... నిదర్శనంగా కనిపిస్తు న్నారు

ప్రముఖ అస్తిత్వవాది అయిన సాత్రే చెప్పిన మూడు పొరల్లో మూడవ పొర అయిన 'ఇతరుల కోసం తాను' అనే పొరలో స్త్రీ తన అస్తిత్వాన్ని కోల్పోతున్నట్టు ఈకథల ద్వారా తెలుస్తో ంది.        ఇల్లలకగానే పండగౌనా కథలో శారద, భూలక్ష్మి కథలో భూలక్ష్మి,విముక్తి కథలో ఇందిర, శిలకోల కథలో చామంతి, సూపర్ మామ్ సింద్రోమ్ కథలో అనురాధ...ఉదాహరణగా చెప్పవచ్చు. ఇక్కడ ఇతరులు అంటే కుటుంబంలో వారు కావచ్చు, బంధువులు కావచ్చు, స్నేహితులు కావచ్చు. అయితే ఈ కథల్లో ఎక్కువగా కుటుంబస్తు ల కోసం స్త్రీ తన అస్తిత్వాన్ని కోల్పోతున్నట్లు స్పష్టమౌతుంది.

ప్రాచీన కాలంలో అంటే పాత, కొత్త రాతియుగాల్లో స్త్రీలు ఎవరి ఆధిపత్యం కింద ఉండకుండా స్వతంత్రంగా జీవించడానికి గల ప్రధాన కారణం స్త్రీ 'స్వయం పోషకురాలు' గా ఉండడం. అంటే ఆహారం కోసం ఎవరిమీద ఆధారపడకుండా తనంతట తానే సంపాదించుకోవడం. అందువల్ల స్త్రీ మీద ఎవరి ఆధిపత్యం లేకుండా, స్వతంత్రంగా జీవించింది.        చెందిన వస్తు వులనే పిల్లలు తమ ఆస్తిగా భావించడం గమనించదగ్గ విషయం. గుంపు పెళ్లిళ్ల నుండి ఎప్పుడైతే జంట పెళ్లిళ్ల వ్యవస్థ మొదలైందో అంటే 'ఒక స్త్రీ - ఒక పురుషుడు తద్వారా కుటుంబం' ఏర్పడిందో అప్పటి నుండి స్త్రీ పరాన్న బుక్కుగా, పురుషుడి ఆస్తిగా మారిపోయింది ఈ క్రమంలో మాతృస్వామ్య వ్యవస్థ పోయి, పితృస్వామ్య వ్యవస్థ ఏర్పడింది. తద్వారా స్త్రీ తన స్వేచ్ఛను కోల్పోయి, పురుషుడి ఆధిపత్యాన్ని అంగీకరించక తప్పలేదు.

మొదటి అధ్యాయంలో వివరించిన 'వివిధ యుగాల్లో స్త్రీ' అనే అంశాన్ని గమనిస్తే - ఎప్పుడైతే స్త్రీ ఎవరి మీద ఆధారపడకుండా తనంతట తాను జీవించగలుగుతుందో ఒక్క మాటలో చెప్పాలంటే ఆర్థిక స్వతంత్రం కలిగి

ఉంటుందో అప్పుడు ఎవరి అజమాయిషీలోను ఉండనవసరం లేదు. అలా కాకుండా, ప్రతి విషయానికి ఇతరుల మీద ఆధారపడవలసి వస్తుందో అప్పుడు పురుషుల ఆధిపత్యాన్ని (అంటే తండ్రిగాని, అన్నగాని, భర్తగాని..) అంగీకరించక తప్పదు.

కాబట్టి స్త్రీ గనుక ఆర్థికస్వతంత్రాన్ని కలిగివుంటే తన అస్తిత్వాన్ని కాపాడుకొని ఎంతో కొంత స్వేచ్ఛగా జీవించడానికి అవకాశం వుంటుంది.

ఈ పరిశోధనకు తీసుకున్నకథల్లో వున్న స్త్రీల జీవితాలను పరిశీలిస్తే స్త్రీ తన అస్తిత్వం కోల్పోవడానికి గల ప్రధాన కారణాలు: స్త్రీకి సొంత ఆస్తి లేకపోవడం (ఆస్తి అనేది డబ్బు, భూమి, ఇల్లు, ఇలా ఏ రూపంలోనైనా కావచ్చు), విద్య లేకపోవడం, సమకాలీన పరిస్థితుల పట్ల సరియైన అవగాహన లేకపోవడం, తనకున్న ప్రతికూల పరిస్థితులను ఎదిరించి, ధైర్యంగా నిలబడే శక్తి లేకపోవడం కర్మ సిద్ధాంతాన్నివిశ్వసించడం, తనకు ఎదురయ్యే సమస్యలకుగల కారణాలను తెలుసుకోకపోవడం, జీవితంపట్ల సరియైన దృక్పథం లేకపోవడం... మొదలైనవని. వీటిన అధిగమిస్తే స్త్రీలు మరింతగా అభివృద్ధి చెందడానికి అవకాశం వుంటుంది.

స్త్రీలు ఎదుర్కొంటున్న అణచివేత, పీడన, దోపిడి, హింస, లింగ వివక్ష, ఆస్తిహక్కు లేకపోవడం, స్వేచ్ఛ లేకపోవడం... మొదలైన సమస్యలను స్త్రీల సమస్యలుగాకాక సామాజిక సమస్యలుగా గుర్తించి ఇటు సమాజం అటు ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కృషిచేస్తే మరింత ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పరచడానికి అవకాశం ఉంటుంది.

ఈ కథల్లో ఉన్న భాషను, సామెతలను పరిశీలించడం ద్వారా స్త్రీల జీవితాల చుట్టూ పురుషుడు కల్పించిన భయాలు, భ్రమలు వాటి వెనుక ఉన్న రాజకీయాలను నేటి స్త్రీలు గుర్తిస్తున్నట్లు స్పష్టమౌతోంది ఈ కథల్లో భావ

స్పష్టతకు, కథా కథనానికి ఎక్కువ ప్రాధాన్యం యిచ్చినట్లు తెలుస్తోంది భాషావిన్యాసాల ఆడంబరం తగ్గి, అంటే కఠిన శబ్దాలు, దీర్ఘసమాసాలు లేకుండా, సామాన్య పాఠకులకి కూడా అర్థమయ్యేవిధంగా కథలు రాయడం ముదావహం.

నేటి కాలంలో స్త్రీలు అనే రంగాల్లో ముందంజ వేస్తు న్నప్పటికి ఇంకా వివక్షకు గురవుతున్నారు. స్త్రీలకోసం ప్రభుత్వం అనేక చట్టాలు ఏర్పాటుచేసినప్పటికి, ఎక్కువమంది వాటిని వుపయోగించుకోలేకపోతున్నరు. స్త్రీల సమస్యలన్ని పరిష్కరించబడాలంటే మరింతమంది స్త్రీలు రాజకీయ రంగంలో ప్రవేశించి, స్త్రీల అభివృద్ధికి కృషిచెయ్యాలి.

స్త్రీలు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పొంది, తమకు ప్రభుత్వం అందిస్తు న్న రాజకీయ అవకాశాలను పూర్తిగా వినియోగించుకోగలిగితే స్త్రీలు మరింతగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉంది.

చివరిగా... ఈ కథల్లో కొన్నింటికి (శిలకోల, అదెక్కడ, అతను, కంచెమేసిన చేను) కథకులు ఇచ్చిన ముగింపు అంత సమంజసంగా లేదు. స్త్రీలు తమ అస్తిత్వం కాపాడుకోవడంకోసం కుటుంబ జీవితాన్ని విడిచిపెట్టి సమాజంలోకి ఒంటరిగా వెళ్లిపోయినట్లు చిత్రించారు. స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలకు ఇలాంటి పరిష్కారాలు మంచిఫలితాలను ఇవ్వలేవు. ఎందుకంటే ఇలాంటి పరిష్కారాలు నిజజీవితంలో ఆచరణకిలో వచ్చే సరికి చాలా యిబ్బందులు ఎదురౌతాయి. అంతేగాక ప్రతి స్త్రీ తన అస్తిత్వం కోసం కుటుంబ జీవితాన్ని వదిలేస్తే భారతీయ సమాజం అనారోగ్య సమాజంగా మారి, తద్వారా సమాజంలో అనేక రుగ్మతలు ఏర్పడతాయి. ఈ విషయాన్ని కథకులు గమనిస్తే మరింత ఉత్తమ కథాసాహిత్యాన్ని సృష్టించడానికి అవకాశం వుంటుంది. తద్వారా సాహిత్యం అనే పదానికి సార్థకత్వాన్ని చేకూర్చిన వారవుతారు.

స్త్రీవాద కవిత్వం వచ్చినంత బలంగా, ఉధృతంగా స్త్రీవాద కథలు రాలేదనే చెప్పాలి. దీనికి ముఖ్యకారణం కవిత్వం అనేది వ్యక్తి అనుభవాలకు స్పందనలకు సంబంధించినది. కాని కథ అలా కాదు. కథ రాయడానికి వ్యక్తిగత అనుభవాలతో పాటు సమకాలీన పరిస్థితులపై అవగాహన ఉండాలి. ఈ రెండు ఉన్నప్పుడే ఉత్తమ కథలు వెలువడే అవకాశం ఉయుంది. స్త్రీలు మరింత స్వేచ్ఛా స్వతంత్రాలతో జీవనం సాగించగలిగితే ఉత్తమ సాహిత్యాన్ని సృష్టించడానికి అవకాశం ఉంటుంది.

# ఉపయుక్త గ్రంథాలు


1. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం. 2001: 'మహిళలు - హింస'. హైదరాబాద్. ప్రజాశక్తి బుక్ హౌస్
2. అనామకుడు. 2006. 'శీలమా? అదియేమి'. వాహిని బుక్ ట్రస్ట్, హైదరాబాద్.
3. అప్పారావు, గురజాడ. 1998. 'కన్యాశుల్కం ' (నాటకం). హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
4. అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్. 2003. 'కుటుంబ హింస'. సికింద్రాబాద్. అస్మిత.
5. ఆంజనేయశర్మ, వేమూరి. 2009. 'అస్తిత్వవాదం... అబ్సర్డ్ నాటకం - వ్యాసాలు కొన్ని కథలు'. హైదరాబాదు: వేమూరి ఆంజనేయశర్మ స్మారక ట్రస్టు.
6. ఆంధ్రప్రదేశ్ చైతన్య మహిళ సమాఖ్య. 1998. 'భారత శ్రామికోద్యమంలో మహిళలు'. తిరుపతి. మహిళామార్గం ప్రచురణలు.
7. ఆచార్య శ్రీ. ఎన్. సి. ఎస్. 2005: 'మహిళామణులు'. విజయవాడ: ఎస్.ఆర్ పబ్లిషర్సు.
8. ఉదయం, మోటూరు. 1996. 'స్వాతంత్ర్య సమరంలో ఆంధ్ర మహిళల మహోన్నత పాత్ర' విజయవాడ: మహిళాభ్యుదయ ప్రచురణలు.
9. ఓల్గా, వసంత కన్నాభిరాన్, కల్పన కన్నబిరాన్. 2007. 'సామాన్యుల సాహసం - ఆంధ్రప్రదేశ్ చరిత్ర నిర్మాణంలో స్త్రీలు' సికింద్రాబాదు. అస్మిత ప్రచురణలు.
10. ఓల్గా. 1993 . 'రాజకీయ కథలు1'. విజయవాడ: స్వేచ్ఛాప్రచురణలు.
11. ఓల్గా. 2003. ' '. హైదరాబాదు: స్వేచ్ఛాప్రచురణలు.
12. ఓల్గా. 2009. 'అక్షర యుద్ధాలు - దక్షిణాసియా రచయిత్రుల సదస్సు'. హైదరాబాద్. అస్మిత.
13. కనక ముఖర్జీ. 2009. ద్వితీయ ముద్రణ. 'భారతదేశంలో స్త్రీ విముక్తి '. హైదరాబాద్'. ప్రజాశక్తి బుక్ హౌస్.
14. కమలాభసీన్ (అనువాదం - ఓల్గా). 2005. 'పితృస్వామ్యం - ఒకపరిచయం'. హైదరాబాదు. అస్మిత ప్రచురణలు.
15. కల్పన కన్నాబిరాన్. 2006. 'అసమ్మతి స్వరాలు'. సికింద్రాబాద్.

16. కాత్యాయని విద్మహే. 2009. '*తెలుగు నాట మహిళల ఉద్యమం: వివర్శనాత్మక అంచనా*' - సాహిత్య అకాడమీ.
17. కాత్యాయని విద్మహే. 2010. '*సామాజిక విప్లవ కారిణి సావిత్రిబాయి*'. హైదరాబాద్: హైదరాబాద్ బుక్ ట్రస్టు.
18. కుటుంబరావు, కొడవటిగంటి. 1980. '*సాహిత్యప్రయోజనం (వ్యాసావళి)*'. విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.
19. గోపిచంద్. '*తత్వవేత్తలు - సిద్ధాంతాలు - జీవిత విశేషాలు*' - అలకానంద ప్రచురణలు; విజయవాడ: 2005
20. ఛాయాదేవి, అబ్బూరి. 1991. '*అబ్బూరి ఛాయాదేవి కథలు*'. హైదరాబాదు: ఉద్యమ పబ్లికేషన్సు.
21. జయప్రభ. 1998. '*భావకవిత్వం*'. హైదరాబాదు: చైతన్య - తేజ పబ్లికేషన్స్
22. జయ, ఎస్. 1998. '*రెక్కలున్న పిల్ల*'(కథా సంపుటి).
23. జోగారావు, ఎస్వీ. మే. 1991. '*కథానిక*' (వ్యాసం) తెలుగు పత్రిక.
24. జ్యోతిరాణి, తోట., గిరిజారాణి హజారీ. 1998. '*మహిళాజీవన అధ్యయన దృక్పథం అర్థశాస్త్రం*'. స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ. వరంగల్లు.
25. జ్యోతిరాణి, తోట., గిరిజారాణి, కాత్యాయనీ విద్మహే, రాములు బుర్ర హజారీ. 2005. '*స్వాతంత్ర్యానంతర భారత దేశ స్త్రీల స్థితీ గతీ*': జనాభ్యుదయ అధ్యయన సంస్థ. వరంగల్లు.
26. నవీన్ వాసిరెడ్డి, శివశంకర్ పాపినేని (సం.) 1994. '*కథ93*'. సికింద్రాబాద్. కథాసాహితీ ప్రచురణలు.
27. నవీన్, వాసిరెడ్డి., శివశంకర్ పాపినేని (సం.) 2010. '*కథ2009*'. సికింద్రాబాద్. కథాసాహితీ ప్రచురణలు.
28. పద్మ, కుప్పిలి .2001. '*సాలభంజిక*'. హైదరాబాదు: మాతా పబ్లికేషన్సు.
29. పద్మారావు, కత్తి: 2003.'*పితృసామ్య వ్యవస్థలో స్త్రీ*': లోకాయత ప్రచురణలు. హైదరాబాదు.
30. పద్మారావు, కత్తి. 1993. '*భారతీయ సంస్కృతిలో స్త్రీ*'. పొన్నూరు: లోకాయత ప్రచురణలు.
31. పార్వతీమీనన్. 2006. '*ధిక్కారస్వరాలు*' ప్రముఖ మహిళా ఉద్యమనేతల జీవితాలు. హైదరాబాదు. ప్రజాశక్తి బుక్ హౌస్

32. ప్రగతి. 1994. పోరు. '*ఆకాశంలో సగం* - భారత జాతీయోద్యమంలో మహిళల పాత్ర' ఆంధ్రప్రదేశ్. ప్రగతిశీల మహిళా సంఘం ప్రచురణలు.
33. ప్రతిమ, వి. 2004. 'పక్షి'.హైదరాబాద్
34. భాగ్యలక్ష్మి, జె. 2007. '*మాదీ స్వతంత్ర దేశం*'. హైదరాబాదు. ప్రచురణలు.
35. భానుమతి, గంటి. 2010. స్వాభిమానం. హైదరా బాద్. గంటి ప్రచురణలు.
36. మూర్తి డి.బి.ఎస్.ఆర్.సి.హెచ్.2006.'*సమాజ పరిణామంలో స్త్రీ*'. హైదరాబాదు. ప్రజాశక్తి బుక్ హౌస్
37. మృణాళిని.2003. '*నిశ్శబ్ద విప్లవాలు*'. హైదరాబాదు. మృదులా పబ్లికేషన్స్.
38. రంగనాథాచార్యులు, కె.కె. 2008. '*తొలినాటి తెలుగు కథానికలు*'. . హైదరాబదు. డా.మాడభూషి రంగాచార్య స్మారకసంఘం
39. రంగనాయకమ్మ.2007(తృతీయ ముద్రణ).'*ఇంటిపని బైటిపని*'.హైదరాబాదు. స్వీట్ హోమ్ పబ్లికేషన్స్
40. రఘు, ఆర్. 2006.ద్వితీయ ముద్రణ. '*భారత స్వతంత్ర్యోద్యమం*' . హైదరాబాదు.
41. రఘుపాల్, జి.2006. '*వరంగల్ జిల్ల వీర గాథలు*'. వరంగల్ జిల్లా కమిటీ, సి.పి.ఐ(ఎం).
42. రజని, ఎన్.2007; '*తొలితరం తెలుగు కథా రచయితలు - స్త్రీ సమస్యల చిత్రణ*'. హైదరాబాద్
43. రమ మార్కెట్, సజయ.కె. (సంపాదకులు) 2008. '*స్త్రీ వాద రాజకీయాలు వర్తమాన చర్చలు*'. అన్వేషి ప్రచురణలు. హైదరాబాదు.
44. రాంబాబు, వేదగిరి.2000.'*కథానిక లక్ష్యము - లక్షణాలు*' .హైదరాబాద్ .

    గు విశ్వవిద్యాలయం.
45. రాజారాం, మధురాంతకం.1996'*తొలినాటితెలుగుకథకులు*'. హైదరాబాదు. పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
46. రామకృష్ణారావు, పై. 1987. '*ఆధునికాంధ్ర సాహిత్యంలో చైతన్య స్రవంతి* '. హైదరాబాదు
47. రామలక్ష్మి, వి. 2007. '*నాకు విశ్రాంతి కావాలి*'. హైదరాబాద్. 'వాహిని బుక్ ట్రస్ట్,

48. రామలింగం, డి. 1994.'*ఒక తరం తెలుగు కథ* ' . :సాహిత్య అకాడమి ప్రచురణలు.

49. రాములు, జి. '*తెలంగాణా పోరాట వారసత్వం*'.2009.హైదరాబాదు.భారత కమ్యునిష్టు పార్టీ(మార్క్సిస్టు) ఆంధ్రప్రదేశ్

50. రామ్మోహన్, సొదుం.1979. '*సాహిత్యావలోకనం* '. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లికేషన్సు.

51. లక్ష్మి రంజనం, ఖండవల్లి; బాలేందు శేఖర్,ఖండవల్లి .1985.'*ఆంధ్రుల చరిత్ర - సంస్కృతి* '.

52. లలిత(మూలం), (అనువాదం): 2001. '*మొగ్గలను తుంచేసింది ఎవరూ?*' మహిళా మార్గం ప్రచురణ.

53. లాయర్స్ కలెక్టివ్ ఉమెన్స్ రైట్స్ ఇనీషియేటివ్.2003.'*మహిళాకుటుంబ హింస*'. సికింద్రాబాద్: అస్మిత రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్

54. వసంత కన్నబిరాన్. 1996. '*కఠోర షడ్జమాలు* '- పర్ స్పెక్టివ్సు పబ్లిషర్సు - హైదరాబాదు:

55. వరలక్ష్మి, జె.1997.'యుగయుగాల్లో భారతీయమహిళ' హైదరాబాదు.

56. విద్యహే,కాత్యాయని.2003. '*20వ శతాబ్ది రాజకీయ ఆర్థిక పరిణామాలు : తెలుగులో స్త్రీల సాహిత్యం*'.

57. విద్యహే, కాత్యాయని.2005. '*జండర్ స్పృహ* '. వరంగల్.

58. వీరలక్ష్మీదేవి, వాడ్రేవు.2009. '*కొండఫలం*'. శ్రీ ప్రచురణలు : హైదరాబాద్

59. వీరేశలింగం, కందుకూరి.2001.'*రాజశేఖరచరిత్ర* '(నవల).హైదరాబాదు :విశాలాంధ్ర పబ్లికేషన్స్

60. వెంకట సుబ్బయ్య, వల్లంపాటి.1995.'*కథాశిల్పం* '.హైదరాబాదు :విశాలాంధ్ర పబ్లికేషన్స్.

61. శ్రీరామమూర్తికోడూరి.1979. '*తెలుగు నవలా సాహిత్యంలో మనోవిశ్లేషణ* '. కిశోర్ పబ్లికేషన్స్.

62. శ్రీరామ మూర్తికె., సంజీవమ్మ,పి., వెంకట్రమయ్య,డి., నవీన్: 2009. '*కథానిక1925 - 1980 పరిశీలన*' డా.మాడభూషి రంగాచార్య స్మారకసంఘం హైదరాబాద్.

63. శ్రీశ్రీ.1994. 'మహాప్రస్థానం '.హైదరాబాదు:విశాలాంధ్ర పబ్లికేషన్స్

64. సంజీవమ్మ, పి. 1985. '*తెలుగు నవలలో సామాజిక చైతన్యం*' (1వ భాగం) - అభ్యుదయ రచయితల సంఘం: కడప.
65. సత్యనారాయణ.ఎస్.వి.(సంపాదకులు) 2007: '*స్త్రీ వాద వివాదాలు*': ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం హైదరాబాదు.
66. సత్యనారాయణ, పోలాప్రగడ.1999. '*తెలుగు కథానిక*' : హైదరాబాదు. .అకాడమీ
67. సత్యన్నారాయణ, పి.1984. ' *భారత స్త్రీ సంకెళ్ళు : స్వాతంత్ర్యం* '.హైదరాబాదు : సౌత్ ఇండియా పబ్లికేషన్స్
68. సత్యవతి, పి.1995. '*ఇల్లలకగానే..* 'విజయవాడ :విశాలాంధ్రపబ్లికేషన్స్.
69. సుదర్శనం, ఆర్.ఎస్. 1989. '*సాహిత్య నేపథ్యం* ' నవోదయ పబ్లిషర్సు.
70. సుబ్రహ్మణ్యం, జి.వి.1994. '*స్త్రీవాదధోరణులు - సమకాలీన సాహిత్యం* '.హైదరాబాదు : యువభారతి ప్రచురణలు.

**ఆంగ్ల గ్రంథాలు:**

1. Barnes,Hazele.1978. ' *Existentialist ethics* '.Chicago university press. Metha P.P- The short story (A study in poem) - prakash Bookdepot, U.P:1987.
2. Carl michalson- '.1987: *what is existentiatism* '. Oxford Clarendon.
3. George Alfred.1967. *'Existential Philosphers: Kierkegaard to Merleaponty'* aveter:schradered: Newyork,Mc Grawhill.
4. Macquaricie,j: 1982 'Existentialism' Newyork Penquin books.